# 1. బైబులు పరిచయం

బైబులు భాష్యం - 56

ఈ వ్యాసంలో మూడంశాలను పరిశీలిద్దాం. మొదటిది బైబులు సమాచారం, రెండవది బైబులు పఠనం, మూడవది భక్తివంతమైన బైబులు పఠనం.

## 1. బైబులు సమాచారం

### 1. గ్రంథ సంఖ్య

అన్ని క్రైస్తవ శాఖలు నూత్న వేదగ్రంథాలు 27 అని అంగీకరిస్తాయి. పూర్వ వేదగ్రంథాల సంఖ్య విషయంలో మాత్రం ఏకాభిప్రాయం లేదు. క్యాతలిక్‌శాఖ ప్రకారం పూర్వవేద గ్రంథాలు 46. కనుక బైబులు గ్రంథాలు మొత్తం 73. ప్రోటస్టెంటు శాఖల ప్రకారం పూర్వవేద పుస్తకాలు 39. బైబులు గ్రంథాలు మొత్తం 66 మాత్రమే.

ఈ వ్యత్యాసం ఏలా వచ్చింది? హీబ్రూ పూర్వవేదంలో 39 పుస్తకాలు మాత్రమే వున్నాయి. ప్రోటస్టెంటు శాఖలు ఈ సంఖ్యను అంగీకరించాయి. హీబ్రూ పూర్వవేదానికి అనువాదమైన సెప్తువాంజిత్ గ్రీకు బైబుల్లో మరి 7 గ్రంథాలు అదనంగా జేర్చి మొత్తం 46 పుస్తకాలు చేసారు. ఇది క్రీసుర్తపూర్వం 3వ శతాబ్దంలో తయారైంది. ఈ యనువాదం కూడ ప్రామాణికమైంది కావడం చేత క్యాతలిక్‌శాఖ దీని సంఖ్యను గ్రహించి పూర్వవేద గ్రంథాలు 46 అని శాసనం చేసింది.

సెప్తువాంజిత్ బైబుల్లో అధికంగా వున్న గ్రంథాలు ఇవి. తోబీతు, యూదితు, బరూక్, మక్కబీయుల గ్రంథాలు రెండు, సొలోమోను జ్ఞానగ్రంథం, సీరా జ్ఞానగ్రంథం. ప్రోటస్టెంటులు ఇవికూడ ఉపయోగకరమైన పుస్తకాలేనని ఒప్పుకొంటారు. కాని వీటిని భగవత్ ప్రేరితమైన పుస్తకాలుగా మాత్రం అంగీకరించరు.

### 2. ప్రేరణం

"క్రీస్తు అనుసరణం" మొదలైన భక్తిమంతమైన క్రైస్తవ పుస్తకాలు చాలా వున్నాయి. వాటికీ బైబులుకీ ప్రధానమైన వ్యత్యాసం ఏమిటి? బైబుల్లో భగవత్ ప్రేరణం వుంటుంది. ఇతర పుస్తకాల్లో ఈ ప్రేరణం వుండదు. ఈ ప్రేరణం వల్ల బైబుల్లో అమోఘమైన ఫలశక్తి నెలకొని వుంటుంది. గ్రంథాన్ని చదివేవాళ్ళకు ఆవక్తి లభిస్తుంది.

కలాన్ని సాధనంగా వాడుకొని జాబు వ్రాస్తాం. అలాగే భగవంతుడు పరిశుద్ధ రచయితను సాదనంగా వాడుకొని వాళ్ళచేత దివ్యగ్రంథాలు వ్రాయించాడు. ఇదేప్రేరణ –2పేత్రు 1,21. దివ్యగ్రంథాల్లోని భావాలు దేవునివి కనుక వాటి ప్రధాన రచయిత

దేవుడే. నరులు కూడా వాటి రచయితలే. వాళ్ళు ప్రధానరచయితలు కారుగాని, యథార్థ రచయితలు. కొన్ని బైబులు పుస్తకాల్లో వాటి రచయితల ప్రత్యేక వ్యక్తిత్వం కొట్టవచ్చినట్లుగా కన్పిస్తుంది.

బైబులు ప్రధాన రచయిత భగవంతుడు కనుక దానిలో తప్పులుండవు. దైవవార్త ఒక్క పాపంలో దప్పితే అన్ని విషయాల్లోను నరుడై జన్మించాడు. ఆ దేవుని గ్రంథం కూడ ఒక్క దోషంలో తప్పితే అన్ని విషయాల్లోను మానవగ్రంథంగా వెలసింది.

## 3. బైబులు సంస్కృతి

బైబులుకి నరులు కూడ యథార్థ రచయితలు. వాళ్లు దాన్ని ఆయా దేశాల్లో, ఆయా కాలాల్లో, ఆయా భాషల్లో, ఆయా సంస్కృతులకు అనుగుణంగా రచించారు. ఈ సంస్కృతులను అర్థం చేసికోందే బైబులు సరిగా బోధపడదు. దానిలో విశేషంగా హీబ్రూ గ్రీకు, రోమను సంస్కృతులు ప్రతిబింబిస్తుంటాయి.

## 4. దేశకాలాలు

యిస్రాయేలు ప్రజలు మోషే నాయకత్వాన క్రీస్తు పూర్వం 13వ శతాబ్దంలో ఐగుప్తునుండి తరలివచ్చారు. యూదులు ఫరో బానిసంనుండి తప్పించుకొని వచ్చిన కథ అప్పటినుండి ముఖతః ప్రచారంలో వుంది. అది ఒక సంప్రదాయంగారూపొందింది. క్రీస్తుపూర్వం 10వ శతాబ్దంలో సొలోమోనురాజు ఆస్థానవిద్వాంసులు ఈ మౌఖిక సంప్రదాయాన్ని గ్రంథస్థం చేయడం మొదలుపెట్టారు. అప్పటినుండి ఇంచుమించు క్రీస్తపూర్వం రెండవి శతాబ్దందాకా గూడ పూర్వవేదగ్రంథాలను క్రమేణ లిఖిస్తూనే వచ్చారు.

నూత్నవేద గ్రంథాలను క్రీస్తు ఉత్థానమైనంక ప్రారంభించి మొదటి శతాబ్దం అంతంవరకూ వ్రాస్తూ వచ్చారు కనుక బైబులు లిఖిత రూపంలో పూర్తికావటానికి కనీసం 1100 ఏండ్లయినా పట్టివుండాలి.

పాలస్తీనా దేశం, బాబిలోనియా, రోమను సామ్రాజ్యం మొదలైన పెక్కు తావుల్లో బైబులును వ్రాసారు. కనుక ఆ గ్రంథం ఒక్కతావులో, ఒక్కకాలంలో, ఒక్క రచయిత లిఖించింది కాదు. అది 73 పుస్తకాల గ్రంథాలయం. భిన్నరచయితలు, భిన్నస్థలాల్లో, భిన్న కాలాల్లో దాన్ని రచించారు. ఐనా ప్రేరణశక్తివల్ల పై 73 గ్రంథాలకు ఐక్యత సిద్ధించింది. అవి ఏకగ్రంథంగా రూపొందాయి. ఆ పుస్తకానికి ఐక్యతనిచ్చే ప్రధానభావం క్రీస్తే. పూర్వవేదమంతా రాబోయే క్రీస్తుని సూచిస్తుంది. నూత్న వేదమంతా వచ్చిన క్రీస్తుని వర్ణిస్తుంది.

## 5. మూల భాషలు, అనువాదాలు

పూర్వ వేదాన్ని చాలవరకు హీబ్రూ భాషలోనే వ్రాసారు. కొన్ని పుస్తకాలనూ లేదా వాటి భాగాలనూ అరమాయికు భాషలోను, గ్రీకులోను గూడ వ్రాసివుంటారు. నూత్న వేదాన్ని పూర్తిగా గ్రీకులోనే వ్రాసారు.

హీబ్రూ పూర్వవేదానికి మాసొరటిక్ హీబ్రె బైబులు అనిపేరు. క్రీస్తుపూర్వం 3వ శతాబ్దంలో చేయబడిన గ్రీకు అనువాదానికి సెప్తువాజింత్ బైబులు అని పేరు. క్రీస్తు శకం 4వ శతాబ్దంలో జెరోము చేసిన లాటిను అనువాదానికి వల్గేట్ అని పేరు.

ఇంగ్లీషు అనువాదాల్లో జెరూసలేం బైబులు, గుడ్‌న్యూస్ బైబులు శ్రేష్ఠమైనవి. తొలిదానిలో చక్కని వివరణలు లభిస్తాయి. రెండవ దానిలో అనువాదం చాలా సరళంగా వుండి మూల గ్రంథకర్తల భావం సులువుగా బోధపడుతుంది. ఆరెస్వీ బైబులు కూడ ముఖ్యమైందే.

తెలుగులో ప్రొటస్టెంటు బైబులు చాలకాలం నుండి సంపూర్ణంగా లభ్యమౌతుంది. కాని దానిభాష నేటి యాంధ్రభాషకు తగినట్లుగా వుండదు. ఇంతకంఎట మెరుగైన భాషలో క్యాతలిక్ అనువాదం ఇటీవలే అచ్చయింది.

## 6. బైబులు రచనోద్దేశం

భగవంతుడు తన్ను గూర్చి, తాను నరులకు రక్షణాన్ని దయచేసే తీరునుగూర్చీ తెలియజేయడానికి బైబులు వ్రాయించాడు. దాని ప్రధానోద్దేశం ఇదే. చరిత్రను గాని, శాస్త్రజ్ఞానాన్నిగాని తెలియజేయడం గాని ఆ గ్రంథం ఉద్దేశం కాదు. వేద గ్రంథాలను సత్యాన్ని బోధించడం కొరకే వ్రాసారు అన్నాడు క్రీస్తు అనుసరణ గ్రంథకారుడు – 1,5,1. కనుక రక్షణసందేశాన్ని తప్పితే మరో అంశాన్ని దానిలో వెదకకూడదు.

## 7. బైబులు అర్థాలు

బైబులుకు చాలా అర్థాలున్నాయి. ఈ యర్థాలన్నిటి ప్రకారం పండితులుదాని వాక్యాలకు వివరణం చెప్పవచ్చు. మొదటిది, చారిత్రకార్థం. ఇది గ్రంథం వ్రాసిన రచయిత చారిత్రకంగా ఉద్దేశించిన అర్థం. ఉదాహరణకు, అతడు యెరూషలేమును పేర్కొన్నప్పుడు యూదుల రాజధాని నగరమైన యెరూషలేము పట్టణాన్ని ఉద్దేశించాడు. అన్ని అర్థాలకంటె ఈ చారిత్రక అర్థం ముఖ్యమైంది, బైబులుకి వివరణం చెప్పేప్పుడు

రెండవది, పరిపూర్ణార్థం. పూర్వవేదంలో చెప్పిన అంశాలను కొన్నినూత్నవేదంలో నెరవేరాయి. అలా నెరవేరినప్పుడు గాని వాటి పరిపూర్ణార్థం బయటపడలేదు. ఈ పరిపూర్ణార్థం పూర్వవేద రచయితకు తెలియదు. ఉదాహరణకు “నా దేవా నా దేవా

నన్నెందుకు చేయి విడిచావు?" అని సిల్వమీద క్రీస్తు పల్కిన వాక్యం (మత్త 27,46) కీర్తన 22,1లోనిది. ఆ వాక్యం క్రీస్తు నోటినుండి వెలువడినప్పుడేగాని దాని పరిపూర్ణార్థ: బయటపడలేదు. కాని అది క్రీస్తుకు వర్తిస్తుందని 22వ కీర్తన వ్రాసిన పూర్వవేద రచయితకు తెలియదు. అతడు తన్ను గూర్చే ఆ వాక్యాన్ని వ్రాసికొన్నాడు. నూత్నవేదంలో నెరవేరిన పూర్వవేద ప్రవచనాలు చాలవరకు ఈ శాఖకు చెందుతాయి.

మూడవది, సాంకేతికార్థం. పూర్వవేదంలోని వ్యక్తులూ, స్థలాలూ, సంఘటనలూ నూత్నవేదంలోని వ్యక్తులనూ స్థలాలనూ సంఘటనలనూ సూచిస్తుంటాయి. ఉదాహరణకు మోషే క్రీస్తుని, యెరూషలేము శ్రీసబనీ, యూదులు రెల్లు సముద్రాన్ని దాటడం జ్ఞానస్నానాన్నీ సూచిస్తాయి.

బైబులు వాక్యాలకు ఇంకా ఇతరార్థాలు కూడ వున్నాయి.

## 2. బైబులు పఠనం

### 1. హృదయభక్తి

బైబులు కేవలం పండితులకొరకే గాదు, సామాన్యప్రజల కొరకు గూడ వ్రాయబడింది. కనుక కొద్దిపాటి జ్ఞానం కలవాళ్లు కూడ దాన్ని చదువుకోవచ్చు, చదువుకోవాలి. గ్రంథం చదువుకొని ప్రార్థనం చేసికొని హృదయం మార్చుకోవడం ముఖ్యమైన విషయం. బైబులుని విజ్ఞానార్జనం కొరకు గాక హృదయపరివర్తనం కొరకు చదువుకోవాలి. సోదరప్రేమ, వినయం, విశ్వాసం, నిర్మలాంతరాత్మ ఉన్న నరునికి బైబులు పఠనం ఎక్కువ ఫలితమిస్తుందన్నాడు అగస్టీను భక్తుడు.

భగవంతుడు ఓ తండ్రిలాంటివాడు. ఆ ప్రభువు బైబులు గ్రంథంలోనుండి మనతో ఓ నాన్నలా సంభాషిస్తాడు. మన తరపున మనం దివ్యగ్రంథంలోని వాక్యాలను సొంత తండ్రి పలుకులనులాగా స్వీకరించాలి. బైబులంటే పరలోకంలోని తండ్రి ఈ భూలోకంలో ప్రవాసంలో వున్న తన బిడ్డలకు అనురాగంతో వ్రాసిన లేఖ అన్నాడు క్రిసోస్తం భక్తుడు.

ఇంకా, బైబులు గ్రంథం ఓ మనుష్యావతారం లాంటిది. మనం ఆ గ్రంథాన్ని పఠించినప్పుడల్లా క్రీస్తు మనమధ్యలోకీ మన హృదయంలోకీ వేంచేస్తాడు. కనుకనే క్రీస్తుని గర్భాన ధరించిన మరియమాతలాగే ఆ ప్రభువు వాక్యాన్ని వినేవాళ్లు కూడ ధన్యులౌతారు -లూకా 11,27-28.

పై పెచ్చు దివ్యగ్రంథ పారాయణం సంస్కారాలను స్వీకరించడంతో సమానమైంది. "మనం క్రీస్తు శరీరాన్ని భుజించి అతని రక్తాన్ని పానం చేసేది ఒక్క దివ్యసత్ప్రసాదంలో

మాత్రమే కాదు, దివ్యగ్రంథ పఠనంలో కూడ" అన్నాడు జెరోము భక్తుడు, "దివ్యగ్రంథమనే పాత్రం నుండి క్రీస్తుని పానం చేస్తాం" అని నుడివాడు ఆంబ్రోసు భక్తుడు. క్రీస్తుఅనుసరణం వ్రాసిన తోమస్ అంకెపిస్ భావాల ప్రకారం, ఈ జీవిత యాత్రలో మనకు భోజనమూ వెలుగూ రెండూ అవసరమే. దివ్యసత్ప్రసాదం ఆ భోజనం, బైబులు ఆవెలుగు-4,11,4

కడన బైబులు వంటబట్టాలంటే ఆత్మ అనుగ్రహం కూడ అత్యవసరం. పూర్వం దివ్యరచయితలను ప్రేరేపించి వాళ్లచే గ్రంథం చెప్పించింది ఆత్మ -2పేత్రు 1,21. శిష్యులకు సర్వసత్యాన్ని, అనగా క్రీస్తుని, బోధించింది ఆత్మ -యోహా 16,13. నేడు మనకు బైబులు నేర్పించేది కూడ ఆత్మే. కనుక తాను వ్రాయించిన గ్రంథంపట్ల ఆసక్తినీ భక్తినీ కలిగించమని విశ్వాసులు ఆ పవిత్రాత్మనే అడుగుకోవాలి. ఆయాత్ముని అనుగ్రహం లేందే ఎవరికీ బైబులు వశపడదు.

2. కొన్ని చిక్కులు

చాలమంది పాఠకులు బైబులు పారాయణం పట్ల నిరుత్సాహం కనబరుస్తుంటారు. కొందరు, అది మాకు సరిగా అర్థంకావడంలేదని చెప్తారు. బైబుల్లో అన్ని విషయాలు మనకు అర్థం కావు, నిజమే. కాని దానిలో మనకు అర్థంకాని విషయాలకంటె అర్థమయ్యే విషయాలే ఎక్కువగా వుంటాయి. అది చాలదా? ఏ విద్య కూడ మనకు మొదటలోనే పూర్తిగా అర్థంకాదుగదా?

మరికొందరు, బైబులు చదువుతుంటే ఆసక్తికరంగా వుండదని సుమ్మర్లు పడతారు. ఈలాంటివాళ్లకు అసలు ఆధ్యాత్మిక విషయాలే రుచించవేమో! బైబుల్లో అన్ని భావాలూ ఆసక్తికరంగా వుండకపోవచ్చు. కాని ఆసక్తిని కలిగించే ఘట్టాలు మాత్రం చాలా వున్నాయి. కనుక మొదటలో పాఠకులు ఆయా భాగాలను ఎన్నుకొని మరీ చదువుతుండాలి.

ఇంకా కొందరు బైబుల్లో మాకు తెలియందేముంది, పూర్వ నూత్నవేద సంఘటనలు ఇంతకుముందే మాకు తెలుసుగదా అంటారు. ఇది పొరపాటు. బైబులు చాల ల ఓతైన పుస్తకం. దాని వాక్యాల భావాలను మనం ఎప్పటికీ పూర్తిగా గ్రహించలేం. మళ్లామళ్లా చదివేకొద్దీ దానిలో క్రొత్తభావాలు తగుతులూతంటాయి. ఒక్క విషయం. సముద్రాలు పర్వతాలు వనాలు సూర్యోదయాస్తమయాలు మొదలైన ప్రకృతి సౌందర్యాలను ఒకసారి చూచాం గనుక మళ్లా చూడకుండా వుంటామా? ఒక్కసారి చూడ్డంతోనే వాటి ల్లోని సౌందర్యాన్నంతటినీ గ్రహించినట్లేనా? రుచిగల భోజనమూ పిండివంటలూఒక్కసారి భుజించాం గనుక వాటిని మళ్లా భుజించకుండా వుంటామా? ఒక్కసారి భుజించడం తోనే ఆ పదార్థాల్లోని రుచినంతటినీ గ్రహించినట్లేనా? బైబులు పఠనం కూడ ఇంతే.

## 3. పఠన ఫలితాలు

క్రైస్తవుడు బైబులు చదవకపోతే పెద్దనష్టానికి గురౌతాడు. అన్ని అనర్థాలకీ మూలం బైబులు జ్ఞానం లేకపోవడమేనన్నాడు క్రిసోస్తం భక్తుడు.

బైబులుపఠనం వల్ల సిద్ధించే ఫలితాలు చాలా వున్నాయి. మొదటిది, దేవుడు మనతో సంభాషిస్తాడు. ప్రార్థనం చేసికొనేపుడు మనం దేవునితో మాటలాడతాం. కాని బైబులు చదువుకొనేపుడు ఆ ప్రభువే మనతో సంభాషిస్తాడు. నరుడు దేవుని సందేశాన్ని ఆలించి ఊరటపొందడం గొప్ప భాగ్యం. క్యాంట్ అనే జర్మను తాత్త్వికుడు

"గాంధాంధకారపు లోయగుండా పయనిస్తున్నా
నేనే యపాయానికీ జంకను
నీవు నాకు తోడైయుంటావు
నీ చేతికోలా, నీ బడితా
నన్ను కాపాడుతూంటాయి"

అన్న 23వ కీర్తనలోని వాక్యం ప్రపంచంలోని పుస్తకాలన్నిటి కంటె గూడ తన కెక్కువ ఓదార్పుని చేకూర్చిపెట్టిందని చెప్పుకొన్నాడు. గ్రంథపఠనం ద్వారా ప్రభువు మనతో మాటలాడినపుడు మనకూ ఈలాంటి ఓదార్పే కలుగుతుంది.

రెండవది, మన దుష్టబుద్ధి నశించి మంచిశీలం అలవడుతుంది. వినయమూ, ప్రేమా, న్యాయబుద్ధీ, పాపాన్ని అసహ్యించుకోవడమూ మొదలైన సద్గుణాలు మన హృదయంలో చోటుచేసికొంటాయి. "రాత్రి గతించి పగలు సమీపిస్తుంది" అన్న రోమీయుల జాబులోని వాక్యం చదివి పాపజీవితం జీవిస్తున్న అగస్టీను పరివర్తనం చెందాడు -రోమా13,12-14. హృదయ పరివర్తనాన్ని గొప్ప వరప్రసాదంగా భావించాలి.

మూడవది, మనం క్రీస్తుని నేర్చుకొంటాం. క్రీస్తుని తెలుసుకొని, అతన్ని ప్రేమించి, అతని యడుగు జాడల్లో నడచేవాడు క్రైస్తవుడు. పౌలు ఈ క్రీస్తుని సంపాదిస్తే చాలు అనుకొన్నాడు. అతనితో పోలిస్తే ఈ లోకంలోని వస్తువులన్నీ చెత్తాచెదారంలాగ విలువ లేనివని భావించాడు -ఫిలి 3,8. ఇక, ఆ ప్రభువుని తెలిసికొనే ప్రధానమార్గం బైబులే. కావుననే జెరోము భక్తుడు, బైబులు తెలియని వాళ్ళకు క్రీస్తంటే యేమిటో తెలియదు అని నుడివాడు.

## 4. పఠనపద్ధతి

బైబులును పఠించే పద్ధతులు చాలా వున్నాయి. వాటిల్లో ఒక ఉత్తమ పద్ధతి "లెక్సియొ దివీన" భక్తిమంతమైన బైబులు పఠనమని ఈ ల్యాటిన్ పదాలభావం. దీనిలో

వాక్యపఠనం, ఆలోచనం, ప్రార్థనం అని మూడు మెట్లుంటాయి. మొదటిది, బైబుల్లోని ఓ మంచి ఘట్టాన్ని ఎన్నుకొని జాగ్రత్తగా చదువుకోవాలి. ఉదాహరణకు యోహాను 15,1-7. రెండవది, ఆ వాక్యల భావమేమిటా అని నిదానంగా ఆలోచించి చూచుకోవాలి. క్రీస్తుతో ఐక్యమై అతని నుండి వరప్రసాద బలాన్ని పొందడం పై యోహాను వాక్యాల భావం. మూడవది, మనం చదువుకొన్న వేద వాక్యాలను పురస్కరించుకొని భక్తితో ప్రార్థనం చేసికోవాలి. ఈ ప్రార్థనం మనవి, పశ్చాత్తాపం, కృతజ్ఞత, ఆరాధనం అనే నానా రూపాల్లో కొనసాగవచ్చు. భక్తితో వేదవాక్యం చదువుకొన్నాక ఆత్మే మనచే ప్రార్థన చేయిస్తుంది. తెరచాప పడవనులాగ ఆ యాత్మ ప్రార్థనాజీవితంలో మనలను నడిపిస్తుంది.

ఈ మూడు మెట్ల పద్ధతిలో బైబులును చదువుకొనే భక్తులు అనతి కాలంలోనే విశేష లాభాలు సాధిస్తారు. రోజూ ఓ పావుగంట కాలమైనా ఈ ప్రక్రియకు వినియోగిస్తుండాలి.

## 5. సప్త సూత్రాలు

బైబులు పఠనంలో ఉపయోగపడే ముఖ్యసూత్రాలు ఏడున్నాయి. వాటిని క్రమంగా పరిశీలిద్దాం.

1. క్రియాశక్తి. బైబులు వాక్కులకు ఇతర గ్రంథాల వాక్కులకు లేని గొప్ప క్రియాశక్తి వుంటుంది. యెషయా ప్రవక్త ఈ క్రియాశక్తిని వానతో పోల్చాడు. వాన భూమిని పదును చేసి దానిలో పంట పండిస్తుంది. అలాగే ప్రభువు వాక్కు కూడ మన హృదయం మీద ఓ వానలా పనిచేస్తుంది. ఆ హృదయం దేవుని చిత్తప్రకారం నడచుకొనేలా చేస్తుంది - 55,10-11. కీర్తనకారుడు ఈ క్రియాశక్తిని దీపంతో పోల్చాడు. దీపం మనకు చీకటిలో దారి చూపుతుంది. ఆలాగే దివ్యవాక్కు మనం ఈ జీవితయాత్రలో ఎటు వెళ్లాలో ఎటు వెళ్లకూడదో, ఏమి చేయాలో ఏమి చేయకూడదో తెలుపుతుంది -119,105. ఈలాంటి వాక్కుని మనం దైవనందిన జీవితంలో వాడుకొని చక్కని ఫలితాన్ని పొందుతూండాలి. మన యింటిలో కరెంటు వేయించుకొంటే అది బోలెడన్ని పనులు చేసిపెడుతుంది. అలాగే బైబులుని వాడుకొంటే అది మన జీవితంలో బోలెడన్ని ఫలితాలను ఆర్జించి పెడుతుంది.

2. ఆకలిదప్పులు. అన్నపానీయాలకు ఆకలిదప్పులు గొంటాం. అలాగే వాక్యం కొరకు గూడ భక్తుడు ఆకలిదప్పులు కలిగించుకోవాలి. అప్పుడే అది మనకు రుచించేది. కూటికీ నీటతికీ మల్లె వాక్యానికి గూడ కరువు వస్తుంది అన్నాడు ప్రభువు -ఆమోసు 8, 11-12. ఇది శాపవాక్యం. ఈ శాపానికి మనం గురికాకూడదు. కనుక ఏ ప్రొద్దూ వాక్యాన్ని చదువుకొంటూండాలి. నరుడు భోజనంతో మాత్రమే గాదు వాక్యంతో గూడ జీవించాలి -మత్త 4,4.

3. నరుల సహాయం. ఇతియోపీయుడు యెరూషలేములో ప్రభువుని సేవించుకొని రథమెక్కి తిరిగిపోతూ యెషయా ప్రవచనం చదువుకొంటున్నాడు. "అతన్ని ఓ గొర్రెపిల్లలా వధ్యస్థానానికి నడిపించుకొనిపోయారు"అన్న వాక్యం అర్థంగాక తికమకలు పడుతున్నాడు. అప్పుడు ఫిలిప్పు ఆ వాక్యం క్రీస్తుకి వర్తిస్తుందని తెలియజెప్పి అతనికి క్రీస్తుని బోధించాడు. జ్ఞానస్నానమిచ్చాడు -అచ 8,36-39. గ్రంథాన్ని అర్థం చేసికోవడానికి బోధకుల ఉపన్యాసాలూ, వాఖ్యాగ్రంథాలూ, పత్రికలూ మొదలైనవి ఉపయోగపడతాయి. ఈ సహాయలన్నిటినీ మనం తప్పకుండా వినియోగించుకోవాలి. రక్షణార్జనంలో భగవంతుడే కాక నరుడు కూడ నరుడికి ఉపయోగపడతాడు.

4. విమర్శనా దృష్టి. పౌలు అతని శిష్యుడు సీల బెరియాకు వెళ్లి అక్కడి యూదులకు సువిశేషబోధ చేసారు. ఆ ప్రజలు పౌలు సందేశాన్ని ఆసక్తితో విన్నారు. అతడు చెప్పింది నిజమా కాదా అని పరిశీలించి చూడ్డానికి వాళ్లు అనుదినం పరిశుద్ధ గ్రంథాన్ని తిరగవేసేవాళ్లు.

5. దేవుని సందేశాన్ని భక్తితో వినాలి. దేవుడు తనతో మాటలాడబోగా బాలుడైన సమూవేలు భక్తిభావంతో "ప్రభూ! నీ దాసుణ్ణి, నీ సందేశాన్ని వినడానికి సిద్ధంగానే వున్నాను" అన్నాడు -1సమూ 3,10. నెహెమ్యా గ్రంథాన్ని చదువుతూండగా యూద భక్తులు నిలుచుండి శ్రద్ధతో ఆలించారు. నెహె 8,5 బెతనీ మరియ ప్రభువుకి శిష్యురాలై అతని పాదాల చెంత కూర్చుండి అతని బోధలు శ్రద్ధతో వింది -లూకా 10,39. ఈ భక్తుల్లాగే మనం కూడ దేవుని సందేశాన్ని భక్తితో ఆలించాలి. గ్రంథంలోనుండి ప్రభువు ఈనాడూ మనతో మాటలాడతాడు. అతడే స్వయంగా ఉపాధ్యాయుడై భక్తులకు బోధ చేస్తుంటాడు -యోహా 6,45.

6. వాక్యాన్ని పాటించాలి. వాక్యాన్ని వింటేనే చాలదు, దాన్ని ధ్యానంచేసికొంటేనే చాలదు. అనుదిన జీవితంలో దాన్ని పాటించాలి కూడ. వాక్యాన్ని కేవలం విని మరిచిపోతే ఆత్మవంచనం చేసికోవడమే ఔతుంది. విన్నదాన్ని జీవితంలో పాటిస్తే దేవుని నుండి దీవెనలు పొందుతాం -యాకో 1,22. అలా పాటించినవాడు రాతి పునాదిమీదా, పాటించనివాడు ఇసుక పునాది మీదా ఇల్లు కట్టినవాడవుతాడు -మత్త 7,24-27. బైబులు వాక్కులకు మన జీవితాన్ని సవరించి మన తప్పులను సరిదిద్దే శక్తి వుంది -2తిమొ 3,16-17. అది ఓ న్యాయాధిపతియై మనకు తీర్పు చెపుతుంది కూడ -హెబ్రే 4,12.

7. చావుకి గాదు జీవానికి. కొందరికి బైబులులో మిడిమిడి జ్ఞానం వుంటుంది. వాళ్లు ఏవేవో పదాలనూ వాక్యాలనూ సాగదీసి వాటికి విపరీతార్థం చెప్తూంటారు. ఈలాంటి వాళ్లు బైబులుని లోతుగా అర్థం చేసికోలేరు. రచయిత హృదయాన్ని గుర్తించలేరు. వీళ్లు బైబులుకి అపార్థాలు కల్పించి స్వీయ నాశం తెచ్చుకొంటారు - 2పేత్రు 3,16. వ్రాత పూర్వకమైన చట్టం చావుకి దారితీస్తుందనీ, ఆత్మ జీవాన్ని దయచేస్తుందనీ చెప్పాడు పౌలు -2కొరి 3,6. దివ్యగ్రంథాన్ని లోతుగా అర్థం చేసికోక వెర్రిమొర్రిగా అర్థంచేసికొంటే అది మనకు వ్రాత పూర్వకమైన చట్టం మాత్రమే చావుని తెచ్చిపెడుతుంది. ఆ గ్రంథాన్ని లోతుగా అర్థం చేసికొని దానివలన మన హృదయాన్ని మార్చుకొంటే అది మనకు జీవాన్ని దయచేస్తుంది. ఎమ్మావు శిష్యులు ఈలా ప్రభువు వాక్కు ద్వారా జీవాన్ని పొందారు -లూకా 24,32.

**ఉపసంహారం**

చాలామంది బైబులును గూర్చి వినగోరుతారుగాని బైబులుని మాత్రం చదవరు. ఇది చాలా చెడ్డపద్ధతి. బైబులును గూర్చి వింటేకాదు, స్వయంగా చదువుకొని ప్రార్థనం చేసికొంటే బైబులు వస్తుంది. ఈత వేయడం ద్వారా ఈతా, పాట పాడడం ద్వారా పాటా, నాట్యం చేయడం ద్వారా నాట్యమూ, క్రీడను అభ్యాసం చేయడం ద్వారా క్రీడా వస్తాయి. కేవలం ఈ కార్యాలను గూర్చి ఉపన్యాసాలు వింటే ఇవి రావు. బైబులు కూడ ఇంతే. కనుక భక్తుడు స్వయంగా దివ్యగ్రంథ పారాయణానికి పూనుకోవాలి. రోజూ ఓ పావుగంట కాలమైనా గ్రంథం చదువుకోవాలి.

# 3. భక్తిమంతమైన బైబులు పఠనం

## 1. బైబులు పఠనం

### 1. దివ్యగ్రంథాలు :

పౌలు శిష్యుడు తిమోతి చిన్నవాడుగా ఉన్నపుడే అమ్మమ్మ అతన్ని ఒడిలో కూర్చోబెట్టుకొని దివ్యగ్రంథం చదివించేదట (2తిమొ 1:5, 3:15). తరువాత చాల యేళ్ళు గడచాక, నీవు చిన్ననాడే అలవాటు చేసుకున్న బైబులు పఠనాన్ని అశ్రద్ధ చేయవద్దని పౌలు తిమోతిని హెచ్చరించాడు (1తిమొ 4:13). ప్రాచీన క్రైస్తవులు దివ్యసత్ప్రసాదంతో పాటు దివ్యగ్రంథ భాగాలను గూడ మెడలో తాయతులుగా కట్టుకునే వాళ్ళు. వాటికన్ కౌన్సిల్ వంటి పెద్దపెద్ద సమావేశాల్లో యీ గ్రంథాన్ని సభామధ్యంలో వుంచేవాళ్ళు. ఆ సభకు ఈ గ్రంథమే అధ్యక్షస్థానం వహించేది. అగస్టీన్, ఫ్రాన్సిస్ వంటి గొప్ప పునీతులు యీ గ్రంథం చదివి పరివర్తనం చెందారు.

గ్రీకు, లాటిన్ పితృపాదులు ఈ గ్రంథాన్ని నిత్యం పఠించేవాళ్లు. "ప్రభు దేవహాన్ని మల్లె ప్రభు గ్రంథాన్ని కూడ శరణు పొందుతూన్నాను" అనేవారు ఆంటియోకయ ఇన్యాసివారు. "దివ్యగ్రంథం ఓ పొలంలాంటిది. ఈ పొలంలో దాగివున్న నిధి క్రీస్తే. బైబులు తెలియని వాళ్ళకు క్రీస్తంటే యేమిటో తెలీదు" అనేవారు జెరోముగారు. "పరలోకంలోని తండ్రి ప్రవాసంలో వున్న మనకు అనురాగంతో వ్రాసిన లేఖలు యీ దివ్యగ్రంథాలు" అనేవారు క్రిసోస్తంగారు. "తిరుసభ అనే కన్యకు అర్పింప బడిన వరకట్నం దివ్యగ్రంథం" అనేవారు గ్రెగోరీగారు. "సువార్త క్రీస్తు కంఠం" అనేవారు అగస్టీనుగారు. ఈలా తొలిరోజులలోనుండి క్రైస్తవ ప్రజలు శ్రద్ధతో పఠిస్తూ వచ్చిన యీ గ్రంథాన్ని మనంగూడ ఆదరంతో చదువుతూండాలి.

## 2. భగవత్ప్రేరితాలు :

అన్నిపుస్తకాలు మనుష్యులు వ్రాసారు. కాని ఈ బైబులుగ్రంథాన్ని దేవుడే వ్రాసాడు. కలాన్ని సాదనంగా వాడుకొని జాబు వ్రాస్తుంటాం. ఇదేవిధంగా భగవంతుడు గూడ నరుణ్ణి సాధనంగా వాడుకొని ఈ గ్రంథాలు వ్రాసాడు. దేవుని పరిశుద్ధాత్మ కొందరు రచయితలను ప్రేరేపించి యీ గ్రంథాలను వ్రాయించింది (2పేత్రు 1:21). దివ్యగ్రంథానికున్న విలువంతా గూడ యీ భగవత్ప్రేరణం అనే అంశం మీదనే ఆధారపడి వుంటుంది. ఈ విషయం మీదట స్పష్టమౌతుంది.

## 3. మరో మనుష్యావతారం :

దివ్యగ్రంథం మరో మనుష్యావతారం లాంటిది. అక్కడ క్రీస్తు మానుష దేహంలో దైవసాన్నిధ్యం వుంది. ఇక్కడ యీ గ్రంథంలోను దైవసాన్నిధ్యం నెలకొనివుంది. అక్కడ వో దేహం దేవుణ్ణి కప్పివేసింది. ఇక్కడ ముద్రాక్షరాలు దేవుణ్ణి కప్పివేసాయి. దైవవాక్కే క్రీస్తు. దైవవాక్కే దివ్యగ్రంథం కూడాను. వాక్కు దేహం ధరించి మన మధ్యలో నివసించింది (యోహా 1:14) పవిత్రాత్మ సహకారం వల్ల దైవవాక్కు కన్యగర్భంలో మానుషరూపం దాల్చింది. మళ్ళా అదే పవిత్రాత్మ సహకారం వల్ల దైవవాక్కు రచయితల ఉదరంలో మస్తిష్కంలో రూపందాల్చి దివ్యగ్రంథమై వెలువడింది.

## 4. క్రీస్తును ముఖాముఖి కలుసుకుంటాం :

నాటి పాలస్తీనా దేశంలోని స్త్రీ పురుషులు క్రీస్తును కలసికున్నారు. మరియా మార్తలు చనిపోయిన తమ్మునికోసం, కుష్ఠరోగులు రోగనివారణ కోసం, శతాధిపతి సేవకునికోసం, కననీయ స్త్రీ కొమార్తెకోసం ప్రభువును సమీపించారని వింటున్నాం. ప్రభువు వాళ్ళకు మేలికార్యాలు చేసాడు. వారి బాధలను తీర్చాడు. కాని ప్రభువు

నేడు భౌతికంగా యీ మంటిమీద లేడు. మరి క్రీస్తు నెక్కడ కలసికుంటాం? ఈ దివ్య గ్రంథంలోను, క్రైస్తవ సంస్కారాల్లోను (దేవద్రవ్యానుమానాలు). ఈ గ్రంథం ద్వారా ప్రభువు నాటి పాలస్తీనాలోని స్త్రీ పురుషులకు మల్లె నేడు మనకూ సాక్షాత్కరిస్తాడు. మనకూ మేలికార్యాలు చేస్తాడు.

## 5. ప్రభు జీవితం పొడిగింపబడుతూంది :

దివ్యారాధనంలో యీ గ్రంథాన్ని చదువుతూంటాం. దినదినం పూజలో ప్రభు బోధలు, సామెతలు, అద్భుతాలు చదువుతూంటాం. క్రిస్మసు పాస్క మొదలైన పండుగ దినాల పూజల్లో ప్రభుజీవిత ఘట్టాలు చదువుతూంటాం. ఈ విధంగా దివ్యారాధనలో చదివే బైబులు భాగాల ద్వారా క్రీస్తు జీవితం మనమధ్యలో పొడిగింపబడుతూంది. ఈ గ్రంథం ద్వారా పీఠం మీద నుండి ప్రభువు మళ్లా మనతో మాటలాడుతాడు, మనకు బోధిస్తుంటాడు. మనకు మేలికార్యాలు చేస్తూ పోతాడు. ఈ విధంగా దివ్యారాధనం ప్రభు జీవితాన్ని మనమధ్యలో కొనసాగిస్తుంది.

## 6. ఓ సంస్కారం :

దివ్యగ్రంథం ఓ సంస్కారం. ఏడు సంస్కారాల్లో ఒకటి కాదుగాని వాటివలె ఫలవంతమైంది. అందుకే పితృపాదులు దీన్ని సత్ప్రసాదంతో పోల్చారు. "మనం క్రీస్తు శరీరం భుజించి క్రీస్తురక్తం పానం జేసేది దివ్యసత్ప్రసాదం ద్వారా మాత్రమే గాదు, దివ్యగ్రంథపఠనం ద్వారా గూడ" అనేవాళ్లు జెరోముగారు. "దివ్యగ్రంథమునే పాత్రం నుండి క్రీస్తును పానం చేస్తున్నాం" అనేవాళ్ళు ఆంబ్రోసుగారు. "దివ్యభోజనం స్వీకరించినప్పుళ్లాగే దివ్యగ్రంథం పఠించినప్పుడు గూడ పిశాచాలు భయంతో మన చెంతనుండి పారిపోతాయి" అనేవాళ్లు అతనేష్యస్‌గారు. క్రీస్త్వనుసరణ గ్రంథం వ్రాసిన టోమస్ అకెంపిస్ భావాల ప్రకారం, మన దేవాలయంలో రెండు వేదికలుంటాయి. ఓ దానిపై సత్ప్రసాదముంటుంది, మరోదానిపై బైబులుంటుంది. సత్ప్రసాదం భోజనం. ఈ భోజనాన్ని భుజించి జీవిస్తాం. బైబులు వెలుగు. ఈవెలుగులో సురక్షితంగా నడుస్తాం. మనకు భోజనం ఎంత అవసరమో వెలుగు కూడ అంత అవసరం (4,11,4). సత్ప్రసాదానికి ముందు "శిరమును వంచుడి" అంటూ భక్తిని ప్రదర్శిస్తూ మోకరిల్లుతాం. ఇదే భక్తి ఆరాధనలు దివ్యగ్రంథం పట్ల గూడ ప్రదర్శించాలి. అక్కడిలాగే యిక్కడ కూడ దైవసాన్నిధ్యం వుంది అన్నాం.

యథార్థక్రైస్తవుడు దివ్యసత్ప్రసాదాన్ని సేవించకముందు దివ్యవార్తను సేవించాలి. ఇది దానికి తయారుచేస్తుంది. అంచేత పూజబలికి ముందు కొంతకాలం బైబులుపఠించి

ధ్యానం చేసికోవాలి. దివ్యభోజనం లాగే దివ్యవార్త గూడ మనకు జీర్ణం గావాలి. దివ్యభోజనంలో పాల్గొని దివ్యవార్తలో పాల్గొననివాడు సగం క్రైస్తవుడు మాత్రమే.

## 7. క్రీస్తురూపం :

బైబులు చదవడం ద్వారా క్రీస్తు రూపాన్ని హృదయంలో చిత్రించుకుంటాం. క్రీస్తు భావాలను పెంపొందించుకుంటాం. క్రీస్తును అనుకరిస్తాం. క్రీస్తులోనికి మారిపోతాం. ఉదాహరణకు, పరస్త్రీలనుగూర్చి మన హృదయంలో చెడు కోరికలు కలుగుతాయి. పరస్త్రీని మోహదృష్టితో చూచినా మానసిక వ్యభిచారం చేసినట్లే అన్న ప్రభువాక్యం పర్వత ప్రసంగంలో చదువుతాం. ఈ వాక్యాన్ని మననం జేసికొని మన హృదయంలోని చెడు కోరికలను అణచుకుంటాం. లేదా, ఎదుటివాళ్లమీద పగగా వుంటాం. మిత్రులనేగాదు శత్రువులను గూడ ప్రేమించండి అన్న ప్రభువాక్యం పర్వత ప్రసంగంలో గుర్తిస్తాం. గుర్తించి మనలోని ద్వేషాన్ని అణచుకుంటాం. ప్రభు సందర్శనం వలన జక్కయ పాపజీవితం మార్చుకున్నాడు (లూకా 19:8). అదేవిధంగా మనం గూడాను. బైబులు పఠనం ద్వారా భక్తుడు రోజురోజుకు క్రీస్తులోనికి మారిపోవాలి. క్రీస్తురూపం పొందుతూండాలి.

పౌలు తాను క్రీస్తును బోధించకముందు ఆరు మాసాల కాలం అరేబియా ఎడారిలో క్రీస్తును ధ్యానించుకున్నాడు. మొదట ప్రభుసాక్షాత్కారం కలిగించుకొని ఆ పిమ్మట గాని తాను హృదయంలో చిత్రించుకున్న క్రీస్తును ఇతరులకు బోధించలేదు (గల 1:17).

## 8. క్రియాత్మక శక్తి :

దైవవాక్కు శక్తిమంతమైంది. అందుకే యీ వాక్కును వర్షంతో పోల్చాడు యెషయా ప్రవక్త (55:10). ఆకాశంనుండి వచ్చినవాన వ్యర్థంగా బోదు. నేలను పదునుజేసి, పైరు పండించి, సేద్యగానికి అన్నం అందిస్తుంది. అలాగే ప్రభువు చెంత నుండి వెలువడిన వాక్యం గూడ వ్యర్థంగా బోదు. మన హృదయాలను సోకి మెత్తపరుస్తుంది. ప్రభువు సంకల్పించుచకున్న కార్యాలను మనచే చేయించి తీరుతుంది. దైవవాక్కులో ఈ క్రియాసాధన శక్తివుంది. అందుకే ప్రభువు ఆజ్ఞాపింపగానే సృష్టి జరిగింది. వెలుగు కలగాలి అనగానే కలిగింది. నెమ్మది కలగాలి అనగానే అలలు సమసిపోయి సరస్సు ప్రశాంతమైంది. కుష్ఠపోవాలి అనగానే కుష్ఠరోగి స్వస్థుడయ్యాడు. క్రియాత్మకమైన ఈ దైవవాక్కే నేడూ మనకు బైబుల్లో లభిస్తుంది. బైబులు వ్రాసినవాడు భగవంతుడు అన్నాం. అంచేత బైబులు చదివేప్పుడు భగవంతుని ప్రత్యక్షశక్తి మనమీద పనిచేస్తుంది. "సువార్త క్రీస్తు కంఠం" అన్న అగస్టీన్ భావం యిదే. అన్యగ్రంథాల్లో వేటిల్లో గూడ యీ శక్తి వుండదు.

## 9. విశ్వాసం

బైబులును విశ్వాసంతో చదవాలి. క్రీస్తేమో ఆనాడూ యీనాడూ యేనాడూ రక్షకుడే. కాని మనలో చాలినంత విశ్వాసం వుండదు. అంచేత అతడు మనపట్ల రక్షకుళ్లా వ్యవహరించడు. ఆనాడు చాలమంది క్రీస్తులో మానవుణ్ణేగాని దేవుణ్ణి చూడలేకపోయారు. చాలమంది దివ్యసత్ప్రసాదంలో రొట్టెముక్కనేగాని ప్రభు సాన్నిధ్యాన్ని గుర్తింపలేరు. ఇంకా చాలమంది ఓ పుస్తకాన్నేగాని భగవంతుని వునికిని గుర్తింపలేరు. చాలా పుస్తకాల్లో యిదీ వొకటి అనే దృష్టితో చదివేవాళ్ళకు బైబులు సత్ఫలితాన్ని యీయదు.

## 10. ఒరపిడి రాయి :

బైబులును మనం భక్తితో చదువుతున్నామా అనే ప్రశ్నకు సమాధానం ఒక్కటే వొక్కటి. ఆ గ్రంథంలో మనం ప్రభువును కలసికోవాలి. ఆ ప్రభువాక్యం మనకు ఓ అనుభూతిని కలిగించాలి. ఈ యనుభూతిని కలిగించుకున్నవాడే బైబులు పఠిత, తన గొఱ్ఱెలేవో ప్రభువుకు తెలుసు, వాటికీ ప్రభుస్వరంతెలుసు (యోహా 10:3–5). బైబుల్లోని ప్రభుస్వరాన్ని గుర్తించిననాడుగాని మనం బైబులు చదివినట్లుగాదు. ఈలా గుర్తించింది మరియ. ఆమె క్రీస్తుకోసం వెదుకుతూంది. తోటమాలి అనుకొని ఉత్థానక్రీస్తును గుర్తుపట్ట లేకపోయింది. అప్పుడు ప్రభువు "మరియా" అని పిలచాడు. వెంటనే ఆ స్వరాన్ని గుర్తుపట్టి, ప్రభూ అంటూ యేసుపాదాలమీద వ్రాలింది ఆ భక్తురాలు (యోహా 20:16) ప్రభు వాక్కును విన్న ఆభక్తురాలి అనుభూతి అలాంటిది. ఈలాగే ఎమ్మావు నుండి తిరిగివచ్చే శిష్యులుగూడ "అతడు లేఖనాలనుగూర్చి మనతో మాటలాడుతూ వున్నపుడు మన హృదయం ప్రజ్వరిల్లలేదా" అని అనుకుంటారు (లూకా 24:32). దివ్యగ్రంథాన్ని భక్తితో చదువుతున్నామా లేదా అని తెలిసికోవడానికి యీ యనుభూతి ఒరపిడి రాయిలాంటిది.

## 11. ఆత్మ అనుగ్రహం :

పరిశుద్ధాత్మ కొందరు భక్తులను ప్రేరేపించి దివ్యగ్రంథాలను వ్రాయించింది అన్నాం. తాను వ్రాయించిన దివ్యగ్రంథంలో ఈ యాత్మ వసిస్తూవుంటుంది. ఈ యాత్మ ప్రేరణం, సహకారం లేందే బైబులును అర్థం చేసికోలేం. బైబులు బోధించే క్రీస్తును ప్రేమించలేం. కనుక బైబులు చదవకముందు యీ యాత్మ అనుగ్రహం అడక్కుంటూ వుండాలి. బైబులును ఆసక్తితో చదివి అర్థంజేసికోవాలని యీ యాత్మను వేడుకుంటూ వుండాలి.

**12. నిత్యజీవం :**

నా దేహాన్నే ఆహారంగా యిస్తానన్నాడు ప్రభువు. బ్రతికివున్న మనిషిని ఎలా భుజిస్తామో ని శిష్యులంతా ప్రభువును విడచి వెళ్ళిపోయారు. పేతురు మొదలైనవాళ్ళు ఒకరిద్దరు వెంటరావడం జూచి "మీరు గూడ వెళ్ళిపోతారా యేమిటి" అని అగిగాడు ప్రభువు. "ప్రభూ, మేమెక్కడికి వెళ్తాం, నిత్యజీవం ఇచ్చే పలుకులు మీ నోటినుండి వెలువడుతున్నాయి" అన్నాడు పేతురు (యోహా 6:69). ఔను, ఈ గ్రంథం చదివేవాళ్ళు దానిలోని పలుకులు ఆలించేవాళ్ళు నిత్యజీవం పొందుతారు. ఈ పుస్తకాన్ని అనాదరం చేసేవాళ్ళు మృత్యువు వాతబడతారు (బరూక్ 4:1).

ఇంతవరకు మనం బైబులు పఠనావశ్యకాన్ని గూర్చి విచారించి చూచాం.కాని బైబులును భక్తితో పఠించడంఎలాగ? ఈయంశం రెండవభాగంలో వివరింప బడుతుంది.

## 2. భక్తియుతమైన బైబులు పఠనం

బైబులును చదివే మార్గాలు చాలావున్నాయి. శాస్త్రదృష్టితో, విజ్ఞానాన్ని ఆర్జించాలి అన్న కోరికతో బైబులు చదవవచ్చు. ఈలా కాకుండ ప్రార్థన చేసికోవాలి, జీవితాన్ని చక్కదిద్దుకోవాలి అనే కోరికతోను బైబులును చదువుకోవచ్చు. ఈ రెండవ విధానానికే "లెక్సియొ దివీన" అని పేరు. అనగా భక్తియుతమైన బైబులు పఠనం. ఇక యీ విధానాన్ని గూర్చి విచారిద్దాం.

బైబులు చదివి ప్రార్తన చేసికోవడం మన ఆశయం. మామూలుగా ప్రార్థనం చేసికునేప్పుడు మనం దేవునితో సంభాషిస్తూంటాం. ప్రార్థనా పూర్వకంగా బైబులు చదువుకునేప్పుడు దేవుడు మనతో సంభాషిస్తూంటాడు. జీవితంలో యీ రెండు రకాల సంభాషణలూ అవసరమే.

కాని ప్రార్థనాపూర్వకంగా బైబులు పఠించడం ఎలాగ? బైబులు పఠనానికి చాలామంది భక్తులు చాలా మార్గాలు సూచించారు. వానిలో కొన్నింటిని సమన్వయపరచి "లెక్సియొ దివీన" విధానం క్రింద అమర్చి యిక్కడ పొందుపరుస్తున్నాం.

**1. నియమిత కాలం :**

ఆదర్శ క్రైస్తవుడు ప్రతిదినం కనీసం ఓ పావుగంట కాలమైనా బైబులు చదువుకోవాలి. ఈ పావుగంటకూడాను నెమ్మదిగాను ప్రశాంతంగాను వుండే కాలం ఎన్నుకోవాలి. భక్తుడు భగవంతునికి వాడిపోయిన పూవులు సమర్పింపడు. సాధారణంగా వేకువజామున లేక ఉదయం బైబులు పఠనానికి శ్రేష్ఠమైంది. ఉదయాన్నే బైబులు చదువుకొని ప్రార్థించుకున్నట్లయితే ఆ ద్దినమంతా ప్రభువుకి అంకితమౌతుంది,

ధన్యమౌతుంది. ఈ యుదయకాల బైబులు ప్రార్తనం వేయి ఏనుగుల బలాన్ని ఇస్తుంది. ఐనా, ఎవరైనా కారణంతరాలచే మరొక కాలం బైబులు పఠనానికి వినియోగించు కుంటామంటే అభ్యంతరమేమీ లేదు.

## 2. భగవత్సాన్నిధ్యం :

బైబులు పఠనానికి ముందు భగవత్సాన్నిధ్యం కలిగించుకోవాలి. సర్వాంతర్యామి యైన ప్రభువు మన యీ పఠనాన్ని గూడ గమనిస్తాడు. కనుక మనం భక్తిప్రపత్తులతో యీ గ్రంథాన్ని చదవాలి. వినయవిధేయతలతో ప్రభువాక్యాన్ని ఆలించాలి. "ప్రభూ! నీ సేవకుడు ఆలిస్తూనే వున్నాడు, సెలవీయి అన్నాడు బాలుడైన సమూవేలు. (1సమూ 3:10). "ప్రభూ! నా కన్నులు తెరువు, నేను నీ ధర్మశాస్త్రం బోధించే ఆశ్చర్యకరమైన సంగతులను గుర్తిస్తాను" అన్నాడు కీర్తనకారుడు (119:18). ఈలాంటి వాక్యాలను వేనినైనా వాడుకొని భగవత్సాన్నిధ్యం కలిగించుకోవచ్చు.

ఆ పిమ్మట పరిశుద్ధాత్మను ప్రార్థించాలి. భక్తులను ప్రబోధించి దివ్యగ్రంథాలను వ్రాయించింది యీ యాత్మ. పునీతులను ప్రబోధించి దివ్యగ్రంథ బోధనల ప్రకారం వాళ్ళు తమ జీవితాలను తీర్చిదిద్దుకునేలా చేసిందీ యీ యాత్మమే. నేడు మనలను ప్రభుమార్గాల్లో నడిపించేది, మనకు "సర్వసత్యం" బోధించేది యీ యాత్మమే (యోహా 14:26). కావున మనం గూడ మనం చదువుకునే యీ దివ్యగ్రంథాన్ని అర్థం జేసికోవా లనీ, అర్థంజేసికున్న అంశాన్ని జీవితంలో ఆచరణలో పెట్టాలనీ యీ యాత్మను అడుక్కో వాలి. ఈ క్రింది ప్రార్థనలాంటి ప్రార్థనను ఓదాన్ని వాడుకోవచ్చు. "క్రైస్తవ ప్రజలను నడిపించే దివ్యాత్మమా! నీవు వ్రాయించిన ఈ దివ్యగ్రంథాన్ని నీవే ఉపాధ్యా యుడవై నాకు బోధించు. నా బుద్ధిశక్తిని ప్రబోధించు. నేను చదువుకునే యీ బైబులు గ్రంథాన్ని అర్థంజేసికునేలా చేయి. నా హృదయాన్ని మేలుకొల్పు. నేను అర్థంజేసికున్న సత్యాలను ఆచరణలో పెట్టేలాచేయి. నేను తెలుసుకున్న క్రీస్తును ప్రేమించి సేవించేలా అనుగ్రహించు ఆమెన్.

## 3. పఠనం

ఆ పిమ్మట బైబుల్లోని ఓ భాగాన్ని చదువుకోవాలి. ఈ భాగం కొన్ని వాక్యాలు కావచ్చు లేక ఓ యధ్యాయం కావచ్చు. కాని యీ భాగాన్ని ముందుగనే నిర్ణయించుకొని వుండాలి. బైబులు గ్రంథంలోని అన్ని పుస్తకాలు, అన్నిపుటలు తప్పనిసరిగా అర్థమౌ తాయి, ప్రార్థనకు ఉపయోగపడతాయి అన్న నియమం యేమీ లేదు. అంచేత కాలవ్యయం కలక్కుండా వుండాలంటే మన అవసరానికి ఉపయోగపడే వాక్యాలను ముందుగనే నిర్ణయమించుకొని వుండాలి.

కుటుంబజీవితం జీవించేవాళ్లు కుటుంబమంతటితో సమావేశమై, ఒకరు చదువుతూండగా అందరు వాక్యాన్ని ఆలించి, ఆ పిమ్మట సమష్టిగా అందరూ ప్రార్థనం జేసికోవడం మంచిది. రోజురోజు కుదరకపోయినా అప్పుడప్పుడు ఈ సమష్టి పఠనం జరుపుకోవడం ఉత్తమం. వ్యక్తిగతంగా గాని కుటుంబవారిగాగాని ఎవరి బైబులు వాళ్ళకు వుండాలి.

## 4. ఆలోచనం :

బైబులు భాగాన్ని చదివి ముగించాక ఆ చదువుకున్న వాక్యాలను గురించి కొంతకాలం ఆలోచించి చూచుకోవాలి. ఆ విన్న సంఘటనను ఓ దృశ్యంలాగ మనోనేత్రాలముందు చిత్రించుకోవాలి. ఈ వాక్యాల్లో ఎవరు మాటలాడుతున్నారు? ఎక్కడ యెవరితో యేమి మాటలాడుతున్నారు? ఏమి చేస్తున్నారు? ఎందుకు అలా చేస్తున్నారు? ఈలాంటి ప్రశ్నలు బైబులు భాగాలను ఆలోచించి చూచుకొని అర్థం చేసికోవడానికి ఉపయోగపడతాయి.

## 5. ప్రార్థనం :

ఆ పిమ్మట మనం చదువుకున్న భాగాన్ని తలంచుకొని ప్రార్థనం చేసికోవాలి. ఆయా బైబులు భాగాల సందర్భాన్నిబట్టి మన ప్రార్థనం బహుముఖాలుగా వుండవచ్చు. మనమూ తూరుపుదేశపు జ్ఞానుల్లాగ ప్రభువును ఆరాధింపవచ్చు. స్వస్థుడైన కుష్ఠరోగిలాగ ప్రభువునకు కృతజ్ఞత తెలుపవచ్చు. శిష్యుల్లాగ "ప్రభూ, మాకు ప్రార్థించే విధానం నేర్పండి" అని వేడుకోవచ్చు. కమనీయ స్త్రీలాగ "ప్రభూ, నా బిడ్డ దయ్యం సోకి బాధపడుతూంది" అని మనవి చేయవచ్చు. కీర్తనకారునిలాగ "ప్రభూ, నా అతిక్రమాలు నాకు తెలిసేవున్నాయి. నా పాపాలు ఎల్లపుడు నా యెదుటనే నిలచి వున్నాయి" అని పశ్చాత్తాపపడవచ్చు. లెక్సియొ దివీనా విధానంలో ఈ ప్రార్థనాంశం పరమ ప్రధానమైంది.

మనం ఒక్క వాక్యాన్ని మాత్రమే చదువుకొని 15 నిమిషాలు ప్రార్థనచేసికోవచ్చు. లేదా ఒక సందర్భాన్ని వర్ణించే వాక్యాలు కొన్ని చదువుకొని ప్రార్థన చేసికోవచ్చు. ఇక్కడ ప్రార్థనం కోసం బైబులు చదువుతున్నాంగాని విజ్ఞానం కోసం గాదు. అంచేత యీ లెక్సియొ దివీన విధానంలో ఎన్ని వాక్యాలు చదివాం అన్నది ప్రధానం గాదు. మరియెంత చక్కగా ప్రార్థన చేసికున్నాం అన్నది ప్రధానం. ఇక, ఉదయం మనం చదువుకున్న వాక్యాన్ని హృదయంలో నిలుపుకొని రోజంతా అప్పుడప్పుడు ధ్యానించు కుంటూ వుండాలి. మరియమాత యిలా చేసేదని వింటున్నాం (లూకా 2:19)

### 6. ఆచరణం :

మనం ప్రార్థన జేసికున్న సత్యాన్ని జీవితానికి అన్వయించి చూచుకోవాలి. ప్రభు వాక్యం ప్రకారం జీవించినవాడే రాతిమీద ఇల్లుకట్టుకున్న బుద్ధిమంతుని లాంటివాడు (మత్త 7:24). ఈ సందర్భంలో క్రింది ప్రశ్నలు ఉపయోగపడతాయి. ఈ వాక్యాల్లో బైబులు ఏమైనా ఆజ్ఞాపిస్తుందా? ఈ బోధల ప్రకారం జీవితంలో నేను సరిదిద్దుకోవలసిన అంశం యేమైనా వుందా? ఆచరించవలసిన మంచికార్యం యేమైనా వుందా? ఇక్కడ బైబులు మనకేమైన వాగ్దానం చేస్తుందా? ఈ విధంగా మనం చదువుకున్న సత్యాన్ని దైనందిన జీవితంలో ఆచరణలో పెట్టే ప్రయత్నం చేయాలి.

ఈలా దైవవాక్యాన్ని ఆచరించినాడే ప్రభువునకు మాతృతుల్యుడు, బంధువు (లూకా 11:28). కాని దైవవాక్యాన్ని చదువుకొని ఆచరణలో పెట్టనివాడు అద్దంలో తన ముఖంజూచుకొని, మళ్లా ఓ నిమిషంలోనే తానేలాంటివాడో పూర్తిగా మరచి పోయిన మందునిలాంటివాడు (యాకో 1:24).

### 7. నోటుబుక్కు :

ప్రార్థనా సమయంలో ప్రభువు మనకేమైన బోధించవచ్చు. మన లోపాలను కొన్నిటిని సవరించవచ్చు. లేదా బైబుల్లోని ఓ వాక్యం మన హృదయానికి హత్తుకొని పోవచ్చు. ఓ పవిత్రమైన అనుభూతి కలుగవచ్చు. వీటినే ఆధ్యాత్మిక జీవితంలో "వెలుగులు" అంటారు. ఈ వెలుగులను ఎప్పటికప్పుడు ఓ నోటుబుక్కులో వ్రాసివుంచు కోవడం మంచిది. ఆయా వెలుగులను అందించిన ఆయా బైబులు భాగాలను మళ్లా మళ్లా ప్రార్థనకు ఉపయోగించుకోవచ్చు.

### 8. ముగింపు :

కడన ఓ చిన్న ప్రార్థనతో బైబులు పఠనం ముగించాలి. ఈ ప్రార్థనలో ప్రభువు మనకు అనుగ్రహించిన వరప్రసాదానికి కృతజ్ఞత చూపాలి. బైబులు బోధల ప్రకారం మన జీవితాన్ని సరిదిద్దుకోవడానికి అవసరమైన వరప్రసాదాన్ని అడుక్కోవాలి.

ఇంతవరకు మనం సూచించిన నియమాలన్నిటినీ ఓ ఉదాహరణకు అన్వయించి చూద్దాం : లూకా సువార్త 11:9-10 తీసికుందాం. ప్రార్థించే విధానం నేర్పమని శిష్యులు ప్రభువుని అడిగారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రభువు ప్రార్థనను సాధించాలి. సంతృప్తికరంగా ప్రార్థనం చేసామని ఎవరు చెప్పుకోగలరు? కనుక ఆ శిష్యుల్లాగే మనంగూడ "ప్రభూ, మాకు జపం చేసికొనే విధానం తెలీదు. మాకు గూడ ప్రార్థన నేర్పించయండి" అని వినయంతో అడుక్కుందాం. మన తరపున మనం రోజురోసు జపం చేసికునే ప్రయత్నం చేద్దాం. ఈలాగే బైబులు భాగాలను ప్రార్థనకు వాడుకోవచ్చు.

# 2. బైబులు గ్రంథాలు

బైబులు భాష్యం -72

బైబులు అనే మాట "బీబ్లోస్" అనే గ్రీకు పదం నుండి వచ్చింది. ఈ పదానికి పుస్తకం అని అర్థం. అతిశ్రేష్ఠమైన గ్రంథం కనుక దీన్ని వట్టినే "పుస్తకం అని వ్యవహరిస్తూ వచ్చారు.

బైబులు ఒక పుస్తకంకాదు, 73 పుస్తకాల గ్రంథాలయం. చాలమంది రచయితలు చాల కాలాల్లో దీన్ని వ్రాసారు. క్రీస్తుపూర్వం 10వ శతాబ్దం నుండి క్రీస్తు తర్వాత మొదటి శతాబ్దం వరకు -అనగా ఇంచుమించు 1100 ఏండ్లపాటు బైబులు రచన కొనసాగుతూ వచ్చింది. కాని ఇంత దీర్ఘకాలంలో జీవిస్తూ వచ్చిన రచయితల నందరినీ ప్రేరేపించి వాళ్ళచేత గ్రంథాలు వ్రాయించింది భగవంతుడే కనుక దీన్ని ఏకగ్రంథంగా గణించారు.

బైబులును పూర్వనూత్న వేదాలుగా విభజించారు. పూర్వవేదం భగవంతుడు మోషేద్వారా యూదులలో చేసికొనిన నిబంధనను గూర్చి చెప్తుంది. దీనిలో తొలి 46 గ్రంథాలున్నాయి. నూత్నవేదం దేవుడు క్రీస్తుద్వారా నరులందరితోను చేసికొన్న నిబంధననుగూర్చి చెప్తుంది. దీనిలో 27 గ్రంథాలున్నాయి.

యూదులూ క్రైస్తవులూ కూడ బైబులు పుస్తకాలను వేరువేరు విధాలుగా విభజిస్తూ వచ్చారు. ఆధునిక పద్ధతిననుసరించి మనం పూర్వవేదాన్ని నాల్గురకాల గ్రంథాలుగా విభజించవచ్చు. అవి 1.ఆది పంచకం, 2. చారిత్రక గ్రంథాలు, 3.జ్ఞానగ్రంథాలు, 4.ప్రవక్తల గ్రంథాలు. ఈ విభజనం ప్రకారం పూర్వవేద గ్రంథాలు మొత్తం యివి.

**1. ఆదిపంచకం -5**

1. ఆదికాండం
2. నిర్గమ కాండం
3. లేవీయ కాండం
4. సంఖ్యా కాండం
5. ద్వితియోపదేశ కాండం

**2. చారిత్రక గ్రంథాలు - 16**

6. యోషువా
7. న్యాయాధిపతులు
8. రూతు

9-10.సమూవేలు గ్రంథాలు రెండు

11-12 రాజుల గ్రంథాలు రెండు

13-14 దినవృత్తాంతాలు రెండు

15. ఎజ్రా

16. నెహెమ్యా

17. తోబీతు

18. యూదితు

19. ఎస్తేరు

20-21 మక్కబీయుల గ్రంథాలు రెండు

**3. జ్ఞానగ్రంథాలు**

22. యోబు

23. కీర్తనలు

24. సామెతలు

25. ఉపదేశకుడు

26. పరమగీతం

27. సొలోమోను జ్ఞానగ్రంథం

28. సీరా గ్రంథం

**4. ప్రవక్తల గ్రంథాలు -18**

పెద్ద ప్రవక్తలు - నల్గురు

29. యెషయా

30. యిర్మీయా

31. విలాపవాక్యాలు

32. బారూకు

33. యెహెజ్కేలు

34. దానియేలు

చిన్న ప్రవక్తలు - పంద్రెండుమంది

35. హోషేయ

36. యోవేలు

37. ఆమోసు

38. ఓబద్యా

39. యోనా

40. మీకా
41. నహూము
42. హబక్కూకు
43. జెఫన్యా
44. హగ్గయి
45. జెకర్యా
46. మలాకీ

నూత్నవేదాన్ని సువిశేషాలు, అపోస్తలుల కార్యాలు, జాబులు దర్శనగ్రంథం (ప్రకటన గ్రంథం) అని నాల్గురకాల గ్రంథలుగా విభజించారు. అవి మొత్తం యివి :

**1. సువిశేషాలు - 4**

1. మత్తయి
2. మార్కు
3. లూకా
4. యోహాను

**2. అపోస్తలుల చర్యలు - 1**

5. అపోస్తలుల చర్యలు

**3. జాబులు - 21**

పౌలు జాబులు -14

6. రోమీయుల జాబు
7-8 కొరింతీయుల జాబులు రెండు
9. గలతీయుల జాబు
10. ఎఫూసీయుల జాబు
11. ఫిలిప్పీయుల జాబు
12. కొలసీయుల జాబు
13-14 తెస్సలోనీయుల జాబులు రెండు
15-16 తిమోతి జాబులు రెండు
17. తీతు
18. ఫిలేమోను
19. హెబ్రేయుల జాబు

20. యాకోబు

21-22. పేతురు జాబులు రెండు

23-25 యోహాను జాబులు మూడు

26. యూదా

## 4. దర్శనగ్రంథం - 1

27. దర్శన గ్రంథం (ప్రకటన గ్రంథం)

మన క్యాతలిక్ లెక్కప్రకారం బైబులు గ్రంథాలు 73. కాని ప్రోటస్టెంటు శాఖల వాళ్ళు అభిప్రాయంప్రకారం ఈ 73లో 7పుస్తకాలు భగవత్ప్రేరితాలు కావు. కల్పితాలు. ఈ యేడు పూర్వవేదంలోనివే. వీళ్ళ లెక్కప్రకారం బైబులు పుస్తకాలు 66 మాత్రమే. వీళ్ళు అంగీకరించని 7 పుస్తకాలు ఇవి. 1. సొలోమోను జ్ఞానగ్రంథం, 2.సీరా జ్ఞానగ్రంథం, 3.యూదితు, 4.తోబీతు, 5. బారూకు, 6-7. మక్కబీయుల గ్రంథాలు రెండు. ఈ యేడింటినీ వీళ్ళు "అపోక్రిఫా" అనే పేరుతో ప్రత్యేక గ్రంథంగా ముద్రిస్తారు. కల్పిత గ్రంథాలని ఈ పేరుకి అర్థం.

# 2. పూర్వవేద గ్రంథాలు

పూర్వాధ్యాయంలో బైబులు పుస్తకాలనూ వాటి విభజననూ పేర్కొన్నాం. ఇక ఒక్కో పుస్తకంలోని విషయాన్ని సంగ్రహంగా పరిశీలిద్దాం. మొదట పూర్వవేదంతోను, అందులోను ఆదిపంచకంతోను ప్రారంభిద్దాం.

## 1. ఆదిపంచకం

ఇప్పుడు మనం తొలి ఐదుపుస్తకాలుగా గణించే ఆది, నిర్గమ, లేవీయ, సంఖ్యా, ద్వితీయోపదేశ కాండలనే పుస్తకాలు తొలుత ఏకగ్రంథంగానే వుండేవి. కథా వస్తువును బట్టి వాటిని క్రమేణ ఐదుగ్రంథాలుగా విభజించారు. కనుక ఇవి కాలక్రమేణ పరిణామం చెందాయి. చాలమంది రచయితలు చాలకాలాల్లో వీటి రచనా వ్యాసంగంలో పాల్గొన్నారు. కనుక ఈ గ్రంథాల్లో పునరుక్తులూ, కొన్నిచోట్ల పరస్పర విరుద్ధవాక్యాలు కూడ తగులు తాయి. అంతమాత్రం చేత వీటి విలువయేమీ తగ్గదు.

ఆదిపంచకంలోని ముఖ్యాంశం యూదులు ఫరోదాస్యం నుండి విముక్తి పొంది ఐగుప్తునుండి తరలిరావడం, మోషే నాయకత్వాన సీనాయి కొండ దగ్గర యావే ప్రభువుతో నిబంధనం చేసికోవడం. ఈ గ్రంథాల్లో ప్రముఖంగా కన్పించేనాయకుడు

మోషే కనుక ప్రాచీనులు అతడే వీటిని వ్రాసాడని భావిస్తూ వచ్చారు. కాని ఆధునికుల భావాల ప్రకారం మోషే స్వయంగా వీటిని వ్రాయలేదు. అతని మరణానంతరం చాల యేండ్లకు గాని ఈ పుస్తకాలు పుట్టలేదు. కాని వీటిలోని భావాలు ప్రధానంగా మోషేవే. కనుక ఇవి అతని పేరు మీదుగా చలామణి ఔతూ వచ్చాయి. యూదులు ఈ యాదిపంచకాన్నే ధర్మశాస్త్రం లేదా ఉపదేశం అని పిలుస్తారు. వాళ్ళ దృష్టిలో ఇవి పూర్వవేదంలోకల్లా ముఖ్యమైనవీ, పరమపవిత్రమైనవీని. ఇక ఈ యాదిపంచకం లోని ఒక్కో గ్రంథాన్ని పరిశీలిద్దాం.

## ఆదికాండం

ఆదికాండం సృష్ట్యాదిని గురించీ, నరజాతి ప్రారంభాన్ని గురించీ, యిస్రాయేలు పుట్టుకను గురించీ చెప్తుంది. కనుకనే దీన్ని ఆదికాండం అన్నారు. ఈ గ్రంథంలో తొలి 11 అధ్యాయాలూ ఆదిదంపతుల సృష్టీ వాళ్ళ పతనమూ మొదలైన అంశాలను వర్ణిస్తాయి. 12-50 అధ్యాయాలు పితరులైన అబ్రాహాము, ఈసాకు, యాకోబు, యోసేపు మొదలైనవాళ్ళ చరిత్రలను వర్ణిస్తాయి. అబ్రాహాము విశ్వాసం ద్వారా దేవునికి ప్రీతిపాత్రుడయ్యాడు. యిస్రాయేలు ప్రజలందరికీ తండ్రి అయ్యాడు. యోసేపు దైవబలం వలన మహాజ్ఞానియై విజయాలు సాధించాడు. ఈ తొలిపుస్తకం బైబులు అంతటికీ పునాదిలాంటిది. ఈ గ్రంథంలో వచ్చే కథలు కూడ చాల ఆకర్షణీయంగా వుంటాయి. ఈ పుస్తకం క్రీస్తుపూర్వం 1800-1500 సంవత్సరాల్లో జరిగిన చరిత్రను చెప్తుంది.

## నిర్గమ కాండం

నిర్గమం అంటే బయటికి వెళ్ళడం. యిస్రాయేలీయులు ఫరో దాస్యాన్నుండి తప్పించుకొని ఐగుప్తునుండి బయటకివెళ్ళారు. ఎడారిలో కొన్నాళ్ళు ప్రయాణం చేసి సీనాయి కొండదగ్గర మోషే నాయకత్వాన యావే ప్రభువుతో నిబందనం చేసికొన్నారు. ఈ సమయంలోనే దేవుడు ఆ ప్రజలకు ధర్మశాస్త్రం దయచేసాడు. ఈ నిబంధనమూ ధర్మశాస్త్రమూ క్రీస్తు వచ్చిందాకా చెల్లాయి. పూర్వవేదమంతా ఈ రెండంశాలమీదనే ఆధారపడి వుంటుంది. కనుక ఇది అతిముఖ్యమైన పుస్తకం. ఈ గ్రంథం 13వ శతాబ్దంలో జరిగిన కథ చెప్తుంది. ఈ రెండవ గ్రంథంనుండి ఐదవగ్రంథం వరకు యూదుల చరిత్రలో మోషే ప్రముఖ వ్యక్తిగా కన్పిస్తాడు.

## లేవీయ కాండం

లేవీయులంటే యాజకులు. యాజకులు ఆరాధనలో పాటించవలసిన నియమాలను చెప్పేదే లేవీయకాండం. ఈ పుస్తకం యిస్రాయేలీయులు బాబిలోనియా ప్రవాసం

నుండి పాలస్తీనా దేశానికి తిరిగివచ్చాక 6వ శతాబ్దంలో పాటించిన ఆరాధన నియమాలను చెప్తుంది. కాని ఈ నియమాలన్నీ మోషే ధర్మశాస్త్రం నుండే ప్రేరణాన్ని పొందాయి. కనుకనే ఈ పుస్తకాన్ని మోషే గొప్పతనానికి అద్దంపట్టే ఆదిపంచకంలో చేర్చారు. ఈ పుస్తకంలోని నియమాలు అంతశ్శుద్ధిని గాక శరీరశుద్ధినే ఎక్కువగా ప్రస్తావిస్తాయి. ఈ గ్రంథంలో చరిత్ర యేమీ వుండదు. అందుచే చదవడానికి విసుగు పుడుతుంది.

## సంఖ్యా కాండం

ఎడారిలో ప్రయాణం చేసేపుడు మోషే యిస్రాయేలీయుల జనాభాలెక్కలు సేకరించారు. కనుకనే దీనికి సంఖ్యాకాండం అని పేరు. ఈ గ్రంథం ప్రజలు సీనాయి కొండనుండి కాదేషుమీదిగా ఎడారిలో ప్రయాణం చేయడాన్ని వర్ణిస్తుంది. లేవీయ కాండంలోని నియమాలు దీనిలోకూడ కన్పిస్తాయి. ఐనా ఈ గ్రంథం ఎడారిలో జరిగిన వివిధ సంఘటనలతో ఆసక్తికరంగానే వుంటుంది.

## ద్వితీయోపదేశ కాండం

ప్రభువు సీనాయి కొండదగ్గర మొదటిసారిగా ప్రజలకు ధర్మశాస్త్రాన్ని లేక ఉపదేశాన్ని దయచేసాడు. ఈ వుపదేశాన్నే మోషే ఎడారిలో తిరిగి రెండవసారి ప్రజలకు విన్పించాడు. కనుకనే దీనికి ద్వితీయోపదేశం అని పేరు. క్రీస్తుపూర్వం 6వ శతాబ్ది కల్లా యూదులు ధర్మశాస్త్రాన్ని ఉపేక్షించడం మొదలుపెట్టారు. కనుక ఆనాటి రచయితలు దాని విలువను నొక్కి చెప్పవలసివచ్చింది. వాళ్ళు ఈ పుస్తకంద్వారా ధర్మశాస్త్రాన్ని మళ్ళా సజీవం చేసారు. పుస్తకమంతా ధర్మశాస్త్రాన్ని గురించే చెప్తుంది. దానిమీద వివరణం చెప్తుంది. మంచి భాషలో, చాల భక్తిమంతంగా వుంటుంది.

## 2. చారిత్రక గ్రంథాలు

ఈ శాఖకు చెందిన గ్రంథాలు యూదుల చరిత్రను చెప్తాయి. హీబ్రూ బైబులు వీటిని "పూర్వ ప్రవక్తల గ్రంథాలు" అని పిలుస్తుంది. అంటే ఈ పుస్తకాల్లో వచ్చేసంగతులు కేవలం చారిత్రకాంశాలు కాదనీ, ఈ చారిత్రకాంశాల ద్వారా ప్రభువు తన చిత్తాన్నీరక్షణ ప్రణాళికనూ ప్రజలకు తెలియజేసాడనీ భావం. వీటిలో యోషువా, న్యాయాధిపతులు, సమూవేలు గ్రంథాలు రెండు, రాజుల గ్రంథాలు రెండు మొదట ఏకగ్రంథంగానే వుండేవి. కాలక్రమేణ విభజింపబడ్డాయి. ఇక ఈ వర్గంలో ఒక్కో పుస్తకాన్ని గూర్చి విచారిద్దాం.

### యోషువా

మోషే గతించిన తర్వాత అతని యనుచరుడైన యోషువా యిస్రాయేలీయులకు నాయకుడై 1250 ప్రాంతంలో వాళ్ళను వాగ్దత్తభూమికి చేర్చాడు. కనానీయులనుండి

కనాను మండలాన్ని జయించి యిస్రాయేలు తెగలకు పంచియిచ్చాడు. యోషువా పేరే నూత్నవేదంలో యేసు పేరుకూడ. అతడు యూదులకు పంచియిచ్చిన వాగ్దత్తభూమి నూత్నవేదంలో మోక్షాన్ని సూచిస్తుంది.

## న్యాయాధిపతులు

ఈ గ్రంథం వాగ్దత్తభూమిని జయించినప్పటినుండి 1050 వరకు నడచిన చరిత్రను చెప్తుంది. ఇంకా రాజులు లేని ఆ ప్రాచీన కాలంలో దెబోరా, యెహూదు, గిద్యోను, యెఫ్తా సంసోను మొదలైన న్యాయాధిపతులు ప్రజలను పరిపాలించారు. వాళ్ళ చరిత్రలన్నీ ఈ గ్రంథంలో వస్తాయి.

## రూతు

రూతు అన్యజాతియైన మోవాబీయుల ఆడపడుచు. బోవసు అనే సంపన్నుడైన యూదుణ్ణి పెండ్లియాడి దావీదు రాజునకు ముత్తవ్వ అయింది. ఎజ్రా మొదలైనసంస్కర్తలు అన్యజాతి ప్రజలను యూదుల్లో చేర్చుకోరాదని శాసించారు. రూతుగ్రంథం ఈ సంకుచిత భావాలమీద తిరుగుబాటు చేస్తుంది. ఇది పాఠకులకు ఎంతో ఆసక్తిని పుట్టించే గ్రంథం.

## సమూవేలు గ్రంథాలు రెండు,
## రాజుల గ్రంథాలు రెండు

ఈ నాల్గు గ్రంథాలు 1050 నుండి 550 వరకు నడచిన యిస్రాయేలు చరిత్రను, విశేషంగా రాజుల ఉదంతాలను వర్ణిస్తాయి. ప్రవక్తయైన సమూవేలు సౌలును మొదటి రాజుగా అభిషేకించాడు. అతడు భ్రష్టుడైపోగా దావీదును రెండవరాజుగాఅభిషేకించాడు. ఇతడు యిస్రాయేలు తెగలను ఐక్యపరచాడు. మందసాన్ని యెరూషలేముకు తీసికొని వచ్చాడు. దావీదు కుమారుడైన సొలోమోను యెరూషలేములో దేవళాన్ని కట్టించాడు. ఈ రాజు పాపాల వలన ఇతని యనంతరం దేశం యూదా, యిస్రాయేలు అని రెండు భాగాలుగా చీలిపోయింది. 6వ శతాబ్దంలో ఆనాటి ప్రపంచరాజ్యాలయిన అస్సిరియా బాబిలోనియా సామ్రాజ్యాలు యూదుల దేశాలను రెండింటినీ నాశం చేసాయి. వందలాది రాజులు పరిపాలించినా ఈ గ్రంథాలు వారిలో దావీదు, హిజ్కియా, యోషియా అనే ముగ్గురు రాజులను మాత్రమే మెచ్చుకొంటాయి.

## దినవృత్తాంతాలు రెండు

ఈ గ్రంథాలుకూడ రాజుల చరిత్రలనే చెప్తాయి. వీటిని లేవీయ కాండను వ్రాసిన యాజకులు రచించారు. ఈ రచయితలకు దైవభక్తి ప్రధానం. ఈ దృష్టితోనే వీళ్ళు

రాజుల చరిత్రలను వర్ణించారు. పై నాల్గు గ్రంథాల్లో లేని నూత్న విషయాలు ఈ పుస్తకాల్లో తగులుతాయి.

## ఎజ్రా, నెహెమ్యా

ఐదవ శతాబ్దంలో యూదులు బాబిలోనియా ప్రవాసం ముగించుకొని పాలస్తీనా దేశానికి తిరిగివచ్చారు. ఆ కాలంలో వాళ్ల నాయకులు యాజకుడైన యెజ్రా, రాష్ట్రాధిపతియైన నెహెమ్యా. వీళ్ళిద్దరూ ప్రజలను సంస్కరించడానికి చాల నియమాలు చేసారు. ధర్మశాస్త్రాన్నీ బలులనూ పునరుద్ధరించారు. యెరూషలేమును దేవళాన్నీ పునర్నిర్మించడానికి పూనుకొన్నారు. ఈ నాయకుల చరిత్రలను చెప్పేవే ఈ రెండు గ్రంథాలు. తరువాత వచ్చిన రూతు, యోనా గ్రంథాలు వీళ్ళ సంస్కరణల్లోని సంకుచిత భావాలమీద తిరుగుబాటు చేసాయి.

## తోబీతు

యూదుల ప్రవాసకాలంలో జరిగిన కథలే తోబీతు, యూదితు, ఎస్తేరు గ్రంథాలు, ఇవి చారిత్రికాలు కాదు. కల్పిత కథలు. ఐనా చాల భక్తిమంతంగా వుంటాయి. తోబీతు అన్నా దంపతుల కుమారుడు తోబియా. ఇతడు రఫాయేలనే దేవదూత సహాయంతో గండాలన్నీ తప్పించుకొని సారాను పెండ్లియాడాడు. ఈ గ్రంథం కుటుంబధర్మాలను అతిలలితంగా వర్ణిస్తుంది. ఇది నాల్గవ శతాబ్దంలో పుట్టిన పుస్తకం.

## యూదితు

అస్సిరియా సైన్యాధిపతియైన హోలోఫెర్నెసు యూదుల నగరమైన బెతూలియాను ముట్టడించాడు. ఆ నగరంలో వసించే వితంతువూ దైవభక్తురాలూ ఐన యూదితు హోలో ఫెర్నెసుసు వంచించి అతని శిరస్సును నరుక్కొని వచ్చింది. తమ సైన్యాధిపతి చావడం చూచి శత్రుసైన్యం పారిపోయింది. ఇది రెండవ శతాబ్దంలో పుట్టిన గ్రంథం.

## ఎస్తేరు

యూదుల వర్ష్యాదేశంలో ప్రవాసులుగా జీవిస్తున్నారు. వాళ్ళ ఆడపడుచు ఎస్తేరు ఆ దేశపు రాజును పెండ్లిచేసికొంది. ఆ దేశపు మంత్రియైన హామాను కుట్రతో యూదులను నాశం చేయబూనాడు. ఎస్తేరురాణి హామాను కుట్రను భగ్నం చేసి అతన్ని ఉరితీయించి యూదులను కాపాడింది.

## మక్కబీయుల గ్రంథాలు రెండు

రెండవ శతాబ్దంలో గ్రీకు రాజయిన అంటియోకస్ ఎపిఫానిస్ యూదులను హింసించాడు. యూదుమతాన్ని బహిష్కరించాడు. కొందరు యూదులు అతనికి దడిసి

తమ మతాన్ని విడనాడారు. కొందరు మాత్రం అతన్ని ప్రతిఘటించారు. వీరిలో యూదా, అతని సోదరులు ముఖ్యులు. వీరికే మక్కబీయులు అని పేరు. వీరు గ్రీకురాజు ఆక్రమణలనుండి యెరూషలేముకు విముక్తి కలిగించారు. దేవలయాన్ని శుద్ధిచేసారు. మొదటి గ్రంథం ఈ చరిత్ర అంతా చెప్తుంది. రెండవ గ్రంథం ఈ పోరాటంలో పాల్గొన్న వీరుల చరిత్రలను మరో దృక్కోణం నుండి వర్ణిస్తుంది. ఈ రెండు గ్రంథాలకు పరస్పర సంబంధం లేదు.

## 3. జ్ఞానగ్రంథాలు

అన్ని దేశాల్లోను జ్ఞానగ్రంథాలూ జ్ఞానసూక్తులూ వెలువడ్డాయి. జ్ఞానమంటే మంచి బుద్ధి, లేదా నీతి. మనదేశంలో పంచతంత్ర హితోపదేశాలూ నీతిశతకాలూ వున్నాయి. అలాగే యిస్రాయేలు ప్రజల్లోకూడ జ్ఞానులు విజ్ఞాన సూక్తులను ప్రచారంలోకి తెచ్చారు. ఈ జ్ఞానులు విశేషంగా రాజాస్థానాల్లో వర్థిల్లారు. సొలోమోను రాజు జ్ఞాన సాహిత్యానికి పోషకుడుగా కీర్తి గడించాడు. యూదుల జ్ఞానగ్రంథాలు ఎక్కువగా లౌకిక నీతిని గూర్చే మాట్లాడతాయి. ధర్మశాస్త్రం, నిబంధనం, ఎన్నిక, రక్షణం మొదలైన మతవిషయాలను అట్టే పేర్కొనవు. జీవితంలో విజయాన్ని సాధించడం ఏలా అనేది ఈ గ్రంథాల్లోని ముఖ్య ప్రశ్న. ఐనా దేవుని పట్ల భయభక్తులు చూపడమే విజ్ఞానంలోని ముఖ్యాంశం. యూదుల దృష్టిలో జ్ఞానంపుణ్యం. అజ్ఞానం పాపం. జ్ఞాని సజ్జనుడు. అజ్ఞాని దుష్టుడు.

6వ శతాబ్దంలో యూదుల రాజులు అంతరించారు. వాళ్ళ రాజ్యం నాశమైంది. అప్పటినుండి వాళ్ళ జ్ఞానులు రాజులకు మారుగా జ్ఞానమే ప్రజలను నడిపిస్తుందని చెప్తూ వచ్చారు. ఈ జ్ఞానుల్లో రెండువర్గాలవాళ్ళున్నారు. మొదటి వర్గంవాళ్ళు ఆశావాదులు. వీళ్ళు జ్ఞానాన్ని అలవర్చుకొన్న నరులు సుఖశాంతులతో జీవిస్తారనీ విజయాలను చేపడతారనీ బోధించారు. రెండవవర్గంవాళ్లు నిరాశావాదులు. వీళ్లు ఈ లోకంలో జ్ఞానీ సజ్జనుడూ ఐన నరుడు కష్టాలననుభవిస్తుంటే అజ్ఞానీ దుష్టుడూ ఐన నరుడు సుఖాలనను భవిస్తున్నాడని వాపోయారు. ఐనా ఈ యుభయవర్గాల రచయితలూ నిజమైన జ్ఞానం కొరకు తపించిపోయారు. నూత్నవేదంలో క్రీస్తే మనకు జ్ఞానం. ఇక యీ వర్గానికి చెందిన పుస్తకాల్లో ఒక్కొక్కదాన్ని పరిశీలిద్దాం.

### యోబు

ఈ గ్రంథం యోబు భక్తుని చరిత్ర చెప్తుంది. అతడు ఎన్ని కష్టాలు వచ్చినా దేవుణ్ణి దూషించలేదు. యోబు భక్తికి మెచ్చుకొని కడన దేవుడు అతన్ని బహూకరించాడు. లోకంలో మంచివాళ్ళకు కష్టాలెందుకు వస్తాయి అనేది ఈ పుస్తకం పరిష్కరించబూనిన

సమస్య. యోబూ అతని నల్గురు స్నేహితులూ కలసి ఈ సమస్యకు రకరకాల పరిష్కారాలు సూచించబోతారు. కాని ఏ పరిష్కారమూ తృప్తిని కలిగించదు. కడన ఈ సమస్యను పరిష్కరించకుండానే గ్రంథం ముగుస్తుంది. ఈ పుస్తకాన్ని అర్థం జేసికోవడం కష్టం. కాని ఈ గ్రంథకర్త చాల లోతయిన భావాలు చెప్పాడు. ఇతడు ప్రపంచంలోని మహారచయితల కోవకు చెందినవాడు. ఇతడు యిస్రాయేలు జ్ఞానుల్లో నిరాశావాదుల పక్షాన నిలుస్తాడు. యోబుకథ చారిత్రకమైంది కాదు. నీతిబోధకమైంది.

## కీర్తనలు

కీర్తనల గ్రంథంలో 150 కీర్తనలున్నాయి. ఇవన్నీ జ్ఞానాన్నీ బోధించవు. వీటిల్లో కొన్నిమాత్రమే ఆ వర్గానికి చెందుతాయి. ఐనా సామాన్యంగా ఈ గ్రంథాన్ని జ్ఞానవాఙ్మయంలోనే చేరుస్తుంటారు.

కీర్తనల గ్రంథం యిస్రాయేలు ప్రజల జపపుస్తకం, సంగీత గ్రంథం. దానిలోని 150 కీర్తనలను దేవళంలో జరిగే ఆరాధనలో గీతాలుగా పాడేవాళ్ళు. లేవీయులు వీటిని స్వయంగా దేవళంలో పాడారు, ప్రజలచే పాడించారు.

దావీదురాజు కొన్ని కీర్తనలను వ్రాసాడు. కాని కీర్తనలన్నీ అతడు వ్రాసినవి కావు. దావీదు వ్రాసిన కీర్తనలను అతని తర్వాత వచ్చిన హీబ్రూ రచయితలు అవసరాన్ని బట్టి కొంతవరకు మార్చారు కూడ. కీర్తనల గ్రంథం కాలక్రమేణ పెరుగుతూ వచ్చింది. అది పూర్తికావడానికి కనీసం ఆరువందల యేండ్లయినా పట్టి వుండాలి.

ఈ గ్రంథం విలువ దానిలోని ప్రార్థనలను బట్టి వచ్చింది. ఈ పొత్తం సూచించని ప్రార్థనారీతులు లేవు. శతాబ్దాల పొడుగునా నరులు వాడుతూ వచ్చిన ప్రార్థనా పద్ధతులన్నీ ఈ పుస్తకంలో ఎక్కడో వో తావులో తగులుతాయి. కనుక భగవదనుభూతిని పొందగోరేవాళ్ళకు ఇది యెంతో వుపయోగపడుతుంది. కష్టసుఖాల్లో నరుడు భగవంతునికి ఏలా ప్రార్థన చేసికోవాలో ఈ గ్రంథం నేర్పుతుంది.

కీర్తనల పుస్తకాన్ని యూదులు మొదట తమ దేవాలయంలోను, తర్వాత తమ ప్రార్థనా మందిరాల్లోను వాడుకొన్నారు. వారి పద్ధతిలోనే క్రీస్తు కూడ ఈ కీర్తలను జపించాడు. అవి సూచించే రాజూ, మెస్సీయా అతడే. క్రీస్తు తర్వాత క్రైస్తవ సమాజం ఈ పుస్తకాన్ని తన ప్రార్థనా గ్రంథంగా స్వీకరించింది. మరియమాతా, అపోస్తలులూ, తొలి శతాబ్దాల్లోని వేదసాక్షులూ వీటిని జపించారు. నేటికీ తిరుసభలో గురువూల మఠవాసులూ ప్రతిరోజు జపించే బ్రీవియరీ జపపుస్తకంలో అధికభాగం కీర్తనలే. పూర్వవేదంలో ఇంత భక్తిమంతమైన గ్రంథం మరొకటి లేదు.

## సామెతలు

సొలోమోనురాజు మహాజ్ఞాని. అతీడు స్వయంగా చాల జ్ఞానవాక్యాలు చెప్పాడు. ఇతరులను ప్రేరేపించి చాల సూక్తులు చెప్పించాడుకూడ. యూదుల ధర్మశాస్త్ర సాహిత్యానికంతటికీ మోషేనుకర్తగా భావించినట్లే, జ్ఞాన సాహిత్యానికంతటికీ సొలోమోనును కర్తగా భావించారు. సామెతల గ్రంథం సొలోమోనురాజు పేరుమీదగా ప్రచారంలోకి వచ్చింది. కాని దీనిలో ఇతరుల రచనలను గూడ చేర్చారు. ఈ పుస్తకం ఐదవ శతాబ్దంలో రూపుదిద్దుకొంది. పుస్తకమంతా నీతివాక్యాలతో నిండివుంటుంది. ఇవి మనసామెతల్లాగాను, నీతి శతకాల్లోని పద్యాల్లాగాను వుంటాయి. జ్ఞానం పుణ్యం, అజ్ఞానం పాపం. జ్ఞానంతో జీవించేవాడు సుఖశాంతులు అనుభవిస్తాడు. అజ్ఞానంతో జీవించేవాడు దుఃఖంపాలవుతాడు. ఇది యీ గ్రంథం సారాంశం

## ఉపదేశకుడు

యోబు గ్రంథకర్తలాగే ఈ గ్రంథకర్తకూడా నిరాశావాది. జ్ఞానాన్ని పాటించినంత మాత్రాన్నే సుఖశాంతులు కలుగవు. లోకంలో పుణ్యకార్యాలు చేసిన జ్ఞానులు కష్టాలనుభవిస్తున్నారు. దుష్టకార్యాలు చేసిన పాపులు సుఖాలనుభవిస్తున్నారు. మరి న్యాయబద్ధంగా జీవించడం వలన లాభమేమిటి? ఇది యీ రచయిత వాదం. లోకంలోని వస్తువులన్నీ వ్యర్థమైనవే. ఏ వస్తువూ మనకు పూర్ణసుఖాన్నీయలేదు. ఇది యీ రచయిత ముఖ్యభావం. యోబు గ్రంథంలాగే ఈ పుస్తకం గూడ లోకంలో చెడ్డ యెందుకు వుందని ప్రశ్నిస్తుంది. తగిన పరిష్కారం మాత్రం సూచించదు. ఈ పుస్తకం సొలోమోను పేరుమీదిగా వెలువడింది.

## పరమగీతం

యథార్థంగా ఈ పుస్తకం జ్ఞానగ్రంథం కాదు. స్థూలంగా దీన్ని ఈ వర్గంపుస్తకాల్లో చేర్చాడు, అంతే. ఓ ప్రేమికుడు తన ప్రియురాలిని వెదకడం, వాళ్ళిద్దరూ కలసుకొని ఆనందించడం ఈ పుస్తకంలో యితివృత్తం. ఈలాంటి పుస్తకం బైబుల్లోకి యెందుకు వచ్చింది? ఈ ప్రేమికుడూ ప్రియురాలూ భగవంతునికీ ప్రజలకీ చిహ్నంగా వుంటారు. యావేప్రభువు యిస్రాయేలు ప్రజను తన వధువునుగా జేసికొని ఆదరించాడు. ఈ సంకేతం వల్ల యూదులు దీన్ని పవిత్రగ్రంథంగా భావించి పూర్వవేదంలో చేర్చారు. నూత్నవేదంలో ఇది క్రీస్తునీ శ్రీసభనీ సూచిస్తుంది. ఓరిజన్, బెర్నార్డ్ మొదలైన వేదశాస్త్రులు ఈ దృష్టితోనే దీనిమీద గొప్పవాఖ్యలు వ్రాసారు. పుస్తకం పాటలరూపంలో వుండిలలితమైన భావాలతో నిండివుంటుంది. ఈ పుస్తకంగూడ సొలోమోను పేరుమీదగానే వెలువడింది.

## సొలోమోను జ్ఞానగ్రంథం

ఎవడో అనామక రచయిత క్రీస్తుపూర్వం మొదటి శతాబ్దంలో ఈ పుస్తకాన్ని సొలోమోను పేరుమీదిగా వెలువరించాడు. మామూలుగా యూదులకు గ్రీకు సంస్కృతి గిట్టదు. కాని ఈ రచయిత గ్రీకు సంస్కృతి ఃకి అలవాటుపడిన యూదుడు. గ్రీకుల భావాన్ననుసరించి యితడు నరుణ్ణి దేహాత్మలుగా విభజించాడు. జ్ఞాని కష్టాలతోచనిపోయినా మరణంతో అతని జీవం అంతంకాదు. అతని ఆత్మ తర్వాత సుఖాన్ని పొందుతుంది. కనుక జ్ఞానం తప్పకుండా సుఖాన్ని కలిగిస్తుంది. ఇది యీ రచయిత వాదం. ఈసూత్రం యోబు గ్రంథ రచయితకూ ఉపదేశక గ్రంథ రచయితకూ తెలియదు. వాళ్ళు యూదుల పద్ధతిలో మరణంతో నరుని జీవితం అంతమవుతుందను కొన్నారు. కనుక లోకంలో సజ్జనులకు కష్టాలెందుకు వస్తాయి అన్న ప్రశ్నకు జవాబు చెప్పలేకపోయారు. ఈ రచయిత చెప్పగలిగాడు. అది యితని గొప్పతనం. ఈ గ్రంథం జ్ఞానప్రశంసలతో నిండివుంటుంది.

## సీరా జ్ఞానగ్రంథం

ఇది జ్ఞానగ్రంథాలన్నిటిలోను ఎక్కువ సూక్తులు కలిగిన గ్రంథం. చాల నైతిక విషయాలను బోధిస్తుంది. క్రీస్తుపూర్వ రెండవ శతాబ్దంలో బెన్‌సీరా దీన్ని వ్రాసాడు. యూదులు గ్రీకు సంస్కృతీప్రభావానికి లొంగకుండా వుండాలని ఇతని ఆశయం. జ్ఞాన గ్రంథాలన్నిటిలోను బహుశః యిది ఎక్కువ ఉపయోగకరమైంది. చాల భక్తిమంతంగా గూడ వుంటుంది.

## 4. ప్రవక్తలు

ప్రవక్త లేక దీర్ఘదర్శి అంటే మనం భవిష్యత్తును తెలియజేసేవాడు అనుకొంటాం. ఇది ప్రవక్త చేసే పనుల్లో ఒకటి మాత్రమే. ప్రవక్త ప్రధానంగా దేవుని పేరుమీదిగా మాటలాడేవాడు. దేవుని చిత్తాన్ని తెలియజేసేవాడు. తాను దేవుని సందేశాన్ని విని దాన్ని ప్రజలకు విన్పించేవాడు. కనుకనే ప్రభువు తన వాక్యాన్ని తీసి యిర్మీయా నోటిలో పెట్టాడు. యిస్రాయేలు ప్రవక్తలు భగవంతుణ్ణి అనుభవానికి తెచ్చుకొని అతనితో ఐక్యమై జీవించిన మహాభక్తులు. వాళ్ళు దేవుడు యిస్రాయేలు ప్రజలను ఏలా నడవమని అభిలషిస్తాడో, తాను వాళ్ళకు ఏయే మేళ్లు చేయాలని కోరుకొంటాడో అర్థంచేసికొని ఆ ప్రభువు చిత్తాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూండేవాళ్ళు. ప్రజలను దేవుని మార్గాల్లో నడవమనీ దేవునికి లొంగమనీ హెచ్చరిస్తుండేవాళ్ళు. కనుక వాళ్ళు దేవుని చేతిలో ఉపకరణం లాంటివాళ్ళు. అతని నోటి పలుకులాంటి వాళ్ళు.

మొదటి మహాప్రవక్త మోషే. అతడు యావే ప్రభువు హృదయాన్నీ, ఐగుప్తు నిర్గమనం భావాన్నీ ప్రజలకు విశదకరించాడు. సీనాయి కొండ దగ్గర నిబంధనం ద్వారా యిస్రాయేలును దేవుని ప్రజను చేసాడు. తర్వాత సమూవేలు, ఏలియా, ఎలీషా మొదలైన ప్రవక్తలు మోషే సంప్రదాయాన్ని కొనసాగించారు. సీనాయి దగ్గర ప్రారంభమైన యావేమతాన్ని వృద్ధిలోకి తీసుకవచ్చారు. 8వ శతాబ్దంలో ఆమోసుతో మొదలుపెట్టి ప్రవచనమే వృత్తిగాగల ప్రవక్తలు బయలుదేరారు. వీళ్ళ ప్రవచనాలు గ్రంథస్థమై బైబులు పుస్తకాలయ్యాయి.

ప్రవక్తలు స్వయంగా గ్రంథాలు వ్రాయలేదు. వాళ్ళ శిష్యులు తమ గురువుల బోధలను సంకలనం చేసారు. ఈ బోధలకు పరిచయవాక్యాలూ వివరణలూ చేర్చి గ్రంథాలుగా రూపొందించారు. కనుక నేడు మనం ప్రవక్తల గ్రంథాలు అనుకొనేవాటిల్లో కొన్ని భాగాలు మాత్రమే ప్రవక్తల సొంత పలుకులు. ప్రవక్తలు తమ ప్రవచనాలను రకరకాల రూపాల్లో పల్కారు. గేయాలు, వచనాలు, సామెతలు, దైవోక్తులు, పిట్టకథలు, ఉపదేశాలు, కీర్తనలు, విలాపవాక్యాలు, అపహాసవాక్యాలు మొదలైన పెక్కు రూపాల్లో ప్రవచనాలు కన్పిస్తాయి.

ప్రవక్తల్లో యెషయా, యిర్మీయా, యెహెజ్కేలు, దానియేలు అనేవాళ్ళు పెద్ద ప్రవక్తలు. వీళ్ళుగాక పండ్రెండుమంది చిన్న ప్రవక్తలు కూడ వున్నారు. నేటి బైబుళ్ళలో ఈ ప్రవక్తల గ్రంథాలు యెషయాతో ప్రారంభమై మలాకీతో ముగుస్తాయి. కాని యిది కాలక్రమ పద్ధతి కాదు. విషయగౌరవాన్ని బట్టి ఈ గ్రంథాలను ఈ క్రమంలో అమర్చారు. ఇక ఒక్కో ప్రవక్తను పరిశీలిద్దాం.

## పెద్ద ప్రవక్తలు నల్గురు

### యెషయా

యెషయా గ్రంథంలో కనీసం ముగ్గురు ప్రవక్తల బోధలయినా కన్పిస్తాయి. దీనిలో 66 అధ్యాయాలున్నాయి. 1-39 అధ్యాయాలు 765-690 సంవత్సరాల్లో యెరూషలేములో జీవించిన యెషయా బోధలు. ఆ కాలంలో అస్సిరియా గొప్ప రాజ్యంగా వృద్ధి చెంది 721లో ఉత్తరదేశమైన యిస్రాయేలును కబళించింది. దక్షిణరాజ్యమైన యూదా స్వీయ రక్షణకు కొంతకాలం అస్సిరియాతోను కొంతకాలం ఐగుప్తుతోను సంధిచేసికొంటూండేది. కాని ఆ రోజుల్లో ఏ రాజును ఆశ్రయిస్తే ఆ రాజు దేవుళ్ళను కొలవాలి. కనుక యూదులు అన్యదైవాలను పూజించే ప్రమాదం వాటిల్లింది. ఈ పరిస్థితుల్లో యెషయా ప్రవచనం చెప్పడం ప్రారంభించాడు. అతని బోధల ప్రకారం యిస్రాయేలుకు ఏకైకరాజు యావే. అతడు పవిత్రుడైన ప్రభువు. చరిత్రనంతటినీ నడిపించేవాడు అతడే. యిస్రాయేలు అతన్ని ఆశ్రయించి అతనినుండే విజయం సాధించాలి. అన్యరాజులను ఆశ్రయించ కూడదు.

యెషయా చెప్పినట్లే అస్సిరియా రాజైన సన్హెరీబు 701లో యెరూషలేమును ముట్టడించి కూడ ఓడిపోయాడు. యావే ప్రభువు ఆ పట్టణాన్ని కాపాడాడు. యెషయా మహాభక్తుడు. మహాకవి. అతని యంత గొప్ప ప్రవక్త మళ్ళా పుట్టలేదు. అతనిగ్రంథంలో వచ్చే ఇమ్మానువేలు ప్రవచనాలు చాలా ముఖ్యమైనవి. ఇవి రాబోయే మెస్సియాను సూచిస్తాయి. ఈ ప్రవక్త భగవంతుని పావిత్ర్యాన్నీ నరుని అపవిత్రతనీ బహు సునిశితంగా వర్ణించాడు.

ఈ గ్రంథంలో వచ్చే 40-55 అధ్యాయాలు మరో ప్రవక్తవి. బాబిలోనియా ప్రవాసంలో జీవించిన యెషయా శిష్యుడెవడో ఈ ప్రవచనాలు చెప్పాడు. ఇతడు ప్రజలు బాబిలోనియా ప్రవాసాన్ని ముగించుకొని తిరిగిరావడం, పూర్వం యిస్రాయేలీయులు ఐగుప్తు ప్రవాసాన్ని ముగించుకొని తిరిగి వచ్చినట్లుగా వుంటుందని చెప్పాడు. కనుక పునరాగమనం ఈ రెండవ భాగంలో ముఖ్యాంశం. ఈ ప్రవచనం 53వ అధ్యాయంలో సుప్రసిద్ధమైన బాధామయ సేవకుని వర్ణనం వస్తుంది. ఈ సేవకుడు రాబోయే క్రీస్తే. ఈ రెండవ భాగాన్ని చెప్పిన ప్రవక్త కూడ మొదటి యెషయా అంతటి రచయిత.

కడపటి 55-66 అధ్యాయాలు బాబిలోనియా ప్రవాసం ముగిసి ప్రజలు యెరూషలేముకు తిరిగివచ్చాక ఇతర ప్రవక్తలు చెప్పినవి. వీళ్ళంతా తొలి యెషయా శిష్యులే. ఈ మూడవిభాగంలో ప్రభువు యూదులనే కాక అన్యజాతులను గూడ రక్షిస్తాడనే విశాలభావాలు కన్పిస్తాయి.

## యిర్మియా

ఈ ప్రవక్త 640-590 కాలంలో జీవించాడు. అస్సిరియా రాజ్యం పతనమై బాబిలోనియా రాజ్యం వృద్ధిలోకి వచ్చింది. 587లో బాబిలోనియా ప్రభువైన నెబుకద్నె సరు యెరూషలేమును ముట్టడించి నాశం చేసాడు. దేవాలయాన్ని ధ్వంసం చేసారు. యూదులను బాబిలోనియాకు బందీలనుగా గొనిపోయాడు. ఈ వినాశాన్ని ముందుగనే తెలియజేసి యూదులను పరివర్తనం చెందండని హెచ్చరించడమే యిర్మియా ప్రవచనం. కాని యూదులు అతని ప్రబోధాన్ని వినలేదు. మొదటి నుండీ అతన్ని ఎదిరించి హింసిస్తూవచ్చారు. యిర్మియా తన ప్రజలనుండి చాల బాధలు అనుభవించాడు. జనులు తన మాట వినరనీ, తనకు అపజయం తప్పదనీ తెలిసికూడ ప్రభువు వలన నిర్బంధితుడై ప్రవచనం చెప్తూపోయాడు. అతనిబాధలు నూత్నవేదంలో క్రీస్తు బాధలను సూచిస్తాయి. ఈ ప్రవక్త మహాభక్తుడు. ఇతడు తన ప్రవచనం 31వ అధ్యాయంలో నూత్ననిబంధాన్ని పేర్కొన్నాడు. ఇదే క్రీస్తు నెలకొల్పిన నూత్నవేద నిబంధనం. ఈ ప్రవచనం ఇతని గ్రంథంలో శిఖరం లాంటిది. దైవభక్తి బాహ్యాచారాల్లోగాక అంతరంగంలో వుంటుందనేది ఇతని

ప్రధాన బోధ. యిర్మీయా యూదుల చరిత్రలో బహుకష్టమైన కాలంలో జీవించాడు. స్వయంగా కష్టాలు అనుభవించాడు. ఆ ప్రభువు ఆజ్ఞపై అవివాహితుడుగా వుండిపోయాడు. ఇతని బోధలూ జీవితమూ కూడ పాఠకులకు ఎంతో సానుభూతిని కలిగిస్తాయి.

## విలాపగీతాలు

587లో బాబిలోనియారాజు యెరూషలేము దేవళాన్ని నాశంచేసాడు. దేవాలయ ధ్వంసానికి విలపిస్తూ చెప్పిన శోకగీతాలే ఈ గ్రంథం. ఈ గీతాల్లో ఒక్కో చరణం హీబ్రూ భాషలోని ఒక్కో అక్షరంతో ప్రారంభమౌతుంది. ఈ గీతాల్లోని భావాలు యిర్మీయా భావాలతో సరిపోయినా, వీటి రచయిత మాత్రం అతడు కాదు. ఐనా అతని పేరు మీదిగానే ఈ గ్రంథం ప్రచారంలోకి వచ్చింది. ఈ గీతాల్లో కొన్ని మన తపస్సుకాలంలో వచ్చే పవిత్రవారం ఆరాధనలో వాడతాం.

## బారూకు

ఈ పుస్తకం యిర్మియాకు లేఖకుడైన బారూకు పేరుమీదిగా ప్రచారంలోకి వచ్చింది. ఇది పశ్చాత్తాపం, ధర్మశాస్త్రం, ప్రవాసం నుండి తిరిగిరావడం మొదలైన అంశాలను ప్రస్తావించే చిన్న పుస్తకం.

## యెహెజ్కేలు

ఈ ప్రవక్త 600 ప్రాంతంలో ప్రజలతోపాటు బాబిలోనియా ప్రవాసానికి వెళ్ళాడు. అక్కడి యూదులు మొదటలో ప్రవాసం స్వల్పకాలం మాత్రమే వుంటుందనుకొన్నారు. కాని ఈ ప్రవక్త అది దీర్ఘకాలం కొనసాగుతుందని రూఢిగా తెలియజేసాడు. ప్రవాసంలో నిరుత్సాహం చెందిన యూదులను ప్రోత్సహించాడు. చనిపోయిన యూదమతం మళ్ళా వుత్థానమౌతుందనీ, ధ్వంసమైన దేవాలయాన్ని మళ్ళా నిర్మిస్తారనీ బోధించి ప్రజల్లో ఆశాభావాలు రేకెత్తించాడు. ప్రజలు పవిత్రులైన యాజకులుగా జీవించాలని హెచ్చరించాడు. ఇతడు స్వయంగా యజాకుడు. కనుక యాజకులు మెచ్చుకొనే దేవాలయం, ఆరాధన, కర్మకాండలో పాటించవలసిన శుద్ధి, ధర్మశాస్త్రానుసరణం మొదలైన భావాలు ఇతని బోధల్లో విరివిగా కన్పిస్తాయి. ఇతని ప్రవచనం నాల్గు పెద్ద దర్శనాల రూపంలో వుంటుంది. నరుడు నూత్న హృదయాన్ని నూత్న ఆత్మనీ పొందాలనేది ఇతని ప్రధానబోధ.

## దానియేలు

ఈ గ్రంథం 165 ప్రాంతంలో పుట్టింది. ఆ కాలంలో అంటియోకస్ ఎపిఫానెస్ అనే గ్రీకురాజు యూదులను హింసిస్తుండేవాడు. ఈ హింసకు గురైనవాళ్ళకు ఓదార్పు కలిగించడానికి రచయిత ఈ గ్రంథం వ్రాసాడు. ప్రభువు తన భక్తులను నాశం

కానీయదని ధైర్యం చెప్పాడు. ఈ పుస్తకంలో ప్రవచనానికి మారుగా దర్శనాల శైలి చోటుచేసికొంది. ప్రవక్త తాను చెప్పదల్చుకొన్న అంశాలను స్వయంగా దర్శనాల్లో చూచినట్లుగా చెప్తూం టాడు. యెహెజ్కేలుతోనే తలెత్తిన ఈ శైలి ఈ పుస్తకంలో శిఖరాన్నందుకొంది. ఈ గ్రంథానికి దీటుగా నూత్నవేదంలో దర్శనగ్రంథం ఉద్భవించింది. దానియేలు ప్రవచనం పూర్వవేదంలో తొలిసారిగా ఉత్థానాన్ని పేర్కొంటుంది. దీనిలోని 7వ అధ్యాయంలో మనుష్యకుమారుని ఉదంతం వస్తుంది. నూత్నవేదంలో క్రీస్తు ఈ మకుటాన్ని స్వీకరించాడు.

## చిన్న ప్రవక్తలు 12 మంది

ఇక్కడ చిన్నప్రవక్తలు అంటే వీళ్లపేరుమీదిగతా ప్రచారంలోకి వచ్చిన గ్రంథాలు చిన్నవని అర్థం. వీళ్లు చెప్పిన సందేశం తక్కువ విలువైందేమీకాదు. ఇక్కడ ఈ ప్రవక్తల గ్రంథాలను వాటిని బైబుల్లో అమర్చిన క్రమాన్నిబట్టి కాక, వాళ్ళు జీవించిన కాలక్రమాన్ని అనుసరించి పరిశీలిద్దాం.

### ఆమోసు

ఇతడు 750 ప్రాంతంలో జీవించాడు. ఉత్తర రాజ్యమైన యిస్రాయేలుకు చెందినవాడు. మనకు తెలిసినంతవరకు ప్రవక్తలందరిలోను మొట్టమొదటిసారిగా గ్రంథరూపం తాల్చింది ఇతని ప్రవచనమే. ఆమోసు చదువుసంధ్యలు లేని మొరటువాడు. గొర్రెలకాపరి. ఐనా ప్రభువు అతన్నే యెన్నుకొన్నాడు. అతని కాలంలో యిస్రాయేలు రాజ్యం సుఖభోగాలతో జీవిస్తూ పేదలకు అన్యాయం చేస్తూంది. కనుక ప్రవక్త ఈ విలాస జీవితాన్ని ఖండించాడు. పేదసాదలకు న్యాయం చేకూర్చమని ధనవంతులను హెచ్చరించాడు. ప్రజలు తమ బుద్ధులు మార్చుకోకపోతే అస్సిరియా రాజు దండెత్తివచ్చి వాళ్ళను శిక్షిస్తాడని చెప్పాడు. ఆ శిక్షాదినాన్ని "ప్రభువు రోజునుగా" గణించాలని వాకొన్నాడు. ఈతని ప్రవచనంనిండా ఈ దైవశిక్షను గూర్చిన బెదరింపులు కన్పిస్తాయి.

### హోషేయ

ఇతడు కూడ ఉత్తర రాజ్యానికి చెందినవాడే. ఆమోసుకు సమకాలికుడు. కాని ఆమోసు దైవశిక్షనుగూర్చి బోధిస్తే యితడు దైవప్రేమను గూర్చి బోధించాడు. ఈ ప్రవక్త భార్యయైన గోమెరు ఇతన్ని విడనాడి వ్యభిచారిని ఐంది. కాని ప్రవక్త ఆమెను గాఢంగా ప్రేమించాడు. కనుక ఆమెను కొలదిగా శిక్షించి మరల స్వీకరించాడు. ఈ గోమెరులాగే యిస్రాయేలు ప్రజలుకూడ సీనాయి నిబంధనం ద్వారా యావే వధువయ్యారు. కాని ఆ ప్రజలు ప్రభువును విడనాడి అన్యదైవాలను కొలుస్తున్నారు. అది వ్యభిచారంలాంటిది.

కనుక ప్రభువు వాళ్ళను అస్సిరియా ప్రవాసం ద్వారా శిక్షించి మరల తన ప్రజలనుగా జేసికొంటాడు. ఇది ఈ ప్రవక్త సందేశం. ఈ పుస్తకంలో ప్రవక్తమాటలు మాత్రమేకాక అతని జీవితం కూడ ప్రవచనమౌతుంది. ఈ దృష్టితో చూస్తే ఇది బైబుల్లో విలక్షణమైన గ్రంథం. ఈ ప్రవక్త భగవంతునికి ప్రజలపట్ల వుండే ప్రేమ భర్తకు భార్యపట్ల వుండే ప్రేమలాంటిదని చెప్పాడు. ఈ భావం నూత్నవేదంలోకి గూడ ప్రవేశించింది. తిరుసభ క్రీస్తు వధువు అనే భావానికి ఆధారం హోషేయ ప్రవచనమే. పూర్వవేదంలో యెషయా యిర్మీయా వంటి మహాప్రవక్తలు హోషేయ వలన ప్రభావితులయ్యారు.

## మీకా

ఇతడు దక్షిణరాజ్యమైన యూదాకు చెందినవాడు. యెషయాకు సమాలికుడు. ప్రజలు తమ దుర్బుద్ధులను మార్చుకొని దేవునికి విధేయులు కావాలనీ, లేకపోతే ప్రభువు యిస్రాయేలు రాజ్యాన్ని వలె యూదారాజ్యాన్ని కూడ శిక్షిస్తాడనీ యితని ప్రధానబోధ. ఇతడు మెస్సీయా బెత్లెహేములో పుడతాడని చెప్పాడు. నూత్నవేదంలో మత్తయి ఈ ప్రవచనాన్ని ఉదాహరించాడు.

## జెఫన్యా

ఇతడు 640–609 కాలంలో జీవించాడు. ప్రభువు యూదాను శిక్షిస్తాడని ఇతని ప్రధానబోధ. ఇతడు దీనులైనవారిని ప్రభువు రక్షిస్తాడని చెప్పాడు. ఇతని నాటినుండి యూదుల్లో దీనులవర్గం ప్రాముఖ్యంలోనికి వచ్చింది. నూత్నవేదంలో క్రీస్తూ మరియమాతా శిష్యులూ ఈ దీనుల వర్గానికి చెందినవాళ్ళు.

## నహూము

అస్సిరియా రాజధానియైన నినివే నాశమౌతుందని ఇతని ప్రవచనం. ఈ ప్రవక్త చెప్పినట్లే 612లో నినివే కూలింది.

## హబక్కూకు

బాబిలోనియా యూదాను శిక్షిస్తుందనీ, అటుపిమ్మట ప్రభువు బాబిలోనియాను గూడ శిక్షిస్తాడనీ ఇతని బోధ. యూదాప్రజలకంటె దుష్టులైన బాబిలోనియులు యూదాను శిక్షించడం దేనికా అని ఈ ప్రవక్త విస్తుపోయాడు. నరుడు భగవంతుణ్ణి నమ్మి జీవించాలని ఇతని ముఖ్యబోధ.

## హగ్గయి

ఇతడు యూదులు బాబిలోనియా ప్రవాసంనుండి తిరిగివచ్చిన పిదప 520 ప్రాంతంలో ప్రవచించాడు. దేవాలయాన్ని పునర్నించాలనీ, రెండవ దేవాలయం మొదటి దేవాలయంకంటె వైభవంగా వుంటుందనీ ఇతని సందేశం.

## జెకర్యా

ఇతడు కూడ హగ్గయి సమకాలికుడు. అతనివలె ఇతడు కూడ దేవాలయాన్ని పునర్నిర్మించమని ప్రజలను హెచ్చరించాడు. ప్రజలు దేవాలయంలాగే పవిత్రంగా వుండాలనీ, మెస్సియా రాజు త్వరలో వేంచేస్తాడనీ బోధించాడు. ఈ గ్రంథంలో 9–14 అధ్యాయాలు జెకర్యా చెప్పినవి కావు. 4వ శతాబ్దంలో ఇతరులు చేర్చినవి.

## మలాకీ

ఈ ప్రవక్త 445 ప్రాంతంలో ప్రవచించాడు. హగ్గయి జెకర్యా ప్రవక్తల అనంతరం ప్రజల్లో మతపరమైన ఉత్సాహం నశించింది. వాళ్ళు అన్యజాతులతో వివాహాలు ప్రారంభించారు. విడాకులు ఎక్కువయ్యాయి. ఈ పరిస్థితుల్లో మలాకీ యాజకులూ ప్రజలూ కూడ పవిత్రులుగా జీవించాలని ప్రబోధించాడు. ఈ గ్రంథం మొదటి అధ్యాయంలో ఇతడు పేర్కొనిన పరిశుద్ధమైన బలి నూత్నవేదంలోని కల్వరిబలికి వర్తిస్తుంది.

## ఓబద్యా

ఇతడు 5వ శతబ్దానికి చెందినవాడు. ఇతని పుస్తకం ప్రవక్తల గ్రంథాలన్నిటిలోను చిన్నది ...21 వచనాలు మాత్రమే. ఈ ప్రవచనం ఎదోమీయుల మీద శాపవచనాలు. వీళ్లు యిస్రాయేలీయులకు పొరుగుజాతివాళ్లు. 586లో బాబిలోనీయులు యెరూషలేము దేవళాన్ని నాశం చేస్తూంటే వీళ్ళు కూడ ఆ శత్రువులతో చేతులు కలిపారు. అందుకే వాళ్ళమీద ఈ శాపవచనాలు.

## యోవేలు

ఇతడు నాల్గవ శతాబ్దానికి చెందినవాడు. ఇతని కాలంలో మిడతలదండు దిగివచ్చి దేశాన్ని నాశం చేసింది. ఈ సంఘటనను ఆధారంగా తీసికొని ప్రవక్త, ప్రజలు దైవశిక్షకు భయపడి తమ పాపాలకు పశ్చాత్తాపపడాలనీ విశుద్ధజీవితం జీవించాలనీ బోధించాడు. ప్రార్థనలూ ఉపవాసాలూ చేయాలని ప్రబోధించాడు. విశేషంగా ఇతడు, మెస్సీయాకాలం వచ్చినపుడు దేవుడు తన ప్రజలందరిమీద పవిత్రాత్మను కుమ్మరిస్తాడని నుడివాడు. నూత్నవేదంలో పవిత్రాత్మ శిష్యులమీదికి దిగివచ్చి నపుడు ఈ ప్రవచనం నెరవేరింది. కనుక ఇతడు పవిత్రాత్మకు సంబంధించిన ప్రవక్త.

## యోనా

ఈ గ్రంథకర్త నాల్గవ శతాబ్దానికి చెందినవాడు. యోనా కథ చారిత్రకం కాదు, కల్పితమైన నీతికథ. యూదులు సంకుచితమైన మనస్తత్వంతో తాము మాత్రమే రక్షణం పొందుతామనీ అన్యజాతులన్నీ నశిస్తాయనీ చెప్తున్నారు. ఎజ్రా నెహెమ్యా సంస్కరణలు కూడ యూదులకు అన్యజాతులతో సంపర్కం పనికిరాదని చెప్పాయి. ఈలాంటి

పరిస్థితుల్లో ఈ ప్రవక్త ప్రభువు అన్యజాతులను గూడ రక్షిస్తాడని బోధించాడు. యోనా కథలో ఆ ప్రవక్త ఊహించనట్లుగా అతనిబోధ విని అన్యజాతి నగరమైన నీనివె పరివర్తనం చెందింది. ప్రభువు దాన్ని కాపాడాడు. ఇది యోనాకు నచ్చక దేవునిమీద సుమ్మర్లు పడ్డాడు. అపుడు ప్రభువు తాను అన్యజాతులను గూడ రక్షించే దేవుణ్ణని తెలియజేసాడు. కనుక ఈ గ్రంథంలో, పూర్వవేదంలో అరుదుగా కన్పించే అన్యజాతి రక్షణం అనే అంశం శిఖరాన్నందుకొంది. నూత్నవేదంలో క్రీస్తు ఈ యోనా కథను పేర్కొన్నాడు.

## 3. నూత్నవేద గ్రంథాలు

### 1. సువిశేషాలు

సువిశేషం అనగానే ఇప్పుడు మనకు పుస్తకం అనే భావం కలుగుతుంది. కాని తొలిరోజుల్లో ఇవి కేవలం బోధలుగా మాత్రమే వుండేవి. ఈ బోధలే తర్వాత గ్రంథస్థాలయ్యాయి. సువిశేష రచనలో కనీసం మూడు దశలైనా గోచరిస్తాయి. మొదటి దశలో క్రీస్తు సందేశాలూ అతని జీవిత సంఘటనలూ కేవలం మౌఖిక బోధలుగా వుండేవి. పేతురు మొదలైన శిష్యులు కేవలం నోటితోనే ఈ బోధలను విన్పిస్తూ వచ్చారు. ఈ దశలో రచనలు లేవు. రెండవ దశలో కొందరు రచయితలు క్రీస్తు బోధలనూ అతని జీవిత సంఘటనలనూ చిన్నచిన్న రచనలుగా వ్రాస్తూ వచ్చారు. ఉదాహరణకు పర్వత ప్రసంగమూ, మంచి సమరయుని సామెతా మొదలైనవి. ఇవి సంపూర్ణ క్రీస్తు చరిత్రలు కావు. మూడవ దశలో భగవత్ప్రేరితులైన నల్గురు రచయితలు ఈ చిన్నచిన్న రచనలను కలిపి సమగ్రమైన క్రీస్తు చరిత్రలను రూపొందించారు. అవే సువిశేషాలు. ఈ రచయితల్లో మొదటివాడు అరమాయిక్ సువిశేషం వ్రాసిన మత్తయి. తర్వాత వచ్చిన మార్కు లూకా యోహాను ప్రత్యేక పద్ధతిలో తన సువిశేషం వ్రాసాడు. నేడు మనకు బైబుల్లో సువిశేషాలంత ఉపయోగకరమైన గ్రంథాలు వేరేవి లేవు. క్రైస్తవులు వీటిని భక్తిభావంతో పారాయణం చేసికోవాలి. ఇక, ఒక్కో సువిశేషాన్ని సంగ్రహంగా పరిశీలిద్దాం.

### మార్కు

మార్కు పేతురు శిష్యుడు. పేతురు బోధలవల్ల ప్రభావితుడై ఇతడు 60 ప్రాంతంలో సువిశేషం వ్రాసాడు. గ్రీకు భాషలో వెలువడిన మొదటి సువిశేషం ఇదే. మత్తయి అరమాయిక్ భాషలో వ్రాసిన సువిశేషం నుండి ఇతడు చాల విషయాలు స్వీకరించాడు. క్రీస్తు దైవకుమారుడనేది ఇతని సువిశేషంలోని ప్రధానాంశం. మార్కు ఈ గ్రంథాన్ని రోములోని క్రైస్తవుల కోసం వ్రాసాడు.

## మత్తయి

మత్తయి గ్రీకు సువిశేషం 65 ప్రాంతంలో వెలువడింది. దీనికి పూర్వం 12మంది శిష్యుల్లో ఒకడైన మత్తయి వ్రాసిన అరమాయిక్ సువిశేషం వుంది. దీన్ని మార్కు సువిశేషాన్నీ ఆధారంగా తీసికొని మరొక రచయిత ఈ గ్రీకు సువిశేషాన్ని వ్రాసాడు. శిష్యుడైన మత్తయి స్వయంగా వ్రాసిన అరమాయిక్ సువిశేషం ఇప్పుడు లభ్యంకాదు.

నాల్గు సువిశేషాల్లోను ఎక్కువ ప్రసిద్ధిలోకి వచ్చింది ఈ మత్తయి సువిశేషమే. దీనిలోని ప్రధానాంశం దైవరాజ్యం. యూదులకు ఆదిపంచకం ఏలాగో క్రైస్తవులకు ఈ సువిశేషం ఆలాగు. దానిలాగే ఇదికూడ ఐదు భాగాలుగా వుంటుంది. క్రీస్తు నూత్న మోషే. పూర్వవేద ప్రవచనాలన్నీ అతనియందు నెరవేరాయి. అతడు తన మరణోత్థానాల ద్వారా మనలను నూత్న వాగ్దత్త భూమియైన మోక్షానికి కొనిపోతాడు. రచయిత ఈ గ్రంథాన్ని యెరూషలేములోని క్రైస్తవుల కోసం వ్రాసాడు.

## లూకా

లూకా 70లో ఈ సువిశేషాన్ని వ్రాసాడు. ఇతడు పౌలు శిష్యుడు. మార్కు మత్తయి సువిశేషాలు యూదుల కోసం ఉద్దేశింపబడ్డాయి. కాని ఈ గ్రంథం ప్రధానంగా గ్రీకు క్రైస్తవులకోసం ఉద్దేశింపబడింది. క్రీస్తు కరుణ, పవిత్రాత్మ, ప్రార్థన మొదలైన అంశాలను ఈ సువిశేసం ప్రత్యేక శ్రద్ధతో వర్ణిస్తుంది. రచనావిధానంలో ఈ మూడవ సువిశేషం తొలి రెండింటికంటె సుందరంగా వుంటుంది.

## యోహాను

ఇది అన్నిటికంతటె చివరన వచ్చిన సువిశేషం. మొదటి శతాబ్దంలో పుట్టింది. ఇది తొలి మూడిటిలాగ క్రీస్తు సమగ్ర చరిత్రను చెప్పదు. క్రీస్తు జీవితంలోని కొన్ని ముఖ్యమైన సంఘటనలను మాత్రం ఎన్నుకొని వాటిమీద వ్యాఖ్య చెప్తుంది. తండ్రిని తెలియజేసే దైవవార్త క్రీస్తు. అతడు లోకానికి వెలుగు, జీవం, సత్యం. అతడు మనకు దైవప్రేమనూ సోదరప్రేమనూ నేర్పేవాడు. ఇవి యీ గ్రంథంలోని కొన్ని ముఖ్యాంశాలు.

# 2. అపోస్తలుల కార్యాలు

ఇది లూకా రెండవ రచన. శ్రీసభ తొలి ముప్పది యేండ్ల చరిత్రను చెప్తుంది. విశేషంగా పేత్రు పౌలు వేదబోధలను వర్ణిస్తుంది. దీనికి పరిశుద్ధాత్మ సువిశేషమని కూడ పేరు. క్రీస్తు ఉత్థానానంతరం ఆత్మ తొలిక్రైస్తవ సమాజాలను నడిపించిన తీరును ఈ గ్రంథం విపులంగా వర్ణిస్తుంది.

## లేఖలు

నూత్నవేదంలో 21 జాబులున్నాయి. వీనిలో 14 పౌలు వ్రాసినవి. 7 ఇతరులు వ్రాసినవి. నూత్నవేదంలో మొదట వ్రాయబడిన పుస్తకాలు సువిశేషాలు కాదు, ఈ జాబులే. ఈ లేఖలను కూడ రచయితలు నాటి క్రైస్తవ సమాజాల్లోని ఆయా సమస్యలను పుస్కరించుకొని వ్రాసారేకాని, కేవలం క్రైస్తవ సిద్ధాంతాలను ప్రతిపాదించడానికి వ్రాయలేదు. ఐనా ఇవి దైవశాస్త్రాంశాలతో నిండివుంటాయి.

సువిశేషాలు కథల్లాగ వుండి సులువుగా బోధపడతాయి. జాబులు శాస్త్రాంశాలతో నిండి ఉండడం వల్ల అంత సులువుగా బోధపడవు. కాని వీటిని అర్థం చేసికొంలటే క్రైస్తవ వేద సత్యాలు చాల లోతుగా తెలుస్తాయి. ఇక, ఈ జాబులను ఇప్పుడు వాటిని బైబుల్లో అమర్చిన క్రమంలోకాక అవి పుట్టిన కాలక్రమపద్ధతిలో పరిశీలించి చూడ్డం మెరుగు.

## తెస్సలోనీయుల జాబులు రెండు

ఇవి నూత్నవేదంలోని పుస్తకాల్లో కెల్ల మొదటి రచనలు. పౌలు వీటిని క్రీ.శ. 50 ప్రాంతంలో వ్రాసాడు. పౌలు తెస్సలోనికలో క్రైస్తవ సమాజాన్ని స్థాపించాక అక్కడ వేదహింసలు ప్రారంభమయ్యాయి. కనుక అతడు తెస్సలోనిక పౌరులను నిలకడతో వుండమని తొలిజాబులో హెచ్చరించాడు. ప్రభువు రెండవరాకడ కొరకు వేచివుండమని కూడ చెప్పాడు. రెండవజాబులో, తెస్సలోనీయులు క్రీస్తు త్వరలోనే వేంచేస్తాడన్న భావంతో పనిపాటలు మానివేయకూడదని హెచ్చరించాడు. విశ్వాసులు సోదరప్రేమతో జీవించాలని బోధించాడు. ఈ జాబుల్లో రెండవ రాకడను గూర్చి పౌలు చెప్పిన విషయాలు నేటికీ ఆసక్తిని కలిగిస్తాయి.

## కొరింతీయుల జాబులు రెండు

పౌలు 54 ప్రాంతంలో ఎఫెసు నుండి కొరింతు క్రైస్తవులకు రెండు జాబులు వ్రాసాడు. మొదటి జాబులో వాళ్లు స్థిరవిశ్వాసంతో మెలగాలని హెచ్చరించాడు. క్రైస్తవ సమాజంలో అంతఃకలహాలు అపవిత్రత పనికిరావని చెప్పాడు. ఆయా సమస్యలను గూర్చి అచటి క్రైస్తవులడిగిన ప్రశ్నలకు సమాధానాలు పంపాడు. రెండవ జాబులో తన మీద అపదూరులు మోపే ఇతర బోధకులను ఖండించాడు. యెరూషలేములో కరువు వలన బాధపడే యూద క్రైస్తవులకు సహాయం చేయమని కోరాడు. ఈ రెండు లేఖలూ పౌలుకీ అతని క్రైస్తవులకీ వుండే వ్యక్తిగతమైన సంబంధాలు చాల తెలియజేస్తాయి.

## గలతీయుల జాబు

పౌలు ఈ జాబునుకూడ 57 ప్రాంతంలో ఎఫెసు నుండే వ్రాసాడు. పౌలు ప్రత్యర్థులైన యూదబోధకులు ధర్మశాస్త్రం మనలను రక్షిస్తుందని బోధించారు. క్రీస్తు వచ్చాక ఆ ప్రభువేగాని ధర్మశాస్త్రం మనలను రక్షించదని బోధించాడు పౌలు. రక్షణమనేది దేవుడు ఉచితంగా దయచేసే వరంగాని మన సత్క్రియలతో సాధించేది కాదనిగూడ తెలియజేసాడు. క్రైస్తవులకు సున్నతి అక్కరలేదని చెప్పాడు.

## రోమీయుల జాబు

దీనిని గలతీయుల జాబు వ్రాసిన తర్వాత 56 ప్రాంతంలో కొరింతు నుండి వ్రాసాడు. గలతీయుల జాబులోని విషయాలే దీనిలోగూడ ప్రస్తావింపబడ్డాయి. మోషే ధర్మశాస్త్రం వలన ఇక లాభంలేదు. తండ్రి క్రీస్తుద్వారా ప్రజలను రక్షించాడు. ఇప్పుడు మనం క్రీస్తుని విశ్వసించి అతనిలోనికి జ్ఞానస్నానం పొంది రక్షణం పొందాలి. క్రైస్తవులు నూత్న యిస్రాయేలు ఔతారు. వాళ్ళు ప్రేమజీవితం జీవించాలి. ఈ జాబులో లోతైన దైవశాస్త్రాంశాలున్నాయి. పౌలు జాబులన్నిటిలోను ఇది యెక్కువ విలువైంది.

## ఫిలిప్పీయుల జాబు

పౌలు ఫిలిప్పి క్రైస్తవులను మెచ్చుకొంటూ 56 ప్రాంతంలో వ్రాసిన జాబు ఇది. స్నేహపూర్వకమైన కుశలప్రశ్నలతోను వ్యక్తిగత సమాచారాలతోను నిండివుంటుంది. రెండవ అధ్యాయంలో క్రీస్తు వినయాన్నీ మహిమనీ తెలియజేసే గొప్ప గేయాన్ని ఉదామరించడం జరిగింది.

## కొలొస్సీయుల జాబు

60 ప్రాంతంలో రోములోని చెరలో నుండి వ్రాసిన జాబు. క్రీస్తు దేవదూతలతో ఒకడనీ, దేవదూతలను పూజిస్తే దేవుణ్ణి చేరతామనీ దబ్బర సిద్ధాంతాలు బయలుదేరాయి. ఈ సిద్ధాంతాలకు లొంగవద్దని పౌలు కొలస్సే పౌరులను హెచ్చరించాడు. క్రీస్తు నిజమైన దేవుడనీ దేవదూతలు అతనికి లొంగి వుంటారనీ ఉపదేశించాడు.

## ఎఫెసీయుల జాబు

61 ప్రాంతంలో వ్రాసిన లేఖ. తండ్రి రక్షణ ప్రణాళికలన్నీ క్రీస్తునందు నెరవేరాయి. ఈ లోకంలో ఉత్థానక్రీస్తు సాన్నిధ్యాన్ని తిరుసభ కొనసాగించుకొని పోతూంటుంది. ఈ లేఖ 5వ అధ్యాయంలో పౌలు వివాహ జీవితాన్ని గూర్చి చెప్పిన వాక్యాలు నేటికీ పెండ్లిపూజలో చదువుతూంటాం.

## ఫిలెమోను

ఫిలెమోను అనే సంపన్నుని బానిస ఒనేసిమస్ పారిపోయాడు. ఇతడు రోములో పలువల్ల ఉపదేశంపొంది క్రైస్తవుడయ్యాడు. ఈ బానిసను దండించవద్దని పౌలు ఫిలేమోనుకు వ్రాసాడు. అదే యీ జాబు.

## తిమోతి జాబు

ఈ జాబులు  ప్రాంతలో వ్రాసినవి. వీటి కర్తృత్వం సందేహాస్పదం. పౌలుగాని అతని శిష్యులుగాని వ్రాసి వుండవచ్చు.పౌలు బోధించిన వేదసత్యాలను అతని శిష్యులైన తిమోతి మొదలైన వాళ్ళు పవిత్రంగా ఎంచాలనీ వాటిల్లో ఏలాంటి మార్పులూ చేయరాదనీ ఈ జాబుల సారాంశం.

## తీతు జాబు

ఇది శిష్యుడైన తీతుకు వ్రాసిన జాబు. తిమోతి జాబుల్లాగే ఇదికూడ పౌలు బోధల్లో మార్పులు చేయరాదని చెప్తుంది.

## హెబ్రేయుల జాబు

ఇది 67  ప్రాంతంలో వ్రాసింది. పౌలు విష్యుడెవరో వ్రాసి వుండవచ్చు. యూదమతంలోని యాజకులు కొందరు క్రైస్తవమతంలో చేరారు. కాని వాళ్ళు వేదహింసలకు జంకి మళ్లా యూదమతంలోకి వెళ్ళగోరుతుంటే అలా చేయవద్దని హెచ్చరిస్తూ వ్రాసిన జాబు ఇది. ఈ లేఖ ప్రధానంగా క్రీస్తు యాజకత్వాన్ని వర్ణిస్తుంది.

## యాకోబు జాబు

యెరూషలేము క్రైస్తవ సమాజానికి అధిపతియైన యాకోబు దీన్ని యూద క్రైస్తవులకోసం 45 ప్రాంతంలో వ్రాసాడు. క్రైస్తవులు పర్వతప్రసంగం బోధల ప్రకారం జీవించాలి. దరిద్రులు దీనులు, హింసితులు దేవునికి స్నేహితులౌతారు. ఈ జాబు చాల నీతిబోధలతో నిండివుంటుంది.

## యూదా జాబు

80 ప్రాంతంలో వ్రాసిన జాబు ఇది. ఆనాటి దబ్బర బోధకులనూ వాళ్ళ సిద్ధాంతాలనూ ఖండిస్తుంది.

## పేతురు జాబులు రెండు

పేతురు పేరుమీదిగా రెండు జాబులు ప్రచారంలోకి వచ్చాయి. పేతురు భావాలనే విశదీకరిస్తూ అతని శిష్యుడు వీటిని వ్రాసివుండవచ్చు. మొదటిది 62

ప్రాంతలో వెలువడింది. క్రీస్తుని ఆదర్శంగా తీసికొని ఆపదల్లో ధైర్యంగా వుండాలని చెప్తుంది. రెండవది ప్రభువు రెండవరాకడ మొదలైన విషయాలను పేర్కొంటుంది.

### యోహాను జాబులు

యోహాను పేరుమీదిగా మూడు జాబులున్నాయి. యోహానుగాని అతని శిష్యులు గాని వీటిని మొదటి శతాబ్దాంతంలో వెలువరించి వుంటారు. వీటిల్లో రెండుమూడు జాబులు ముఖ్యమైనవి కావు. మొదటి జాబు మాత్రం ప్రశస్తమైంది. ఈ లేఖబోధల ప్రకారం దేవుడు ప్రేమమయుడు. దేవుని ప్రేమ క్రీస్తులో దర్శనమిచ్చింది. క్రైస్తవులు ప్రేమజీవితం గడపాలి.

## 4. దర్శన గ్రంథం

పూర్వవేదంలో దానియేలు గ్రంథం వెలువడినప్పటికే ప్రవచనం అంతరించి దర్శన వాఙ్మయం ప్రచారంలోకి వచ్చింది, ప్రవక్తలు చెవితో దైవసందేశం విని నోటితో ప్రకటించారు. కాని దర్శన గ్రంథకర్తలు దర్శనాల్లో దైవసందేశాన్ని గ్రహించి రచనా రూపంలో ప్రకటించారు. నూత్నవేదంలోని తుదిగ్రంథమైన దర్శనగ్రంథం ఈ దర్శన సాహిత్యానికి చెందింది. ఇది 95 ప్రాంతంలోపుట్టింది. సువిశేషకారుడైన యోహాను దీనికి కర్తకావచ్చు, కాకపోవచ్చు కూడ. ఈ గ్రంథం తొలి శతాబ్దంలో వేదహింసలనుభ వించే క్రైస్తవులను హెచ్చరించడానికి పుట్టింది. ఇది పూర్వవేదంలో దానియేలు గ్రంథాన్ని అనుకరిస్తుంది. తండ్రి క్రీస్తుద్వారా మనకు అన్ని పరలోక భాగ్యాలూ దయచేసాడు. కనుక క్రైస్తవులు అతన్ని నమ్మి జీవించాలి. శ్రమలకు జంకకూడదు. క్రీస్తు మన శ్రమల్లో మనతో వుండి మనలను కాపాడతాడు.

ఈ గ్రంథంలో చాల సంకేతాలు వస్తాయి. వాటిని అర్థం చేసికోవడం కొంచెం కష్టం. ఐనా ఈ పుస్తకం తొలినాటి వేదహింసలకు సంబంధించిందేగాని భవిష్యత్తులో రాబోయే సంగతులను చెప్పేదికాదు. కనుక దీన్ని భవిష్యత్సంఘటనలను సూచించే దాన్నిగా అర్థంచేసికోవడమూ, ఆ పద్ధతిలో దీనిమీద వ్యాఖ్య చెప్పడమూ తప్పు. నూత్న వేదంలోని ఇతర గ్రంథాల్లో లేని క్రొత్తబోధలను వేటినీ ఈ గ్రంథం చెప్పదు. మామూలు బోధలనే దర్శనాల భాషలో చెప్తుంది, విశేషం అంతే. నూత్న వేదంలో దర్శన సాహిత్యానికి చెందిన పుస్తకం ఇదొక్కటే.

# 3. ఆది దంపతులు



## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | విశ్వసృష్టి | 42 |
| 2. | నరుడు | 45 |
| 3. | నారి | 48 |
| 4. | ఏదెను తోట | 50 |
| 5. | శోదనలూ, పతనమూ | 52 |
| 6. | పాపమూ, శిక్షా | 54 |
| 7. | లోకరక్షకుడు | 56 |
| 8. | సంకేతాలు, వాటి భావమూ | 57 |


## 1. విశ్వసృష్టి

### 1. రెండు సంప్రదాయాలు

ఆదికాండంలోని తొలి మూడధ్యాయాలు రెండు భిన్న సంప్రదాయాలనుండి గ్రహింపబడ్డాయి. 1. 1నుండి 2,3 వచనాల వరకు యాజక సంప్రదాయం. ఇది క్రీస్తుపూర్వం 6వ శతాబ్దికి చెందిన రచన. 2,4 నుండి 3,24 వరకు యావే సంప్రదాయం. ఇది క్రీస్తుపూర్వం 8వ శతాబ్దికి చెందిన రచన. ఇక, ఐదవ శతాబ్దంలో వున్న ఓ రచయిత ఈ రెండు సంప్రదాయాలనూ ఐక్యం జేసి ప్రస్తుతమున్న రీతిగా ఆదికాండాన్ని తయారుచేసాడు.

### 2. ఆరు రోజుల సృష్టి

యాజక సంప్రదాయం ప్రకారం దేవుడు ఆరురోజుల్లో సృష్టి చేసాడు. మొదటిరోజున వెలుగును కలిగించాడు. రెండవరోజున నీటినీ, మూడవరోజున చెట్టుచేమలనూ, నాల్గవరోజున సూర్యచంద్ర నక్షత్రాలనూ సృజించాడు. ఐదవరోజు జలంలోని చేపలనూ, ఆకాశంలోని పక్షులకూ పుట్టించాడు. ఆరవరోజు భూమిమీది జంతువులనూ, నరుణ్ణీ సృజించాడు. ఈ విధంగా ప్రాణులన్నిటిలోను ఉత్తముడైన నరుణ్ణి ఆఖరిరోజున చేసాడు. కాని ఏడవరోజు ప్రభువు ఏ పనీ చేయకుండా విశ్రాంతి తీసుకున్నాడు.

ఐతే దేవుడు ఈలాగ ఆరురోజులు సృష్టి చేసాడా? చేయలేదు. ఇది యాజక సంప్రదాయంవాళ్లు అవలంభించిన ఓ రచనాపద్ధతి, అంతే. యావే సంప్రదాయంలో

అసలు ఈ యారురోజుల సృష్టి లేనేలేదు. అక్కడ దేవుడు ఒకరోజులోనే సృష్టిఅంతా ముగించాడు -2,4. ఇంకోసంగతి కూడ. దేవుడు మొదటిరోజున వెలుగును కలిగించాడనీ, నాల్గవరోజున సూర్యుణ్ణి కలిగించాడనీ చెప్తుంది యాజక సంప్రదాయం. ఇదే నిజమైతే సూర్యుడు లేకముందే వెలుగెలా వచ్చింది? కనుక మనం ఈ యారు రోజుల సృష్టిని అక్షరాల నమ్మవలసిన అవసరంలేదు. మరి యాజక సంప్రదాయం దేవుడు ఆరురోజుల పాటు సృష్టిచేసికొంటూ వెళ్లాడని చెప్పడం దేనికి?

## 3. విశ్రాంతి దినము

దేవుడు ఆరురోజులు పనిచేసి ఏడవ రోజు విశ్రాంతి తీసికొన్నాడు -2,7. యాజకులకు ఈ విశ్రాంతి దినమంటే మాలావు గౌరవం. దేవుడే ఆరురోజులు పనిచేసి ఏడవ రోజు విశ్రాంతి తీసికొంటే, నరుడు కూడ ఏడవరోజు విశ్రాంతి తీసికోవాలని చెప్పడం కోసం యాజకులు పైయారురోజుల సృష్టిని వర్ణించారు. నిర్గమ కాండం "ప్రభువు ఆరురోజులు కృషిచేసి భూమ్యాకాశాలనూ సముద్రాన్నీ వాటిలో వుండే ప్రాణికోటినీ సృజించాడు. ఏడవరోజు విశ్రాంతి తీసికొన్నాడు. అతడు విశ్రాంతి దినాన్ని ఆశీర్వదించి పవిత్రపరచాడు" అని చెప్తుంది -20,11. ఈలాంటి పవిత్ర దినాన్ని నరులు కూడ పవిత్రంగా భావించాలి అని యాజకుల ఉద్దేశం. ఈ విశ్రాంతి దినం ప్రాముఖ్యాన్ని నొక్కి వక్కాణించడం కొసమే యాజకులు ఆరురోజుల సృష్టిని ఊహించారు. అసలు ప్రభువు ఓక్షణంలోనే, ఓ చిన్న తలంపుతోనే సృష్టినంతటినీ చేసాడు. ఇక, యూదులు శనివారాన్ని విశ్రాంతి దినంగా పాటించేవాళ్లు. మనకు ఆదివారం విశ్రాంతి దినం. కనుక వాళ్లు ఆ శనివారాన్ని లాగే మనం ఆదివారాన్ని పవిత్ర దినంగా భావించాలి. అది ప్రభువు ఉత్థానమైన రోజు.

## 4. వ్యత్యాసాలు

ఆదికాండములోని తొలి మూడధ్యాయాలూ యాజక యావే సంప్రదాయాలనే రెండు భిన్న సంప్రదాయాలకు చెందిన రచనలని చెప్పాం. ఈ రెండు సంప్రదాయాలూ సృష్టిని గురించే చెప్పినా వాటి దృక్పథంలో మాత్రం చాలా భేదం వుంది. 1. యాజక సంప్రదాయం ప్రపంచపు సృష్టితో ప్రారంభమౌతుంది. దేవుడు ప్రపంచాన్ని ఏలా కలిగించాడు అన్నది ఇక్కడ ముఖ్యం. యావే సంప్రదాయం నరుని సృష్టితో ప్రారంభ మౌతుంది. దేవుడు చేసిన నరుడు ఏలాంటివాడు అన్నది ఇక్కడ ముఖ్యం. 2. యాజక సంప్రదాయంలో విశ్రాంతి దినం ప్రధానమైతే యావే సంప్రదాయంలో నరుడు ఆడుది మగవాడుగా కలిగింపబడ్డాడు అన్నది ముఖ్యం. 3. అక్కడ దేవుడు తన వాక్కుతో

నరుణ్ణి కలిగిస్తాడు. ఆరవరోజున కాని నరుని సృష్టి జరగలేదు. ఇక్కడ దేవుడు ప్రాణవాయువు నూది నరుణ్ణి చేస్తాడు. మొదటి రోజుననే అతన్ని సృజిస్తాడు. అక్కడ దేవుడు నరునికి కొంచెందూరంగా వున్నట్లు అతన్ని గూర్చి అట్టే పట్టించుకోనట్లు కనిపిస్తాడు. యావే సంప్రదాయంలో కుమ్మరి మట్టితో నరుణ్ణి చేసాడు అనే భావం స్ఫురిస్తుంది. 4. అక్కడ నరుడంటే దేవుని పోలికా ఆకారమూను. ఇక్కడ నరుడడంటే మట్టీ వాయువును. 5. అక్కడ నరుని బాధ్యత, సంతానాన్ని కని వృద్ధిలోనికి రావడమని చెప్పబడింది. అతడు భూమి మీద దేవుని ప్రతినిధిగా వుంటాడు, దేవుని తరపున సృష్టివస్తువులన్నిటినీ పరిపాలిస్తుంటాడు. ఇక్కడ నరుని బాధ్యత, దేవుని ఆజ్ఞలను పాటించడమని చెప్పబడింది. అతడు దేవుడు తినవద్దన్న పండును తినరాదు. పైగా నరుడు దేవుడు నాటిన తోటను సాగుచేస్తుండాలి. 6. యాజక సంప్రదాయం మాత్రమే దేవుడు ఆది దంపతులను దీవించాడనీ వాళ్లు బిడ్డలను కని వృద్ధిలోనికి రావాలని కోరుకొన్నాడనీ చెప్తుంది. యావే సంప్రదాయం మాత్రమే నరుడు జంతువుల కన్నీటికీ పేళ్లు పెట్టాడనీ స్త్రీనిచూచి సంతోషించాడనీ చెప్తుంది. ఆలాగే యావే సంప్రదాయం మాత్రమే ఏదేనుతోటలో ప్రాణమిచ్చే చెట్టూ మంచిచెడ్డలను తెలియజేసేచెట్టూ వున్నాయనీ, పరుడు ఆరెండవ చెట్టుపండ్లు ముట్టుకోగూడదని దేవుడు ఆజ్ఞయిచ్చాడనీ చెప్తుంది. ఇవి ఈరెండు సంప్రదాయాల్లో కనిపించే కొన్ని వ్యత్యాసాలు. ఈ వ్యత్యాసాలన్నిటినీ గమనిస్తేనే గాని ఆదికాండం వర్ణించే విశ్వసృష్టి చక్కగా బోధపడదు.

## 5. సృష్టి అంటే యేమిటి?

ఇక ఈ వ్యత్యాసాలు ఏలా వున్నా, భగవంతుడు సృష్టిచేసాడు అనేసంగతిమాత్రం చాలగొప్పది. మనం సృష్టి చేయలేం. మనం చేసేదల్లా ఓ వస్తువును మరోవస్తువుగా మార్చడమే. కుమ్మరి మట్టితో కుండను చేస్తే అది సృష్టికాదు, వస్తువు మార్పు ఔతుంది. కాని భగవంతుడు ఓ వస్తువునుండి మరోవస్తువునుగాదు, శూన్యం నుండి వస్తువులను కలిగించాడు. అదే సృష్టి. ఇది మనకు మించిన పని. కనుకనే సృష్టి మనకు ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆ ప్రభువు కూడ తానుచేసిన సృష్టిని చూచి ఎంతో సంతోషించాడు. ఆయన కంటికి అది బాగా వుంది -1,31. మొదటి అధ్యాయంలోనే ఈ "బాగా వుంది" అనే వాక్యం ఐదుసార్లు విన్పిస్తుంది. కనుక దేవుడు చేసిన ఈ ప్రపంచం చాలగొప్పది, చాలమంచిదికూడ. ఈ లోకంలో జన్మించడం, ఈ లోకాన్ని చేసిన దేవుణ్ణి స్మరించుకోగల్గడం, మన భాగ్యవిశేషం అనాలి.

# 2. నరుడు

## 1. బహువచన ప్రయోగం

మొదట యాజక సంప్రదాయం వాళ్ల భావాలతో ప్రారంభిద్దాం. దేవుడు "మనకు పోఎలికగా, మన ఆకారంలో నరజాతిని సృజిద్దాం" అనుకొన్నాడు -1,26. ఇక్కడ దేవునికి "మన" అని బహువచనం వాడడం దేనికి? దేవుళ్లో ముగ్గురు వ్యక్తులు ఉండబట్టా? పూర్వవేద ప్రజలకు సుతుని గూర్చీ పరిశుద్ధాత్మను గూర్చీ తెలియనే తెలియదు. వాళ్లకు తెలిసిందల్లా పిత అనబడే ఒక్క దైవవ్యక్తిని గూర్చి మాత్రమే. కనుక ఈ వాక్యంలోని బహువచనం ముగ్గురు దైవ వ్యక్తులనుగాదు, దేవుణ్ణీ దేవదూతలనూ సూచిస్తుంది. ఇక్కడ దేవుడు తన దూతలతో మంత్రాలోచనం చేసినట్టుగా భావించుకోవాలి.

## 2. పోలిక, ఆకారం

దేవుడు నరుణ్ణి తనకు పోలికగాను, తన ఆకారంలోను సృజించాడు -1,26. ఇక్కడ పోలిక అన్నా ఆకారమన్నా ఒక్కటే. నరుడు దేవునికి పోలికగా వుంటాడు, దేవునిలాగా వుంటాడు. నేలమీది ప్రాణులన్నిటికంటె అధికంగా నరుడు దేవుని పోలివుంటాడు. అతనిలో వున్నంత దేవునిలో పోలిక మరే ప్రాణిలోను వుండదు. కనుక అతన్ని చూస్తే దేవుణ్ణి చూచినట్లే. కానిన రుడు దేనిలో దేవుణ్ణి పోలివుంటాడు?

నరుడు దేహంలోను, ఆత్మలోను కూడ దేవుణ్ణి పోలివుంటాడు. మృగాలన్నిటికీ తల భూమివైపునకు వంగివుంటుంది. అవి నేలవైపు చూస్తుంటాయి. కాని నరునితల నిలువుగా నిలబడి వుంటుంది. అతడు పైకి చూస్తుంటాడు. ఈ నేలమీది ప్రాణులన్నిటిలోను అతడు మాత్రమే దేవునివైపు చూడగలడు, దేవుణ్ణి తలంచుకోగలడు.

నరునిలో బుద్ధిశక్తీ, చిత్తశక్తీ వున్నాయి. అనగా అతనిలో తెలివితేటలున్నాయి, అతడు ప్రేమించగలడు. పైగా అతడు సృష్టి ప్రాణులపై అధికారం నెరపగలడు. అతనిలో స్వాతంత్ర్యం కూడ వున్నది. ఈలా బుద్ధిశక్తీ, చిత్తశక్తీ, అధికార శక్తీ, స్వాతంత్ర్య శక్తీ అనే గుణాలన్నిటిలోను అతడు దేవుణ్ణి పోలివుంటాడు. 8వకీర్తన 5-8 వచనాలు ఈసత్యాన్నే ఉగ్గడిస్తాయి. ఐతే అన్నిటికంటే మిన్నగా నరుడు అధికారం నెరవడంలో దేవుణ్ణి పోలివుంటాడు. దేవునికి ప్రతినిధిగా వుండి అతడు భూమిమీద ప్రాణులన్నిటినీ పరిపాలిస్తుంటాడు.

దేవుడు ఆదముని తనకు పోలికగా చేసాడు అన్నాం. దేవుని కుమారుడైన క్రీస్తు కూడ ఆదేవునికి పోలికగా వుంటాడు -కొలో 1,15. కనుక ఇక్కడ ఆదాము దేవునికి

పోలికగా ఉన్నాడు అంటే అతడు కూడ దేవుని కుమారుడేనని భావం. "దేవునిపోలిక" అన్న మాటల్లో ఈ భావాలన్నీ ఇమిడివున్నాయి.

### 3. స్త్రీ పురుషులనుగా సృజించాడు

"దేవుడు నరుణ్ణి సృజించాడు, అతన్ని స్త్రీ పురుషులనుగా సృజించాడు" అంటాడు రచయిత -1,27. దేవుడు నరుణ్ణి ఆడదాన్ని గాను, మగవాణ్ణిగాను చేసాడు. అంటే లింగాన్ని భగవంతుడే ఉద్దేశించాడు, నిర్ణయించాడు. స్త్రీ పురుషులను భగవంతుడిచ్చిన ఓ గొప్పవరం లింగం. వీళ్ళు భగవంతుడు ఉద్దేశించినట్లుగా లైంగిక జీవితాన్ని గడపాలి.

దేవుడు నరుణ్ణి స్త్రీ పురుషులనుగా జేసి తానుచేసిన పనిని జూచి చాలబాగుంది అనుకొన్నాడు -1,31. కనుక లైంగిక జీవితం దానంతట అది యోగ్యమైంది, పవిత్రమైందికూడ. నరుల్లో కొందరు లింగాన్ని లైంగిక క్రియను దివ్యంగా ఎంచి ఆరాధిస్తారు. ఆడు మగ కలిసికోవడమే పరమావధి అనుకొంటారు. మరికొంతమంది లైంగిక క్రియను పశుతుల్యంగా భావించి నిరసిస్తారు. కాని ఇవిరెండూ తప్పుడు భావాలే. లింగాన్ని గూర్చి బైబులు బోధించేబోధ ఈ రెండుమార్గాలకు మధ్యస్థంగా వుంటుంది. లింగాన్ని భగవంతుడే ఇచ్చాడుకనుక నరుడు దాన్ని వాడుకోవాలి. దానంతటఅది దివ్యమైందీ కాదు, నీచమైందీకాదు. కనుక దాన్ని పూజింపనూగూడదు, నిరసింపనూగూడదు

### 4. సంతానాభివృద్ధి

భగవంతుడు ఆదిదంపతులను దీవించి "మీరు సంతానాన్ని కని వృద్ధిచెందండి" అన్నాడు -1,28. దేవునివాక్కు ఏంచెప్తుందో అది నెరవేరి తీరుతుంది. కనుక స్త్రీ పురుషులు కలుసుకొన్నప్పుడు సంతానం కలుగుతుంది. భగవంతుడు తొలి మానవులను శూన్యం నుండి సృజించాడు. కాని మాటిమాటికి ఈలా సృజించడు. ఓమారు దేవుడు తొలి మానవులను సృజించాక, మాలి మానవులను మానవులే సృజించుకొంటూ బోతారు. కనుక బిడ్డలను కన్నపుడు నరులు దేవుని సృష్టితో సహకరిస్తుంటారు. అందుచేత తల్లిదండ్రులు బిడ్డల పుట్టువును ఓ పవిత్రకార్యంగా భావించాలి.

చావువల్ల భూమిమీది నరులంతా నశిస్తారు. ఇక లోకంలో మనుష్యజాతి మిగలదు. కనుక నరుడు వివాహజీవితం ద్వారా క్రొత్త మానవులను సృజిస్తుండాలి. ఈ విధంగా చావు కలిగించే నష్టాన్ని పుట్టువు పూరిస్తుంటుంది. కాని భగవంతునికి చావు లేదు. అందుకే బైబులు భగవంతునికి లింగంలేదు. అతడు భార్యను స్వీకరించడు, బిడ్డలను కనడు. ఆ మహాత్ముడు ఆడు మగ బేధాలకు గురిగాని ఆత్మస్వరూపుడు. ఉత్థాన జీవితంలో కూడ చావులేదు. అందుకే మోక్షంలో పెండ్లిచేసికోవడమూ, బిడ్డలను కనడమూ అనే బెడద లేదు -మార్కు 12,25.

## 5. భూమిని వశం చేసికోవడం

దేవుడు ఆది దంపతులతో 'మీరు భూమిని వశం చేసికొనండి" అన్నాడు – 1,28. నరుడు నేలనుదున్నిసాగుచేస్తుంటాడు. ఈ కృషివల్ల భూమి అతనికి వశమౌతుంది, పంటలు పండిస్తుంది, అతన్ని పోషిస్తుంది. కనుక కృషి ఎంతో విలువైంది. పని నీచమైంది కాదుగదా గౌరవ ప్రదమైంది. నరుడు కష్టపడి పనిచేయాలి. ఇక, కష్టపడే నరులంతా భూమి పండించే పంటలను అనుభవించాలి. కొందరు మాత్రమే మేము భూస్వాముల మన్న నెపంతో ఆపంటంతా దోచుకొని అధిక ధనవంతులు కాగూడదు. మరికొందరు ఆ భూమి మీద కృషిచేసికూడ, కూలివాళ్లు కనుక, దానిపంట ననుభవింపలేక నానాటికీ నిరుపేదలై పోగూడదు. ఇది సాంఘిక అన్యాయం. భగవంతుడు భూమిని అందరి కొరకు కలిగతించాడు. మనం మాత్రం అన్యాయంగా భూమిని మన అదుపులోనికి తెచ్చుకొంటూంటాం. ఇతరులకు దాన్ని దక్కనీయకుండా చేస్తుంటాం.

## 6. నేల మట్టినుండి

దేవుడు నేలమట్టినుండి నరుణ్ణి చేసాడు –2,7. భగవంతుడు నరుణ్ణి చేసాడని మనకు తెలుసు. కాని ఏలా చేసాడో మనకు తెలీదు. ఇక మనుష్యులకు మనుష్యభాషలో చెప్తేనే గాని అర్థంకాదు. కనుక ఇక్కడ రచయిత మనుష్యుడు చేసే ఓ పనిని పోలికగా తీసికొని భగవంతుడు నరుణ్ణి ఈలా సృజించాడు అని ఉపమానపూర్వకంగా చెప్తున్నాడు. కుమ్మరి మట్టితో కుండను చేస్తాడు. కుండ తన పుట్టుకకు పూర్తిగా కుమ్మరి మీదనే ఆధారపడి వుంటుంది. ఈలాగే మానవుడు కూడ తన పుట్టుకకు పూర్తిగా భగవంతుని మీదనే ఆధారపడ్డాడు. ఐగుప్తీయులు, సుమేరియనులు, బాబిలోనీయులు భగవంతుడు నరుణ్ణి సృజించడాన్ని కుమ్మరి పనితో పోల్చారు. యిర్మీయా ప్రవక్తకూడ ఈ యుపమానాన్ని వాడాడు –18,6. ఆదికాండం వ్రాసిన రచయిత కూడ ఈ యుపమానాన్నే ఎన్నుకొన్నాడు.

కనుక ఇక్కడ భగవంతుడు నేల మట్టినుండి నరుణ్ణి చేసాడు అంటే నరుడు పూర్తిగా భగవంతుని మీదనే ఆధారపడి వుండేవాడని భావం. దేవుడు ఎంతో ప్రేమా కనికరమూ కలవాడు కనుక మట్టినుండి నరుణ్ణి చేసాడు. దేవుడు చేయకుముందు అతడు లేడు. అన్ని ప్రాణుల్లాగే అతడు నిత్యం ఆ ప్రభువు మీదనే ఆధారపడాలి. తాను సృజించిన నరుడు బలహీనపు ప్రాణి కనుక ప్రభువు అతన్ని ఎంతో ఆదరంతో చూస్తుంటాడు. కంటిపాపను లాగ కాపాడుతుంటాడు. కాని మట్టిమానిసియైన నరుడు దుష్టుడు, పొగరుబోతు. అతడు భగవంతుని సృష్టికార్యాన్ని ఒక్కనిమిషంలో భగ్నంచేసి

శాపంపొంది తానుమళ్లా మట్టిఐపోతాడు. ఏ మట్టినుండి పుట్టాడో ఆ మట్టిలోనే కలసిపోతాడు. ఇది నరుని దౌర్భాగ్యం.

## 7. ప్రాణవాయువు

దేవుడు నరుని ముక్కు గోళ్లలోనికి ప్రాణవాయువు నూదగా అతడు జీవం పొందాడు –2,7. అన్ని ప్రాణులూ వాయువు వల్లనే బ్రతుకుంటాయి. నరుడు దేవుడు కనుకపై "నేలమట్టి" లాగా ఈ "ప్రాణవాయువు" అన్న ప్రయోగం గూడ నరుడు దేవుని మీదనే పూర్తిగా ఆధారపడి ఉండేవాడని సూచిస్తుంది. రచయిత జంతువుల సృష్టిని గూర్చి చెప్పినపుడు ఒట్టినే దేవుడు వాటిని సృజించాడని చెప్పాడు –2,19. కాని నరుని సృష్టిని గూర్చి చెప్పేప్పుడు మాత్రం దేవుడు ఎంతో కృషి చేసినట్లుగా చెప్పుకవెళ్లాడు –2,7. జంతువుల్లో పెద్ద ఆధిక్యమేమీ లేదు. అవన్నీ నరుని కోసమే. కాని అతడు చాలవిశిష్టుడు. కనుకనే అతడు వాఇకి పేర్లు పెడతాడు –2,20. ఇక్కడ జంతువులకు పేర్లు పెట్టడమంటే వాటిమీద అధికారం నెరపడం. కాని ఈ జంతువుల్లో నరునికి తోడుగా వుండదగినప్రాణి ఏదీ లేకపోయింది. అవి అతని లాంటివికావు. కనుకనే ప్రభువు ఆదాములాంటి వ్యక్తిని మరొకర్తను చేయవలసి వచ్చింది.

# 3. నారి

## 1. నిద్ర

ప్రభువు ఆదాముకి గాఢనిద్ర కలిగించి అతని ప్రక్కటెముకను తీసి స్త్రీని చేసాడు –2,21. కాని ఇక్కడ దేవుడు ఆదముకి గాఢనిద్ర పుట్టించడం దేనికి? అతనికి బాధ కలుగకుండావుండేలా మైకం కలిగించడానికా? కాదు. భగవంతుణ్ణిగాని, అతని సృష్టి రహస్యాలుగాని నరుడు చూడలేడు. ఇక్కడ ప్రభువు ఏవనుచేయబోతున్నాడు. ఆసృష్టి కార్యాన్ని ఆదాము చూడకూడదు. చూడలేడుకూడ. అందుకే ప్రభువు అతన్ని నిద్రబుచ్చాడు. "భగవంతుణ్ణి చూచి ఏ నరుడూ బ్రతకలేడు" అంటుంది నిర్గమకాండం 33,20.

## 2. ప్రక్కటెముక

దేవుడు ఆదాము ప్రక్కటెముక నుండి స్త్రీని చేసాడు. ఇక్కడ ప్రక్కటెముక అంటే యేమిటి? యావే స్త్రీని పురుషుని ప్రక్కటెముక నుండి చేసాడు అంటే ఆమెకూడ ఆ పురుషునిలాంటిదేనని భావం. మగవాడూ ఆడదీ ఒకే స్వభావం కలవాళ్లు. రెండు రూపాల్లో వున్నా వాళ్లిద్దరూ నరులే. కనుక వాళ్లిద్దరూ యజమానుడూ బానిసా కారు. వాళ్ల తండ్రీ సృష్టికర్తా ఐన దేవునిముందు ఆ యిద్దరూ సమానమైన హోదా కలవాళ్లు. స్నేహితుల్లాగ

మెలిగేవాళ్లు. కనుక వాళ్లిద్దరిలో హెచ్చుతగ్గులు లేవు. ఇద్దరూ సరిసమానులే. వైవాహిక ప్రేమద్వారా వాళ్లిద్దరూ ఒకరినొకరు బలంగా ఆకర్షించుకొంటారు. ఒకరినొకరు పరిపూర్ణులను జేసికొంటారు. ఈ ప్రక్కటెముక ఉదంతంలో భగవంతుడు ఓ శస్త్రచికిత్సాకారుడుగా పనిచేసాడు అన్నభావం స్ఫురిస్తుంది.

## 3. ఎముకల్లో యెముక

ప్రభువు ఏవను చేసి ఆదామునొద్దకు తోడ్కొనిరాగా అతడు ఆ స్త్రీని చూచి "ఈమె నాయెముకల్లో ఎముక, నాదేహంలో దేహం" అనుకొన్నాడు -2,23. ఇక్కడ ఎముకల్లో ఎముక, దేహంలో దేహం అంటే దగ్గరిచుట్టం అని అర్థం. అనగా ఏవ ఆదామువంటిది. అతనికి ఆప్తురాలు, ప్రియురాలు. హీబ్రూ భాషలో పురుషునికి "ఈష్" అని స్త్రీకి "ఈషా" అని పేర్లు. ఈష్ నుండి పుట్టింది కనుక ఆమె ఈషా అయింది అన్నాడు మూలంలో హీబ్రూ రచయిత. దీన్నే మనభాషలో చెప్పాలి అంటే ఏవ "నరుని" నుండి పుట్టింది గనుక "నారి" అయింది.

ఆదాము ఏవకు నారి అని పేరుపెట్టాడు. హీబ్రూ సంప్రదాయం ప్రకారం పేరు పెట్టడమంటే అధికారం నెరపడం. కనుక నరుడు స్త్రీ మీద పెత్తనం చేస్తుంటాడు. ఆమె అతని అధికారంలో వుంటుంది. ఐనా స్త్రీ పురుషునికంటే తక్కువది కాదు. ఆమె అతన్నీ అతడు ఆమెనూ పరస్పరం పరిపూర్ణం చేసికొంటూంటారు.

దేవుడు ఏవను చేయకముందు "నరుడు ఒంటరిగావుండడం మంచిదికాదు. అతనికి తోడునీడగా వుండడానికి ఓ స్త్రీని సృజిద్దాం" అనుకొన్నాడు -2,18. కనుక యావే స్త్రీని చేయడంలో ఉద్దేశం ఆమె నరునికి అండదండగా వుండాలనే. అనగా భార్య భర్తకు స్నేహితురాలుగాని బానిసకాదు. పూర్వం సోక్రటీసు తాను స్త్రీయై పుట్టనందుకు దేవతలకు వందనాలర్పించాడు. ప్లేటో పాపం చేసిన నరులు మొదట స్త్రీలుగాని ఆ పిమ్మట జంతువులుగాను పునర్జన్మ మెత్తుతారు అన్నాడు. ఈలాగే చాలమంది జ్ఞానులు స్త్రీలను హేయంగా చూచారు. ఇంకా కొంతమంది స్త్రీలను స్వార్థానికి వాడుకొన్నారు. స్త్రీని ఓ భోగ్యవస్తువునుగా పరిగణించి ఆమెతో లైంగిక సుఖాలు అనుభవించడమే పరమధ్యేయం అనుకొన్నారు. లింగాన్ని ఓ దేవతగా భావించి కొలిచారు, బైబులు ఈ విపరీత ధోరణులకు సమ్మతింపదు. స్త్రీ పురుషులు సమానమేననీ, వారిరువరూ పరస్పర సహాయకులనీ బోధిస్తుంది. వాళ్లిద్దరూ దేవుని బిడ్డలేననీ చెప్తుంది. నేడు మనం కూడ స్త్రీ పురుష వైవిధ్యాన్ని చూచి విస్తుపోతాం. ఆడు మగ విభేదం ఎంత విచిత్రమైందా అని ఆశ్చర్యపోతాం. స్త్రీపురుషులంగా జీవించే మనకు ఈలా ఆశ్చర్యపడ్డం చాలా అవసరం కూడ.

### 4. ఆలికి హత్తుకొని పోవడం

భార్యభర్తలిరువురూ కలసి ఒక్కవ్యక్తిగా ఐక్యమైపోతారు. నరుడు తల్లిదండ్రులతో కంటే గూడ భార్యతో అధికంగా ఐక్యమైపోతాడు. కనుకనే అవసరం వచ్చినపుడు జననీ జనకులను కూడ వదలి ఆలికి అతుకుకొంటాడు. వాళ్లిద్దరూ ఇద్దరై గూడ ఏక వ్యక్తుల్లాగా జీవిస్తారు. అందుచేత ఇకవాళ్లకు విడాకుల్లేవు -మార్కు 10,9. ఒకరు చనిపోతేనే గాని ఇంకొకరు మళ్లా వివాహబంధంలో ప్రవేశించడానికి వీల్లేదు.

స్త్రీ పురుషునికి ముందు నడవదు, వెనుకా నడవదు. అతని ప్రక్కన నడుస్తుంది. అతనికి సరిసమానంగా జీవిస్తుంది. అతడున్నకాడల్లా ఆమెకూడ వుంటుంది. అందుకే తొలి ఆదాము ఒక స్త్రీతో ఐ్యమయ్యాడు. ఆలాగే మలి ఆదాము క్రీస్తు కూడ మరో స్త్రీ తో ఐక్యమయ్యాడు. ఆ స్త్రీ భార్య, ఈ స్త్రీ తల్లి, అంతే భేదం.

తొలి ఆదాము నిద్రిస్తూండగా అతని ప్రక్కలో నుండి స్త్రీ బయల్వెడలింది. ఆలాగే మలి ఆదాము నిద్రిస్తూండగా అతని ప్రక్కలోనుండి మరొక స్త్రీ బయల్వెడలింది. ఈరెండవ స్త్రీయే శ్రీసభ, క్రైస్తవ సమాజం. అనగా మృతక్రీస్తు దేహంనుండి బయల్వెడ లిన నెత్తురూ నీళ్లూ విశ్వాసులను కడిగి శుద్ధిచేస్తాయి. వాళ్లే క్రైస్తవ సమాజం. అందుకే ప్రాచీన క్రైస్తవ రచయితలైన పితృపాదులు ఏవ పుట్టుక శ్రీసభ పుట్టుకకు పోలికగా వుంటుందని చెప్పారు. చూడు ఎఫె -5,31-32. ఆదాము దైవపుత్రుడై రాబోయే క్రీస్తుని సూచిస్తుంటాడు. ఏవ రాబోయే శ్రీసభను సూచిస్తుంది. సృష్టి మనుష్యావతారాన్ని సూచిస్తుంది. ఒక విధంగా చెప్పాలంటే, రాబోయే క్రైస్తవ సత్యాలన్నీ ఆదిదంపతుల చరిత్రలో బీజరూపంగా ఇమిడే వున్నాయి.

ఆదాము ఏవ దినములతో ఉన్నాగానీ వారికి సిగ్గువేయలేదు -2,25. అనగా ఆదిదంపతుల్లో ఇంకా కామవికారం పుట్టలేదని భావం. వ ఆరిలో ఇంకా ఆశాపాశాలూ వ్యామోహాలూ లేవు. శాంతిసమాధానాలు నెలకొని వుండేవి. దేహం బుద్ధిశక్తికి లొంగివుంది.

## 4. ఏదెను తోట

### 1. ఏదెను తోట

ప్రభువు ఏదెనులో తూర్పువైపున ఒక తోటను నాటి ఆదాముని ఆ తోటలో వుంచాడు-2,8. దేవుడు మంచివాడు, కరుణ గలవాడు. అతడు పిడికెడు మట్టినుండి నరుణ్ణి చేయడం మాత్రమే గాదు, ఆనరునికి చక్కగా వాతావరణం కూడ కలిగించాడు. ఆవాతావరణమే ఈతోట. పాలస్తీనా దేశం ఉష్ణదేశం. కనుక యూదప్రజలకుచెట్టుచేమలన్నా

నీళ్లన్నా పరమప్రీతి. అందుకే ఈ రచయిత దేవుడు పచ్చని చెట్లతోను నాల్గు నదులుతోను కూడిన తోటను సిద్ధంచేసి ఆదాముని ఆ తోటలో వుంచాడని చెప్పుకొంటూపోయాడు. అనగా ఆదాముకు అన్ని సౌఖ్యాలూ అమరాయని అర్థం.

ఈతోట ఏదెనులో ఉంది. "ఏదెను" అనే హీబ్రూమాటకు మైదానమని అర్థం. ఆనందకరమైన మైదానంలో దేవుడు ఆ తోటను నాటాడు. అదికూడ తూర్పువైపుగా వుంది. అనగా రచయిత వసించే పాలస్తీనా దేశానికి తూర్పువైపుగా వుంది. తూర్పు సూర్యుడు ఉదయించే దిశ. దేవతలు మెలిగే దిశ. కనుక ఆ తోట అన్నివైభవాలతో నిండివుందని భావం.

ఆదాము వసించిన ఈ తోట సకల సౌఖ్యాలతో నిండివుండడం వల్ల మోక్షానికి చిహ్నంగా వుంటుంది. బైబులు చెప్పే ఈ తోట ఎక్కడుందో వెదకలాని చాలమంది ప్రయత్నంచేస్తారు. కాని ఈ తోట భౌగోళికమైంది కాదు, సాంకేతికమైంది. తొలి మానవునికి అన్ని సౌక్యాలూ అమరాయని చెప్పడమే ఈ టో ఉద్దేశం. కనుక ఏదెను తోట ఓ స్థలం అనుకోవడం కంటె, ఓ దశ అనుకోవడం మేలు. తొలినరుడు సౌభాగ్య దశలో వుండేవాడని దాని భావం. అతడు దేవునికి స్నేహితుడుగా వుండేవాడు. దేవుడు అతన్ని ఆదరించి పోషిస్తుండేవాడు. అందుచేత ప్రభువు నరుణ్ణి ఏదెను తోటలో వుంచాడు అంటే అతన్ని ఉన్నతస్థాయికి కొనివచ్చాడని భావం.

## 2. ప్రాణమిచ్చే చెట్టు

దేవుడు నాటిన తోటలో రకరకాలైన మంచి చెట్లున్నాయి. ప్రాణమిచ్చే చెట్టు కూడ వుంది -2,9. ప్రాచీన జాతులన్నీ జీవవృక్ష మొకటుందనీ, దానిపండ్లు తిన్న నరులు మరణాన్ని జయిస్తారనీ భావించారు. దేవతలు ఆ చెట్టుకు కావలి కాస్తుంటారని చెప్పుకొన్నారు. ఆదికాండం వ్రాసిన రచయిత కూడ ఈ వూహనే ఎన్నుకొన్నాడు. ఇక్కడ ప్రాణమిచ్చే చెట్టు అని చెప్పడంలో రచయిత ఉద్దేశం ఇది: ఆదిదంపతులకు చావులేదు. వాళ్లు స్వతస్సిద్ధంగా అమరులు. దేవునితో స్నేహంగా జీవిస్తుండేవాళ్లు.

యిస్రాయేలు ప్రజల బైబులు గ్రంథంకంటె ముందుగానే మెసపొటేమియాలో "ఎమినా ఎలీష్" అనే గ్రంథం వెలువడింది. దాన్ని క్రీస్తుకు రరెండువేల యేండ్ల పూర్వమే వ్రాసారు. కనుక ఇది బైబులు కంటె కనీసం ఏడు వందల యేండ్లకు ముందే వెలువడింది. ఈ గ్రంథం ''దేవతలు నరులను చేసినపుడు చావును నరులకిచ్చి వేసారు. చావులేనితనాన్నేమో వాళ్లే ఉంచేసుకున్నారు" అని చెప్తుంది. కాని బైబులు భగవంతుడేమో ఓ నరుణ్ణి చేసినప్పుడు అతనికి అమృతత్వం ప్రసాదించాడు. అన్యజాతులు ఊహించిన దేవుళ్లకంటె యిస్రాయేలు ప్రజలు కొలిచిన దేవుడు ఎంత ఉదాత్తమైనవాడు!

### 3. మంచిసెబ్బరలను తెలియజేసే చెట్టు

ఏదెను తోటలో మంచిసెబ్బరలను తెలిసికొనే శక్తినిచ్చే చెట్టుకూడ వుంది – 2,9. దాని పండ్లు తింటే నరులకు వెంటనే మంచిసెబ్బరలను తెలిసొకనే తెలివి కలుగుతుంది. మంచిసెబ్బరలను తెలిసికొనే శక్తినిచ్చే చెట్టు అనడం కూడ ఓ సంకేతం. ఇక్కడ మంచిసెబ్బరలు అంటే పూర్తిజ్ఞానం అని భావం. జ్ఞానమంటే పుస్తకజ్ఞానం కాదు. జీవితంలో మనకు ఏది అవసరమో తెలిసకొనే క్రియాజ్ఞానం. అనగతా మన మంచినీ, మన అవసరాలనూ నిర్ణయించుకొనే జ్ఞానం. కాని మన మంచినీ మన అవసరాలనూ మనమే నిర్ణయించుకొంటున్నా మంటే, మనం స్వతంత్రంగా ప్రవర్తిస్తున్నామని భావం.కనుక ఈ జ్ఞానవృక్షం పండ్లు తింటే నరుడు స్వతంత్రంగా ప్రవర్తించడమౌతుంది. దేవుని మీద ఆధారపడకుండా వుండడమౌతుంది.

ప్రభువు ఆదాముతో "మీరు తోటలో వున్న పండ్లన్నీ తినవచ్చుగాని మంచి సెబ్బరలను తెలియజేసే చెట్టు పండ్లను మాత్రం తినకూడదు" అన్నాడు –2,16–17. అంటే ఆదిదంపతులు ఏమైనా చేయవచ్చుగాని, స్వతంత్రంగా ప్రవర్తించడం మాత్రం కూడదని భావం. వాళ్లు దేవుని మీద ఆధారపడి జీవిస్తుండాలని అర్థం.

భగవంతుడు సర్వతంత్ర స్వతంత్రుడు. అతనిమీద మరోశక్తి పనిచేయదు. కాని నరుడు ఆలాకాదు. అతడు పరతంత్రుడు. దేవునిమీద ఆధారపడి జీవింప వలసినవాడు. ఐనా ఆదాము స్వతంత్రుళ్లాగ ప్రవర్తింపబోయాడు. అది అతని గర్వం.

## 5. శోధనలూ, పతనమూ

### 1.జిత్తులమారి పాము

ఏవను శోధించడానికి వచ్చిన పిశాచం పామురూపంలో వుంది –3,1. పిశాచం పాము రూపంలో వచ్చింది అనడం దేనికి? పాముకంటె నక్క ఇంకా జిత్తులమారిది కదా? ఇక్కడ గ్రంథకర్త పామును ఎన్నుకోవడంలో ఉద్దేశం యిది. పామంటే నరచులందరికీ అసహ్యమూ భయమూను. పైగా ఆ కాలంలో యిస్రాయేలీయులకు సోదరజాతులైన కనానీయులు ఫిలిస్టీయులు మొదలైన వాళ్లంతా పామును ఆరాధించే వాళ్లు. ఇంకా, లింగానికి కూడ పాము చిహ్నంగావుండేది. ఆ కాలపు ప్రజలు కొందరు సర్పపూజా నెపంతో లైంగికంగా అత్యాచారాలు చేసేవాళ్లు. ఈ కారణాలచేత యిస్రాయేలు ప్రజలకు పాము అసహ్యకరమై పోయింది. కనుక గ్రంథకర్త పామును ప్రదర్శించడంలో పిశాచం ఎంతో అసహ్యకరమైన ప్రాణి అని చెప్పాడు.

## 2. పాము స్త్రీని ప్రశ్నించింది.

పాము స్త్రీని చూచి "మీరు తోటలో వున్న ఏ చెట్లు పండ్లూ తినగూడదట నిజమేనా?" అని ప్రశించింది -3,1. ఏవ పిశాచాన్ని చూడగానే దాన్ని తరిమి వేయవలసింది. పిశాచంతో ఎవరూ సంభాషణకు దిగకూడదు. కాని ఈ తెలివి ఏవకు లేదు. పైగా పిశాచం వట్టి అబద్దాల కోరు. కనుకనే "జ్ఞానవృక్షం పండ్లు తిన్నా మీరు చావనే చావరు" అని చెప్పింది. ఏవ ఆ మాటలు గట్టిగా నమ్ముకొంది. ఆమె మందబుద్ధినిచూచి పిశాచం మరింత రెచ్చిపోయి "దేవుడు వట్టి అసూయాపూరుడూ, స్వార్థపరుడూను. నరులుకూడ తనంతటి వాళ్లు ఔతారేమోనన్న భయంతో జ్ఞానవృక్షఫలం తినవద్దని శాసించాడు సుమా" అని చెప్పింది. ఆ మాటలు వినేటప్పటికి ఏవకు ఆశపుట్టింది. తానూ మంచిచెడ్డలు తెలిసికొని దేవుడంతటిది కావచ్చుగదా అనుకొంది. ఇకనేం. పండునుకోసి తింది. ఆదాము చేతగూడ తినిపించింది.

ఈవిధంగా ఆదిదంపతులిద్దరూ పిశాచం వలన పతనమైపోయారు. పిశాచానికి నరజాతి అంటే గిట్టదు. తాను పోగొట్టుకొనిన భాగ్యదశను ఈ నరులు పొందారు. కనుక నరజాతిని ఏలాగైనా కూలద్రోయాలనే దానికోరిక. సొలోమోను జ్ఞానగ్రంథం "భగవంతుడు నరుణ్ణి అమరుణ్ణిగా సృజించాడు. కాని పిశాచం అసూయ వలన మరణం లోకంలో ప్రవేశించింది. కనుక ఆ పిశాచం పక్షానికి చెందినవాళ్ళంతా నేటికీ చావును చవిచూస్తూనే వున్నారు" అంటుంది -2,24.

దేవుడు నిషేధించిన పండు స్త్రీకి కన్నులపండువుగా వుంది. ఆమెకు దాన్ని తింటే యెంత రుచిగా వుంటుందో అనే వుబలాటం పుట్టింది -3,6. పాపపు క్రియ ఎప్పుడూ ఈలాగే వుంటుంది. సీరా జ్ఞానగ్రంథం "పాపం స్త్రీతో ప్రారంభమైంది. ఆమెవలన మనమంతా నాశమై పోయాము" అని చెప్తుంది -25,24.

దేవుడు వలదన్న పండును తినగానే ఆదిదంపతులకు కనువిప్పు కలిగింది. వాళ్లు తాము దిసమొలతో వున్నట్లు తెలిసికొని అంజూరపుటాకులు కుట్టి మొలకు కప్పుకొన్నారు -3,7. పూర్వాధ్యాయంలో రచయిత ఆదిదంపతులు మొండిమొలతో వున్నా వాళ్లకు సిగ్గు వేయలేదు అన్నాడు -2,25. కానీ ఇక్కడ సిగ్గువేసింది అని చెప్పాడు. భావం ఇది. పాపం వాళ్లల్లో దోషశంకను పుట్టించింది. వాళ్ల నిష్కల్మషత్వం పోయింది. ఆదిమానవులు పాపానికి లొంగిపోయారు. వాళ్లల్లో ఆశాపాశాలూ వ్యామోహాలు పుట్టుకవచ్చాయి. జంతువాంఛలు మోసులెత్తాయి. కనుకనే వాళ్లు ఒకరి లింగాన్ని చూచి ఒకరు నిగ్రహం కోల్పోయారు. సిగ్గు చెందారు. అనగా పాపం వలన వాళ్లల్లో పెద్దమార్పు కలిగింది. ఇకదేహం వాళ్ల అదుపులో వుండదు.

## 6. పాపమూ, శిక్షా

### 1. చెట్లనడుమ దాగుకొన్నారు

సాయంకాలం దేవుడు తోటలో నడయాడ్డానికి రావడం చూచి భయపడి ఆదామేవలు చెట్లనడుమ దాగుకొన్నారు -3,8. నరులిద్దరూ దేవుని యెదుట బడకుండ దాగుకొన్నారు. వాళ్లింతవరకూ దేవుని బిడ్డల్గా, దేవుని స్నేహితుల్గాగ మెలిగారు. కాని యిప్పుడు ఆ తండ్రి యెదుటికి రాలేకపోయారు. కారణం? పాపంవలన దేవుని స్నేహాన్నీ అనుగ్రహాన్నీ కోల్పోయారు.

### 2. ఆవిడ తినమంటే తిన్నాను

దేవుడు నీవు పండునెందుకు తిన్నావని ఆదాముని అడుగగా అతడు, నీవు నాకు తోడుగా ఇచ్చిన స్త్రీ తినమంటే తిన్నాను అన్నాడు. దేవుడు స్త్రీని నీవెందుకు తిన్నావని అడుగగా ఆమె, పాము తినమంటే తిన్నాను అంది. పాపపు మానవుడు తన తప్పుతాను ఒప్పుకోడు. ఇతరులమీద నింద మోపుతూంటాడు. మనమందరమూ ప్రతిదిన జీవితంలో ఈలాగే చేస్తుంటాం.

### 3. ముగ్గురికీ శిక్షలు

దేవుడు పిశాచాన్నీ, ఏవనూ, ఆదామునీ శిక్షించాడు. ఈ ముప్పురూ ఒకరి కొకరు బాధాకారణ మౌతారు. పిశాచాన్ని స్త్రీ బాధిస్తుంది. స్త్రీని పురుషుడు బాధిస్తాడు.

కాని దేవుడు ఆముప్పురిలోను పాము రూపంలో వున్న పిశాచాన్ని మాత్రమే శపించాడు. దానికి నిత్యమూ మట్టే ఆహారం. ఇక్కడ మట్టిని తినడమంటే శిక్షను పొందడమని భావం. అంటే పిశాచం సదాశిక్ష ననుభవిస్తూ వుండిపోతుందని అర్థం.

స్త్రీకి మూడు శిక్షలు పడ్డాయి. 1 ఆమె ప్రసవ వేదన ననుభవించి బిడ్డలను కంటుంది. 2.భర్తమీద ఆమెకు విపరీతమైన వ్యామోహం కలుగుతుంది. 3. అతడు ఆమెమీద పెత్తనం చేస్తుంటాడు. కనుక ఆమె ఓ బానిసలా బ్రతుకుతుంది. అనగా తల్లిగా, భార్యగా ప్రస్తుతం స్త్రీ జీవించే జీవితం కష్టమైందని భావం. ఈ కష్టానికి ఆమె తొలిపాపమే కారణం అంటాడు రచయిత.

ఇక ఆదాముకి రెండు శిక్షలు పడ్డాయి. 1.అతడు బ్రతికినన్నాళ్లు కష్టపడి నొసటి చెమటోడ్చి కూడు సంపాదించుకోవాలి. నేల చాలినంతగా పంటలు పండదు. 2.అతడు మట్టినుండి పుట్టాడు. చివరకు ఆ మట్టిలోనే కలసిపోతాడు. దేవుడు నెనరుతో

పిడికెడు మట్టినుండి నరుణ్ణి చేసాడు. అతనికి ఓ మంచి వాతావరణం కలిగించి ఓ తోటలో వుంచాడు. తోడుగా వుండడానికి ఒక స్త్రీని కూడ ఇచ్చాడు. అతన్ని తనకు స్నేహితునిగా జేసికొన్నాడు. తన కుమారునిగా స్వీకరించాడు. ఐనా నరుడు కృతఘ్నుడై దేవుని ఆజ్ఞమీరాడు. తలబిరుసుతో దేవుణ్ణి ధిక్కరించాడు పాపంచేసాడు. తత్ఫలితంగా అతడు మృత్యువు వాతబడ్డాడు, మంటగలసిపోయాడు.

ఈ పట్టున భగవంతుని జాలిని తెలియజేసే వాక్య ఒకటి విన్పిస్తుంది. దేవుడు జంతుచర్మాలతో గుడ్డలుచేసి ఆదామేవలకు తొడిగాడు −3,21. అంటే ప్రభువు ఆ పాపపు మానవుల పట్ల గూడ కనికరమూ ఆదరమూ చూపాడని భావం.

## 4. నరుడు అమరుడై పోతాడేమోనని

ఆదాము జీవవృక్ష ఫలాలు కోసికొని తిని అమరుడై పోతాడేమోనని దేవుడు అతన్ని తోటలోనుండి వెళ్లగొట్టాడు 3,23. అనగా ఆదామునకు అమరత్వం పోయింది. అతడు చావునకు గురయ్యాడు.

దేవుడు ఏదెను తోటకు తూర్పుగా దేవదూతలను నిల్పాడు −3,24. ఈ దేవదూతలకు మూలంలో కెరూబులని పేరు. యిస్రాయేలీయులకు సమీప జాతులైన కనానీయులు మొదలైనవాళ్ల మతాల్లోఈకెరూబులు క్షుద్రదేవతలు. వీళ్లు దేవాలయాలను కాపాడుతూ పెద్దపెద్ద దేవతలకు అంగరక్షకులుగా పనిచేస్తుంటారు. ఆలాగే ఇక్కడ కూడ దేవదూతలు నరుని నుండి తోటను కాపాడరని చెప్పబడింది.

గుండ్రంగా తిరుగుతూ నిప్పులు కక్కే కత్తినికూడ దేవుడు తోటకు కావలి వుంచాడు. దేవతల ఆయుధం పిడుగు. ఇక్కడ ఈ కత్తి ఓ పిడుగులాగ పనిచేసి నరుణ్ణి తోటలోనికి రానీకుండా వారిస్తుంది. అనగా నరుడు తన తొల్లింగి సౌఖ్యాన్ని శాశ్వతంగా కోల్పోయాడనీ ఇక అతనికి అమరత్వం లేదనీ భావం.

## 5. నరుని పాపం

ఆదాము పాపం ఏమిటి? అతడు దేవుడు నిషేధించిన పండు తిన్నాడని మాత్రం చెప్పబడింది. అసలు ఆదాము పండు తిననూ లేదు పెట్టనూ లేదు. ఈ పండు ఓ సంకేతం మాత్రమే. ఆదాము దేవుని ఆజ్ఞమీరి ఏమో చేసాడని దీని భావం.

కాని ఆదిదంపతులు యథార్థంగా చేసిన పాపం ఏమిటి? అది యెవ్వరికీ తెలియదు. ఆదికాండం వ్రాసిన రచయితకు కూడ తెలియదు. కాని ఒకటి మాత్రం నిజం. ఆదాము గర్వముతో దేవుని ఆజ్ఞ మీరాడు. తాను పరతంత్రప్రాణి ఐకూడ

స్వతంత్రంగా ప్రవర్తింప గోరాడు. తాను ఆదేవుని మీద ఆధారపడి జీవించడానికి నిరాకరించాడు. అతని పాపం విశేషంగా గర్వంతో కూడింది. ఈ పాపాన్నే రచయిత ప్రజలకర్థమయ్యేలా తినకూడని పండు తినడం అన్న సంకేతంతో చెప్పుకొంటూ బోయాడు.

ప్రాచీనులు కొందరు ఆదాము ఏవను కూడి పాపం చేసాడని అభిప్రాయ పడ్డారు. వాళ్ల దృష్టిలో ఆదాము పాపం లైంగికపాపం. ఆని ఇది పొరపాటు. 1,28లో ప్రభువు "మీరు సంతానాన్ని కని అభివృద్ధికండి" అంటాడు. ఆలాంటి ఆజ్ఞనిచ్చిన దేవుడు ఆదాము ఏవను కూడితే కోపపడతాడా? కనుక అతని పాపం లైంగికమైందికాదు అని చెప్పాలి. అది గర్వానికీ స్వేచ్ఛా ప్రవర్తనకూ సంబంధించిందని మీద చెప్పాం.

తొలి ఆదాము ద్వారా పాపమూ మరణమూ సిద్ధించాయి. కాని మలి ఆదాము ద్వారా వరప్రసాదమూ జీవమూ లభించాయి. ఆదాము తెచ్చిపెట్టిన శాపాలకు మించినవి క్రీస్తు ఆర్జించిన సౌభాగ్యాలు. ఆదాము పాపం మనకందరకు సంక్రమిస్తుంది. మనం అతని సంతతివాళ్లం గనుక పుట్టుకతోనే అతని పాపాన్ని పొందుతాం. అదే జన్మపాపం. కాని క్రీస్తుద్వారా, అతని లోనికి జ్ఞానస్నానం పొందడం ద్వారా, ఈజన్మపాపంతొలగి పోతుంది. కనుక ఆదాము మనకు మరణాన్ని కలిగించే తండ్రి ఐతే, క్రీస్తు మనకు జీవాన్నిచ్చే తండ్రి -రోమా 5,18-22.

## 7. లోక రక్షకుడు

### 1. స్త్రీ సంతతి

నరుడు ఎన్ని పాడుపనులు చేసినా భగవంతుడు మాత్రం అతన్ని చేయి విడువడు. నిత్యం అతన్ని కీర్తనతో ఆదరిస్తూనే వుంటాడు. ఆదాము పాపం దేవుణ్ణి ధిక్కరించినా దేవుడతన్ని పరిత్యజించ లేదుగదా, అతని రక్షణమార్గం వెదికాడు. స్త్రీ సంతతికీ పిశాచం సంతతికీ తీరని వైరం కలుగుతుంది. ఐనా స్త్రీ సంతతివాళ్లు పిశాచం తల చితుక గొడతారు. దాన్ని జయిస్తారు. పిశాచం కూడ స్త్రీ సంతతిని కొంతవరకు బాధిస్తుంది. వారి మడిమలు కరుస్తుంది. ఐనా వారిని జయించలేదు -3,15. ఇక్కడ స్త్రీ సంతతి అంటే యెవరు. ఏవ సంతతి ఐన నరులంతాను. కాని ఆ నరుల్లో ఓ ప్రముఖవ్యక్తి నరులందరికీ నాయకత్వం వహిస్తాడు. అతడే క్రీస్తు. నిత్యం మనకు పిశాచంతో పోరాటం జరుగుతుంటుంది. ఆ పోరాటంలో క్రీస్తు మనకు నాయకుడు. అతనితో గూడి మనం పిశాచాన్ని జయిస్తాం, దాని తల చితుకగొడతాం. పిశాచం తోడి పోరాటంలో క్రీస్తు మనకు నాయకుడైతే, అతని తల్లి మరియ మనకు సహాయకురాలు. పై వాక్యంలో "స్త్రీ

సంతతి" అంటే మరియ సంతతి అని కాదు. ఏవ సంతతి అనే అర్థం. కాని ఆ యర్థంలో క్రీస్తూ మరియాఇద్దరూ ఇమిడే వున్నారు. మరియను ప్రాచీన క్రైస్తవ రచయితలు "రెండవ ఏవ" అని పేర్కొన్నారు గూడ.

2. ఆదాము పాపం సంతోషకరమైంది

భక్తుడు అగస్టీను ఆదాము పాపం సంతోషకరమైంది అన్నాడు. ఆదాము పాపం చేయకుండా వుండడంకంటె చేయడమే మేలైంది అన్నాడు. ఎందుకు? ఆదాము పాపం వలన క్రీస్తు అంతటి రక్షకుణ్ణి పొందగలిగాం. లోకరక్షకుడైన క్రీస్తు మన పాపానికి పరిహారం చేసాడు. మనకు మళ్లా దేవునితో స్నేహం కలిగించాడు. ఆదాము అనుభవించిన ఆ తొల్లిటి సౌభాగ్య దవను మళ్లా నెలకొల్పాడు.

కాని ఆదాము అనుభవించిన సౌభాగ్య దశకూ క్రీస్తు నెలకొల్పిన సౌభాగ్య దశకూ కొన్ని వ్యత్యాసాలున్నాయి. 1.క్రీస్తు అమరత్వాన్ని పునస్థాపనం చేయలేదు. పాపానికి ముందు ఆదాము చనిపోయ్యేవాడు కాదు. కాని మనమిప్పుడు చనిపోతున్నాం ఐనా చనిపొయ్యాక ఆ క్రీస్తులాగే మనమూ ఉత్థానమౌతాం. ఆ ప్రభువులాగే మనమూ జీవంతో లేచి మోక్షాన్ని చేరుకొంటాం, ఆ మీదట శాశ్వతంగా అమరులమైపోతాం. 2.క్రీస్తు వ్యాధిబాధలను నిర్మూలించలేదు. పాపానికి ముందు ఆదాముకు వ్యాధిబాధలుం డేవి కావు. కాని నేడు మనకున్నాయి. ఐనా ప్రభువుబాధల ద్వారా మన బాధలు ఫలితాన్ని పొందుతాయి. మనకు వరప్రసాదాన్ని ఆర్జించిపెడతాయి. 3.మనం పాపం చేయగలం, దేవునితోడి స్నేహాన్ని కోల్పోగలం. అనగా మనమూ ఆయాదాములాగే ప్రవర్తింపగలం. పతనమైపోగలం. ఈ యపాయాన్ని క్రీస్తు తొలగింపలేదు. డఅంచేత మనం భయభక్తులతో ప్రవర్తిస్తుండాలి. రక్షణమార్గంలో నడుస్తుండాలి. ఇవి క్రీస్తు నెలకొల్పిన నేటి సౌభాగ్య దశలో కన్పించే కొన్ని లక్షణాలు.

భగవంతుడు నరుణ్ణి ఎప్పుడూ చేయివిడువడు అన్నాం. నరుడు పాపంచేసినా గానీ అతనికి కొండంతటి రక్షకుణ్ణి అనుగ్రహించాడు. ఆ రక్షకుడే క్రీస్తు. ఆదాము ఈ క్రీస్తుని సూచిస్తుంటాడు. ఆ యాదాము సంతతివాళ్లమైన మన సౌభాగ్యమంతా ఈ క్రీస్తుతో ఐక్యంగావడంలోనే ఇమిడి వుంది.

## 8. సంకేతాలూ వాటి భావమూ

ఆదికాండం తొలి మూడధ్యాయాల్లో రచయితలు చాలా సంకేతాలు వాడారు. వీటి భావాలు పూర్వాధ్యాయాల్లో వివరించాం. కాని స్పష్టత కోసం వాటినన్నిటినీ మళ్లా ఇక్కడ ఓ జాబితాగా పొందుపరుస్తున్నాం.

ఈ సంకేతాలను ఉన్నవాటిని ఉన్నట్లుగా నమ్మనక్కరలేదు. అవి బోధించే భావాలను మాత్రం నమ్మాలి. ఉదాహరణకు ఆదామేవలు తినవద్దన్న పండు తిన్నారు అన్నది సంకేతం. వాళ్లు ఏదో రూపంలో దేవుని ఆజ్ఞ మీరారు అన్నది ఆ సంకేతం భావం. నేడు మనం ఆదామేవలు దేవుని ఆజ్ఞమీరారు అని నమ్మాలి. కాని వాళ్లు తినవద్దన్న పండు తిన్నారని మాత్రం నమ్మనక్కరలేదు. మిగతా సంకేతాలు విషయం గూడ ఇంతే.

1. దేవుడు ఆరు రోజులు సృష్టిచేసి ఏడవరోజు విశ్రాంతి తీసికొన్నాడు –2,2. నరులు విశ్రాంతి దినాన పనులు చేయకూడదనీ, అది పవిత్రమైన దినమనీ ఈ సంకేతం భావం.
2. దేవుడు తనకు పోలికగా నరుణ్ణి చేసాడు –2,26. సృష్టి వస్తువులన్నిటి మీదా నరుడు అధికారం చూపుతాడు.
3. ప్రభువు మట్టినుండి నరుణ్ణి చేసి అతని ముక్కు గోళ్లలోనికి ప్రాణవాయువు నూదాడు –2,7. నరుడు పూర్తిగా భగవంతుని మీదనే ఆధారపడి జీవించేవాడు.
4. యావే నరుని ప్రక్కటెముక తీసికొని స్త్రీని చేసాడు –2,22. స్త్రీ గూడ పురుషుని లాంటిది. వాళ్లిద్దరిదీ ఒకే స్వభావం. వాళ్లిద్దరూ ఒకే కోవకు చెందినవాళ్లు. వాళ్లల్లో హెచ్చుతగ్గులు లేవు.
5. దేవుడు ఆదామునకు గాఢనిద్ర కలిగించి అతని ప్రక్కటెముకను తీసాడు – 2,21. సృష్టి రహస్యాలను నరుడు చూడకూడదు.
6. నరుడు తొలి స్త్రీని చూచి "ఈమె నా యెముకల్లో యెముక, నా దేహంలో దేహం" అనుకొన్నాడు –2,23. ఆమె అతనికి ఆప్తురాలు, బంధువురాలు, ప్రియురాలు.
7. నరుడు తొలి స్త్రీకి నారి అని పేరుపెట్టాడు –2,23. స్త్రీ పురుషుని ఆధీనములో వుంటుంది.
8. ఆది దంపతులు దిసమొలతో వున్నా వాళ్లకు సిగ్గువేయలేదు –2,25. ఇంకా పాపం చేయలేదు గనుక వాళ్లల్లో కామవికారం లేదు.
9. దేవుడు నరుణ్ణి ఏదెను తోటలో వుంచాడు –2,15. దేవుడు నరుణ్ణి సౌభాగ్యదశకు కొనివచ్చాడు.

10. ఆ తోట మంచిచెట్లతో నదులతో అలరారుతూ తూర్పువైపున ఉండేది – 2,8–14. ఆదిదంపతులు సౌభాగ్యమైన దశలోను సంతోషకరమైన స్థితిలోను జీవించేవాళ్లు.

11. ఆ తోటలో ప్రాణమిచ్చే చెట్టు వుండేది –2,9. ఆదిదంపతులకు మృత్యువు లేదు.

12. ఆ తోటలో మంచిసెబ్బరలను తెలియజేసే చెట్టు కూడ వుండేది –2,9. నరుడు స్వతంత్రంగా ప్రవర్తించకూడదు. దేవునిమీద ఆధారపడి జీవిస్తుండాలి.

13. నరుడు జంతువులకు పేర్లు పెట్టాడు –2,19. ఆ జంతువుల కన్నిటికీ నరుడు అధిపతి.

14. ఆ జంతువులలో నరునికి తోడుగా వుండదగినదేదీ లేదు –2,20. అతడు జంతువులకంటె పైస్థాయిలోని వాడు. అతని కోవ వేరు, వాటి కోవ వేరు.

15. దేవుడు సాయంకాలం తోటలో తిరుగాడుతూ ఆదామేవలను పిల్చాడు – 3,8. దేవుడు ఆది దంపతులతో స్నేహంగా మెలిగేవాడు.

16. దేవుడు ఆదాముని జ్ఞానవృక్షం ఫలాలు తినవద్దన్నాడు –2,17. ఆదిదంపతుల సౌభాగ్యస్థితి వాళ్ల విధేయతమీద ఆధారపడి వుంటుంది.

17. పాము ఏవతో సంభాషణం ప్రారంభించింది –3,30. దుష్టుడైన సైతాను ఏవను శోధించాడు.

18. ఏవా ఆదామూ తినకూడని పండు తిన్నారు –3,6. వాళ్లిద్దరూ దేవుని ఆజ్ఞ మీరారు.

19. దేవుడు ఆది దంపతులను తోట నుండి వెళ్లగొట్టాడు –3,23. వాళ్లు తామున్న సౌభాగ్యస్థితిని పోగొట్టుకున్నారు.

20. యావే ఏదెను తోటకు ఓ దేవదూతనూ కత్తినీ కాపుంచాడు –3,24. నరజాతికీ ఆ తొల్లిటి సౌభాగ్యస్థితి దక్కకుండా పోయింది.

21. స్త్రీ సంతతి పాము తల చితుకగొడతారు –3,15. స్త్రీ సంతానమైన లోకరక్షకుడు పిశాచాన్ని జయిస్తాడు.

# 4. యోసేపు కథ

బైబులు భాష్యం - 133

యోసేపు కథ బైబుల్లోని సుప్రసిద్ధ కథల్లో వొకటి. ఈ కథ ప్రధానంగా దైవ కటాక్షాన్ని తెలియజేసేది. మంచికథకు వుండే లక్షణాలన్నీ - యౌవనం, సౌందర్యం, చైతన్యం, నాయకత్వం, అసూయాద్వేషాలూ, శోధనలూ, కష్టాలు దుఃఖాలు, పశ్చాత్తాపం అపరాదక్షమ, మహానుభావత్వం - దీనికీ వున్నాయి. ఈ కథను చదువుతూంటే కండ్లవెంట నీళ్లు కారతాయి. ఇది మంచికథ లక్షణం. ఆదికాండ ఈ కథ ఈజిప్టులో, హిక్సోసు రాజవంశం పరిపాలనాకాలంలో, క్రీ.పూ. 17వ శతాబ్దంలో జరిగినట్లుగా చెప్తుంది.

## యోసేపు బాల్యం

వంశపారంపర్యంగా వచ్చిన లక్షణాల ప్రభావం, పరిసరాల ప్రభావం కూడా పిల్లలపై వుంటుంది. యోసేపు చిన్ననాడే చాల విషమ పరిస్థితులను చవిజూచాడు. అతడు మెసపొటామియాలోని పదనారాములో పుట్టాడు. అతని మేనమామ లాబాను పారిపోయే అతని తండ్రి యాకోబును తరుముకొంటూ వచ్చాడు. అతని పెదతండ్రి యేసావు నాల్గువందలమంది మనుష్యులతో అతని తండ్రి యాకోబును కలిసికోవడానికి వచ్చాడు. దేవదూత ఒకరాత్రంతా అతని తండ్రితో కుస్తీపట్టాడు. షెకెము వద్ద అన్యజాతి వారు అతని అక్కదీనాను మానభంగం చేయగా అతని సోదరులు వారిపై పగతీర్చు కొన్నారు. యోసేపు సోదరులు పదిమందికి అతనిపై చిన్ననాటినుండి అసూయ వుండేది. ఈ సంఘటనలన్నీ యోసేపు లేత హృదయంపై చెరగని ముద్ర వేసివుంటాయి.

యోసేపు యాకోబుకి ముసలిప్రాయంలో పుట్టిన కుమారుడు. పైగా యాకోబుకి మొదటి భార్యయైన లేయాకంటె రెండవ భార్యయైన రాహేలంటే ఎక్కువ యిష్టం. ఈ రాహేలు బిడ్డలే యోసేపు బెన్యామీనులు. కనుక ఈ యిద్దరు పిల్లలపై యాకోబుకి ఎక్కువ ప్రీతి. అతడు యోసేపుకి చారలుకల పొడుగు చేతుల నిలువుంగీని కుట్టించాడు. ఆ రోజుల్లో ప్రముఖుల, ధనవంతులు ఈలాంటి అంగీలను తాల్చేవాళ్ళు. కనుక సోదరులకు యోసేపుపై అసూయపుట్టింది -37,3-4. పైగా అతడు సోదరులు చేసిన చెడ్డపనులను తండ్రికి తెలియజేసాడు. అందుచే వారికి అతనిపూ ద్వేషం కూడ పెరిగింది. తండ్రికి అతనిపై గల విశేషానురాగమే అతని తిప్పలకు కారణమైంది.

యోసేపు కలలు కనేవాడు. అతనికి చిన్ననాడే రెండు కలలు వచ్చాయి. మొదటి కలయిది. అతడూ సోదరులూ పొలంలో పైరుకోసి కట్టలు కట్టారు. కాని సోదరుల కట్టలు నిటారుగా నిలబడివున్న అతని కట్టకు దండం పెట్టాయి. అతడు సోదరులమీద

అధికారం నెరపుతాడని ఈ కలభావం. యోసేపుకి వచ్చిన రెండవ కల యిది. సూర్య చంద్రులు, పదకొండు నక్షత్రాలు అతనికి నమస్కారం చేసాయి. సోదరులూ తల్లిదండ్రులూ యోసేపుకి దండంపెడతారని ఈ కల అర్థం. ఈ కలలను విని తోబుట్టువులు యోసేపుపై మండిపడ్డారు. అతన్ని ఇంకా యెక్కువగా ద్వేషించారు.

## బానిసగా అమ్ముడుపోవడం

యాకోబు కొడుకులు షెకెములో గొర్రెలు కాచుకొంటున్నారు. యాకోబు యోసేపుని అన్నల వద్దకుపోయి వారి మంచిచెడ్డలు తెలసికొని రమ్మన్నాడు. యోసేపు వెళ్లేప్పటికి సోదరులు దోతానుకి కదలిపోయారు. వాళ్లు ఎక్కడ పచ్చిక బాగావుంటే అక్కడికి మందలను తోలుకొని పోయి మేపేవాళ్ళు. ఈ దోతాను చాలమార్గాలు కలసే తావు. వర్తకులు ఈ బాటలవెంట ప్రయాణం చేసేవాళ్ళు.

అన్నలకు యోసేఫంటే గిట్టదు కదా! కనుక వాల్లతన్ని చంపివేద్దామనుకొన్నారు. మళ్లా మనసు మార్చుకొని నీళ్లులేని బావిలో పడద్రోసారు. అతడు ఆ గోతిలో కొంత కాలమున్నాడు. మిద్యాను వర్తకులు ఆ దారివెంట వెళ్తూ అతన్ని బయటికిలాగి 22 నాణాలకు యిష్మాయేలీయులకు అమ్మారు. మిద్యానీయులు అబ్రాహాము భార్యయైన కతూరా సంతతివాళ్ళు. యిష్మాయేలయులు అబ్రాహాము భార్య హాగారు సంతతివాళ్ళు. యిష్మాయేలీయులు యోసేపుని ఈజిప్టుకు కొనిపోయారు.

సోదరులకు యోసేపుమీద అక్కసు ఇంకా తీరలేదు. వారు అతని అంగీని మేకపిల్ల నెత్తుటిలో ముంచి తండ్రివద్దకు పంపారు. నీ ముద్దుల కొడుకుని ఏదో వన్యమృగం చంపివేసింది. ఇది వాని అంగీ అని కబురు చెప్పించారు. యాకోబు తన కొడుకు నిజంగానే చనిపోయాడనుకొని అతని కొరకు ఎంతగానో విలపించాడు.

యిష్మాయేలీయులు యోసేపుకి సంకెలలు వేసి అతన్ని బానిసగా ఈజిప్టుకి కొనిపోయారు. అక్కడ సంతలో అతన్ని వేలంవేసారు. యోసేపు అప్పటికి 27 సంవత్సరాల యువకుడు. కండలు తీరి పుష్టిగా వున్నాడు. బాగా పనిచేసేలా వున్నాడు. కనుక చాలమంది యజమానులు అతనికొరకు పాటపాడారు. చివరకు పోతీఫరు అతన్ని కొన్నాడు. ఇతడు సైనికోద్యోగి. రాజు అంగరక్షకులకు నాయకుడు.

### పోతీఫరు ఇంటిలో

పోతీఫరు ఇంటిలో యోసేపు ఏలా మెలిగాడు? దేవుడు యోసేపుకి తోడుగా వున్నాడు. కనుక అతడు చేపట్టిన కార్యాలన్నీ విజయవంతమయ్యాయి -39,23. పోతీఫరు ఈ సంగతిని గుర్తించాడు. అతనికి ఈ కొత్త బానిసపై అభిమానంపెరిగింది. అతన్ని

ఇష్టసేవకుని చేసికొన్నాడు. ఐనా ఆ యింటిలో అతడు బానిసే. ఇతర బానిసలకు మాత్రం నాయకుడు. సైన్యాధికారికి పెద్ద బలగముంది. ఆ బలగానికంతటికి ఈ హీబ్రూ బానిసే పెద్ద అధికారి. ఇంటి విషయాలన్నీ అతనికే వదలివేసాడు. ఆ యింటిలో అతని తర్వాత అతని యంతటివాడు యోసేపు. అతడు దైవబలం కలవాడు. కార్య చతురుడు. నమ్మదగినవాడు. కనుక యజమానుని మన్ననకు పాత్రుడయ్యాడు.

శోధనలో చిక్కుకోవడం

నరునికి వచ్చే శోధనల్లో లైంగిక శోధనలు అతిబలమైనవి. కనుకనే చాలమంది వాటికి లొంగిపోతూంటారు. యోసేపు చక్కని ఆకారం కలవాడు. యౌవనంలో వున్నవాడు ఇకనేం యజమానుని భార్య అతనిపై కన్నువేసింది. ఆమె అతన్ని పాపపు ఊబిలోనికి లాగజూచింది. తాజెడిన కోతి వనమెల్ల చెరుస్తుంది కదా! క్రీస్తుపూర్వం 5000 సంవత్సరాల నాటికే ఈజిప్టులో గొప్ప నాగరకత వృద్ధిలోకి వచ్చింది. ఈజిప్టీయులు వారి స్త్రీలకు పూర్ణ స్వేచ్ఛనిచ్చారు. ఇది వారిని కొన్నిసార్లు దుష్కార్యాలకు పురికొల్పేది. ఇక్కడ ఈ స్త్రీ పెద్ద హోదాలో వున్నరాజు సైనికాధికారికి భార్య. ఇక ఆమె ఆగడానికి హద్దులుంటాయా?

ఈ సందర్భంలో ఈ శోధనను కొంచెం విపులంగా పరిశీలించిచూద్దం మంచిది. ఈ ప్రలోభం లక్షణాలను జాగ్రత్తగాగమనించాలి. 1.యోసేపుకి ఈ శోదన తలవని తలంపుగా వచ్చింది. దానికి కర్త అతడుకాదు. ఆమె. అతడు ఓ అనుమాకుడైన బానిస. ఆమెదేశంలో ఓ గొప్ప అధికారికి భార్య. అంత వున్నతపదవిలో వున్న మహిళ అంత క్రిందిస్థాయిలో వున్న నరుణ్ణి కామిస్తుందని ఎవరు ఊహించగలరు? ఈ శోధనలో చివరిమెట్టు యోసేపు ఊహింపని గడియలో వచ్చింది. అతడు పనిమీద యజమానుని ఇంటిలోనికి పోయాడు. ఆ సమయంలో అక్కడ దాసులెవ్వరూలేరు. అప్పుడు యజమానుని భార్య అతని పైబట్ట పట్టుకొని తనతో శయనింపరమ్మని కోరింది −39,12. ఇది దిడీలున వచ్చిన శోధన.

2. ఒకసారి ప్రారంభమయ్యాక ఈ శోధనం చాలనాళ్లవరకు కొనసాగింది. ప్రతిదినం ఆమె యోసేపుని పాపకార్యానికి పురికొల్పేది. కాని అతడు ఆమె కోరికను నిరాకరించేవాడు −39,10. అదే శోధన మళ్లామళ్లా వస్తే చాలమంది నరులు క్రమేణ లొంగిపోతారు. కొండలా నిశ్చలంగా నిల్చేవాళ్ళు ఎంతమంది? కాని యోసేపు దృఢచిత్తుడు అతని హృదయం భగవంతునిపై లగ్నమైవుంది. కనుక అతడు తుచ్ఛసుఖాలకు లొంగలేదు.

3. యజమానుని భార్య కోర్కెను అంగీకరిస్తే అతనికి చాల లాభాలు కలుగుతాయి. ఆమె ద్వారా అతడు సులువుగా ఉన్నత పదవిని పొందవచ్చు. పేరూ ప్రఖ్యాతులూ

తెచ్చుకోవచ్చు. పూర్వం తాననుభవించిన కష్టాలకు బదులుగా ఇప్పుడు సుఖాలు అనుభవింపవచ్చు. ఐనా యోసేపు నైతిక విలువలు చాల గొప్పవి. ఆ విలువలముందు ఈ లౌకిక లాభాలు గడ్డిపోచతో సమానం.

4. ఇక్కడ యోసేపు విలువలను జాగ్రత్తగా గమనించాలి. అతడు యజమానుడు తనకు మేలు చేసాడు కనుక తాను అతనికి ద్రోహం తలపెట్టకుండా వుంటాననుకోవచ్చు. లేదా ఆ స్త్రీ యజమానుని భార్య కనుక ఆమెను ముట్టుకోకుండా వుంటాననుకోవచ్చు. కానిఅతనికి ఈ రెండిటి కంటెగూడ మూడవకారణం బలమైంది. అతడు తాను ఆ స్త్రీని కూడడం భగవద్ద్రోహం అనుకొన్నాడు -39,9. దేవుడు చూస్తుండగా ఆలాంటి దుష్కార్యం చేయగూడదనుకొన్నాడు. భగవంతునిపై యోసేపుకున్న భక్తిభావం అంత గొప్పది. ఇక్కడ ఒక్క హీబ్రూ రచయిత మాత్రమే ఈ భావాన్ని సూచించగలదు. ఈజిప్టీయులకు ఈ నైతిక విలువలు తెలియవు.

శోధనం దానంతట అది పాపంకాదు. దుష్టమైన కోరిక పుట్టినంతమాత్రాన్నే పాపం చేసినట్లు కాదు. మనం దానికి సమ్మతిస్తే, దాన్ని తలంచుకొని ఆనందిస్తే అది పాపం. ఇక్కడ యోసేపు శోధనం చివరిమెట్టు చేరుకోలేదు.

యజమానుని భార్య తనపైబట్ట పట్టుకోగా యోసేపు దాన్ని ఆమె చేతుల్లోనే వదలివేసి ఆ యింటినుండి పారిపోయాడు. ఈలాంటి కామసంబంధమైన కోరికలు వచ్చినపుడు వాటితో చలగాటమాడుతూ కూర్చోకూడదు. పారిపోవడమే శ్రేయస్కరం. విశేషంగా కామానికి ఇదే విరుగుడు. ఆనాటి యువకులు యోసేపు చర్యకు నవ్వి వుండవచ్చు. ఈనాటి వాళ్ళుకూడ అతడు వట్టి అసమర్థుడు అనుకోవచ్చు. మన సినిమాలు, నవలలు, నాటకాలు తరచుగా పుణ్యాన్ని చేతగానితనంగాను పాపాన్ని సామర్థ్యంగాను, ఆకర్షణీయమైన దాన్నిగాను చిత్రిస్తాయి. కాని భగవద్భక్తులు పాపాన్ని జయించి పదిమందికి ఆదర్శంగా నిలుస్తారు. ఈ శోధనకు లొంగిపోయి యోసేపు ఆనాడు ఆ స్త్రీని కూడినట్లయితే నేడతడు మనకు మాన్యుడయ్యేవాడేనా? ఇప్పుడతన్ని మనం గౌరవభావంతో స్మరించుకొనే వాళ్లమేనా?

ఇంతయెందుకు? బైబుల్లోనే దావీదు చరిత్రవుంది. అతడు సాయంత్రంపూట మేడపై పచార్లు చేస్తూ పక్కింటిలో స్నానం చేసికొనే బత్షెబాను చూచాడు. ఆ చూపుతోనే అతనికి మతిపోయింది. అతని హృదయం దేవునికి దూరమైంది. అతడు ఆ స్త్రీని యింటికి రప్పించుకొని ఆమెతో పాపంచేసాడు -2సమూ 11,2-4. అతనికి తాత్కాలిక సుఖం కలిగింది. కాని తన పాపానికి జీవితాంతం పశ్చాత్తాప పడవలసివచ్చింది. నేడు

మనం అతని దుర్బలుణ్ణిగా ఎంచుతాం గాని ఆదర్శప్రాయుణ్ణిగా గణించం. అతనిచర్యను ఖండిస్తాంగాని మెచ్చుకోం. ఐతే దావీదు పడిపోయినచోట యోసేపు గెల్చాడు. శోధనలు గెల్చినవాడు మహానుభావుడు. దేవునికీ భక్తకోటికీ ప్రీతిపాత్రుడు.

యోసేపు దృష్టాంతం నుండి మనం మూడంశాలు నేర్చుకోవాలి. 1.నరునికి ద్రోహం చేయడం కంటె దేవునికి ద్రోహంచేయడం గొప్ప పాపం. అతడు నే నీ స్త్రీని కూడ్డం భగవద్ద్రోహం కాదా అనుకొన్నాడు -39,9. పాపంలోని దుష్టత్వమంతా దేవునికి ద్రోహం చేయడంలోనే వుంటుంది. "నేను నీకే, నీకే ద్రోహంగా పాపంచేసాను" -కీర్త 51,4.

2. యోసేపుకి పాపభీతివుంది. అతడు నేను ఈ దుష్కార్యానికి ఏలా వొడిగడతాను అనుకొన్నాడు. పాపాన్ని చులకన చేసేవాడు దానిలో కూలతాడు. పాపనికి జంకేవాడు దానికి దూరంగా వుంటాడు.

3. యోసేపు ఎప్పుడూ దేవుణ్ణి తలంచుకొనేవాడు. దేవుని సన్నిధిలో నడచేవాడు. కష్టసుఖాల్లోను దేవుణ్ణి నమ్మి జీవించేవాడు. కనుకనే శోదనవచ్చినపుడు దైవబలంతో దాన్ని జయించగలిగాడు. భగవంతునిపట్ల మనకు ఎంత భక్తివుందో అంతగానే శోధనలను జయిస్తాం. పౌలు నుడివినట్లుగా, మనం ఆత్మయందు జీవించాలి. శారీరక వాంఛలను తృప్తిపరచకూడదు -గల 5,16.

యోసేపుకి శిక్ష

దేవుడు యోసేపు పుణ్యాన్ని గుర్తించి అతన్ని బహూకరిస్తాడని మనం భావించి వుండవచ్చు. కాని అలాయేమి జరగలేదు. పోతీఫరు భార్య యోసేపు తన కోర్కెను తీర్చనందుకు అతనిపై కోపించింది. అతడు తన్ను చులకన చేసి అవమానించినట్లుగా భావించింది. తన చేతికి జిక్కిన యోసేపు పైబట్టను భర్తకు చూపించి అతడు తన్ను మానభంగం చేయడానికి లోనికి వచ్చాడని పెనిమిటికి ఫిర్యాదు చేసింది. ఆడవాళ్లు అబద్ధం చెప్తే గోడకట్టినట్లుగా వుంటుంది కదా! ఆలిమాటలు నమ్మి పోతీఫరు యోసేపుని చెరలో త్రోయించాడు. అంతటి పెద్ద అధికారి అతన్ని చంపించి వుండవచ్చు. ఇక్కడ ఆ కార్యం అతడు ఎందుకు చేయలేదా అని మనకు ఆశ్చర్యం కలుగుతుంది. సరే, యోసేపు పుణ్యానికి బహుమతికి మారుగా శిక్షపడింది. ఐనా అతడు దేవుని మార్గాలను అర్థం చేసికొని ఓర్పుతో చెరలో వుండిపోయాడేగాని ఆ ప్రభువుపై సుమ్మరలు పడలేదు.

ఐతే చెరలో దేవుడు యోసేపుకి తోడుగా వున్నాడు. చెరసాల అధికారికి అతనిపై దయపుట్టేలా చేసాడు. కనుక ఆ యధికారి చెరలోని వారనందరినీ యోసేపుకి అప్పగించాడు. అతన్ని వారికి నాయకుణ్ణి చేసాడు. భగవంతుని నమ్మినవాళ్లను ఆ ప్రభువు ఎప్పుడు

ఆదుకొంటూనే వుంటాడుకదా! పైగా యోసేపు కష్టపడి పనిచేసేవాడు. నిజాయితీ, వివేకం, స్వామిభక్తి కలవాడు. కనుక అతడు ఎక్కడికి వెళ్లినా యజమానులకు ప్రీతిపాత్రుడు అయ్యేవాడు.

## ఫరో సేవకుల కలలు

యోసేపు చెరసాలలోని ఖైదీలందరికీ పెద్దగా వుండేవాడు కదా! ఒకరోజు ఆ చెరలోకి ఇద్దరు క్రొత్త ఖైదీలు వచ్చారు. వారు ఫరోరాజు వంటవాడు, పానీయవాహకుడు. వీళ్లు వట్టి సేవకులు కారు, రాజోద్యోగులు. రాజుకి సలహాదారులుకూడ. ఏదో రాజకీయ నేరంపై చెరసాలలో త్రోయబడ్డారు. ఈ యిద్దరికీ కలలు వచ్చాయి. యోసేపు స్వప్న వ్యాఖ్యనంలో నిపుణుడు. అతీడు ఆ యిద్దరి కలలకు అర్థం చెప్పాడు.

పానీయవాహకుడికి ద్రాక్షగుత్తులు పండి ఫరోకు ద్రాక్షరసం అందించినట్లుగా కల వచ్చింది. యోసేపు ఫరో అతన్ని మళ్లా కొలువులోకి తీసికొంటాడని అర్థం చెప్పాడు. అతడు చెప్పినట్లే మూడురోజుల తర్వాత ఫరో అతన్ని విడుదల చేయించి మళ్లా కొలువు దయచేసాడు.

వంటవానికి తాను ఫరోచక్రవర్తికి పిండివంటలను గంపలో మోసికొని పోతూన్నట్లూ, ఆకాశంలోని పక్షులు ఆ పిండివంటలను తింటున్నట్లూ కలవచ్చింది. యోసేపు అతనితో ఫరోచక్రవర్తి నీ తల తీయిస్తాడు అని చెప్పాడు. మూడురోజులయ్యాక చక్రవర్తి అతన్ని వురితీయించాడు. అంతా యోసేపు చెప్పినట్లే జరిగింది.

యోసేపు పానీయవాహకునితో నీవు నాకు ఓ ఉపకారం చేసిపెట్టాలి. నన్ను హేబ్రేయుల దేశం నుండి అపహరించుకొని వచ్చారు. ఇక్కడ అన్యాయంగా ఈ చెరలో త్రోయించారు. నీవు ఫరోను కలసికొన్నపుడు ఆ రాజుకి నాసంగతి తెలియజేయి. ఆయనకు నాపై దయపుట్టేలా చూడు అని చెప్పాడు. కాని చెరనుండి విడుదల పొందిన పానీయవామకుడు అతన్ని పూర్తిగా మర్చిపోయాడు. యోసేపు ఇంకా రెండేండ్లు ఆ చెరలోనే మ్రగ్గవలసి వచ్చింది. దైవలీలలు విచిత్రంకదా! యోసేపుకి తరచుగా కష్టాలు వస్తాయి. ప్రభువు అతన్ని ఆ బాధలనుండి తప్పించినట్లే వుంటుంది. కాని అతడు మళ్లా క్రొత్తకష్టాల్లో చిక్కుకొంటాడు. ఐనా అతడు నిరాశకు గురికాక విశ్వాసంతో ప్రభువుని నమ్ముతూంటాడు. దేవుడు అతన్ని కష్టపుబాటలో నడిపిస్తూంటాడు. ఐనా అతన్ని నిరంతరం ఆదుకొంటూనే వుంటాడు.

## ఫరో కలలు

ఈ కథలోమొత్తం ఆరు కలలు వస్తాయి. ఇవి జంటలుగా వస్తాయి. యోసేపు వీటికి అర్థం చెప్తాడు. ఈ కలలు దైవదర్శనాలు కాదు. కాని యివి దేవుడు భవిష్యత్తులో నిర్ణయించిన కార్యాలను ముందుగానే సూచిస్తాయి. హెబ్రేయుల కంటె యాజిప్టు ప్రజలు స్వప్నశాస్త్రాన్ని ఎక్కువగా అభివృద్ధి చేసారు. ఈ కథలోని కలలు ఈజిప్టు ప్రజల స్వప్నసంస్కృతిని తెలియజేస్తాయి.

ఫరోకు రెండు కలలు వచ్చాయి. మొదటి దానిలో అతడు నైలునదివొద్దున బక్కచిక్కిన ఏడావులు బలిసిన ఏడావులను మ్రింగివేయడం చూచాడు. రెండవదానిలో ఏడు గట్టింకకులు ఏడు పీలకంకులను మ్రింగివేయడం చూచాడు. మరునాడు రాజు ఈ కలల భావాన్ని తెలియజేయండని తన జ్ఞానులను అడిగాడు. కాని వాళ్లు వాటి అర్థాన్ని వివరించలేకపోయారు. హీబ్రూజ్ఞానం ముందు ఈజిప్టు జ్ఞానం తలవంచక తప్పదని ఇక్కడ రచయిత భావం.

ఫరో ఈ కలలు ఏదో అనర్థాన్ని సూచిస్తున్నాయని భయపడ్డాడు. అప్పుడు పానీయవాహకుడికి తెలివివచ్చింది. అతడు యోసేపు పూర్వం తన కలకు అర్థం చెప్పిన తీరును రాజుకు తెలియజేసాడు. అతన్ని పిలిపింపమని వేడుకొన్నాడు. రాజు యోసేపును పిలువనంపగా అతడు ఆ కలలభావాన్ని ఈలా వివరించాడు. ఈజిప్టులో మొదట ఏడేండ్లు పంటలు బాగా పండుతాయి. ధాన్యం సమృద్ధిగా లభిస్తుంది. కాని తర్వాత ఏడేండ్లు దారుణమైన కరువు వస్తుంది. ప్రజలు తిండిలేక మలమలమాడి చస్తారు. అందుచే రాజు ముందుగానే వివేకమూ ఉపాయమూగల అధికారిని నియమించాలి. ఆ ఉద్యోగి పంటలు బాగా పండిన ఏడేండ్ల కాలంలో ధాన్యాన్ని ప్రోగుజేసి ఆయానగరాల్లో నిల్వజేయించాలి. కరవు కాలంలో ఆ గింజలను ప్రజలకు పంచి పెట్టాలి. అలాచేస్తే దేశం కరువుకి బలికాకుండా వుంటుంది. యోసేపు తన సొంత శక్తితో కాక దైవజ్ఞానంతో ఈ కలలకు అర్థం చెప్పాడు –41,16. ఇక్కడ ఏడు అంటే కచ్చితంగా ఏడేండ్లని అర్థంకాదు. కొంతకాలంపాటు అని మాత్రమే భావం.

యోసేపు వ్యాక్యానమూ సలహా చక్రవర్తికీ అతని కొలువుకాళ్లకూ నచ్చాయి. ఫరో అతన్ని దైవప్రబోధితుడు అని మెచ్చుకొన్నాడు. అతడు దేవునియాత్మ తనయందు కలవాడు –41,38. ఫరో అతనికి మించిన వివేకి ఉపాయశాలి లేదని యెంచి కరవు కాలానికి ధాన్యాన్ని నిల్వచేసే అధికారాన్ని అతనికే ఒప్పజెప్పాడు. అతన్ని

దేశంలో తన తర్వాత రెండవ అధికారిని చేసాడు. ఈలా దైవబలం వల్ల ఒక హీబ్రూ బానిస ఈజిప్టుకి ప్రధానమంత్రి అయ్యాడు. బిచ్చగాడు అందమెక్కినట్లు ఐంది.

ఇక్కడ ఫరో యోసేపుని సత్కరించిన తీరును జాగ్రత్తగా గమనించాలి. అతడు తన రాజాంగుళీయాన్ని యోసేపుకి ఇచ్చాడు. అది రాజు ముద్ర. కనుక సర్వాధికారాన్ని సూచిస్తుంది. అఈతనికి దువ్వలువలు ఇచ్చాడు. ఇవి ఆదేశంలో ప్రముఖులు ధరించేవి. యోసేపు తన బట్టను పూర్వం పోతీఫరు భార్య చేతుల్లో పోగొట్టుకొన్నాడు కదా! ఇప్పుడు దానికి మించిన రాజవస్త్రాలు లఅభించాయి. ఫరోయిచ్చిన బంగారు గొలుసు కూడ ఏదో అధికారాన్ని హోదానీ సూచిస్తుంది. ఇంకా ఫరో అతన్ని తనరథానికి సాటియైన రథాన్నెక్కించి వాడవాడల త్రిప్పించాడు. రాజభటులు ఆ రథంముందు నడుస్తూ ప్రక్కకు తొలగండని ప్రజలకు హెచ్చరికలు చేశారు. ఫరో అతనికి జఫెనత్పానెయా అని పేరు పెట్టాడు. దైవబలంతో జీవించేవాడని ఆ పేరుకి అర్థం. అతనికి హెలియోపొలిస్ నగర దేవాలయపు పూజారియైన పోతీఫెర కుమార్తెనిచ్చి పెండ్లిచేసాడు. ఈ నగరంలో సూర్య దేవత దేవాలయం ఉండేది. ఈజిప్టు ప్రధాన దేవత సూర్యుడే. ఈ పూజారికి దేశంలో గొప్ప పలుకుబడీ, రాజకీయ ప్రాబల్యమూ వుండేవి. అనగా యోసేపుకి ఆ దేశపు ప్రధానాధికారులతో బంధుత్వం కుదిరిందని భావం. పోతీఫెర అంటే సూర్యదేవత వరమని అర్థం. యోసేపు భార్యపేరు ఆస్నెతు. అనగా ఆమె నెతో అనే దేవతకుచెందిందని భావం. ప్రధానమంత్రి పదవిని పొందేనాటికి యోసేపుకి 30 ఏండ్లు. అది నిండు యౌవనం.

పెద్ద పదవుల్లోకి రాగానే చాలమందికి తలతిరుగుతుంది. ఆరోజుల్లో ఈజిప్టు ప్రపంచంలోకెల్ల అభివృద్ధి చెందినదేశం. యోసేపుకి ఆ దేశంలో అత్యున్నత పదవి లభించింది. ఐనా అతనికి పొగరెక్కలేదు. అతడు పూర్వం కామశోధనను జయించినట్లే ఇప్పుడు గర్వాన్ని గూడ జయించాడు. తాను కష్టాల ద్వారా పైకొచ్చిన వాడు. ఆ శ్రమలు అతనికి ఓర్పు, వొళ్లొంచి పనిచేయడం, వినయం, కృతజ్ఞత మొదలైన సుగుణాలను నేర్పాయి. ఇంకా అతడు దైవబలంతో విజయాలు సాధించినవాడు. కనుక అతడు ఈజిప్టులో ప్రధానమంత్రి ఐన పిదపగూడ ఆ దైవబలంపైనే ఆధారపడి పనిచేసాడు. దేవునిపట్ల భయభక్తులు చూపడం విజ్ఞానానికి మొదటిమెట్టు –సామె 1,7. యోసేపులో ఈ గుణం ప్రబలంగా కన్పిస్తుంది.

అతడు దేవుని ప్రణాళికను చక్కగా అర్థంజేసికొన్నాడు. పూర్వం అన్నలు తన్ను ద్వేషించడం ఒకవిధంగా మంచిదేఐంది. తాను ఈజిప్టులో బానిసగా అమ్ముడు పోవడమూ అక్కడ చెరలో త్రోయబడ్డమూ మేలేఐంది. ఈ కష్టాలే లేకపోతే అతడుఇప్పుడు ప్రధానమంత్రి

అయ్యేవాడు కాదు. బాల్యం నుండి దేవుని హస్తం తన్ను నడిపిస్తూంది. దైవసహాయం వల్లనే తానింతటివాడు అయ్యాడు. ఆ ప్రభువుకి తాను ఎల్లవేళలా రుణపడి వుండాలి.

యోసేపు రాజ్యమంతటా తిరిగి చూచి పరిస్థితులను క్షుణ్ణంగా అర్థంచేసికొన్నాడు. రాజకార్యాలను చాకచక్యంగా నిర్వహించాడు. ఈజిప్టూ దాని పరిసర దేశాల ప్రజలూ ఏడేండ్లు కరవుకోరల్లో చిక్కుకొని విలవిల్లాడిపోయారు. అతడు కొట్లు తెరపించి తాను ప్రోగుజేయించిన ధాన్యాన్ని ఎల్లరికి అమ్మించాడు. అతని చలువ వల్ల ప్రజలంతా పిడికెడు తిండితిని బ్రతికిపోయారు. అతడు భూసంస్కరణలు కూడ చేయించాడు. కరవులో చిక్కిన రైతులందరు తమ పొలాలను ఫరోకు అమ్మి ధాన్యం కొన్నారు. ఈరీతిగా ఈజిప్టు లోని భూములన్నీ రాజు పరమయ్యాయి. ఈజిప్టీయులు తమరాజుని దైవావతారంగా భావించారు.

యోసేపు పరిపాలనాదక్షుడు. ప్రజలను న్యాయసమ్మతంగా పరిపాలించడానికి కావలసిన వివేకమూ ఉపాయమూ కలవాడు. ఈ వరం కొరకే తర్వాత సోలోమోనురాజు దేవుణ్ణి ప్రార్థించాడు −1రాజు 3,9. యోసేపుని చూచి యిస్రాయేలు పాలకులు దేశాన్ని దక్షతతో పాలించాలని రచయిత భావం.

## సోదరులు మొదటిసారి యోసేపుని సందర్శించడం

కనాను దేశంలో కూడ కరవు వచ్చింది. యోసేపు సోదరులు ధాన్యం కొరకు ఈజిప్టుకి వచ్చి అక్కడ అధికారిగా వున్న తమ్మునికి దండంపెట్టారు. అన్నలు అతన్ని గుర్తుపట్టలేదు. తమ్ముడు మాత్రం అన్నలగు గుర్తుపట్టాడు. పూర్వం అన్నలు తన్ను బానిసగా అమ్మివేసి ఇప్పటికి పదేండ్లయింది. ఇంత కాలమయ్యాక వాళ్ళు తమ్ముని గుర్తించకపోవడం సహజమే. అతడు అన్నలు తనకు చేసిన ద్రోహానికి వారికి పశ్చాత్తాపం పుట్టించాలను కొన్నాడు. ఇందుకు చాలయెత్తులు పన్నివారిని ఇరుకుల్లో పెట్టాడు. మొదట వారితో పరుషంగా మాటలాడాడు. మీరు గూఢచారులు. మా దేశపు దుర్గాల గుట్టు తెలిసికోవాలని వచ్చారు అన్నాడు. వారిని మూడునాళ్లపాటు చెరలో త్రోయించాడు. వాళ్ళు లబోదిబో మొత్తుకొని తమకుటుంబ పరిస్థితులను తమ్ముని ముందు ఏకరువు పెట్టారు. తమ ముసలితండ్రి యాకోబుని గూర్చి చెప్పారు. తమ కడగొట్టు తమ్ముడు బెన్యామీనును గూర్చి వివరించారు. యోసేపు మీరు చెప్పేది నిజమైతే మీ తమ్ముడు బెన్యామీనుని ఇక్కడికి తీసుకుని రండి. అప్పటిదాకా మీలో వొకడు ఇక్కడ చెరలో వుండాలి అన్నాడు. షిమ్యోనుని బంధించి కారాగారంలోవుంచి తతిమ్మా సోదరులను ధాన్యాన్ని తీసికొని వెళ్లమన్నాడు. దానితో అన్నలకు పశ్చాత్తాపం కలిగింది. వాళ్ళు పూర్వం తాము యోసేపుకి చేసిన ద్రోహానికి చింతించారు. "మనం పూర్వం తమ్మునికి కీడు చేసాం. ఇప్పుడు వాడి ఉసురు

కొట్టింది" అనుకొని బాధపడ్డారు -42,21. సోదరులు యోసేపుని కలసికోవడం హృదయాన్ని కదిలించే సంఘటనం. బైబుల్లోని గొప్పఘట్టాల్లో వొకటి.

అన్నలు తాము కొన్న ధాన్యానికి చెల్లించవలసిన సొమ్మును యోసేపు వారివారి గోతాలలోనే పెట్టించాడు. అతడు సోదరులకు దారిబత్తాలు ఇప్పించాడు. కనుక వారికి దారిలో గోతాలను విప్పవలసిన అవసరం కలగలేదు. ఇంటికి వెళ్లి సంచులు విప్పగా ఎవరి డబ్బుల మూట వారి సంచుల్లోనే కన్పించింది. అది చూచి వాళ్లు వణకిపోయారు. ఈజిప్టు అధికారి వాళ్లతో పరుషంగా మాటలాడి వారిని చెరలో త్రోయించాడు కదా! అలాంటివాడు తమ సొమ్మును తిరిగి ఇచ్చివేస్తాడా? ఇక్కడ యేదో కుట్రవుండాలి అనుకొని భయపడ్డారు. దిగులు చెందారు -42,35.

## రెండవసారి సోదరులు యోసేపుని దర్శించండం

సోదరులు మొదటిసారి తెచ్చుకొన్న ధాన్యం ఐపోయింది. వాళ్ళు రెండవసారి ధాన్యానికి వచ్చారు. యాకోబు చాల అనిష్టంగానే బెన్యామీనును వాళ్లవెంట పంపాడు. అదీయూదా కడగొట్టు తమ్మునికి పూటపడిన తరాతనే. బెన్యామీను రాహేలుకి పుట్టిన వాడు కనుక యోసేపుకి సొంత తమ్ముడు. ఇతడు పుట్టగానే తల్లి చనిపోయింది.ఇతడు యోసేపు ఇల్లు వీడివచ్చిన తర్వాత పుట్టాడు. కనుక అతడు తమ్ముణ్ణి చూడ్డం ఇదే మొదటిసారి. అతన్ని చూడగానే యోసేపుకి కన్నుల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. వెలుపలికి వెళ్లి వెక్కివెక్కి యేడ్చాడు. ఈలాంటి గొప్పఘట్టాలు ఈ కథలో చాలవున్నాయి -43,30.

యోసేపు అన్నలకు ఇంకా యెక్కువ పశ్చాత్తాపం పుట్టింపగోరాడు. అతడు తాను పానీయం సేవించే గిన్నెను బెన్యామీను గోతంలో పెట్టించాడు. సోదరులు ధాన్యం తీసికొని నగరంవీడి పొలిమేర వరకు వెళ్లాక వారి గోతాలు సోదాచేయించాడు. బెన్యామీనుపై నేరంమోపి అందరినీ తిరిగి తన చెంతకు రప్పించాడు. మేలుచేసిన వారికి కీడు చేస్తారా అని వారిని చీవాట్లు పెట్టాడు. ఈ సందర్భంలో యూదా యోసేపుకి చేసిన మనవి ఒక్క బైబుల్లోనే కాక ప్రపంచ సాహిత్యంలోనే మణిపూసలాంటిది. పాఠకులు ఈ ఘట్టాన్ని పలుసార్లు చదువుకోవాలి -44,16-34.

## యోసేపు తన్ను ఎరుక పరచుకోవడం

బెన్యామీను గోతంలో దొరికిన గిన్నె కారణంగా సోదరులు ఇరకాటంలో పడి బిక్కమొగం వేసికొని నిలబడ్డారు. యూదా కడగొట్టు తమ్మునికి తాను పూటపడతాననీ, అతనికి బదులుగా తాను చెరలో వుంటాననీ, తమ్ముని తండ్రివద్దకు పంపివేయమనీ విన్నవించుకొన్నాడు. యోసేపు దుఃఖం ఆపుకోలేకపోయాడు. అతడు సేవకులందరినీ

ఆవలకు పంపివేసి సోదరులకు తన్నుతాను తెలియజేసికొన్నాడు. నేనే మీ తమ్ముడు యోసేపునని చెప్పాడు. ఎప్పుడో గతించాడనుకొన్న సోదరులు అతన్ని చూచి దిగ్భ్రాంతి చెందారు. యోసేపు దైవలీలలను వారికి వివరించాడు. మీరు నన్ను బానిసగా అమ్మివేసి నందుకు చింతించకండి. మీ ప్రాణాలను నిలబెట్టడానికి మీకు ముందుగా దేవుడే నన్నిక్కడికి పంపాడు. నన్ను ఈజిప్టుకి ప్రధానమంత్రిని చేసింది భగవంతుడే అని చెప్పాడు -44,3-8. ఈ పలుకులను బట్టే యోసేపు గొప్పతనాన్నీ ఉదారగుణాన్నీ అర్థం చేసికోవచ్చు. ప్రాచీన కాలపు రాజులు అధికారంలోకి రాగానే పూర్వం తమకు ద్రోహం చేసినవాళ్లను పట్టి చంపివేసేవాళ్ళు. ఆలాగే యిక్కడయోసేపు కూడ అన్నలకు శిక్షించివుండవచ్చు. కాని అతడు అన్నల ద్రోహంలో దేవుని హస్తాన్ని చూచాడు. అన్నల ద్వారా దేవుడే తన్ను ఈజిప్టుకి పంపాడని యెంచాడు. దైవకటాక్షాన్ని తలంచుకొని అన్నలను పూర్తిగా క్షమించాడు. అతని దైవభక్తీ విశ్వాసమూ మెచ్చుకో దగినవి కదా! - 44,5-8. సోదరులు యోసేపుకి ద్రోహంచేసినా అతడు వారికి రక్షకుడై వారిని క్షమించాడు. ఈ దృష్టితో చూస్తే అతడు క్రీస్తుప్రభువు వంటివాడు. అతడు చాలమందికి ప్రాణదాత అయ్యాడు. పానీయవాహకుని ప్రాణాలు కాపాడాడు. తన అన్నల ప్రాణాలు రక్షించాడు. ఈజిప్టు ప్రజల ప్రాణాలు నిలబెట్టాడు.

యాకోబు కుటుంబం ఈజిప్టుకి రావడం

యోసేపు తన కుటుంబానికంతటికీ రక్షకుడయ్యాడు. అతడు తన తండ్రిని కుటుంబ సమేతంగా ఈజిప్టుకి రప్పించుకొన్నాడు. ఆ కుటుంబంవాళ్ళు మొత్తం 70 మంది ఫరో అనుమతిపై ఈజిప్టులో సారవంతమైన గోషెను మండలంలో వారికి నివాసం కల్పించాడు. యాకోబు యోసేపు ఇద్దరు కొడుకులనూ దత్తుతీసికొన్నాడు. వారు ఎఫ్రాయీము మనష్షే అనేవారు. తర్వాత యూదులు లేవీగోత్రాన్ని లెక్కలోకి తీసికోలేదు. ఈ యిద్దరు కుమారులతో కలసి యిస్రాయేలు గోత్రాలు 12 అయ్యాయి. యోసేపు మాత్రం గోత్రకర్త కాలేదు.

యాకోబు చనిపోకముందు కొడుకులనూ మనుమలనూగూడ దీవించాడు. తండ్రి తాతల ఆశీస్సులు ఫలిస్తాయని పూర్వుల నమ్మకం. అతడు తన్ను కనాను దేశంలోనే పాతిపెట్టాలని యోసేపుచే వాగ్దానం చేయించుకొని ప్రాణాలు విడిచాడు. ఆ కుమారుడు తండ్రిని కనానులోని మక్పేలా శ్మశానంలోనే పాతిపెట్టాడు. పూర్వం అబ్రాహాము ఈసాకులను కూడ అక్కడే ఖననం చేసారు. యిస్రాయేలు ప్రజలకు కనానుదేశం పవిత్రమైంది. అది దేవుడు వారికిచ్చినభూమి. కనుక వారిని అక్కడే భూస్థాపనం చేయాలి.

## సోదరుల బెదరు

యాకోబు చనిపోయాక సోదరులకు బెదరుపుట్టింది. తప్పుచేసినవాళ్ళు ఊరికే వులిక్కిపడతారు కదా! వాళ్లు తాము పూర్వం యోసేపుకి చేసిన అపకారానికి అతడు తమపై పగతీర్చుకొంటాడేమోనని భయపడ్డారు. కనుక వాళ్లు ఓ కథ అల్లుకొని వచ్చారు. మన తండ్రి చనిపోకముందు నీకీ వర్తమానం తెలియజేయమన్నాడు. "నీ సోదరులు తెలిసో తెలియకో నీకు కీడుచేసారు. నీవు వాళ్లను క్షమించి వదలివేయి." ఈ మాటలు విని యోసేపు మనసు నొచ్చుకొన్నాడు. అతడు వారితో "మీరు నాకు కీడు తలపెట్టారు. కాని దేవుడు ఆ కీడును మేలుగా మార్చాడు. నన్ను మీకంటె ముందుగా ఇక్కడికి పంపి ఈ కరవుకాలంలో నేను మీ ప్రాణాలనూ, ఇంకా చాలమంది ప్రాణాలనూ నిలబెట్టేలా చేసాడు. కనుక జరిగినదానికి మీరేమీ బాధపడకండి. నేను మిమ్మూ మీ బిడ్డలనూ తప్పక కాపాడతాను" అన్నాడు -50,15-21. ఈ పలుకులు ఓ నరమాత్రుడు కాక దేవుడే పలికాడేమో అనిపిస్తుంది.

ఈ కథ సందేశమంతా ఈ చివరి సంఘటనంలో ఇమిడివుంది. ఇతరులు మనకు చెడ్డచేసినా దేవుడు ఆ చెడ్డను మంచిగానే మారుస్తాడు. మన తరఫున మనం దేవుణ్ణి నమ్మి జీవిస్తే చాలు. దేవుణ్ణి నమ్మినవాళ్లకు అన్నీ అనుకూలంగానే జరిగిపోతాయి -రోమా 8,28

ఇంకా మనకు జరిగే సంఘటనలన్నిటిలోను దేవుని హస్తం వుంటుంది. మొదటలో మనం అతని ప్రమేయాన్ని గుర్తించలేం. కాని క్రమేణ అతని హస్తాన్ని గుర్తిస్తాం. అతని అనుమతి లేందే ఆ సంఘటనం అలా జరిగివుండదని అర్థం చేసికొంటాం. ఆలా అర్థంచేసికొన్న వెంటనే ఆ ప్రభువుకి వందనాలు చెప్పుకోవాలి. యోసేపు చేసింది ఇదే. నూత్నవేదంలో నానా పునీతులు చేసిందికూడ యిదే. నేడు మనమూ ఈలాగే చేయాలి.

యోసేపు దొడ్డ గుణాలు కలవాడు. యాకోబు కుటుంబంలో మొదటినుండి అంతఃకలహాలు వున్నాయి. యాకోబుకీ యేసావుకీ పడదు. యాకోబుకీ అతని మేనమామ లాబానుకీ పడదు. అన్నలను క్షమించి పూర్వవైరాన్ని తొలగించాడు. యాకోబు కుటుంబ మంతా ఇక యాజిప్టులో కలసిమెలసి సమాధానంగా జీవించవచ్చు. ఇక వాళ్ల భవిష్యత్తుని వాళ్లే తీర్చిదిద్దుకోవచ్చు. ఈ విధంగా యోసేపు కుటుంబశాంతిని పెంపొందించాడు. అది అతనిలోని దివ్యగుణం.

యోసేపు ఈజిప్టులో 110 యేండ్లు జీవించాడు. అది నీతిమంతుల ఆయుస్సు. అతడు చనిపోకముందు సోదరులను ఒక కోరిక కోరాడు. దేవుడు మిమ్ము ఈ దేశంనుండి మళ్లా కనాను మండలానికి తీసికొని పోతాడు. అప్పుడు నా యస్థులను మీ వెంట కొనిపొండి అని చెప్పాడు -50,25. దేవుడు పితరులకు ప్రమాణం చేసింది ఈజిప్టు కాదు కనానుదేశం. ఈజిప్టు వారికి తాత్కాలిక నివాసం మాత్రమే. కనుకనే యోసేపు తన అస్తులను ఆ దేశంలో పాతిపెట్టమని కోరాడు. ఇక్కడ అతడు ఓ ప్రవక్తలా మాట్లాడాడు. తర్వాత మోషేకాలంలో యిస్రాయేలీయులు ఈజిప్టునుండి వెడలిపోయి నపుడు ఆ పుణ్యపురుషుని ఆస్థులను గూడ తమవెంట తీసికొని పోయారు- నిర్గ 13,19.

## గుణపాఠాలు

యోసేపు కథనుండి మనం నేర్చుకోవలసిన పాఠాలు చాలవున్నాయి.

1. అతడు దేవుణ్ణి నమ్మినవాడు, దైవభక్తుడు. నానాకష్టాలద్వారా దేవుడే తన్ను ఈజిప్టుకి కొనివచ్చి అక్కడ ప్రధానమంత్రిని చేసాడని అతని నమ్మకం - 45,7. తనకు ఎదురైన కీడులన్నింటిని దేవుడు మేలుగా మార్చాడని గూడ అతని విశ్వాసం -50,20.
2. అతడు చాల పరీక్షలకు శ్రమలకు గురయ్యాడు. కాని దేవుడు అతన్ని ఆ కష్టాల నుండి గట్టెక్కించాడు.
3. యోసేపులోని దొడ్డగుణం క్షమాబుద్ధి. అతడు తనకు అపకారం చేసిన అన్నలను క్షమించాడు. ఈజిప్టులోని సారవంతమైన ప్రదేశంలో వారికి వసతి కల్పించాడు.
4. అతడు సమర్థుడైన పాలకుడు. నీతినిజాయితీలు కలవాడు. కరవు కాలంలో స్వదేశీయులు విదేశీయుల అక్కరలు కూడ తీర్చి అందరిప్రాణాలు కాపాడినవాడు.

యోసేపులాగ దైవభక్తిరి అలవర్చుకొన్నవాళ్లకు మేలు కలుగుతుంది. వాళ్లకు జీవితంలో కష్టాలు రాకపోవు. కాని ఆ శ్రమలనుండి ప్రభువే వారిని ఒడ్డు జేరుస్తాడు. యోసేపు పదిమందికి ఆదర్శంగా వుండాలన్న ఈ కథను బైబులునుండి పలుసార్లు పారాయణం చేయడం మంచిది. భక్తుల జీవితాలు మనం కూడ వారి అడుగుజాడల్లో నడచిపోయేలా చేస్తాయి.

# 5. నిర్గమం

బైబులు భాష్యం - 36

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | యావే దివ్యనామం | 73 |
| 2. | ప్రభువు విమోచకుడు | 76 |
| 3. | పాస్క | 79 |
| 4. | యుద్ధమూ, సముద్రోత్తరణమూ | 82 |
| 5. | నిబంధనం | 86 |
| 6. | ఎడారి | 90 |
| 7. | సాన్నిధ్యం | 95 |
| 8. | మహానాయకుడు మోషే | 98 |
| 9. | ఆదిపంచకమూ, నాల్గు సంప్రదాయాలూ | 101 |


## 1. యావే దివ్యనామం

### 1.యావే ఉండేవాడు

యిస్రాయేలు ప్రజలకు యావే అంటే మహాగౌరవం. భయంకూడాను అందుచేత అతని పేరుకూడా ఉచ్చరించేవాళ్ళు కాదు. పూర్వవేదంలో యావే అనేపేరు వచ్చినపుడెల్లా వాళ్ళు "అదొనాయి" అనిచదివేవాళ్ళు. అదొనాయి అనే అరమాయిక్ మాటకు ప్రభువు అని అర్థం. కనుక యావే అంటే కూడ ప్రభువు అనే అర్థమే రూఢమైపోయింది. గ్రీకు లాటిను అనువాదాలు కూడ యావే అనేమాటకు ఈ యర్థాన్నే స్వీకరించాయి. కాని యావే అనే పేరునకు ప్రభువు అని అర్థం కాదు. మరేమిటి?

నిర్గమకాండ 3,14లో యావే మోషేతో "యేహ్యే అషేర్ యేహ్యే" అంటాడు. ఈ హీబ్రూ మాటలకు "నేను ఏ వున్నవాడనో అతనినే" అని భావం. "హయ్యా" లేక "హవ్వా" అనే హీబ్రూ ధాతువునుండి "యేహ్యే" అనే క్రియారూపం ఏర్పడుతుంది. హయ్యా అంటే ఉండడం లేక అవడం. కనుక ఈ మూలధాతువు నుండి పుట్టే యావే అనే శబ్దానికి "ఉండేవాడు" లేక "అయ్యేవాడు" అని భావం. కాని ఏమి వుండడం?

### 2. రక్షణాత్మకంగా ఉండేవాడు

నరుడు నరునితో ఉంటుంటాడు. నరుడు నరుని ప్రక్కనే కూర్చుండి మాటలాడతాడు. కాని నరుని ఉనికివలన నరునికి కీడూ కలుగదు. మేలూ కలుగదు.

కాని దేవుని ఉనికి అలాకాదు. హీబ్రూ సంప్రదాయంప్రకారం పేర్లు వ్యక్తిని వర్ణిస్తాయి. కనుక దేవుని పేరుకూడ అతని వ్యక్తిత్వాన్ని వర్ణించాలి. యావే అంటే ఉండేవాడు అన్నాం. ఎలా వుండడం? నిద్రాణంగా కాదు. శక్తిమంతంగా ఉండడం. క్రియాత్మకంగా, రక్షణాత్మకంగా ఉండటం కనుక యవే అంటే నరుల సన్నిధిలో ప్రత్యక్షమై ఉండేవాడు నరుల కొరకు కృషిచేసేవాడు నరులను కాచికాపాడేవాడు నిర్గమ 7:5లో ప్రభువు "ఐగుప్తీయులు నేను యావేనని తెలిసికొంటారు." అంటాడు. అనగా అతడు యిస్రాయేలు ప్రజలకు ప్రత్యక్షమైవుండేవాడు. శక్తితో వాళ్ళను కాపాడేవాడు అని భావం.

ఈ ప్రభువు క్రియాశక్తి తన ప్రజను రక్షిస్తుంది. ఆ ప్రభువు పథకానికి అడ్డుపడే శత్రుప్రజను శిక్షిస్తుంది. నిర్గమ 3,14లో ప్రభువు మోషేతో "ఉండేవాడు నన్ను మీ యొద్దకు పంపాడు" అని యిస్రాయేలు ప్రజలకు చెప్పమంటాడు. అనగా రక్షించడానికి శిక్షించడానికి కూడ సమర్థుడైయున్నవాడు నన్ను మీ యొద్దకు పంపాడు అని భావం. ఆ ప్రభువు యిస్రాయేలీయులను రక్షించేవాడు. ఐగుప్తీయులను శిక్షించేవాడు.

3. స్వేచ్ఛగా ఉండేవాడు

3,14లో యావే మోషేతో నేను 'ఏ వున్నవాడనో అతనినే' అంటాడు. ఈ మాటలకు ప్రభువు ఎక్కడ తలంచుకుంటే అక్కడే, ఎప్పుడు తలంచుకుంటే అప్పుడే ఎవరికి తలంచుకుంటే వారికే ప్రత్యక్షమై వుంటాడని భావం. యావే స్వేచ్ఛగా వుండేవాడు. స్వేచ్ఛగా మెలిగేవాడు. నరులు అతనిని నిర్బంధింపలేరు. 3,13లో మోషే యావే పేరు అడుగుతాడు. హీబ్రూ సంప్రదాయంప్రకారం ఒక వ్యక్తి పేరు తెలిసికొనడమంటే ఆ వ్యక్తిని స్వాధీనం చేసికోవడమే. ఈలాగే మానోవా దేవదూత పేరు అడుగుతాడు (న్యాయా 13,17). యాకోబు దేవదూత పేరు అడుగుతాడు (ఆది 32,29), కాని ఈమూడు సందర్భాల్లోను అడుగబడిన వ్యక్తులు తమ పేరులు తెలియజేయలేదు. అనగా యావే నరునికి స్వాధీనం కావడానికి అంగీకరింపరు.

ఫిలిస్తీయులు, కనానీయులు మొదలైన అన్యజాతి ప్రజలు దేవాలయాలు పీఠాలు విగ్రహాలు నిర్మించి తాము కొలిచే దేవుణ్ణి వీటిల్లో బంధింపజూచారు. అతనిచే తమ ఇష్టం వచ్చిన పనిచేయించుకోగోరారు. కాని యావే అలా బంధింపబడడు. అతడు స్వేచ్ఛగా మెలిగేవాడు. అందుకే కీర్తన 115,3 "మా దేవుడు సమస్తము తన ఇష్టం వచ్చినట్లు చేస్తాడు" అంటుంది. యావే విగ్రహాలలాంటివాడు కాడు. అతడు స్వేచ్ఛగా యిస్రాయేలును ఎన్నుకున్నాడు. స్వేచ్ఛగానే యిస్రాయేలును రక్షిస్తాడు.

### 4. చలనాత్మకంగా వుండేవాడు

నిర్గమ 12,12లో యావే మోషేతో "నేను ఐగుప్తుదేశంలో సంచరిస్తాను" అంటాడు. 33,22లో యావే మోషేకుముందుగా సాగిపోతాడు. 34,6లో అతడు మోషేకు ముందుగా దాటివెళ్తూ తననామాన్ని ప్రకటిస్తాడు. ఈ సందర్భాలన్నీ యావే కదలికలను వర్ణిస్తాయి. కనుక అతడు చలనాత్మకమైన దేవుడు. క్రియాపరుడు, తన ప్రజలకొరకు కృషిచేసేవాడు. అతని కృషే రక్షణం.

నాటి కనానీయులు, ఫిలిస్తీయులు వాళ్ళదేవుళ్ళ విగ్రహాలను మోసికొని పోయారు. ఆ భక్తులు లేకుంటే ఆ దేవుళ్ళు కూడ లేదరు. కాని యావే అలాకాదు. అతన్ని ప్రజలు మోసికొని పోరుగదా, అతడే తన ప్రజలను మోసికొని పోతాడు. అందుకే యెషయా ప్రవచనంలో ప్రభువు యిస్రాయేలు నుద్దేశించి "మీరు గర్భంలో ఏర్పడినది మొదలుకొని నాచేత భరింపబడినవాళ్లు. ముదిమి వచ్చిందాక, తలవెంట్రుకలు నరసిందాక, మిమ్ము ఎత్తుకొనేవాడను నేనే" అంటాడు (యెషయా 46,3-4)÷. ఈ మోసికోవడమే, ఈ ఎత్తుకోవడమే రక్షించడం. ఫలితార్థ మేమిటంటే, యావే యిస్రాయేలును రక్షించేవాడు. అతని అస్తిత్వం రక్షణాత్మకమైంది.

### 5. క్రీస్తు ఉండేవాడు

ఇక నూతనవేదంలో మన రక్షణాత్మకమైన అస్తిత్వం క్రీస్తే. కనుకనే అతడు "నేను ఉండేవాడను" అంటాడు (యోహాను 18,4-8). అనగా యావే పూర్వవేద ప్రజలతో ఉండినలాగే క్రీస్తు నూతనవేద ప్రజలతో నెలకొని ఉండేవాడు. అతడు మన ఇమ్మానుయేలు (మత్త 1,22).

### 6. యావే – యెహోవా

పూర్వ హీబ్రూ లిఖిత ప్రతుల్లో వాడబడిన హీబ్రూ లిపిలో హల్లులే గాని అచ్చులు ఉండేవికావు. దేవునిపేరు ఆ ప్రతుల్లో "య్ హ్ వ్" అని వ్రాయబడివుండేది. ఈ పేరును హీబ్రూ ప్రజలు అసలు ఉచ్చరించేవాళ్ళే కాదు. దానికి మారుగా "అదొనాయి" అని ఉచ్చరించేవాళ్లు అన్నాం. కాని అసలు దాన్ని ఉచ్చరించేటపుడు ఏలా వుచ్చరించేవాళ్లో ఎవ్వరికీ తెలియదు. యెహోవా అని ఉచ్చరించేవాళ్లు కాబోలు అనుకొని ప్రాచీన అనువాదాలు "యెహోవా" లేక "జెహోవా" అని అనువదించాయి. ప్రోటస్టెంటు తెలుగు బైబులు కూడ ఈలాగే అనువదించింది. కాని ఇటీవలి పరిశోధనల వల్ల యూదులు దేవుని పేరు ఉచ్చరించేటపుడు "యాహ్వే" అని ఉచ్చరించేవాళ్లని తెలియవచ్చింది. కనుక నేటి బైబులు విద్వాంసులంతా ఈ పేరును "యాహ్వే" లే "యావే" అని ఉచ్చరిస్తారు. కనుక మనంకూడ "యావే" అని ఉచ్చరించడం సమంజసం.

## 2. ప్రభువు విమోచకుడు

విమోచనం బైబుల్లో ఓ పెద్ద భావం. ఇది ఐగుప్తున యూదుల బానిసం సందర్భంలో ప్రారంభమౌతుంది. పూర్వవేదమంతట కన్పిస్తుంది. నూత్నవేదంలోను గోచరిస్తుంది. ప్రస్తుత వ్యాసంలో ఈ భావాన్ని కొంచెం విపులంగా పరిశీలించి చూద్దాం.

### 1. విమోచకుడు

విమోచకుడు అంటే ఆపదనుండి విడిపించేవాడు లేక రక్షించేవాడు అని అర్థం. ఇతడు దగ్గరి చుట్టం, తన బంధువులకు మేలు చేసేవాడు. హీబ్రూ భాషలో ఇతన్ని "గోయెల్" అనేవాళ్లు.

పూర్వవేదంలో విమోచకుడు మూడు పనులు చేసిపెట్టేవాడు 1) యూదుల్లో ఎవరైనా పేదవాళ్లయిపోయి తమ ఆస్తిని కోల్పోతే వాళ్ళదగ్గరి చుట్టమయిన విమోచకుడు మళ్లా వాళ్ళకు ఆ యాస్తిని సంపాదించి పెట్టేవాడు. అనగా అతడు ఆ పొలాన్ని మళ్లా కొని దాన్ని సొంతదారులకు ముట్టజెప్పేవాడు -లేవీ 25,25. 2)ఆలాగే యూదుల్లో ఎవరైనా బానిసలై పోతే దగ్గరిచుట్టమయిన విమోచకుడు వాళ్ళను ఆ బానిసాన్నుండి విడిపించేవాడు -లేవీ 25,47-49. యావే ఈ రెండవ అర్థంలో విమోచకుడు ఔతాడు. 3) ఎవరినైనా శత్రువులు చంపివేస్తే ఆ చంపబడినవారి దగ్గరి చుట్టం విమోచకుల్లాగ ప్రవర్తించి శత్రువుల మీద పగతీర్చుకోవాలి -సంఖ్యా 35,19. ఇవి ప్రాచీన యూద సమాజంలో ప్రచారంలో వున్న భావాలు.

### 2.యావే విమోచకుడు

ఇక యావే ఐగుప్తులోని యిస్రాయేలు ప్రజలపట్ల విమోచకుల్లాగ మెలిగాడు - నిర్గ 6,6. కీర్త 77,15. ఏలాగ? యిస్రాయేలీయులను ఫరో చక్రవర్తి బానిసలనుగా ఏలుతున్నాడు. వాళ్ళను ముప్పుతిప్పలు పెడుతూన్నాడు. అప్పుడు ప్రభువుకి ఆ ప్రజల మీద జాలికలిగింది. తాను వాళ్ళకు దగ్గరిచుట్టమయ్యాడు. ఫరో దాస్యాన్నుండి ఆ ప్రజలను విడిపించాడు.

మామూలుగా యిస్రాయేలు విమోచకులు బానిసలుగా అమ్ముడుపోయిన బంధువులను విడిపించడానికి వాళ్ళ యజమానులకు డబ్బు చెల్లించేవాళ్లు. కాని యిస్రాయేలు ప్రజను విడిపించడానికి యావే ఫరోకు సొమ్ము ఏమాత్రమూ చెల్లించ లేదు. ఫరోకు ధనమిచ్చిగాక. అతన్ని అణగద్రొక్కి ప్రభువు యిస్రాయేలును విడిపించుకొని వచ్చాడు. కనుకనే అతడుమోషేతో "ఫరో రాజునీ అతని రథాలనూ అశ్వాలనూ సైన్యాలనూ నాశం చేసి నా మహిమను ప్రదర్శిస్తాను" అంటాడు -నిర్గ 14,18.

ఈ విమోచనం ద్వారానే యిస్రాయేలీయులు యావే ప్రజలయ్యారు. అతనికి యాజకరూపమైన రాజ్యమూ, పవిత్రప్రజలా సొంతజనమూ అయ్యారు -19,5-6. ప్రభువు వాళ్ళను ప్రేమతో ఎన్నుకొన్నాడు గూడ -ద్వితీ 7,6-8.

యూదులకు ఐగుప్తు మొదటి ప్రవాసమైతే బాబిలోను రెండవ ప్రవాసం. కనుక ప్రవక్తలు పై విమోచనాన్ని బాబిలోను ప్రవాసానికి గూడ అన్వయింపజేసారు. కనుకనే యెషయా బాబిలోనులో ఖైదీలుగా వున్నయూదులకు ప్రభువు విముక్తి ప్రసాదిస్తాడని ప్రవచించాడు. ఈ విముక్తి భర్త తాను పరిత్యజించిన భార్యను మళ్ళా చేపట్టినట్లుగా వుంటుందని చెప్పాడు -54,5-10.

ఇంకా కొందరు ప్రవక్తలు ప్రభువు విమోచనాన్ని మెస్సీయా కాలానికి గూడ వర్తింపజేసారు. ఇదే నూత్నవేద విమోచనం. "ఈ దినాలు గడచిన తర్వాత నేను ప్రజల హృదయాల మీద నా యాజ్ఞలు లిఖిస్తాను" అంటాడు యిర్మీయా -31,33-34. పూర్వవేద ఆజ్ఞలు రాతిపలక మీద వ్రాయబడ్డాయి. మెస్సీయా కాలంలో ప్రభువు ఆజ్ఞలు నరుల హృదయాల మీదనే వ్రాయబడతాయి అని భావం. "ఆ రోజుల్లో మీకు నూత్న హృదయాన్నీ నూత్న స్వభావాన్నీ ప్రసాదిస్తాను. మీలోని రాతిగుండెను తొలగించి దానిస్థానే మాంసపుగుండెను నెలకొల్పుతాను" అంటాడు యెహెజ్కేలు -36,26-27. ఇక్కడ రాతిగుండె అవిధేయతకీ మాంసపుగుండె విధేయతకీ చిహ్నాలు. ఈ ప్రవచనాలన్నీ నూత్నవేదంలో క్రీస్తు ప్రసాదించబోయే విమోచనాన్ని సూచిస్తాయి.

### 3. క్రీస్తు విమోచకుడు

యిర్మీయా యెహెజ్కే వంటి ప్రవక్తల ప్రవచనాలు నెరవేరి యేసుప్రభువు విజయం చేసాడు. యావే పూర్వవేద విమోచకుడైతే యేసు నూత్నవేద విమోచకుడు. కనుకనే అతడు "మనుష్యకుమారుడు సేవలు చేయించుకొనడానికి గాదు, సేవలు చేయడానికే వచ్చాడు. అనేకుల రక్షణం కోసం అతడు తన ప్రాణాలను క్రయధనంగా వెచ్చిస్తాడు" అని పల్కాడు -మార్కు 10,45. ఈలా ప్రాణాలను వెచ్చించడమే విమోచనం.

పూర్వవేద విమోచనానికీ నూత్నవేద విమోచనానికీ చాలా పోలికలున్నాయి. అక్కడ ప్రజలు ఫరోకు దాసులు. ఇక్కడ పిశాచానికీ పాపానికీ దాసులు. యూదులు రెల్లుసముద్రం దాటారు. మనం దాటే సముద్రం జ్ఞానస్నానమే. ఆనాడు ప్రభువు సీనాయి కొండమీద యూదులతో నిబంధనం చేసికొన్నాడు. ఈనాడు అతడు

జ్ఞానస్నానం ద్వారానే మనతో నిబంధనం చేసికొంటాడు. యూదులు వాగ్దత్త భూమిలో ప్రవేశించారు. మనం చేరుకొనే వాగ్దత్తభూమి మోక్షమే. అక్కడ ప్రజలను నడిపించిన నాయకుడు మోషే, నూత్నవేద ప్రజలను నడిపించేనాయకుడు క్రీస్తు. యావే ప్రభువు ఫరోకు డబ్బు చెల్లించిగాదు, అతన్ని అణగద్రొక్కి యూదులు విముక్తి కలిగించాడు అన్నాం. అలాగే క్రీస్తుకూడ పిశాచాన్ని ఓడించి మనకు పాపవిముక్తి కలిగించాడు.

## 4. విమోచనం దేనినుండి?

క్రీస్తుమనలను స్వతంత్రులనుగా జేసాడు అన్నాడు పౌలు -గల 5,1. ఈ స్వాతంత్ర్యమే విమోచనం. అనగా ప్రభువు మను పాపదాస్యాన్నుండి విమోచనం ప్రసాదించాడని భావం. పౌలు దృష్టిలో క్రీస్తు మూడు బాధలనుండి మనకు విమోచనం ప్రసాదిస్తాడు.

1. పాపంనుండి : మనం పుట్టుకతోనే పిశాచానికీ పాపానికీ దాసులంగా పుడతాం. క్రీస్తులోనికి జ్ఞానస్నానం పొందడం ద్వారా ఈ దాస్యాన్నుండి విముక్తి చెందుతాం. -రోమా 6,6. కొలో 1,13-14.
2. మరణం నుండి: ఆదాము పాపం ద్వారా నరులందరికీ మరణశిక్ష ప్రాప్తించింది. చావు మనలను బాధించే ముల్లు. కాని క్రీస్తు మరణోత్థానాలద్వారా ఈ ముల్లు తొలగిపోయింది -1కొ 15,56. నేడుకూడ మనకు చావు తప్పదు. కాని దాని విషపరిణామం మాత్రం తప్పిపంచుకొంటాం.
3. ధర్మశాస్త్రం నుండి: పూర్వవేద ప్రజలు ధర్మశాస్త్రానికి దాసులు. దాని నియమాలను పాటించలేక వాళ్లు నానా యాతనలూ అనుభవించారు. నూత్నవేదంలో ఈ ధర్మశాస్త్రం నుండికూడ క్రీస్తు మనకు విముక్తి ప్రసాదించాడు -రోమా 7,6. నేడు మనలను నడిపించేది క్రీస్తు ఆత్మేగాని ధర్మశాస్త్రం గాదు -8,2.

ఈలా క్రీస్తుద్వారా స్వాతంత్ర్యమూ విమోచనమూ పొందిన క్రైస్తవుడు దేవునిపట్ల చనువుతో మెలుగుతాడు. ఇంటిలోని పిల్లలు తండ్రిని జూచి భయపడరు. చొరవతో అతని వద్దకు వెళ్తారు. అలాగే క్రైస్తవుడుకూడ తన్ను విమోచించిన క్రీస్తుద్వారా చనువుతో తండ్రివద్దకు వెళ్తాడు -ఎఫే 3,12. హెబ్రే 4,16. ఈ చనువు భయానికి వ్యతిరేకమైనది పూర్వవేద యూదులు యావే ప్రభువుకి భయపడేవాళ్లు. నూత్నవేద ప్రజలమైన మనం దేవునికి భయపడం. ప్రేమతో, ధైర్యంతో, చనువుతో అతని వద్దకు వెళ్తాం. ఈ చొరవను మనకు ప్రసాదించేది క్రీస్తే.

# 3. పాస్క

"పాస్క" గ్రీకు పదం. దీనికి తుల్యమైన హీబ్రూ పదం "పేసా". హీబ్రూలో ఈ మాటకు "దాటిపోవడం" అని అర్థం. ఆ నాటిరేయి ఐగుప్తులో యావే యిస్రాయేలీయుల యిండ్లను దాటిపోయాడు, ఐగుప్తీయుల ఇండ్లను శిక్షించాడు. నిర్గ 12,13, 23,27. అతడు యిస్రాయేలీయులను దాస్యగృహమైన ఐగుప్తునుండి తరలించుకొని వచ్చాడు. అప్పటినుండి యూదులకు పాస్క పవిత్ర సంఘటనంఅయింది. ఇది ఓ పెద్ద బైబులు భావం. పూర్వవేదలోనేగాక నూత్నవేదంలో కూడ ఈ భావం గోచరిస్తుంది. ప్రస్తుత అధ్యాయంలో ఈ పాస్కపుట్టుపూర్వోత్తరాలను వివరంగా పరిశీలిద్దాం. నిర్గమ కాండం 12వ అధ్యాయం ఈ పండుగను వర్ణిస్తుంది.

## 1. యిస్రాయేలీయుల పాస్క

### 1. మొదటి పాస్క :

యిస్రాయేలీయులు అబీబు నెల 14న ఈ పండుగ చేసికొనేవాళ్లు. ఈ నెలకే నీసాను అనికూడ పేరు. మన కాలమానం ప్రాకరం ఈ నెల మార్చి-ఏప్రిల్ మాసాల్లో వస్తుంది. ఈ పండుగనాడు యూదులు నిర్మలమైన యేడాది గొర్రెపిల్లను బలి యిచ్చాడు -నిర్గమ 12:3-6. ఆ గొర్రెపిల్ల నెత్తురును వాళ్లు ద్వారబంధాలకు పూసికొన్నారు. అలా నెత్తురు పూసిన యిడ్లను ప్రభువు శిక్షింపలేదు. కనుక ఆ రక్తం రక్షణకు చిహ్నమైంది -12,7,22. వాళ్లు గొర్రెపిల్ల మాంసాన్ని కాల్చి తిన్నారు. ప్రయాణం చేసేవాళ్ళలాగ గబగబ భుజించారు -12,8-11. అలా తినేప్పుడు ఒక్క యెముకను గూడ విరగగొట్టలేదు -12,46.

ఇవన్నీ పాస్కపండుగకు సంబంధించిన నియమాలు. కాని ఈ పాస్క ఐగుప్తు నిర్గమనంతో ప్రారంభం కాలేదు. యిస్రాయేలీయుల్లో అంతకుముందే ఈ పండుగ వాడుకలో వుంది. మోషే "మేము మూడునాళ్లు అడవిలో ప్రయాణం చేసి మా దేవుడైన యావేకు పండుగ చేసికోవాలి, కనుక మమ్ము వెళ్ళిపోనీయి" అని ఫరోను అడగబోతాడు -3,18. ఈ పండుగ పైపాస్కే. కాని యీ పండుగ తేదీ యిక్కడ సరిగ్గా యిస్రాయేలీయులు ఐగుప్తునుండి వెడలివచ్చినపుడే వచ్చింది -12,27. ఈ నిర్గమనం ఆ పండుగకు క్రొత్త భావాన్నీ ఎనలేని ప్రాముఖ్యాన్నీ చేకూర్చి పెట్టింది.

## 2. పొంగని రొట్టెల పండుగ

ఇది ఆనాడు యిస్రాయేలీయుల్లో ప్రచారంలోవున్న మరో పండుగ. దీన్ని నీసాను 15-21 తేదీల్లో చేసికొనేవాళ్ళు -12,15-20. కాని యిది పాస్క పండుగ ముగిసిన వెంటనే రావడం వల్ల క్రమేణ ఆ పండుగతో మిళితమైపోయింది. ఈ పండుగ భావం మాత్రం ముఖ్యం. యిస్రాయేలీయులు రొట్టెలను జేసికొనే పిండిలో ముందటిరోజు పిండిని కొంచెము కలుపుతారు. ఇది రొట్టెల పిండి పులియబారేలా చేస్తుంది. రొట్టెలు పొంగేలా చేస్తుంది. కనుక ఇది పులిపిడి ద్రవ్యం. ఐనా యూదుల సంప్రదాయంలో ఈ పులిపిండి పాపానికీ మాలిన్యానికీ చిహ్నం. కనుక రొట్టెల పండుగనాడు దీన్ని వాడకూడదు. అనగా పొగని రొట్టెలనే చేసికోవాలి. పొంగని రొట్టెలు పారిశుద్ధ్యానికి చిహ్నం. ఈ రొట్టెల పంఒడుగకూడ క్రమేణ పాస్కపండుగలో కలసిపోయిందని చెప్పాం. కనుక దానితోపాటు ఇదికూడ ఐగుప్తు నిర్గమనాన్ని సూచిస్తుంది. విశేషంగా యిస్రాయేలీయులు త్వరత్వరగా ఐగుప్తునుండి బయలు దేరి రావడాన్ని గుర్తుకి తెస్తుంది -12,34.

## 3. దేవాలయపు పండుగయైన పాస్క :

యూదులు పాస్కను మొదట ఐగుప్తులో చేసికొన్నారు. తర్వాత యెడారిలో చేసికొన్నారు. అటుతర్వాత పాలస్తీనా దేశంలో స్థిరపడిన పిమ్మట దాన్ని యేటేట దేవాలయపు పండుగగా కొనయాడేవాళ్ళు -ద్వితీ 16,1-8. సున్నతి పొందిన మగవాళ్ళంతా దీనిలో పాల్గొనాలి -12,48. క్రమేణ యూదుల పండుగలన్నిటిలోను ఇది ముఖ్యమైన ఉత్సవమైంది. దాన్ని యెరూషలేములో మాత్రమే చేసికొనేవాళ్ళు. యూదులు ఎక్కడ వసిస్తున్నా ఈ పండుగకు యెరూషలేము నగరానికి యాత్రచేసేవాళ్ళు. ఈ పండుగ నాటిరాత్రి మెస్సీయా విజయం చేస్తాడనే భావంగూడ రానురాను ప్రచారంలోకి వచ్చింది. కనుక ఈ పండుగ నిరీక్షణకు నిలయమయింది. పర పరిపాలనమంటే యిష్టంలేని యూదులు ఈ పండుగ సందర్భంలో రోమను ప్రభుత్వం మీద తిరగబడేవాళ్లు. గలాటా చేసేవాళ్ళు -లూకా 13,1.

## 2. క్రీస్తు - పాస్క

యూదులు ఆశించినట్లుగానే మెస్సీయా రానేవచ్చాడు. యూదులు తొలి పాస్కలో యావే ప్రభువు యిస్రాయేలీయుల ఇండ్లను దాటిపోయాడు. కాని యీ పాస్కలో క్రీస్తు ఈ లోకాన్ని దాటిపోయి తండ్రిని చేరతాడు -యోహా 13,1. ఆ ప్రభువు

శిష్యులతో భుజించిన అంతిమ భోజనం పాస్కభోజనం. ఆ విందులో భుజింపబడిన గొర్రెపిల్ల గూడ అతడే –మార్కు 14,22–24.

కాని యిక్కడ విశేషమేమిటంటే యూదులు క్రీస్తుని నీసాను 14వ తారీఖున వధించారు. ఆ దినం యూదులకు పాస్కపండుగ. అది శుక్రవారం సాయంకాలం. సరిగ్గా దేవాలయంలో పాస్క గొర్రెపిల్లను వధించేపుడు కల్వరి కొండమీద క్రీస్తునికూడ చంపారు –యోహా 19,14. కనుక అతడు మన పాస్క గొర్రెపిల్ల. ఐగుప్తు దాస్యకాలం నాటినుండి యూదులు ఏటేట వధిస్తూవచ్చిన పాస్క గొర్రెపిల్లలన్నీ ఈ క్రీస్తునే సూచిస్తూవచ్చాయి. ఈ గొర్రెపిల్లనుబట్టే ఆ గొర్రెపిల్లలన్నీ స్మరణయోగ్యమయ్యాయి.

## 3. క్రైస్తవుల పాస్క

### 1. ఆదివారపు పాస్క :

క్రీస్తులాగే మనం కూడ తండ్రివద్దకు సాగిపోవాలి. ఈలా సాగిపోయేలా చేసే సాధనాల్లో ఆదివారపు పాస్క ముఖ్యమైంది. ఇది ఆదివారపూజ. యూదులకు శనివారం విశ్రాంతి దినం. పవిత్ర దినం. కాని క్రైస్తవులమైన మనకు ఆదివారం పవిత్ర దినం. ఎందుకంటే అది ప్రభువు ఉత్థానమైన రోజు. తొలిరోజుల్లోని శిష్యులు ఆదివారం పూట ఆయా గృహాల్లో సమావేశమై రొట్టె విరిచేవాళ్లు. అదే తొలినాటి పూజ –అచ 20,7. ఆదివారం ప్రభుదినం. అతని వుత్థానాన్ని స్మరించుకొనే దినం. అనగా అతన్ని ఆరాధించే దినం. ఈ యారాధనం వల్లనే మనం తండ్రిని చేరుకోగలిగేది. ఇప్పుడు మనం దేవాలయంలో ప్రభువును పూజిస్తాం. ఈ పూజలో రొట్టెను భుజించి పాత్రాన్ని పానం చేసినపుడెల్ల క్రీస్తు మరణాన్ని జ్ఞప్తికి తెచ్చుకొంటాం. అతని రెండవ రాకడ కొరకు నిరీక్షిస్తాం –1కొ 11,26. మనం పవిత్రులమయ్యే మార్గం ఇదే.

### 2. సాంవత్సరిక పాస్క –ఉత్థాన పండుగ :

యూదులకు మోషే నాయకత్వం క్రింద ఐగుప్తునుండి విముక్తి లభించింది. అలాగే మనకు క్రీస్తు నాయకత్వం క్రింద పిశాచ దాస్యనుండి విముక్తి లభించింది. కనుక మనం కృతజ్ఞతాభావంతో ఏటేట ప్రభువు ఉత్థానాన్ని కొనియాడతాం. పౌలు క్రీస్తు అనే మన పాస్కగొర్రెపిల్ల వధింపబడింది అన్నాడు. కనుక మన జీవితం నుండి పాపం తొలగిపోవాలి అని నుడివాడు. పులిసినపిండి పాపానికి చిహ్నమని చెప్పాం గదా! మన జీవితం నుండి ఈ పులిపిండి పోవాలి. మనం క్రొత్త పిండితో చేసిన పొంగని రొట్టెలా తయారుకావాలి అని చెప్పాడు –1కొ 5,6–8.

క్రీస్తుతోపాటు మనమూ పాపానికి చనిపోతాం. అతనితోపాటు నూత్న జీవితానికి ఉత్థానమౌతాం. ఈ మరణమూ ఉత్థానమూ మన జ్ఞానస్నానంలో సాంకేతికంగా జరుగుతాయి. కనుకనే ప్రాచీన కాలంలో ఉత్థాన దినాన విశేషంగా జ్ఞానస్నానం ఇచ్చేవాళ్లు. జ్ఞానస్నానం ద్వారా మనం ప్రభువు మరణోత్థానాల్లో పాల్గొంటామని తెలియజేసేవాళ్లు -రోమా 6,3-11. ఈలా మనం ఏటేట ఉత్థాన పండుగను చేసికొంటూ క్రీస్తు పాస్కను నూత్నీకరిస్తూ పోతాం. అన్ని ఆదివార ఆరాధనలకంటె గూడ అధికంగా ఈ ఉత్థాన ఆదివారపు ఆరాదనం మనలను పవిత్రపరుస్తుంది.

### 3. మోక్షపు పాస్క :

క్రీస్తు వధింపబడిగూడ సజీవుడై యున్న గొర్రెపిల్ల అంటుంది దర్శనగ్రంథం -5,6. అనగా అతడు ఉత్థానక్రీస్తు. మనం మోక్షంలో ఈ గొర్రెపిల్లను చేరుకొంటాం. ఆ ప్రభువుతో పాటు మోక్షపు విందులో పాలుపొందుతాం. అదే మన పాస్క -మత్త 26,29. మనం ఈ లోకంనుండి స్వర్గానికి యాత్ర చేసేవాళ్లం. ఇక్కడినుండి మోక్షానికి దాటిపోయేవాళ్ళం -హెబ్రే 22-24. మొదటి పేత్రు జాబు కూడ మనం ఈ లోకంలో యాత్రికుల్లాగ జీవించాలి అని చెప్తుంది. అనగా మనం స్వర్గానికి యాత్ర వెళ్ళేవాళ్ళం. అక్కడ కడపటి పాస్క చేసికొనేవాళ్ళం -1పేత్రు 2:11.

ఈ యధ్యాయంలో పాస్కనుగూర్చి చాల విషయాలు చూచాం. ఐగుప్తులో ప్రారంభమైన ఈ పాస్క మోక్షంలో ముగుస్తుంది. పాస్కబలి క్రైస్తవజీవితంలో ముఖ్యాతి ముఖ్యమైన అంశం.

## 4. యుద్ధమూ, సముద్రోత్తరణమూ

బైబులు యిస్రాయేలును ప్రభుసైన్యంగా భావిస్తుంది -నిర్గ 12,41. ప్రభువే ఈ సైన్యానికి అధిపతి. యిస్రాయేలు ప్రభువుని అనుభవానికి తెచ్చుకొంది ఒక్క ఆరాధనలోనేగాదు, యుద్ధంలో గూడ. అతడు యిస్రాయేలు తరపున పోరాడే వీరుడు. వాళ్ళ శత్రువులను హతమార్చే యోధుడు. దావీదురాజు కాలంనుండి యుద్ధం రాజుల వంతయింది. అంతకుముందు అది యావే వంతు. ఈ అధ్యాయంలో ప్రభువు ఐగుప్తీయులతో పోరాడి వాళ్ళను నాశంచేసి తన భక్తులైన యిస్రాయేలీయులను రెల్లుసముద్రం దాటించడాన్ని గూర్చి ఆలోచిద్దాం. ఈ వుదంతం నిర్గమకాండం 14వ అధ్యాయంలో వస్తుంది.

## 1. యుద్ధ నియమాలు

1. యుద్ధానికిముందు ప్రభువుకి గొర్రెపిల్లను బలిగా అర్పించేవాళ్లు -1సమూ 7,9. యావే సంప్రతించి అతని చిత్తాన్ని తెలిసికొనేవాళ్లుకూడ -2సమూ 5,22-24.

2. శత్రువులకు భయపడవద్దని యుద్ధానికి ముందు యాజకుడు ప్రజలకు ఉపదేశం చేసేవాడు -ద్వితీ 20,1-4. సముద్రాన్ని దాటకముందు మోషే యిస్రాయేలుకు కూడ ఈలాంటి వుపదేశమే చేసాడు -నిర్గమ 14,13-14.

3. పోరాటానికి ముందు సైనికులు శుద్ధిచేసికొనివుండాలి. యుద్ధకాలంలో వీరులు స్త్రీలను కూడరాదు -1సమూ 21,5.

4. యుద్ధంలో యావే యిస్రాయేలు సైన్యానికి ముందు నడిచి శత్రువులను ఓడించేవాడు. ఆలా అతడు బారాకునకు ముందుగా నడచిపోయి శత్రువైన సిస్రాను ఓడించాడు -న్యాయా 4,14-16. ఇంకా ప్రభువు పోరాటంలో శత్రుసైన్యాన్ని కలవరపెట్టేవాడు. దీనివల్ల యిస్రాయేలు పోరు ప్రారంభింకమునుపే శత్రువులు ఓడిపోయేవాళ్లు. ఆ రీతిగా అతడు యోషువా మీదికి దండెత్తివచ్చిన ఐదుగురు అమోరీయ రాజులను కలవరపెట్టాడు -యోషు 10,9-1. సమూవేలు కాలంలో యిస్రాయేలు మీదికి దండెత్తివచ్చిన ఫిలిస్తీయులను గగ్గోలుపరచాడు -1సమూ 7,10. మన కథలో మోషే మీదికి దండెత్తివచ్చిన ఐగుప్తీయులను కలవరపెట్టాడు -నిర్గ 14,24.

5. విజయం యావేదే. కనుక యుద్ధంలో లభించే కొల్ల సొమ్మును యావేకే అర్పించేవాళ్లు. జయించిన నగరాన్ని గూడ శాపంపాలుచేసి నాశం చేసేవాళ్లు. అది యావేకు అర్పింపబడిన బలి అని తలంచేవాళ్లు. ఈ భావంతోనే యోషువా యెరికో పట్టణాన్ని జయించినపుడు దాన్ని సర్వనాశం చేయించాడు -యోషు 6,21.

6. ఇక్కడ ఓ విషయం నొక్కి చెప్పాలి. యావే యుద్ధానికి వెళ్లేది రక్తప్రీతితోగాదు, పీడితులను రక్షించేందుకు. తన భక్తులైన యిస్రాయేలును శత్రువులు పీడిస్తే అతడుసహించి వూరుకోడు. తరచుగా యుద్ధంలో ప్రభువు ఆత్మ ఓ యిస్రాయేలు వీరుణ్ణి ఆవేశించేది. ఇక ఆ వీరుడు ప్రజలకు నాయకుడై యుద్ధంనడిపేవాడు. అతని ద్వారానే ప్రభువు శత్రువులను హతమార్చేవాడు. సౌలు ఈలా అమ్మోనీయులను ఓడించాడు -1సమూ 11,6-7. సంసోను వేయిమంది ఫిలిస్టీయులను చంపాడు -న్యాయా 15,14-15.

## 2. యావే సంప్రదాయం

రెల్లు సముద్రంవద్ద ఏమి జరిగింది? యిస్రాయేలీయులు ఐగుప్తునుండి వెడలి వచ్చి రెల్లుసముద్రం చేరుకొన్నారు. ఆ సముద్రాన్ని ఏలా దాటిపోవాలో వాళ్లకు తెలియలేదు.

ఇంతలో ఐగుప్తీయులు వాళ్ళ వెంటబడి వచ్చారు. యిస్రాయేలును మళ్లా వెనక్కు లాగుకొనిపోయి వాళ్ళచేత వెట్టిచాకిరి చేయించుకోవాలని ఫరో కోర్కె. సరే, ఐగుప్తు సైన్యం వచ్చి యిస్రాయేలు మీద పడింది. ఆ ప్రజలు ఇరకాటంలో పడ్డారు. వాళ్ళకు ముందు నుయ్యి, వెనుక గొయ్యి. ఇక యేటూ కదలలేని పరిస్థితితో వున్నారు. ఆ విషమ సమయలో యావే వాళ్ళ కోపు తీసికొన్నాడు. తాను స్వయంగా వాళ్ళ తరపున పోరాడి ఐగుప్తీయులను ఓడించాడు. ఈ పోరాటాన్ని యావే సంప్రదాయం ఒకరీతిగాను యాజకసంప్రదాయం మరొక రీతిగాను వర్ణించింది. నిర్గమకాండం 14వ అధ్యా యంలో ఈ సంప్రదాయాలు రెండూ మిళితమై వున్నాయి (ఈ సంప్రదాయా లేమిటో, వాటి భావమేమిటో చివరి అధ్యాయంలో పరిశీలిద్దాం). ఇక్కడ మనం మొదట రెల్లు సముద్రం వొద్దున జరిగిన పోరాటాన్ని యావే సంప్రదాయం వర్ణించిన తీరును పరిశీలిద్దాం.

యిస్రాయేలీయులను పట్టుకొని రావడానికి ఫరో రథాలతో వచ్చాడు -14,5-7. వాళ్లను చూడగానే యూదులకు గుండె నీరయింది. అప్పుడు మోషే జనులయెదుట అభయవాక్యాలు పల్కాడు. యావేను నమ్మమన్నాడు. ప్రభువు మీద భారం వేసి నిమ్మళంగా వుండమని హెచ్చరించాడు -14,13-14. అంతలో యింతవరకూ ముందు నడుస్తూన్న మేఘస్తంభం వెనుకకు వచ్చి యిస్రాయేలీయులకూ ఐగుప్తీయులకూ మధ్య నిలిచింది. అది ఐగుప్తీయులవైపు చీకటినీ యిస్రాయేలీయుల వైపు వెలుగునీ ప్రసరింపజేసింది. కనుక ఆ రాత్రి ఐగుప్తీయులు య్సిఆయేలీయులకు ఏ హానీ చేయలేకపోయారు. మరునాటి వేకువన ప్రభువు మేఘస్తంభంలోనుండి ఐగుప్తు దండును ఉరిమిచూచాడు. దాన్ని కలవరపెట్టాడు -14,24. దానితో ఐగుప్తీయులు గగ్గోలుపడి చెల్లాచెదరై సముద్రంలో దూకి చచ్చారు. తెల్లవారాక ఐగుప్తీయుల శవాలు సముద్రంలో తేలియాడుతూ కన్పించాయి -14,27-28.

యావే సంప్రదాయం ప్రకారం రెల్లుసముద్రం వొద్దున పోరాటి జరగనేలేదు. అసలు యిస్రాయేలీయులు వాళ్ళ గుడారాల్లోనుండి బయటికిగూడ రాలేదు. యావే ఐగుప్తీయులను కలవరపెట్టగా వాళ్ళంతట వాళ్ళే వెళ్ళి సముద్రంలో దూకి చచ్చారు. కనుక ఇక్కడ యావే ఐగుప్తీయులను కలవరపెట్టాడు అనే 14,24వ వచనం ముఖ్యమైంది.

### 3. యాజక సంప్రదాయం

పై సంఘటనాన్ని యాజక సంప్రదాయం కొంచెం భిన్నంగా వర్ణించింది. యావే పల్కిన పల్కు తప్పకుండా నెరవేరి తీరుతుంది. ప్రభువు మొదట యిస్రాయేలు దాటిపోయేందుకు సముద్రం దారి ఈయాలి అన్నాడు. నీళ్లు పాయలు కావాలి అని

పల్కాడు. అలాగే నీళ్ళు పాయలయ్యాయి –14,21-22. యిస్రాయేలీయులు సముద్ర గర్భంగుండా పొడినేల మీదలాగా నడచిపోయారు. వాళ్ళు పోతూంటే సముద్రం నీళ్లు కుడివైపుగా ఎడమవైపుగా గోడల్లాగ నిల్చివున్నాయి –14,29.

యూదులను జూచి ఐగుప్తీయులు కూడ ఆరిన సముద్రంగుండా నడవడం మొదలుపెట్టారు. అప్పుడు ప్రభువు సముద్రం ఐగుప్తీయులను ముంచివేయాలి అన్నాడు. అలాగే జరిగింది. ఇంతసేపూ గోడల్లాగ నిల్చివున్న నీళ్లు ఒక్కపెట్టున వాళ్ళ మీద విరుచుకపడ్డాయి. కనుక ఐగుప్తీయులు నడికడలిలో మునిగిచచ్చారు –14,28.

యిస్రాయేలీయులు దాటిపోతూండగా సముద్రం నీళ్లు కుడియెడమలయందు గోడల్లాగ నిల్చివున్నాయి అని చెప్తుంది యాజక సంప్రదాయం. యావేసంప్రదాయంలోని 14,24 వలె యాజక సంప్రదాయంలోని 14,29 ముఖ్యాతిముఖ్యమైన వాక్యం. కాని ఇక్కడ నీళ్లు కుడివైపునా ఎడమవైపునా గోడల్లాగ నిల్చివున్నాయి అంటే ఏమిటి? బైబులు భావాల ప్రకారం సముద్రమూ నీళ్లూ ప్రభువుకి శత్రువులు. కనుక ఈ నీళ్ళను కూడ ప్రభువు విరోధిగా భావించుకోవాలి. ప్రభువు తన సైన్యమైన యిస్రాయేలును తరలించుకొని వస్తూంటే శత్రుశక్తులన్నీ దిగ్భ్రాంతి చెందాయి. మ్రాన్పడి చూస్తున్నాతయి. అలాగే ఈ నీళ్లు కూడ యిస్రాయేలును చూచి మ్రాన్పడి గోడల్లాగ నిల్చిపోయాయి. ఇది భావం. ఐనా ఇది ఉత్ప్రేక్షకాని చరిత్రకాదు.

ఇంతవరకూ మనం చూచిన రెండు సంప్రదాయాల భావాలను సంగ్రహంగా ఈలా చెప్పుకోవచ్చు.

అసలు జరిగిన సంగతి యిది. యిస్రాయేలీయులు వచ్చినపుడు సముద్రం "ఆటు" వల్ల ఇంకిపోయి వుంది. అనగా దాని నీళ్లు ప్రక్కకు కదలిపోయాయి. అలా తీసిపోయిన కడలిగుండా వాళ్ల దాటిపోయారు. కాని వాళ్ల వెనువెంట ఐగుప్తీయులు సాగరంలో ప్రవేశించేటప్పటికల్లా "పోటు" వల్ల దాని నీళ్లు మళ్లా తిరిగివచ్చాయి. అనగా సముద్రం పొంగులో వుంది. కనుక వాళ్లు ఆ వెల్లువలో మునిగిచచ్చారు. యథార్థంగా జరిగిన సంగతి యిది.

ఈ సంగతిని యావేసంప్రదాయం ఈలా వర్ణించింది. ప్రభువు వేకువ జామున ఐగుప్తుదండును కలవరపరిచాడు. ఆ దండు గగ్గోలుపడి తనంతటతానే సముద్రంలోకి దూకి చచ్చింది. తర్వాత యిస్రాయేలీయులు ఆరిన సముద్రాన్ని దాటి వెళ్లారు.

పై సంగతిని యాజకసంప్రదాయం మరోలా వర్ణించింది. యిస్రాయేలీయులు నీళ్లగుండ వెళ్తూంటే ఆ నీళ్ళు ఇరువైపుల గోడల్లాగ నిల్చాయి. నీళ్లు దేవుని శత్రువులు

కనుక, ఆ దేవుని సైన్యం తరలిపోతుంటే ప్రూన్పడి చూస్తున్నాయి. ఆ రీతిగా యిస్రాయేలీయులు సురక్షితంగా సాగరం దాటివెళ్లారు. కాని ఐగుప్తీయులు వచ్చినపుడు మాత్రం అంతవరకూ గోడల్లాగ నిల్చివున్న నీళ్లు మళ్లా కలుసుకొన్నాయి. వాళ్లు నడి సంద్రంలో మునిగి చచ్చారు.

పై రెండు సంప్రదాయాల్లోను యావే సంప్రదాయమే యథార్థంగా జరిగిన సంఘటనను దగ్గరగా వుంటుందని చెప్పాలి. ఇక, ఈ సముద్రోత్తరణంలో అసలు అద్భుతం ఏమిటి? ప్రభువు ప్రకృతి శక్తులను తన భక్తులకు అనుకూలంగాను ప్రతికూలం గాను మెలిగేలా చేసాడు. యిస్రాయేలీయులు వచ్చినపుడు సముద్రం ఆటులో వుంది. కనుకనే వాల్కు దాన్ని సులభంగా దాటిపోగలిగారు. అదే సముద్రం ఐగుప్తీయులు వచ్చినపుడు పోటులో వుంది. కనుక వాళ్లు దానిలో మునిగిపోయారు. ఈలా సముద్రం ఆటుపోటుల ద్వారా ప్రభువు ఐగుప్తీయులను శిక్షించి యిస్రాయేలీయులను రక్షించడమే ఇక్కడ అద్భుతం. ఈ యద్భుత కార్యం ఆనాడు యిస్రాయేలీయులకు గొప్ప అనుభూతిని కలిగించింది. కనుకనే పూర్వవేదం చాల తావుల్లో ఈ సంఘటనను ప్రస్తావిస్తుంది.

## 4. పౌలు హెచ్చరిక

పౌలు నూత్నవేదంలో పై సముద్రోత్తరణాన్ని ప్రస్తావించాడు -1కొ 10,1-5,11. యిస్రాయేలీయులు సముద్రంగుండా దాటిపోయారు. అదే వాల్క జ్ఞానస్నానం. తర్వాత వాల్లు ఎడారిలో మన్నా భోజనం భుజించారు. ఐనా వాళ్ళల్లో కొందరు ప్రభువు మీద తిరగబడ్డం మానలేదు. కనుక ప్రభువు వాళ్లను ఎడారిలోనే చంపివేసాడు. నేడు ఈ సంఘటనం మనకు హెచ్చరికగా వుండాలి. మన సముద్రోత్తరణం జ్ఞానస్నానం. మన మన్నా దివ్యసత్ర్పసాదం. కాని మనం జ్ఞానస్నానం పొందినంత మాత్రాన్నే, దివ్య భోజనాన్ని పుచ్చుకొన్నంత మాత్రాన్నే, రక్షణం పొందం. ఆ ప్రభువు ఆజ్ఞళ ప్రకారం జీవిస్తేనేగాని అతని అనుగ్రహానికి పాత్రులంగాం. లేకపోతే నాశమైపోతాం.

## 5. నిబంధనం

యిస్రాయేలీయుల చరిత్రలో నిబంధనం ముఖ్యాతిముఖ్యమైన ఘట్టం. కాని యూదుల సీనాయి నిబంధనకు పూర్వమే వారి సమకాలికులైన హిత్తీయజాతివాళ్లు ఒడంబడికలు చేసికొన్నారు. ఆ జాతికి చెందిన ఓ మహారాజు సామంతరాజుతో ఒడంబడిక చేసికొనేవాడు. ఆ మహారాజు సామంత్రున్ని శత్రువులనుండి రక్షించేవాడు. సామంతుడు అతనికి సేవలుచేసేవాడు. ఈ పద్ధతే యిస్రాయేలీయుల నిబందనలో కూడ కన్పిస్తుంది. ప్రభువు ఓ మహారాజులా వచ్చి యిస్రాయేలీయులను ఐగుప్తు దాస్యం నుండి రక్షించాడు.

వాళ్లతో నిబంధనం చేసికొన్నాడు. ఇకమీదట వాళ్లు యావేను కొలవాలి. ఈలా హిత్తీయుల ఒడంబడిక యూదుల ఒడంబడికకు ప్రాతిపదికఅయింది. ఏమైతేనేం, నిబంధనం బైబుల్లో ఓ పెద్దభావ.ం ఈ యధ్యాయంలో ఒడంబడికను గూర్చి కొన్ని వివరాలు తెలిసికొందాం.

1. నిబంధనం చేసికోవడం

1. సిద్ధం కావడం :

ప్రభువు తలపెట్టిన నిబంధనం ఓ వుపన్యాసంతో ప్రారంభమయింది. అతడు ఈలా చెప్పాడు. తాను యిస్రాయేలును ఐగుప్తునుండి తోడ్కొని వచ్చాడు. ఏలా? గరుడ పక్షి తన పిల్లలను రెక్కలమీద మోసికొని పోయినట్లే యావే వారిని ఆప్యాయతతో మోసికొని వచ్చాడు -నిర్గ 19,4. కనుక ఆ ప్రజలు ప్రభువు మాటవినాలి. అతని నిబంధనను పాటించాలి. అప్పుడు వాళ్లు అతని సొంతప్రజ, అనగా ప్రభువు ఎన్నుకొన్న ప్రజ ఔతారు. యాజకరూపమైన రాజ్యం ఔతారు. అంటే యావేను ఆరాధించే ప్రజ ఔతారు. పవిత్ర ప్రజ ఔతారు. ఎందుకంటే వాళ్లు యావేకు అంకితమైన జనం -19, 5-6. ఈ భావాలన్నీ యిస్రాయేలుకు నచ్చాయి. వాళ్లు ఒక్కగొంతుతో మేము ప్రభువు చెప్పినట్లే చేస్తామని జవాబు చెప్పారు -19,8.

2. నిబంధన బలి :

యిస్రాయేలీయులకు సమకాలికులైన హిత్తీయులు మొదలైన జాతులవాళ్లు మూడు రకాలతుగా నిబంధనం చేసికొనేవాళ్ళు. 1) ఇరుపక్షాలవాళ్లు చేతులమీద కోసికొని నెత్తురు కలుపుకొనేవాళ్లు. ఈలాంటి నిబంధనం బైబుల్లో కన్పించదు. 2) ఇరువురూ బలిజంతువుల తుండెముల మధ్యగా నడిచేవాళ్లు. పూర్వం దేవుడు అబ్రాహాముతో ఈపద్ధతిలో ఒడంబడిక చేసికొన్నాడు - ఆది 15,9-12. 3) ఇరువురూ కలసి భోజనం చేసేవాళ్లు. ఈసాకు అబీమెలెకు ఈలా భుజించారు -ఆది 26,28-30. ఈ పద్ధతులన్నిటిలోను ముఖ్యభావం యిది. నిబంధనం చేసికొన్న వారిద్ధరూ రక్తబంధువు ల్లాంటివాళ్లు. సోదరుల్లాంటివాళ్లు. కనుక ఆ యిరువురూ దాన్ని జాగ్రత్తగా పాటించాలి.

కాని యిక్కడ ప్రభువు మోషేతో చేసికొన్న నిబంధనం ఇంకో పద్ధతిలో నడిచింది. మోషేకొండవద్ద పూజాపీఠాన్ని నిర్మించాడు. ప్రజలు ప్రోగుజేసాడు. బలికి కోడెలను వధించి వాటి నెత్తురు పళ్లాల్లో సేకరించారు. మోషే ఆ నెత్తుటిలో సగం పీఠంమీద చల్లాడు. మిగతా సగం ప్రజలమీద చిలకరించాడు. యావే మీకీ నియమాలను ప్రసాదించాడు. అతడు మీతో చేసికొన్న నిబంధనం రక్తం యిది" అని పల్కాడు - 24,4-8.

ఇక్కడ నెత్తురు ముఖ్యమైన వస్తువు. యూదుల భావం ప్రకారం నెత్తురులో జీవం వుంటుంది -లేవీ 17,14 ఆ నెత్తురు వల్ల భగవంతుడూ ప్రజలు ఒక్క సమాజంగా ఐక్యమౌతారు. వారిలో ఒకే ప్రాణం నెలకొంటుంది. ఏలా? ఇక్కడ పీఠం దేవునికి గుర్తు. మోషే పీఠం మీద చల్లిన నెత్తురు దేవుడిచ్చే దివ్యజీవాన్ని సూచిస్తుంది. అతడు ప్రజలమీద చల్లిన నెత్తురు, ఆ దివ్యజీవం నుండే ప్రజలు కూడ తమ జీవాన్ని పొందుతారని తెలియజేస్తుంది. కనుక సీనాయి నిబంధనమంటే ప్రజలు దేవుని నుండి తమ జీవాన్ని పొందడం. ఆ దేవుడూ ప్రజలూ కలసి ఒక్క సమాజంగా ఏర్పడి రక్తబంధువుల్లాగ జీవించడం.

3. నిబంధన భోజనం :

నిబంధనంలో ఇరుపక్షాలు భోజనం చేయడంగూడ ముఖ్యాంశం. అహరోను నాదాబు అబీహులతో, యిస్రాయేలు పెద్దలు డెబ్బదిమందితో కొండమీది కెక్కిపోయాడు మోషే. అక్కడ ప్రభువు వాళ్ళకు ప్రత్యక్షమయ్యాడు. ఆయన పాదాలక్రింద నీలమణి ఫలకం వెలుగుతూంది. పూర్వవేద సంప్రదాయం ప్రకారం నరుడు భగవంతుణ్ణి చూచి బ్రతకజాలడు -33,20. కాని యిక్కడ ప్రభువు ఆ భక్తులకు ఏ హాని చేయలేదు. వాళ్లు యావేతోగాదు, యావే సమక్షంలో భోజనం చేసారు. కలసి భుజించేవాళ్లు మిత్రులని హీబ్రూ ప్రజల భావం. ఈ నియమం ప్రకారం ఇక్కడ యావే యిస్రాయేలుకు మిత్రుడూ చుట్టమూ అయ్యాడు. ఈ కొండమీది భోజనం తర్వాత నూత్నవేదంలో వర్ణింపబడిన చాల భోజనాలకు ఆదర్శమయింది.

2. నిబంధనను మీరడం

పై రీతిగా ప్రభువు యిస్రాయేలీయులతో చేసికొన్న నిబంధనం ఎంతోకాలం నిలువలేదు. మోషే కొండమీదికి వెళ్ళి చాలనాళ్లవరకు దిగిరాలేదు. అంతలోనే ప్రజలు ఆ మోషేకు ఏమి దుర్గతి పట్టిందోలే అనుకొని ఓ బంగారు దూడను తయారు చేసికొని దాన్ని ఆరాధించడం మొదలెట్టారు -32,4-6. ఇక్కడవాళ్లు బంగారుదూడను పూజించడం దేనికి? ఆ కాలంలో యిస్రాయేలీయుల పొరుగుజాతియైన కనానీయులు బాలుదేవతను కొలిచేవాళ్లు. ఆ దేవతకు చిహ్నం ఎద్దు. కనుకవాళ్లు ఎద్దుకు మ్రొక్కేవాళ్లు. ఆదిచూచి యిస్రాయేలీయులు కూడ వృషభ పూజకు పాల్పడ్డారు. దానినుండి అద్భుత శక్తులు పొందవచ్చు గదా అనుకొన్నారు. ఇది యావే ఏకైక దేవుడు అన్న తొలియాజ్ఞకు వ్యతిరకమైన పాపం. సరే, కొండమీదవున్న మోషేకు ప్రభువు యిస్రాయేలీయులు భ్రష్టులైపోయారనీ విగ్రహారాధనకు పాల్పడ్డారనీ తెలియజేసాడు. మోషే విచారంతో

రాతిపలకలు తీసికొని పర్వతం దిగివచ్చాడు. అతడు వచ్చేటప్పటికల్లా యూదులు బంగారు దూడచుట్టు మూగి నాట్యం చేస్తున్నారు. మోషే ఉగ్రుడైపోయి రాతిపలకలను అక్కడే విసరికొట్టాడు. అవి ముక్కముక్కలుగా పగిలిపోయాయి -32,19. ఇక్కడ మోషే పలకలు పగలగొట్టడం ప్రభువు చేసిన నిబందనం భగ్నమైపోయింది అనడానికి చిహ్నం. యిస్రాయేలీయులు ఎంత కృతఘ్నులో, ఎంత తలబిరుసు జనమో ఈ వొక్క సంఘటనం వల్లనే అర్థంచేసికోవచ్చు.

3. నిబంధనను నూత్నీకరించడం

కాని ప్రభువు దయామయుడు. సులభంగా కోపపడేవాడు కాదు. నిత్యమూ ప్రేమ చూపేవాడు, నమ్మదగినవాడతు -34,6. కనుక అతడు మోషేను మళ్లా కొండమీదికి రమ్మన్నాడు. ఆ భక్తుడు మరి రెండు రాతిపలకలను చెక్కుకొని కొండ యెక్కాడు. అక్కడ దేవుడు అతణ్ణి కరుణించాడు. మరల ఆ పలకలమీద పదియాజ్ఞలు వ్రాసియిచ్చాడు. ప్రభువు యిస్రాయేలుతో మళ్లా నిబంధనాన్ని నూత్నీకరించుకొన్నాడు -34,27. యావే విశ్వసనీయుడు. అతడు ఆడితప్పడు. ప్రజలు దేవుని ఆజ్ఞను పాటించలేకపోయినా అతని నిబందనమేమో నిలుస్తుంది. పాటించనివాళ్ళకు మాత్రం ఆ నిబంధనం ఫలితమీయదు, అంతే.

4. క్రీస్తు నిబందనం

ప్రభువు మోషే ముఖాన సీనాయి కొండవద్ద యూదులతో నిబందనం చేసికొన్నాడు అన్నాం. ఆలాగే అతడు నూత్నవేదలో క్రీస్తుద్వారా మనతో నిబంధనం చేసికొన్నాడు. "ఇది యావే మీతో చేసికొనే నిబంధన రక్తం" అన్నాడు మోషే. నిర్గ 24,8. "ఇది అనేకులకొరకు చిందబడనున్న నా నూత్ననిబంధన రక్తం"అన్నాడు క్రీస్తు -మార్కు 14,26. ఈ పలుకులనుబట్టే ఈ రెండు నిబంధనల సామ్యాన్ని ఊహించవచ్చు. కాని అక్కడ పూర్వవేద నిబంధనంలో చిలకరించినది ఎడ్లనెత్తురు. ఇక్కడ నూత్నవేద నిబంధనంలో చిందించింది క్రీస్తు సొంత నెత్తురు.

యిర్మీయా, యేహెజ్కేలు మొదలైన మహాప్రవక్తలంతా భవిష్యత్తులో రానున్న క్రొత్త నిబందనను ప్రస్తావించారు. ఆ భక్తులు పేర్కొన్న నూత్ననిబందనను నిర్వహించింది క్రీస్తే. పూర్వనిబంధనంకంటె శ్రేష్ఠమైన నూత్ననిబంధనానికి క్రీస్తు మధ్యవర్తి అంటుంది హెబ్రేయుల జాబు -8,6. అక్కడ ఆ జంతువుల నెత్తురే అంతటి పవిత్రకార్యం సాధిస్తే ఇక్కడ క్రీస్తు నెత్తురు ఇంకా యెంతటి పవిత్రకార్యం చేకూర్చి పెడుతుందో ఊహించమంటుంది -9,12-14. పూర్వనిబంధనం ద్వారా యిస్రాయేలీయులు యావే

ప్రజలయ్యారు. అతడూ వాళ్ళకు దేవుడయ్యాడు. నూత్న నిబంధనం ద్వారా మనంక్రీస్తు ప్రజలమౌతాం. అతడు మనకు దేవుడౌతాడు -ప్రకట 21,3. "అతడు వారి దేవుడు. వాళ్ళు అతని ప్రజలు" అనే పల్కులను బైబులు నిబంధన సందర్భంలో వాడుతుంది.

## 6. ఎడారి

యిస్రాయేలీయులు నలువదియేండ్లు ఎడారిలో ప్రయాణంచేసిన పిదపగాని వాగ్దత్త భూమిని చేరుకోలేదు. ఐగుప్తునుండి వెడలివచ్చిన మొదటితరం వాళ్ళంతా ఆ యెడారిలోనే గతించారు. హీబ్రూప్రజల సంప్రదాయం ప్రకారం ఎడారి దేవుణ్ణి కలసికొనే తావు. మోషే యేలీయా మొదలైన మహాభక్తులంతా ఎడారిలో దైవసాక్షాత్కారం పొందారు. ఇంకా యెడారి నరుడు దేవుణ్ణి పరీక్షకు గురిచేసే తావు కూడ. ఎడారిలో యిస్రాయేలీయులు దేవుణ్ణి నమ్మలేదు. అతనికి పరీక్షలు పెట్టారు. నూత్న వేదంలో క్రీస్తుపౌలు మొదలైన వాళ్ళు కొంతకాలం ఎడారిలో గడిపారు. కనుక ఎడారి బైబుల్లో ఓ పెద్దభావం. ప్రస్తుతాధ్యాయంలో ఈ యంశాన్ని గూర్చిన వివరాలను కొన్నిటిని తెలిసికొందాం. బైబులు ఎడారి మన యెడారిలాంటిది కాదు. అది పైరుపంటలు పండని అడవినేల. నిర్జన ప్రదేశం. మరుభూమిమాత్రం కాదు.

### 1.మన్నా

ప్రజలు సీనాయి ఎడారిలో ప్రయాణం చేస్తున్నారు. అక్కడ వాళ్ళకు తిండి దొరకలేదు. కనుక ఆ జనం మేము ఐగుప్తులోనే చనిపోయివుంటే బాగుండేదని మోషే మీద సణగుకొన్నారు. అతడు యావేకు మొరపెట్టగా ప్రభువు యిస్రాయేలీయులకు ఆకాశంనుండి అద్భుతంగా ఆహారం కురిపించాడు. అదే మన్నా -నిర్గ 16,12-16. ఇది ఉదయం నేలమీద పొగమంచులా కురిసేది. తెల్లగా కొత్తిమీరగింజ ఆకారంలో వుండేది. తేనెలా ఎవరికి ఇష్టమైన రుచి వాళ్ళకు కలిగించేది -జ్ఞాన 16,20-21. ఈలా యెడారిలో ఈ యన్నం కురియడం పూర్వవేదంలో ఓ గొప్ప అద్భుతం. ఐనా యిస్రాయేలీయులు ఈ భోజనాన్ని చూచి విసుగుకొన్నారు. సయ్యీసారములేని యీ తిండి ఎవడికి కావాలి అని మోషేమీద తిరగబడ్డారు - సంఖ్యా 21,5. ఔనుమరి, భగవంతుని మీద విశ్వాసంలేని వాళ్ళకు అతని అద్భుతాలు కూడ అద్భుతాలుగా కన్పించవు.

ఇక నూత్నవేదంలో క్రీస్తే మన మన్నా. తండ్రి మనకొరకు ఆకాశంనుండి కురిపించిన అద్భుతభోజనం అతడే. అందుకే క్రీస్తు "మీ పితరులు ఎడారిలో మన్నా

భుజించికూడ మరణించారు. పరలోకంనుండి దిగివచ్చిన జీవాహారాన్ని నేనే. ఈ యాహారాన్ని భుజించేవాడు నిరంతరం జీవిస్తాడు. ఈ లోకంలోని జనులు జీవించడానికి నేనిచ్చేది నా శరీరమే" అని పల్కాడు -యోహా 6,48-51. కనుక నేడు మనం దివ్యసత్ప్రసాదం పుచ్చుకొన్నపుడు ఈ మన్నానే భుజిస్తాం. ఇంకా క్రీస్తు రొట్టెలను విస్తరింపజేసాడు గదా? ఆ యద్భుతంగూడ ఈ మన్నానే సూచిస్తుంది - యోహా 6,1-13.

2. రాతిబండనుండి నీళ్లు

ప్రజలు ఎడారిలో రెఫిదీముకడ విడిది చేసారు. అచ్చట వాళ్ళకు త్రాగడానికి నీళ్లు దొరకలేదు. ఇకనేం, ఆజనం మోషేమీద ఎగబడ్డారు. నీవు మమ్ము ఐగుప్తునుండి ఎందుకు తోడ్కొని వచ్చావని తిరగబడ్డారు. దేవుడు మనలను చేయి విడిచాడు. అతడే మనతోవుంటే ఈ యిబ్బందులన్నీ ఎందుకు వస్తాయని ఆపసోపాలు పడ్డారు. అప్పుడు మోషే యావే సలహాపై కఱ్ఱతో దాపులోని రాతిచుట్టును కొట్టాడు. ఆ బండనుండి అద్భుతంగా నీటిపాయ వెలువడింది. ప్రజలూ వారి పశువులూ ఆ నీళ్లు త్రాగి సంతృప్తిచెందారు. ఇక్కడ ప్రజలు యావే మనతో వున్నాడా లేదా అని సందేహించి అతన్ని పరీక్షకు గురిచేసారు. కావుననే ఆ తావుకి "మాసా" అని పేరు. హీబ్రూలో మాసా అంటే పరీక్ష అని అర్థం -నిర్గ 17,1-7.

ఇక, రాతిబండనుండి వెలువడిన నీళ్లు పవిత్రాత్మకు చిహ్నం. "మీ అపవిత్రత తొలగిపోయేలా నేను మీమీద నిర్మలమైన జలాలు చిలకరిస్తాను" అంటాడు యెహెజ్కేలు ప్రవక్త -36,24-27. ఈ జలాలే ఆత్మ. నూత్నవేదంలో క్రీస్తుని నమ్మినవాళ్ళ అంతరంగం నుండి జీవజలాలు పుట్టుకవస్తాయి. ఈ జీవజలాలు కూడ ఆత్మే - యోహా 7,37-38. మోషేకు రాతిబండ నుండి నీళ్లు లభించాయిగదా! రబ్బయుల సంప్రదాయం ప్రకారం ఈ రాయి ఎడారి అంతటా యిస్రాయేలీయులతో ప్రయాణం చేసింది. ఈ రాయి ఎవరోకాదు క్రీస్తే అన్నాడు పౌలు -1కొ 10,14. అనగా పూర్వవేదం నుండి క్రీస్తు యిస్రాయేలీయులతో సంచరిస్తూనే వున్నాడని భావం. ఈనాడు మనంకూడ ఆత్మను పొందేది ఈ క్రీస్తునుండే. చనిపోయేపుడు అతని ప్రక్కను ఈటెతో పొడువగా నీళ్లూ నెత్తురూ వెలువడ్డాయని వింటున్నాం. ఈ నీళ్ళు జ్ఞానస్నానాన్నీ పవిత్రాత్మనూ సూచిస్తాయి -యోహా 19,34. ఇంకా యోహాను 19,30 "క్రీస్తు ప్రాణం విడిచాడు అంటుంది. ఈ వాక్యంలోని "ప్రాణం" అనే మాటను గ్రీకు

మూలంలో "ఆత్మ" అనికూడ అర్థం చేసికొనవచ్చు. అప్పుడు "క్రీస్తు తన ఆత్మను వదలాడు" అనే వాక్యం సిద్ధిస్తుంది. అనగా అతడు పరిశుద్ధాత్మను మనమీదికి వదలాడు అనే భావం వస్తుంది. ఈ రీతిగా ప్రభువు మనకు ఆత్మనిచ్చేవాడు. పైన మోషే రాతిబండనుండి వెలువరించిన నీళ్లు ఈ ఆత్మనే సూచిస్తాయి అని చెఆప్పం.

3. కంచుసర్పం

ప్రజలు హోరు పర్వతంనుండి కదలి ఎదోము దేశం వైపుగా ప్రయాణం చేస్తున్నారు. కాని ఆ ప్రయాణంలో వాళ్లు సమనం కోల్పోయి మోషేమీద తిరగబడ్డారు. "నీవు ఈ యెడారిలో మా ప్రణాలు తీయవుకదా! ఈ పాడుకూడు మన్నా మాకు రుచించడంలేదు" అని గొణిగారు. అందుకు ప్రభువు వాళ్ళమీద కోపించి విషసర్పాలను పంపగా అవి చాలామందిని కాటేసాయి. అప్పుడు ప్రజలు భయపడిపోయి మోషేకు మొరపెట్టుకొన్నారు. అతడు యావే ఆజ్ఞపై కంచు సర్పాన్ని చేసి ఎత్తైన గడెమీద తగిలించాడు. పాముకరచిన వాళ్ళు ఆ సర్పంవైపు చూడగా విషం విరిగిపోయింది -సంఖ్యా 21,4-9. ఈ ఘట్టాన్ని స్మరించుకొంటూ తర్వాత జ్ఞానగ్రంథగారుడు "ప్రభో! ఆ ప్రజలు కంచుసర్పంవల్ల ఆరోగ్యం పొందలేదు. నరుల రక్షకుడవైన నీవల్ల స్వస్థత పొందారు" అని వ్రాసాడు -16,7. అనగా యావే ఆ కంచుపాముద్వారా ప్రజలకు ఆరోగ్యం దయచేసాడు. ఈ ఘట్టంమీద వ్యాఖ్య చెపుతూ రబ్బయులు "యిస్రాయేలీయులు పాముకాటునుండి ఏలా బ్రతికారు? వాళ్లు దేవునివైపు మనసు మరల్చారు. మోక్షంలోని తండ్రిమీద హృదయంనిల్పి స్వస్థులయ్యారు" అని నుడివారు.

ఇక, నూత్నవేదలో మన కంచుసర్పం క్రీస్తే. మోషే సర్పాన్ని గడెమీదికి ఎత్తినేట్లు క్రీస్తునిగూడ సిలువమీదికి ఎత్తారు. పూర్వవేద ప్రజలు ఆ గడెమీది సర్పాన్ని చూచి బ్రతికిపోయారు. నూత్నవేద ప్రజలు సిలువమీది క్రీస్తునిచూచి - అనగా అతన్ని విప్వసించి బ్రతికిపోతారు -యోహా 3,14-15.

4. చేతులు చాచిన మోషే

రెఫిదీముదగ్గర మకాము చేస్తూన్నపుడు అమాలెకీయులు యిస్రాయేలీయులను ఎదిరించారు. యోషువా వాళ్ళతో యుద్ధంచేస్తున్నాడు. మోషే, అహరోను హూరులను తీసికొని దైవసహాయం అర్థించడానికై కొండమీదికి వెళ్ళాడు. అక్కడ అతడు చేతులు చాచి ప్రార్థించాడు. అతడు చేతులు చాచినపుడు యిస్రాయేలీయులు గెలిచారు. కాని చేతులు దించినపుడు అమాలెకీయులు గెలిచారు. తానెంతసేపని అలా చేతులు చాచి వుంచగలడు? అందుచే మోషే ఓ రాతిమీద కూర్చోగా అహరోను హూరు

చెరోవైపు నిలచి అతని చేతులెత్తి పట్టుకొన్నారు. ప్రొద్దుక్రుంకేవరకు మోషే కొండమీద ఆలాగే ప్రార్థనచేసాడు. క్రింద యోషువా అమాలెకీయులను కత్తివాదరకు బలిచేసాడు. నిర్గమ 17,8-16. ఇక్కడ మోషే చాచిన చేతులు ప్రవక్త చూపే సూచనక్రియగా భావించు కోవాలి. ప్రవక్త వాక్కులాగే అతని సూచనక్రియగూడ శక్తిమంతంగా పనిచేస్తుంది. ప్రభువు యిస్రాయేలీయులకు విజయం ప్రసాదిస్తాడని ఈ సూచనక్రియ భావం. ఈ పట్టున రబ్బయులు “యిస్రాయేలీయులు కొండమీది మోషేనుచూచి అతన్ని ఆలా చేతులు చాపమని ఆజ్ఞాపించిన యావేను విశ్వసించారు. దానివల్ల వాళ్ళకు విజయం సిద్ధించింది” అని వ్యాఖ్యానించారు.

ఇక్కడ ఆ వైపున ఒకడు ఈవైపున ఒకడు నిలబడగా మధ్యలో మోషే జెండాలుగా నిలబడ్డాడు. తాను ధ్వజంలాగ నిలుచుండి యావే విజయాన్ని ప్రకటించాడు -నిర్గమ 17,12. ఆలాగే క్రీస్తుకూడ ఆవైపున ఒకదొంగ ఈ వైపున ఒక దొంగ నిలువగా వారి మధ్యలో తాను జెండాలాగ నిలిచాడు. ధ్వజంలాగ సిలువమీద నిలిచి పాపం మీద విజయాన్ని ప్రకటించాడు -యోహా 19,18-19. అనగా ఇక్కడ అహరోను హూరులమధ్య వున్న మోషేకు, ఇద్దరు దొంగల మధ్యవున్న క్రీస్తుకు సామ్యం చెప్పబడింది. ఆ మోషేలాగే క్రీస్తుకూడ ప్రార్థనచేసి ప్రజలకు రక్షణవిజయాన్ని సంపాదించిపెట్టాడు.

5. యిస్రాయేలు శోధనలు

యిస్రాయేలీయులు ఎడారిలో చాల శోధనలకు గురయ్యారు. క్రీస్తుకూడ బహిరంగదజీవితం ప్రారంభించడానికి ముందు ఎడారికి వెళ్ళి శోధనలకు గురయ్యాడు. ఎడారిలో అతడు ఎదుర్కొనిన మూడు శోధనలకూ యిస్రాయేలీయుల శోధనలకూ ఎంతో సామ్యం ఉంది.

1) ఆహారం : తిండి యిస్రాయేలీయులకు పెద్ద శోధన. వాళ్లు ఎడారిలో ఆహారం దొరక్క మోషేమీదా ప్రభువుమీదా గొణిగారు. అప్పుడు ప్రభువు వాళ్ళకొరకు మన్నా కురిపించాడు -నిర్గమ 16,3. ఇది మొదటి శోధన.

క్రీస్తు ఎడారిలోని ఓ కొండమీద నలువదినాళ్లు ఉపవాసం చేసాక అతనికి కూడ ఆకలివేసింది. క్రీస్తుని కూడ దేవునిమీద గొణిగేలా చేయాలనుకొంది పిశాచం. కనుక ఆ కొండమీది గుండ్రాళ్ళను రొట్టెలుగా మార్చి భుజించమని సలహాయిచ్చింది -మత్త 4,3. కాని ప్రభువు పిశాచప్రయత్నాన్ని గుర్తించాడు. “మానవుడు ఒక్క రొట్టెచేతనే గాదు, దేవుడు పలికే ప్రతిమాటవల్లా జీవిస్తాడు” అని బదులు చెప్పాడు -ద్వితీ 8,3. ఈ పూర్వవేదవాక్యం మీద వ్యాఖ్యా చెపుతూ జ్ఞానగ్రంథకారుడు “నరుడు ఆహారంవల్లనే

గాక దైవవార్తవల్ల కూడ జీవించాలి. అసలు వానలు కురిపించి నరులకు పంటలు పండించిపెట్టేది దైవవాక్కేగదా?" అని నుడివాడు -16,26.

2. దేవునికి పరీక్ష : యిస్రాయేలీయులకు మస్సావద్ద నీళ్ళు దొరకలేదు. వాళ్లు దేవుడు మనలను విడనాడాడు, లేకపోతే ఈ యగచాట్లు ఎందుకు వస్తాయి అని వాపోయారు. అతడు మనతో వున్నాడో లేదో పరీక్షించి చూడాలి అనుకొన్నారు. మోషేమీద తిరగబడ్డారు. అప్పుడు ప్రభువు వాళ్ళకు మస్సారాతిచట్టునుండి నీళ్ళు పారించాడు. ఇది రెండవ శోధన -17,7.

పిశాచం క్రీస్తుని దేవాలయ గోపురంమీద కూర్చోబెట్టి అక్కడినుండి క్రిందికి దూకమంది. నీతండ్రి నిన్ను ఆదుకోవడానికి వస్తాడో లేదో పరీక్షించి చూడమంది - మత్త 4,6. క్రీస్తుకి పిశాచశోధనం అర్థమయింది. అతడు నీ ప్రభువైన దేవుణ్ణి పరీక్షకు గురిచేయవద్దు అని జవాబు చెప్పాడు -ద్వితీ 6,16.

3. విగ్రహారాధన : యిస్రాయేలీయులకు నిత్యశోధనం బాలు ఆరాధనం. ప్రభువు అప్పుడే ప్రజలతో నిబంధనం చేసికొని ముగించాడు. మోషే కొండమీదికి ఎక్కిపోయి కొంచెం జాగుచేసాడు. అతడు దిగతివచ్చే లోపులోనే వాళ్ళు బాలు చిహ్నమైన కోడెను ఆరాధించడం మొదలెట్టారు -నిర్గమ 32,4. యిస్రాయేలీయుల చరిత్ర పొడుగునా ఈ విగ్రహారాధన అనేది వాళ్ళ ప్రధానపాపం. ఇది మూడవ శోధనం.

పిశాచం ఎడారిలో క్రీస్తుకికూడ ఇదే శోధనం కలిగించింది. అతన్ని ఎత్తయిన కొండమీదికి తీసుకవెళ్ళి ప్రపంచంలోని రాజ్యాలన్నీ చూపించింది. నీవు చాగిలపడి నన్ను ఆరాధించావంటే ఈ రాజ్యాలన్నీ నీకిచ్చివేస్తాను అని మభ్యపెట్టింది. కాని క్రీస్తు "నీ దేవుడైన ప్రభువుని ఆరాధించి అతన్ని మాత్రమే కొలువు" అని జవాబు చెప్పాడు -ద్వితీ 6,13. ఈలా మూడు శోధనల్లోను పిశాచమే ఓడిపోయింది.

యిస్రాయేలు శోధనలకూ క్రీస్తు శోదనలకూ సంబంధం వుందని చెప్పాం. యిస్రాయేలు దేవుని తొలికుమారుడు. అతడు శోధనలకు లొంగిపోయాడు. క్రీస్తు దేవుని మలికుమారుడు. ఇతడు శోధనలను గెలిచాడు. తన పితరుల పాపాలకు పరిహారం చేసాడు. క్రీస్తుద్వారా దేవుని కుమారులమయ్యే మనం కూడ శోధనలకు లొంగకూడదు. శోధనలు వచ్చినపుడు క్రీస్తు విజయం మనీమద పనిచేస్తుంది. అతడు దయ్యాన్ని గెలిచిన వాడు. అతనిగెలుపు మన గెలుపు. ఆ గెలుపు ద్వారా మనంకూడ పిశాచం మీద విజయాన్ని సాధిస్తాం. శోధనలు వచ్చినపుడు మనం ఆ ప్రభువుసహాయం అడుగుకోవాలి. వాటినుండి మనలను గట్టెక్కించేవాడు క్రీస్తే -హెబ్రే 4,15-16.

# 7. సాన్నిధ్యం

పూర్వవేదంలో ప్రభువు యిస్రాయేలీయులకు దగ్గరిచుట్టం అయ్యాడు. వాళ్లనడుమ వసించేవాడు. కనుకనే ఆ ప్రజలు అతన్ని ఇమ్మానువేలు అని పిల్చారు. నిర్గమనకాలంలో ప్రభువు విశేషంగా మందసంలో, గుడారంలో, మేఘస్తంభంలో వసించాడు. వీటిల్లో నెలకొనివుండి యిస్రాయేలును కాపాడాడు. నూత్నవేదంలో క్రీస్తుసాన్నిధ్యం మనలను రక్షిస్తుంది. ఈలా ఈ సాన్నిధ్యం బైబుల్లో ఓ పెద్ద అంశం. ప్రస్తుతాధ్యాయంలో ఈ భావాన్ని పరిశీలించిచూద్దాం.

## 1. మందసం

### 1. మందసరూపం :

మందసం అంటే ఏమిటి? అది కొయ్యతో చేయబడిన పెట్టె. దాని చుట్టు బంగారు రేకు పొదిగారు. దేవుడు పదియాజ్ఞలు వ్రాసి యిచ్చిన రాతిపలకలు దానిలో పెట్టారు. పెట్టెమీద కరుణాఫలకం అనే బంగారు పలక వుంటుంది. దానిమీద ఒకదానికొకటి అభిముఖంగా వుండే రెండు దేవదూతల బొమ్మలుండేవి. ఆ రెండు బొమ్మలకు మధ్య కొంచెం ఖాళీ స్థలం వుండేది. దైవసాన్నిధ్యం వుండేది ఈ స్థలంలోనే – నిర్గ 25,10–22. యూదులు ఈ పెట్టెను దేవుని సింహాసనంగా భావించారు – 1సమూ 55. అది ఆ దేవుని పాదపీఠం అన్నారు –1దిన 25,22. ఎడారికాలంలో ఈ మందసం దైవసాన్నిధ్యానికి మనికిపెట్టు.

### 2. దైవ సందేశం :

పదియాజ్ఞల పలకలు ఈ పెట్టెలో వున్నాయిగదా! కనుక ఇది దైవాజ్ఞలకీ దైవ సందేశానికీ నిలయమైంది. పెట్టెమీది రెండుబొమ్మలనడిమి ఖాళీస్థలంలోనుండి దేవుడు మోషేతో మాటలాడేవాడు –నిర్గ 25,22. తర్వాత ఈ పెట్టెదగ్గరే చాలామంది భక్తులు దైవసందేశం విన్నారు. బాలుడైన సమూవేలు ఇక్కడే దేవుని పిలుపు ఆలించాడు – 1సమూ 3,1–5. ఈ పెట్టె దగ్గరే చాలామంది భక్తులు దేవుని ప్రార్థించారు. సమూవేలు తల్లి అన్నా యిక్కడే బిడ్డకోసం ప్రార్తన చేసింది –1సమూ 1,9–11. ఇక్కడే మోషే బంగారుదూడ నారాధించిన యిస్రాయేలును నాశం చేయవద్దని ప్రభువునకు విజ్ఞాపనం చేసాడు –సంఖ్యా 14,13–19.

### 3. ప్రజలను నడిపించడం :

ఎడారికాలంలో మందసం ముందువెళ్తూండగా ప్రజలు దాని వెనుక నడుస్తుండే వాళ్లు. అది విశ్రాంతి స్థలం చూపించినపుడు వాళ్లు విడిది చేసేవాళ్లు –సంఖ్యా

10,33. ఈలా మందసంమీది నుండి దేవుడు ప్రజలను నడిపించడం మాత్రమే కాదు. తాను వాళ్లపక్షాన యుద్ధం చేసేవాడు. అ తడు రణవీరుడు. అందుకే మందసం సాగినప్పుడెల్ల మోషే "యావే! కదలిరా! నీ శత్రువులు చెదరిపోవాలి" అనేవాడు -సంఖ్యా 10,35-36. మందసం మీది యావే సహాయంతోనే యోషువా యెరికోను ఆక్రమించుకొన్నాడు - యోషు 6,12-21. అతని సహాయంతోనే యోర్దాను నదిని దాటాడు -3,14-18. ఈలా మందసంలోని దేవుడు ఆ ప్రజను నడిపించాడు.

## 2. గుడారం

దైవసాన్నిధ్యాన్ని ప్రసాదించిన రెండవ వుపకరణం గుడారం. యూదులకు మనకులాగ ఇండ్లు వుండేవిగావు, గుడారాల్లోనే జీవించేవాళ్లు. వాళ్ళ దేవుడుకూడ గుడారంలోనే వసించాడు. కనుక మందసంలోలాగే గుడారంలో కూడ ప్రభువు నెలకొనివుండేవాడు. యూదభక్తులు ఈ గుడారంలో దేవుణ్ణి కలసికొని అతని సందే శాలనూ సలహాలనూ స్వీకరించేవాళ్లు. కనుకనే దానికి సమాగమపు గుడారం అనిపేరు. ఓ మేఘం ఈ గుడారం ద్వారాన్ని కప్పుతూండేది. గుడారం మధ్యలో తెరవుండేది. ఆ తెరవెనుక మందసం వుండేది. తెర ముందట నిలుచుండి భక్తులు యావే దర్శనం చేసికొనేవాళ్లు. ఇక్కడ విశేషంగా యావే మోషేతో మాటలాడేవాడు. స్నేహితుడు స్నేహితునితోలాగే ప్రభువు మోషేతో ముఖాముఖి సంభాషించేవాడు. భక్తులకూ భగవంతునికీ గల సన్నిహిత సంబంధాన్ని సూచించే పూర్వవేద ఘట్టాల్లో ఇది ప్రశస్త మైంది -నిర్గ 33,7-11. ఎడారికాలంలో గుడారమే దేవాలయం. భక్తులు ఈ గుడారంలో సమావేశమై అక్కడ వెలసివున్న దేవునికి మ్రొక్కుకొనేవాళ్లు.

## 3. మేఘస్తంభం

దైవసాన్నిధ్యాన్ని ప్రసాదించిన మూడవ వుపకరణం మేఘం. ఇది మూడు పనులు చేసింది.

### 1. సాన్నిధ్యం :

మేఘంలో దైవసాన్నిధ్యం నెలకొనివుండేది. అది గుడారంముందు వాలివుండేది. మోషే గుడారంలోకి వెళ్ళగానే దేవుడు మేఘంలోనుండి అతనితో మాటలాడేవాడు-నిర్గ33,9.

### 2. నడిపించడం

ఎడారికాలం నలభై యేళ్లూ మేఘం యిస్రాయేలీయులను నడిపించుకొని వెళ్ళింది. ఇది గుడారానికి కమ్ముకొని వుండేది. రాత్రుల్లో అగ్నిలా మెరుస్తుండేది. కనుకనే దాన్ని

కాంతిమేఘం  అన్నారు. ఇక, మేఘం గుడారంమీద వాలివున్నంతకాలం యిస్రాయేలీయులు విశ్రాంతి తీసికొనేవాళ్లు. అది గుడారంమీదినుండి పైకి లేవగానే వాళ్లు ప్రయాణం సాగించే వాళ్లు. అది ఎక్కడ ఆగిపోతే వాళ్లు అక్కడే ఆగి విడిది పన్నేవాళ్లు. ఈలా అది వాళ్ళను వాగ్దత్తభూమికి నడిపించుకొని పోయింది –నిర్గ 40,36–38.

### 3. కాపాడ్డం

రెల్లుసముద్రం వొడ్డున ఐగుప్తీయులు యిస్రాయేలీయులను కలసికొన్నారు. వాళ్లు యిస్రాయేలీయులను మళ్లా బలవంతంగా పట్టుకొని తీసుకపోవడానికి వచ్చారు. అంతవరకు యిస్రాయేలీయుల ముందు నడుస్తున్న మేఘం వెనుకకు వచ్చి వాళ్ళకూ ఐగుప్తీయులకూ మధ్య నిలిచింది. అది యిస్రాయేలీయులవైపు వెలుగునీ ఐగుప్తీయులవైపు చీకటినీ ప్రసరించింది. ఆ చీకటిలో శత్రువులు యిస్రాయేలీయులను చూడలేక పోయారు. వాళ్లకు ఏహానీ చేయలేకపోయారు. అలా మేఘం వాళ్లను కాపాడింది –14,19–20.

### 4. నూత్నవేద సాన్నిధ్యం

యావే పూర్వవేద ప్రజలకులాగే క్రీస్తు నూత్నవేద ప్రజలకు ప్రత్యక్షమై వుంటాడు. నేడు క్రీస్తు మనకు సాక్షాత్కారమయ్యే మార్గాలు రెండు.

### 1. ఆత్మద్వారా

అతడు మన యిమ్మానువేలు –మత్త 1,23. లోకాంతం వరకు మనతో వుండేవాడు –28,20. కాని ఉత్థానమై తండ్రి వద్దకు వెళ్ళిన క్రీస్తు నేడు మనతో ఏలా వుండగలడు? ఆత్మద్వారానే. క్రీస్తు వెళ్ళి రెండవ నాయకుడైన ఆత్మను పంపాడు –యోహా 16,7. ఈ యాత్మే ఉత్థాన క్రీస్తుని మనకు ప్రత్యక్షం చేస్తుంది –1కొ 12,3.

ఆత్మ అనుగ్రహం వరప్రసాదం. కనుక వరప్రసాద రూపంలో కూడ ప్రభువు మనకు ప్రత్యక్షమౌతాడు. క్రీస్తు వచ్చి మన హృదయాన్ని మెల్లగా తడతాడు. ఏ భక్తుడైనా సరే అతని స్వరాన్ని ఆలించి హృదయకవాటాన్ని తెరిస్తే అతడు లోన ప్రవేశిస్తాడు. తాను ఆ భక్తునితో భుజిస్తాడు. అనగా ప్రభువు అతనికి స్నేహితుడై వుంటాడు –దర్శన 3,20. ఇంకా క్రీస్తుని ప్రేమించే నరుడు అతని ఆజ్ఞలు పాటిస్తాడు. అప్పుడు ప్రభువూ అతని తండ్రీ విజయంచేసి ఆ భక్తునితో వసిస్తారు –యోహా 14,23.

పూర్వవేదంలో ధర్మశాస్త్రం చదివి విన్పించే భక్తసమాజంలో ఆ ప్రభువు నెలకొని వుండేవాడు. ఆ సాన్నిధ్యానికి "షెకీనా" అని పేరు. హీబ్రూ భాషలో షెకీనా అంటే నివాసం. ఇక నూత్నవేదలోకూడ ఎక్కడైనా క్రీస్తు పేర ఓ బృందం సమావేశమైతే దాని మధ్యలో ఆ క్రీస్తు నెలకొని వుంటాడు –మత్త 18,20. అతడు మన షెకీనా. నరులు

సోదర ప్రేమతో మెలిగేకాడగూడ అతని సాన్నిధ్యం వుంటుంది. అతడు "మీరు నా సోదరులు ఉపకారం చేసారు కనుక అది నాకు చేసినట్లే భావిస్తాను" అంటాడు -మత్త 25,40. ఇవన్నీ వరప్రసాద రూపమైన ప్రభుసాక్షాత్కారానికి ఉదాహరణలు. ఈలా పరిశుద్ధాత్మ కలిగించే క్రీస్తు సాన్నిధ్యం నానారూపాల్లో వుంటుంది.

2. దివ్యసత్ప్రసాదంద్వారా

పూర్వవేదంలో దైవమందసం చేసిన రక్షణకార్యాలన్నీ నూత్నవేదంలో మళ్లా దివ్యసత్ప్రసాదం కూడ చేస్తుంది. అది మనకు దైవచిత్తాన్ని తెలియజేస్తుంది. ఇహలోకయాత్రలో దారి చూపించి మనలను ముందుకు నడిపిస్తుంది. శత్రువుల నుండి మనలను కాపాడుతుంది.

ప్రభువు మోషేతో మిత్రునిలాగ ముఖాముఖి మాట్లాడాడు. ఇక్కడగూడ ప్రభువు మీరు నా సేవకులు గాదు, స్నేహితులు అంటాడు -యోహా 15,15. ఇక్కడగూడ ప్రభువు మన భారం తొలగిస్తాడు. "భారంచేత అలసివున్న వాళ్ళంతా నాచెంతకు రండి నేను మీకు విశ్రాంతినిస్తాను" అంటాడు -మత్త 11,28. కనుక ఆ తూర్పుదేశపు జ్ఞానుల్లాగే ఇక్కడ మనం ఆ ప్రభువు ముందు ప్రణమిల్లాలి -మత్త 2,11.

8. మహానాయకుడు మోషే

ఐగుప్తు నిర్గమనంలో ప్రముఖపాత్ర మోషే. అతని నాయకత్వం ద్వారానే యావే ప్రజలను ఐగుప్తునుండి నడిపించుకొని వచ్చాడు. ఈ యధ్యాయంలో మోషే వ్యక్తిత్వాన్ని కొద్దిగా పరిశీలించిచూద్దాం.

1.దేవునికి సేవకుడూ, మిత్రుడూ

మోషే బానిసల కుటుంబంలో పుట్టినవాడు. ఫరో కూతురు అతన్ని నైలునది నుండి రక్షించి దత్తు తీసికొంది. ఆమె అతనికి ఐగుప్తు విద్యలన్నీ నేర్పించింది -అచ 7,22. మోషే నాయకుడు కాకమునుపు స్వీయజనుల అనిష్టానికి గురయ్యాడు. ఫరోకు దడిసి మిద్యానుకు పారిపోయాడు. ఎడారిలో దేవుడు ప్రత్యక్షమై తన పేరు రక్షణప్రణాళికా అతనికి తెలియజేసాడు -నిర్గ 3,13-15. ప్రభువు తన్ను ఫరోవద్దకు పంపబోగా మోషే మొదట తప్పుకోజూచాడు -3,11. కాని యావే అతనికి తోడై యుంటానని బాస చేసాడు. ఐనా మోషే నేను నత్తివాడనని చెప్పి వెనుకాడాడు. కాని చివరకు ప్రభువు సేవకుడుగా పనిచేయడానికి అంగీకరించాడు. మెరీబావద్ద రాతిచుట్టును చరిచినప్పుడు అతని నమ్మిక కొంచెం చలించింది -సంఖ్యా 20,10. ఐనా అతడు ప్రభువుని విశ్వసించిన భక్తుడు. అనన్య చిత్తంతో యావేను సేవించిన వాడు. దేవుడు అతనితో స్నేహితుల్లాగ మాట్లాడాడు

–నిర్గ 33,11. ప్రభువు తన మహిమను కాకపోయినా పేరును అతనికి వెల్లడిచేసాడు. మేఘంలోనుండి అతన్ని తన ప్రజలకు నాయకునిగా ప్రకటించాడు –19,9.

## 2. విమోచకుడూ, నిబంధన మధ్యవర్తీ

ఐగుప్తునుండి ప్రజలను గొర్రెలమందనులాగ నడిపించుకొని వచ్చాడు మోషే –కీర్త 77,21. అతడు సీనాయివద్ద ప్రభువుకి నిబంధనబలి అర్పించాడు. ప్రభువు అతని నాయకత్వం క్రింద ప్రజలతో నిబంధనం చేసికొన్నాడు –నిర్గ 24,3–8. మోషేను అనుసరించినవాళ్ళంతా నిబంధనప్రజలు –1కొ 10,2. అతడు ప్రజలకు నాయకుడూ వారి విమోచకుడూను –అ.చ. 7,35. ఇంకా అతడు నిబంధనకు మధ్యవర్తి. ఈ క్రియలో అతడు రానున్న నూత్నవేద మధ్యవర్తి క్రీస్తుకు సూచక వ్యక్తి –హెబ్రే 8,6.

3. ప్రవక్తా, ధర్మశాస్త్రప్రదాతా

మోషేవంటి ప్రవక్త పూర్వవేదంలో మళ్లా పుట్టలేదు –ద్వితీ 34,10. పైగా అతడు ధర్మశాస్త్రప్రదాత. అందుకే యిస్రాయేలీయులకు అతడంటే పరమగౌరవం. హిందూ సంప్రదాయంలో ధర్మశాస్త్రకారుడు మనువుకి ఎంత ప్రశస్తి వుందో యూద సంప్రదాయంలో మోషేకు అంత ప్రశస్తి వుంది.

## 4. విజ్ఞాపనకారుడు

మోషే ప్రార్థనాపరుడు. అతడు చాలసార్లు యిస్రాయేలీయుల కొరకు ప్రభుని ప్రార్థించాడు. యోషువా అమాలెకీయులతో యుద్ధం చేస్తుండగా తాను కొండమీదికి వెళ్ళి తన ప్రజకు విజయం ప్రసాదించమని ప్రభువుని మనవిచేసాడు –నిర్గ 17,9–13. ప్రజలు దూడను ఆరాధించినందుకు యావే వాళ్ళను నాశంచేయబోయాడు. కాని మోషే ప్రార్థనచేసి ప్రభువు కోపాన్ని చల్లార్చాడు –32,11–14. ఆ సందర్భంలో అతడు యావే యిస్రాయేలీయులను మన్నింపనొల్లకపోతే తన పేరును ఆ ప్రభువు గ్రంథంలో నుండి  కొట్టివేయవలసిందని గూడ మనవిచేసాడు. అతని చిత్తశుద్ధిని నిరూపించడానికి ఈ యొక్క వుదామరణం చాలు –32,31. యెషయా తన ప్రవచనం 53,12లో ఒక బాధామయసేవకుడు ప్రజల తరపున విజ్ఞాపనం చేసినట్లుగా వర్ణించాడు. ఆలాంటివాడే ఈ మోషేకూడాను.

## 5. మోషే వినయమూ, బాధలూ

భూమిమీది నరులందరికంటె గూడ వినయవంతుడు మోషే –సంఖ్యా 12,3. ప్రభువు మోషే ఆత్మను డెబ్బదిమంది పెద్దలకు పంచియిచ్చాడు. వాళ్లు ఆవేశంతో

ప్రవచనం పలికారు. వాళ్ళ బృందానికి చెందని మరియిద్దరిమీదికి గూడ ఆత్మ దిగి వచ్చింది. అది చూచి యోషువా అసూయపడ్డాడు. మోషేను వాళ్ళ ప్రవచనం ఆపివేయమని కోరాడు. కాని మోషే యిస్రాయేలు ప్రజలంతా ఆత్మనుపొంది ప్రవక్తలైతే బాగుంటుంది అన్నాడు. అతడు అంతటి ఉదారస్వభావుడూ, వినయవంతుడూను – 11,29. ఇంకోమారు మిర్యాము అహరోను అతన్ని తూలనాడారు. ఐనా మోషే సహించి పూరకున్నాడు –12,1–3. మరోమారు యిస్రాయేలు ప్రజలు మోషే నాయకత్వాన్ని నిరాకరించారు. “ఆ మోషేకు ఏమికీడు మూడిందో మాకు తెలియదు” అంటూ యావేను విడనాడి విగ్రహారాధనకు పూనుకొన్నారు –నిర్గ 32,1. కాని అదే సమయంలో మహానుభావుడైన మోషే కొండమీద ఆ మూర్ఖులకొరకు దేఉవనికి మొరపెడుతూన్నాడు –32,32. అతడు “ప్రభో! వీళ్ళను పరామర్శించే బాధ్యత నా నెత్తిన పెట్టావెందుకు? నేనేమి వీళ్ళను కన్నానాయేమిటి” అని మొరపెట్టుకొన్నాడు –సంఖ్యా 11,11–14. ఇదిగెత్సమని తోపులో క్రీస్తుచేసిన ప్రార్థనలాంటిది –మార్కు 14,36. మోషే శీలాన్ని అంచనా కట్టడానికి ఈ సందర్భాలు చాలు. ఎమ్మావు త్రోవలో ప్రభువు మోషే. ప్రవక్తలూ చెప్పినట్లుగానే నేను బాధలు అనుభవించాను అంటాడు –లూకా 24,27. మోషే చెప్పినట్లు మాత్రమేగాదు, మోషే అనుభవించి నట్లుగా గూడ బాధలు అనుభవించాడు క్రీస్తు.

## 6. క్రీస్తుతో పోలిక

మోషేకూ క్రీస్తుకూ చాల పోలికలున్నాయి. ఏలీయా ఎలీషాకు తన ఆత్మనిచ్చాడు –2రాజు 2,9–12. మోషే యోషువాకు తన ఆత్మనిచ్చాడు –ద్వితీ 34,9. అలాగే క్రీస్తు కూడ మనకు తన ఆత్మనిచ్చాడు –యోహా 19,30; 16,7. అతడు క్రీస్తులాంటి వాడు. మోషే భావిలోరానున్న క్రీస్తు ప్రవక్తను స్వయంగా పేర్కొన్నాడు –ద్వితీ 18,18. అతని కష్టాలనుగూర్చి కూడ చెప్పాడు –లూకా 24,27. వాళ్లిద్దరికీ దగ్గరి సంబంధం వుండబట్టే తబోరుకొండమీద క్రీస్తుతోపాటు మోషేకూడ కన్పించాడు –లూకా 9,30.

సీనాయి కొండమీద యావే తేజస్సుసోకి మోషేముఖం ప్రకాశించింది –నిర్గత 34,29–35. ఉత్థానక్రీస్తు తేజస్సుసోకి, అతని నుండి వెలువడే ఆత్మనుపొంది, మనంకూడ ప్రకాశిస్తాం –2కొ 3,18.

మోషే యూదులకు ధర్మశాస్త్రం ఇచ్చాడు. క్రీస్తు మనకు వరప్రసాదమూ సత్యమూ ప్రసాదించాడు –యోహా 1,17. క్రీస్తు క్రొత్త మోషే. పూర్వం ఆ మోషే యూదులను వాగ్దత్త భూమికి నడిపించుకొనిపోయాడు. ఈనాడు క్రీస్తు మనలను మోక్షంలోని తండ్రి యింటికి నడిపించుకొనిపోతాడు –హెబ్రే 3,5–6. ఈలా పూర్వవేదంలోని మోషే నూత్నవేదంలోని క్రీస్తుని తలపింపజేస్తాడు.

## 9. ఆదిపంచకమూ, నాల్గు సంప్రదాయాలూ

### 1. రచనా చరిత్ర

ఈ పుస్తకంలోని 6వ అధ్యాయంలో సముద్రోత్తరణను గూర్చి చెప్పేపుడు యావే యాజకసంప్రదాయాలను పేర్కొన్నాం. ఈ చివరి అధ్యాయంలో వీటలిని గూర్చి సంగ్రహంగా తెలుసుకొందాం.

బైబుల్లోని తొలి ఐదు పుస్తకాలకు ఆదిపంచకం అని పేరు. ఇవి ఆది, నిర్గమ, లేవీయ, సంఖ్యా, ద్వితీయోపదేశ కాండలు. యూదుల సంప్రదాయంలో వీటికన్నిటికి కలిపి "టోరా" అని పేరు. టోరా అంటే ఉపదేశం. అనగా ఈ యైదు పుస్తకాలు మోషే వుపదేశమని యూదులభావం. ఐనా మోషే ఈ యైదింటిలో ఒక్కటి కూడ వ్రాయలేదు. ఈ పుస్తకాలు తయారుకావడానికి ఇంచుమించు800 ఏండ్లు పట్టింది. ఎనోన తావుల్లో ఎందరో రచయితలు చేసిన కృషివల్ల ఈ గ్రంథాలు వెలువడ్డాయి. మొదటిరోజుల్లో ఆదిపంచకం నేడున్నట్లుగా లేదు. ఆదిపంచక గ్రంథాలు అవతరణంలో మూడు దశలు గోచరిస్తాయి.

1. క్రీస్తుపూర్వం 13వ శతాబ్దంలో యూదులు మోషే నాయకత్వం క్రింద ఐగుప్తునుండి వెడలివచ్చాడు. ఈ కథను మోషే సంగ్రహంగా చెప్పాడు. ఇది యూదుల జాతీయేతిహాసం అయింది. కాని ఈ యితిహాసం లిఖితంకాలేదు. ముఖతః మాత్రమే ప్రచారంలో వుండేది. అనగా తాతలూ తండ్రులూ కుమారులూ ఒకరికొకరు ఈ కథను నోటితోనే చెప్పుకొంటూ పోయేవాళ్లు. ఈలా మూడువందల యేండ్లపాటు ఈ కథ ముఖతః ప్రచారంలోవుంది. పూర్వం ఇండియాలో వేదాలూ భారత రామాయణాది ఇతిహాసాలు కూడ ఈలాగే ముఖతః ప్రచారంలో వుండేవి.

2. క్రీస్తుపూర్వం 10వ శతాబ్దంలో పాలస్తీనా దక్షిణ భాగానికి చెందిన పండితులు ఈ యైగుప్తు నిర్గమనకథను మొట్టమొదటిసారిగా హీబ్రూ భాషలో గ్రంథస్థం చేసారు. ఆదికాండం నుండి ద్వితీయోపదేశకాండం వరకు ఈ కథ ఏకగ్రంథంగా వుండేది. వాళ్లు దేవుణ్ణి "యావే" అని పిల్చారు. కనుక దీనికి యావే సంప్రదాయం అని పేరు. నేడు బైబులు విద్వాంసులు ఈ సంప్రదాయాన్ని "J" అని పిలుస్తారు.

8వ శతాబ్దంలో పాలస్తీనా ఉత్తరభాగానికి చెందిన పండితులు పై జాతీయేతిహాసాన్ని మరో గ్రంథంగా వ్రాసారు. వాళ్లు దేవుణ్ణి "ఎలోహి" అని పేర్కొన్నారు. కనుక దీనికి ఎలోహిం సంప్రదాయం అని పేరు. నేడు పండితులు దీన్ని "E" అని పిలుస్తారు.

722 ప్రాంతంలో ఉత్తరాది పండితులు వాళ్ళ గ్రంథాన్ని పాలస్తీనా దక్షిణ భాగానికి తీసికొనివచ్చారు. కనుక వాళ్ళ ఎలోహిం సంప్రదాయగ్రంథం దక్షిణదేశంలోని యావే సంప్రదాయగ్రంథంతో మిళితమైపోయింది. ఈ రెండూ కలసి యావే ఎలోహిం గ్రంథం ఏర్పడింఇ. దీన్ని నేడు విద్వాంసులు "JE" అని పిలుస్తారు.

8వ శతాబ్దంలోనే ఔత్తరాహులైన యాజకులు జాతీయేతీహాసాన్ని మరో గ్రంథంగా తయారు చేసారు. వీళ్ళు మోషేకు ప్రాముఖ్యమిచ్చారు. వీళ్ళ గ్రంథానికి ద్వితీయోపదేశ సంప్రదాయం అని పేరు. ఇప్పుడు బైబులుపండితులు దీన్ని "D" అని పిలుస్తారు.

6వ శతాబ్దంలో యెరూషలేములోని యాజకులు పైకథనే మరో గ్రంథంగా వ్రాసారు. వీళ్లు యాజకులకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు. వీళ్ళ గ్రంథానికి యాజక సంప్రదాయం అని పేరు. ఇప్పుడు పండితులు దీన్ని "P" అని పిలుస్తారు. కనుక ఆరవ శతాబ్దంనాటికి మోషే ముఖతః చెప్పినకథ పాలస్తీనా దేశంలో నాల్గు గ్రంథాలుగా ప్రచారంలోకి వచ్చింది.

3. ఈలావుండగా 5వ శతాబ్దిలో ఒక సంధాత ఈ గ్రంథాలన్నిటినీ కలిపివేసాడు. అతని నాటికే యావే ఎలోహిం సంప్రదాయాలు కలసివున్నాయి. అతడు యాజక సంప్రదాయాన్ని గూడ ఈ గ్రంథంతో మిళితం చేసాడు. ద్వితియోపదేశ సంప్రదాయాన్ని మాత్రం అనుబంధంగా గ్రంథాంతంలోచేర్చాడు. కనుక అతడు JEP + D అనే పద్ధతిలో నాల్గు గ్రంథాలు కలిపి ఏకగ్రంథంగా తయారుచేసాడు.

క్రీస్తుపూర్వం 5వ శతాబ్దం తర్వాత మరో రచయిత ఈ యేకగ్రంథంమీద కృషి చేసాడు. అతడు సంప్రదాయాలనుబట్టి పోలేదు. ఇతివృత్తాన్ని బట్టిపోయాడు. కథను బట్టి ఈ యేకగ్రంథాన్ని ఐదుపుస్తకాలుగా విభజించాడు. ఇవే నేడు మనకు లభ్యమయ్యే ఆదికాండం మొదలైన ఆదిపంచకం. ఈ చివరి పద్ధతిలో ఒకే పుస్తకంలోనే పై నాల్గు సంప్రదాయాలూ ఇమిడివుండడం జరిగింది. ఉదాహరణకు ఒక్క ఆదికాండంలోనే అన్ని సంప్రదాయాల రచనా కన్పించవచ్చు.

## 2. నాల్గు సంప్రదాయాల లక్షణాలు

పై నాల్గు సంప్రదాయాల్లోను భినభిన్న లక్షణాలు గోచరిస్తాయి. ఒక్కో సంప్రదాయం వాళ్లు ఒక్కో అంశానికి ప్రాముఖ్యమిస్తూ వచ్చారు. ఆదిపంచకాన్ని బాగా అర్థం చేసికోవాలి అంటే ఈ యైదుపుస్తకాల్లో ఏభాగం ఎవరి సంప్రదాయానికి చెందిందో తెలిసివుండాలి. ఈ క్రింద సంప్రదాయ లక్షణాలను క్లుప్తంగా పేర్కొంటున్నాం.

### 1) యావే సంప్రదాయం

ఈ సంప్రదాయంవాళ్లు దేవుణ్ణి యావే అని పిలుస్తారు. వాళ్ళకు భగవంతునిపట్ల చాల చనువు వుంటుంది. అతన్ని ఓ నరుణ్ణిలాగ వర్ణిస్తారు. యావే నరుణ్ణి చేసి తోటలో

వుంచుతాడు. తాను అతనితో సాయంకాలపు చల్లగాలికి షికారుకువెళ్తాడు –ఆది 3,8. అతడు తన చేతిలోనే నోవా వోడ తలుపు మూసివేస్తాడు –7,16. అబ్రాహాము ఇంటిలో స్వయంగా భుజిస్తాడు –18,8. సొదొమ గొమఱ్ఱా పట్టణాలను పరిశీలించడా నికి వెళ్తాడు –18,20. సొదొమ గొమఱ్ఱా పట్టణాలను పరిశీలించడానికి వెళ్తాడు – 18,20. ఈ సంప్రదాయం రచయితలు పేర్లకు వ్యుత్పత్తి అర్థం చెపుతారు. ఏవ అవే పదానికి జీవులతల్లి అని అర్థం –3,20. ఏసావు అనేమాటకు రోమామయుడు అని అర్థం –25,25. వీళ్ళు రచనలో సంభాషణలో నాటకీయశైలి వాడతారు. నరుల మానసిక పరిస్థితి వ్యక్తీకరించడంలో దిట్టలు. వీళ్ళ శైలి మూర్తిమంతంగాను చదవడానికి ఆకర్షణీయంగానువుంటుంది.

### 2) ఎలోహిము సంప్రదాయం

వీళ్లు దేవుణ్ణి ఎలోహిం అని పిల్చారు. ఈ రచయితలు దేవునిపట్ల అంత చనువు చూపరు దేవునికీ నరునికీ మధ్య చాల అంతరమున్నట్లుగా వర్ణిస్తారు. భగవతుడు నరులతో కలలద్వారా గాని దూతలద్వారా గాని మాటలాడతాడు. వీళ్ళకు ప్రవక్తలంటే యిష్టం. యావే సంప్రదాయం దేవుణ్ణి యావే అంటే వీళ్లు ఎలోహిం అంటారు. ఆ సంప్రదాయంలోని "సీనాయి" "యిత్రో" అనే పేర్లను వీళ్లు "హోరెబు" "హోబబు" అని పేర్కొన్నారు.

### 3) యాజక సంప్రదాయం

వీళ్ళకు ధర్మశాస్త్రమూ ఆరాధనా అంటే అభిమతం. వంశవృక్షాలూ కాలమానాలు పేర్కొంటారు. వీళ్లు భగవంతుణ్ణిగాను మహా పవిత్రుణ్ణిగాను చిత్రిస్తారు. నరుడు దేవుని దగ్గరకు వెళ్లలేదని వీళ్లభావం. ఈ రచయితల శైలి అమూర్తంగా వుంటుంది. పునరుక్తులతో నిండివుంటుంది. చదవడానికి అంత ఆకర్షణీయంగా వుండదు. ఐనా వీళ్లు గొప్ప దైవశాస్త్రజ్ఞులు.

### 4) ద్వితీయోపదేశ సంప్రదాయం

ఈ రచయితలు మోషేకు ప్రాముఖ్యమిచ్చారు. ద్వితీయోపదేశ గ్రంథమంతా ఈ సంప్రదాయానికి చెందిందే. వీళ్ళ రచన ఉపన్యాస ధోరణిలో వుంటుంది. ఉదాత్తమైన శైలిని వాడారు. మచ్చుకు వీళ్ళ ప్రయోగాలు కొన్ని : దేవుణ్ణి పూర్ణహృదయంతోను, పూర్ణాత్మతోను ప్రేమించాలి. మీరు ఐగుప్తులో బానిసలుగా వుండేవాళ్లు. పాలూ తేనెలూ ప్రవహించే నేల. దాస్యగృహం. యావే చాచిన బాహువుతో మిమ్ములవిమోచించాడు. యిస్రాయేలూ విను – మొదలైనవి.

నేడు బైబులు పండితులు ఆదిపంచకంలోని ఐదుగ్రంథాల్లో ఏ వాక్యాలు ఏ సంప్రదాయానికి చెందినవో విభజించిచూపగలరు.

# 6. సంఖ్యాకాండం

బైబులు భాష్యం - 145

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | టబేరావద్ద నిష్ఠురాలు | 104 |
| 2. | కిబ్రోతు హట్టావా వద్ద నిష్ఠురాలు | 105 |
| 3. | మిర్యాము అహరోనుల అసూయ | 106 |
| 4. | వేగు చూడబోయినవారి కథ | 107 |
| 5. | కోరా, దాతాను అబీరాముల తిరుగుబాటు | 108 |
| 6. | మోషే అవిశ్వాసం | 110 |
| 7. | కంచు సర్పం | 111 |
| 8. | బిలాము కథ | 111 |
| 9. | బాలుపెయోరు సంఘటనం | 114 |
| 10. | మోషేకు అనుయాయి యోషువా | 115 |
| 11. | సంఖ్యాకాండం, క్రైస్తవులు | 115 |


## 1. టబేరా వద్ద నిష్ఠురాలు 11,1-3

యిస్రాయేలు ప్రజలు మోషే నాయకత్వాన సీనాయినుండి కదలి ఎడారిలో ప్రయాణం చేస్తున్నారు. వాళ్ళు టబేరా వద్ద మోషేమీద తిరగబడ్డారు. మోషేను ఎదిరిస్తే దేవుణ్ణి ఎదిరించినట్లే. కనుక దేవుడు అగ్నిని పంపి ప్రజలను కాల్చివేసాడు. ఆ శిక్షకు తట్టుకోలేక ప్రజలు మోషేను దేవునికి విన్నపం చేయమని బతిమాలారు. అతని వేడుదలపై దేవుడు అగ్నిని ఆపివేసాడు. ఈ తావుకి టబేరా అని పేరు. ఈ పేరుకి మండడం అని అర్థం. అనగా ఇక్కడ దేవుని అగ్ని యిస్రాయేలీయులపై మండి వారిని శిక్షించింది. బైబులు చాల తావుల్లో స్థలనామాలను పేర్కొని, ఆ నామం ఏలా వచ్చిందో కథగా చెప్తుంది. ఈ కథ అలా స్థలనామాలను పేర్కొనేది.

ఇది తిరుగుబాటు కథ. ఈ గ్రంథంలో ఈలాంటి తిరుగుబాట్లు చాల వస్తాయి. మామూలుగా వీటిల్లో 5 అంశాలు వుంటాయి. 1. ప్రజలు దేవునిపై తిరగబడతారు. 2. దేవుడు వారిని శిక్షిస్తాడు. 3.ప్రజలు ఆ శిక్షను మోషేకు విన్నపం చేస్తారు. 4. అతడు దేవునికి ప్రార్థన చేస్తాడు. 5. శిక్ష తొలగిపోతుంది.

దేవునికి ఎదురుతిరగడం పాపం. ఆలాంటి పాపానికి మనం పాల్పడకూడదు.

## 2. కిబ్రోతు హట్టావా వద్ద నిష్ఠురాలు 11,4-35

ఇదికూడ స్థలనామాన్ని తెలిపేకథే. కిబ్రోతు హట్టావా అనేపేరు. ఎందుకు వచ్చిందో ఈ సంఘటనం చెప్తుంది.

ఇక్కడ రెండు కథలున్నాయి.మొదటిది ప్రజలు నిష్ఠురాలు పలికితే దేవుడు వారికి మాంసాన్నిచ్చాడు. రెండవది, మోషేకు సహాయం చేయడానికి దేవుడు 70 మంది పెద్దలను నియమించాడు. మూల రచయితలు ఈ రెండు సంఘటనలు కలిపి వేసారు. కాని మనం వీటిని విడివిడిగా చూడాలి.

1. యిస్రాయేలీయులూ వారితో వచ్చిన అన్యజాతి ప్రజలూ కూడ తినడానికి మాంసం ఈయమని మోషేమీద తిరగబడ్డారు. మేం ఐగుప్తులో చేపలూ కూరగాయలూ తిన్నాం. ఇక్కడ దిక్కుమాలిన మన్నా వొక్కటే దొరుకుతుంది అన్నారు. మోషే వారి ఫిర్యాదును దేవునికి తెల్పాడు. ఇంతమందికి నేనెక్కడ మాంసం తెచ్చిపెట్టగలను? ఈ జనాన్ని తల్లిలా, దాదిలా సాకవలసింది నీవుగాని నేనుకాదు అన్నాడు.

ప్రభువు ప్రజల అవిశ్వాసానికి వారిపై కోపించాడు. ఐనా వారికి సముద్రం మీదినుండి పూరేడు పిట్టలను పంపాడు. ఇవి వలసపక్షులు. సముద్రం మీదిగా ఎగిరివచ్చి యిస్రాయేలు శిబిరంలో వాలాయి. ప్రజలు ఆశతో ఒక్కొక్కరు 50 బుట్టలు నిండిందాకా వాటిని పట్టుకొన్నారు. కాని వాళ్ళు ఆ పక్షుల మాంసాన్ని నోటిలో పెట్టుకోగానే దేవుడు అంటురోగాన్ని పంపివారిని చంపివేసాడు. చచ్చిన వారిని అక్కడే పాతిపెట్టారు. కావుననే ఆ తావుకి కిబ్రోతు హట్టావా అని పేరు వచ్చింది. అనగా ఆసబోతుల సమాధులు అని అర్థం. దురాశతో మాంసాన్ని తినబోయి ప్రజలు అలా నశించారు. ప్రజల్లో మాంసం తిననివాళ్ళు మాత్రమే బ్రతికున్నారు అనుకోవాలి. తిండిపట్ల దురాశ పనికిరాదనీ, కేవలం కూటికొరకు దేవునిమీద తిరగబడరాదనీ ఈ కథ నీతి.

2. ఇక రెండవకథ. ఈ ప్రజల బాగోగులను నేనొక్కణ్ణే విచారించలేను అని మోషే దేవునికి మొరపెట్టాడు. నీవు నన్ను చంపివేస్తే బాగుంటుందని వాపోయాడు. ప్రభువు అతనికి సహాయకులుగా 70 మంది పెద్దలను నియమించాడు. మోషే ఆత్మను కొంత తీసికొని వారికిచ్చాడు. అనగా అతని ప్రవచనశక్తి వారికి కూడ కొంత లభించిందని భావం. ఈ శక్తితోనే వాళ్ళు కూడ ప్రవచనం చెప్పారు. ఇక్కడ ప్రవచన మంటే దేవుణ్ణి స్తుతించడమే. ప్రజలకు ప్రధాన నాయకుడు మోషే వొక్కడే. ఈ పెద్దలు అతనికి సహాయకులుగా వుంటారు.

ఎల్దాదు, మేదాదు అనే యిద్దరుకూడ పై 70 మందిలోనివాళ్లే. వాళ్ళు గుడారానికి రాక ఇంటివద్దనే వున్నా ప్రవచనం చెప్పారు. వారి ప్రవచన శక్తికి అసూయపడి వారి నోళ్ళు మూయించమని యోషువా మోషేతో చెప్పాడు. కాని మోషే యిస్రాయేలు సమాజమంతా ప్రవక్తలై దేవుణ్ణి స్తుతిస్తే బాగుంటుంది అన్నాడు. అనగా అతడు అసూయ, స్వార్థంలేని మహానాయకుడు. తర్వాత ఈ యిద్దరుకూడ మోషేతో కలసి సమాజానికి పెద్దలుగా వ్యవహరించారు.

## 3. మిర్యాము అహరోనుల అసూయ 12,1-16

ఈ సంఘటనం కుటుంబంలోని అంతఃకలహాల వల్ల పుట్టితంది. మోషే అన్యజాతి స్త్రీని పెండ్లాడాడు. దీన్ని కారణంగా దీసికొని అహరోను మిర్యాము ఏకమై మోషేమీద పోట్లాడారు. వాళ్ళు నీవొక్కడివే నాయకుడివా? ప్రభువు మాద్వారా గూడ మాట్లాడలేదా అన్నారు. అనగా మోషేతో పాటు మేముకూడ యిస్రాయేలు సమాజానికి నాయకులమని వాళ్ళ భావం. అతని ఏకైక నాయకత్వాన్ని అన్నా అక్కా సవాలు చేసారు. నరులందరిలోను మోషే మహావినయవంతుడు -3. అనగా అతడు దేవునికి సన్నిహితుడు, ప్రీతిపాత్రుడు. అక్క తగాదా ఆడినా మోషే తగాదాకు దిగలేదు.

దేవుడే అతని కోపు తీసికొన్నాడు. ప్రభువు అహరోను మిర్యాములను చీవాట్లు పెట్లాడు. నేను ఇతర ప్రవక్తలతో కలలద్వారా పరోక్షంగా మాటలాడతాను. కాని మోషేతో నేరుగా మాటలాడతాను. అతడు నా యాకారాన్ని చూచాడు. అలాంటివాణ్ణి మీరు ఎదిరిస్తారా అని మందలించాడు. ప్రభువు మందలింపు ద్వారా మోషే ఏకైక నాయకుడని రుజువైంది.

దేవుడు మిర్యాముకు శిక్షగా కుష్ఠరోగాన్ని కలిగించాడు. ఆమె గర్భంలోకి చనిపోయి పుట్టిన పిండంలాగ వికారంగా వుంది. అహరోను దేవునికి మొరపెట్టి ఆమె కుష్ఠను తొలగించమని తమ్ముణ్ణి వేడుకొన్నాడు. ఆలాగే మోషే అక్కకొరకు ప్రార్థన చేసాడు. మిర్యాము కుష్ఠపోయింది. ఆమెను ఏడునాళ్ళు శిబిరం నుండి తొలగించి మళ్ళా శిబిరంలో చేర్చుకొన్నారు. ఈ గ్రంథమంతటా మోషే ప్రజల తరపున విజ్ఞాపనం చేసేవాడుగా కన్పిస్తాడు.

ఇది ఐదంశాలతో గూడిన తిరుగుబాటు కథ. నేడు మనంకూడ భక్తిభావంతో చదువుకొని మననం చేసికోదగ్గది. నాయకుల అధికారాన్నీ పెద్దరికాన్నీ చూచి అసూయ చెందగూడదు. రోజువారి జీవితంలో మన అసూయను ఎప్పటికప్పుడు గుర్తించి

సవరించుకొంటుండాలి. ఈ దుర్గుణం మనలోకి ఎప్పుడు ప్రవేశిస్తుందో మనకు తెలియదు.

4. వేగు చూడబోయినవారి కథ 13-14

యిస్రాయేలు ప్రజలు ఎడారిలో కాదేషు బార్నెయావద్ద వున్నారు. ఈ తావు కనాను దేశానికి దక్షిణాన, దగ్గరలో వుంది. ఇక్కడినుండి మోషే వేగుల వాళ్ళను కనాను దేశానికి పంపాడు. గోత్రానికి ఒక్కడు చొప్పున మొత్తం 12 మంది వెళ్ళారు. వారిలో కాలేబు, యోషువా ముఖ్యులు. ఇక్కడే మోషే హోషేయా పేరును యెహోషువా గా మార్చాడు. దేవుడు రక్షిస్తాడు అని ఈ క్రొత్తపేరుకి అర్థం. మోషే తర్వాత యిస్రాయేలు ప్రజలను కనాను భూమికి చేర్చేది ఈ యెహోషువాయే. ఈ పేరు మార్పులోనే అతని భవిష్యత్ కార్యక్రమం సూచింపబడింది. వేగులవాళ్ళు కనాను దేశంలోని నగరాలనూ, ప్రజలనూ, భూములనూ, పంటలనూ చూచారివాలి.

గూఢచారులు 40 రోజుల తర్వాత తిరిగివచ్చి మోషేకు సమాచారం తెలిపారు. ఆ దేశంలో పెద్దనగరాలున్నాయి. పంటలు బాగానే పండుతున్నాయి. కాని అక్కడి ప్రజలు దీర్ఘకాయులు. విశేషంగా అనాకు వంశజులు రాక్షసులు. వారిముందు మేము మిడతల్లా కన్పించాం. వారిని మనం గెల్వలేము. కనుక మనం అక్కడికి వెళ్ళకూడదు అని చెప్పారు. కాలేబు మాత్రంమనం ఆ దేశం మీదికి వెళ్ళి దాన్ని జయిద్దాం అన్నాడు. అబ్రాహాం కాలంలోనే దేవుడు ఈ దేశాన్ని యిస్రాయేలుకి ఇచ్చాడు. ఇప్పుడు ఈ చారులు మనం అక్కడకు వెళ్ళకూడదు అంటే దేవుని ప్రణాళికను ధిక్కరించినట్లే గదా!

ప్రజలు ఈ చారుల సమాచారాన్ని విని భయపడ్డారు. మోషేమీద తిరుగుబాటు ప్రారంభించారు. మోషేను రాళ్ళతో కొట్టి చంపబోయారు. ఇంకో నాయకుణ్ణి ఎన్నుకొని ఈజిప్టుకి తిరిగిపోదాం, అక్కడి దాస్యమే మెరుగు అన్నారు. కనాను దేశానికి వెళ్తే ఓడిపోతామని వారి భయం. కాలేబు, యోషువా, దేవుడు ఆ దేశప్రజలు మనకు ఓడిపోయేలా చేస్తాడు అని వాదించారు. కాని ప్రజలు వారి మాటలను నమ్మలేదు.

అప్పుడు దిడీలున ప్రభువు తేజస్సును కన్పించింది. అతడు ఆ తిరుగుబాటు దారులను నాశంజేయబోయాడు. మోషేతో నేను ఈ ప్రజలను తుడిచివేసి నీ ద్వారా క్రొత్త జాతిని పుట్టిస్తాను అన్నాడు. కాని మోషే స్వార్థంలేని మహానాయకుడు. అతడు ప్రభువుతో నీవు ఈ ప్రజను నాశం చేయవద్దు. పూర్వం నీవు మా పితరులతో చేసికొన్న నిబంధనం నిలబెట్టుకో. ఇప్పుడు నీవు వీరిని శిక్షిస్తే ఈ చుట్టుపట్ల వున్న జాతులు నిన్ను ఆడిపోసికొంటాయి. నీవు ఈ ప్రజను వాగ్దత్త భూమికి చేర్చలేకనే వారిని

చంపివేసావు అంటారు. నీకు అపకీర్తి వస్తుంది. శిక్షించడం కంటె క్షమించడం ద్వారా నీకు ఎక్కువ కీర్తివస్తుంది అని విన్నవించాడు. ఇక్కడ 13-19 వచనాలు అద్భుతమైనవి, పలుసార్లు చదువదగినవి.

ప్రభువు ప్రజల అపరాధాన్ని క్షమించాడు. కానికాలేబు యోషువాలు తప్ప ఆ తరంవాళ్ళెవరూ కనాను దేశంలో అడుగుపెట్టరని చెప్పాడు. వేగు చూడబోయినవాళ్ళు 40 రోజులు కనాను దేశంలో వున్నారు. కనుక ఆ ప్రజలుకూడ 40 ఏండ్లు ఎడారిలో తిరుగాడి అక్కడే చస్తారన్నాడు. ఆ జనంలో 20 ఏండ్లలోపులో వున్నవాళ్ళు మాత్రం రెండవతరంగా కనాను దేశంలో అడుగుపెడతారని చెప్పాడు. వాళ్ళు కూడ తండ్రుల పాపాలకు ప్రాయశ్చిత్తం చేస్తూ 40 ఏండ్లు ఎడారిలో తిరుగుతారని పల్కాడు. వేగు చూచి వచ్చినవాళ్ళు అక్కడికక్కడే రోగంతో చచ్చారు. ప్రజలు 40 ఏండ్ల దీర్ఘకాలం ఎడారిలో గడపడానికి కారణం ఇదే.

14,39-45 వచనాలు తిరుగుబాటులో ఇంకో తిరుగుబాటు. ప్రజలు యావే శాపానికి భయపడి అప్పటికప్పుడే కనాను దేశానికి వెళ్ళి దాన్ని జయిద్దామనుకొన్నారు. కాని మోషే వారిని అలా వెళ్ళవద్దనీ, అది దేవుని చిత్తం కాదనీ వారించాడు. మందసం కూడ వారితో పోలేదు. ఐనా వాళ్ళు మూర్ఖంగా యుద్ధానికి పోయారు. కాని కనానీయులు వారిని ఓడించి తరిమికొట్టారు.

ఈ యధ్యాయాలు యిస్రాయేలు ప్రజల తలబిరుసునీ, తిరుగుబాటునీ బాగా చిత్రిస్తాయి. మనకు ఈలాంటి ప్రవర్తనం తగదు. ప్రభువు ప్రమాణాలను శంకించ కూడదు. అతనిమీద తిరుగుబాటు చేయకూడదు. అతని నిబంధనాన్ని నమ్మాలి.

## 5. కోరా, దాతాను అబీరాముల తిరుగుబాటు 16-17

మిర్యాము తిరుగుబాటు కుటుంబం లోపలినుండి వచ్చింది. ఇక్కడి తిరుగు బాటు కుటుంబం వెలుపలినుండి వచ్చింది. ఇక్కడ రెండు కథలున్నాయి. బైబులు రచయితలు ఈ రెండింటిని కలిపివేసారు. కాని మనం వీటిని వేరువేరుగా చూడాలి.

మొదట కోరా కథ. ఇతడు లేవీ తెగకు చెందిన యాజకుడు. గుడారంలోని పాత్రలు మోసికొనిపోవడం ఇతని పని. కాని ఇతనికి యాజకపదవిని పొందాలని కోరిక పుట్టింది. కనుక తన అనుచరులు 250 మందిని ప్రోగుజేసికొని మోషేమీద తిరగబడ్డాడు. మోషే కోరాబృందాన్ని, అహరోనుని కలశాల్లో నిప్పులు పోసికొని గుడారంలోకి రమ్మన్నాడు. ప్రభువు ఎవరి సాంబ్రాణి పొగను అంగీకరిస్తే వాళ్ళే

నిజమైన యాజకులు అని చెప్పాడు. కోరా సాంబ్రాణి పొగ వేస్తుండగా అగ్ని దిగివచ్చి అతన్నీ అతని అనుచరులనూ కాల్చి చంపింది. వాళ్ళు గుడారంలోనే చనిపోయారు. ప్రభువు వాళ్ళ యాజకత్వాన్ని అంగీకరించలేదని రుజువైంది.

తర్వాత యెలియాసరు కోరాబృందం కలశాలను సాగగొట్టి రేకులు చేసి పీఠానికి కప్పాడు.

దాతాను, అబీరాము రూబేను తెగకు చెందినవాళ్ళు. వీళ్ళ తిరుగుబాటు రాజకీయమైంది. వీళ్లు వాగ్దత్త భూమికి వెళ్ళడానికి నిరాకరించినవారి ముఠాకు చెందినవాళ్ళు. కనుక మోషే నాయకత్వాన్ని ధిక్కరించి తిరుగుబాటు చేసారు. మోషే పెద్దలతో వీరి గుడారాల వద్దకు వెళ్ళాడు. అక్కడ భూమి నెర్రెలు విచ్చి ఈ తిరుగుబాటు దారులను మ్రింగివేసింది. ఈలా వీళ్ళు యావే గుడారంలోగాక తమ గుడారాల దగ్గరే చనిపోయారు. దీనివల్ల ప్రభువుకి వీళ్ళ ప్రవర్తన నచ్చలేదని తెలిసిపోయింది.

తర్వాత ప్రజల మోషే అహరోనులమీద గొణగారు. మీరు ఇంతమందిని చంపించారు గదా అని తిరుగుబాటు చేసారు. ప్రభువు ఆ ప్రజలపై కోపించి అంటురోగాన్ని పంపగా వారిలో 14,700 మంది చచ్చారు. అపుడు అహరోను మధ్యవర్తిగా నిల్చి దేవునికి సాంబ్రాణి పొగవేసి అంటురోగాన్ని ఆపివేసాడు. అతడు సాంబ్రాణి పొగవేయడం విజ్ఞాపన ప్రార్థన లాంటిది.

అహరోను కుటుంబం మాత్రమే యాజకులుగా పనిచేయాలి అనే అంశంమీద ప్రజల్లో ఇంకా అనుమానాలున్నాయి. కనుక ప్రభువు ఈ సందేహాలను తొలగింప గోరాడు. అతని అనుమతిపై మోషే పండ్రెండు గోత్రాలవారిచే 12 కర్రలు తెప్పించి గుడారంలో పెట్టించాడు. ప్రతి కర్రమీద గోత్రం పేరుంది. చివరకు ల ఏవీ తెగవాడైన అహరోను కర్ర చిగిర్చి బాదము పండ్లు కాసింది. కనుక ప్రభువు ఆ కుటుంబాన్నే యాజకులుగా ఎన్నుకొన్నాడని తేలిపోయింది. అంతటితో ప్రజలు వాగుడు ఆగి పోయింది. ఇది బైబుల్లోని ప్రసిద్ధ కథల్లో వొకటి.

కోరా, దాతాను కథలు మనకు నేర్పేదేమిటి? దేవుడు ఈయనొల్లని పదవులను ఆశించకూడదు. అది అహంకారమౌతుంది. ఇంకా దేవుడు నియమించిన నాయకులను అంగీకరించాలి. వారిని నిరాకరిస్తే దేవుణ్ణే నిరాకరించినట్లు. దేవుని ప్రతినిధుల్లో దేవుడుంటాడు.

## 6. మోషే అవిశ్వాసం 20,1-13

యిస్రాయేలీయులు కాదేషులోని సీను ఎడారికి వచ్చారు. మిర్యాము ఇక్కడే చనిపోయింది. యావే ఆజ్ఞప్రకారం తొలి తరంవాళ్ళంతా ఒకరితర్వాత ఒకరు చనిపోవలసిందే -14,29.

ఈ తావులో నీళ్ళు దొరకనందున ప్రజలు మోషేమీద గొణగారు. ఈజిప్టులో వున్నపుడే బాగుంది, ఇప్పుడు ఈ యెడారిలో చచ్చిపోతున్నాం అని తిరగబడ్డారు. మోషే ప్రభువుకి విజ్ఞాపనం చేయగా అతడు నీవుబెత్తం తీసికొనిపోయి కొండబండను నీళ్ళీయమని ఆజ్ఞాపించు అని చెప్పాడు.

మోషే అహరోనులు బెత్తం తీసికొని, ప్రజలను ప్రోగుజేసికొని బండ దగ్గరికి వెళ్లారు. ప్రభువు చెప్పినట్లుగా అతడు ఆజ్ఞాపిస్తే చాలు, అది నీళ్ళిస్తుంది. కాని ఇక్కడ మోషే విశ్వాసం చలించింది. వట్టినే రాతిబండను నీళ్ళీయమంటే అది యేలా యిస్తుంది అని అతడు శంకించాడు. కనుక అతడు బండను కర్రతో బాదాడు. అదీ వొకసారి కాదు, రెండుసార్లు. ఈలా దేవుని శక్తికి శంకించినందుకు దేవుడు ఆ యన్నదమ్ములను శిక్షించాడు. మీరు నా పవిత్ర శక్తిని శంకించారు కనుక కనాను దేశంలో అడుగు పెట్టరు అని చెప్పాడు. సామాన్య ప్రజలు శంకించడం ఒక యెత్తు. దేవుణ్ణి బాగతా అనుభవానికి తెచ్చుకొన్న నాయకుడు మోషే శంకించడం మరొకయెత్తు. సముద్రాన్ని పాయలుగా చీల్చినవాడు, ఆకాశంనుండి ఆహారాన్ని కురిపించినవాడు రాతిబండనుండి నీళ్ళు పుట్టించలేడా? మోషేకు అతనిశక్తిని శంకించవలసిన అవసరం ఏమి వచ్చింది? కనుకనే ప్రభువు ఆయన్నదమ్ములను కఠినంగా శిక్షించాడు. మనం ఎంత పెద్ద పదవిలో వున్నామో మన విశ్వాసంగూడ అంత గొప్పదిగా వుండాలి. దేవునిపట్ల నేడు మనకున్న విశ్వాసం ఏపాటిది?

మోషే అవిశ్వాసం ఏలాగున్నా, ప్రజల అక్కరను గుర్తించిదేవుడు బండనుండి నీళ్ళు పారించాడు. ప్రజలు వారి పశువులు ఆ నీళ్ళు త్రాగి ముందుకు సాగిపోయారు.

ఆ ప్రయాణంలో హోరు పర్వతం దగ్గర అహరోను కూడ చనిపోయాడు -20,22-29. దేవుని ఆజ్ఞను అనుసరించి తొలితరం యిస్రాయేలీయులంతా కనాను దేశాన్ని చేరక ముందే చనిపోతారు. చనిపోకముందు అహరోను తన యాజక వస్త్రాలను కుమారుడైన యెలియాసరుకు కట్టబెట్టాడు. అనగా అతని యాజకత్వం కుమారునికి సంక్రమించిందని భావం. యిస్రాయేలీయులు అహరోను మృతికి నెలనాళ్ళు విలపించారు. అక్క, అన్న గతించాక మోషే వొక్కడే ప్రజలను నడిపించుకొని పోయాడు. తర్వాత అతడు కూడ నెబో కొండమీద చనిపోతాడు.

## 7. కంచుసర్పం 21,4-9

ప్రజలు హోరు పర్వతం దాటి రెల్లుసముద్రం ప్రక్కగా ప్రయాణం చేస్తున్నారు. ఈ యెడారిలో వారికి అన్నపానీయాలు దొరకలేదు. వెంటనే వాళ్ళు మోషేమీదా దేవునిమీదా తిరగబడ్డారు. మనం ఈజిప్టులో వున్నపుడే సౌఖ్యంగా వుంది అన్నారు. దేవుడు వారి తిరుగుబాటుకు శిక్షగా విషసర్పాలను పంపాడు. అవి కరవగా చాలమంది చనిపోయారు. ప్రజలకు బుద్ధివచ్చి దేవునికి విన్నపంచేయమని మోషేను బతిమాలారు. అతడు దేవునికి విజ్ఞాపనం చేసాడు. ప్రభువు ఆజ్ఞపై కంచు పాముని చేసి గడె పైకెత్తి ప్రజలకు చూపించాడు. దానివైపు చూచిన వాళ్ళంతా విషం విరిగి బ్రతికిపోయారు.

ఇక్కడ కంచుపాము ప్రజలను రక్షించలేదు. అదివొట్టి బొమ్మ, చిహ్నం. ప్రజలు దేవుడు ఆజ్ఞాపించినట్లు కంచుపామువైపు చూచారు. అవిధేయులు విధేయులయ్యారు. కనుక ప్రజల విధేయతావిశ్వాసాలు వారిని రక్షించాయి.

నూత్నవేదంలో ఈ కంచుపాము క్రీస్తుకే చిహ్నంగా వుంటుంది. దాన్ని గడెమీది కెత్తినట్లే క్రీస్తుని సిలువమీది కెత్తారు. అలా యెత్తబడిన క్రీస్తువైపుచూచి, అతన్ని విశ్వసించి, మనం రక్షణ పొందుతాం. ఇక్కడ క్రీస్తుని సర్పంతో పోల్చలేదు. ఉపమానం కేవలం ఎత్తబడ్డంతోనే -యోహా 3,14.

## 8. బిలాము కథ 22-24

### 1. బిలాము రాకడ

యిస్రాయేలీయులు మోవాబు దేశంలోనికి వచ్చి యోర్ధాను సమీపాన విడిది చేసారు. వారి సంఖ్యను చూచి మోవాబీయులు భయపడ్డారు. పూర్వం యిస్రాయేలు సంఖ్యను చూచి ఫరో చక్రవర్తి ఈలాగే భయపడ్డాడు.

మోవాబు రాజు బాలాకు. అతడు ఎద్దు గడ్డిమేసినట్లుగా యిస్రాయేలు ప్రజలు తన దేశాన్ని ధ్వంసం చేస్తారని భయపడ్డాడు -4. ఆ రోజుల్లో మెసపొటామియా మండలంలోని పేతోరున బిలాము అనే ప్రవక్త ఉండేవాడు. అతడు సమూవేలు యేలీయాల్లాగా దేవుని పలుకులు విన్పించే ప్రవక్త. అతడు ఏమి చెప్పితే అది జరిగి తీరుతుంది. అతని దీవెనలకూ శాపాలకూ తిరుగులేదు -22,6. కనక బాలాకు ఆ ప్రవక్తను పిల్చుకొని రమ్మని బిలాము నొద్దకు దూతలను పంపాడు. వాళ్ళు డబ్బు తీసికొని ప్రవక్త దగ్గరికి వచ్చారు. ఈ ప్రవక్త యిస్రాయేలును శపిస్తే వాళ్ళ బలం పోతుందనీ, అప్పుడు తాను వాళ్ళను జయింపవచ్చుననీ బాలాకు పన్నాగము. బిలాము

తన దేవుని సహాయంతో యిస్రాయేలు దేవుణ్ణి అణచివేస్తాడని బాలాకు నమ్మకం. కాని ఆ ప్రవక్త యావే భక్తుడే. ఆ సంగతి బాలాకును తెలియదు.

బాలాకు దూతలు సొమ్ముతో రాగా బిలాము వారి డబ్బు తీసికోలేదు. ముందుగా యావేను సంప్రదించి నేనీజనంతో పోవచ్చా అని అడిగాడు. ప్రభువు నేను దీవించిన వారిని నీవు శపించకూడదు అన్నాడు. కనుక ప్రవక్త రాజు దగ్గరికి పోవడానికి నిరాకరించాడు. అతడు యావే అనుగ్రహంతో ప్రవచనం చెప్పేవాడు.

రాజు రెండవసారి కూడ దూతలను పంపాడు. ఈసారి యావే నీవు వారివెంట వెళ్ళవచ్చు. కాని నీవు అక్కడ నేను చెప్పిన పనినిమాత్రమే చేయాలి సుమా అని చెప్పాడు. ప్రవక్త గాడిదనెక్కి బాలాకు దగ్గరకు బయలుదేరాడు.

## 2. గాడిద కథ

ఈ గాడిద కథ గమ్మత్తుగా వుంటుంది. ఇది వో జానపత కథ. బైబులు రచయితలు దీన్ని బిలాము కథలో చేర్చారు. బిలామురాజు దగ్గరికి పోవడం ప్రభువు చిత్తంకాదు. అన్నట్లుగా ఈ గాడిదకథ ప్రారంభమౌతుంది. దేవదూత కత్తి దూసి గాడిదకు అడ్డంగా నిలబడ్డాడు. అది భయపడి ప్రక్కకు తొలగి పొలంలోకి వెళ్ళింది. ప్రవక్త దాన్ని బాది మళ్ళా దారిలోకి తీసికొని వచ్చాడు. అతడు మాత్రం దేవదూతను చూడలేదు.

రెండవసారి గాడిద రెండు గోడలకు నడుమగా సన్నని దారిగుండ పోతూంది. మళ్లా దేవదూత గాడిదకు అడ్డమొచ్చాడు. అది గోడకు ఆనుకొని పోగా బిలాము కాలు రాచుకొనిపోయింది. అతడు దాన్ని చావమోదాడు.

మూడవసారి గాడిద తప్పుకోవడానికే వీల్లేని ఇరుకు త్రోవలో పోతూంది. మళ్లా దేవదూత గాడిదకు అడ్డమొచ్చాడు. అది చేసేదిలేక నేలమీద చతికిలబడింది. అప్పుడు గాడిద ఓ మనిషిలాగ ప్రవక్తతో మాటలాడింది. అతడు కన్నులు తెరచి తన యెదుట నున్న దేవదూతను చూచాడు.

ఈ కథలో చాలా హాస్య సంఘటనలు ఉన్నాయి. పిచ్చి జంతువైన గాడిద దేవదూతను చూచింది. దర్శనాలు చూచే ప్రవక్త దేవదూతను చూడలేకపోయాడు. ఇంకా, బిలాము గాడిదతో నా చేతిలో కత్తివుంటే నిన్ను నరికివేసేవాణ్ణి అన్నాడు. నిజంగానే దేవదూత కత్తిదూసి బిలమును నరకబోయాడు. ఐన ఆ సంఘటన బిలాముకి తెలియనే తెలియదు. ప్రవక్త దేవుని ఆజ్ఞను మీరరాదనీ, అతడు పలికించిన పలుకునే పలకాలనీ ఈ కథ భావం. ఇది బైబుల్లోని హాస్యభరిత కథల్లో వొకటి.

## 3. నాల్గు ప్రవచనాలు

బిలాము నాల్గు ప్రవచనాలు చెప్పారు. ఒకొక్క దానిలోను యిస్రాయేలును శపించడానికి మారుగా దీవించాడు. అది దైవ ప్రబోధం. ఒక్కో ప్రవచనంలోను మూడంశాలు వుంటాయి. 1. అతడు ఓ ప్రత్యేక స్థలంలో నిల్చుండి ప్రవచనాలు చెప్తాడు. 2.ఏడు పీఠాలమీద ఎద్దులనూ పొట్టేళ్ళనూ బలియిస్తాడు. 3.ఆ పిమ్మట ఏకాంత స్థలానికి వెళ్ళి ప్రభువు సందేశాన్ని వింటాడు. ఆ సందేశాన్ని రాజుకి ఎరిగిస్తాడు. అతడు దేవుడు పల్కించిన పలుకులు మాత్రమే పల్కుతాడు -38.

మొదటి ప్రవచనం ఇది. దేవుడు శపింపనివారిని బిలాము శపింపడు -23,8. ప్రభువు యిస్రాయేలును దీవించాడు. కనుకనే వాళ్ళు భూరేణువుల్లాగ అసంఖ్యాకంగా విస్తరిల్లారు. అలాంటి వాళ్ళను ప్రవక్త శపింపాడు. ప్రాచీన కాలంలో సంతానం, జనసంఖ్య గొప్ప భాగ్యాలు కదా! ప్రవక్త దీవెన రాజుకి నచ్చలేదు.

రెండవ ప్రవచనం ఇది. దేవుడు యిస్రాయేలుకు మేలు చేస్తానని వాగ్దానాలు చేసాడు. ఆ వాగ్దానాలు నెరవేరితీరుతాయి. అతడు నరుల్లాగా ఆడితప్పేవాడు కాదు. తన ప్రమాణాలను నిలబెట్టుకొనేవాడు -23,19. ఆలాంటి వాళ్ళమీద ప్రవక్త శాపాలు పనిచేయవు. యిస్రాయేలీయులు సింహంలాగ పరాక్రమవంతులు. వాళ్ళు భవిష్యత్తులో శత్రువులనూ, మోవాబీయులను గూడ ఓడించగలరు. సహజంగానే ఈ దీవెన కూడ రాజుకి నచ్చలేదు. కాని బిలాము యావే పల్కులే పల్కుతాడు -26.

మూడవ ప్రవచనం ఇది. యిస్రాయేలుకి నాయకుడు లభిస్తాడు. వాళ్ళు భూమిని పొంది రాజ్యాన్ని స్థాపిస్తారు. శత్రువులను జయిస్తారు -24,7. వాళ్లు తోటల్లాగ ఎదుగుతారు. ఈ ప్రవచనం కూడ రాజుకి నచ్చలేదు.

నాల్గవ ప్రవచనం ఇది. యిస్రాయేలు నుండి ఒక చుక్క రాజదండం పుడతాయి. అనగా వారినుండి ఒకరాజు ఉద్భవిస్తాడు -24,17. ఈరాజు దావీదు, మెస్సీయా కూడ. ఇంకా యిస్రాయేలు శత్రురాజ్యాలైన మోవాబు, ఎదోము మొదలైనవాటిని జయిస్తారు.

ఈ ప్రవచనాలన్నీ కూడ యిస్రాయేలు వృద్ధిలోకి వస్తారని చెప్తాయి. వాళ్ళు సొంత రాజ్యాన్ని స్థాపించి శత్రురాజ్యాలను జయిస్తారని చెప్తాయి. ఆ ప్రజలు కనాను దేశంలో ప్రవేశించబోయేపుడు బిలాము ఈలాంటి వాక్యాలు పల్కి వారికి ప్రేరేపణం పుట్టించాడు. అతడు భావికాలంలో వారికి సిద్ధించబోయే విజయాలను సూచించాడు.

బిలాము దైవప్రబోధం ప్రకారం జీవించినవాడు. దేవుడు చెప్పుమన్న సందేశాన్ని మాత్రమే చెప్పేవాడు. అతనికి బాలాకు ఇచ్చే బహుమతులు కాదు, దేవుని చిత్తాన్ని

పాటించడం ముఖ్యం. కనుకనే "బాలాకు తన యింటిలోని వెండి బంగారాలను త్రవ్వి నా నెత్తిన పెట్టినా నేను ప్రభువు ఆజ్ఞమీరి ఒక చిన్నపని కూడ చేయను" అన్నాను - 24,13. యిస్రాయేలు ప్రజలు కూడ ఈలాంటి వాళ్ళుగా తయారుకావాలి. దేవుని ఆజ్ఞలకు లొంగి జీవించాలి. ఇతడు నేడు మనకుకూడ ఆదర్శంగా వుంటాడు. ప్రభువు చిత్తాన్ని పాటించడం మన ధ్యేయం కావాలి.

## 9. బాలు పెయోరు సంఘటనం 25

ఈ యధ్యాయంలో రెండు సంఘటనలు ఉన్నాయి. మొదటిది పెయోరు సంఘటనం. మోవాబీయులు పెయోరు అనే తావులో బాలుదేవతను కొల్చేవాళ్ళు. వాళ్ళు అక్కడ సంతానోత్సవాన్ని జరుపుకొంటున్నారు. వాళ్ళు బాలు దేవతను నరులకుజంతువులకు సంతానాన్ని ఇచ్చేవాణ్ణిగాను, భూమికి పంటలు ఇచ్చేవాణ్ణిగాను భావించి పూజించేవాళ్ళు. ఈ పూజల్లో వ్యభిచారం కూడ వుండేది. యిస్రాయేలు ప్రజలు కూడ ఈ పూజల్లో పాల్గొని బాలుని ఆరాధించారు. మోవాబు స్త్రీలతో వ్యభిచారం చేసారు. అన్యదైవాలను పూజించవద్దని దేవుడు ఖండితంగా ఆజ్ఞాపించాడు కదా! కనుక ఇక్కడ వాళ్ళు బాలునుకొల్చి భ్రష్టులయ్యారు. కనుక దేవుడు ఆ ఉత్సవంలో పాల్గొన్న వారినందరిని వధించమని మోషేను ఆజ్ఞాపించాడు. అతడు సమాజంలోని పెద్దల ద్వారా దోషులను చంపించాడు -25,1-5

పూర్వం బాలాకు రాజు యిస్రాయేలు ప్రజలను నాశంజేయగోరి విఫలుడయ్యాడు. కాని ఆ ప్రజలు పెయోరువద్ద దేవుని ఆజ్ఞమీరి తమ్ముతామే నాశం జేసికొన్నారు. ప్రభువు ఆ ప్రజలను ఆదరిస్తున్నా వారి పాపమే వారిని నాశం జేసింది.

రెండవ సంఘటనం ఇది. సిమ్రీ అనే యిస్రాయేలీయుడు కొస్బీ అనే మిద్యాను జాతి స్త్రీని శిబిరంలోకి తీసికొని వచ్చి పెండ్లిచేసికొన్నాడు. ఈ కార్యం అన్యజాతి స్త్రీలను పెండ్లాడరాదనే మోషే ఆజ్ఞకు కేవలం వ్యతిరేకం. కనుక అహరోను మనుమడు, యెలియాసరు కుమారుడు ఐన ఫీనెహాసు ఈ యిద్దరినీ ఈటెతో పొడిచి చంపాడు. వారి పాపానికి ప్రాయశ్చిత్తం చేసాడు. పై అక్రమ వివాహం వల్ల ప్రభువు ప్రజల మీదికి అంటురోగాన్ని పంపాడు. కాని దోషుల వధల్ల ఆ రోగం సమసిపోయింది. ప్రభువు ఫీనెహాను ఆసక్తినీ భక్తినీ మెచ్చుకొని అతని వంశజులు శాశ్వతంగా యాజక వృత్తిలో కొనసాగుతారని వాగ్దానం చేసాడు. వీళ్లే సాదోకు తెగకు చెందిన యాజకులు. ఈ వర్గం యాజకులను సమర్థించడానికే రచయితలు ఈ కథను బైబుల్లో చేర్చారు. ప్రభువు మనలను తన ప్రజలనుగా చేసికొన్నంత మాత్రాన్నే చాలదు. మన అంతస్తుకి తగినట్లుగా మనం యోగ్యంగా జీవించాలి.

## 10. మోషేకు అనుయాయి యోషువా 27

మోషేకు చివరి రోజులు సమీపించాయి అతని అబారీము కొండల్లోని నెబో శిఖరాన్నెక్కి కనాను దేశాన్ని కన్నులార చూసాడు. ఆ పిమ్మట అతడు చనిపోవాలి. కాని తాను మరణింపకముందు యిస్రాయేలీయులకు ఒక నాయకుణ్ణి ప్రసాదించమని అతడు దేవుణ్ణి వేడుకొన్నాడు. ప్రభువు యోషువాను అతనికి అనుయాయిని చేసాడు. కనుక మోషే యాజకుడైన యెలియాసరుముందు, ప్రజలముందు యోషువాపై చేతులు చాచాడు. అతని శక్తి యోషువాలోకి దిగివచ్చింది. మోషే తనకు బదులుగా యోషువాను ప్రజలకు నాయకుణ్ణి చేసాడు.

మోషే నేరుగా దేవుని నుండి ఆజ్ఞలు స్వీకరించారు. ఏక నాయకుడుగా పని చేసాడు. యోషువా ఈలాంటి నాయకుడు కాదు. అతడు యాజకుడైన యెలియాసరు మీద ఆధారపడాలి. ఈ యాజకుడు దేవుని చిత్తాన్ని యోషువాకు తెలియజేస్తుంటాడు. ఆ దైవచిత్తం ప్రకారం యోషువా కార్యాలు జరిపిస్తుంటాడు. ప్రజలకా నాయకుడు లేని లోపం వుండదు. ఆ ప్రజలనులాగే నేడు మనలను కూడ దైవమార్గాల్లో నడిపించే నాయకులుండాలి. వారికి మనం విధేయులమై యుండాలి కూడ.

11. సంఖ్యాకాండం - క్రైస్తవులు

నేడు ఈ గ్రంథం నేర్పే పాఠాలు ఇవి :

1. ఈ పుస్తకంలో యిస్రయేలు ప్రజలు కనాను దేశం పొలిమేరలవరకు ప్రయాణం చేసారు. దారిలో ఎన్నో ప్రలోభాలకూ, శిక్షలకూ, క్షమాపణకూ గురయ్యారు. ఈలాగే క్రైస్తవులమైన మనంకూడ ఈ లోకంనుండి పరలోకానికి యాత్ర చేస్తున్నాం. క్రైస్తవ జీవితం పెద్దయాత్ర. ఈ యాత్రలో మనంకూడ చాలసార్లు పడిపోతాం. కాని క్రీస్తు నాయకుడు మనలను పైకిలేపి ముందుకు నడిపిస్తాడు. అతడు మన తిరుగుబాట్లనూ, పాపకార్యాలను క్షమిస్తాడు. యిస్రాయేలు ప్రజలు ఎంత పాపులైనా ఆ యాదిమకాలంలో వివిధ జాతులమధ్య దేవునికి సాక్షులుగా నిల్చారు. నేటి పాపపు ప్రపంచంలో మనం కూడ క్రైస్తవ సాక్షులంగా వుండాలి. మన జీవితం దేవునికి మహిమ కీర్తి కలిగించేలా వుండాలి.

2. ఎడారి కాలమంతా ప్రభువు యిస్రాయేలు మధ్య నెలకొనివున్నాడు. అతడు మందసంలో, మేఘంలో, గుడారంలో వుండి ఆ ప్రజను నడిపించాడు. ప్రయాణంలో రేయింబవళ్ళు వారికి దారి జూపిస్తూ వచ్చాడు. అతని సాన్నిధ్య బలంవల్లనే వాళ్ళు సీహోను ఓగులాంటి శత్రురాజులను జయించారు. మన్నా భోజనం వారికి దైవ సాన్నిధ్యాన్ని

నిరంతరం గుర్తు చేస్తుండేది. నూత్నవేదంలో క్రీస్తు సాన్నిధ్యం మనలను నడిపిస్తుం టుంది. విశేషంగా దివ్యసత్ప్రసాదంలో అతని సాన్నిధ్యం అతిబలంగా పనిచేస్తుంటుంది.

3. యిస్రాయేలుకు దేవుడు నియమించిన నాయకుడు మోషే. అతడు స్వార్థం లేని సేవామూర్తి. ప్రజలకు దేవుని చిత్తాన్ని తెలియజేసే ప్రవక్త. వారి తరపున మాటిమాటికి విజ్ఞాపనం చేసే ప్రార్థనామూర్తి. దేవుని రూపం చూచినవాడు. అతనికి స్నేహితుడు. నూత్న వేదంలో మన క్రీస్తే మోషే. మోషే పవిత్ర గుణాలన్నీ ఇంకా అధికంగా క్రీస్తులో వున్నాయి. ఈ క్రీస్తు నాయకుణ్ణి అనుసరిస్తే మనం తప్పకుండా దివ్యధామం చేరతాం. అతడు మోషే యెత్తిన సర్పంలాఆ సిలువమీదికి ఎత్తబడినవాడు.

4. యిస్రాయేలు ప్రజలు మాటిమాటికి దేవునిపై తిరుగుబాటు చేసేవాళ్ళు. ప్రయాణంలో చిన్న చిన్న కష్టాలు ఎదురువగానే మోషేను నిందించేవాళ్ళు. ఈజిప్టులో సముద్ర ఉత్తరణంలో ప్రభువు చేసిన అద్భుతకార్యాలను పరిగణించేవాళ్ళు కాదు. కడకు దేవుడు వారితో విసిగిపోయి మీలో ఒక్కడు కూడ కనాను దేశంలో అడుగు పెట్టడని శపథంచేసాడు. కడన కాలెబు యోషువాలు మాత్రమే ఆ దేశాన్ని చేరుకొ న్నారు. ఈ ప్రజల్లాగ మనం దేవునిపై తిరుగుబాటు చేయకూడదు. అతడు మనకు చేసిన నానా వుపకారా లను తలంచుకొని అతన్ని నమ్మడం నేర్చుకోవాలి. కష్టాల్లో అతనికి విధేయులం కావాలి.

5. ఈ గ్రంథంలోని అంశాలను కొన్నిటిని నూత్నవేదం పేర్కొంటుంది. అక్కడ దేవుడు ప్రజల మధ్య వసించడాన్ని మనసులో పెట్టుకొనే యోహాను "వాక్కు మానవుడై మన మధ్య వసించాడు" అని వ్రాసాడు -1,14. మోషే కంచుసర్పాన్ని గడెమీదికి ఎత్తడానికి క్రీస్తుని సిలువమీదికి ఎత్తడానికీ పోలిక వుంది -3,14-15. యెడారిలో దేవుడిచ్చిన మన్నాకీ మన దివ్యసత్ప్రసాదానికీ సామ్యం వుంది. ఎడారిలో యిస్రాయేలీయుల శోధనలకూ నేటి మన శోధనలకూ పోలిక వుంది. పౌలు భక్తుడు యిస్రాయేలీయుల ఎడారి శోదనలు మనకు కూడ వస్తాయని చెప్పాడు -1కొ 10,1-11. కనుక సంఖ్యాకాండంలోని అంశాలు నేటికీ మన జీవితంలో కొనసాగుతూనే వున్నాయి అని చెప్పాలి.

6. మోషే రాతిబండను చివరగా దానినుండి అద్భుతంగా నీళ్లు పారాయి -సంఖ్యా 20,11. ప్రాచీన క్రైస్తవ రచయితలు ఈ రాతిబండలో, సిలువమీద తెరవబడిన క్రీస్తు ప్రక్కను చూచారు. రాతిబండనుండి నీళ్ళు వెలువడినట్లే క్రీస్తు ప్రక్కనుండి కూడ నీళ్లు వెలువడ్డాయి -యోహా 19,34. ఈ నీళ్ళు పవిత్రాత్మ, జ్ఞానస్నాన జలాలు. ఈలా సంఖ్యాకాండ క్రైస్తవులమైన మనకు ఎన్నో మంచి జ్ఞాపకాలు ప్రేరణలు పుట్టిస్తుంది.

# 7. యోబు కథ

బైబులు భాష్యం - 67

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | యోబు పరీక్షలు | 118 |
| | 1. సమస్య | 118 |
| | 2. యోబు దృష్టాంతం | 119 |
| 2. | యోబు సంభాషణలు | 121 |
| | 1. యోబు స్నేహితులు | 121 |
| | 2. మొదటి సంభాషణం -యోబు తెలియక చేసిన పాపాలు | 121 |
| | 3. రెండవ సంభాషణం-అతడు దుష్టుడై యుండాలి | 126 |
| | 4. మూడవ సంభాషణం-వేషధారియై యుండాలి | 128 |
| | 5. ఎలీహు సంభాషణం -శ్రమలు పాపంనుండి వారిస్తాయి | 133 |
| 3. | దైవ సాక్షాత్కారం | |
| | 1. దేవుని సృష్టిమహత్త్వం | 134 |
| | 2. యోబు లొంగుబాటు | 136 |
| | 3. పాక్షికమైన సమస్యా పరిష్కారం | 138 |
| | 4. క్రీస్తు సిలువ నుండి సమస్యా పరిష్కారం | 139 |
| | 5. యోబు మరల సిరిసంపదలు పొందడం | 140 |
| | 6. విజ్ఞాన స్తవం | 141 |

# 1. యోబు పరీక్షలు

## 1. సమస్య

అన్ని కాలాల్లోను అన్ని దేశాల్లోను నరులు బాధలకు గురౌతూనే వచ్చారు. విశేషంగా మంచివాళ్ళు బాధలకు గురికావడం చాలమందికి ఆశ్చర్యం కలిగించింది. సజ్జనుడు శ్రమలెందుకు అనుభవించాలి అనే ప్రశ్నకు ప్రపంచంలో చాలమంది తాత్వికులు సమాధానం ఆలోచించారు.

పూర్వవేదం, భగవంతుడు దుష్టులను వ్యాధిబాధలతో దండిస్తాడనీ వాళ్ళకు హ్రస్వకాలిక జీవితాన్ని మాత్రమే దయచేస్తాడనీ చెప్తుంది. సజ్జనులకు సుఖాలూ దీర్ఘకాలిక జీవితమూ ప్రసాదిస్తాడనీ వాకొంటుంది. కాని నిత్యజీవితంలో ఈ సూత్రం తారుమారయిందేమో ననిపిస్తుంది. దుష్టులు సుఖభోగాలతో దీర్ఘకాలం జీవిస్తున్నారు. సజ్జనులను శ్రమలు దాపురిస్తున్నాయి. వాళ్ళు అకాలమృత్యువువాత బడుతున్నారు. మరి దేవుని న్యాయం ఏమైనట్లు? ఈ సమస్యనే యిర్మీయా ప్రవక్త యిలా వ్యక్తం చేసాడు.

"ప్రభూ! నీవు న్యాయం తప్పేనవాడివి కాదు
ఐనా నేను నీకు ఫిర్యాదు చేస్తున్నాను
దుష్టులు వృద్ధిలోకి రానేలా?
ద్రోహులు అభివృద్ధి చెందనేల?
నీవు వాళ్ళను మొక్కల్లా నాటగా
వాళ్ళు ఎదిగి పండ్లు ఫలిస్తున్నారు
నీవు వాళ్ళ పెదవులమీద వున్నావుగాని
వాళ్ళ హృదయాల్లో లేవు" -12,1-2.

దుర్మార్గులకు సుఖాలెందుకు నీతిమంతులకు కష్టాలెందుకు అనే ప్రశ్న బహు ప్రాచీనమైంది. అధునాతనమైంది కూడ. ఇన్నివేల యేండ్లనుండి మేధావులు ఈ ప్రశ్నకు జవాబును ఆలోచిస్తున్నా నేటికీ దీనికి తృప్తికరమైన సమాధానం లభించదు. ఈ సమస్యకు పరిష్కారం సూచించడానికే యోబుగ్రంథం కూడ పుట్టింది. సామాన్య పాఠకులకు ఈ పుస్తకం సులభంగా అర్థంకాదు. ఐనా దీనిలో చాల లోతైన భావాలు న్నాయి. ఈ పుస్తకంలోని ప్రశస్త భావాలను కొన్నిటినయినా మన పాఠకలోకానికి అందించాలనర్న తపనతోనే ఈ చిన్ని పొత్తాన్ని తయారుచేసాం.

## 2. యోబు దృష్టాంతం

యోబు ఊజు దేశీయుడు. అతడు సంపన్నుడు. పొలాలలతో పసుల మందలతో సిరిసంపదలతో హాయిగా కాలం గడుపుతున్నాడు. పూర్వవేద ప్రజలు సంతానాన్ని దేవుని దీవెనగా భావించేవాళ్ళు. యోబుకి ఏడ్గురు కొడుకులూ ముగ్గురు కూతుళ్ళూ వున్నారు. అనగా దేవుడు అతన్ని సమృద్ధిగా దీవించాడని భావం. అతడు దోషరహితుడు ధర్మాత్ముడు, పాపానికి దూరంగా వుండేవాడు. కనుక అతడంటే దేవుడికి యిష్టం.

ఓ దినం దేవదూతలూ సాతానూకూడ దేవుణ్ణి దర్శించడానికి వచ్చారు. దేవుడే సంభాషణం ప్రారంభించి "నీవు నా సేవకుడైన యోబుని చూచావా?" అని సాతానుని అడిగాడు -1,8. పిశాచానికి యోబు భక్తిమీద నమ్మకం అట్టేలేదు. అతడు స్వార్థపరుడని దాని భావం. కనుక అది దేవునితో "యోబు తమరిపట్ల వట్టినే భయభక్తులు చూపడంలేదు" అంది -1,9. అనగా యోబు దేవుడు తనకు దయచేసిన భోగభాగ్యాలకోసం అతన్ని సేవిస్తున్నాడని పిశాచం భావం. అది "మీరు యోబు ఆస్తిపాస్తులన్నీ తీసికోండి. అతడుమీ మొగం ముందటనే మిమ్ము శపించి తీరుతాడు" అని సవాలు చేసింది. దేవుడు పిశాచం సవాలుని అంగీకరించాడు "యోబు భక్తుడో కాదో నీకే తెలుస్తుంది. అతని యాస్తిపాస్తులన్నీ నీ యధీనంలో వుంచుతూన్నాను. నీవు అతని వంటిమీద మాత్రం చేయి పెట్టవద్దు" అన్నాడు దేవుడు. దీనితో యోబుకి తిప్పలు ప్రారంభమయ్యాయి -1,12.

పిశాచం యోబుని రెండుసార్లు పరీక్షించింది. మొదటి పరీక్షలో శత్రువులు వచ్చి యోబు పసుల మందలన్నీ తోలుకొనిపోయ్యేలా చేసింది. అతని కొడుకులూ కూతుళ్ళూ విందారగిస్తూండగా గాలివాన వీచి యిల్లు కూలిపడి వాళ్ళంతా చనిపోయేలా చేసింది. ఈలా సాతాను యోబుని ఒక్కరోజులో బికారిని చేసింది.

ఈ విధంగా తన ఆస్తిపాస్తులూ సంతానమూ నాశమైపోగా యోబుకి దుఃఖం కలిగింది. అతడు సంతాప సూచకంగా వంటిమీది బట్టలు చించుకొన్నాడు. తల గొరిగించు కొన్నాడు. తాను దైవచిత్తానికి లొంగానని తెలియజేస్తూ నేలమీద బోరగిలబడి దేవుడికి దండం పెట్టి

"నేను దిగంబరుడనుగానే తల్లి కడుపునుండి వెలువడ్డాను
మళ్ళా దిగంబరుడనుఆనే యిక్కడినుండ వెళ్ళిపోతాను
ప్రభువు దయచేసిన వాటతినన్నిటినీ మళ్ళా తానే తీసికొన్నాడు
అతని నామానికి స్తుతి కలుగునుగాక"

అన్నాడు -1,21. ఇవి ఆ మహాభక్తుని నోటినుండి వెలువడిన ముత్యాల్లాంటి వాక్యాలు. ఇన్ని దురదృష్టాలు వాటిల్లినా యోబు దేవుణ్ణి దూషించి పాపం కట్టుకోలేదు.

యోబు నిస్వార్థపరుడని రుజవయింది. అతడు దేవుని కొరకే దేవుణ్ణి కొలుస్తున్నాడని తేలింది. పరీక్షలో పిశాచం ఓడిపోయింది. ఐనా అది తన ఓటమిని అంగీకరించలేదు. యోబు కపట భక్తుడనే దాని నమ్మకం.

రెండవ పరీక్షలో పిశాచం దేవునితో ఈలా వాదించింది. “యోబు ఆస్తిపాస్తులు పోయాయేగాని అతని ప్రాణానికేమీ ముప్పు వాటిల్లలేదు. నరుడు సమస్తాన్ని వదలు కొనైనాసరే తన ప్రాణాన్ని కాపాడుకోగోరుతాడు. మీ మట్టుకు మీరు యోబు శరీరానికి హాని తలపెట్టండి, అతడు మీ మొగం ముందటనే మిమ్ము శపించి తీరుతాడు” అంది -2,4. దేవుడు రెండవసారి గూడ పిశాచం సవాలుని అంగీకరించాడు. “నేను యోబుని నీ యధీనంలో వుంచుతున్నాను. నీవు అతని ప్రాణాలు మాత్రం ముట్టుకోవద్దు” అన్నాడు -2,4-6.

మొదటి పరీక్షలో పిశాచానికి యోబు ఆస్తిపాస్తులమీద మాత్రమే అధికారం లభించింది. ఈ రెండవ పరీక్షలో దానికి అతని దేహంమీద కూడ పెత్తనం లభించింది. అది యోబుని చంపకూడదు కాని, అతని శరీరానికి ఎన్ని బాధలయినా కలిగించవచ్చు.

సాతాను యోబు శరీరాన్ని అరికాలినుండి నడినెత్తి వరకూ వ్రణాలతో నింపింది. ఆ పుండ్లనుండి చీమూ రసీ కారుతున్నాయి. అతన్ని చూచి అందరూ అసహ్యించు కొన్నారు. అతడు దుఃఖాన్ని భరించలేక జనానికి దూరంగా తొలగిపోయి ఓ దిబ్బ మీద కూర్చున్నాడు. చిల్లపెంకుతో తన కురుపులను గోకుకో నారంభించాడు.

ఈలాంటి బాధాకరమైన పరిస్థితుల్లో పానకంలో పుడకలా యోబు భార్య వచ్చింది. ఆమె పెనిమిటిని జూచి “నీవింకా దోషరహితుడవు గానే మనుగడ సాగిస్తున్నావా? దేవుడు నీకు ఇన్ని తిప్పలు పెట్టాడు. నీవు చావకముందు అతన్ని నోరార శపించి చాఉవ అంది. కాని యోబు మహాభక్తుడు. ఇతరుల దుర్బోధలకూ ప్రలోభాలకూ లొంగేవాడు కాదు. అతడు భార్యతో “నీవు వట్టి తెలివితక్కువ దానిలా మాట్లాడుతున్నావు. దేవుడు మనకు శుభాలు దయచేసినపుడు హాయిగా అనుభవించాం. ఇపుడు కీడులను పంపితే మాత్రం స్వీకరించవద్దా?” అన్నాడు -2,9-10. ఈ మాటలతో అతడు స్వార్థపరుడు ఎంతమాత్రమూ కాదనీ, దైవచిత్తానికీ లొంగివుండే వాడనీ రూఢిగా తేలిపోయింది. అన్ని దురదృష్టాలు వాటిల్లినా యోబు దేవుణ్ణి పల్లెత్తి మాట అనలేదు.

ఇక్కడ యోబు భార్య మనందరిలాంటిది. మనమంతా లాభాలకోసం దేవుణ్ణి సేవిస్తాం. కష్టాలు రాగానే అతనిమీద సమ్మర్లు పడతాం. అతన్ని విడనాడతాంగూడ. కాని యోబు మనలాంటివాడు కాదు. అతడు దేవునికోసమే దేవుణ్ణి కొలిచే భక్తుడు.

దేవుడే యోబునిగూర్చి "అతడు దోషరహితుడు. ధర్మాత్ముడు. దేవునిపట్ల భయభక్తులు కలవాడు. పాపానికి దూరంగా వుండేవాడు. అలాంటివాడు మరొకడు భూలోకంలో లేడు" అని సాక్ష్యమిచ్చాడు -1,8. ఈ సందర్భంలో యోబు భార్య పెనిమిటిపట్ల ప్రలోభకారిణిగతా వ్యవహరించింది. పూర్వం ఏవ ఆదాముని ప్రలోభపెట్టి అతనిచేత పండు తినిపించిందని వింటున్నాం. యోబు భార్యకూడ భర్తపట్ల ఈ లోభకారిణి పాత్రనే నిర్వహించింది. కాని యోబు ఈ శోధనరలన్నిటికీ తట్టుకొని తాను దైవచిత్తానికి కట్టుపడి వుండేవాణ్ణని నిరూపించుకొన్నాడు.

## 2. యోబు సంభాషణలు

యోబు కథ ఇంతటితో ముగియలేదు. అతని శ్రమలు చాలకాలం కొన సాగాయి. ఈ ఘోరబాధల్లో తాలిమి కోల్పోయి అతడు దేవునిమీద తిరగబడ్డాడు. నేను ఏ పాపమూ ఎరుగనుకదా, నీవు నన్ను ఈలా యెందుకు శిక్షిస్తున్నావో చెప్పమని దేవుణ్ణి సవాలు చేసాడు. ఈ సంఘటనని ఆధారంగా తీసికొని యోబుగ్రంథ రచయిత సజ్జనులకు బాధలెందుకు వస్తాయి అనే సమస్యకు పరిష్కారం చూపించడానికి పూనుకొన్నాడు. కనుక మనం యోబు సంభాషణలను జాగ్రత్తగా పరిశీలించి చూడాలి.

### 1. యోబు స్నేహితులు

యోబుకి ముగ్గురు ప్రాణస్నేహితులున్నారు. వాళ్ళు టేమాను నగరవాసియైన యెలీఫాను, షూహాదేశీయుడైన బిల్దదు, నామాదేశీయుడైన సోఫరు. (తర్వాత నాల్గఇవి స్నేహితుడైన యెలీహుకూడ కన్పిస్తాడు). ఆ మిత్రులు ముగ్గురూ యోబు కష్టాల్లో వున్నాడని విని అతన్ని వోదార్చడానికి పయనమై వచ్చారు. వాళ్ళు యోబునిచూచి శోకించారు. అతనిప్రక్కనే నేలమీద చతికిలబడి ఏడురాత్రులూ ఏడుపగళ్ళూ మౌనంగా గడిపారు. యూదుల సంప్రదాయం ప్రకారం బాధల్లో వున్న వ్యక్తి మాట్లాడిందాకా ఓదార్చేవాళ్ళు మాట్లాడకూడదు. ఇక్కడ యోబు మౌనంగా వుండడంచేత అతని మిత్రులు కూడ వారం రోజులు మౌనంగా వుండిపోవలసి వచ్చింది -2,12-13.

సరే, వారం రోజులయ్యాక యోబు స్నేహితులతో సంభాషణలు మొదలెట్టాడు. ఈ సంభాషణల్లో ఒక్కో స్నేహితుడూ యోబుకీ బుద్ధిమంతులు చెప్తూండగా యోబు వాళ్ళకు ఉచితరీతిని జవాబిస్తూంటాడు. ఈలా ముగ్గురు మిత్రులచుట్టూ మూడు పెద్ద సంభాషణలు నడిచాయి. వీటిని క్రమంగా పరిశీలిద్దాం.

## 2. మొదటి సంభాషణం

తెలియక చేసిన పాపాల ఫలితంగా యోబుకి శిక్ష

యోబు తాను తెలియక చేసిన పాపాలకు ఫలితంగా శిక్ష ననుభవిస్తున్నాడు కాబోలు అనుకొన్నారు స్నేహితులు. మనం బుద్ధిపూర్వకంగా కాకపోయినా బలహీనత వల్లా అజ్ఞానంవల్లా దేవుని ఆజ్ఞలుమీరి పాపం కట్టుకొంటూంటాం. యోబుకూడ ఈలాగే చేసివుండాలి. కనుక అతడు పశ్చాత్తాపపడితే దేవుడు అతని తప్పిదాలను మన్నిస్తాడు అని హితోపదేశం చేసారు మిత్రులు. విశేషంగా టేమాను నగరవాసియైన యెలిఫాను యోబుకి హితబోధ చేస్తూ

"ఏ నరుడైన దేవుని యెదుట నిర్దోషిగా కన్పిస్తాడా?
ఎవడైన సృష్టికర్తముందట పవిత్రుడుగా చూపడతాడా?
దేవుడు స్వర్గంలోని తన సపేవకులనే నమ్మడు
అతడు దేవదూతల గణంలోనే తప్పులు పడతాడు
ఆలాంటివాడు మట్టితో జేయబడిన మర్త్యుని,
దుమ్మునుండి తయారైన నరుని
చిమ్మటవలె చితికిపోయే మానవుని నమ్ముతాడా?"

అని ప్రశ్నించాడు -4,17-19. కనుక యోబుకూడ తప్పు చేయడంలో ఆశ్చర్యం లేదు. ఐనా అతడు పశ్చాత్తాపపడితే చాలు దేవుడతన్ని మన్నిస్తాడు.

"దేవుడు శిక్షించి చక్కదిద్దే నరుడు ధన్యుడు
కనుక నీవు ప్రభువు శిక్షకు కోపించవద్దు
దేవుడు గాయపరచేవాడు, కట్టుకట్టేవాడు కూడ
దెబ్బలు కొట్టేవాడు, చికిత్స చేసేవాడు కూడ"

అని చెప్పాడు -5,18-19. అలాంటి దేవుణ్ణి శరణు వేడమన్నాడు. ఇంకా యెలిఫాను

"వ్యధలు మట్టిలోనుండి పుట్టుకరావు
తిప్పలు నేలలోనుండి మొలకెత్తవు
పక్షి ఆకాశానికి ఎగిరినంత సులువుగా
నరుడు తన తిప్పలు తానే కొనితెచ్చుకొంటాడు"

అని పల్కాడు -5,6-7.

కాని యోబుకి ఈ యాలోచన నచ్చలేదు. తాను నిర్దోషిననే అతని నమ్మకం. అతడు తన బాధలను ప్రస్తావిస్తూ

“సంతాపమే నా కాహారమైంది
నానిట్టూర్పులకు అంతమేలేదు
నేను దేనికి వెరుస్తున్నానో,
దేన్ని గూర్చి భయపడుతున్నానో అదే జరిగింది
నాకు శాంతి సమాధానలు లేవు
నా శ్రమల కంతం లేదు”

అని వాపోయాడు -3,24-26.

ఇంకా తాను పుట్టిన దినాన్ని శపిసూప్త
“నేను పుట్టిన దినం నశించుగాక
ఒక మగబిడ్డ ఆమె కడుపున పడ్డాడని
మా యమ్మనుగూర్చి వార్త పుట్టినరేయి నశించుగాక” అని అంగలార్చాడు - 3,1-3. కాని మళ్లా కొంచెం పస్తాయించుకొని, తన తొందరపాటుకి పశ్చాత్తాప పడుతూ

“నా బాధలనరు తూయగలమేని,
నా వ్యధలను తక్కెడలోబెట్టి తూయజాలుదుమేని
అవి సముద్రపు టిసుకదిబ్బలకంటె
ఎక్కువ బరువుగా వుంటాయి
కనుక నేను తాలిమిమాలి మాటలాడాను
ప్రభువు బాణాలు నా దేహంలో గుచ్చుకొన్నాయి
నా హృదయం వాటి విషంతో నిండిపోయింది
ప్రభువు పంపే యాతనలు
నా మీదికి బారులుతీరి వచ్చాయి”

అని వాపోయాడు -6,1-3. ఇక్కడ యుద్ధంలో విరోధి బాణాలు రువ్వినట్లుగా ప్రభువు యోబుమీద అమ్ములు విసరాడని భావం. అతడు స్నేహితులను జూచి మీరు నన్ను ఓదార్చుడానికి మారుగా నా మీద తప్పుపడుతున్నారని నిష్ఠురాలు పలికాడు

‘నేనేమి శిలనా?
నాది యిత్తడి దేహమా యేమి?
ఇక నాలో ఏమిశక్తి మిగిలియున్నది?
ఇక నాకు దిక్కేమి కలదు?

నిరాశ వలన దేవుణ్ణి నమ్మలేనివాళ్ళకి
స్నేహితుల యండదండ లెంతైనా యావశ్యకంకాదా?"

అని నేస్తులను నిందించాడు -6,12-14. "నా దోషమేమిటో మీరే నిరూపించండ"ని మిత్రులను సవాలు చేసాడు-6,24.

పాపం అతనికి పండుకొంటే నిద్రపట్టేది కాదు

"నేను ఏలాంటి ఆశలూ లేకుండానే నెలలు గడిపాను
విచారంతో రాత్రులు వెళ్ళబుచ్చాను
నేను పండుకొన్నపుడు
పగలెప్పుడు వస్తుందా అనుకొంటాను
పడకనుండి ఎప్పుడు లేస్తానా అనుకొంటాను
వేకువదాక నిద్రపట్టక బాధపడతాను
నా యొడలినిండ పుండ్లులేచి పురుగులు పడ్డాయి
నా చర్మం పగిలి రసి కారుతూంది
ప్రభూ! నా జీవితం శ్వాసవలె క్షణికమైంది
నాకిక యెట్టి యానందాలూ లేవు
పూర్వం నన్నెరిగిన వారికి నేనిక కన్పింపను
నీవు నన్ను చూడగోరినా నేనిక దొరకను"

అని శోకించాడు -7,3-8.

దేవుడు తనపట్ల నిరంకుశంగా ప్రవర్తించి నిర్దోషియైన తన్ను నిష్కారణంగా శిక్షిస్తున్నాడని అపోహపడ్డాడు యోబు

"దోషిని నిర్దోషిని గూడ
అతడు సమంగానే నాశంచేస్తాడు
నిర్దోషి తలవని తలంపుగా నాశంకాగా
దేవుడు నవ్వి వూరకుంటాడు"

అని ఫిర్యాదు చేసాడు -9,22-23. ఇంకా, తాను బాలుడుగా వున్నపుడు తెలిసీ తెలియక చేసిన పాపాల కొరకు దేవుడు తన్ను క్రూరంగా దండిస్తున్నాడేమోనని కూడ శంకించాడు.

"నేను బాలుణ్ణిగా వున్నపుడు చేసిన పాపాలకు
నీవు నా మీద ఘోరమైన నేరాలు మోపుతున్నావు
నీవు నా పాదాలను బండకొయ్యలో బిగించావు

నా మార్గాలనూ అడుగుజాడలనూ గుర్తుపట్టావు
నేను చివికిపోయిన కొయ్యలాగ,
చిమ్మటలు కొట్టిన బట్టలాగ తుత్తునియలయ్యాను"

అని వాపోయాడు -13,26-28.

దేవుడు తాను తప్పుచేసినపుడు తన్ను పట్టుకొని దండించడానికి కాచుకొని వున్నాడనీ, అతడు వట్టి మోసగాడనీ ఫిర్యాదు చేసాడు

"నీవే నన్ను సృజించి నాకీ రూపాన్ని దయచేసావు
కాని నీవే నన్నిపుడు నాశం చేయబూనావు
నీవు నన్ను మట్టినుండి మలిచావు
తిరుగా నన్ను మట్టిపాలు చేస్తావా?
పాలనుండి వెన్న యేర్పడినట్లుగా
నీవు నన్ను మాతృగర్భాన రూపొందించావు
చర్మాన్ని నాకు వస్త్రంవలె తొడిగావు
ఎముకలతో నరాలతో నన్ను బట్టనువలె నేసావు
అటుపిమ్మట నాకు వూపిరిపోసి
అనురాగంతో నన్ను పరామర్శించావు
కాని యింత చేసినపుడు కూడ నీవు మోసంతో వర్తించి
నాకు హాని చేయడానికి తరుణం కొరకు వేచివున్నావని
ఇప్పుడు నేను గుర్తించాను
నేను పాపం చేసినపుడు నాకు క్షమాభిక్షను
నిరాకరించవచ్చునని నీవు కనిపెట్టుకొని వున్నావు"

అని దేవుని మీద నేరం మోపాడు -10,8-14.

కడన దేవునిమీద తిరగబడుతూ
"నేనేమి తప్పుచేసాను? ఏమి పాపాలు కట్టుకొన్నాను?
ఏ యపరాధాలు సల్పాను? ఏ యజ్ఞలు మీరాను?
నీవిపుడు మొగం చాటుచేసికోనేల?
నన్ను నీ శత్రువునిగా భావింపనేల?
గాలికెగిరిపోయే ఈ యాకునా నీవు భయపెటేట్టఇ?
ఎండిపోయిన ఈ తాలునా నీవు వెన్నాడేది?"

అని దేవుణ్ణి దబాయించాడు -13,23-25.

తాను నిర్దోషినని యోబు వాదం సారాంశం. నిర్దోషియైన తానెందుకు బాధలనుభవించాలో అతనికే అర్థంకాలేదు. ఔను, బాధలు వచ్చినపుడు సహించడం ఎంత దుర్భరం! దేవునిమీద మొరపకుండా వుండడం ఎంత కష్టం! ఇక్కడ శ్రమలకు తట్టుకోలేక భగవంతునిమీద సుమ్మర్లుపడే యోబు మనకందరికీ ప్రతీకగా వుంటాడు. కష్టాలు వచ్చినపుడు భగవంతుని చిత్తానికి లొంగేవాళ్ళు మనలో ఎంతమంది?

3. రెండవ సంభాషణ:

యోబు దుష్టుడై యుండాలి

మిత్రులు పశ్చాత్తాపపడమని పదేపదే చెప్పినా, యోబు పశ్చాత్తాపపడకుండా నేను నిర్దోషినని వాదిస్తున్నాడు. కనుక అతడు దుష్టుడూ, పాపీ ఐయుండాలి అనుకొన్నారు మిత్రులు. అందుచేత వాళ్ళు నీవు పశ్చాత్తాపపడు. లేకపోతే దుష్టులందరి లాగే దేవుడు నిన్నుకూడ నాశం చేస్తాడు అని హెచ్చరించారు. ముఖ్యంగా యెలీఫాసు

"అసలు ఏ నరుడు విశుద్ధుడో చెప్పు?
నారికి జన్మించి నరులలో పుణ్యశీలుడెవడు?
ప్రభువు దేవదూతలనే నమ్మడు
దూతగణాలే అతని కంటికి నిర్దోషంగా కన్పించవు
అలాంటప్పుడు పాపాన్ని నీటినివలె మ్రింగివేసే
చెబ్బరజాతికి చెందిన నికృష్ట మానవుడా
అతని దృష్టిలో నిర్మలుడు?"

అని ప్రశ్నించాడు -15,14-16. కాని యోబు దుర్మార్గులందరు నాశమైపోతున్నారా అని యెదురుప్రశ్న లేస్తూ

"దుర్జనుల దీపం ఆరిపోదేల?
వాళ్ళకు వినాశం దాపురించదేల?
దైవకోపం వాళ్ళను నాశం చేయదేల?
గాలికి గడ్డిపోచలాగాను,
సుడిగాలికి కళ్ళంలోని పొట్టులాగాను
వాళ్ళు కొట్టుకొని పోరేల?"

అని అడిగాడు -21,17-18. అందుకు మిత్రులు, దుర్మార్గులు మొదటలో గాకపోయినా తర్వాతనయినా నాశంగాక తప్పదని జవాబిస్తూ

"దుర్మార్గుడు స్వల్పకాలం మాత్రమే వృద్ధిజెందుతాడు
వాని సంబరం కొద్దికాలం మాత్రమే నిలుస్తుంది
దుష్టుడు ఆకాశం వరకు ఎదిగి
మేఘమండలం తాకవచ్చుగాక
చివరి కతడు ధూళివలె యెగిరిపోతాడు
పూర్వమతన్ని యెరిగి వున్నవాళ్ళు
ఇప్పుడతడేమయ్యాడని ప్రశ్నిస్తారు
అతడు స్వప్నంలాగ మరుగైపోతాడు
నిద్దురలో కన్పించిన దృశ్యంలా మాయమైపోతాడు"

అని చెప్పారు -20,5-8.

ఈ పట్టున యోబు తన బాధల్ని స్మరించు కొని
"నేను దిగులుతో గోనె తాల్చాను
ఓడిపోయి యీ మంటిమీద బోరగిల బడ్డాను
ఏడ్చిఏడ్చి నా మొగం కందింది
నా కన్నులు వాచి నల్లబడ్డాయి
ఐనా నే నేపాపమూ చేయలేదు
నా ప్రార్థనలో చిత్తశుద్ధి లోపించలేదు"

అని విలపించాడు 16,15-17. తన దుఃఖన్ని తనలొనే దిగమ్రింగుకొంటూ

నా సమాధే నాకు తండ్రి అనీ
నన్ను తినివేసే పురుగులే
నాకు తల్లీ తోబుట్టువులు అనీ నేను వాకొంటాను
ఇక నాకు ఆశ యెక్కడిది?
నాకు మంచిరోజులున్నాయని యెవరైనా వూహిస్తారా?"

అని కుమిలిపోయాడు -17,14-16. దేవుడు తనపట్ల శత్రువులా ప్రవర్తిస్తున్నాడని వాపోతూ

"నన్ను అణగద్రొక్కినవాడు దేవుడేనని తెలిసికొనండి
నన్ను బంధించడానికి వలపన్నినవా డతడే
అతడు నా త్రోవకు అడ్డం కల్పించాడు
నా మార్గాన్ని చీకటితో కప్పివేసాడు
నా పరువుని మంటగలిపి

నా పేరుప్రఖ్యాతుల్ని నాశంచేసాడు
నలువైపులనుండి నన్నెదిరించి కూలద్రోసాడు
నా యాశని మొక్కనులాగ పెరికివేసాడు
అతనికోపం నా మీద రగుల్కొంది
అతడు నన్ను తన శత్రువునిగా భావించాడు"

అని నిట్టూర్పు విడిచాడు -19,6-11.

కాని అతడు మహాభక్తుడు. కనుక మళ్ళా ప్రభువుని నమ్మాడు. ఆ ప్రభువు తన బాధలను తప్పక తొలగిస్తాడని విశ్వసించి

"నా విమోచకుడు సజీవుడుగా వున్నాడనీ
అతడు కడన నన్ను సమర్థించి తీరతాడనీ నాకుతెలుసు
నా దేహం క్షీణించిపోయినా
ఈ శరీరంతోనే నేను ప్రభువుని దర్శిస్తాను
నా యీ నేత్రాలు స్వయంగానే అతన్ని చూస్తాయి
అతడు నాకు పరాయివాడేమి కాదు"

అని వాకొన్నాడు -19,25-27. అనగా తాను బ్రతికి వుండగానే దేవుడు తనకు దర్శనమిచ్చి తన కష్టాలను తొలగించి, తన్ను నిర్దోషినిగా ప్రకటిస్తాడని యోబు ఆశించాడు.

దేవుడు తనకు అన్యాయం చేసాడనికానీ, అతడు పక్షపాతి అనికాని యోబు యెక్కడా చెప్పడు. అతడు తనకు దర్శనమీయడంలేదనీ, తన మొరపెట్టుకొన్నా దేవుడు తన్ను పట్టించుకోకపోతే యేలా వుంటుంది? ఎంత ప్రార్థనం చేసినా దేవుడు మనకు దూరంగా వున్నాడు అన్పిస్తుంటే సహించడం యేలా? యోబు వ్యథ యిదే.

యోబుకి తన తరపున తాను దుష్టుడను కానని తెలుసు. దేవుని తరపున దేవుడు అన్యాయం చేసేవాడు కాదనికూడ తెలుసు. ఐనా ఆ ప్రభువు తన్ను పట్టించుకోవడం లేదు, తన వేడికోలును ఆలించడంలేదు. ఈ పరిస్థితిని యోబు భరించలేకపోయాడు.

4. మూడవ సంభాషణం

యోబు వేషధారియై యుండాలి

యోబు నేను నిర్దోషినై గూడ శ్రమలనుభవిస్తున్నానని మాటిమాటికి చెప్పడం జూచి మిత్రులతన్ని వేషధారినిగాను కపటభక్తునిగాను గణించారు. అతదడు తాను రహస్యంగా చేసిన పాపాలకు శిక్షననుభవిస్తున్నాడని యెంచారు. ముఖ్యంగా యెలీఫాసు

"అనంతమైన నీ దుష్టవర్తనానికి,
లెక్కలకందని నీ దుష్కార్యాలకు
దేవుడు నిన్ను దండిస్తున్నాడు
తోడివారు నీ వద్ద అప్పుతీసికొన్న సొమ్ముకి
నీవు వాళ్ళ బట్టల్ని కుదువసొమ్ముగా పుచ్చుకొని
వాళ్ళను దిగంబరులను గావించావు
నీవు ఆకలిగొన్నవాళ్ళకి పిడికెడు కూడు పెట్టలేదు
దప్పికగొన్నవాళ్ళకి గ్రుక్కెడు నీళ్ళీయలేదు
నీవు బలవంతుడివి కనుక పేదల పొలాలు కాజేసావు
వితంతువులను వట్టిచేతులతో పంపివేసావు
అనాథులకు అన్యాయం చేసావు"

అని అతన్ని నిందించాడు -22,5-9. ఇప్పుడైనా పశ్చాత్తాపపడితే దేవుని దయవల్ల బ్రతికిపోతానని హెచ్చరించాడు. నీ పాపకార్యాలు వదలుకొమ్మని హితబోధ చేస్తూ

"నీవు వినయంతో దేవునివద్దకు తిరిగిరా
నీ యింటినుండి పాపకార్యాలెల్ల పారద్రోలు
నీ బంగారాన్ని ధూళిగా యెంచి బయట పారవేయి
నీ మేలిమి బంగారాన్ని యేటియొడ్డున దొరికే
చిన్న రాళ్ళనుగతా భావించి బయట విసరివేయి
అప్పుడు దేవుడే నీకు బంగారమౌతాడు
ఆ ప్రభువే నీకు వెండికుప్ప ఔతాడు
అప్పుడు దేవుడు నీకు ఆనందనిధి ఔతాడు
నీ వతన్ని విశ్వసిస్తావు"

అరి చెప్పాడు -22,26-36.

ఐనా యోబు తాను పాపినని వొప్పుకోలేదు. అతని అపరాధమేమిటో అతనికి తెలియలేదు. దేవుడు తన్నీలా యెందుకు శిక్షిస్తున్నాడో అసలే తెలియలేదు. ఈలాంటి పరిస్థితుల్లో యోబు ఆ ప్రభువుని దర్శించాలనీ అతని వాక్కులు వినాలనీ యెంతో వుబలాటపడ్డాడు. ఐనా ప్రభువు అతనికి దూరంగా వుంటాడేగాని అ తని కంటికి కన్పించదు. ఆ భక్తునికి శారీరక వ్యధలకంటె గూడ దేవుణ్ణి దర్శించలేకపోయాననే మానసిక వ్యధ అధిక ఘోరమనిపించింది. కనుక

"ఆ ప్రభువుని సమీపించే మార్గం,
అతన్ని చేరుకొనే విధానం
తెలిస్తే యెంత బాగుంటుంది!
అప్పుడు నా అభియోగాన్ని అతనికి తెల్పుకొంటాను
నా వాదాలన్నిటినీ అతనికి విన్పించుకొంటాను
నేను తూర్పుకి వెళ్తే అక్కడ దర్శనమీయడం లేదు
ఉత్తరాన వెదికితే అచట పొడచూపడం లేదు
దక్షిణాన వెదికితే అక్కడా దొరకడం లేదు"

అని విలపించాడు -23,3-4. 8-9. భగవంతుణ్ణి మనసార వెదకిగూడ దర్శించలేక పోవడం మహాబాధ. భక్తులకేగాని ఈ బాధ అర్థం కాదు.

యోబు తేపతేపకు తాను నిర్దోషినని వాకొంటూంటాడు. ఈ ధోరణిలోనేమరల

"ఐనా నా కార్యాలన్నీ ప్రభువుకి తెలుసు
అతడు నన్ను పరీక్షిస్తే నేను నిర్దోషినని తెల్లమౌతుంది
నేను ప్రభువు నిర్ణయించిన మార్గాన్నే నడచాను
కుడియెడమలకు బెత్తెడైన జరగలేదు
అతని యాజ్ఞలన్నీ పాటించాను
అతని చిత్తాన్ని అనుసరించి జీవించాను"

అని ప్రమాణం చేసాడు -23,10-12. ఈలా యోబు తన నిర్దోషత్వాన్ని పదేపదే పునశ్చరణం చేయడం జూచి స్నేహితుడు బిల్దదు అతన్ని మందలిస్తూ

"దేవుని దృష్టిలో ఏ నరుడైనా
పుణ్యాత్ముడుగా గణింపబడతాడా?
నారికి జన్మించిన నరుడవైనా
విశుద్ధుడుగా పరిగణింపబడతాడా?
ఆ ప్రభువుకి చంద్రుళ్ళో ప్రకాశం చూపట్టదు
చుక్కల్లో నిర్మలత్వం కన్పించదు
అలాంటప్పుడు క్రిమికీటకముఐన దుర్బల మానవుడు
దేవుని దృష్టిలో ఏపాటివాడు?"

అని ప్రశ్నించాడు -25,4-6. ఇవి చాలా లోతైన వాక్యాలు. ఈలాంటి వాక్యరత్నాలు ఈ గ్రంథమంతటా తళతళా మెరుస్తుంటాయి.

యోబు మళ్లా తన నిర్దోషత్వాన్ని సమర్థించుకొంటూ
"నేను న్యాయాన్నే వస్త్రంగతా తొడుగుకొన్నాను
ధర్మాన్నే చొక్కాయిగాను తలపాగాగాను ధరించాను
నేను గ్రుడ్డివారికి కన్నులయ్యాను
కుంటివారికి కాళ్ళయ్యాను
కుంటివారికి కాళ్ళయ్యాను
పేదసాదలకు తండ్రినయ్యాను
అపరిచితుల మొర లాలించాను
దుష్టుల కోరలు ఊడబెరికి
వాళ్ళచేతికి జిక్కిన వారిని విడిపించాను
నేను నా యింటనే సుఖశాంతులతో
కన్ను మూస్తాననుకొన్నాను"

అని శోకించాడు -29,14-18

అతడు తన పూర్వపు ఔన్నత్యాన్ని యిప్పటి దైన్యస్థితిలో పోల్చిచూచుకొంటూ
"భయాలు నన్నావరించాయి
నా ధైర్యం గాలివలె యెగిరిపోయింది
నా భద్రత మేఘంవలె తేలిపోయింది
నా ప్రాణం అవసానదశకు వచ్చింది
నాబాధకు ఉపశమనం లేదు
రేయి నా యెముకల్లో నొప్పిపుడుతూంది
నన్ను తొలిచివేసే వేదనకు అంతమే లేదు
ప్రభువు నన్ను నేలమీద పడద్రోసాడు
నేను ధూళితో సమానమయ్యాను
నా కానందం చేకూరుతుందనుకొంటే శ్రమలెదురయ్యాయి
నేను వెలుగును చూస్తాననుకొంటే చీకట్లలముకొన్నాయి
నేను బాధలతో క్రుంగిపోతున్నాను, నాకుపశాంతిలేదు
ప్రతిదినం వేదనల ననుభవిస్తున్నాను
నా రోదనం నక్కల రోదనంలా విచారసూచకమైంది
ఏడారిలోని యిష్టపక్షి యేడ్పుల్లా
నావి యేకాకి యేడ్పులయ్యాయి.

నా వీణ శోకగీతాలకు సంసిద్ధమైంది
నా పిల్లనగ్రోవి విలాపగీతాల కాయత్తమైంది"
అని దురపిల్లాడు -30,15-19. 26-27,29-31.

కడన యోబు మిత్రులముందు తాను నిర్దోషినని యొట్టుపెట్టుకొన్నాడు. యిస్రాయేలు సంప్రదాయం ప్రకారం ముద్దాయి న్యాయస్థానంలో ఈలాంటి వొట్టు పెట్టుకొంటాడు. ప్రతిపక్షంవాళ్ళు ప్రతిఘటిస్తేనేతప్ప, న్యాయస్థానంలో ఈలాంటి వొట్టు పెట్టుకొన్నవాళ్ళని నిర్దోషులనుగా గణించి వాళ్ళ కనుకూలంగా తీర్పు చెప్తారు. ఈ వొట్టు "నేను పలానా తప్పులు చేస్తే నాకు పలానా శిక్షలు ప్రాప్తించుగాక" అనే రూపంలో వుంటుంది. యోబుకూడ ఈ పద్ధతిలోనే వొట్టుపెట్టుకొంటూ

"నే నసత్యపు బాటలు త్రొక్కానా?
మోసాని కొడిగట్టానా
ప్రభువు నన్ను నిర్దుష్టమైన తులతో తూస్తే
నేను నిర్దోషినని తేలిపోతుంది
నేను ధర్మమార్గంనుండి వైదొలగివుంటే,
నా హృదయం చెడ్డను కోరుకొనివుంటే,
నా చేతులు పాపకర్మాలకు పాల్పడివుంటే
నేను వేసిన పైరులు నాశమగునుగాక
నేను పండించిన పంటను ఇతరులనుభవింతురుగాక
నేను పొరుగువాని పెండ్లాన్ని ఆశించి
వాని గుమ్మంకడ పొంచివుంటే
నా భార్య పరునికి కూడువండి
వాని పడకమీద పండుకొనునుగాక
నేనితురుల పొలం ఆక్రమించుకోగా
ఆ పొలం నన్ను తిట్టిపోసి
తన నాగటి చాళ్ళను కన్నీటితో నింపుకొనివుంటే,
ఆ పొలంలో పండిన పంటను నేననుభవించి
దానిని పండించిన రైతుల కడుపు కొట్టివుంటే,
ఆ పొలంలో నేడు గోధుమలకు మారుగా ముండ్లపొదలూ,
యువ పూరుకుమారుగా కలుపుమొక్కలూ ఎదుగునుగాక" అని వాకొన్నాడు
31,5-10.38-40

యోబు మిత్రులు ఈ లోకలో దుష్టులకు కష్టాలూ సజ్జనులకు సుఖాలూ ప్రాప్తిస్తాయని వాదించారు. యోబు నిత్యజీవితంలో ఈలా జరగడంలేదని ప్రతివాదన చేసాడు. పైపెచ్చు ఈ లోకంలో దుర్మార్గులకు సుఖాలూ సజ్జనులకు కష్టాలూ వాటిల్లుతున్నాయని నిరూపించాడు. సజ్జనుడైన తనకు శ్రమలెందుకు వచ్చాయో అతనికే తెలియడంలేదు. దేవుడు దర్శనమీయడం లేదు. కనుక అంతా అంధకార బంధురంగా వుంది.

## 5. ఎలీహు సంభాషణం

*శ్రమలు పాపంనుండి వారిస్తాయి*

ఈ పరిస్థితుల్లో నాల్గవ మిత్రుడైన యెలీహు ప్రవేశించాడు. ఇతడు తొలి ముగ్గురు మిత్రులతో కలసిరాడు. ఇక్కడ కథలోనికి అకస్మాత్తుగా ప్రవేశిస్తాడు. తొలి ముప్వురు మిత్రులూ దుర్మార్గులకు శిక్షగా కష్టాలు ప్రాప్తిస్తాయని పేర్కొన్నారు. ఎలీహు కష్టాలకు ఇంకో అర్థంగూడ వుందని చెప్పాడు. శ్రమలు మంచివాళ్ళకుగూడ రావచ్చు. మంచివాళ్ళకు వచ్చే శ్రమలు వాళ్ళకు బుద్ధిచెప్పడానికి వుపయోగపడతాయి. అనగా శ్రమలు సత్పురుషులను శిక్షించి వాళ్ళు పాపంలో పడకుండా వుండేలా చేస్తాయి. వాళ్ళను దేవునివైపు మరల్చుతాయి. యోబు శ్రమల భావంకూడ ఇదే ఐయుండాలి అని యెలీహు భావం. కనుక అతడు

"నరులను పాపంనుండి వారించడానికి,
వాళ్ళ పొగరు అణచడానికి
దేవుడు వాళ్ళతో సంభాషిస్తాడు
చావువాతబడి మృతలోకం చేరుకోవడమనే
దుఃస్థితినుండి నరుని కాపాడాలనే అతని కోరిక
దేవుడు నరుణ్ణి వ్యథలపాలు గావించి
అతని శరీరాన్ని బాధలతో నింపి అతనికి బుద్ధిచెప్తాడు
నరుని కిట్టి వుపకారం దేవుడు మాటిమాటికి చేస్తాడు
ప్రభువు నరుణ్ణి చావునుండి తప్పించి
తన జీవనజ్యోతిని అతనిపై ప్రకాశింపజేస్తాడు"

అని వాదించాడు -33,17-19. 29-30. కాని యోబు ఈ వాదాన్ని కూడ విన్పించుకోలేదు.

## 3. దైవసాక్షాత్కారం

యోబు బాధలను భరించలేక తనకు దర్శనమిచ్చి తన తప్పేమిటో నిరూపించమని దేవుణ్ణి సవాలు చేసాడు. అతడు

"నా పలుకు లాలించేవాళ్ళు ఎవరూ లేరా?
ఇపుడు నా వాదాన్ని సొంతంగా వివరించాను
ప్రభువు నాకు బదులు చెప్పునుగాక
నా ప్రతిపక్షి నా నేరాలను వ్రాసి చూపిస్తే
నేను ధైర్యంతో వాటిని నా భుజాలకు కట్టుకొంటాను
తలపాగావలె నా శిరస్సుకు చుట్టుకొంటాను
నేనుచేసిన కార్యాలెల్ల నా ప్రతిపక్షి కెరిగిస్తాను
అతని యెదుట ధైర్యంతో
తలయెత్తుకొని ఠీవితో నిలుస్తాను"

అని అన్నాడుఎ -31,35-37. ఇక్కడ యోబు "ప్రతిపక్షి" దేవుడే. దేవుడు ఈ సవాలుని అంగీకరించాడు. అతడు తుఫానులో యోబుకి దర్శనమిచ్చాడు -38,1.

1. దేవుని సృష్టిమహత్త్వం

ప్రభువు యోబుకి దర్శనమిచ్చాడు గాని అతని తప్పేమిటో చెప్పలేదు. తానతన్ని ఎందుకు దండిస్తున్నాడో తెలియజేయలేదు. దీనికిబదులుగా అతడు యోబుని రకరకాల ప్రశ్నలడగడం మొదలెట్టాడు. ఈ ప్రశ్నలు ఓవైపు దేవుని సృష్టిమహత్త్వాన్ని సూచిస్తాయి. మరోవైపు నరుని అజ్ఞానాన్నీ అశక్తినీ తెలియజేస్తాయి. యోబు ఈ ప్రశ్నలకు జవాబు చెప్పలేక వెలవెలబోతాడు.

ప్రభువు తన సృష్టిరహస్యాలను ఉగ్గడిస్తూ భూమినీ సముద్రాన్నీ చేసిందెవరని ప్రశ్నించాడు.

"ఓయి! ఇట్టి యవివేకపు మాటలతో
నా జ్ఞానాన్ని తప్పుపట్టడం నీకు తగునా?
నీ విపుడు ధైర్యంతోనిల్చి నా ప్రశ్నలకు జవాబుచెప్పు
నే నీ భూమికి పునాదులెత్తినపుడు నీ వున్నావా?
నీ కంతటి విజ్ఞానమే వుంటే నాకు జవాబుచెప్పు
ఈ భూమి వైశాల్యాన్ని నిర్ణయించిందెవరో,
దాన్ని కొలించెదవరో నీ వెరుగుదువా?

నేలను మోసే స్తంభాలు దేనిమీద నిలుస్తాయో,
ఈ నేలకు పునాది వేసిందెవరో నీకేమైన తెలుసా?
భూగర్భం నుండి సముద్ర ముద్భవించినపుడు
దాన్ని కవాటాలతో బంధించి వుంచిందెవరు?
సాగరంమీద మేఘాలను గప్పి
దాన్ని పొగమంచుతో నింపింది నేనుగాదా?
కడలి కెల్లలు నిర్ణయించి
అది నేను గీసిన గిరి దాటకుండా వుండేలా చేసాను,
నీ వీ మేరవరకు మాత్రమే పొంగిపొరవచ్చు
నీ బలమైన కెరటాలు ఇక్కడ ఆగిపోవలసిందే
అని నేను కడలికి కట్టడ చేసాను"

అని అన్నాడు -38,4-11. ఇంకా, గాలులూ వానలూ మంచులూ మబ్బులూ కలిగించిందెవరో చెప్పమని దబాయించాడు

"నేను మంచు నేకొట్టులో దాచివుంచుతానో
వడగండ్ల నే తావులో భద్రపరుస్తానో
నీ వెన్నడైన చూచావా?
కష్టదినాల్లో, యుద్ధకాలాల్లో
వినియోగించడానికి నేను వాటి నట్టిపెట్టి యుంచుతాను
సూర్యుడెచటినుండి బయలుదేరుతాడో
తూర్పు వడగాలు లెచటినుండి
పుడతాయో నీ వెరుగుదువా?
పెనుగాలులకు మార్గాలు కల్పించిందెవరు?
గాలివానలకు త్రోవలు సిద్ధంచేసిందెవరు?
జనసంచారంలేని మరుభూముల్లో
వర్షాలు కురిపించే దెవరు?
ఎండి బీటలువారిన నేలను
నీటి చుక్కలతో తడిపి గ్రాసం ఎదిగించే దెవరు?
వానకు తండ్రి కలడా?
పొగమంచుకి జనకుడు కలడా?

మంచుకి తల్లి కలదా?
నేలపై పేరుకొనే నూగుమంచుకి జనని కలదా?
నభోమ ండలి నియమాలను నీ వెరుగుదువా?
ఆ సూత్రాలను భూమికి గూడ వర్తింపజేస్తావా?
నీవు మేఘాల నాజ్ఞాపింపగలవా?
వానిచే కుండపోతగా వానలు కురియింపగలవా?
మెరపుల నాజ్ఞాపింపగలవా?
అవి నీ కట్టడలను పాటిస్తాయా?
ఆకసంలోని మేఘాలను లెక్కించి
వానిచే వానలు కురిపించే దెవరు?
ఆ వానలు భూమిమీది ధూళిని గట్టి ముద్దనుగా జేసి
మట్టిపెళ్ళలు గట్టిపడేటట్లు చేయడంలేదా?"

అని ప్రశ్నించాడు -38,22-38. పైగా వన్యమృగాలనూ, పక్షులనూ పోషించే దెవరో చెప్పమని అడిగాడు

"గుహలలో దాగుకొని
పొదలలో పొంచివుండే సింహాలకు
నీవు ఎరను చేకూర్చి పెడతావా?
సింగపు కొదమలకు ఆహారం సంపాదించి పెడతావా?
ఆకలితో తిరుగాడే కాకులను పోషించేదెవరు?
ఆ కాకుల పిల్లలు ఆకలిగొని నాకు మొరపెట్టగా
వాటికి తిండి పెట్టేదెవరు?

అని నిలదీసి అడిగాడు -38,39-41. యోబు ఈ ప్రశ్నలు విని నిర్ఘాంత పోయాడు. అతనికి నోటమాట రాలేదు. ఈ సృష్టి దేవుని వునికినీ అతని ప్రాణిపోషణాచాతుర్యాన్నీ నిరూపిస్తుంది. కాని సృష్టివస్తువులనుగూర్చి యింతగా జాగ్రత్తపడే దేవుడు నరుణ్ణి గూర్చి జాగ్రత్తపడడా? తనకు కష్టాలెందుకు వచ్చాయో యోబుకి తెలియకపోయినా దేవునికి తెలియదా? మరి యోబు దేవుణ్ణి తప్పుపట్టడం న్యాయమా? ఇది యీ ప్రశ్నల భావం.

2. యోబు లొంగుబాటు

సజ్జనునికి బాధలెందుకు రావాలి అని యోబు ప్రశ్న. కాని యిక్కడ ప్రభువు గుప్పించిన ప్రశ్నలవల్ల యోబు బాధల సమస్య మరుగునపడిపోయింది. అసలు ప్రభువు

యోబు బాధల సమస్యను ఎత్తుకోనేలేదు. అతడు తన తరపున తాను ప్రశ్నల వర్షం కురిపించాడు. నరునికి దేవుణ్ణి ప్రశ్నించే సామర్థ్యం వుందా, అతనికి విజ్ఞానమూ శక్తీ వున్నాయా అని యీ ప్రశ్నల భావం. లేవని వాటి అంతరార్థం. అల్పజ్ఞుడైన యోబెక్కడ సర్వజ్ఞుడైన దేవుణ్ణి సవాలు చేయడమెక్కడ? పొట్టేలుబోయి కొండను ఢీకొన్నట్లుగా లేదా? కనుక యోబు తన వాదాన్ని ఉపసంహరించుకొని దేవునికి లొంగిపోయాడు. పూర్వం అబ్రాహాము యాకోబు మోషే యెషయా యిర్మియా మొదలైన మహాభక్తులకు దైవదర్శనాలు లభించాయి. ఆ దర్శనాలవల్ల వాళ్లు వినయం అలవర్చుకొన్నారు. యోబుకూడ వాళ్లలాగ వినమ్రహృదయుడై

"నేను తెలివిమాలిన పల్కులు పల్కాను
ఇప్పుడు నేను జవాబు చెప్పలేను గనుక మౌనంవహిస్తున్నాను
నే నొకసారి మాటలాడాను, మరల మాటలాడాను
ఒక్కసారికంటె అధికంగా సంభాషింపను"

అన్నాడు -40,4-5.

ఇక్కడ యోబుకి రెండనుభవాలు కలిగతాయి. మొదటిది, అతడు తాను అజ్ఞానినని గుర్తించాడు. దేవుని మార్గాలు అతనికి తెలియవు. ఐనా తాను దేవునిముందు ఎగిరిపడ్డాడు. ఆ ప్రభువు సర్వశక్తిమంతుడు. సర్వమూ నిర్వహింపగల సమర్థుడు. అతనికేదీ అడ్డురాదు. మంచివాళ్ళకు బాధలెందుకు వస్తాయో, వాటివల్ల ఏమి ప్రయోజనం సిద్ధిస్తుందో అతనికి తెలుసు. కనుక యోబు తొందరపడి నోరు పారవేసికోగూడదు. ఈ భావాలన్నిటినీ సూచిస్తూ అతడు

"ప్రభూ! నీవు సర్వశక్తిమంతుడివి
నీవు తలపెట్టిన కార్యాలెల్ల చేయగలవు
నాకు విజ్ఞానం చాలకున్నా
నేను నీ కార్యాలనుగూర్చి ప్రశ్నించాను
నా కర్థంగాని అంశాలనుగూర్చి సంభాషించాను
నేను గ్రహించజాలని మహాద్భుత విషయాలను గూర్చి
ఇంత తడవూ వదరాను"

అన్నాడు -42,2-4.

రెండవది, దేవుడు అతనికి ప్రత్యక్షంగా అనుభవానికి వచ్చాడు. అతడు పూర్వం వాళ్ళు వీళ్ళు చెప్పిన మాటలను బట్టి దేవుడు అలాంటివాడు ఈలాంటివాడు అనుకొనే

వాడు కాని యిప్పుడు తాను స్వయంగా దేవుణ్ణి చూచాడు. ప్రత్యక్షానుభవం కలిగింది. ఆ యనుభవం గొప్ప వెల్తురు. ఆ వెల్తురు సోకగానే అతనిలోని చీకటి పటాపంచలైంది. అతడు తన తప్పుని గుర్తించాడు. తన దురుసుతనానికి పశ్చాత్తాపపడ్డాడు.

యోబు తప్పు ఏమిటి? అతడు మంచివాళ్ళకు కష్టాలెందుకు రావాలి అని వాదించి దేవునిమీద తిరగబడ్డాడు. దేవుని స్థానే నేను న్యాయమూర్తిగా వుంటానన్నట్లు ప్రవర్తించాడు. తనకు సుఖాలేగాని కష్టాలు రాకూడదన్నట్లుగా మాట్లాడాడు. కష్టాల ద్వారా దేవుడు తన్ను తిరస్కరించాడని అపోహపడ్డాడు. తాను అజ్ఞానియైగూడ మహాజ్ఞానిలాగ వ్రేలాడు. కాని దేవుడు తన దృష్టికి తెచ్చిన సృష్టివస్తువుల మహాత్మ్యన్ని చూచి ఇప్పుడు పాఠం నేర్చుకొన్నాడు. సృష్టి వస్తువులను పట్టించుకొనే దేవుడు తన్ను గూర్చి కూడ జాగ్రత్త పడుతూనే వుంటాడు. కనుక తనకు దాపురించిన కష్టాలకు దేవుడు ఏదో అర్థం ఉద్దేశించి వుండాలి. కావున యోబు తన సాహసానికి పశ్చాత్తాప పడుతూ

"పూర్వం వినికిడివల్ల మాత్రమే నేను నిన్నెరిగితిని
కాని యిప్పుడు నా కన్నులతో నిన్ను జూచయాను
కనుక నేను పల్కిన పల్కులకు సిగ్గుపడుతున్నాను
దుమ్మూ బూడిదా నా మీద చల్లుకొని
పశ్చాత్తాపపడుతున్నాను"

అన్నాడు -42,5-6. ఇవి యోబు గుండెలు చీల్చుకొని వచ్చిన పలుకులు. చాల చిత్తశుద్ధికల వాక్యాలు.

3. పాక్షికమైన సమస్యా పరిష్కారం

మంచివాళ్ళకు కష్టాలెందుకు వస్తాయి అని యోబు ప్రశ్న. ఇదే అతని సమస్య. కాని ప్రభువు యోబుకి దర్శనమిచ్చి అతనితో సంభాషించినపుడు ఈ సమస్యను అసలు ఎత్తుకోనేలేదు. యోబు తన దురుసుతనానికి పశ్చాత్తాపపడి ఊరకున్నాడు. "దుమ్మూ బూడిదా నా మీద చల్లుకొని పశ్చాత్తాపపడుతున్నాను" అని పలికి మౌనం వహించాడు -42,6. మాటిమాటికి తాను నిర్దోషినని వాదిస్తున్నా దేవుడు అతడు మంచివాడనిగాని చెడ్డవాడనిగాని చెప్పలేదు. అతనికి కష్టాలెందుకు వచ్చాయో తెలియజేయలేదు. మరి అతని సమస్య ఏలా పరిష్కారమైనట్లు?

యోబు దేవుణ్ణి ప్రత్యక్షంగా చూచాడు. అతని సృష్టి మహాత్మ్యానికి విస్తుపోయాడు. సృష్టిరహస్యాలనే తెలిసికోలేని తాను ఆ సృష్టిని చేసిన దేవుని రహస్యాలను ఎంతమాత్రమూ తెలిసికోలేనని గ్రహించాడు. దేవుడు తనకు కష్టాలనెందుకు పంపాడో అసలే అర్థం

చేసికోలేనని గ్రహించాడు. దేవుడు సర్వజ్ఞుడనీ తాను అజ్ఞుడననీ గుర్తించాడు. తనకు కష్టాలెందుకు వచ్చాయో తనకు తెలియకపోయినా దేవునికి తెలుసు, అది చాలు అనుకొన్నాడు.

యోబు భగవంతుణ్ణి దర్శించి ప్రత్యక్షానుభవం పొందాడు. ఆ యనుభవంవల్ల అతని విశ్వాసం బలపడింది. ఆ విశ్వాసం ద్వారా అతడు తన కష్టాలను అంగీకరించాడు. అవి దేవుడు పంపినవి. అవి తనకెందుకు దాపురించాయో తనకు తెలియక పోయినా, దేవుడే పంపాడు గనుక వాటిని అంగీకరించవచ్చు. దేవునిపట్ల అచంచల విశ్వాసమే మన ప్రశ్నలన్నిటికీ జవాబు –ఇది యోబు గ్రంథరచయిత సూచించిన పరిష్కారం.

కాని యిది తృప్తికరమైన జవాబౌతుందా? లోకంలో మంచివాళ్ళకు కష్టాలెందుకు వస్తాయి? చెడ్డ అనేది సజ్జనులనెందుకు బాధిస్తుంది? ఈ ప్రశ్నలకు యోబు గ్రంథకర్త నిజమైన పరిష్కారం చూపించగలిగాడా?

బాధలెందుకు వస్తాయి, చెడ్డ అనేది యెందుకువుంది అనే ప్రశ్నలకు యోబు గ్రంథం పాక్షికమైన పరిష్కారం మాత్రమే సూచిస్తుంది. పూర్తి పరిష్కారం చూపించదు. పూర్తి పరిష్కారం ఈ గ్రంథకర్తకు తెలియదు. ఆ మాటకొస్తే, పూర్వవేద రచయితల కెవరికీ తెలియదు. కనుక బాధలెందుకు వస్తాయి అని ప్రశ్నవేయడం మాత్రమే ఈ గ్రంథకర్త చేసిన పని. దీనికి పూర్తి సమాధానం నూత్న వేదలోని క్రీస్తునుండీ, అతని సిలువనుండీ వెతుక్కోవాలి.

## 4. క్రీస్తు సిలువనుండి సమస్యాపరిష్కారం

ఆదాము పాపం వల్ల శ్రమలూ మృత్యువూ లోకంలోకి ప్రవేశించాయి. అతని సంతతివాళ్ళమైన మనకు కూడ బాధలు తప్పవు. యోబు శ్రమలూ అతని మొరలూ మనందరి వేదనలను సూచిస్తాయి. ఆ పుణ్యపురుషుళ్ళాగే చాలమంది బాధలనుభవించారు. వాటిని భరించలేక ఆక్రోశించారుకూడ.

క్రీస్తుకూడ ఆదాము సంతతికి చెందినవాడు. కనుక అతడు కూడ వేదనలకీ చావుకీ గురయ్యాడు. సిలువమీద ఘోరయాతనలు అనుభవించి ప్రాణం విడచాడు. కాని అతడు నూత్న మానవజాతికి శిరస్సు. కనుక అతడు వ్యధలకీ మృత్యువుకీ లొంగిపో లేదు. చనిపోయిగూడ మృత్యుంజయుడై మళ్ళా వుత్థానమయ్యాడు.

నేడు మనం క్రీస్తులోనికి జ్ఞానస్నానం పొందినపుడు అతనితో ఐక్యమౌతాం. ఈ యైక్యతవల్ల అతడు ఆనాడు బాధలమీదా మృత్యువుమీదా సాధించిన విజయం నేడు మనకు సంక్రమిస్తుంది. అతడు మనకు శిరస్సని చెప్పాం. మనకు శ్రమలేమో తప్పవు.

అవి ఆదాము సంతతి కంతటికీ ప్రాప్తించిన శాపాలు. కాని మన శ్రమలు నిష్ప్రయోజనం కావు. క్రీస్తు వేదనలు మన వేదనలను ఫలభరితం చేస్తాయి. అతని మరణం మన మరణాన్ని పునీతం చేస్తుంది. మృతుల పూజలో వచ్చే ప్రెఫేస్ ప్రార్థనం చెప్పినట్లుగా, క్రీస్తునందు మరణించేవాళ్ల జీవితం అంతంకాదు. వాళ్లకు క్రొత్తజీవితం, అనగా పరలోక జీవితం, ప్రారంభమౌతుంది. కనుక కీడుల సమస్యకు పరిష్కారం క్రీస్తు సిలువొక్కటే.

యోబు మొదలైన పూర్వవేద భక్తులకు క్రీస్తునిగూర్చి తెలియదు. అతని కష్టాలు మన కష్టాలను ఫలభరితం చేస్తాయనీ, మన కష్టాలకు అర్థముందనీ వాళ్లు గ్రహించలేదు. కనుక యోబు తన బాధలకు అర్థంతెలియక నిరాశతో క్రుంగిపోయాడు. కాని నేడు మనకు మన బాధల కర్థం తెలుసు. ఆదాము సంతతికి శ్రమలు రాక తప్పవనీ, ఐనా వాటివల్ల మనం క్రుంగిపోనక్కరలేదనీ కూడ మనకు తెలుసు. కనుక బాధలూ శ్రమలూ ఎందుకు అనే సమస్యకు యోబుకి తెలియని పరిష్కారం మనకు తెలుసు. ఐనా బాధలు వచ్చినపుడు ఆ యోబులాగే మనంకూడ తల్లడిల్లిపోతాం. అసలు అతనికున్న విశ్వాసం మనకుండదు. కనుక ఎప్పుడో క్రీస్తుపూర్వం నాల్గవ శతాబ్దంలో వెలువడిన యీ గ్రంథం నేటికీ తన ప్రాముఖ్యాన్నీ కోల్పోలేదు. బాధల్లో వున్న వాళ్లకి ఈ గ్రంథం నేటికీ ప్రేరణం కలిగిస్తూనే వుంటుంది.

## 5. యోబు మరల సంపదలు పొందడం

ప్రభువు యోబు విశ్వాసాన్ని మెచ్చుకొన్నాడు. అతడు

> "ప్రభువు దయచేసిన వాటినెల్ల మరల తానే తీసికొన్నాడు
> అతని నామానికి స్తుతి కలుగునుగాక"

అని పల్కాడు -1,21. ఇది చాల గొప్పభక్తి. అతడు తన పాలబడిన కష్టాలకు దేవుని మీద తిరగబడినా, దైవదర్శనాన్ని పొందాక తన దురుసుతనానికి పశ్చాత్తాపపడ్డాడు. దేవునికి లొంగాడు. ఆ ప్రభువుని గాఢంగా విశ్వసించాడు. జీవితంలో అన్ని సమస్యలకూ పరిష్కారం దైవవిశ్వాసమేనని గ్రహించాడు. ఈలా యోబు హృదయం మారింది. అతని దైవభక్తి బలపడింది. కనుక ప్రభువు సంతోషించి యోబుకి పూర్వసంపదలన్నీ మరల దయచేసాడు. రెట్టింపుగా గూడ దయచేసాడు. అతనికి మళ్ళా సంతానం కలిగింది, పసుల మందలు వృద్ధి చెందాయి. "ప్రభువు యోబు జీవితలో పూర్వభాగం కంటె గూడ ఉత్తరభాగాన్ని అధికంగా దీవించాడు -42,12. కనుక ప్రభువు నీతిమంతులను బహూకరిస్తాడు అనే పూర్వవేదసూక్తి నెరవేరింది.

## 6. విజ్ఞానస్తవం

యోబు గ్రంథం 28వ అధ్యాయంలో విజ్ఞానస్తవం వస్తుంది. ఈ పుస్తకాన్ని గూర్చి మాట్లాడేపుడు ఈ యధ్యాయాన్ని పేర్కొనకుండా వుండలేం. కనుక ఈ విజ్ఞాన గీతం తోనే ఈ చిన్ని పొత్తాన్ని ముగిద్దాం.

పూర్వవేదంలో విజ్ఞానం ఓ గొప్పభావం. విజ్ఞానం అంటే యేమిటి? అది యీ జీవిత ధ్యేయాన్ని గూర్చి చెప్తుంది. ఈ జీవితంలో వచ్చే సుఖదుఃఖాల నేలా అర్థంచేసి కోవాలో చెప్తుంది. జీవితంలో విజయాన్ని ఏలా సాధించాలో చెప్తుంది. విజ్ఞానానికి వ్యతిరేకమైంది మూర్ఖత్వం. విజ్ఞానం పుణ్యం, మూర్ఖత్వం పాపం. దేవుడు విజ్ఞానిని లేక పుణ్యపురుషుణ్ణి బహూకరిస్తాడు. మూర్ఖుణ్ణి లేక దుష్టుణ్ణి శిక్షిస్తాడు. సంగ్రహంగా చెప్పాలంటే దేవునిపట్ల భయభక్తులతో జీవించడమే విజ్ఞానం. కనుక పూర్వవేద ప్రజలు ఈ విజ్ఞానాన్ని అలవర్చుకొని దేవుణ్ణి భక్తిభావంతో పూజించాలని కోరుకొన్నారు. నూత్నవేదంలో క్రీస్తు మన విజ్ఞానమౌతాడు.

పూర్వవేదంలోని ఏడు విజ్ఞానగ్రంథాల్లో యోబుగ్రంథంకూడ ఒకటి. కనుక పై విజ్ఞానభావాలు ఈ గ్రంథంలో కూడ కన్పిస్తాయి. విశేషంగా, సజ్జనులకు కష్టాలెందుకు అన్నది ఈ గ్రంథం అడిగే ముఖ్యప్రశ్న. ఈ ప్రశ్నను గూర్చి పూర్వమే చూచాం. ఇక యీ గ్రంథంలోని విజ్ఞానగీతాన్ని పరిశీలిద్దాం.

"వెండిని త్రవ్వడానికి గనులున్నాయి
సువర్ణాన్ని శుద్ధిచేయడానికి కొలిమి వుంది
జనులు భూమిని త్రవ్వి ఇనుముని తీస్తారు
రాళ్ళను కరగించి రాగిని తయారుచేస్తారు
నరులు అంధకారమయమైన భూగర్భంలోకి ప్రవేశించి
అచట చీకటిలో రాళ్ళు త్రవ్వి తీస్తారు
జనసంచారానికి దూరంగా
కాలూనడానికైన వీలులేని గోతుల్లోనికి దిగి
త్రాటికి వ్రేలాడుతూ గనులు త్రవ్వుతారు
భూగర్భంలోని రాళ్ళలో మణులుంటాయి
అందలి మట్టి బంగారంతో నిండివుంటుంది
డేగలకి ఆ గనుల్లోకి పోయే మార్గం తెలియదు
రాబందులకి అచటికి వెళ్ళే త్రోవ తెలియదు

దర్పంగల వన్యమృగాలు అచటికి పోలేవు.
సింహం అచటికి వెళ్ళలేదు
నరులు కఠిన శిలలనుగూడ త్రవ్వుతారు
కొండపాదులను కుళ్లగించివేస్తారు
పర్వతాల్లో సొరంగాలు త్రవ్వి
విలువగల మణులను వెలికి తీస్తారు
కాని విజ్ఞానం ఎచట కన్పిస్తుంది?
వివేకం ఎందు చూపబడుతుంది?
విజ్ఞానాన్ని చేరేమార్గ నరులకు తెలియదు
అది నరలోకానికి దొరికేది కాదు
అగాధాన్నడిగితే విజ్ఞానం నా వద్ద లేదంటుంది
సముద్రాన్నడిగితే అదికూడ
అలాంటిది నా వద్ద లేదంటుంది
దాన్ని బంగారంతో కొనలేం
వెండిని తూచియిచ్చి సంపాదించలేం
మేలిమి బంగారంకాని గోమేధిక నీలమణులుగాని
దాని వెలతో సరితూగలేవు
అది సువర్ణంకంటె, శ్రేష్ఠమైన కాచంకంటె మెరుగైంది
సువర్ణపాత్రాన్ని దానికి మారకం వేయలేం
పగడాలనూ స్ఫటికాలనూ దానితో వుపమింపలేం
దానితో పోలిస్తే ముత్యాలెందుకు పనికిరావు
ప్రశస్తమైన పుష్యరాగం దానికి సాటిరాదు
పుటంవేసిన బంగారం దానికి సమం కాదు
కాని విజ్ఞానం ఎచట కన్పిస్తుంది?
వివేకం ఎందు చూపడుతుంది?
జీవించివున్న ప్రాణి యేదీ విజ్ఞానాన్ని చూడలేదు
ఆకాశాన యెగిరే పక్షులుకూడ దాన్ని కనుగొనలేవు
మృత్యువూ వినాశమూ కూడ
మేము విజ్ఞానాన్ని గూర్చి విన్నాము అని మాత్రమే చెప్తాయి.

దేవునికి మాత్రమే దానిమార్గం తెలుసు
అది దొరికే తావుని అతడు మాత్రమే చూచాడు
అతడు నేల నాల్గుచెరగులూ పరిశీలిస్తాడు
మింటిక్రింద వున్న వస్తువులన్నిటినీ అవలోకిస్తాడు
ప్రభువు వాయువుకి బలాన్ని దయచేసినపుడు
జలరాశికి పరిమాణం విధించినపుడు
వానలు కురియడానికి నియమాలు చేసినపుడు
ఉరుములకీ మెరుపులకీ మార్గాలు నియమించినపుడు
విజ్ఞానాన్ని గూడ పరికించి చూచాడు
దాన్ని పరీక్షించి చూచి
అది తనకు సమ్మతమైనదేనని తెలియజేసాడు
ప్రభువు నరునికి యిలా చెప్పాడు –
"దేవునికి భయపడ్డమే విజ్ఞానం
దుష్కార్యాలను విడనాడడమే వివేకం."

జ్ఞానగ్రంథాల్లోని అతి ప్రశస్తమైన గీతాల్లో ఈ విజ్ఞానగీతం కూడ వొకటి. విజ్ఞానం అమూల్యమైందని ఈ గీతం భావం. నరులు భూగర్భంలోకి ప్రవేశించి వెండి బంగారాలూ రత్నాలూ వెలికితీస్తారు. కాని విజ్ఞానాన్ని మాత్రం కనుగొనలేరు. అది ప్రశస్తమైన లోహాలకంటె, అమూల్యమైన మణులకంటె విలువైంది. నరునికి విజ్ఞానాన్ని గూర్చి తెలియదు. దేవునికి మాత్రమే దాన్ని గూర్చి తెలుసు. విజ్ఞానమంటే యేమో కాదు. దేవునికి భయపడ్డమే.

కాని యీ భయం ఏలాంటిది? సేవకుడు యజమానుణ్ణి చూచి భయపడతాడు. ఆ యజమానుడు తన్ను శిక్షిస్తాడేమోనని భీతిల్లుతాడు. జ్ఞానగ్రంథాలు పేర్కొనే దైవభీతి ఈలాంటిది కాదు. బిడ్డడు తల్లిదండ్రులమీద గల ప్రేమభావంచే వాళ్ళ ఆజ్ఞలు మీరి వాళ్ళ మనసు నొప్పించడానికి భయపడతాడు. జ్ఞానగ్రంథాలు పేర్కొనే దైవభీతి యిలాంటిది. విజ్ఞానంలోని ముఖ్యాంశం ఈ ప్రేమతో గూడిన దైవభీతే. ఈ దైవభీతినే యోబు గ్రంథకర్త అమూల్యమైన వరంగా యెంచాడు. ఈ వరాన్నే మనంకూడ పొందగలిగితే యెంతబాగుంటుంది!

# 8. తోబీతు, యూదితు, ఎస్తేరు, రూతు గ్రంథాలు

బైబులు భాష్యం 141 - 144

## విషయసూచిక

## మిద్రాష్ కథలు


1. తోబీతు గ్రంథం 146
    1. గ్రంథ స్వభావం 146
    2. కథా సంగ్రహం 146
    3. వివరణం 147
        1. తోబీతు సారాల దురవస్థ 147
        2. ప్రయాణం 148
        3. సారా తోబీతులకు చికిత్స 148
        4. రఫాయేలు దర్శనం 149
    4. పుస్తకం సందేశం 150
2. యూదితు గ్రంథం 151
    1. గ్రంథ స్వభావం 151
    2. కథా సంగ్రహం 151
    3. వివరణం 152
        1. అస్సిరియానుల దాడి 152
        2. బెతూలియా ముట్టడి 152
        3. యావే ప్రతినిధిగా యూదితు 153
        4. యూదితు శత్రుశిబిరానికి వెళ్లడం 153
        5. శత్రువుల భంగపాటు 155
    4. పుస్తకం సందేశం 156
3. ఎస్తేరు గ్రంథం 157
    1. గ్రంథ స్వభావం 157
    2. కథా సంగ్రహం 157
    3. వివరణం 158

1. వష్టి రాణి 158
2. మొర్దెకయి – ఎస్తేరు 158
3. యూదులకు అపాయం 159
4. యూదులు పగ తీర్చుకోవడం 160
5. పూరీము ఉత్సవం 161
4. పుస్తకం సందేశం 161
4. రూతు గ్రంథం 162
1. గ్రంథ స్వభావం 162
2. కథా సంగ్రహం 163
3. వివరణం 163
1. మోవాబులో నవోమి 163
2. రూతు బోవసును కలసికోవడం 164
3. వివాహ సేత్రధారిణి నవోమి 164
4. రూతు బోవసుల పెండ్లి 165
5. దావీదు వంశవృక్షం 165
4. పుస్తక సందేశం 166
– అనుబంధం – సూసన్న కథ 167

## మిద్రాష్ కథలు

పూర్వవేదంలో మిద్రాష్ అనే సాహితీ ప్రక్రియకు చెందిన కథలు వున్నాయి. ఈ రకం కథల్లో మూడు ప్రధాన లక్షణాలు కన్పిస్తాయి. 1. రచయిత బైబుల్లోని కొన్నిభాగాలను ఎన్నుకొని వాటిమీద వివరణం చెప్తుంటాడు. బైబులు వాక్కు తన కాలపు ప్రజలకు ఎలా అన్వయిస్తుందో వివరించి చెప్తాడు. 2. చారిత్రక సంఘటనలను కొన్నిటిని ఆధారంగా తీసికొని వాటితో ఓ కథ అల్లుతాడు. ఈ కథలో చారిత్రకాంశాలు కొన్ని వున్నా కథ మాత్రం కేవలం కల్పితమైంది. 3. ఈ కథ ద్వారా ప్రజలకు దైవభక్తినీ, నీతినీ, ధర్మాచరణను బోధించడం రచయిత ఉద్దేశం. ఈ కథలో ముఖ్యాంశం ఉపదేశమే కాని చరిత్ర కాదు. బైబుల్లో తోబీతు, యూదితు, ఎస్తేరు, రూతు, యోనా గ్రంథాలు ఈలాంటి మిద్రాష్ కథలు. "మిద్రాష్" అనే హీబ్రూ మాటకు వివరణం, వ్యాఖ్యానం, ఉపదేశం అని అర్థం. రూతు గ్రంథం మిద్రాష్ కథకాదు. చారిత్రక

గ్రంథమే. అయినా దైవభక్తిని బోధించే చిన్న కథ. కనుక దీన్నికూడ మిద్రాష్ పుస్తకాల్లో చేర్చాం. మనదేశంలో భక్తుల చరిత్రలు ఈ మిద్రాష్ కథలకు దగ్గరగా వుంటాయి. నేడు మనం ఈ కథలను చదివి దైవభక్తిని పెంపొందించుకోవాలి.

# 1. తోబీతు గ్రంథం

## 1. గ్రంథ స్వభావం

ఈ పుస్తకాన్ని క్రీస్తుపూర్వం రెండవ శతాబ్దంలో అరమాయిక్ భాషలో వ్రాసారు. ఇప్పుడు గ్రీకు మూలం మాత్రమేలభిస్తుంది. ఈ గ్రంథాన్ని ప్రోటస్టెంటులు అంగీకరింపరు.

రెండు మూడు జానపద కథలు ఈ పుస్తకానికి ఆధారం. రచయిత ఈ జానపద కథలను ఆధారంగా చేసికొని, ద్వితీయోపదేశకాండంలోని నీతిబోధలను చేర్చి నేర్పుతో తోబీతు కథను తయారుచేసాడు.

తోబీతు, సారా యిద్దరు కష్టాల్లో వుండి దేవునికి మొరపెట్టారు. చనిపోగోరారు. దేవుడు రఫాయేలు దూతను పంపి వారిద్దరినీ ఆదుకొన్నాడు. ఇలా ఈ పుస్తకం రెండు భక్తిగల కుటుంబాలు వివాహంద్వారా ఐక్యం గావడాన్ని వర్ణిస్తుంది. ఇదిబైబుల్లో అతి శ్రేష్ఠమైన గ్రంథాల్లో ఒకటి. ప్రాచీనకాలం నుండి క్రైస్తవలోకాన్ని ప్రభావితం చేసింది.

ఈ పుస్తకం పుట్టుక సందర్భం ఇది. క్రీస్తు పూర్వం 200 ప్రాంతంలో గ్రీకు రాజులు యూదులను మతపరంగా హింసించారు. ఈ సందర్భంలో యూదులను ప్రోత్సహించడానికి రచయిత ఈ గ్రంథాన్ని వ్రాసాడు. దేవుడు మీ మధ్యలోనే వున్నాడు. మీ కష్టాలను తొలగిస్తాడు. మీరు మాత్రం అతన్ని నమ్మండి అని ప్రజలను హెచ్చరించాడు. శ్రమల్లో చిక్కిన తోబీతుని లాగే మిమ్ముకూడా కాపాడతాడని నొక్కిచెప్పాడు. నేడు మనకు కూడా ఈ పుస్తకం దేవుడు మీ కష్టాల్లో మిమ్ము ఆదుకొంటాడు అనే ఆశాభావంపుట్టిస్తుంది.

## 2. కథా సంగ్రహం

తోబీతు నీనివే నగరంలో ప్రవాసంలో వున్నాడు. అతడు దైవభక్తుడు. పేదలకు దానధర్మాలు చేయడం, చనిపోయిన వారిని పాతిపెట్టడం మొదలైన పుణ్యకార్యాలు చేసేవాడు. నీనివేలో ప్రవాసంలో వున్నపుడు అతనికి చూపుపోయింది. అతని ఆస్తి పోయింది. కనుక కష్టాల్లో చిక్కుకొన్నాడు. తన ప్రాణాన్ని తీసికొనిపొమ్మని దేవునికి మొర పెట్టాడు. అంతకుముందే అతడు మాదియా దేశంలోని గబాయేలు వద్ద సొమ్ము దాచాడు. ఆ సొమ్మును తీసికొని రావడానికి కుమారుడైన తోబియాను పంపనిశ్చయించు కొన్నాడు.

ఆదినాన్నే మాదియా దేశంలోని ఎక్బటానా నగరంలో నివసించే రగూవేలు పుత్రిక సారా వరుసగా ఏడ్గురు భర్తలను కోల్పోయి దుఃఖంతో దేవునికి మొరపెట్టింది. ఆస్మోదియస్

అనే దయ్యం ఆ భర్తలను చంపివేసింది. ఈ యిరువురు భక్తులను కాపాడ్డానికి దేవుడు రఫాయేలు దేవదూతను పంపాడు. కాని అతడు దేవదూత అని సారా తోబీతులకు తెలియదు. వాళ్ళు అతన్ని సామాన్య నరునిగానే భావించారు.

సొమ్మును వసూలు చేసికొని రావడానికి రఫాయేలు తోబియాను మాదియా దేశానికి కొనిపోయాడు. దారిలో అతన్ని చేపబారినుండి కాపాడాడు. తోబియా చేప కాలేయం పొగతో అస్మోదియస్‌ను తరిమివేసి సారాను పెండ్లాడాడు. రఫాయేలు గబాయేలు నుండి సొమ్ముకూడ తెచ్చియిచ్చాడు.

తోబియా డబ్బుతో, వధువుతో సురక్షితంగా తిరిగివచ్చాడు. చేప పిత్తాన్ని పూసి తండ్రి గుడ్డితనాన్ని తొలగించాడు. సన్మనస్కుడు తండ్రీకుమారులకు తానెవరో తెలియజేసికొని అదృశ్యుడయ్యాడు. తండ్రీకుమారులు నివ్వెరపోయి దేవుణ్ణి స్తుతించారు.

3. వివరణం

1. తోబీతు సారాల దురవస్థ 1,1–3,17

తోబీతు అస్సిరియా దేశంలోని నీనివే పట్టణంలో ప్రవాసి, దైవభక్తి కలవాడు. తోబీతు అనే పేరుకి దేవుడు మంచివాడు అని అర్థ. తోబీతు పేదలకు అన్నంపెట్టి బట్టలిచ్చేవాడు. నీనివేలో శత్రువులు చంపివేసిన యూదులను పాతిపెట్టేవాడు. ఏటేట యెరుషలేము యాత్రచేసి తన పంటలో పదవవంతు చెల్లించేవాడు. ధర్మశాస్త్రం విధించిన భోజనాన్నే తినేవాడు. ఇవి అతని పుణ్యకారాలు.

అతని భార్య అన్నా, కుమారుడు తోబియా. వాళ్ళు పవిత్రమైన కుటుంబ జీవితం గడిపేవాళ్ళు. తోబీతు మాదియా దేశంలోని రాగేసులో వసించే గబాయేలు వద్ద సొమ్ము దాచాడు.

తోబీతుకి కష్టకాలం దాపురించింది. రాజు అతని ఆస్తిని తీసికోగా అతడు పేద వాడయ్యాడు. గోడ ప్రక్కన పండుకొని వుండగా పిచ్చుకలు అతని కండ్లల్లో రెట్టవేసాయి. అతనికి చూపుపోయింది. అతని భార్య అన్నా కూలికి పోయి యజమానుడు తనకు కానుకగా ఇచ్చిన మేకపిల్లను తీసికొని వచ్చింది. తోబీతు భార్య దొంగతనం చేసిందను కొని ఆమెను మందలించాడు. కాని ఆమె పెనిమిటి మీద తిరగబడి అతన్ని నిందించింది. కనుక తోబీతు దుఃఖంతో దేవా! నీవు నా ప్రాణాలు తీసికొనిపో అని ప్రార్థించాడు.

అదేరోజు ఎక్బటానాలోని రగూవేలు కూతురు సారా కూడ దుఃఖానికి గురైంది, ఆమెకు ఏడుసార్లు పెండ్లయింది. కాని ప్రతిసారీ అస్మోదియస్ అనే దయ్యం ఆమె భర్తలను చంపివేసేది. ఒకరోజు సారా పనికత్తె ఆమెను నిందించింది. కనుక సారా

దుఃఖంతో ఏడ్చింది. దేవా! నీవు నా ప్రాణమైనాతీయి, లేదా నాకు వేరే మార్గమైనా చూపించు అని ప్రార్థించింది.

దేవుడు తోబీతు సారాల మొర విన్నాడు. ఆ యిద్దరు భక్తులను కాపాడ్డానికి రఫాయేలు దేవదూతను పంపాడు. అతడు తోబీతు గ్రుడ్డితనాన్ని తొలగించాలి. సారాకు పట్టిన అస్మోదియను దయ్యాన్ని పారదోలాలి. అతడు ఈతోబియా ద్వారా ఈ కార్యాలు నెరవేరుస్తాడు. దేవుడు తోబీతు రగూవేలు కుటుంబాలను వివాహం ద్వారా కలిపి వేస్తాడు. ఇది తోబీతు సారా భక్తుల ప్రార్థనా ఫలితం.

2. ప్రయాణం

తోబీతు తాను చనిపోతాననుకొని కుమారునికి ఉపదేశం చేసాడు. దీనిలో తల్లిపట్ల గౌరవం, పేదలకు దానాలు చేయడం మొదలైన మంచివిషయాలు ఎన్నో వున్నాయి. పాఠకులు ఈ వుపన్యాసాన్ని జాగ్రత్తగా చదవాలి -4,3-21.

తోబియా చిన్నవాడు. అతడు తండ్రి సొమ్ము తసికొని రావడానికి మాదియా దేశానికి వెళ్ళాలి. కనుక అసరియా అనే ప్రయాణికుడు అతనికి తోడి బాటసారిగా కుదిరాడు. ఇతడు రఫాయేలు సన్మనస్కే. కాని తోబీతు కుటుంబానికి అతడు దేవదూత అని తెలియదు. 5,232లో తోబీతు దేవదూత మన బిడ్డతో ప్రయాణం చేస్తాడు అంటాడు. తరువాత అతడు ఆశించినట్లే జరిగింది. ఇది వ్యంగ్యం. తోబియాతోపాటు అతని చిన్నకుక్క కూడా ప్రయాణం చేసింది.

దారిలో తోబియా టిగ్రిస్ నదిలోకి దిగగా ఒక పెద్ద చేప అతన్ని మ్రింగబో యింది. రఫాయేలు సలహాపై అతడు చేపను చంపి దాని కాలేయం, గుండె, పిత్తం దాచుకొన్నాడు. ఇవి తరువాత అతనికి ఉపయోగపడతాయి.

త్రోవలో రఫాయేలు తోబియాకు సారాను గూర్చి చెప్పాడు. సృష్ట్యాది నుండి దేవుడు ఆమెను నీకు భార్యగా నియమించాడు అని చెప్పాడు 6,17. ఆ యువకునికి సారా మీద ప్రేమపుట్టింది.

## 3. సారా తోబీతులకు చికిత్స 7,1-11,18.

రఫాయేలు తోబియాను ఎక్బటానాలోని రగూవేలు ఇంటికి తీసికొనిపోయాడు. ఆ యువకుని కోరికపై రగూవేలు సారాను అతనికిచ్చి పెండ్లిచేసాడు. పడకగదిలో తోబియా చేప కాలేయాన్ని, గుండెను కాల్చి పొగవేసాడు. ఆ పొగకు సారాకు పట్టివున్న దయ్యం పారిపోయింది. సన్మస్కుని శక్తికి పిశాచం లొంగిపోయింది. వధూరులు కలసి కోకముందు దేవునికి ప్రార్థన చేసారు. తోబియా "నేను కామతృప్తికిగాక దైవాజ్ఞకు

లొంగి ఈ సారాను స్వీకరించాను" అంటాడు -8,7. భార్యాభర్తలు పరస్పరం సహాయం చేసికోవడం, సంతానాన్ని కనడం దైవాజ్ఞ. ఆదాము, ఏవ ఈ నవ దంపతులకు ఆదర్శం. వాళ్ళు ఉద్రేకానికి లొంగిపోలేదు. ప్రార్థన వారిని అదుపులో వుంచింది.

రగూవేలు 14 రోజులపాటు వివాహోత్సవం జరిపించాడు. ఈ మధ్యలో రఫాయేలు రాగేసుకు పోయి రూకల సంచిని తెచ్చాడు. గబాయేలు కూడా వివాహ మహోత్సవానికి వచ్చి వధూవరులను దీవించాడు. ఇంటి దగ్గర తోబీతు తన కుమారుడు అనుకొన్న కాలానికి రాలేదేమిటా అని బెంగపడ్డాడు. తండ్రి కంటెగూడ ఎక్కువగా తల్లి కుమారుని కొరకు ఎదురుచూచేది. రేయంతా అతని కొరకు కలవరించేది.

కడన తోబియా భార్యతో, మిత్రునితో నీనివే పట్టణానికి తిరిగివచ్చి తండ్రిని కలసికొన్నాడు. కుమారుడు చేప పిత్తాన్ని తండ్రి కన్నులకు పూసి కంటిలోని పొరలను పెరికివేసాడు. తోబీతుకి చూపు వచ్చింది. అతడు కుమారునితో నాయనా! నా కంటికి దీపానివైన నిన్ను మళ్ళీ చూడగలిగాను అన్నాడు -11,14. అతడు కోడలిని ఇంటి లోనికి ఆహ్వానించాడు. రెండు కుటుంబాలు కలసిపోయాయి.

## 4. రఫాయేలు దర్శనం 12,1-14,15

దేవదూత సారాకు పట్టిన దయ్యాన్ని వదలించాడు. ముసలి తోబీతుకు దృష్టి వచ్చేలా చేసాడు. అతడు వచ్చిన పని ముగిసింది. ఇక దేవుని వద్దకు వెళ్ళిపోతాడు.

తండ్రీకుమారులు రఫాయేలు ఉపకారానికి అతనికి తగిన జీతం చెల్లించాలను కొంటున్నారు. దేవదూత వారికి చిన్న ఉపన్యాసం చేసాడు. దీన్ని పాఠకులు బైబులు నుండి చదవాలి -12,6-10. ఆ పిమ్మట అతడు నేను దేవుని సన్నిధిలో నిల్చి అతనికి సేవలు చేసే ఏడ్గురు దేవదూతల్లో ఒకణ్ణని చెప్పాడు. తండ్రీకొడుకులు అతన్ని చూచి భయపడ్డారు. దేవదూత వారికి దేవుణ్ణి స్తుతించండని చెప్పి అదృశ్యు డయ్యాడు. సన్మనస్కులను గూర్చి చెప్పాలంటే బైబుల్లో ఈ గ్రంథానికి మించింది లేదు. వాళ్లు మనకు చేసే సేవలు నాల్గ. 1.వాళ్ళు మనకు మార్గదర్శకులై ఏమి చేయాలో, ఏమి చేయకూడదో చెప్తారు. 2. మనకు ఉపదేశం చేస్తారు. 3. మనచే ప్రార్థన చేయిస్తారు. 4. మనలను పరీక్షకు గురిచేసి దానిలో మనం నెగ్గేలా చేస్తారు. మన తరపున మనం వాళ్ళపట్ల భక్తిని పెంపొందించుకోవాలి.

తోబీతు కుమారునికి తుది సందేశం విన్పించి చనిపోయాడు. తోబియా నీనివేను వదలి ఎక్బటానాలో వసించాడు. నీనివే నాశమైంది. అతడు 117 ఏండ్లు జీవించి కన్నుమూసాడు.

## 4. పుస్తకం సందేశం

తోబీతు గ్రంథం మొదటినుండి చివరిదాక దైవభక్తితో నిండివుంటుంది. ఈ పుస్తకంలో రఫాయేలు పాత్ర దేవుడు నరులను ఆదుకొంటాడు అని చెప్తుంది. తోబీతు పాత్ర ఓర్పునీ, కరుణ కార్యాలనూ తెలియజేస్తుంది. అతడు ఆదర్శ భక్తుడు. తోబియా పాత్ర తల్లిదండ్రులపట్ల భక్తిగౌరవాలు కలిగి వుండాలని చెప్తుంది. తోబియా సారాలది పవిత్రమైన వివాహ బంధం

గ్రంథంలో ధర్మశాస్త్రాన్ని పాటించడం, దానధర్మాలు, ప్రార్థన, ఉపవాసం మొదలైన అంశాలు వస్తాయి. ఇది విశేషంగా కుటుంబ భక్తిని వర్ణిస్తుంది. పేదలకు అన్నం పెట్టడం, బట్టలీయడం, మృతులను పాతిపెట్టడం, తల్లిదండ్రులు బిడ్డల మధ్య అనురాగం నెలకొనడం, పెద్దల ఉపదేశాలు వినడం మొదలైన అంశాలు గ్రంథమంతట వస్తాయి.

రఫాయేలు అస్మోదియసును ఓడించి తోబియా సారాలకు మేలుచేసాడు. నేడు మన జీవితంలో మనం దేవదూతలపట్ల భక్తిని పెంచుకొంటే వారినుండి ఎన్నో వుపకారాలు పొందుతాం.

ప్రార్థనలు దేవునికి మొరపెట్టడం, దైవస్తుతులు, నీతివాక్యాలు గ్రంథంలో కోకొల్లలుగా వుంటాయి. కనుక ఈ పుస్తకాన్ని చదువుతుంటే దేవాలయంలో ప్రార్థన చేసికొన్నట్లుగానే వుంటుంది.

క్రీస్తు పూర్వం 2వ శతాబ్దంలో గ్రీకు రాజులనుండి హింసలనుభవించే యూదులను ప్రోత్సహించడానికి రచయిత ఈ గ్రంథాన్ని వ్రాసాడు. ఏ దోషం లేకున్నా సారా శ్రమలకు గురైంది. పుణ్యకార్యాలు చేసినా తోబీతు బాధలు అనుభవించాడు. నీతిమంతులైన యాకోబు యోసేపుల్లాగే, తోబియా సారాల్లాగే యూదులు కూడా కొన్ని శ్రమలు అనుభవించాలని ఈ గ్రంథకర్త హెచ్చరించాడు. నేడు మన జీవితంలో కూడా శ్రమలు తప్పవు.

ప్రాచీన కాలంనుండి క్రైస్తవులు ఈ గ్రంథాన్ని భక్తితో చదువుతూ వచ్చారు. మనకు బాగా వుపయోగపడే బైబులు గ్రంథాల్లో ఇదీ ఒకటి. ఈ పొత్తం ప్రధానంగా కుటుంబ భక్తినీ, కుటుంబ ధర్మాలనూ బోధిస్తుంది. కనుక మన విశ్వాసులు ఈ పుస్తకాన్ని శ్రద్ధతో చదవాలి. ఇది మంచికథ. కనుక విసుగు పుట్టించదు. ఇంటిలో మన పిల్లల చేతకూడా ఈ పుస్తకాన్ని చదివించాలి. పింగళి యెల్లన అనే ప్రాచీన కవి ఈ పుస్తకాన్ని “సర్వేశ్వర మహత్త్వం” అనే పేరుతో పద్యకావ్యంగా వ్రాసాడు.

## 2. యూదితు గ్రంథం

### 1. గ్రంథ స్వభావం

క్రీస్తు పూర్వం 175–164 కాలంలో సిరియా దేశాన్నేలిన అంటియోకస్ ఎపిఫానీస్ అనే గ్రీకు రాజు యూదులను క్రూరంగా హింసించాడు. ఆ సందర్భంలో యూదులను ప్రోత్సహించడానికి రచయిత ఈ గ్రంథాన్ని వ్రాసాడు. దేవుడు బలహీనుల ద్వారాగూడ తన ప్రజలను కాపాడతాడని ఉద్బోధించాడు. ఈ పుస్తకం క్రీ.పూ. 150–100 సంవత్సరాల మధ్య వెలువడి వుంటుంది. ఇపుడు దీని హీబ్రూ మూలం లభింపదు. గ్రీకు అనువాదం మాత్రమే దొరుకుతుంది. ఇది చారిత్రక గ్రంథంకాదు. దైవభక్తినీ, నీతినీ బోధించే కల్పిత గాథ. చిన్న నవల లాంటిది.

### 2. కథా సంగ్రహం

అస్సిరియా రాజైన నెబుకద్నెసరు, మాదియా రాజు మీదికి యుద్ధానికి పోయాడు. పశ్చిమ ఆసియా రాజ్యాలు అస్సిరియా రాజుకి సామంత రాజ్యాలు. ఐనా అవి యుద్ధంలో అతనికి సహాయం చేయలేదు. కనుక అతడు ఆ దేశాలను శిక్షించడానికి తన సైన్యాధిపతియైన హోలోఫెర్నెసును బ్రహ్మాండమైన సైన్యంతో పంపాడు. ఇతడు వచ్చి యూదుల నగరమైన బెతూలియాను ముట్టడించాడు. యిస్రాయేలీయులు పాపం చేయందే వారిని జయించడం సాధ్యంకాదని అమ్మోనీయుల నాయకుడు అకియోరు సేనానికి సలహాయిచ్చాడు. ఐనా సేనాపతి వినలేదు.

హోలోఫెర్నెసు బెతూలియా పట్టణానికి నీటి సరఫరాను ఆపివేసాడు. నగర పౌరులు శత్రువుకి లొంగిపొండని తమ నాయకులను వత్తిడిచేసారు. ఇంకా ఐదు రోజుల్లో దైవసహాయం అందకపోతే లొంగిపోతామని ఆ నాయకులు మాటయిచ్చారు.

ఆ పరిస్థితుల్లో యువ వితంతువైన యూదితు ముందుకు వచ్చి విరోధికి లొంగకూడదనీ అతన్ని ఎదిరించి పోరాడాలనీ సలహా యిచ్చింది. తాను స్వయంగా నగరాన్ని కాపాడుతానని వాగ్దానం చేసింది. ఆమె దాసితో శత్రువు శిబిరానికి వెళ్ళింది. బెతూలియాను నీవశం చేస్తానని చెప్పి హోలోఫెర్నెసును ఉబ్బించింది. అతనికి ఆమెపై మరులు పుట్టాయి. నాల్గవనాడు అతడు ఆమెను చెరపగోరి విందుకు ఆహ్వానించాడు. ఆమె అందానికి తబ్బిబ్బులై ద్రాక్షసారాయాన్ని విపరీతంగా త్రాగి మైకంలో పడిపోయాడు. యూదితు అతని తలను నరికి బెతూలియాకు తీసికొనిపోయింది. యిస్రాయేలీయులు శత్రువుల మీదికి దాడిచేసి వారిని ఓడించి కొల్లసొమ్ము దోచుకున్నారు.

యూదితు పురజనులతో యెరూషలేము వెళ్ళి దేవాలయంలో కానుకలు అర్పించింది. భర్త మనష్షేను స్మరించుకొంటూ జీవితాంతం వితంతువుగానే వుండి పోయి పండు ముసలితనంలో చనిపోయింది.

## 3. వివరణం

### 1. అస్సిరియనుల దాడి 1,1-3,10

అస్సిరియా రాజు నెబుకద్నెసరు యుద్ధంలో తనకు సహాయం చేయనందుకు పశ్చిమ దేశాలను శిక్షించడానికి తన సైన్యాధిపతియైన హోలోఫెర్నెసును పంపాడు. వాటిల్లో యిస్రాయేలు దేశం ఒకటి. వారి నగరమే బెతూలియా. అస్సిరియా రాజు తానొక దేవుణ్ణనుకొని యూదులు కొలిచే యావే దేవుణ్ణి ఎదిరించాడు. నెబుకద్నెసరు మానవ ప్రతినిధి హోలోఫెర్నెసు. యావే ప్రభువు మానవ ప్రతినిధి యూదితు.

సేనాపతి ఒకలక్ష ముప్పయి రెండువేల మందితో గూడిన బ్రహ్మాండమైన సైన్యంతో వచ్చి చిన్నగ్రామమైన బెతూలియాను ముట్టడించారు. ఈ యుద్ధంలో ఇద్దరు దేవుళ్ళు ఒకరినొకరు ఎదిరించారు. రాజుది మానుషబలం. యూదితుది దైవబలం. పశ్చిమదేశాల్లో శత్రువుని ఎదిరించింది యిస్రాయేలు దేశమొక్కటే.

### 2. బెతూలియా ముట్టడి 4,1-7,32

హోలోఫెర్నెసు బెతూలియా ప్రక్కన శిబిరాన్ని పన్నాడు. ఆ శిబిరాన్ని చూచి యూదీయులు భయపడ్డారు. యెరూషలేము నరానికీ, దేవాలయానికీ ప్రమాదం కలుగుతుందని దడిసారు. వాళ్ళు శత్రువులు తమ దేశలోకి ప్రవేశించే కనుమలకు కాపుపెట్టారు. ప్రార్థనలు, ఉపవాసాలు చేసి దైవానుగ్రహంతో యుద్ధానికిసిద్ధమయ్యారు.

శత్రుసేనాని తన శిబిరంలో మంత్రాలోచనం జరిపాడు. అతడు యిస్రాయేలీ యులు ఎవరని ప్రశ్నింపగా అమ్మోనీయుల నాయకుడైన అకియోరు వారి పుట్టు పూర్వోత్తరాలను తెలియజేసాడు. వారికి దైవబలం ఉందనీ, పాపం చేస్తేనే తప్ప వారి దేవుడు వారిని చేయి విడువడనీ చెప్పాడు. కనుక వారిని జయించడం కష్టమని హితవు చెప్పాడు. కాని సేనాపతి గర్వంతో అతని సలహాను పాటించలేదు.

శత్రుసైన్య బెతూలియాను చుట్టుముట్టి నీటి సరఫరాను ఆపివేసింది. నగర పౌరులు 34 రోజుల వరకు తమవద్ద వున్న నీళ్ళు వాడుకున్నారు. ఆ మీదట త్రాగటానికి నీళ్ళులేక సొమ్మసిల్లిపోయారు. శత్రువుకి లొంగిపొమ్మని తమ నాయకుడైన ఉజ్జీయాను నిర్బంధం చేసారు. ఉజ్జీయా ఇంకా ఐదునాళ్ళు చూద్దాం. దేవుడు అద్భుతంగా వాన కురిపించి

నీళ్ళు ఈయకపోతే లొంగిపోదాం అన్నాడు. ఉజ్జీయా గడువుతో కలుపుకొని మొత్తం 39 రోజులు ఔతాయి. 38వ రోజు యూదితు ద్వారా ప్రజలకు విమోచనం లభిస్తుంది.

### 3. యావే ప్రతినిధిగా యూదితు 8,1-10,10

యూదితు యువ వితంతువు. యూద సమాజంలో వితంతువులు దీనుల వర్గానికి చెందినవాళ్ళు. ఐనా ప్రభువు ఈ దీనురాలి ద్వారానే విజయాన్ని ప్రసాదిస్తాడు. ఆమె పేరుకి యూదజాతి స్త్రీ అని అర్థం. యూదితు అందగత్తె. అందమనే ఆయుధంతోనే ఆమె శత్రువును జయిస్తుంది. ఆమె భక్తిమంతురాలు. గోనెతాల్చి ప్రార్థనలు, ఉపవాసాలు చేసేది. కనుక ఆమె ప్రభువు చేతిలో యోగ్యురాలైన సాధనం.

నగరపెద్దలు ఐదు రోజుల్లో యావే సహాయం అందకపోతే శత్రువుకి లొంగి పోదామన్నారు కదా! యూదితు ఈ నిర్ణయం పొసగదని చెప్పింది. అది దేవుణ్ణి పరీక్షించి నట్లవుతుందని వాకొంది. కనుక ఆ నిర్ణయాన్ని రద్దు చేయించింది. యూదులది పురుషాధిక్య సమాజం. అలాంటి సమాజంలో ఓ స్త్రీ పురుషుల నిర్ణయాన్ని మార్చి వేసి క్రొత్త నిర్ణయం చేసింది. ఆమె శత్రువుకి లొంగవద్దనీ అతన్ని ఎదిరించమనీ ఆజ్ఞాపించింది. తాను శత్రువు శిబిరానికి వెళ్ళి నగరాన్ని కాపాడతానని చెప్పింది. కాని అది యేలాగో తెలియజేయలేదు. ఆమె మనసులో వున్న ప్రణాళికను దేవుడు ఆమోదిస్తాడో లేదో కూడా ఆమెకు ముందుగా తెలియదు. ఐనా దేవునిపై భారం వేసి కార్యానికి పూనుకొంది.

ఆమె విరోధుల శిబిరానికి వెళ్ళకముందు తలమీద బూడిద చల్లుకొని, గోనెతాల్చి. వినయంతో ప్రార్థన చేసింది. "ప్రభూ! నీవు సైనికుల సంఖ్యపై, బాలాఢ్యుల బలంపై ఆధారపడవు. నీవు పీడితులకు సహాయుడవు" అని దేవునికి మొరపెట్టింది -9,11. ఈ విధంగా దైవబలాన్ని పొంది కార్యాచరణకు పూనుకొంది.

ఇంకా ఆమె చక్కగా అలంకరించుకొని విరోధుల విడిదికి పోయింది. ఆమె అందానికి నగరానికి కావలి కాసే యిస్రాయేలీయులే ముగ్ధులయ్యారు. ఈ యందం ఆమె ఆయుధం. దీనితోనే ఆమె శత్రువుని జయిస్తుంది. మనం మన అందాన్ని దుర్వినియోగం చేస్తాం. కాని యూదితు దాన్ని దైవకార్యానికి ఉపయోగించి సద్వినియోగం చేసికొంది.

### 4. యూదితు శత్రు శిబిరానికి వెళ్ళడం 10,11-13,20.

ఆ ధీరురాలు దాసితో బెతూలియా నగరద్వారం దాటి శత్రువుల శిబిరంలో ప్రవేశించింది. అక్కడ గస్తీ కాసేవాళ్ళను నమ్మించి నేను మీ సేనాపతికి విశ్వసనీయమైన

సమాచారాన్ని అందించడానికి వచ్చానని చెప్పింది. శిబిరంలో యూదితు చుట్టుమూగిన అస్సిరియా సైన్యం ఆమె సౌందర్యానికి మురిసిపోయి యిస్రాయేలు అందగత్తెలు లోకాన్నతంటినీ లొంగదీసికుంటారు అని పల్కారు –10,19. తర్వాత ఆమె నిజంగానే సేనాని లొంగదీసికొంది. ఇది వ్యంగ్యం.

సైనికులు ఆమెను హోలోఫెర్నెసు గుడారానికి తీసికొనివెళ్ళారు. అతడు రాత్రి దివిటీల కాంతిలో యూదితు సౌందర్యాన్నిచూచి విభ్రాంతి చెందాడు –22. తర్వాత ఆమె అతని తల తెగనరుకుతుంది. కాని ఆ సుందరాంగిని చూడగానే ఇప్పుడే అతని తలపోయింది.

యూదితు సేనాని ముందు పెద్ద ఉపన్యాసం చేసింది. అతన్ని బాగా పొగడి అస్సిరియా సైన్యమంతటిలో నీవు మొనగాడివంది. ఆ మాటలకు అతడు పొంగిపో యాడు. ఆమె అకియోరు ఉపన్యాసాన్ని జ్ఞప్తికి తెచ్చి "మా ప్రజల ఆహారం ఐపోయింది. వాళ్ళు తమ పంటలో దేవునికి అర్పించిన ధాన్యాన్ని భుజించి పాపం గట్టుకొంటారు. అప్పుడు నీవు వాళ్ళను జయించవచ్చు. నేను నిన్ను యెరూషలేములో రాజుగా అభిషేకిస్తాను" అని చెప్పింది. సేనాపతి ఆమె మాటలన్నీ నమ్మాడు. ఇంకా ఆమె నేనొక ముఖ్యకారాన్ని నెరవేరుస్తాను. అది యేమిటో తెలిసికొన్నపుడు లోకమంతా విస్తుపోతుంది అని పల్కింది –11,16. హోలోఫెర్నెసు ఆ కార్యం బెతూలియాను జయించడం అనుకొన్నాడు. కాని యూదితు దృష్టిలో ఆ కార్యం అతని చావే.

రచయిత యూదితు విజయాన్ని యుద్ధవిజయంగా వర్ణించాడు. యూదితు శిబిరంలో మూడు రోజులు వసించింది. అక్కడ తాను వెంటతెచ్చుకొన్న శుద్ధాహారాన్ని భుజించింది. యూదులకు ఆహార నియమం ముఖ్యం. ఆమె రోజూ వేకువ జాముననే లేచి శిబిరం ప్రక్కనున్నలోయలోనికి వెళ్ళి స్నానం జేసి శుద్ధిని పొందివచ్చేది. దారిలో తన ప్రయత్నాన్ని దీవించమని దేవునికి మనవి చేసేది. ఈ యాచారం నెపంతోనే ఆమె నాల్గవరోజు అర్థరాత్రి విరోధి శిరస్సుతో శిబిరం బయటికి రాగలిగింది.

కడన నాల్గవరోజు, అనగా 38వ రోజు రానేవచ్చింది. ఆ రోజురాత్రి హోలోఫెర్నెసు యూదితుకి విందు చేసాడు. ఆ విందు ఆమెను చెరచడానికే – 12,12. యూదితు తన సౌందర్యాన్ని ఆయుధంగా వాడుకొంది. చక్కగా అలరించుకొని మూర్తీభవించిన సౌందర్యంలాగ వచ్చి విందుశాలలో నాయకుని ముందు కూర్చుంది. అతడు ఆమెను కూడాలన్న కోరికతో మహోద్రేకానికి గురయ్యాడు. ఆమె అందానికీ మురిసిపోయి తన జీవితంలో ఏనాడూ త్రాగనంతగా ద్రాక్షసారాయన్ని త్రాగాడు.

అలా తప్పత్రాగి మైకంగమ్మి పడకమీద తూలి పడిపోయాడు. అలా యూదితు చేతికి సులువుగా దొరికిపోయాడు.

ఆమె దేవునికి ప్రార్థన చేసింది. తాను చేయనెంచిన కార్యాన్ని సఫలం చేయమని వేడుకొంది -13,5. ఆమెకు శక్తినిచ్చేవాడు భగవంతుడే.

ఆ వీరనారి హోలోఫెర్నెసు కత్తితోనే అతని శిరస్సును తెగనరికింది. దాసి ఆ తలను ఆహారపదార్థాల సంచిలో దాచింది. ఇద్దరు రోజూ వేకువజామున స్నానానికి పోయినట్టుగానే శిబిరంనుండి వెలుపలికి పోయారు. అచటినుండి బెతూలియా నగర ద్వారం చేరుకొన్నారు.

పూర్వం యాయేలు శత్రువైన సీస్రాను కణతల్లో మేకు దిగగొట్టి చంపింది న్యాయాధి -4,17-22. దావీదు గొల్యాతును అతని కత్తితోనే చంపాడు -1సమూ 17,48-51. వీరిలాగే ఇక్కడ యూదితు శత్రువుని హతమార్చింది. దైవబలంతో బలహీనురాలు బలాఢ్యుణ్ణి గెల్చింది. అతడు మాయతో విందు ఏర్పాటు చేసి ఆమెను చెరచాలని చూచాడు. కాని ఆమె శత్రువుని మించిన మాయతో ఆ చెరువును తప్పించుకొని విరోధి ప్రాణాలు తీసింది.

పురజనులు యూదితు చేతిలోని శిరస్సుని చూచి విస్తుపోయారు. దేవుడు లోకంలోని స్త్రీలందరికంటెను యూదితుని ఎక్కువగా దీవించాడని ఉజ్జీయా పొగడారు. ఉజ్జీయా, ఇతర పురుషులు యుద్ధానికి పోలేదు. భయంతో నగరంలోనే వుండిపోయారు. ఓ ఆడపడుచు శిబిరానికి పోయి శత్రువుని ఓడించి వచ్చింది. అనగా ఓ స్త్రీ పురుషులను కాపాడింది. ఇది విడ్డూరం.

5. శత్రువుల భంగపాటు 14,1-16,25

యూదితు శత్రువు శిరస్సును నగర ప్రాకారంపై వ్రేలాడదీయించింది. పురజనులను విరోధి మీదికి దాడిచేయమని పంపింది. వాళ్ళు సేనాపతిని నిద్రలేపబోయి అతడు చచ్చాడని తెలిసికొని కలవరం చెందారు. ఆ కాలంలో ఒక పురుషుడు ఒక స్త్రీ చేతిలో చావడం అవమానకరం. తమ నాయకుని మరణవార్తవిని అస్సిరియను సైనికులు శిబిరం నుండి పారిపోయారు. యూదులు వారిని తరిమి చంపివేసారు. వారి శిబిరాన్ని దోచుకొన్నారు. యెరూషలేము నుండి ప్రధాన యాజకుడు వచ్చి యూదితుని అభినందించాడు.

యూదితు పురజనులు యెరుషలేము వెళ్ళి అక్కడ దేవునికి కృతజ్ఞతాస్తుతులు అర్పించారు. యూదితు హోలోఫెర్నెసు సామగ్రిని దేవునికి అర్పించింది. ఆ వీరనారి

శౌర్యాన్ని మెచ్చుకొని చాలామంది ఆమెను పెండ్లాడ్డానికి వచ్చారు. కాని ఆమె తన భర్త మనష్షేపట్లగల గౌరవంచే జీవితాంతం వితంతువుగానే వుండిపోయింది. అలా ఆమె స్త్రీకి వివాహమాడ్డం, బిడ్డలను కనడం ఒక్కటే ముఖ్యం కాదని నిరూపించింది. తన ఆస్తిని బంధువులకు పంచియిచ్చింది. తన దాసికి స్వేచ్ఛనిచ్చింది. పండు ముసలి తనంలో 105వ యేట పరమపదించింది.

4. పుస్తకం సందేశం

1. అంటెయోకస్ ఎఫిఫానీస్ వేద హింసలకు చిక్కిన యూదులకు ధైర్యాన్ని కలిగించడానికి రచయిత ఈ గ్రంథాన్ని వ్రాసాడు. కనుక ఇది ప్రధానంగా దేవుని పట్ల నమ్మకాన్ని పెంచేది. ఉజ్జీయా యూదితుతో "దేవుని పట్ల నీవు చూపిన నమ్మకాన్ని ప్రజలు ఏనాడూ విస్మరించరు" అంటాడు -13,19. ఈ గ్రంథం నేడు మనకు కూడా దేవునిపట్ల నమ్మకాన్ని పుట్టిస్తుంది. ఐతే మనంకూడా యూదితులాగ నేడు సమాజంలో జరుగుతున్న అన్యాయాలనూ, మనమీదికి వచ్చే దుష్టశక్తులనూ ధైర్యంతో ఎదిరించాలి.
2. నియంతల ఆగడాలు చెల్లవు. దేవుడు వారికంటె శక్తిమంతుడు. దైవశక్తితో ప్రజలు దుష్టులను ఎదిరించాలి.
3. దేవుడు కష్టాలను నరులను శిక్షించడానికే పంపడు. మన విశ్వాసాన్ని పరీక్షించ డానికి గూడ పంపవచ్చు. శ్రమల్లో మన విశ్వాసం బలపడుతుంది. యూదితు అస్సిరియనుల దాడిని ఈ దృష్టితో చూచింది.
4. దేవుడు బలహీనుల ద్వారానే బలవంతులను జయిస్తాడు. అతడు ఒక ఆడ గూతురు ద్వారా మహా సైన్యాధిపతిని మన్ను గరపించాడు. మనకు దైవబలం ముఖ్యం.
5. ప్రార్థనం మంచిదే. కాని ప్రార్థనం వల్లనే అన్నీ నెరవేరవు. యూదితు కార్యా చరణకు పూనుకొని విరోధి శిబిరానికి వెళ్ళి అతన్ని ఓడించింది. దేవుడు నేను నీ ప్రణాళికను నెరవేరుస్తానని ముందుగా ఆమెకు హామీ ఈయలేదు. ఐనా ఆమె దేవుణ్ణి నమ్మి పనికి పూనుకొంది. నగర నాయకులు సాధించలేని కార్యాన్ని తాను సాధించింది. కనుక జపంతోపాటు కార్యాచరణం గూడ వుండాలి.
6. యూదితు స్త్రీజాతికే అలంకారం. ఆమె పేరుకే యూదమహిళ అని అర్థం. యూద మహిళల్లోని గొప్పతనం ఆమెలో రాసిపోసినట్లుగా కన్పించింది. యూద సమాజం స్త్రీలకు విలువనీయలేదు. ఐనా ఆమె ఆనాటి యిస్రాయేలు పురుషుల

కంటే ఎక్కువ తెలివీ ధైర్యసాహసాలు ప్రదర్శించింది. ఆమె పూర్వవేదంలోని మిర్యాము, దెబోరా, యాయేలుల్లాగ ధీరవనిత. ఆమెనుండి మన క్రైస్తవ స్త్రీలు ప్రేరణం పొందాలి. ధైర్యంతో నాయకత్వం వహించి ముందుకు సాగాలి. మన బాలికలకు యూదితు, ఎస్తేరు, రూతు మొదలైన ధీరవనితల పేర్లు పెట్టాలి.

7. మన దైవార్చనలో యూదితు మరియమాతకు పోలికగా వుంటుంది. ఆమె హోలోఫెర్నెసున లాగే మరియ పిశాచాన్ని జయించింది. యూదితు మరియకు సూచన వ్యక్తి.

8. హోలోఫెర్నెసు వాలకం నేడు మనలో అరుదేమీ కాదు. పరస్త్రీని జంతుదృష్టితో జూచి కామించినపుడెల్ల ఆ దుష్టుడు మనలో మెదులుతున్నాడు అనుకోవాలి. కామ వికారాన్ని జయించనివాడు భక్తుడు కాదు.

## 3. ఎస్తేరు గ్రంథం

### 1. గ్రంథ స్వభావం

బైబుల్లో హీబ్రూ ఎస్తేరు, గ్రీకు ఎస్తేరు అని రెండు గ్రంథాలున్నాయి. గ్రీకు పుస్తకంలో హీబ్రూ పుస్తకంలో వున్నదానికంటే 107 వచనాలు అధికంగా వున్నాయి. ప్రొటెస్టెంటులు హీబ్రూ ఎస్తేరునీ, క్యాతలిక్కులు గ్రీసు ఎస్తేరునీ అంగీకరించారు. ఇది చారిత్రక గ్రంథంకాదు. చరిత్రను ఆధారంగా చేసికొని వ్రాసిన చిన్న నవల.

ఈ పుస్తకంలో అధ్యాయాలనూ వచనాలనూ తెలిపే సంఖ్యలు గజిబిజిగా వుంటాయి. ఐనా కథాక్రమంమాత్రం సక్రమంగానే వుంటుంది. కనుక పాఠకులు ఈ పుస్తకంలోని అధ్యాయాల సంఖ్యల్లో పొరపాటుందేమోనని భ్రాంతి పడకూడదు. హీబ్రూ ఎస్తేరుని క్రీస్తుపూర్వం రెండవ శతాబ్దంలో వ్రాసారు. గ్రీకు ఎస్తేరులో అధికంగా వున్న భాగాలను తర్వాత చేర్చారు.

### 2. కథా సంగ్రహం

పారశీక చక్రవర్తియైన అహష్వేరోషు వష్టిని రాణి పదవినుండది తొలగించి నూత్న రాణి కొరకు గాలించాడు. మొర్దెకయి అన్న కూతురు యూద మహిళ ఐన ఎస్తేరు నూత్నరాణి ఐంది.

రాజు ముఖ్యమంత్రియైన హామానుకి మొర్దెకయిపై ద్వేషం. కనుక అతడు మొర్దెకయినీ, పారశీకంలోని యూదులందరినీ కూడా వధించడానికి కుట్రపన్ని మోసంతో రాజుచే శాసనం చేయించాడు. ఎస్తేరు రాజుసన్నిధిలోకి వెళ్ళి యూదులను

కాపాడమని వేడుకోవాలి. ఐతే ఆ రోజుల్లో ఎవరుకూడ రాజు పిలువకుండానే అతని సన్నిధిలోకి వెళ్ళకూడదు.

హామాను మొర్దెకయిని ఉరితీయించడానికి 75 మూరల ఎత్తున ఉరికంబాన్ని సిద్ధం చేయించాడు. ఎస్తేరు రాజును సందర్శించి అతనికి విందు చేయించింది. ఆ విందులో యూదులకు ప్రాణభిక్ష పెట్టమని వేడుకొంది. ఆ సమయంలోనే హామాను కుట్రనుగూడ రాజుకు తెలియజేసింది. హామానుతన్ను క్షమించమని అడుగుకోవడానికి పడకపై కూర్చుండివున్న ఎస్తేరు కాళ్ళపై పడ్డాడు. రాజు ఈ చర్యను అపరాధంగా భావించి హామానునిఅతడు మొర్దెకయి కొరకు తయారుచేయించిన ఉరికంబం మీదనే ఉరితీయించాడు. యూదులు పారశీకంలోని తమ శత్రువులను రెండు రోజులపాటు చంపారు. వాళ్ళు శత్రువులపై సాధించిన విజయాన్నే పూరీము ఉత్సవంగా జరుపు కొన్నారు. రాజు హామానుకు బదులుగా మొర్దెకయిని ప్రధానమంత్రిని చేసాడు. అతడు దేశాభివృద్ధికొరకూ, యూదుల శ్రేయస్సు కొరకూ కృషిచేసాడు.

ఈ పుస్తకాన్ని వ్రాయడంలో గ్రంథకర్త ఉద్దేశాలు రెండు. మొదటిది, పూరీము ఉత్సవం ఎలాపుట్టిందో తెలియజేయడం. రెండవది, తన్ను నమ్మి తనను శరణు వేడినవారిని దేవుడు తప్పక కాపాడతాడని తెలియజేయడం. ఇక ఈకథను ఐదు భాగాలుగా పరిశీలిద్దాం.

## 3. వివరణం

### 1. వష్టి రాణి 11,2-1,22

అహష్వేరోషు తన అధికారులకు విందుచేయించాడు. ఈ విందులో తప్పత్రాగి వివేకాన్ని కోల్పోయి రాణి అధికారుల ముందు తన సౌందర్యాన్ని ప్రదర్శించాలని ఆజ్ఞాపించాడు. అభిమానమున్న ఏ స్త్రీయైనా అలాంటిపని చేస్తుందా? వష్టి రాజాజ్ఞను త్రోసిపుచ్చింది. రాజు సలహాదారులుకూడా అతనిలాంటివాళ్ళే. వాళ్ళు రాణిని చూచి దేశంలోని స్త్రీలందరూ తమ భర్తలను ధిక్కరిస్తారు కనుక ఆమెను పదవినుండి తొలగించ మని రాజుకి సలహాయిచ్చారు. వష్టి పదవి పోయింది. ఇక్కడ రచయిత పారశీక రాజుల పిచ్చి పద్ధతులను ఎగతాళి చేసాడు.

### 2. మొర్దెకయి -ఎస్తేరు 2,1-3,6

కొంతమంది అందమైన కన్నెలను రాజు అంతఃపురానికి తీసికొనివచ్చారు. వారిలో ఎస్తేరుకూడా వుంది. రాజుకు ఆమె అందం, వినయం నచ్చింది. కనుక రాజు ఆమెను పరిణయమాడి వష్టికి బదులుగా రాణిని చేసాడు. కాని ఆమె యూదస్త్రీ అని రాజుకి

తెలియదు. వష్టిరాణి స్వతంత్రభావాలు కలది. ఆమె అభిమానాన్ని కాపాడుకోవడానికి రాణి పదవిని వదలుకొంది. ఆమెతో పోలిస్తే ఎస్తేరుకి సొంతభావాలు లేవు. ఈమె పెద్దలకు మొర్దెకయికి విధేయురాలు. నేటి స్త్రీ విమోచనవాదులు ఈమెకంటె వష్టినే అధికంగా గౌరవిస్తారు.

ఇద్దరు సేవకులు రాజుపై కుట్రపన్నగా మొర్దెకయి ఆ కుట్రను భగ్నం చేసి రాజుని కాపాడాడు. కాని మొర్దెకయికి అప్పటికప్పుడు ఏ బహుమానం లభించలేదు. ప్రధానమంత్రి హామానుకి మొర్దెకయి దండంపెట్టలేదు. యావే ప్రభువుకి తప్ప మరొక రికి దండం పెట్టకూడదని అతని తలంపు. కనుక హామాను అతనిపై పగబట్టాడు.

3. యూదులకు అపాయం 3,7-5,14

మొర్దెకయి మీదగల కోపంచే హామాను యూదులందరినీ చంపించబూనాడు. రాజుకి లంచమిచ్చి యూదులను హత్యజేయడానికి శాసనం చేయించాడు. కాని ఆ ప్రజలు యూదులని రాజుకి తెలియదు. హామాను వాళ్ళు “ఒకానొక జాతి” అని చెప్పాడు. ఆదారు నెల (ఫిబ్రవరి - మార్చి) 13వ తేదీన యూదులను హత్యచేసి వారి యాస్తులను స్వాధీనం చేసికోవాలని అన్ని రాష్ట్రాల్లో ప్రకటించారు.

మొర్దెకయి యూదుల వధను ఆపివేయవలసిందిగా రాజును బ్రతిమాలమని ఎస్తేరును కోరాడు. కాని ఆ రోజుల్లో ఎవరైనా రాజు పిలువకుండానే అతని సన్నిధిలోకి వెళ్తే చావు తప్పదు. ఎస్తేరు రాజు దగ్గరికి వెళ్తే ఆమెకు చావు, వెళ్ళకపోతే ఆమె ప్రజలకు చావు. ముందు గొయ్యి, వెనుక నుయ్యి.

ఎస్తేరు తన ప్రజలకొరకు స్వీయప్రాణాలను గూడా సమర్పించడానికి పూనుకొంది. ఆమె దేవునికి ప్రార్థన చేసింది. సింహం గుహలోనికి ప్రవేశింపనున్న తనకు వాక్శక్తి ప్రసాదించమని వేడుకొంది -14,13. నిజాయితీతో గూడిన ఆమె మొరను దేవుడు ఆలించాడు.

ఆమె రాజు సన్నిధిలోకి రాగా అతడు ఆమెవైపు కోపంగాజూచాడు. కాని దేవుడు రాజు హృదయాన్ని దిడీలున మార్చి అతనికి రాణిపై దయపుట్టేలా చేసాడు -15,11. ఇక్కడ ఎస్తేరు ధైర్యాన్ని మెచ్చుకోవాలి. రాజు రాణిని ఆదరంతో చేరదీసి నీ కోరిక యేమిటో చెప్పమన్నాడు. ఆమె అతన్ని విందుకి ఆహ్వానించింది. ఈ విదంఉకి హామాను కూడా వచ్చాడు. కాని అతడు అంతకుముందే మొర్దెకయిని ఉరితీయడానికి 75 అడుగు ఎత్తయిన ఉరికంబాన్ని సిద్ధం చేయించాడు. ఐతే బైబుల్లో విందులు పతనాన్నీ పదోన్నతనీ గూడా సూచిస్తాయి. హామాను పతనం దగ్గరించింది.

## 4. యూదులు పగ తీర్చుకోవడం 6,1-9,198

ఒకరోజు రాత్రి రాజు నిద్రపట్టక రాజకార్యాల దస్తావేజులు చదివించుకొన్నాడు. వానిలో సేవకుల కుట్రనుండి మొర్దెకయిరాజును రక్షించాడనీ, అతనికే బహుమతి లభించలేదనీ వ్రాయబడివుంది. కనుక రాజు అతన్ని బహూకరించాలి అనుకొన్నాడు. ఆ వుదయమే హామాను మొర్దెకయిచావుకి అనుమతీనీయమని అడగడానికి రాజు దగ్గరికి వచ్చాడు. రాజు సత్కరించగోరినవాణ్ణి ఎలా సన్మానించాలని ప్రభువు మంత్రిని అడిగాడు. హామాను ఆ సన్మానం తనకేనని భ్రాంతిపడి అతన్ని గుర్రమెక్కించి ఊళ్ళో ఊరేగించాలి అన్నాడు. ప్రభువు ఈ పని నీవు మొర్దెకయికి చేయించు అని ఆజ్ఞాపించాడు. హామాను శత్రువుని వూళ్ళో ఊరేగించాడు. అతని మొగం చిన్నపోయింది. అతని భార్య మిత్రులు మొర్దెకయి నిన్ను ఓడిస్తాడు అని చెప్పారు. ఎస్తేరు ప్రార్థనను విన్న దేవుడే ఈ కార్యాన్ని కూడా జరిపించాడు.

రాణి రెండవ విందు చేసింది. రాజు మంత్రి హాజరయ్యారు. ఆ విందులో ఆమె మాజాతి ప్రజలకు చావు మూడింది. ప్రభువులవారు మమ్ము కాపాడాలి అని వేడుకొంది. మంత్రి హామానే మాకు కీడు తలపెట్టాడని చెప్పింది. రాజు మంత్రిపై కోపించి ఉద్యానవనంలోకి వెళ్ళాడు. మంత్రి పడకమీద వాలి విందారగిస్తున్న ఎస్తేరు కాళ్ళపైబడి తన్ను క్షమింపమని వేడుకొంటున్నాడు. అంతలో రాజు తిరిగివచ్చి వీడు నా యింటనే నా రాణినే మానభంగం చేస్తాడా యేమిటి అన్నాడు. వెంటనే సేవకులు అతని ముఖంమీద ముసుగువేసారు. రాజాజ్ఞపై మొర్దెకయికొరకు సిద్ధంచేసిన ఉరికంబంమీదనే అతన్ని వ్రేలాడదీసారు. ఈలా మొర్దెకయిచావు హామాను చావుగా మారింది. మంత్రి తాను త్రవ్విన గోతిలో తానే పడ్డాడు. ఇది దైవనిర్ణయం. ఈ ఘట్టంలో మంత్రిని పట్టియీయడంలో ఎస్తేరు చూపిన ధైర్యాన్ని మెచ్చుకోవాలి. రాజు హామానుకు బదులుగా మొర్దెకయిని ప్రధానమంత్రిని చేసాడు.

యూదులు తమ్ము చంపడానికి వచ్చినవాళ్ళను తాము చంపవచ్చునని రాజు, మంత్రి క్రొత్త ఆజ్ఞ జారీచేసారు. యూదులు పారశీకులను 75,800 మందిని చంపి పగతీర్చుకొన్నారు. సంతోషంతో పూరీము ఉత్సవం చేసికొన్నారు. ఐతే, ఇలా పగతీర్చు కోవడం పూర్వవేదానికి తగుతుందిగానీ నూత్నవేదానికి తగదు. క్రీస్తు శత్రువులను క్షమించమన్నాడు గానీ, ప్రతీకారం చేయమనలేదు. నూత్నవేద వరప్రసాదం ఇంకా పూర్వవేదంపై సోకలేదు అనుకోవాలి.

## 5. పూరీము ఉత్సవం 9,20-10,1

పూర్వం హామాను ఆదారునెల 13వ తేదీన యూదులను చంపాలని నిర్ణయించాడు. కనుక ఈ నెల 13,14 తారీఖుల్లో యూదులు పూరీము ఉత్సవాన్ని జరుపుకోవాలని మొర్దెకయి, ఎస్తేరు ఆజ్ఞాపించారు. ఆ యిద్దరు యూదుల అభివృద్ధి కొరకు, పారశీకరాజ్యం శ్రేయస్సుకొరకు కృషిచేసారు.

పూర్వం మొర్దెకయి కలలో రెండు సర్పాలు పోట్లాడుకోవడం, ఓ నదిపుట్టటం చూచాడు. ఆ సర్పాలు హామాను, తాను. ఆ నది ఎస్తేరు.

4. పుస్తకం సందేశం

ఈ పుస్తకంలోని ప్రధాన పాత్రలు మొర్దెకయి, ఎస్తేరు. మొర్దెకయి తెలివితో హామాను కుట్రను తప్పించుకొన్నాడు. అతడు ఎస్తేరును ప్రోత్సహించి ఆమె రాజునుండి యూదులకు ప్రాణభిక్షను సంపాదించి పెట్టేలా చేసాడు. ప్రధానమంత్రి అయ్యాక యూదుల శ్రేయస్సుకొరకు కృషిచేసాడు. ఇతనిలాగే మనమూ మన సుగుణాలనూ, సామర్థ్యాన్ని పెంచుకోవాలి.

ఎస్తేరు ఆదర్శ వనిత. ఆమె తన ప్రజల శ్రేయస్సుకొరకే జీవించింది. ప్రాణాపాయాన్ని గూడ లెక్కచేయక రాజు సన్నిధిలోకి వెళ్ళి యూదులకు ప్రాణభిక్ష పెట్టమని వేడింది. ధైర్యంతో హామాను కుట్రను రాజుకి ఎరిగించింది. ఆమెలో ధైర్యం, దైవభక్తి, విధేయత మొదలైె సుగుణాలు వున్నాయి. ఐతే నేటి స్త్రీ విమోచనవాదులు ఎస్తేరుకంటే వష్టినే ఎక్కువగా మెచ్చుకొంటారు. వష్టి స్త్రీగా తన గౌరవాన్ని కాపాడుకోవడానికి రాణి పదవిని త్యజించింది. తర్వాత ఎస్తేరు ఆమె స్థానాన్ని ఆక్రమించుకొంది. కాని వష్టిలో వున్న ఆత్మాభిమానం, స్వతంత్రభావాలు ఈమెలో లేవు.

ఈ గ్రంథలో ఆపదలో దేవుణ్ణి సహాయం అడుక్కోవడం, ప్రార్థనం, ఉపవాసం మొదలైన సదాచారాలు వస్తాయి. ఇవి నేడు మనకు కూడా అవసరమే.

ఈ పుస్తకంలో విందులు చాల పర్యాయాలు వస్తాయి. ఇవి బైబుల్లో పదవీ చ్యుతిని, పదోన్నతినీ కూడా సూచిస్తాయి. విందుల్లోనే వష్టి, హామాను పడిపోయారు. విందుల్లోనే ఎస్తేరు తన కార్యాన్ని సాధించుకొంది. నేడు మనకు పాస్క విందు, సత్ప్రసాద విందు ఉన్నాయి. మనం వీటిల్లో భక్తితో పాల్గొని ఆధ్యాత్మికాభివృద్ధిని పొందాలి.

పారశీకదేశంలో యూదులు అల్పసంఖ్యాకులు. వారి ప్రత్యేక జీవిత విధానాన్ని చూచి పారశీకులు వారినిద్వేషించారు. నేడు ఇండియాలో మనం మైనారిటీ వర్గాలము. కనుక హిందువులు మనలను చులకన చేస్తారు.

హామాను మోసంతో పారశీకంలోని యూదులను తెగటార్చేవాడే దైవకటాక్షం యూదులను కాపాడింది. దేవుణ్ణి నమ్మి అతని సహాయాన్ని అడుగుకొంటే మన జీవితం సురక్షితంగా వుంటుంది.

ఈ గ్రంథంలో రాజకీయమైన ఎత్తులు, ఎదురెత్తులు వున్నాయి. పారశీకులు యూదులను నాశం జేయగోరితే యూదులు వారికి ప్రతీకారం చేసారు. నూత్నవేదంలో మనం శత్రువు మీద పగతీర్చుకోకూడదు. అతన్ని క్షమించి వదలివేయాలి. క్రీస్తు అందరినీ ఐక్యంజేసి శాంతిని చేకూర్చి పెట్టేవాడు -ఎఫే 2,14-15. కనుక ఈ పుస్తకంలోని శత్రుశిక్షణం మనకు ఆదర్శం కాదు.

# 4. రూతు గ్రంతం

## 1. గ్రంథ స్వభావం

ఈ పుస్తకం క్రీ.పూజ 5వ శతాబ్దానికి చెందిన రచన. దీనిలోని విషయం మాత్రం న్యాయాధిపతుల కాలానికి చెందింది 1200. ఇది చారిత్రక గ్రంథం. ఇది చిన్న నీతి కథ. కనుక మిద్రాష్ పుస్తకాల్లో చేర్చాం. యూదులు దీన్ని ఉత్సవదినాల్లో చదివేవాళ్ళు.

దీనిలో తోబీతు గ్రంథంలోలాగ అద్భుతాలు, దేవదూతల జోక్యం మొదలైన అసాధారణ సంఘటనలు ఏమీ వుండవు. పైరుపండి కోతకోయడం, పరిగలు ఏరడం, కరువు, పెండ్లి, శిశుజననం, మరణం మొదలైన రోజువారి సంఘటనలు మాత్రమే కన్పిస్తాయి.

ఇంకా ఈ గ్రంథంలో పురుషుల ప్రాముఖ్యం వుండదు. నవోమి, రూతు అనే ఇద్దరు స్త్రీలు కథ నడుపుతారు. వాళ్ల నిర్ణయాలు చేసి కథను సుఖాంతం చేస్తారు. ప్రాచీన యూద సమాజంలో స్త్రీలకు ప్రాముఖ్యం లేదు. ఆ కాలంలో రచయిత ఈలాంటి కథను ఏలా అల్లాడా అని ఆశ్చర్యం కలుగుతుంది.

ఈ కథలో నిబంధనకు అధిక ప్రాముఖ్యం వుంటుంది. సినాయి నిబంధనం ద్వారా యావే ప్రభువు యిస్రాయేలీయుల పట్ల కరుణాజూపాడు. అతని పేరుమీదిగా యూదులు కూడ ఒకరిపట్ల ఒకరు దయజూపాలి. రూతు నవోమి పట్ల కరుణ జూపడం ఈ పుస్తకంలో ఓ ముఖ్యాంశం.

ఇది కళాత్మకమైన కథ. గ్రంథం ఎలా ముగుస్తుందా అని చివరిదాకా ఉత్కంఠ కలిగిస్తుంది. కథ చివరిదాకా పవిత్రంగా, నిర్మలంగా నడుస్తుంది.

## 2. కథా సంగ్రహం

న్యాయాధిపతుల కాలంలో ఓ యూదకుటుంబం బేత్లెహేమునుండి మోవాబు దేశానికి వలసపోయింది. అక్కడ తండ్రి ఎలీమెలెకు చనిపోయాడు. ఇద్దరు కొడుకులు మహ్లోను, కిల్యోను అనేవాళ్లు మోవాబు పడుచులైన రూతు, ఓర్పాలను పెండ్లి చేసికొన్నారు. పెండ్లయ్యాక ఈ కొడుకులు కూడ సంతానం లేకుండానే చనిపోయారు. బెత్లెహేములో కరవు తీరింది కనుక తల్లి నవోమి తిరిగి అక్కడకి వెళ్లగోరింది. ఓర్పా వెళ్లిపోయింది గాని రూతు అత్తవెంట బెత్లెహేముకి వచ్చింది.

రూతు బోవసు అనే ధనవంతుని పొలంలో పరిగలేరుకోవడానికి పోయింది. ఇతడు ఎలీమెలెకుకి దగ్గరిచుట్టం కనుక ఈ వితంతువుని పట్టించుకోవలసినవాడు. నవోమి రూతుని బోసుకి పెండ్లిచేసి ఆమెకు సంతానాన్ని కలిగించాలని సంకల్పించుకొని ఒక పథకం పన్నింది. అత్త ఆదేశం ప్రకారం రూతు రాత్రిలో బోవసు కళ్లానికి వెళ్లి అతన్ని తన్ను పెండ్లాడమని వేడుకొంది. నవోమికి దగ్గరి చుట్టం బేత్లెహేములో మరొక డున్నా అతడు ఆమెను పెండ్లి జేసికోవడానికి ఇష్టపడలేదు. కడన బోవసే ధర్మబద్ధంగా ఆమెను వివాహమాడాడు. వారికి ఓబేదనే బిడ్డడు పుట్టి నవోమికి ఆనందం కలిగించాడు. ఈ వోబేదు మనుమడే దావీదు. ఇక ఈ చరిత్రను విపులంగా పరిశీలించి చూద్దాం.

## 3. వివరణం

## 1. మోవాబులో నవోమి 1,1-22

కరవువల్ల ఎలీమెలెకు, నవోమి, వారి కుమారులు మహ్లోను, కిల్యోను యూదా నుండి మోవాబు దేశానికి వలసపోయారు. అక్కడ కొడుకులిద్దరు మోవాబు పడుచులను పెండ్లాడారు. మహ్లోను భార్య రూతు. కిల్యోను భార్య ఓర్పా. పదేండ్లయ్యాక తండ్రీ కొడుకులు చనిపోయారు. ఇక ముగ్గురు వితంతువులు మాత్రమే మిగిలారు. యూద సమాజంలో వితంతువులు దిక్కులేనివాళ్లు.

ఇంతలో యూద దేశంలో వానలు కురిసి పంటలు పండాయి. కనుక నవోమి బేత్లెహేముకి తిరిగిరాగోరింది. ఆమె కోడళ్లను పుట్టనింటికి వెళ్లి మళ్లా పెండ్లాడి బిడ్డలను కనమంది. వారు తన పట్ల ఆదరంతో మెలిగినట్లే దేవుడు కూడ వారిపట్ల ఆదరంతో మెలగాలని కోరుకొంది -1,8. చిన్నకోడలు ఓర్పా పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె చేసింది మంచిపనే. కాని పెద్దకోడలు రూతు ఇంకా మంచిపని చేసింది.

రూతు అత్తతో నీతోపాటు నేనుకూడ బేత్లెమేము వస్తానంది. నీదేశం, నీ ప్రజలు, నీ దేవుడు, నా దేశం, నా ప్రజలు, నా దేవుడు ఔతారంది. రూతు పెనిమిటిపట్ల మమకారం జూపితే వింతయేమీ లేదు. కాని అత్తపట్ల, అదీ ఓ అన్యజాతి స్త్రీపట్ల మమకారం జూపితే  అది వింతేకదా! యావే నిబంధనల ద్వారా యిస్రాయేలు ప్రజలపట్ల జూపిన కరుణే రూతు అత్తపట్ల చూపింది. రూతు శీలాన్ని మదింపు వేయడానికి ఈ వొక్క సంఘటనం చాలు. 1,16–17 వాక్యాలు బైబుల్లోని అతి ప్రశస్త భాగాలకు చెందినవి. కనుక పాఠకులు వీటిని జాగ్రత్తగా మనం చేసికోవాలి.

బేత్లెహేములోని స్త్రీలు నవోమి కష్టాలకు సంతాపం తెలియజేసారు. ఆమెకూడ నా పేరు నవోమికాదు 'మారా' అని పల్కింది. నవోమి అంటే సుందరమైనదనీ, మారా అంటే విషాదకరమైనదనీ అర్థం.

## 2. రూతు బోవసును కలసికోవడం 2,1–23

బోవసు ఎలీమెలెకు కుటుంబానికి బంధువు. కనుక రూతుని పట్టించు కోవలసినవాడు అతడే. రూతు పరిగలేరుకోవడానికి పోయి బోవసు పొలంలోనే అడుగుపెట్టింది. దేవుడే ఆమెను అలా ప్రేరేపించాడు. రైతులు పైరు కోసేపుడు కొన్ని వెన్నులు పేదలకు వదలివేయాలని ధర్మశాస్త్రం ఆదేశిస్తుంది –లేవీ 19,9–10. బోవసు రూతుని తన పొలంలోకి ఆహ్వానించాడు. తాను కూలీలు అన్నం తినేపుడు రూతుని కూడ భోజనానికి ఆహ్వానించాడు. ఆమె అతనికి వందనాలు అర్పించింది. బోవసుతన కుటుంబానికి బంధువని మాత్రం రూతుకి తెలియదు.

ఆరోజు రూతు కుంచెడు ధాన్యంతో ఇల్లుజేరి అత్తకు చూపించింది. నవోమికి ఆలోచనపుట్టింది. బోవసు మనకు దగ్గరిచుట్టం గనుక మన సంగతిని పట్టించుకో వలసినవాడు అతడే అంది –2,20. అనగా బోవసు దేవరన్యాయం ప్రకారం రూతును పెండ్లాడాలని  భావం.

ఒక స్త్రీ సంతానాన్ని కనకముందే ఆమె భర్త చనిపోతే అతని సోదరుడు లేక దగ్గరిచుట్టం ఆ వితంతువును పెండ్లాడాలి. వారికి కలిగితే మొదటి బిడ్డడు చనిపోయిన నరునికి బిడ్డడౌతాడు. ఇదే దేవరన్యాయం. కుటుంబం గతించకుండా వుండడానికి ప్రాచీన యిస్రాయేలీయులు ఈ నియమం చేసికున్నారు –ద్వితీ 25,5–6.

## 3. వివాహ సూత్రధారణి నవోమి 3,1–16

నవోమి రూతును చక్కగా అలరించుకొని బోవసు కళ్లందగ్గరికి వెళ్లమని చెప్పింది. బోవసు రాత్రి కళ్లంలోని ధాన్యం దగ్గర పండుకొనివున్నాడు. రూతు అతనికి

నిద్రపట్టాక మెల్లగా వచ్చి అతని పాదాలమీది బట్టను తొలగించి ఆ పాదాల దగ్గర పండుకొంది. ఇక్కడ పాదాలమీద బట్టను తొలగించడం భార్యాభర్తల కలయికకు సూచనం.

బోవసు నడిజామున మేల్కొని తన పాదాల వద్దనున్న స్త్రీని చూచి విస్తుపోయాడు. రూతు సమయస్ఫూర్తితో అయ్యా! నీవు మాకు దగ్గరి చుట్టానివి. నన్ను పెండ్లాడి నాకు సంతానాన్ని కలిగించు అని వేడుకొంది. ఈ ప్రణాళికను తయారుచేసింది అత్త. దాన్ని నిర్వహించింది కోడలు. ఇక్కడ రూతు తెలివినీ, ధైర్యసాహసాలనూ మెచ్చుకోవాలి. ఆ అత్తాకోడళ్లు ఒకరికొకరు తీసిపోరు.

బోవసు అమ్మా! నీవు ఓ యువకుణ్ణి పెండ్లాడాక వయోవృద్ధుణ్ణయిన నావద్దకే వచ్చావు. నీవు నీయత్త పట్ల కంటే నాపట్ల యోగ్యతరంగా ప్రవర్తించావు. నీ ధర్మబుద్ధిని మెచ్చుకోవాలి అన్నాడు. రూతు బోవసులకు కావలసింది శారీరకానందం కాదు. సంతానాన్ని కని మహ్లోను కుటుంబాన్ని నిలబెట్టడం. ఈ ఘటాన్ని రచయిత చాల నేర్పుతోను కళాత్మకంగాను రచించాడు. బోవసు రూతు ద్వారా నవోమికి ఆరుకుంచాల ధాన్యం పంపాడు. ఈ చర్య నవోమి కుటుంబానికి సమృద్ధీ, సంతానప్రాప్తీ కలుగుతాయని సూచిస్తుంది.

## 4. రూతు బోవసుల పెండ్లి 4,1-12

బోవసు నగరద్వారం దగ్గరికి వచ్చాడు. ఇక్కడే పంచాయితీలన్నీ జరిగేవి. నవోమికి దగ్గరి బంధువు ఇంకొకడున్నాడు. రూతుకి సంతానాన్ని కలిగించవలసిన బాధ్యత అతనికి కూడ వుంది. అతన్నీ పదిమంది పెద్దలనూ నగరద్వారం దగ్గరికి పిలిపించారు. బోవసు ఆ బంధువుతో నవోమి తన పొలం అమ్మబోతుంది. నీవు ఆ పొలాన్ని కొని, రూతును పరిణయమాడి ఆమెకు సంతానాన్ని కలిగిస్తావా అని అడిగాడు. రూతుకి సంతానం కలిగితే ఆ పొలం ఆమె బిడ్డలకు దక్కుతుంది. కనుక అతడు నేనీకార్యం చేయలేను అన్నాడు. అప్పుడు బోవసు నేనే పొలాన్ని కొని రూతుని పెండ్లాడతానన్నాడు. అక్కడకు వచ్చిన పెద్దలంతా ఈ వుదంతానికి సాక్షులుగా వున్నారు. వాళ్లు రూతు పుణ్యస్త్రీలైన లెయా రామేళ్లవలె సంతానవతి కావాలన్నారు. బోవసు సుప్రసిద్ధుడు కావాలని దీవించాడు.

## 5. దావీదు వంశవృక్షం 4,13-22

బోవసు రూతుని పెండ్లాడగా ఆమెకు బిడ్డడు కలిగాడు. బేత్లెహేము స్త్రీలు నవోమిని అభినందించారు. ఈ కథ ఆమెతోనే ప్రారంభమై ఆమెతోనే ముగుస్తుంది. అబీమెలెకు కుటుంబాన్ని నిలబెట్టడానికి ఆమె గొప్ప ప్రణాళిక పన్నింది. రూతు బోవసులను ఐక్యం

జేయగోరింది. దేవుని కృప వలన ఆమె కృషి ఫలించింది. ఇప్పుడు మనుమణ్ణి ఎత్తుకొని సంతోషంతో అరుగుమీద కూర్చుంది. రూతుకి గొడ్రాలితనం పోయి, బిడ్డడు కలిగాడు. ఈ శిశువు ద్వారా మహ్లోను కుటుంబం భూమిమీద కొనసాగుతుంది. వారి ఆస్తి అన్యాక్రాంతం కాదు.

రూతు బోవసులకు క్రమంగా ఓబేదు, యిషాయి, దావీదు పుట్టారు. కనుక దావీదుకు రూతు ముత్తవ్వ ఔతుంది. తర్వాత మెస్సీయా ఈ దావీదు వంశం నుండే జన్మిస్తాడు. మత్తయి క్రీస్తు వంశావళిలో రూతును గూడ పేర్కొన్నాడు. ఆమె గొప్పతనం అది –మత్త 1,5.

## 4. పుస్తకం సందేశం

ఈ కథలోని ముఖ్యాంశాలు ఇవి. 1 ఈ పుస్తకంకుటుంబ ధర్మాలకు ఎంతో ప్రాముఖ్యమిస్తుంది. నవోమి దేవరన్యాయం ద్వారా కుటుంబానికి సంతానం కలిగిస్తుంది. సంతానం ద్వారా కుటుంబాన్ని నిలబెట్టాలని అత్తాకోడళ్లు పడిన శ్రమ మన మనసులను కరిగిస్తుంది. అత్తా కోడళ్ల అనురాగం మనలను ముగ్ధులను చేస్తుంది. 2. దేవుడు దీనురాళ్లయిన వితంతువులను కరుణతో ఆదరిస్తాడు. 3. దేవుడు ఒక్క యూదులనే గాక రూతులాంటి అన్యజాతి ప్రజలనుగూడ ఆదరిస్తాడు. ఎజ్రా అన్యజాతితో చేసికొన్న మిశ్రమవివాహాలను రద్దుచేసాడు. కాని ఈ గ్రంథం మిశ్రమ వివాహాలను సమర్థిస్తుంది. 4. ఈ పుస్తకం దావీదు వంశావాళిని గూడ పేర్కొంటుంది. దావీదుకి రూతు ముత్తవ్వ. దావీదు వంశంనుండే మెస్సీయా రావాలి.

యావే నిబంధనం ద్వారా యిస్రాయేలీయుల పట్ల కరుణ జూపినట్లే ఆ ప్రజలు కూడ ఒకరిపట్ల ఒకరు కరుణ జూపాలి. కనుకనే నవోమి, రూతు ఒకరిపట్ల ఒకరు కరుణజూపారు. బోవసుగూడ రూతుపట్ల కరుణ జూపి మహ్లోను కుటుంబాన్ని నిలబెట్టాడు. ఈ కరుణ ఈ గ్రంథంలోని ఓ ముఖ్యాంశం.

ఈ పుస్తకం ప్రధానంగా స్త్రీల కథ. స్త్రీలకు విలువనిచ్చేది. దీన్ని చదివి మనం మహిళల పట్ల గౌరవం పెంచుకోవాలి.

రూతు చరిత్ర పుణ్యకథ. కనుక భక్తులు ఈ గ్రంథాన్ని పలుసార్లు పారాయణం చేయాలి.

## అనుబంధం – సూసన్న కథ

సూసన్న కథ దానియేలు గ్రంథం 13వ అధ్యాయంలో వస్తుంది. ఈ భాగం హీబ్రూ బైబుల్లో లేదు. దాని అనువాదమైన గ్రీకు బైబుల్లో మాత్రమే కన్పిస్తుంది. కనుక ప్రోటస్టెంటులు దీన్ని అంగీకరించరు. మనకు మాత్రం దైవప్రేరితమైంది. ఈ కథను క్రీ.పూ. 1వ శతాబ్దంలో వ్రాసివుంటారు.

ఇది మొదట ఓ జానపద కథగా ప్రచారంలో వుండేది. ఎవడో యూద రచయిత ఈ కథను ఎన్నుకొని యూద మతాంశాలను దీనిలోనికి ప్రవేశపెట్టాడు. కనుక మొదట లౌకికపరమైన కథ తర్వాత మతపరమైన కథగా మారిపోయింది.

ఇది బైబుల్లోని ఉత్తమ కథల్లో వొకటి. ఒక్కసారి చదవగానే మన హృదయాన్ని ఆకట్టుకొంటుంది. అందుకే ఇది జనసామాన్యలో బాగా ప్రచారంలోకి వచ్చింది. కథ చిన్నదైనప మంచికథకు ఉండవలసిన లక్షణాలన్నీ దీనికీ వున్నాయి. సూసన్నకు ఏమి జరుగుతుందో అనే ఆంఓదళనం పాఠకునికి చివరిదాకా ఉత్కంఠను పుట్టిస్తుంది. కట్ట కడన దుష్టశిక్షణం అతని హృదయానికి ఊరటనిస్తుంది. కొందరి దృష్టిలో ఇది మొట్టమొదటి డిటెక్టివ: కథ. కాని ఇది ప్రధానంగా మిద్రాష్ కథ.

సూసన్న కథాసంగ్రహం ఇది. యూదులు బాబిలోనియా ప్రవాసంలో వున్నపుడు యోవాకీము భార్యయైన సూసన్న అనే స్త్రీ వుండేది. వారిది సంపన్నకుటుంబం. యూద సమాజానికి పెద్దలూ న్యాయాధిపతులూ ఐన వృద్ధులు ఇద్దరు ఆమెను కామించారు. ఒక రోజు మధ్యాహ్నా వాళ్ళు సూసన్నను చెరుపగోరి ఆమె వాడుక ప్రకారం తిరిగే తోటలో దాగివున్నారు. సూసన్న తోటలోనికి వచ్చి పనికత్తెలను పంపివేసి వంటరిగా వుండగా వారిరువురు ఆమెను సమీపించి నీవు మాకోరిక తీర్చు. లేకపోతే నీ విక్కడ ఓ యువకునితో వ్యభిచారం చేసినట్లుగా నీమీద నేరం మోపుతాం అన్నారు. ఆమె పెద్దగా అరవగా ఇంటిలోని జనమంతా పరుగెత్తుకొని వచ్చారు.

మరుసటిరోజు సూసన్నకు తీర్పు చెప్పారు. వృద్ధులు ఆమె వ్యభిచారం చేసిందని అబద్ధాలు చెప్పారు. ప్రజలు వారి కథను నమ్మి ఆమెకు మరణశిక్ష విధించారు. వాళ్ళు ఆమె జవాబును విననుగూడ వినలేదు. ప్రజలు ఆమెను చంపడానికి తీసుకొని పోతుండగా దేవుడు దానియేలు అనే యువకుని ప్రేరేపించాడు. అతడు వృద్ధుల సాక్ష్యాన్ని తిరిగి ప్రశ్నింపగోరాడు. వారిద్దరినీ వేరుపరచి సూసన్న ఏ చెట్టుక్రింద వ్యభిచారం చేసిందో చెప్పుమన్నారు. ముసలివాళ్ళు ఇద్దరు వేరువేరు చెట్లు పేర్కొన్నారు.

వారి సాక్ష్యాలు ఏకీభవించలేదు. కనుక కూటసాక్ష్యాలు చెప్పారని తేలిపోయింది. దానియేలు సూసన్నకు విడిపించి వృద్ధులిద్దరికీ మరణదండను విధించాడు. ఈ తీర్పు వలన దానియేలు కీర్తిబాగా పెరిగిపోయింది.

## 1. సూసన్న

యూదులు బాబిలోనియా ప్రవాసంలో వున్నపుడు యోవాకీము అనే సంపన్నుడు సూసన్నకు పెండ్లిచేసికొన్నాడు. ఆమె అందగత్తె. భక్తురాలు. తల్లిదండ్రులు చిన్నపుడే ఆమెకు యూదజాతి నియమాలు జాగ్రత్తగా నేర్పారు. యూదులు యోవాకీము తోటలో ప్రోగై కొన్ని వ్యవహారాలు చర్చించుకొనేవాళ్లు. ఆ యేడు ఇద్దరు వృద్ధులైన పెద్దలను న్యాయాధిపతులనుగా నియమించారు. వీళ్లు యోవాకీము ఇంటిలోనే ప్రజల తగాదాలకు తీర్పు చెప్పేవాళ్ళు. కాని వాళ్ళ బుద్ధి మంచిదికాదు. యిర్మీయా తన ప్రవచనంలో పేర్కొన్న ఇద్దరు దుష్టప్రకవ్తల వంటివాళ్లు -29,21-23.

సూసన్న మధ్యాహ్నం తోటలో కాసేపు తిరుగాడేది. న్యాయాధిపతులు ఆమెమీద కన్నువేసారు. రోజూ తోటలో ఆమెను చూడ్డానికి కాచుకొని వుండేవాళ్ళు. ఒకరోజు వాళ్లిద్దరూ ఒకరికోరిక లొకరు తెలిసికొన్నారు. సూసన్న ఒంటరిగా దొరికినప్పుడు చెరచాలని కాచుకొనివున్నారు.

## 2. న్యాయాధిపతుల కుతంత్రం

ఓ దినం మధ్యాహ్నం వాళ్ళు సూసన్నను చెరచాలని నిర్ణయించుకొని తోటలో దాగుకొని వున్నారు. ఆమె వాడుక ప్రకారం తోటకు వచ్చింది. ఆరోజు బాగ వేడిగా వున్నందున తోటలో స్నానం చేయగోరింది. పనికత్తెలను చమురు తీసికొని రండని ఇంటికి పంపింది. పనిపిల్లలు తోట ద్వారములు మూసివేసి వెళ్ళగానే అక్కడ దాగివున్న వృద్ధులు సూసన్న దగ్గరికి వచ్చి మాకు నీమీద కోరిక పుట్టింది. నీవు మా కోరిక తీర్చు. లేకపోతే నీవిక్కడ ఎవడో యువకునితో వ్యభిచరించావని నీమీద నేరం మోపుతాం అన్నారు. సూసన్న నేను ప్రభువుకి ద్రోహంగా పాపంజేయడం కంటె నిర్దోషినిగా మీ చేతికి చిక్కడం మేలు అంది. ఈ వాక్యాలను బట్టి ఆమె ఎంత యోగ్యురాలో ఊహించవచ్చు. వెంటనే సూసన్న కేకలు వేయగా ఇంటిలోని పనివాళ్ళు పరుగెత్తుకొని వచ్చారు. ముసలివాళ్ళు తమ కథను విన్పించారు. పనివాళ్ళు ఆ కథను నమ్మి సిగ్గుపడ్డారు.

## 3. కూటసాక్ష్యం

మరునాడు యోవాకీము ఇంటిలోనే సూసన్నకు తీర్పు చెప్పారు. ఆమె తమ వాంఛను తీర్చలేదు కనుక న్యాయాధిపతులు ఆమెను చంపించాలని కుట్రపన్నారు. ఆ మహిళ బంధువులతో, బిడ్డలతో సభ మధ్యకు వచ్చింది. నిందితురాలిగా ముఖంమ ఈద ముసుగు వేసుకొని వుంది. న్యాయాధిపతులు ఆమె సౌందర్యాన్ని చూచి ఆనందిం చాలన్న కోర్కెతో ఆమె ముసుగును తొలగించమని ఆజ్ఞాపించారు. దోషిమీద నేరం మోపేవాళ్ళు అతని తలమీద చేతులుపెట్టి నేరం విన్పించాలి -లేవీ 24,14. ఈ నియమం ప్రకారం ముసలివాళ్ళు సూసన్న తలమీద చేతులు పెట్టి "ఈమె తోటకు వచ్చి పనికత్తెలను పంపివేసి తలుపులుమూయించి ఒక యువకునితో వ్యభిచరించింది. మేము ఆ ప్రక్కనేవుండి ఇదంతా గమనించి ఆమె దగ్గరికి వచ్చాం. ఆ యువకుడు మాకు దొరకకుండా పారిపోయాడు. ఈమె చిక్కింది. ఆ యువకుని పేరుమాత్రం చెప్పడంలేదు" అని కూటసాక్ష్యం పలికారు. వాళ్ళు యూద సమాజానికి పెద్దలూ న్యాయాధిపతులూ కూడ. కనుక జనం సూసన్న అభిప్రాయాన్ని తెలిసికోకుండానే వాళ్ళు చెప్పింది నమ్మి ఆమెకు మరణశిక్ష విధించారు. యూదుల మరణశిక్ష రాళ్ళతో కొట్టి చంపడం.

ఆ భక్తురాలు మరణానికి ముందు పెద్దగా ఏడుస్తూ దేవునికి ప్రార్థన చేసింది. ప్రభూ! నీకు రహస్యాలన్నీ తెలుసు. ఈ దుష్టులు నా మీద మోపిన నేరం పచ్చి అబద్ధం. నీవు నన్ను కాపాడవా అని వేడుకొంది. నిజానిజాలు తెలిసిన దేవుడు ఆమె మొర విన్నాడు.

ఆ మహిళను చంపడానికి తీసికొని పోతూండగా దేవుడు దానియేలును ప్రేరేపించి అతనికి జరిగిన సంగతిని తెలియజేసాడు. అతడు కూటసాక్ష్యం వల్ల సంభవించిన ఈ మరణాన్ని నేను అంగీకరింపను అని అరచాడు. అతని ఆదేశం ప్రకారం జనులందరు మళ్ళా యోవాకీము ఇంటికి తిరిగి వచ్చారు. ఈమారు దానియేలే తీర్పు చెప్పడానికి పూనుకొన్నాడు. వృద్ధులు చెప్పిన సాక్ష్యాన్ని పరిశీలించి సత్యాసత్యాలు తెలిసికోవడం ముఖ్యమని అతడు గ్రహించాడు.

అతడు ఇద్దరు పెద్దలను వేరుపరచాడు. మొదటి వానిని పిలిపించి నీవు అన్యాయపు తీర్పులు చెప్పడంలో దిట్టవు. ఈ యిద్దరు ఏ చెట్టుక్రింద పాపం చేస్తూండగా నీవు చూచావో చెప్పు అన్నాడు. న్యాయాధిపతి మస్తకి చెట్టుక్రింద అన్నాడు. అంతట రెండవవానిని పిలిపించి నీవు కనానీయుల్లవలె విగ్రహారాధకుడివి. యిస్రాయేలు

స్త్రీలను చెరచేవాడివి. ఇప్పుడు నీ పాపం పండింది. ఈ యిద్దరు ఏ చెట్టు క్రింద పాపం చేసారో చెప్పు అన్నాడు. అతడు సింధూరం క్రింద అన్నాడు. ఇద్దరి సాక్ష్యాలు ఏకీభవించలేదు. కనుక వాళ్ళు చెప్పింది పచ్చి అబద్ధమని తేలింది. దేవుడు వారి కపటత్వాన్ని వెల్లడిచేసి సూసన్నను కాపాడాడు.

ప్రజలు ఆ పెద్దలమీద మండిపడ్డారు. కూటసాక్షులు నిందితునికి పడే శిక్షను తామే అనుభవించాలి -ద్వితీ 9,19. ఈ నియమం ప్రకారం జనం న్యాయాధిపతులను రాళ్లతో కొట్టి చంపి సూసన్నను విడిపించారు. ఆమె బంధువులు దేవుణ్ణి స్తుతించారు. జ్ఞానియైన దానియేలు కీర్తి అంతట వ్యాపించింది.

ఈ కథ నుండి మనం నేర్చుకోవలసింది ఏమిటి?

1. ఈ సంఘటనంలో ప్రధానపాత్ర సూసన్న. భక్తులు ఆపదలో చిక్కి మొర పెట్టినపుడు దేవుడు వారి మొర ఆలించితీరతాడు. జీవితంలో కష్టాలు వచ్చినంత మాత్రాన్నే నాశమైపోము. భక్తులను కాపాడే దేవుడొకడు వున్నాడని నమ్మాలి.
2. కుట్రలు మోసాలు బయటపడకపోవు. అధర్మం గెలువదు. నరులకు పాపభీతి వుండాలి. పాపం చేయడం కంటె చనిపోవడం మేలు.
3. కామం ఎప్పుడు మన హృదయంలో ప్రవేశిస్తుందో మనకే తెలియదు. కాని కామవాంఛలకు లొంగిపోయేవాళ్ళు నాశమైపోతారు.
4. ఇతరులు చెప్పింది వెంటనే నమ్మకూడదు. నిజానిజాలు పరిశీలించి చూచిన పిదపకాని ఒక నిర్ణయానికి రాకూడదు. ఈలా సూసన్నకథ అనేక విధాల మనకు నీతిని బోధిస్తుంది. మన బాలికలు ఈ పుణ్యస్త్రీ పేరు పెట్టుకోవాలి.

# 9. పూర్వవేద కథలు

బైబులు భాష్యం 151

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఏడ్గురు సోదరులు | 171 |
| 2. | ఎలియాసరు కథ | 175 |
| 3. | ఆకానుకు శిక్ష | 176 |
| 4. | దావీదు కథలు | 177 |
| 5. | షెబారాణి | 180 |
| 6. | ఉజ్జీయా పతనం | 181 |
| 7. | మిర్యామునకు శిక్ష | 182 |
| 8. | మెరీబావద్ద నీళ్ళు | 183 |


### 1. ఏడ్గురు సోదరులు, తల్లి -2 మక్క 7

క్రీస్తుపూర్వం 167 ప్రాంతంలో అంటియోకస్ అనే గ్రీకురాజు యూదులను హింసించాడు. యెరూషలేము దేవాలయాన్ని అమంగళం చేసాడు. యూదులు ధర్మశాస్త్రాన్ని విడనాడి గ్రీకు దేవతలను కొలవాలనీ, గ్రీకు ఆచారవ్యవహారాలను పాటించాలనీ నిర్బంధం చేసాడు. భక్తిలేని యూదులుకొందరు అతనికి లొంగిపో యారు. కాని భక్తికలవాళ్ళు అతన్ని ఎదిరించారు. వేదహింసలకూ, ప్రాణత్యాగానికి భయపడకుండా ధర్మశాస్త్రాన్ని నిష్ఠతో పాటించారు. ఆలాంటి భక్తవర్గానికి చెందిన వాళ్ళు ఏడ్గురు సోదరులు, వారి తల్లి -2మక్క 7.

ఈ కథలో ముఖ్యాంశం, ప్రాణాలను కాపాడుకోవడం కంటె ధర్మశాస్త్రాన్ని పాటించడం ముఖ్యం అనేది. ఈ సంఘటనం వేదహింసలు కాలంలో ధైర్యంగా ప్రాణత్యాగం చేయాలని చెప్తుంది. ఇది ఆధ్యాత్మికంగా, నైతికంగా ప్రేరణను పుట్టించే కథ. నేడు మనకు కూడా స్పందన కలిగిస్తుంది.

యూదులకు 7 పరిపూర్ణసంఖ్య. కనుక ఏడ్గురు సోదరులతో కూడిన ఈ కుటుంబ పరిపూర్ణమైందనీ, దైవభక్తి కలదనీ భావం. ఈ సంఘటనంలో వర్ణించిన అంశాలన్నీ చారిత్రకమై యుండనక్కరలేదు. ప్రజలకు ప్రేరణం పుట్టించడం రచయిత ముఖ్యోద్దేశం.

ఏడ్గురు సోదరులకు రాజభటులు ఈ క్రింది శిక్షలు విధించారు. వారి నలుకలు కోసివేసారు. కాలుసేతులు నరికివేసారు. తలమీది చర్మం పెరికివేసారు. వారిని గనగన మండే పెనముమీద కాల్చివేసారు.

ఈ కథ సిరియాలోని అంటియోకయ నగరంలో రాజు సమక్షంలో జరిగింది. ఏడ్గురు సోదరులు ప్రాణాలు విడువకముందు రాజును హెచ్చరించి మందలిస్తారు. ఈ కొడుకుల తల్లి తన బిడ్డలకంటె గూడ ఎక్కువ విశ్వాసము, ధైర్యము కలది. ఇది ఒక్కో కుమారుడు ప్రాణాలు అర్పించిన తీరును పరిశీలిద్దాం.

## మొదటి కుమారుడు

రాజు సోదరులను పందిమాంసం తినమని నిర్బంధం చేసాడు. ధర్మశాస్త్రం దీన్ని అంగదీకరించదు. కనుక సోదరులు రాజాజ్ఞను ధిక్కరించారు. అతడు వారిని కొరడాలతో కొట్టించాడు. మొదటి కుమారుడు మేము చావడానికైనా ఒప్పుకుంటాం గాని మా పూర్వుల చట్టాలను మీరం అన్నాడు. ఇది అతని ధర్మనిష్ఠ-2. భటులు అతని కాలుసేతులు నరికివేసి గనగన మండే పెనముమీద కాల్చివేసారు. సోదరులు తల్లి అతని ప్రాణత్యాగాన్ని కండ్లార చూస్తూ, ఒకరినొకరు హెచ్చరించుకొంటూ ధైర్యంగా వుండిపోయారు.

## రెండవ కొడుకు

రెండవ కొడుకునుకూడ భటులు పూర్వరీతినే శిక్షించారు. ఐనా అతడు ధైర్యాన్ని ఓర్పునీ కోల్పోలేదు. రాజుని ధిక్కరించి రాక్షసుడా! నీవు మమ్ము చంపితే నేమి? విశ్వాధిపతియైన ప్రభువు మాకు పునరుత్థాన భాగ్యాన్ని దయచేస్తాడు అని పల్కాడు - 9. పూర్వవేదంలోని యూదులకు పునరుత్థాన ముందని స్పష్టంగా తెలియదు. క్రీస్తుకి పూర్వం 200 యేండ్ల నుండే ఈ భావం స్పష్టంగా ప్రచారంలోకి వచ్చింది.

## మూడవనాడు

సైనికులు మూడవవాణ్ణి హింసించారు. అతని అవయవాలను నరికివేసారు. కాని అతడు ధైర్యంగా మీరు నా అవయవాలను నరికివేస్తారు. మా ప్రభువు ఉత్థానకాలాన వీటిని నాకు మళ్ళా దయచేస్తాడు అని పల్కాడు-11. అతని ధైర్యానికి రాజు విస్తుపోయాడు.

## నాల్గవవాడు

సైనికులు నాల్గవవాణ్ణి హింసించి శ్రమలకు గురిచేసారు. కాని అతడు దిట్టతనంతో మేము మా ప్రభువు కొరకు చనిపోతున్నాం. అతడు మాకు పునర్జీవాన్ని ప్రసాదిస్తాడు. మీకు మాత్రం ఉత్థానం, నూత్నజీవం లభించవు అన్నాడు -14. పునరుత్థానం మీది నమ్మిక అతన్ని ప్రేరేపించి ప్రాణాలు వదలుకొనేలా చేసింది.

## ఐదవ కుమారుడు

సైనికులు ఐదవవాణ్ణి బాధించారు. మామూలు శిక్షలకు గురిచేసారు. అతడు గడసుతనంతో రాజువైపు తేరిపారజూచి ఓయి! నీవు అధికార బలంతో మమ్ము శిక్షిస్తున్నావు. ఐనా దేవుడు మా ప్రజను చేయివిడువ లేదు. అతడు మా జనాన్ని తప్పక ఆదుకొంటాడు. నిన్ను నీ అనుచరులను మాత్రం శిక్షించితీరుతాడు అన్నాడు. 16-17. అంటియోకస్ వేద హింసలవల్ల యూదప్రజ నాశమైపోదని ఇతని నమ్మకం.

## ఆరవ కొడుకు

ఆరవవాడి వంతు వచ్చింది. భటులు అతన్ని కూడ మామూలు పద్ధతిలోనే హింసించారు. ఇతడు ఒక గొప్ప సత్యాన్ని తెలియజేసాడు. మా పాపాలవల్లనే మాకీ శిక్షలు వచ్చాయి అన్నాడు-18. యూదుల పాపం ధర్మశాస్త్రాన్నిమీరడమే. ఈపాపం యూద సమాజానికంతటికీ తిప్పలు తెచ్చిపెట్టింది. పాపానికి సమాజాన్నంతటినీ బాధించడం అనే దుష్ప్రభావం వుంటుంది. బైబులు ఈ సూత్రాన్ని చాలసార్లు పేర్కొంటుంది.

## ఏడవవాడు

సైనికులు ఏడవవాణ్ణి కూడ ఘోరశ్రమలకు గురిచేసారు. అతడింకా పసివాడు. ఐనా రాజుతో ఈలా అన్నాడు. మా సోదరుల మరణం మా ప్రజల పాపాలకు పరిహారం చేస్తుంది. దేవుడు మా శ్రమలను, చావులను చూచి మా ప్రజల పాపాలు క్షమిస్తాడు. యిస్రాయేలు ప్రజలు ఇకమీదట శ్రమలు అనుభవించరు 37-38. మన శ్రమలు ఇతరుల పాపాలకు ప్రాయశ్చిత్తం చేస్తాయి అనేది కూడ గొప్పభావం.

## తల్లి

ఈ తల్లి తన బిడ్డలకంటెను అధికమైన భక్తివిశ్వాసాలు, ధైర్యసాహసాలు కలది. ఆమె తన యేడ్గురు కుమారులు ఒక్కరోజులోనే చనిపోవడాన్ని చూచి తల్లడిల్లిపోయింది. కాని ప్రభువును నమ్మి ఆ దుఃఖాన్ని ఓపికతో భరించింది. ఆమెలో స్త్రీల ప్రేమ పురుషుల ధైర్యమూ రెండూ వున్నాయి. కనుక ఏడ్గురు బిడ్డలను ఈలా ప్రోత్సహించింది. నాయనాలారా! మీరు నా కడుపున ఎలా వూపిరి పోసికున్నారో నాకు తెలియదు. మీకు ఈ అవయవాలను ఇచ్చింది నేనుకాదు. అన్ని జీవులకు ప్రాణం పోసినవాడే మీకు కూడ జీవమిచ్చాడు. అతడు చనిపోయాక మీకు మళ్ళా ఉత్థానాన్ని దయచేస్తాడు. కనుక మీరు ధైర్యంతో ప్రాణాలు అర్పించండి -23.

ఈమె కడగొట్టు కొడుకుకి రెండు సత్యాలు విశదీకరించింది. 1.దేవుడు శూన్యం నుండి ప్రపంచాన్ని సృజించాడు -28. ఈ భావం ప్రాచీన మతాల్లో వేటిల్లో కూడ లేదు. బైబుల్లో కూడ ఇక్కడే మొదటిసారి తగులుతుంది. హెబ్రేయుల జాబు 11,3. ఈ భావాన్ని మరల జ్ఞప్తికి తెస్తుంది. 2.మరణం తర్వాత మళ్ళీ ఉత్థానముంటుంది. ఈ భాం దానియేలు గ్రంథం 12,2లోను, ఈ గ్రంథంలో ఈ కథలోను మొట్టమొదటిసారిగా స్పష్టంగా కన్పిస్తుంద. దైవప్రేరణవల్ల పూర్వవేదాంతంలో భక్తులు ఈ భావాన్ని స్పష్టంగా ప్రకటించారు. సరే, శత్రువులు ఏడ్గురు కొడుకుల తర్వాత తల్లిని గూడ చంపివేసారు. ఆ యెన్మిదిమంది యూదమతం కొరకు ధర్మశాస్త్రం కొరకు ప్రాణాలు అర్పించారు.

ఈ కథ నుండి మనం నేర్చుకోవలసిన సత్యాలు చాల వున్నాయి. 1. మన మతంపట్ల, మన విశ్వాసం పట్ల, దేవుని ఆజ్ఞలపట్ల మనకున్న నిష్ఠ ఏపాటిది? భారత దేశంలో వేదహింసలు ప్రారంభమయ్యాయి. గురువులను కొంతమందిని ఇదివరకే చంపివేసారు. మఠకన్యలను బాధించారు. విశ్వాసులను కష్టాలపాలు చేసారు. దేవాలయాలు ధ్వంసం చేసారు. మైనారిటీ ప్రజలంగా మన హక్కులను కాలరాస్తు న్నారు. రానురాను ఈ హింసలు ఇంకా ఎక్కువౌతాయిగాని తగ్గవు. ఈ దేశంలోని తీవ్రవాదులు క్రైస్తవులను అణగద్రొక్కడానికి ప్రణాళికలు సిద్ధంచేసికొంటున్నారు. ఈలాంటి పరిస్థితుల్లో ఈ యేడ్గురు సోదరులకథ మనకు ప్రేరణం పుట్టిస్తుంది. ఇది ప్రధానంగా వేదహింలకు, శ్రమలకు సంబంధించిన కథ. దీని నుండి మనం ప్రేరణం పొందాలి. ధైర్యంతో మనపాలబడిన శ్రమలకు సిద్ధం గావాలి.

2. మన పాపం ఇతరులను గూడ బాధిస్తుంది. అలాగే ఇతరుల పాపం మనలను బాధిస్తుంది. నరుల పాపం సమాజం మీదకూడ దుష్పరిణామం చూపుతుంది. ఈ యంశాన్ని గుర్తించిమనం పాపానికి దూరంగా వుండాలి.

3. హింసలనూ కష్టాలనూ భరించడం కష్టం. ఐనా ఒక్కసత్యం మన శ్రమల్లో మనకు ఓదార్పునిస్తుంది. మన శ్రమలు మన పాపాలకూ, మన సంఘం పాపాలకూ గూడ పరిహారం చేసిపెడతాయి. ఈ భావంతోనే పై సోదరులు ఓదార్పుని పొందారు.

4. శ్రమల్లో మనం దేవునికి దగ్గరౌతాం. అతన్ని ఆశ్రయిస్తాం. అతనికి ప్రార్థన చేసికొని అతనిపై ఆధారపడతాం. నేడు నరులు సుఖభోగాలకు అర్రులు చాస్తున్నారు. మనది సుఖసంస్కృతి. కాని ఈ సంస్కృతి మనలను దేవునికి దూరం చేస్తుంది. లోక వస్తువుల్లో కూరుకొని పోయేలా చేస్తుంది. అందుచే హింసలు ఒకవిధంగా మనకు మేలే చేసిపెడతాయి. అవి మన భక్తిని పెంచుతాయి.

5. ఈ కథలో దైవశాస్త్రానికి సంబంధించిన సత్యాలు చాల వున్నాయి. నరులకు మరణం తరువాత మళ్లా ఉత్థానముంది. దేవుడు లోకాన్ని శూన్యం నుండి సృజించాడు. ఆత్మకు చావులేదు. అది శాశ్వతంగా జీవిస్తుంది. దేవుడు దుర్మార్గులను శిక్షించి తీరుతాడు. అతడు న్యాయం జరిగిస్తాడు.

## 2. ఎలియాసరుకథ -2 మక్క 6,18-31

పై యేడ్గురు సోదరుల్లాగే వేదహింసల కాలంలో ప్రాణత్యాగం చేసిన భక్తుడు ఎలియాసరు. ఆదర్శవంతమైన ఇతని మరణం పైయేడ్గురు యువకులకు ప్రేరణం పుట్టించింది. ఇది నేడు మనకు కూడ ఉత్సాహం కలిగిస్తుంది.

ఈ భక్తుడు రబ్బయి. అంటియోకస్ సేవకులు ఇతన్ని పందిమాంసం తినమని నిర్బంధం చేసారు. దాన్ని అతని నోటిలో కుక్కారు. కాని అతడు దాన్ని ధైర్యంగా ఉమిసి వేసాడు. తానే స్వయంగా హింసాస్థానానికి వెళ్లాడు. అక్కడ బలులర్పించేవాళ్లు ఎలియాసరుకి స్నేహితులే. వాళ్ళు కూడ యూదులే. కాని విశ్వాసాన్ని కోల్పోయి శత్రుపక్షంలో చేరారు.

ఈ భ్రష్టులు నీవు మామూలు మాంసాన్ని భుజించి పందిమాంసం తిన్నట్లుగా నటించు. అప్పుడు చావును తప్పించుకోవచ్చు అని యెలియాసరుకి సలహా యిచ్చారు. మేము చేసే ఈ సహాయాన్ని అంగీకరించమని బతిమాలారు. కాని యెలియాసరు ఆ సలహాను పాటింపలేదు. రెండు కారణాలవల్ల అతడు దాన్ని నిరాకరించాడు. మొదటిది, దురాదర్శం. 90 ఏండ్ల యీడున యెలియాసరు పందిమాంసం తిని ధర్మశాస్త్రాన్ని మీరాడని యువకులు తలుస్తారు. అతన్ని చూచి యువకులు పెడమార్గం పడతారు. అది ఆ రబ్బయికి మాయనిమచ్చ 24-25.

రెండవది, అతడు తాత్కాలికంగా చావును తప్పించుకొన్నా తర్వాత ప్రభువు తీర్పుని తప్పించుకోలేడు -26. నరులను మెప్పించి దేవుని శిక్షకు గురైతే ఏమి లాభం? ఇక, అతడు ధర్మశాస్త్రం కొరకు మరణిస్తే యువకులకు మంచి ఆదర్శం చూపించినవాడు ఔతాడు. కనుక అతడు మరణాన్నే ఎన్నుకొన్నాడు.

రాజాజ్ఞను ధిక్కరించిన యెలియాసరుని భటులు కొరడాలతో కొట్టారు. అతడు చనిపోతూ "నేనీ శ్రమలను తప్పించుకొని వుండగలిగేవాణ్ణి. కాని ప్రభువు పట్ల గల భయభక్తులచే వీటిని అంగీకరిస్తున్నాను. ఈ సంగతి దేవునికి తెలుసు" అంటూ ప్రాణాలు విడిచాడు. అతని మరణం యూదజాతిలోని పిన్నలకూ, పెద్దలకూ గూడ చక్కని ఆదర్శమైంది.

ఎలియాసరు కథ మనకు కొన్ని సత్యాలు నేర్పుతుంది. 1. మనపాపాన్ని చూచి ఇతరులు అపమార్గం పడతారు. తోడివారికి, విశేషంగా చిన్నవారికి మనం చమంచి ఆదర్శం చూపించాలి. ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా? కనుకనే యెలియాసరు ఇతరులకు నీతిని బోధించడానికి ప్రాణత్యాగం చేసాడు.

2. ఎలియాసరు యూదజాతి కంతటికీ మంచి ఆదర్శాన్ని చూపించాడు. అతని మరణం వల్ల ప్రేరణం పొందే పూర్వకథలోని ఏడ్గురు సోదరులు ప్రాణత్యాగం చేసారు. మంచి ఆదర్శానికి ఇంతశక్తి వుంది. కనుక మనం దురాదర్శానికి దూరంగా వుండాలి. మంచి ఆదర్శాన్ని చూపడానికి సిద్ధంగావుండాలి. మదర్ తెరేసాను చూచి నేడు చాలమంది పేదసాదలను ఆదుకోవడానికి ముందుకు వస్తున్నారు. విశేషంగా వేదహింసల కాలంలో మనం ధైర్యంతో మన భక్తి విశ్వాసాలను ప్రకటించాలి.

## 3. ఆకానుకు శిక్ష - యెహోషువా 7

అది క్రీస్తు పూర్వం 12వ శతాబ్దం. మోషే గతించాక యోషువా ప్రజలకు నాయకుడయ్యాడు. అతడు యావే ఆజ్ఞపై కనాను మండలాన్ని జయిస్తున్నాడు. అప్పటికే యెరికో అతని వశమైంది. ఆ మీదట హాయి పట్టణాన్ని జయించడానికి 3000 మంది ప్రజలను పంపాడు. కాని హాయి పౌరులు వారిని యుద్ధంలో ఓడించి చంపి వేసారు. యిస్రాయేలీయులకు గుండె చెదిరింది. కనానీయులు ఈ వోటమిని గూర్చి విని యిస్రాయేలీయుల మీదికి దండెత్తివచ్చి వారిని నాశం చేయవచ్చు. కనుక యోషువా, ప్రజలు, పెద్దలు సంతాపసూచకంగా తమ వస్త్రాలు చించుకొన్నారు. తలపై దుమ్ము పోసికొని యావే ముందట సాష్టాంగపడి ప్రార్థన చేసారు.

ప్రభువు యోషువాకు సమాధానం చెప్పాడు. యిస్రాయేలీయుల శాపగ్రస్తమైన వస్తువులను దొంగిలించి దాచుకొన్నారు. కనుక ప్రబువుతకి వారిపై కోపం వచ్చి హాయి యుద్ధంలో వాళ్ళు ఓడిపోయేలా చేసాడు. దైవప్రజలు ఏదైనా నగరాన్ని జయించినపుడు అక్కడి నరులను, జంతువులను, వస్తువులను అన్నిటినీ శాపం పాలు చేసి నాశం చేయాలి. తాము ఏమీ దక్కించుకోగూడదు. ఇది దేవుని ఆజ్ఞ -ద్వితీ 7,1-4. వాళ్ళు ఈ యాజ్ఞమీరి హాయిని జయించినపుడు అక్కడి వస్తువులు కొన్నిటిని దాచుకొన్నారు. కనుక ప్రభువు వారిపై కోపించి హాయి పట్టణ యుద్ధంలో వారికి అపజయం కలిగించాడు.

ప్రభువు ఆజ్ఞపై యోషువ యిస్రాయేలు ప్రజలను ప్రోగుచేయించాడు. వారిని

గోత్రాల క్రమంగా, వంశాల క్రమంగా, కుటుంబాల క్రమంగా తన యెదుటికి పిలిపించాడు. కడన సబ్ది కుటుంబానికి చెందిన ఆకాను దోషి అని తేలింది. ఇతని పాపం వల్లనే యిస్రాయేలీయులు యుద్ధంలో ఓడిపోయింది.

యోషువా ఆకానును బుజ్జగించి నీవు నిజం చెప్పి దేవుణ్ణి స్తుతించమన్నాడు. ఆకాను తనతప్పు ఒప్పుకొన్నాడు. అతడు యెరికో యుద్ధం జరిగేప్పుడు ఒక సీనారు బట్ట, రెండువందల తులాల వెండి, ఏబది తులాల బంగారం చేజిక్కించుకొని తన గుడారంలో దాచుకొన్నాడు. ఇవి శాపగ్రస్తమైన వస్తువులు. వీటిని నాశం చేయాలి.కాని ఆకాను వీటిని దాచుకొన్నాడు. అందుకే యిస్రాయేలీయులు యుద్ధంలో ఓడిపోయింది.

యోషువా ఆకాను గుడారం నుండి ఆ మూడు వస్తువులను తెప్పించాడు. ఆకానునీ, అతని కుటుంబాన్నీ, ఆ వస్తువులను ఆ కోరు లోయలోనికి తీసికొనిపోయాడు. అక్కడ అతన్నీ, అతని కుటుంబాన్నీ, వస్తువులనూ అన్నిటినీ రాళ్ళతోకొట్టి కాల్చివేసారు. అనగా వాళ్ళందరినీ శాపంపాలు చేసారు. ఆకోరు అంటే శ్రమపెట్టడం. ఆకాను తన దురాశద్వారా యిస్రాయేలు సైన్యాన్ని శ్రమపెట్టాడు. దానికి శిక్షగా యోషువా ఆకానుని శ్రమపెట్టాడు. యోషువా ఆతావున పెద్దరాళ్ళ గుట్టను పేర్చాడు.

ఇది కథ. ఈ కథ నేడు మనకు కొన్ని సత్యాలు నేర్పుతుంది. 1. యిస్రాయేలు ప్రజల దేవుని నిబంధనను మీరినప్పుడు యుద్ధంలో ఓడిపోయారు. దాన్ని పాటించనపుడు గెల్చారు. దేవుని ఆజ్ఞల ప్రకారం జీవిస్తే మనకు అతని దీవెనలు లభిస్తాయి. ఆ యాజ్ఞలు  మీరితే శాపాన్ని తెచ్చుకొంటాం.

2. ఆకాను పాపం దురాశ. దేవుడు నాశం జేయమన్న వస్తువులను అతడు ఆసబోతుతనంతో దక్కించుకొన్నాడు. ఆ పాపమే అతని ప్రాణాలు తీసింది. గెహాసి, యూదా, అననీయా సఫీరా మొదలైన వాళ్ళంతా దురాశ వల్లనే నాశమయ్యారు. ఈనాడు మనంకూడ అత్యాశకుబోయి చేటు తెచ్చుకొంటాం. కనుక మనం ఏ వస్తువులను అక్రమంగా కోరుకొంటున్నామా అని పరిశీలించి చూచుకోవాలి.

## 4. దావీదు కథలు

ఇక్కడ దావీదు చరిత్ర నుండి మూడు సంఘటనలను పరిశీలిద్దాం. మొదటి కథ 1 సమూవేలు 24లో వస్తుంది. అతడు 600 మంది అనుచరులతో ఎంగడీ యెడారిలోని కొండల్లో దాగివున్నాడు. సౌలురాజు దావీదును పట్టుకోవడానికి 3000 మంది సైనికులతో ఆ ప్రాంతానికి వచ్చాడు. సౌలు దారినపోతూ మలవిసర్జనకు

ఒక కొండ గుహలోకి వెళ్ళాడు. కాని దావీదు అతని అనుచరులు ఆ గుహలోనే దాగుకొని వున్నారు. సౌలుకి ఆ సంగతి తెలియదు.

దావీదు అనుచరులు శత్రువును చంపివేయమని సలహా యిచ్చారు. కాని దావీదు సౌలుకు తెలియకుండ అతని పైబట్ట అంచును మాత్రం కత్తిరించుకొని వచ్చాడు. ఈ పని చేసినందుకు కూడ అతడు విచారించాడు. యూదుల భావాల ప్రకారం నరుని దుస్తులు అతని అధికారాన్ని, హక్కుల్నీ, వ్యక్తిత్వాన్నీ సూచిస్తాయి. కనుక దావీదు సౌలు బట్టను కత్తిరించాడు అంటే అతన్ని నాశం చేయడానికి పూనుకొన్నట్లే. ఈ సౌలురాజు దేవునిచే అభిషిక్తుడు. అలాంటి వాడికి దావీదు కీడు తలపెట్టడం పెద్ద పాపం. కనుక అతడు పశ్చాత్తాపపడ్డాడు -6.

సౌలు గుహనుండి వెలుపలకువచ్చి ప్రయాణం సాగిస్తున్నాడు. దావీదు అతని వెంటబోయి అతన్ని పేరెత్తి పిలిచాడు, తాను కత్తిరించిన గుడ్డముక్కను సౌలుకి చూపించాడు. నేడు నీవు నా చేతికి చిక్కినా నేను నిన్ను చంపకుండ వదలివేసాను. దీన్ని బట్టే నేను నీ మీదకు కుట్రపన్నలేదనీ, నీకు ద్రోహం తలపెట్టలేదనీ అర్థం చేసికో. దేవుడు నిన్ను శిక్షించినా నేను మాత్రం నీమీద చేయిజేసికోను. ఐనా నీవు మాత్రం నావెంటబడి నన్ను తరుముతూన్నావు. నేనేపాటివాణ్ణి? చచ్చిన కుక్కతో, ఈగతో సమానుణ్ణి అన్నాడు. ఈ పలుకులు దావీదు మంచితనాన్ని, వినయాన్నీ స్పష్టంగా తెలియజేస్తాయి.

ఈ పలుకులకు సౌలు మనసు కరిగింది. అతడు పసిపిల్లవాడిలాగ పెద్దగా యేడ్చాడు. అతని హృదయంలో నుండి పరాక్రమం గాక పశ్చాత్తాపం పెల్లుబికి వచ్చింది. అతడు దావీదుతో నాకంటె నీవు ఉత్తముడివి. నేను నీకు కీడు తలపెడితే నీవు నాకు మేలుచేసావు. నేను నీ ప్రాణాలు తీయగోరితే నీవు నా ప్రాణాలు కాపాడావు. చేతికి జిక్కిన శత్రువును ఎవడు వదలివేస్తాడు? నీ మంచితనానికి ప్రభువు నీకు మేలు చేయునుగాక అన్నాడు.

పైగా సౌలు దావీదుతో నీవు రాజువౌతావని ప్రవచనం చెప్పాడు-20. నీవు రాజువయ్యాక నా కుటుంబాన్ని నాశం చేయవద్దని బతిమాలుకొన్నాడు. పూర్వం గెల్చినరాజు ఓడినరాజు కుటుంబాన్ని సర్వనాశం చేసేవాడు. కనుక ఇక్కడ సౌలు దావీదుని ముందుగానే బతిమాలాడు. ఇకమీదట యిస్రాయేలు రాజ్యం సౌలుకీ అతని కుమారుడు యోనాతానుకీ దక్కదు. అన్యుడైన దావీదుకి దక్కుతుంది. ఈ యధ్యాయంలో రచయిత చెప్పదలచుకున్న ప్రధానాంశం ఇదే. రాజు కోరినట్లే దావీదు తాను సౌలు కుటుంబాన్ని రూపుమాసనని ప్రమాణం చేసాడు. సౌలు దావీదును జయించాలని వచ్చాడు. కాని కడన దావీదే సౌలుని జయించాడు.

ఇది బైబుల్లోని మంచికథల్లో వొకటి. ఈ సంఘటనం మనకు కొన్ని సత్యాలు నేర్పుతుంది. 1. దావీదు చేతికి జిక్కిన శత్రువుని చంపకుండ వదలివేసాడు ఎందుకు? అతడు దేవుని అభిషిక్తుడు గనుక. ఇక్కడ దావీదు మంచితనం, నమ్మదగినతనం విశదమౌతున్నాయి. అతడు మాటయిస్తే తప్పదు. అధికారాన్ని గౌరవిస్తాడు. ఎల్లవేళల దేవునికివిదేయుడు. రోజువారి జీవితంలో మన విరోధులు నీచంగా ప్రవర్తించ వచ్చు. మనం వారిపట్ల తిరిగి నీచంగా ప్రవర్తించనక్కరలేదు. మన ఔదారాన్ని మనం నిలబెట్టుకోవాలి.

2. దేవుడు తన భక్తులను కాపాడతాడు. సౌలు దావీదును చంపడానికి వచ్చాడు. కాని దేవుడు దావీదును కాపాడి సౌలుకి పశ్చాత్తాపం పుట్టించాడు. పైగా సౌలుని కాదని దావీదుని రాజునుచేసాడు. మనకు ప్రధానంగా కావలసింది దైవబలం.

3. న్యాయం దావీదు పక్షాన వుంది. సౌలు చెప్పుడు మాటలు విని అన్యాయంగా దావీదును పట్టుకోవడానికి వచ్చాడు. కడన దేవుడు న్యాయాన్ని గెలిపించాడు. మన శత్రువుని మనం శిక్షించనక్కరలేదు. అవసరమొచ్చినపుడు దేవుడే ఆ పనిచేస్తాడు.

రెండవ సంఘటనం 2 సమూవేలు 23,13-17లో వస్తుంది. ఫిలిస్తీయులు బేత్లెహేము నగరాన్ని ముట్టడించారు. దావీదు అదుల్లాము గుహలో దాగివున్నాడు. అతనికి 30 మంది వీరులు స్నేహితులు. వీరిలో ముగ్గురు మిక్కిలి సాహసవంతులు. వీళ్ళు తమ నాయకుణ్ణి చూడబోయారు. దావీదు పుట్టిపెరిగింది బేత్లెహేములోనే - ఆ నగర ద్వారం దగ్గరవున్న బావినీల్లు అతనికి చాల యిష్టం. కనుక అతడు ఆ బావినీళ్ళు ఎవరైనా తీసికొని వస్తే ఎంత బాగుంటుంది అన్నాడు. వాటికోసం అతడు మొగంవాచి వున్నాడు. వెంటనే ఆ ముగ్గురు వీరులు బేత్లెహేము వెళ్ళారు. శత్రువులకు వెరవకుండ బావి దగ్గరకు వెళ్ళి దానినీళ్ళు తీసికొనివచ్చి దావీదుకిచ్చారు. దావీదు వాళ్ళ ధైర్యాన్ని మెచ్చుకొన్నాడు. కాని తాను ఆనీళ్ళు త్రాగలేదు. ఆ ముగ్గురు తమ ప్రాణాలకు తెగించారు కనుక ఆ నీళ్ళు వాళ్ళ నెత్తురుతో సమానమనుకొన్నాడు. కనుక వాటిని యావేకు సమర్పించి ధారగా పోసాడు. ఇది దైవారాధన. నాయకుడు, అనుచరులు అంతా ఆ యారధనలో పాల్గొన్నారు.

ఈ సంఘటనం స్నేహం ఎలా వుండాలో తెలియజేస్తుంది. స్నేహితులకు దావీదుపట్ల గౌరవభావం వుంది. వాళ్ళు తమప్రాణాలు పణంగాపెట్టి దావీదుకొరకు ఆనీళ్ల తెచ్చారు. దావీదుకి మిత్రులపట్ల గూడ ఆదరభావంవుంది. అతడు వాళ్ళు తెచ్చిన నీటికి ఎనలేని విలువనిచ్చి దాన్ని తాను త్రాగడానికి బదులుగా దేవునికి

కానుకగా అర్పించాడు. మిత్రులకు నమ్మదగిన తనముండాలి. ఒకరిపట్ల ఒకరు విశ్వసనీయులుగా మెలగాలి. ఒకరికొరకొకరు ఎంత త్యాగమైనా చేయడానికి సిద్ధంగావుండాలి.

మూడవ సంఘటనం 2 సమూవేలు 15,19–21లో వస్తుంది. దావీదు కొడుకు అబ్షాలోము తండ్రిమీద తిరగబడ్డాడు. దావీదు అతనికి దాడిసి నగరాన్ని విడచి పారిపోతున్నాడు. కొద్దిమంది స్వామిభక్తిగల సేవకులు మాత్రం అతనితో వెళుతున్నారు. అన్యజాతి వాడయిన ఇత్తయి కూడ రాజుతో పోతున్నాడు. దావీదు ఇత్తయిని తనవెంట రావద్దని హెచ్చరించాడు. నేను ఎక్కడికి వెళ్ళాలో, ఎన్ని కష్టాలు పడాలో నాకే తెలియదు. నీవు పరదేశివి. ఇటీవలే నా కొలువులో చేరావు. ఇప్పుడు నాతో నీవు కూడ కష్టాలు అనుభవించడమెందుకు? తిరిగిపోయి కొత్తరాజయిన అబ్షాలోము కొలువులోజేరి సుఖంగా వుండు అని సలహాయిచ్చాడు. కాని యిత్తయి దావీదు మాటలు వినలేదు. చావయినా బ్రతుకయినా నేను నీతోనే వస్తాను. నా ప్రభువు ఎక్కడ వుంటాడో నేనూ అక్కడే వుంటాను అన్నాడు. ఆ అన్యజాతివాని నమ్మదగినతనం అంతగొప్పది. ఓవైపు దావీదు సొంత కొడుకే తండ్రికి ద్రోహం చేస్తూంటే, మరోవైపు అన్యజాతి బంటు ఒకడు రాజుకి సేవలు చేస్తున్నాడు. విశ్వసనీయత ఈలా వుండాలి కదా! అన్యజాతి స్త్రీ రూతు, అత్తనవోమిపట్ల చూపిన విశ్వసనీయత కూడ ఈలాంటిదే – రూతు 1,17. దేవునిపట్ల గాని, ఉపకారం చేసినవారి పట్లగాని మనంకూడ ఈలాంటి నమ్మదగిన తనాన్ని చూపాలి.

## 5. షెబారాణి –1రాజు 10,1–13

షెబారాణి సొలోమోను వైభవాన్ని గూర్చి వింది. ఆమె స్వయంగా అతన్ని సందర్శించడానికి ఆఫ్రికా నుండి వచ్చింది. ఆమె అతన్ని చాల ప్రశ్నలు అడిగింది. వాటన్నిటికి అతడు సులువగానే జవాబులు చెప్పాడు. ఆ రాజు విజ్ఞానానికి ఆమె ఆశ్చర్యపడింది. ఆమె సొలోమోనుతో కొన్ని వ్యాపారపు ఒప్పందాలు కుదుర్చుకోవడానికి వచ్చింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని రచయిత సొలోమోను సిరిసంపదలను వర్ణించాడు. సొలోమోను భవనాలు, అతని ఉద్యోగులు, అతని దహనబలులు మొదలైన వన్నీ పరికించేటప్పటికి ఆమెకు నోటమాట రాలేదు.

రాణి సొలోమోను విజ్ఞానమూ సిరిసంపదలూ రెండిటిని మెచ్చుకొంది. అతడు కొలిచే యావే ప్రభువును స్తుతించింది. ఆ దేవుడు యిస్రాయేలును ప్రేమించి వారికి సొలోమోనులాంటి మహారాజుని దయచేసాడు అని పల్కింది. తాను పూర్వం తనదేశంలో విన్నదానికంటె గూడ సొలోమోను విజ్ఞానం వైభవం అధికంగా వున్నాయని వాకొంది –7. ఆమె రాజుకి బంగారం, రత్నాలు, సుగంధ ద్రవ్యాలు కానుకగా ఇచ్చింది. అతడు కూడ తన రాజవైభవానికి తగినట్లుగా ఆమెకు కానుకలిచ్చాడు.

ఈ కథనుండి మనం నేర్చుకోవలసిన సంఘటనం ఒకటుంది. రాణి రాజుతో మాట్లాడుతూ నేను మా దేశంలో వుండగానే నీ సంపదలను గూర్చీ, జ్ఞానాన్ని గూర్చీ విన్నాను. ఇప్పుడు ఇక్కడికి వచ్చి వాటిని స్వయంగా నా కన్నులతో చూచి ఆనందించాను. ఐనను నా సేవకులు నీ గొప్పతనంలో సగమైన నాకు తెలుపలేదు. నీ విజ్ఞాన వైభవాలు నేను విన్నదానికంటె ఎక్కువగా వున్నాయి అంది. సేవకులు రాణికి సొలోమోనును గూర్చి తక్కువగా జెప్పారు. నేడు మనమో మనలను గూర్చి ఎక్కువగా చెప్పుకుంటాం. ఎక్కువచేసి తక్కువగా చెప్పుకోవడం ఉత్తముల పద్ధతి. తక్కువచేసి ఎక్కువగా చెప్పుకోవడం నీచుల పద్ధతి.

## 6. ఉజ్జీయా పతనం -2రాజుల దినచర్య 26

ఉజ్జీయా యూదా రాజ్యాన్ని పరిపాలించిన గొప్పరాజుల్లో వొకడు. అతడు క్రీస్తుపూర్వం 783 నుండి 742 వరకు, అనగా 52 ఏండ్లు యెరూషలేము నుండి పరిపాలనం చేసాడు. ఆ రాజు పెద్ద సైన్యాన్ని పోషించి ఫిలిస్తీయులను, అరబ్బీయులను జయించాడు. ఎడారిలో కోటలు కట్టించాడు. యెరూషలేములో ద్వారాలు, బురుజులు నిర్మించి నగరాన్ని సురక్షితం చేసాడు. బావులు త్రవ్వించి, వ్యవసాయాన్ని వృద్ధి చేసాడు. యాజకుడు జెకర్యా అతనికి సలహా లిచ్చినంతకాలం అతడు దైవభక్తితో జీవించి దేవుని ఆశీస్సులు పొందాడు. చాలసంపదలు కూడబెట్టాడు.

కాని జెకర్యా గతించాక అతనికి తల తిరిగింది. అతడు అహంకారంతో దేవళం లోనికివెళ్ళి దేవునికి పీఠంమీద సాంబ్రాణిపొగ వేయబోయాడు. ఇది యాజకులు చేయవలసిన పని. కనుక తొమ్మిదిమంది యాజకులు అతనికి అడ్డువచ్చారు. నీవు ప్రభువును ధిక్కరించి అతని అనుగ్రహాన్ని కోల్పోయావు అని చెప్పారు. వెంటనే అతని నొసటిమీద కుష్ఠ పొక్కులు లేచాయి. అది దైవశిక్ష. యాజకులు అతన్ని దేవళం నుండి వెలుపలికి గెంటివేసారు. ఆ రాజు చనిపోయిందాకా కుష్ఠరోగిగా వుండిపోయాడు. మళ్లా దేవళంలో అడుగుపెట్టలేకపోయాడు. ఒక ప్రత్యేక భవనంలో వసించాడు. రాజ్యకార్యాలను అతని కుమారుడు పరిశీలించాడు.

ఉజ్జీయా రాజును చూచి మనం పాఠం నేర్చుకోవాలి. పొగరు తగదు. కొన్నిసార్లు దైవాశీర్వాదంతో వృద్ధిలోకి వస్తాం. అంతమాత్రం చేతనే మిడిసిపడకూడదు. మన తాహతుకు మించిన కార్యాలు చేపట్టకూడదు. పొగరువల్ల చాలమంది మన్నుగరచారు. మనకు వినయం ఒక్కటి తగుతుంది.

## 7. మిర్యామునకు శిక్ష -సంఖ్యా 12

యిస్రాయేలు ప్రజలు మోషే నాయకత్వాన ఎడారిలో ప్రయాణం చేస్తూ హోసెరోత్తున విడిది చేసారు. అక్కడ అహరోను, మిర్యాము మోషేమీద తిరగబడ్డారు. మోషే అప్పటికే యితియోపీయా స్త్రీని పెండ్లాడాడు. దీన్ని ఆసరాగా పెట్టుకొని వాళ్ళు తమ్మునిమీద తిరగబడ్డారు. దేవుడు నీ ద్వారానేగాక, మాద్వారా గూడ మాటలాడాడు అన్నారు -2. అనగా మోషేతోపాటు తాముకూడ యిస్రాయేలు సమాజానికి నాయకుల మని వారిభావం. సాటిలేని మోషే నాయకత్వాన్ని చూడగా వారికి అసూయ పుట్టింది. కనుకనే వాళ్ళు తమ్ముణ్ణి ఎదిరించారు. ఈ సందర్భంలో బైబులు మోషే మహావినయ వంతుడు అని చెప్తుంది -3. ఇక్కడ "వినయవంతుడు అంటే దేవునికి సన్నిహితుడు, ప్రీతిపాత్రుడు అనిభావం. దేవుడు అతన్ని తనకు ఇష్టుడైన సేవకునిగా, కార్య నిర్వాహకునిగా ఎన్నుకొన్నాడు.

అన్న, అక్క మోషేమీద తిరగబడినందున దేవునికి కోపం వచ్చింది. అతడు ఇతర ప్రవక్తలతో కలలలో, దర్శనాలలో మాట్లాడేవాడు. అనగా పరోక్షంగా వారికి తన సందేశాన్ని తెలిపేవాడు. కాని మోషేతో నేరుగా మాట్లాడేవాడు. మోషే దేవుని రూపాన్ని జూచాడు. అతన్ని దర్శించాడు. ఆలాంటి మహానాయకుణ్ణి, నేనే ఎన్నుకొన్న వాణ్ణి ఎదిరించడానికి మీకు ఎన్ని గుండెలు అని విరుచుకుపడ్డాడు.

మోషేను ఎదిరించినందుకు దేవుడు మిర్యామును శిక్షించాడు. ఆమెకు కుష్ఠ సోకింది. అహరోను వేడికోలుపై మోషే మిర్యాము తరపున దేవునికి మనవి చేసాడు. ప్రభువు ఆమె కుష్ఠను తొలగించాడు. కాని మిర్యామును ఏడునాళ్ళపాటు విడిది నుండి బహిష్కరించారు. వారం తర్వాత మళ్ళా పాళెంలో చేర్చుకొన్నారు.

ఈ సంఘటనం కుటుంబంలోని అంతఃకలహాలవల్ల పుట్టింది. నాయకుల అధికారాన్నీ, పెద్దరికాన్నీ జూచి అసూయపడకూడదని ఈ కథభావం. రోజువారి జీవితంలో మనం, మన పెద్దల పేరుప్రఖ్యాతులను జూచి అసూయ చెందుతాం. వారిని విమర్శిస్తూ చులకనచేస్తూ మాటలాడతాం. వారికంటె మనం అధికుల మన్నట్లుగా నోరు పారవేసికొంటాం. పుల్లవిరుపు మాటలంటాం. ఈలా చేయకూడదు. పెద్దలు దేవుని అధికారంలో పాలుపంచుకొంటారు. కనుక వారిపట్ల మనకు గౌరవం, వినయం వుండాలి.

## 8. మెరీబా వద్ద నీళ్లు –సంఖ్యా 20,11

ఎడారి ప్రయాణంలో యిస్రాయేలు ప్రజలు సీను ఎడారిచేరి మెరిబావద్ద విడిది చేసారు. మిర్యాము చనిపోగా ఆమెను అక్కడనే పాతిపెట్టారు. ఆ తావులో ప్రజలకు నీళ్ళు దొరకలేదు. కనుక వాళ్ళు నాయకులైన మోషే, అహరోనుల మీద తిరగబడ్డారు. ఈజిప్టులో వుండగా మస్తుగా తిన్నాం. ఇక్కడ తిండిలేదు, అసలు నీళ్ళుకూడ లేవుకదా అని గొణిగారు. దేవునితో వాదాడారు. కనుకనే ఆ ప్రదేశానికి మెరిబా అనిపేరు. ఆ పేరుకి వాదాడ్డం అనే అర్థం.

మోషే, అహరోనులు సాన్నిధ్యపు గుడారంవద్ద దేవునికి మనవిచేసారు. దేవుడు వారితో మీరు ప్రజలను ఆ యెదుటవున్న బండదగ్గర ప్రోగుజేయండి. ఈ కర్రను తీసికొనిపోయి ఆ బండను నీళ్ళీయమని ఆజ్ఞాపించండి. దానినుండి నీళ్ళు పారతాయి అని చెప్పాడు. అది పూర్వం అహరోను వాడిన కర్ర. అలాగే మోషే ప్రజలను బండ వద్ద ప్రోగుజేసి కర్రను చేతబట్టుకొని వచ్చాడు. కాని అతనికి అనుమానం కలిగింది. బండను ఆజ్ఞాపించినంతమాత్రాన్నే దానినుండి నీళ్ళేలా వస్తాయి అనుకొన్నాడు. కనుక అతడు ప్రభువు చెప్పకున్నా కర్రతో బండను బాదాడు. అదీ వొకసారికాదు, రెండుసార్లు. ఈ చర్య అతని అవిశ్వాసాన్నీ, అవిధేయతను సూచిస్తుంది. అతనికి ప్రభువుశక్తి తెలిసికూడ శంకించాడు.

దేవుడు కరుణించి బండనుండి నీళ్ళు పారించగా ప్రజలు త్రాగారు. కాని దేవుని శక్తిని శంకించినందున ప్రభువు ఆ యన్నదమ్ములను కఠినంగా శిక్షించాడు. మీరు నా పవిత్రశక్తిని నమ్మలేదు కనుక వాగ్దత్త భూమిలో అడుగుపెట్టలేరు అన్నాడు. కనుక ఆ సోదరులు ఎడారిలోనే కన్నుమూసారు. సామాన్య ప్రజలు శంకించడం ఒక యెత్తు. మోషేలాంటి మహాసేవకుడు దేవుణ్ణి శంకించడం మరోయెత్తు.

బండనుండి పారిన ఈ నీళ్ళు నూత్నవేదంలో పవిత్రాత్మను సూచిస్తాయి. సిలువపై క్రీస్తు ప్రక్కలో నుండి పారిన నీళ్ళను గూడ సూచిస్తాయి.

ఈ సంఘటనం నుండి నేడు మనం నేర్చుకోవలసిందేమిటి? మన విశ్వాసం లోపించకూడదు. దేవుని శక్తిని శంకించకూడదు. అతనికి ఏమి అసాధ్యం? మనం ఎంత పెద్ద పదవుల్లో వున్నామో మన విశ్వాసంకూడ అంత పెద్దదిగా వుండాలి. మోషేలాంటి భక్తిపరుడే అవిశ్వాసం వలన శిక్షను తెచ్చుకొన్నాడంటే, మన తరపున మనం ఎంత జాగ్రత్తగా మెలగాలి? ఎంత విశ్వాసంతో జీవించాలి?

# 10. బాధామయ సేవకుడు

బైబులు భాష్యం 124

## సేవకుడు

"సేవకుడు" అనేమాట బైబుల్లో చాలచోట్ల కన్పిస్తుంది. మోషే యోషువా మొదలైన నాయకులు అబ్రాహాము, ఈసాకు, యాకోబు మొదలైన పితరులు సేవకులు. దావీదు, యోషీయా మొదలైన గొప్పరాజులు, కడకు అన్యజాతి రాజులైన కోరెషు, నెబుకద్నెసరు లాంటివాళ్లు కూడ సేవకులు. ఆమోసు, యెషయా, యిర్మీయా మొదలుగా గల ప్రవక్తలు, దేవదూతలు, యాజకులు, యిస్రాయేలు ప్రజలు కూడ సేవకులే. ఈ వర్గానికి చెందినవాడే బాధామయ సేవకుడు.

యిస్రాయేలు ప్రజలు ప్రభువు ఆజ్ఞలు మీరి ద్రోహులయ్యారు. కనుకనే "మీరు ప్రభువు ప్రజలైనప్పటినుండి తిరుగబడుతూనే వచ్చారు" అన్నాడు మోషే -ద్వితీ 9,24. ప్రభువు ఆ ప్రజలపై కోపించి వారిని నెబుకద్నెసరు అనే బాబిలోనియా రాజు వశంజేసాడు. అతడు యెరూషలేమును ధ్వంసంచేసి 586లో యూదులను బాబిలోనియాకు బందీలనుగా కొనిపోయాడు. అప్పటినుండి 538లో పారశీకరాజు కోరేషు విడుదల దయచేసే వరకు యూదులు ప్రవాసంలోనే వున్నారు. ఈ ప్రవాసంలె భక్తిగలవాళ్ళు కొందరు మాత్రం యావేను విస్మరింపక చిత్తశుద్ధితో పూజిస్తూ వచ్చారు. వీరికే "శేషజనం" అని పేరు. ఈ వర్గానికి చెందినవాడే బాధామయ సేవకుడు. ఇతడు ప్రాణాలు కూడ అర్పించి ప్రభువుకీ అతని ప్రజలకూ సేవలు చేసిన భక్తుడు. యెషయా గ్రంథం నాల్గు గీతాల్లో ఇతన్ని స్తుతిస్తుంది. వీటికి "బాధామయ సేవకుని గీతాలు" అని పేరు. ఇవి యెషయా ప్రవచనం 42,1-7. 49,1-6,చ 4-11. 52,13-53,12 వచనాల్లో వస్తాయి.

ముందే చెప్పినట్లు ఇవి బాబిలోనియా ప్రవాసం చివరి కాలానికి చెందినవి. ఇవి యూదులు ప్రవాసాన్ని ముగించుకొని యెరూషలేముకి తిరిగి రావడాన్ని ప్రస్తావిస్తాయి. వీటి రచయిత యెవరో మనకు తెలియదు. యెషయాప్రవక్త శిష్యుడైన "రెండవ యెషయా" పేరుమీదిగా ప్రచారంలోకి వచ్చాయి. ఈ గీతాలు నాల్గు బాధామయ సేవకుని భక్తిని వర్ణిస్తాయి. అతడు యూదులకు నిబంధనంగాను, అన్యజాతులకు వెలుగుగాను వుంటాడు. ప్రజలకొరకు బాధలు అనుభవించి చనిపోయి మళ్ళా ఉత్థానమౌతాడు. అతని మరణం ద్వారా యిస్రాయేలుకు పాపవిమోచనం సిద్ధిస్తుంది. ఈ గీతాలు పూర్వవేదంలోని ఉత్తమస్థాయి ప్రవచనాలకు చెందినవి. వీటలి ఆధ్యాత్మికస్థాయి కూడ ఉన్నతమైందే.

పైగా ఈ ప్రవచనాలు నూత్నవేదంలో క్రీస్తుకి అన్వయిస్తాయి. సేవకుడు ఇతడే. కనుక ప్రాచీన కాలంనుండి క్రైస్తవ భక్తులు వీటిని భక్తితో మననం చేసికొంటూ వచ్చారు. ఈ క్రింద నాల్గు గీతాల మీద వ్యాఖ్య చెప్పి వాటి భావాలను వివరిస్తున్నాం. భక్తులు ఈ ప్రవచనాలను జాగ్రత్తగా మననం చేసికొని దైవానుభూతిని పొందాలి.

## మొదటి గీతం 42,1-7

1. ఇదిగో "నా సేవకుడు
నేనితన్ని బాలాఢ్యున్ని జేసాను
ఇతన్ని ఎన్నుకొన్నాను, ఇతనివలన ప్రీతి చెందాను
ఇతన్ని నా యాత్మతో నింపాను
ఇతడు జాతులకు న్యాయాన్ని కొనివస్తాడు
2. ఇతడు పెద్దగా అరవడు, కేకలు పెట్టడు
వీధుల్లో ఉపన్యసింపడు
3. నలిగిన రెల్లుకాడను త్రుంచివేయడు
కునికిపాట్లుపడే దీపాన్ని ఆర్పివేయడు
నమ్మదగినతనంతో ఎల్లరికీ న్యాయాన్ని బోధిస్తాడు
4. నిరాశ జెందక నిరుత్సాహానికి గురికాక
నేలమీద న్యాయాన్ని నెలకొల్పుతాడు
ద్వీపాలు ఇతని బోధకొరకు ఎదురుచూస్తాయి
5. దేవుడు ఆకాశాన్ని సృజించి విశాలంగా విప్పాడు
భూమినీ దానిమీద వసించే ప్రాణులనూ చేసాడు
దానిమీది నరులకు ప్రాణమొసగాడు
దానిమీద వసించేవారికి జీవాన్ని దయచేసాడు
అట్టి దేవుడైన ప్రభువు ఈలా చెప్తున్నాడు
6. ప్రభువునైన నేను నిన్ను పిల్చాను
నీకు బలాన్నొసగి రూపాన్నిచ్చాను
నీవు న్యాయాన్ని నెలకొల్పాలి
నేను నిన్ను ప్రజలకు నిబంధనంగాను
జాతులకు జ్యోతిగాను నియమించాను

7. నీవు గ్రుడ్డివారి కన్నులు తెరుస్తావు
బందీలను చెరనుండి వెలుపలికి కొనివస్తావు
చీకటిలో వున్నవారిని చెరనుండి విడిపిస్తావు"

ఈ గీతంలో ప్రభువు మొదటిసారిగా సేవకుణ్ణి ప్రజలకు పరిచయం జేస్తున్నాడు. అతడు ప్రభువు ఎన్నుకొన్నవాడు. యావే ఆత్మచే నిండినవాడు. యావే మతాన్ని ప్రజలకు తెలియజేసేవాడు ప్రవక్త.

చరణం 1. ప్రభువు ఆమోసు, యిర్మీయా మొదలైన ప్రవక్తలను లాగే ఇతన్ని గూడ ఎన్నుకొన్నాడు. ఇతడు స్వయంగా ప్రవక్త. ఇతడంటే యావేకు ఇష్టం. ప్రభువు ఈ సేవకుణ్ణి తన ఆత్మతో నింపాడు. ఈ యాత్మశక్తితోనే ఇతడు ప్రభువు కోరిన రక్షణ కార్యాన్ని సాధిస్తాడు. పూర్వవేదంలో న్యాయాధిపతులు, రాజులు మొదలైన నాయకులంతా ఆత్మచే నిండినవాళ్లే. ఈ సేవకుడు జాతులకు, అనగా యూదులకూ అన్యజాతులకూ కూడ యావే న్యాయాన్ని బోధిస్తాడు. ఇక్కడ "న్యాయం" అంటే, యావే మతం. అది ప్రధానంగా ధర్మశాస్త్రంలో వుంది. కనుక సేవకుడు ప్రధానంగా ధర్మశాస్త్రాన్ని బోధించేవాడు. అతడు ప్రవక్తగా ఈ పనిచేస్తాడు.

2. ప్రభువు పారశీక రాజయిన కోరెషు ద్వారా యూదులకు బాబిలోనియా ప్రవాసంనుండి విడుదల దయచేసాడు. ఈ రాజు ఆర్భాటంగా యుద్ధాలు చేసాడు. నగరాల్లో కోలాహలం రేపాడు. కాని మన సేవకుడు ఈ రాజులా కాకుండా నెమ్మదిగా పని చేసికొని పోతాడు. మొదట ప్రజలు అతని వునికినే గమనించరు. అతడు స్వీయబలం వలన కాక ప్రభువు శక్తి వలన విజయాన్ని సాధిస్తాడు.

3. నలిగిన రెల్లుకాడ, కునికిపాట్లుపడే దీపం ప్రవాసంలో బాధలు అనుభవించే యూదులకు చిహ్నం. ఆ దీనులను ఆదుకోవడానికి వచ్చినవాడే సేవకుడు. కనుక అతడు వారిని ఓదార్చి వారికి నెమ్మదిగా యావే మతాన్ని బోధిస్తాడు.

4. ప్రవాసంలోని ప్రజలకు మతబోధ చేసివారికి యావేమీద భక్తి పుట్టించడం తేలికైన పనికాదు. ఐనా సేవకుడు నిరుత్సాహం చెందడు. దేవుని ఆత్మే అతని నడిపించి వుత్సాహపరుస్తుంది. బావబిలోనియా సామ్రాజ్యంలోని ద్వీపాల్లోను దూరప్రాంతాల్లోను వసించేవాళ్ళుకూడ వచ్చి అతని బోధలు వింటారు. వీళ్ళు యూదులూ అన్యజాతి ప్రజలూ కావచ్చు. పూర్వం మోషే ధర్మశాస్త్రబోధకుడు. ఇప్పుడు సేవకుడు కూడ అదే పని చేస్తాడు.

5. ప్రభువు సృష్టికర్త. సర్వశక్తి సంపన్నుడు. అతడు తన శక్తిని సేవకునికి ఇచ్చి అతనిచే బోధ చేయిస్తాడు.

6. ప్రభువే సేవకుణ్ణి తన పనిమీద పిల్చాడు. పూర్వం ఆదామికిలాగే అతనికి కూడ ఒక రూపాన్ని ఇచ్చాడు. తన ఆత్మతో అతన్ని బలపరచాడు. ఆ బలంతోనే సేవకుడు బోధ చేస్తాడు. యావే పూర్వం మోషేద్వారా యిస్రాయేలుతో నిబందనం చేసికొన్నాడు. కాని యూదులు ఆ ఒడంబడికను మీరారు. కావుననే యిప్పుడు బాబిలోనియా ప్రవాసంలో వున్నారు. సేవకుడు వారిని మరల నిబంధనను పాటించే వారినిగా చేయాలి. అతడే స్వయంగా నిబంధనమై వారికి ప్రేరణం పుట్టిస్తాడు. ఆ ప్రజలు నిబంధన నియమాల ప్రకారం జీవించేలా చేస్తాడు. ఇంకా, అన్యజాతి ప్రజలు చీకటిలో మ్రగ్గుతున్నారు. సేవకుడు వీరికి జ్యోతి ఔతాడు. ధర్మశాస్త్ర జ్యోతినే వారిపై ప్రసరింపజేస్తాడు. వాళ్ళు ధర్మశాస్త్రాన్ని పాటించి, యావే ప్రభువుని పూజించి అతని నుండి రక్షణాన్ని పొందుతారు.

7. సేవకుడు అన్యజాతివారికి వెలుగుగా వుంటాడని పూర్వచరణంలో విన్నాం. ఈ చరణం అతడు వారికి చూపునిస్తాడని చెపుతుంది. ధర్మశాస్త్రబోధ ద్వారానే ఈ చూపు. ఇక, అతడు యూదులను బాబిలోనియా దాస్యమనే చెరనుండి విడిపిస్తాడు. ఆ దాస్యం వారికి చెరా, చీకటీ కూడ. కనుక భక్తుడు వీటినుండి వారికి విముక్తి కలిగిస్తాడు.

సంగ్రహంగా ఈ గీతం చెప్పే భావాలు ఇవి. యావే సేవకుణ్ణి ఎన్నుకొని అతన్ని తన్ను గూర్చి బోధించమని ఆజ్ఞాపించాడు. అతనికి ఆత్మశక్తిని దయచేసాడు. అతడు నెమ్మదిగా, నిదానంగతా యూదులకూ అన్యజాతి వారికీ గూడ బోధ చేస్తాడు. యూదులకు నిబంధనం, అన్యజాతి ప్రజలకు జ్యోతి ఔతాడు.

ఈ సేవకుడు నూత్నవేదలోని క్రీస్తేనని చెప్పాం. కనుక ఈ గీతం క్రీస్తుపట్ల నెరవేరిన తీరును పరిశీలిద్దాం. క్రీస్తు జ్ఞానస్నాన సమయంలో తండ్రి అతనికి సాక్ష్య మిచ్చాడు. అతడు తనకు ప్రియకుమారుడని వాకొన్నాడు మత్త 3,17. ఈ వాక్యం యెషయా 42,1 నుండే గ్రహింపబడింది. క్రీస్తు పదిమంది దృష్టిని ఆకర్షించకుండా నెమ్మదిగా రోగుల వ్యాధులను నయం చేయడంచూచి మత్తయి అతన్ని సేవకునితో పోల్చాడు -మత్త 12,18-20. యెష 42,3. సేవకుడు యూదులకు నిబంధనమైతే క్రీస్తు కూడ నూత్నవేద ప్రజలకు నిబంధనం -మత్త 26,28. సేవకుడు అన్యజాతులకు వెలుగైతే క్రీస్తు కూడ నూత్నవేద ప్రజలకు నిబంధనం -మత్త 26,28. సేవకుడు అన్యజాతులకు వెలుగైతే క్రీస్తుకూడ వెలుగు. సిమియోను చెప్పినట్లుగా అతడు అన్యజాతులకు మార్గదర్శకమైన వెలుగు -లూకా 2,32. ఇంకా అతడు లోకానికే వెలుగు -యోహా 8,12. సేవకుళ్ళాగే అతడు కూడ గ్రుడ్డివారికి చూపు, చెరలో వున్నవారికి విడుదల దయచేయడానికే వచ్చాడు -లూకా 4,18. ఈ విధంగా సేవకుణ్ణి గూర్చిన ప్రవచనాలు క్రీస్తునందు పరిపూర్ణమయ్యాయి.

## రెండవ గీతం 49,1-6

1. "ద్వీపములారా! నా మాట వినండి
దూరప్రాంత జాతులారా! నా పల్కులు ఆలించండి
నేను తల్లికడుపున పడినప్పటినుండి
ప్రభువు నన్నెన్నుకొని తన సేవకునిగా నియమించాడు
2. అతడు నాకు పదునైన కత్తిలాంటి నాల్క నిచ్చాడు
తన హస్తంతో నన్ను రక్షించాడు
వాడుకోవడానికి తన అమ్ముల పొదిలో దాచాడు
3. అతడు నాతో యిస్రాయేలూ! నీవు నాకు సేవకుడివి
నీ వలన నాకు కీర్తి కలుగుతుంది అని చెప్పాడు
4. నేను నిరర్థకంగా శ్రమపడ్డాను
నా బలాన్నంతటినీ వినియోగించినను
ఫలితాన్ని సాధించలేకపోయాను అనుకొన్నాను
కాని ప్రభువు తప్పక నాకోపు తీసికొని
నా కృషికి నన్ను బహూకరిస్తాడు
5. నేను మాతృగర్భాన పడినప్పటినుండి
ప్రభువు నన్నెన్నుకొన్నాడు
యాకోబును తన వద్దకు తీసికొని రావడానికీ,
యిస్రాయేలును తన చెంతకు చేర్చడానికీ
నన్ను తన సేవకునిగా నియమించాడు
ప్రభువు నాకు కీర్తిని దయచేసాడు
నా బలానికి కారకుడు అతడే
6. ప్రభువు నాతో యిలా అన్నాడు -"నీవు నాకు సేవకుడవై
యాకోబు వంశజుల్ని, యిస్రాయేలున మిగిలినవారిని
నా యొద్దకు తీసికొని రావడం మాత్రమే చాలదు,
నేను నిన్ను జాతులకు జ్యోతిగా నియమిస్తాను
అప్పుడు నా రక్షణం నేలయంచులదాకా వ్యాపిస్తుంది.

ఈ రెండవ గీతంలో సేవకుడే మాట్లాడుతున్నాడు. అతడు తన శ్రమ వ్యర్థమై పోయిందని ప్రజలతో చెప్తున్నాడు. నిరుత్సాహపడుతున్నాడు. ఐనా తన్ను పిల్చి పని వొప్ప జెప్పిన ప్రభువుని నమ్ముతున్నానని వాకొంటున్నాడు

1. ఆనాటి యూదులకు తెలిసింది మధ్యధరా సముద్ర తీరప్రాంతాలు. సేవకుడు ఈ ప్రాంతపు ప్రజలందరినీ సంబోధించి వారితో మాట్లాడుతున్నాడు. తాను తల్లి కడుపులో పిండంగా వున్నపుడే ప్రభువు అతన్ని తన సేవకు ఎన్నుకొన్నాడు. యావే యిర్మీయాను కూడ ఈలాగే ముందుగానే ఎన్నుకొన్నాడు -యిర్మీ 1,5. కనుక సేవకుడు యావే తనకు ప్రత్యేకమైన పని ఒప్పజెప్పాడని నమ్మాడు.

2. ఆ కాలపు వీరుడైన పారశీకరాజు కోరెషు కత్తితోను బాణాలతోను దేశాలు జయించాడు. మన సేవకుడు మాత్రం తన శక్తిగల వాక్కుతోనే ప్రజలను జయిస్తాడు. ఆ వాక్కు కత్తి వంటిది, బాణం లాంటిది. అతడు ప్రవక్త. ప్రభువు తరపున మాట్లాడే వాడు. అతని పలుకు కత్తిలా పదునైంది. ప్రవక్తలు తాము పలికే ప్రభువు పలుకు మహాబలంతో పనిచేస్తుందని చెప్తుంటారు. ఇంకా సేవకుని పలుకు బాణంలాగా వాడియైంది. అతన్ని ప్రభువు కొంతకాలం పాటు దాచియుంచి అవసరమైనపుడు వాడుకొంటాడు.

3. సేవకుడు ప్రవక్త. అతని బోధలవల్ల యావేకు మహిమ కలుగుతుంది. తర్వాత ఈ సేవకుడు ఎవరనే ప్రశ్న వస్తుంది. ఈ వచనం అతన్ని యిస్రాయేలూ! అని సంబోధిస్తుంది. కావున యిక్కడ యిస్రాయేలు ప్రజే ఉమ్మడిగా యావే సేవకుడు అనుకోవాలి.

4. సేవకుడు కొంతకాలం బోధచేసాడు. కాని అతని బోధలను ఏవరూ వినలేదు. కనుక అతనికి నిరుత్సాహం కలిగింది. కాని అతనికి తన్ను ఎన్నుకొనిన ప్రభువు మీద గాఢమైన విశ్వాసం ఉంది. కనుక తనకు విజయం లభించకపోయినా దేవుడు తన శ్రమను గుర్తించి తన్ను బహూకరించి తీరుతాడని నమ్మాడు. ప్రజలు కఠిన హృదయులై తన బోధలు వినకున్నా తానుమాత్రం శక్తివంచన లేకుండా శ్రమపడ్డాడని ఎంచాడు. దేవుడు తన చిత్తశుద్ధిని మెచ్చుకొంటాడని నమ్మాడు.

5. ఇక్కడ సేవకుడు మొదటి చరణంలోని భావాలనే మళ్ళా తలంచుకొంటు న్నాడు. ప్రభువు రూఢిగా తన్ను ఎన్నుకున్నాడని నమ్ముతున్నాడు. ప్రభువు తన శ్రమకు తగిన కీర్తిని బహుమతినీ దయచేస్తాడని విశ్వసిస్తున్నాడు.

6. ప్రభువు సేవకుని అంకిత భావాన్ని మెచ్చుకొని అతనికి నూత్నకార్యాన్ని గూడ అప్పజెప్పాడు. ఇంతవరకు అతడు యిస్రాయేలీయులకు మాత్రమే బోధించేవాడు. ఇకమీద అన్యజాతులకు కూడ బోధిస్తాడు. వారికి కూడ యావే ధర్మశాస్త్ర జ్యోతిని అందిస్తాడు.

మధ్యదరాసముద్ర తీరవాసులంతా అతని ఉపదేశాలు వింటారు. కనుక అతడు వీరిని మొదటి చరణంలోనే సంబోధించాడు. పూర్వం మోషే యూదులకు మాత్రమే బోధకుడు. కాని సేవకుడు యూదులకు అన్యజాతివారికీ కూడ బోధకుడు.

ఈ రెండవ గీతంలో ముఖ్యమైన భావాలు ఇవి. సేవకుడు తల్లి కడుపులో పడినప్పటినుండే ప్రభువు అతన్ని ఎన్నుకొన్నాడు. ప్రబువు అతనికి శక్తిగల వాక్కుని దయచేసాడు. అది కత్తిలా, బాణంలా వాడియైంది. ఈ సేవకుడు యిస్రాయేలు ప్రజే. అతడు ప్రభువు సేవలో కృషిచేసాడు. ఐనా ఫలితాన్ని సాధించలేకపోయాడు. ఐనా ప్రభువు తన నిజాయితీని చూచి తన్ను బహుకరిస్తాడని నమ్మాడు. ఇంతవరకు అతడు యిస్రాయేలుకే సేవలు చేసాడు. కాని ఇకమీదట ప్రభువు అతనిచే అన్యజాతులకు కూడ సేవలు చేయిస్తాడు.

ఈ రెండవ గీతం కూడ క్రీస్తుపట్ల నెరవేరింది. సేవకుళ్ళాగే క్రీస్తుకూడ తల్లి గర్భంనుండే ప్రభువుసేవకు అంకితుడైనవాడు. సేవకుళ్ళాగే ప్రభువు కూడ యూదులు తన బోధలు ఆలించనందులకు నిరుత్సాహం చెందాడు. "యెరూషలేమూ! కోడి తన పిల్లలను లాగే నేనూ నీ బిడ్డలను చేరదీయాలని కోరుకొన్నాను. కాని నీవు నా పలుకులు వినలేదు" అని బాధపడ్డాను -మత్త 23,27.

మూడవ గీతం 50,4-11

4. ప్రభువువైన దేవుడు
నాకు బోధచేసే శక్తిని అనుగ్రహించాడు
అలసిపోయినవారిని వోదార్చడానికి
అతడు నాకు సంభాషణాశక్తిని దయచేసాడు
ప్రభువు ప్రత్యుదయము నన్ను ప్రబోధించి
నేను శిష్యుళ్ళాగ అతని బోధను ఆలించేలా చేస్తాడు

5. ప్రభువైన దేవుడు నాకు జ్ఞానాన్ని దయచేసాడు
నేను అతనికి అడ్డు చెప్పలేదు
అతని మాట పెడచెవిని పెట్టలేదు

6. నన్ను మోదేవారికి నా వీపును అప్పగించాను
వారకు నా గడ్డపు వెంద్రుకలను లాగివేస్తుండగా
నేను ఊరకున్నాను
నా మొగంమీద వుమ్మివేసి

నన్ను అవమానిస్తుండగా నేనేమి చేయలేదు
7. ప్రభువైన దేవుడు నన్నాదుకొంటాడు
వారి యవమానాలు నన్ను బాధించలేవు
నేను నా మొగాన్ని చెకుముకిరాతిలా గట్టిజేసికొన్నాను
నేను నగుబాట్లు తెచ్చుకోనని నాకు తెలుసు
8. నేను నిర్దోషినని సమర్థించి చెప్పేవాడు
నా ప్రక్కనే వున్నాడు
నామీద ఎవడైన నేరం మోపదలిస్తే
అతడు నేను కలిసి న్యాయస్థానానికి వెళ్తాం
నా ప్రత్యర్థి తన అభియోగాన్ని రుజువు చేయాలి
9. ప్రభువైన దేవుడు నాకు తోడ్పడతాడు
ఇక నేను దోషినని నిరూపించే దెవడు?
నా ప్రత్యర్థులు చిమటలు కొట్టిన బట్టలా క్షీణిస్తారు
10. ప్రభువు పట్ల భయభక్తులు చూపుతూ
అతని సేవకుని మాట పాటించేవారలారా!
మీరు చీకటిలో నడవవలసి వచ్చినపుడు
ప్రభువుని నమ్మి అతనిపై ఆధారపడి
11. కాని నిప్పును రగిల్చి
కొరవులను మండించేవారలారా!
మీరు నిప్పులోనికే నడుస్తారు
మీ కొరవుల్లోనికే అడుగుపెడతారు
ప్రభువు వల్లనే మీ కీగతి పడుతుంది
మీరు ఘోరబాధల్లో చిక్కుకొంటారు"

ఈ మూడవ గీతంలో సేవకుడు తన్నుగూర్చి రెండంశాలు చెప్పుకొన్నాడు. 1.అతడు మంచి శిష్యుల్లాగ దినందినం ప్రభువు బోధలు ఆలిస్తాడు. 2.అతడు బాధలకూ అవమానాలకూ గురైనా జంకడు. ప్రభువే అతని నిర్దోషత్వాన్ని వెల్లడిచేస్తాడు.

4. మొదటిది, ప్రభువు సేవకునికి బోధచేస్తాడు. ఆ బోధనే సేవకుడు తిరిగి ప్రజలకు విన్పిస్తాడు. అతడు ప్రభువుకి శిష్యుడు. ప్రభువు వాక్కుని శ్రద్ధగావిని దాన్ని తన హృదయంలో పదిలపరకచుకొనేవాడు. మోషే మొదట ప్రభువు దాసుడు

కావడానికి ఇష్టపడలేదు. కాని సేవకుడు మొదటనే యిష్టపడ్డాడు. మోషే నత్తివాడు. కాని ఇతడు వాక్చాతుర్యం కలవాడు. ఇతడు బోధ చేసేది ప్రవాసంలో అలసిపోయివున్న యిస్రాయేలీయులకు.

5. సేవకుడు ప్రభువు ఉపదేశాన్ని వినేవాడు. అతనికి దైవచిత్తం తెలుసు. అతడు ఎల్లవేళల ప్రభువుకి విధేయుడు.

6. రెండవది, సేవకుతని బాధలు. అతని శత్రువులు తోడి యిస్రాయేలీయులే. వారు అతన్ని వీపుపై చరచారు. అతని గడ్డాన్ని పీకివేసారు. ఇది బాధనీ అవమానాన్నీ గూడ కలిగించే కార్యం. పూర్వం అమ్మోనీయులు దావీదు సేవకుల గడ్డాలను కత్తిరించి వేయగా అతడు వారిమీదికి యుద్ధానికి పోయాడు -2సమూ 10,4. ముఖంమీద ఉమ్మివేయడంకూడ అవమానకరం -సంఖ్యా 12,14. యిర్మీయా మొదలైన ప్రవక్తలు కూడ ఈలాగే బాధలూ అవమానాలూ అనుభవించారు.

7. మోషే యిర్మీయా బాధలు అనుభవించినపుడు ప్రభువు వాళ్ళకు ఆ శ్రమలను అనుభవించే శక్తిని దయచేసాడు. విశేషంగా యిర్మీయాను ఇనుప స్తంభంలాగ ఇత్తడి తలుపులాగ గట్టిజేసాడు -యిర్మీ 1,18. ఇక్కడ సేవకుని ముఖాన్ని చెకుముకి రాయిలాగ గట్టచేసాడు అనగా యావే అతనికి బలాన్నిచ్చాడని భావం.

8. భక్తునిమీద నేరాలు మోపేవాళ్ళు న్యాయస్థానానికి రావచ్చు. ఈ న్యాయస్థానం దేవుని సమక్షమే. దేవుడు తన భక్తుడు నిర్దోషి అని తప్పక నిరూపిస్తాడు.

9. యావే తన సేవకుని ఆదుకొంటాడు. భక్తుని శత్రువులు చిమటలు కొట్టిన బట్టలా నాశమైపోతారు. బైబుల్లో బట్టలు వాటిని తాల్చిన నరుణ్ణే సూచిస్తాయి.

10-11. ఇక్కడ భక్తుడు ఆపదల్లో దేవుణ్ణి నమ్మమని ప్రవాసంలోని శేషజనాన్ని హెచ్చరిస్తున్నాడు. వీళ్ళుకూడ భక్తులే. కాని ప్రవాసంలోని అధిక సంఖ్యాకులైన యూదులు మాత్రం సేవకుణ్ణి బంధించి నాశం చేయడానికి పూనుకొన్నారు. వాళ్ళు తాము త్రవ్విన గోతిలో తామే పడతారు.

ఈ గీతంలోని ముఖ్యాంశాలు ఇవి. భక్తుడు ప్రభువు వాక్కును ఆలించే శిష్యుడు, అతనికి విధేయుడు. శత్రువులు అతన్ని హింసించారు. ఐనా ప్రభువు హింసల్లో అతని కాపాడాడు. అతడు నిర్దోషి అని రుజువుచేసాడు.

ఈ మూడవ ప్రవచనం కూడ క్రీస్తుపట్ల నెరవేరింది. సేవకుడు యావేమాట వినేవాడు. క్రీస్తుకూడ తండ్రి పలుకులను ఆలించి ఆ పలుకులను మాత్రమే మనకు బోధించేవాడు -యోహా 12,49-50. శత్రువులు సేవకునిలాగే క్రీస్తునికూడ పాటుల సమయంలో కొట్టి, ఉమ్మివేసి అవమానించారు -మత్త 27,30.

## నాల్గవ గీతం 52,13-53,12

52,13ప్రభువు ఈలా పలుకుతున్నాడు
"ఇదిగో నా సేవకుడు విజయాన్ని పొందుతాడు
అతడు ఘనుడై ప్రశంసలు అందుకొంటాడు
జనసమూహాలు అతన్ని చూచి విభ్రాంతి చెందుతాయి
అతడు వికృతరూపం తాల్చి వున్నందున
నరుళ్ళా కనిపించనే లేదు
14. కాని యిప్పుడు బహుజాతులు
అతన్ని చూచి విస్మయ మొందుతారు
రాజులు అతన్ని చూచి నిశ్చేష్టులౌతారు
వాళ్ళు పూర్వం కనివిని యెరుగని సంగతులు తెలుసుకొంటారు
53,1 ప్రజలు ఈలా బదులు చెప్తారు
మేమిపుడు విన్నవించే సంగతులు ఎవరు నమ్మారు?
ఇది ప్రభువు వల్ల జరిగిందని ఎవరు గ్రహించారు
2. దైవచిత్తం వలన అతడు
ఎండిన నేలలో వేరు పాతుకొని
లేత మొక్కలా పెరిగాడు
అతనికి సౌందర్యంగాని చక్కదనంగాని లేదు
మనలను ఆకర్షించే సొబగేది అతనిలో లేదు
3. ప్రజలు అతన్ని చిన్నచూపు చూచి తృణీకరించారు
అతడు విచారగ్రస్తుడు బాధమయుడు అయ్యాడు
నరులు అతనివైపు చూడ్డానికి కూడ ఇష్టపడలేదు
ప్రజలు అతన్ని తిరస్కరించడంచే
మనం అతన్ని లెక్కచేయలేదు
4. ఐనా అతడు మన బాధలను భరించాడు
మన దుఃఖాలను వహించాడు
ప్రభువు అతన్ని మోది, శిక్షించి, దుఃఖపెట్టాడని
మనం భావించాం

5. కాని అతడు మన తప్పులకొరకు గాయపడ్డాడు
మన పాపాలకొరకు నలిగిపోయాడు
అతడు అనుభవించిన శిక్షద్వారా
మనకు స్వస్థత కలిగింది
అతడు పొందిన దాఎబ్బలద్వారా
మనకు ఆరోగ్యం చేకూరింది
6. మనమంతా గొర్రెల్లా దారి తప్పాం
అందరం మన త్రోవన మనం వెళ్ళిపోయాం
కాని ప్రభువు మనందరి దోషం అతనిపై మోపాడు
7. దౌర్జన్యానికి గురైనా అతడు వినయంతో సహించాడు
పల్లెత్తు మాట అనలేదు
అతడు మధ్యస్థానానికి కొనిపోబడే గొర్రెపిల్లల్లా,
ఉన్ని కత్తిరింపబడే గొర్రెల్లా
మౌనంగా వున్నాడే కాని నోరు తెరవలేదు
8. అతన్ని దౌర్జన్యంగా, అన్యాయంగా కొనిపోయారు
అతని గతి పట్టించుకున్నవాల్లే లేరు
అతన్ని నరికి సజీవుల లోకం నుండి తొలగించారు
మన ప్రజల పాపాలకొరకు అతన్ని వధించారు
9. ఏ తప్పు చేయకున్నా, ఎన్నడు అబద్ధమాడకున్నా
అతన్ని దుష్టుల ప్రక్కన పాతిపెట్టారు,
దుర్మార్గుల ప్రక్కన సమాధి చేసారు
10. ప్రభువు ఈలా అంటున్నాడు
ఐనా అతన్ని బాధాభరితుణ్ణి చేయాలనే నా సంకల్పం
అతని మరణం పాపపరిహారబలి ఐంది
కనుక అతడు దీర్ఘాయువును బడిసి
పుత్రపౌత్రులను చూస్తాడు
అతని ద్వారా నా సంకల్పం నెరవేరుతుంది

11. బాధలు ముగియగా అతడు మళ్ళా ఆనందిస్తాడు
నీతిమంతుడైన నా సేవకుడు
పెక్కుమంది దోషాలను భరిస్తాడు
అతన్ని చూచి నేను వారి తప్పిదాలను మన్నిస్తాను
12. అతడు తన ప్రాణాలను అర్పించాడు
దుష్టుడుగా ఎంచబడ్డాడు
పెక్కుమంది దోషాలను భరించి
వారి పాపాల పరిహారం కొరకు విజ్ఞాపనం చేసాడు
కనుక నే నతన్ని గొప్పవాణ్ణి చేస్తాను
ఘనుల్లో వొకణ్ణిగా గణిస్తాను."

నాల్గు గీతాల్లోను ఇది సుప్రసిద్ధమైంది. దీనిలో విరోధులు సేవకుణ్ణి వధించారు. కాని భక్తుడు విరోధుల తరపున చనిపోయాడు. అతని మరణం వాళ్ళకు పాపపరిహార బలి ఐంది. ప్రభువు అతని నిర్దోషత్వాన్ని నిరూపించి అతనికి పునర్జీవాన్ని ప్రసాదించాడు.

52,13. ఇవి యావే పలుకులు. సేవకులు అపజయాలకు వెరవకుండా బోధించాడు. శత్రువులు అతన్ని బాధించి, వధించి, సమాధి చేసారు. అతడు కుష్ఠరోగి లాగ కన్పించాడు. కాని మరణానంతరం ప్రభువు అతని మహిమపరచి అతనికి వుత్థానాన్ని దయచేసాడు. అతని విజయాన్ని చూచి జనం ఆశ్చర్యపోతారు.

14. ప్రజలుమాత్రమే కాక రాజులుకూడ సేవకుని విజయానికి విస్తుపోతారు. నవ్విన నాపచేనే పండిందికదా అని నిశ్చేష్టులౌతారు. ఊరూపేరూ లేనివాడు కడకు విజయాన్ని సాధించాడు కదా అనుకొంటారు

53,1. ఇవి ప్రజల పలుకులు. ప్రజలు భక్తుని బాధించి చంపివేసారు. కాని యావే అతన్ని మహిమపరచాడు. ఈ సంగతిని ఎవరైనా ముందుగా ఊహించారా? అర్థం చేసికొన్నారా? లేదు.

2. సేవకుడు ఊరూపేరూ లేని పేద కుటుంబంలో పుట్టాడు. మెస్సీయా యీషాయి వంశంలో పుట్టే మొలకలాంటివాడు -యెష 11,1. సేవకుడు కూడ ఎండిన నేలలో మొలచిన మొలక. అనగా అనామకుడని భావం. యావే అలాంటివాణ్ణి తన కార్యాన్ని సాధించడానికి ఎన్నుకొన్నాడు.

3. సేవకుడు బాధలు అనుభవించి కుష్ఠరోగిలా తయారయ్యాడు. జనం అతనివైపు చూడ్డానికి గూడ ఇష్టపడలేదు. అతడు తన పాపాల కొరకే బాధలు అనుభ వించాడు అనుకొన్నారు. కనుక ఎవరూ అతన్ని విలువతో చూళ్లేదు.

4–5 కాని ప్రజల భావం తప్పు. దాసుడు మన బాధలూ, దుఃఖాలూ అనుభవించాడు. తన్ను హింసించే వాళ్ళ పాపాలకు పరిహారం చేయడానికై ఆ మహానుభావుడు తానే శ్రమలు అనుభవించాడు. అతడు అనుభవించిన శిక్షద్వారా ఇతరులు స్వస్థతను పొందారు.

6. ప్రజలు ప్రభువు మార్గాలు విడనాడి పాపపు త్రోవల్లో నడిచారు. వారి అపరాధాలకు సేవకుడు గాయపడ్డాడు.

7. దాసుడు తన పాలబడిన బాధలను ఓర్పుతో సహించాడు. మోషే, యేలియా, యోబు మొదలైన భక్తులు తమ బాధల్లో సహనాన్ని కోల్పోయి నిష్ఠురాలు పలికారు. కాని సేవకుడు పల్లెత్తుమాట అనలేదు. యిస్రాయేలీయులు ద్రోహులయి ప్రభువుని విడనాడారు. కాపరిని వదలిపోయిన చెడ్డగొర్రెల్లా తయారయ్యారు. కాని సేవకుడు మాత్రం కాపరిని అంటిపెట్టుకొని వుండే మంచి గొర్రెలా మెలిగాడు. అతడు ప్రభువు పట్ల విధేయతా భావంతోనే మధ్యస్థానంలో చనిపోయే గొర్రెపిల్లలా ప్రాణాలు విడిచాడు. ఈ చరణంలో రచయిత రెండుసార్లు అతని మౌనాన్ని పేర్కొన్నాడు.

8. ప్రజలు అతన్ని అన్యాయంగా వధించారు. ఎవరూ అతనిపట్ల సానుభూతి చూపలేదు, అతన్ని పట్టించుకోలేదు.

9. అతన్ని గౌరవప్రదంగా గాక దుర్మార్గుల సమాధుల ప్రక్కన పాతిపెట్టారు. అనగా అతన్ని దుష్టునిగా గణించారని భావం.

10–11. దాసుడు ఓర్పుతో చనిపోయాడు కదా! ఆలాంటి పవిత్ర మరణం వ్యర్థమౌతుందా? అతని మరణం పాపపరిహారబలి ఐంది. ప్రజల పాపాల కొరకు యెరూషలేము దేవాలయంలో గొర్రెపిల్లలను బలిగా సమర్పించేవాళ్లు. దీన్ని పాప పరిహారబలి అన్నారు –లేవీ 5,14–19. దాసుని మరణాన్ని దేవుడు ఈలాంటి బలిగా స్వీకరించాడని భావం. ఇక్కడ అతడు యాజకుడుగా ప్రజలకొరకు ఆత్మార్పణం చేసికొన్నాడని అర్థం. అతని మరణంవల్ల పాపపరిహారాన్ని పొందినవాళ్ళంతా అతనికి పుత్రపౌత్రులయ్యారు. సేవకుడు మరణానంతరం దీర్ఘాయువుని పొందాడు. అనగా మళ్ళా ఉత్థానమయ్యాడు. అతనిద్వారా యావే రక్షణప్రణాళిక నెరవేరింది.

12. సేవకుడు చేసిన మరో గొప్పకార్యం, ప్రవాసంలోని యూదుల పాపాలు మన్నించమని దేవునికి విజ్ఞాపనం చేయడం. అతడు ప్రవక్తగా ప్రజలకొరకు దేవునికి విన్నపం చేసాడు. అతని భక్తి శ్రద్ధలకు దేవుడు అతన్ని ఘనుణ్ణి చేసాడు. భావితరాల వాళ్ళు అతన్ని కొనియాడతారు.

ఈ నాల్గవ గీతంలోని ముఖ్యభావాలు ఇవి. సేవకుడు నిరాడంబరంగా పెరిగతాడు. దుష్టులైన ప్రజలు అతని బోధను పెడచెవిని బెట్టారు. అతన్ని బాధించి చావమోదారు. గాయాలవల్ల అతని దేహం కుష్ఠరోగి దేహంలా కన్పించింది. ప్రజలు అతడు తన పాపాల కొరకే బాధలు అనుభవించాడు అనుకొన్నారు. కాని దేవుడు అతడు ప్రజల పాపాలకొరకు గాయపడేలా చేసాడు. అతని గాయాల ద్వారా జనుల పాపాలకు ప్రాయశ్చిత్తం జరిగింది. కడన దుష్టులైన ప్రజలు అతన్ని వధించారు. మరణసమయంలో గతూడ ఆ మహానుభావుడు గొర్రెపిల్లలా మౌనంగా వుండిపో యాడు. ప్రజలు అతన్ని దుష్టుల సమాధుల ప్రక్కన పాతిపెట్టారు. అతడు యాజకుడుగా మరణించాడు. దేవుడు అతని మరణాన్ని పాపపరిహార బలిగా స్వీకరించాడు. అతని భక్తిని మెచ్చుకొని అతనికి ఉత్థానాన్ని దయచేసాడు. అతని మరణం వల్ల చాలమంది దోషవిముక్తిని పొంది అతనికి ఆధ్యాత్మిక సంతానమయ్యాడు. అతడు ప్రవక్తగా ప్రజలకొరకు దేవునికి విజ్ఞాపనం కూడ చేసాడు. ఈ గీతం వర్ణించే సేవకుడు మహాభక్తుడు. ఆదర్శప్రాయుడు. ఉదాత్త వ్యక్తి. మనకు ప్రేరణం కలిగించేవాడు.

ఈ గీతంలోని వాక్యాలు చాల క్రీస్తు జీవితంలో నెరవేరాయి. అతడు లోకం పాపాలను తొలగించే గొర్రెపిల్ల –యోహా 1,29. యూదుల న్యాయసభ తనమీద నేరాలు మోపినా తానుమాత్రం మౌనంగా వుండిపోయిన గొర్రెపిల్ల. ఈ సేవకుని చావులాగే క్రీస్తు చావుకూడ పాపపరిహార బలి ఐంది. క్రీస్తుఅనేకుల కొరకు తన ప్రాణాలను విమోచన క్రయధనంగా అర్పించాడు –మత్త 20,28. సేవకుళ్ళాగే అతడు కూడ దుష్టుడుగా ఎంచబడ్డాడు –లూకా 22,37. అతనిలాగే క్రీస్తుకూడ సిలువపై నుండి విరోధుల కొరకు విజ్ఞాపనం చేసాడు –లూకా 23,24. ఆ ప్రవాసుల్లాగే నేడు మనంకూడ గొర్రెల్లాగ దారితప్పాం. కాని క్రీస్తు మనలను మళ్ళా దారికి కొనివచ్చి తనవద్దకు చేర్చుకొన్నాడు –1పేత్రు 2,22–25. ఫిలిప్పు యితియోపీయునికి చేసిన బోధల ప్రకారం, వధ్యస్థానానికి కొనిపోబడిన గొర్రెపిల్ల క్రీస్తే –అ.చ.8,32–35. సేవకుళ్ళాగే క్రీస్తుకూడ మొదట బాధలు అనుభవించి ఆ పిమ్మట మహిమలో ప్రవేశించాడు –లూకా 24,26. అతడు తన్ను గూర్చిన ప్రవక్తల ప్రవచనాలను నెరవేర్చినవాడు –24,44.

## సేవకుడు ఎవరు?

యెషయా గీతాలు పేర్కొన్న సేవకుడు ప్రధానంగా మెస్సీయా. కాని కొన్నిచోట్ల ఈ గీతాలు ప్రవాసంలోని యూదులకు కూడ వర్తిస్తాయి. ప్రవాసంలో బాధలు అనుభవించిన యూదులంతా ఉమ్మడిగా సేవకుడు ఔతారు. యావే వారిని ఎన్నుకొన్నాడు.

వారిద్వారా అన్యజాతులకు కూడ తన్ను తెలియజేసికోగోరాడు. కనుక వారిని జాతులకు జ్యోతిగా నియమించాడు.

కాని యిస్రాయేలీయులు దేవుని ఆజ్ఞలను పాటించలేదు. అందుకే ప్రభువు వారిని శిక్షించి బాబిలోనియా ప్రవాసానికి పంపాడు. వీరిలో కొద్దిమంది మాత్రం యావేపట్ల భక్తితో జీవించారు. వీరికి శేషజనం అని పేరు. ప్రవక్తలు విజ్ఞాన బోధకులు మొదలైన భక్తులు ఈ కోవలోనికి వస్తారు. వీల్ళు ఉమ్మడిగా "సేవకుడు" అనే బిరుదుకు తగినవాళ్ళు. యెషయా 49,3. వీరిని "యిస్రాయేలు" అని సంబోధించింది.

ఈ గీతాల్లోని కొన్ని భావాలు మాత్రమే ప్రవాసంలోని యూదులే సేవకుడు అని చెప్తాయి. అన్ని భాగాలు అలా చెప్పవు. ఈ గీతాలు వ్రాసిన కవి ఆలోచనలో కొన్ని పర్యాయాలు యూద సమాజమే సేవకుడు. చాల పర్యాయాలు ఓ ప్రత్యేక వ్యక్తి (మెస్సీయా) సేవకుడు. ఈ రెండు భావాలు అతని మనసులో కలగాపులగంగా కలసిపోయాయి.

ఇక, మెస్సీయాయే సేవకుడు అనే భావాన్ని పరిశీలిద్దాం. నూత్నవేద రచయితలు పై యెషయా గీతాలను క్రీస్తుకి అన్వయించారు. వేదశాస్త్రులైన తొలి ఐదు శతాబ్దాల్లోని పితృపాదులు కూడ అలాగే చేసారు. బైబులు పండితులు చాలమంది సేవకుడు క్రీస్తేనని చెప్తున్నారు. కనుక నేడు మనం ఈ గీతాలను క్రీస్తుకి అన్వయించేలా చదువుకోవాలి.

తండ్రి క్రీస్తుని ఎన్నుకొని యూదుల దగ్గరికి పంపాడు. ప్రజలకు దేవుని తెలియ జేసి అతని ఆజ్ఞలను బోధించడానికి క్రీస్తు వచ్చాడు. అతడు మహా ప్రవక్త. యూదులు మాత్రం ఆ ప్రవక్త బోధలు ఆలించలేదు. అతడు నిర్దోషియైనా యూదులు అతనిపై నేరాలు ఆరోపించి అతడు మరణశిక్షకు గురయ్యేలా చేసారు. క్రీస్తు చనిపోతూ తన విరోధులకొరకు తండ్రికి విన్నపం చేసాడు. తన మరణాన్ని పాపపరిహార బలిగా సమర్పించాడు. అతడు లోకంలోని నరులందరికొరకూ మరణించాడు. అతని మరణం వల్లనే దేవుడు నేడు మన పాపాలను మన్నిస్తున్నాడు. తండ్రి క్రీస్తు నిర్దోషత్వాన్ని నిరూపించడానికే అతన్ని మరణం నుండి ఉత్థానం చేసాడు. అతని ఉత్థానానంతరం యూదులూ అన్యజాతి ప్రజలు కూడ అతన్ని గౌరవిస్తున్నారు. ఈలా సేవకుడు సాధించిన గొప్ప కార్యాలన్నీ మళ్ళా క్రీస్తులో కన్పిస్తాయి. కనుక అతడు సేవకుడు. సేవకుని గూర్చిన వాక్యాలను క్రీస్తు స్వయంగా తనకు అన్వయించుకొన్నాడు -లూకా 22,22-44.

## ప్రార్థనా భావాలు

1. బైబుల్లో నరుడు ప్రధానంగా సేవకుడు. దేవునికి విధేయుడై అతడు తనకు ఒప్పజెప్పిన పనిని చేసి ముగించడం అతని ప్రధాన ధర్మం. మోషే మొదలుకొని క్రీస్తువరకు వచ్చిన భక్తులంతా సేవకులుగానే జీవించారు. నేడు మనకు కూడ సేవాజీవితం తగుతుంది. మనం ప్రభువుకీ తోడి నరులకూ గూడ పరిచర్యలు చేయాలి. సేవలు చేయించుకోవడానికి కాక స్వయంగా సేవలు చేయడానికి వచ్చిన క్రీస్తు మనకు ఆదర్శం -మార్కు 10,45.
2. ప్రభువు సేవకుణ్ణి తల్లి గర్భంనుండే యెన్నుకొన్నాడు. అతనిపట్ల ప్రీతి చెందాడు -యెష 42,1. జ్ఞానస్నాన సమయంలో క్రీస్తుని గూర్చి కూడ తండ్రి యివే మాటలు పలికాడు -మత్త 3,17. ప్రభువు సేవకుణ్ణిలాగే నూత్నవేద ప్రజలను గూడ ఎన్నుకొన్నాడు. మనమంటే అతనికి ప్రీతి. మన తరఫున మనం తండ్రికి ప్రీతి కలిగించేలా జీవించాలి.
3. సేవకుడు యిస్రాయేలుకు నిబంధనం, జాతులకు జ్యోతి -యెష 42,6. అతడు యిస్రాయేలుకు సీనాయి నిబంధాన్ని జ్ఞప్తికితెచ్చి వాళ్లు ఆ నిబంధనం షరతుల ప్రకారం జీవించేలా చేస్తాడు. వాళ్ళ పాపమంతా నిబంధనను మీరడమే. కనుక అతడు వాళ్ళు మళ్ళా నిబంధనను పాటించేలా చేస్తాడు. ఇంకా, అన్యజాతులకు యావే ధర్మశాస్త్ర జ్యోతిని అందిస్తాడు. ఆ భక్తుడు సూచించే క్రీస్తుకూడ నిబంధనకారుడు. సీనాయి నిబందనానికీ బదులుగా అతడు సిలువ నిబంధనాన్ని నెలకొల్పాడు. పైగా అతడు లోకానికే జ్యోతి - యోహా 8,12. ఈ యిద్దరు భక్తులను అనుసరించి మనంకూడ లోకం ఎదుట ప్రభువు నిబంధనంగాను, జ్యోతిగాను మెలగాలి. మన దైవభక్తివల్లా, మంచి ఆదర్శంవల్లా పదిమందిని దేవుని దగ్గరికి రాబట్టేలా జీవించాలి.
4. సేవకుడు యావే శిష్యుడు. రోజురోజు అతని వాక్కుని వినేవాడు -యెష 50,4. యావే తనకు ఒప్పజెప్పిన పనిని ఖండితంగా నెరవేర్చేవాడు. క్రీస్తు కూడ తండ్రి వాక్కుని వినేవాడు -యోహా 12,49-50. నేడు మన తరపున మనం రోజు ప్రభువు వాక్కుని బైబుల్లోనుండి ధ్యానం చేసికోవాలి. అతడు మనలను ఏమి చేయమంటున్నాడో గుర్తించాలి. చాలమందికి ప్రభువు వాక్కూ తెలియదు. అతని చిత్తమూ తెలియదు. వాళ్ళ యిష్టం వచ్చినట్లు పాపజీవితం గడుపుతూంటారు.

5. బాధామయ సేవకుడు ప్రధానంగా బాధలు అనుభవించినవాడు. అతడు చేసిన గొప్ప కార్యం ఇదే. అతడు సూచించే క్రీస్తుకూడ శ్రమలు అనుభవించిన వాడు. గురువుకి ఒక త్రోవ శిష్యుడికి ఇంకొక త్రోవ వుంటుందా? కావున నేడు మనకుకూడ శ్రమలు తప్పవు. వాటిని మన పాపాలకు రపాయశ్చిత్తంగా స్వీకరించి దేవునికి సమర్పించాలి.

6. సేవకుడు ప్రవక్త. ప్రభువు వాక్కుని విని దాన్ని ఇతరులకు బోధించినవాడు. ఆ వాక్కు అతనికి పదునైన కత్తిలా, బాణంలా ఉపయోగపడింది –యెష 49,21. క్రీస్తుకూడ తండ్రి వాక్కుని బోధించినవాడే. ఈ భక్తులను అనుసరించి మనంకూడ వాక్యబోధకు పూనుకోవలి. ఎవరి శక్తికొలది వాళ్ళు ఇతరులకు వాక్యాన్ని విన్పించాలి.

7. సేవకునికి తన పనిలో నిరుత్సాహం కలిగింది. ప్రవాసులు అతని బోధను వినలేదు. పైగా అతన్ని బాధించారు –యెష 49,4. క్రీస్తుకూడ యూదప్రజలు తన్ను అంగీకరించనందుకు నిరుత్సాహపడ్డాడు. కడకు తన శిష్యులు కూడ తన్ను అపార్థం చేసికొన్నందుకు బాధపడ్డాడు. నేడు మన జీవితంలోకూడ అపజయాలూ నిరుత్సాహ భావాలూ తప్పవు. లౌకిక ఆధ్యాత్మికరంగాల్లో కూడ మనకు నిరుత్సాహం ఎదురౌతుంది. కాని మనం ఓడిపోం. ప్రభువు బలం వలన గెలుస్తాం. కనుక మన నిరుత్సాహాలను గూడ ప్రభువుకే అర్పించుకోవాలి.

8. సేవకుని జీవితానికి అర్థముంది. అతడు శ్రమలు అనుభవించి ప్రజలకు ఏలు చేసిపెట్టాడు. క్రీస్తుకూడ ఈలాగే చేసాడు. అతని జీవితం కూడ అర్థవంత మైంది దివ్యమైంది. నేడు మనంకూడ ఈ భక్తుల్లాగే జీవించి మన జీవితాన్ని ధన్యం చేసికోవాలి. క్రైస్తవుడి జీవితం క్రీస్తుని అనుసరించేది, పవిత్రమైంది. మనకు ప్రేరణ కలగడానికి పై బాధామయ సేవకుని గీతాలను పలుమారులు భక్తితో చదువుకోవాలి. విశేషంగా తపసు కాలంలో వీటిని మననం చేసికోవాలి. మన జీవితాన్ని ఉదాత్తంగా మలచుకోవాలి.

# 11. బైబులు భక్తులు

బైబులు భాష్యం 100-101

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | అబ్రాహాము | 201 |
| 2. | హేబెలు | 208 |
| 3. | నోవా | 210 |
| 4. | మెల్కీసెదెకు | 213 |
| 5. | యెహోషువ | 215 |
| 6. | ఏలీయా | 218 |
| 7. | మోషే | 222 |
| 8. | దావీదు | 227 |
| 9. | స్నాపక యోహాను | 230 |


## 1. అబ్రాహాము

ఒక్క యూదులకే గాక, యావే ప్రభువుని విశ్వసించే భక్తులందరికీ అబ్రాహాము తండ్రి. విశ్వాసరంగంలో అతడు మనకందరికీ నిదర్శనం

### 1. అబ్రాహాము పిలుపు

అబ్రాహాము కాల్దియా దేశీయుడు. ఊరు పట్టణవాసి. క్రీస్తుపూర్వం 19వ శతాబ్దంలో జీవించినవాడు -ఆది 11,31. ఓ దినం ప్రభువు అతనికి ప్రత్యక్షమై "నీవు నీ సొంత దేశాన్నీ నీ చుట్టపక్కాలనూ వదలి నేను చూపే దేశానికి రా. నేను నిన్ను మహా జాతిగా తీర్చిదిద్దుతాను. నిన్ను ఆశీర్వదిస్తాను. భావికాలంలోని జనులు నీలాగే తామూ ఆశీర్వాదాలు పొందాలని కోరుకొంటారు. నిన్ను దీవించేవారిని దీవిస్తాను. శపించేవారిని శపిస్తాను. నీ ద్వారా నేను సమస్త జాతులకు దీవెనలిస్తాను" అని పల్కాడు -ఆది 12,1-3. ఈ వాక్యాల్లో మూడు ప్రధానాంశాలున్నాయి. 1.అబ్రాహాముకి దేవుడు ఓ క్రొత్త దేశాన్నిస్తాడు. 2.అతడు సంతానం తామరతంపరగా వృద్ధి చెందుతుంది. 3.దేవుడు అతన్ని నిండుగా దీవిస్తాడు. అతని ద్వారా అన్ని జాతులు దీవెనలు పొందుతాయి. ఈలా అబ్రాహాము కథంతా సంగ్రహంగా పై వాక్యాల్లో ఇమిడివుంది. అతడు స్థిరనివాసం లేని సంచారజీవి. ఐనా దేవుడు అతనికి

ఓ గడ్డనిస్తాడు. అతడు అతని భార్య సార వృద్ధులు. ఐనా వారికి సంతానం కలుగుతుంది. అతని జాతినుండే మెస్సీయా ఉద్భవిస్తాడు. ఈ మెస్సీయా ద్వారా అన్ని జాతులూ దీవెనలు పొందుతాయి. పైదైవవాక్యాల్లో ఇంత శక్తి యిమిడి వుంది. అనామకుడైన అబ్రాహాము గొప్పవాణ్ణి చేసింది ప్రభువు. కాల్దియా దేశంనుండి అతన్ని పిల్చుకొచ్చింది ప్రభువు వాక్కు. ఐతే అబ్రాహాము తన తరపున తాను ప్రభువుని నమ్మి జీవించాడు. అతని రక్షణ ప్రణాళిక ప్రకారం నడచుకొన్నాడు. భావికాలంలో రాబోయే దైవ భక్తులందరికీ ఆదర్శప్రాయుడ య్యాడు. అదే అతని గొప్పతనం.

## 2. అబ్రాహాముకు పరీక్ష

దేవుడు అబ్రాహాము సంతతి అంసఖ్యాకంగా విస్తరిల్లుతుందని చెప్పాడు. ఐనా ఈ సంతానం రంగంలోనే ప్రభువు అతన్ని పరీక్షించాడు. ఈ పరీక్షలో అతని విశ్వాసం చలించలేదు కదా, పుటం వేసిన బంగారంలాగా తళతళా మెరిసింది. దేవుడు అతనితో నీ యేకైక కుమారుని, నీవు గాఢంగా ప్రేమించే యీసాకుని మోరీయా కొండమీద నాకు దహనబలిగా సమర్పించు అని చెప్పాడు -ఆది 22,2. ఈ యీసాకు ద్వారానే అబ్రాహాము సంతతి దోసపాదులా వృద్ధి చెందాలి. అది దేవుడు పూర్వమే చేసిన వాగ్దానం ఏలా నెరవేరుతుంది? పైగా యీసాకు అబ్రాహాముకి ఏకైక కుమారుడు, కనుక అత్యంత ప్రీతిపాత్రుడు. ఆ పిల్లవాడు పోతే ఆ ముసలిప్రాయంలో అతనికి ఏమి మిగులుతుంది? తల్లిదండ్రులు సంతానాన్ని మిక్కుటంగా ఆశించే పాత్ర తరానికి చెందినవాడు అబ్రాహాము ముసలివాడు ఊతకర్రమీద ఆధారపడి నడచినట్లుగా అబ్రాహాము తన ఆశలన్నీ ఈసాకుమీద పెట్టుకొని జీవిస్తున్నాడు. ముసలివాని చేతిలో నుండి ఊతకర్రను లాగివేస్తే అతడు పడిపోడా? దేవుడు ఆ భక్తునికి పెట్టిన పరీక్ష అలాంటిది.

అబ్రాహాము ఈ పరీక్షలో నెగ్గాడు. తన ప్రాణానికే ప్రాణమైన ఈసాకుని బలి యీయడానికి సిద్ధమై తన విశ్వాసాన్ని నిరూపించుకున్నాడు. మనమైతే యావే వట్టి దొంగదేవుడు. బిడ్డణ్ణి యిచ్చినట్లే యిచ్చి మళ్లా తీసికొని పోతున్నాడు. ఈ దేవుణ్ణి నమ్మి నేను మోసపోయాను అనుకొనేవాళ్లం. కాని అబ్రాహామో, ముసలిప్రాయంలో నాకు అద్భుతంగా ఈసాకుని దయచేసిన దేవుడు అతడు పోతే అతని తాతలాంటివాణ్ణి మరొకణ్ణి యీయలేడా అనుకొన్నాడు. అతనికి యీసాకైనా మరెవరైనా దేవుని తర్వాతనే. అతని విశ్వాసం అంత గొప్పది. ఈ విశ్వాసంతోనే అతడు తన దైవభీతిని నిరూపించుకొన్నాడు -ఆది 22,12. దేవుడు పెట్టిన పరీక్షలో నెగ్గాడు. తాను దేవుతని వరాల కొరకు గాక దేవుని కొరకే దేవుణ్ణి సేవించేవాడనని నిరూపించుకొన్నాడు. ప్రభువు అతని చిత్తశుద్ధిని

మెచ్చుకొని ఈసాకుకి బదులుగా ఓ పొట్టేలుని చూపగా అబ్రాహాము దాన్నే దహనబలిగా సమర్పించాడు.

ఈసాకుని చావునుండి తప్పించిన దేవుడు మృత్యువుని గాక జీవాన్ని కోరేవాడు –సొలోమోను జ్ఞాన 1,13. అసలు అతడు నరజాతినుండి మృత్యువుని తొలగిస్తాడు. ఈసాకు సూచించే క్రీస్తు సిలువమరణం ద్వారా ఈకార్యం జరుగుతుంది. కట్టెలమోపు మోసికొని బలికావడానికి సిద్ధమై వెళ్లిన యీసాకు భావికాలంలో సిలువను మోసికొని పోయే క్రీస్తుకి చిహ్నంగా వుంటాడు –ఆది 22,6. ఓ రెండువేల యేండ్లు కడచాక యెరూషలేములో ఈ సూచనం నెరవేరుతుంది –రోమా 8,32.

## 3. ధన్యుడైన తండ్రి

దేవుడు అబ్రాహాము విదేయతనూ విశ్వాసాన్నీ మెచ్చుకొని "నేను నిన్ను అధికంగా దీవిస్తాను. ఆకాశ నక్షత్రాల్లాగ, సముద్రతీఈరంలోని యిసుకరేణువుల్లాగ నీ సంతానం అసంఖ్యాకంగా వృద్ధిచెందుతుంది. లోకంలోని జాతులన్నీ నీ సంతానం ద్వారా దీవెనలు పొందుతాయి. నీవు నాకు విధేయుడవయ్యావు కనుక ఇదంతా జరుగుతుంది" అని చెప్పాడు –ఆది 22,17–18. ఇవి చాల గొప్ప దీవెనలు. సీరా చెప్పినట్లుగా అబ్రాహాము కీర్తి అనన్య సామాన్యమైంది –44,19. అసలు దేవుడు అబ్రాహాముని పిల్చింది అతడు బహుజాతులకు తండ్రి కావాలనే. కనుక అతని గొప్పతనమంతా అతని సంతానంలోనే యిమిడి వుంది. అబ్రాహాము తొలిపేరు అబ్రాము. ఈ పేరుకి గొప్పవాడైన తండ్రికి జన్మించినవాడని అర్థం. దేవుడు ఈ పేరుని అబ్రాహాముగా మార్చాడు. ఈ రెండవ పేరుకి అనేకజాతులకు తండ్రి అని అర్థం. కనుక తన పేరుకి తగినట్లుగానే అతడు నానాజాతులవారికి పిత –ఆది 17,5.

అబ్రాహాము పొందిన దీవెనలు అతనినుండి ఉద్భవించే నానాప్రజల్లోకి గూడ దిగివస్తాయి. ఆ ప్రజలద్వారా నానాజాతులూ దీవెనలు పొందుతాయి –ఆది 22,18 ఏలాగ? ఈ సంతానంనుండే భావికాలంలో మెస్సీయా పుడతాడు. అతని ద్వారా అన్ని జాతులవాళ్ళూ శుభాలు పొందుతారు. ఈలా అబ్రాహాముతో ప్రారంభమైన దీవెనలు మెస్సీయా ద్వారా ముగుస్తాయి. కనుక అబ్రాహాము ధన్యుడైన తండ్రి, నానా జాతులకూ పిత. పూర్వవేదకాలం చివరలో వచ్చిన సీరా అబ్రాహాముని స్తుతిస్తూ "అతని వంశజులవలన లోకానికి దీవెనలు అబ్బుతాయని దేవుడు రూఢిగా ప్రమాణం చేసాడు" అని చెప్పాడు –44,21. ఆదాము అవిశ్వాసం పాపపు నరజాతి అవిశ్వాసాన్ని సూచించినట్లే, అబ్రాహాము విశ్వాసం ఉద్ధరింపబడిన నరజాతి విశ్వాసాన్ని సూచిస్తుంది.

## 4. దేవుడు అబ్రాహాము సంతానాన్ని కరుణించాడు

దేవుడు అబ్రాహామునకిచ్చిన దీవెనలు అతని సంతానంలోకిగూడ దిగివచ్చాయని చెప్పాం. అతడు యిష్మాయేలుని గాక యీసాకునే యెన్నుకొన్నాడు. ఏసావునిగాక యాకోబునే ఎన్నుకొన్నాడు. దేవుని దీవెనలు అబ్రాహాము ఈసాకు యాకోబుల ద్వారా పండ్రెండు తెగల యిస్రాయేలీయులమీదికి దిగివచ్చాయి. ఈ తెగలవాళ్ళు ఐగుప్తులో బానిసలై దైవసహాయం కొరకు రోదిస్తూ వుంటే ప్రభువు పూర్వం అబ్రాహాము ఈసాకు యాకోబులతో చేసికొనిన నిబంధనను గుర్తుకుతెచ్చుకొని వారిని కరుణించాడు -నిర్గ 2,44. అలాగే బాబిలోనియాకు బందీలుగా వెళ్ళిపోయిన యిస్రాయేలీయులు దైవసహాయాన్ని అర్థిస్తే ప్రభువు వారి మొర ఆలించాడు. ఎందుకంటే వాళ్ళు తన స్నేహితుడైన అబ్రాహాము వంశజులు -యెష 41,8. ఇస్రాయేలీయులు అపాయల్లో బాధల్లో చిక్కుకొని నిరుత్సాహం చెందినపుడు ప్రవక్తలు

మీరు ఏరాతినుండి పగులగొట్టి తీయబడ్డారో
ఏగని నుండి తొలవబడ్డారో ఊహించండి
మీ తండ్రియైన అబ్రాహామునీ
మీకు జన్మనిచ్చిన సారానీ తలంచండి

అని వోదార్చారు -యెష 51,1-2. యూదులు తమ ప్రార్థనలో దేవా! నీవు నీ సేవకుడైన అబ్రాహాముని స్మరించుకొని మాకు దయజూపు అని మనవిచేసేవాళ్ళు. అతని పేరుమీదిగా చేసిన ప్రార్థన ఫలిస్తుందని నమ్మేవాళ్ళు. ఈ విధంగా ప్రభువు అబ్రాహాము భక్తివిశ్వాసాలనుబట్టి అతని సంతతిని కరుణించాడు.

## 5. కేవలం శారీరక సంతానం ఐతే చాలదు

యూదులు అబ్రాహాము మధ్యవర్తిత్వం ద్వారా తాము దేవుని అనుగ్రహానికి పాత్రులు కావచ్చు ననుకొన్నారు. కాని వాళ్ళు కేవలం శారీరకరీత్యా అబ్రాహాము సంతానమైతే చాలుననుకొన్నారు. ఆధ్యాత్మికరీత్యాగూడ అతని సంతతి కావాలను కోలేదు. అనగా అబ్రాహాము విశ్వాసాన్ని తాము ప్రదర్శిస్తూ దేవునికి ప్రీతిపాత్రులు కావలని తలంచలేదు. కనుకనే స్నాపక యోహాను మీరు అబ్రాహాము మాకు తండ్రి అని పొంగిపోకండి. మీరు శారీరకంగా మాత్రమే అతని సంతానం. దీనివల్ల ఒరిగిందేమీ లేదు. దేవుడు ఈ రాళ్ళనుండిగూడ అబ్రామాముకి సంతానాన్ని కలుగ జేయలేడు. మరి మీ గొప్పేమిటి? కనుక మీరు ఆధ్యాత్మికంగా అతని సంతానం కండి అని మందలించాడు -మత్త 3,9. ధనికుడు లాజరు కథలోని ధనికుడు అబ్రాహామును జూచి తండ్రీ అబ్రాహామూ! నన్ను

కరుణించు అని వేడుకొన్నాడు. కాని ఆ తండ్రి ఈ శారీరక పుత్రుణ్ణి ఆదరించలేదు – లూకా 16,24. క్రీస్తుకూడ యూదులను ఖండిస్తూ మీరు మేము అబ్రాహాము సంతానమని మురిసిపోతున్నారు. కాని మీరు నిజంగా సైతాను సంతానం. ఆ పిశాచం లాగే మీరూ నరహంతలు అని పల్కాడు –యోహా 8,40–44. ఈ వాక్యాలన్నీ కూడ అబ్రాహాముకి కేవలం శారీరక సంతానమైతే ఒరిగేదేమీ లేదని తెలియజేస్తాయి. యూదులకూ, నేడూ మనకూ కూడ కావలసింది అబ్రాహాము విశ్వాసం.

## 6. యూదుల పుణ్యక్రియలు వారికి రక్షించవు

యూదులకు మరో భ్రాంతికూడ వుండేది. అబ్రాహాము తన విశ్వాస విధేయతలను క్రియాపూర్వకంగా చూపించి నీతిమంతుడయ్యాడు కదా! కనుక యూదులు తమ పుణ్యక్రియల ద్వారానే తాముకూడ నీతిమంతుల మౌతామనుకొన్నారు. ధర్మశాస్త్రాన్ని పాటించడం ద్వారానే తాము పుణ్యాత్ముల మౌతామనుకొన్నారు. దేవుని అనుగ్రహం అవసరం లేదనుకొన్నారు. మేము ఆజ్ఞలు పాటిస్తున్నాం గనుక దేవుడే మాకు ఋణపడి వున్నాడని మిడిసిపడ్డారు. పరిసయుడు సుంకరి సామెతలోని పరిసయుని భావాలు ఈ కోవకు చెందినవే –లూకా 18,9–12. పౌలు యూదుల్లోని ఈ అహంకార భావాన్ని తీవ్రంగా ఖండించాడు. అతడు ఆదికాండ 15,6ను ఉదాహరించి అబ్రాహాము దేవుని నమ్మాడు. ఆ నమ్మకాన్ని బట్టి దేవుడు అతన్ని నీతిమంతునిగా ఎంచాడు. కనుక అబ్రాహాముని రక్షించింది అతని విశ్వాసంగాని పుణ్యక్రియలు కాదు. మనలను రక్షించేది కూడ మనకు క్రీస్తుపట్లగల విశ్వాసం గాని మన పుణ్యక్రియలుకాదు" అని నొక్కి చెప్పాడు –గల 3,6. కనుక మన పుణ్యక్రియలు మనలను రక్షించవు. దేవుని వరప్రసాదం మనలను రక్షిస్తుంది. అసలు ఈ వరప్రసాద బలంవల్లనే మనం పుణ్యక్రియలు చేయగల్గుతున్నాం. మొదట దేవుని అనుగ్రహం, తర్వాత మన పుణ్యక్రియలు. అంతేగాని ముందే మన పుణ్యక్రియలు తర్వాత దేవుని వరప్రసాదం కాదు. యాకోబు జాబు 8,20–24 కూడ ఈ విషయాన్నే ప్రస్తావిస్తుంది. మన విశ్వాసమూ మన పుణ్యక్రియలూ రెండూ కలసి మనలను రక్షిస్తాయని యాకోబు ఇక్కడ స్పష్టంగా చెప్పాడు.

## 7. అబ్రాహాముకు నిజమైన సంతానం క్రీస్తే

అబ్రాహాముకు నిజమైన సంతానం ఎవరు? కేవలం శారీరక సంతానమైన యూదులు కాదు. ఆధ్యాత్మిక సంతానమైన క్రీస్తే. అతడు అబ్రాహాము వంశస్థుడు – మత్త 1,1. అబ్రాహాము సంతానమంతటిలోను అతని దీవెనలు సమృద్ధిగా పొందినవాడు క్రీస్తు వొక్కడే –గల 31,16. అసలు దేవుడు పూర్వం అబ్రాహాముని పిల్చింది ఎందుకు?

అతని సంతతినుండి మెస్సియాను పుట్టించడం కొరకే గదా? కనుక అబ్రాహాము మొదటినుండి క్రీస్తుదినాన్ని చూడాలని ఉవ్విళ్ళూరాడు -యోహా 8,56. అతడు తన దీవెనలను క్రీస్తుకి గూడ సంక్రమించేలా చేసాడు.

దేవుడు రక్షణచరిత్రలో ఒక్కోసారి ఒక్కోవ్యక్తిని ఎన్నుకొని అతనిద్వారా తన దీవెనలు పెక్కుమందికి సంక్రమించేలా చేస్తాడు. పూర్వవేదంలో అబ్రాహాము అలాంటివాడు. నూత్నవేదంలో క్రీస్తు అలాంటివాడు. క్రీస్తుని నమ్మేవాళ్ళంతా వాళ్ళు యూదులైనా అన్యులైనా - ఆ క్రీస్తుద్వారానే అబ్రాహాము దీవెనలు పొందుతారు. దేవుడు అబ్రాహాముకు ఇచ్చిన దీవెనలు క్రీస్తుద్వారా అన్యజనులకు అందుతాయి - గల3,14. వారి విశ్వాసమే వారిని విశ్వాసులందరికీ తండ్రియైన అబ్రాహాముకి బిడ్డలనుగా జేస్తుంది -రోమా 4,11. కనుకనే పౌలు "మీరు క్రీస్తుకి చెందినవారైతే అబ్రాహాము సంతానమే. అబ్రాహాము పొందిన వాగ్దానాలకు మీరుకూడ వారసులౌతారు" అని వ్రాసాడు -గల 3,29.

దేవుడు అబ్రాహాముకి గొప్ప బహుమతిని ఇస్తానన్నాడు -ఆది 15,1. ఈ బహుమతి అతని సంతానమే. ఈ సంతానంలో క్రీస్తు వున్నాడు. మనమూ వున్నాం. ఇంకా రాబోయే తరాలవాళ్ళూ వున్నారు. ఈ లోకవాసులూ పరలోకవాసులూ కూడ వున్నారు. యూదులు మోక్షాన్ని అబ్రాహాము వొడి లేక రొమ్ము అని పిల్చారు. అనగా, అతని దాపులో మనం సురక్షితంగా వుండిపోతామని భావం -లూకా 16,22. మనమంతా చనిపోయాక అబ్రాహామున్న చోటికే వెళ్తాం. క్రీస్తుని నమ్మినవాళ్ళందరికీ అక్కడ కలకాలం అబ్రాహాము తండ్రిగా వుంటాడు.

ప్రార్థనాభావాలు

1. అబ్రాహాము ప్రధాన పుణ్యం విశ్వాసం. ఈ విశ్వాసం అతని జీవితంలో మూడుసార్లు వెల్లడియైంది. మొదటిసారి, ప్రభువు అతన్ని పిల్చినపుడు. కాల్దియా దేశంలో దేవుడు తన్ను పిలువగానే అబ్రాహాము ఆ కొత్తదేవుణ్ణి నమ్మి తన సొంత దేశాన్ని వ దలిపెట్టి నూత్నదేశమైన కనానుకు తరలి వచ్చాడు -ఆది 12,1. రెండవసారి, ముసలిప్రాయంలో దేవుడు అతనికి సంతానాన్ని కలిగిస్తానని చెప్పినపుడు. ఆ భక్తుడు తానూ తన భార్యా వృద్ధులైనా కూడ దేవుని వాగ్దానం ప్రకారం తమకు సంతానం కలుగుతుందని నమ్మాడు. ఆ నమ్మకాన్ని జూచే దేవుడు అబ్రాహాముని నీతిమంతునిగా గణించాడు - 15,4-6. మూడవసారి, దేవుడు ఈసాకుని బలి యీయమని అడిగినపుడు.

దేవునిపట్లగల భయభక్తులచే అబ్రాహాము తనకు ప్రీతి పాత్రుడైన ఈసాకుని బలియీయడానికి గూడ వెనుదీయలేదు -ఆది 22,1-2. ఈ భక్తుని నుండి ప్రేరణం పొంది నేడు మనమూ విశ్వాస పుణ్యాన్ని అధికం చేసికోవాలి.

2. అబ్రాహాము విశ్వాసాన్నిబట్టి బైబులు అతన్ని "దేవుని దాసుడు" అని పిలుస్తుంది - ఆది 22,24. "దేవుని స్నేహితుడు" అని చెప్తుంది -యెష 41,8. ఆ మహాత్ముడు భక్తిమార్గంలో మనకు ఆదర్శం కావాలి.

3. ప్రభువు అబ్రాహాముతో ఒడంబడిక చేసికొన్నాడు. ఆ వొప్పందం ప్రకారం అతని సంతానానికి కనాను మండలాన్ని ధారదత్తం చేసాడు -ఆది 15,9-18. అప్పటినుండి యూదులు ప్రభువుని "అబ్రాహాము ఈసాకు యాకోబుల దేవుడు" అని పిలుస్తూ వచ్చారు -నిర్గ 3,6. అబ్రాహాము కొల్చిన దేవుణ్ణే నేడు మనం కూడ శ్రద్ధతో కొలవాలి.

4. అబ్రాహాము అన్నిజాతుల వారికి తండ్రి, మధ్యవర్తి. మధ్యవర్తిగానే అతడు సొదొమ గొమర్రా ప్రజల కొరకు దేవునికి విజ్ఞాపనం చేసాడు -ఆది 18,22-32. అబ్రాహాము సంతానమైన యిస్రాయేలును దేవుడు దయతో జూస్తాడని యూదుల నమ్మకం. కనుక వాళ్ళు తమ ప్రార్థనలో దేవా! అబ్రాహాముని జూచి నీవు మమ్ము కరుణించు అని మనవిజేసికొనేవాళ్ళు -మీకా 7,19. నూత్న వేదప్రజలమైన మనం కూడ ఈ యబ్రాహాముని భక్తిభావంతో స్మరించుకోవాలి. అతనినుండి ప్రేరణం పొందాలి.

5. బేతేలు దగ్గర వసించేపుడు అబ్రాహాముకీ అతని తమ్ముని కొడుకు లోతుకీ పొలం విషయమై తగాదా వచ్చింది. అప్పుడు అబ్రాహాము లోతుతో నాయనా! మనం అయినవారలం. మనలో మనకు తగాదా లెందుకు? ఇక మనం వేరుపడదాం. మనచుట్టూ బోలెడంత నేలవుంది. నీవు కుడివైపుకు వెళ్తే నేను ఎడమవైపుకు వెళ్తాను. లేదా నీవు వెళ్ళు అని చెప్పాడు. అప్పుడు లోతు తూర్పువైపుకు జరిగాడు. అబ్రాహాము ఎడమవైపుకు జరిగాడు. దానితో తగాదా సమసిపోయింది. అబ్రాహాము అంత మంచివాడు. అతన్నిజూచి మనం కూడ ఇరుగుపొరుగువారితో ఒద్దికగా మెలగడం నేర్చుకోవలి -ఆది 13,8-11

# హేబేలు

## 1. నీతిమంతుడైన హేబెలు

నీతిమంతుడు హింసలకు గురౌతాడనే సత్యాన్ని కయీను హేబెలుల కథ విశదం చేస్తుంది. బైబులు మొదటి నుండి చివరిదాకా ఈ సత్యాన్ని మళ్ళామళ్ళా పేర్కొంటూఐనే వుంటుంఇ. ఒకే కుటుంబంలో పుట్టిన సోదరులు ఒకరినొకరు అంగీకరించకపోతే ఏలాంటి అనర్థాలు దాపురిస్తాయో ఈ కథ చక్కగా వివరిస్తుంది.

ఈ యన్నదమ్ములు ఆదిదంపతులైన ఆదాము ఏవల కుమారులు. కయీను సేద్యగాడు. అతడు తన పొలంలో పండిన ధాన్యాన్ని దేవునికి కానుకగా అర్పించాడు. హేబెలు గొర్రెల కాపరి. అతడు గొర్రెపిల్లలను దేవునికి కానుకగా అర్పించాడు. కాని దేవుడు హేబెలు కానుకను అంగీకరించి కయీను కానుకను త్రోసిపుచ్చాడు. ఎందుకు? ఆదికాండం చెప్పదు. కయీను హృదయం నిర్మలంగా లేదు –1యోహా 3,12. అందుచే ప్రభువు అతని కానుకను నిరాకరించాడు. దానితో కయీనుకి కోపమొచ్చింది. మొగం చిన్నబోయింది. చిర్రుముర్రులాడాడు. తమ్ముడిమీద అసూయ పెంచుకొన్నాడు. అతన్ని ఏవిధంగానైనా నాశంచేయాలని నిశ్చయించుకొన్నాడు.

హేబెలు నీతిమంతుడు. అతని హృదయం నిర్మలంగా వుంది. కనుకనే దేవుడు అతని కానుకను అంగీకరించాడు. అతడంటే ప్రభువుకి యిష్టం.

హేబెలు అన్న దుష్టబుద్ధిని పసికట్టలేదు. ఓ దినం కయీను తమ్ముడూపొలం వెళ్ళి వద్దాము రారా అని హేబెలుని పిల్చాడు. ఏకీడూ శంకింపకుండా హేబెలు అన్న వెంట వెళ్లాడు. అక్కడ కయీను తమ్మునిమీదికి దూకి అతన్ని చంపివేసాడు. అది లోకంలో తొలిహత్య, తొలిరక్తపాతం. ఆనాటినుండి ప్రపంచంలో అన్యాయపు హత్యలు కొనసాగుతూనే వున్నాయి. హేబెలు నెత్తురు (ప్రాణం) దేవుడికి మొరపెట్టింది. ప్రభూ! మా అన్న నన్ను అన్యాయంగా చంపివేసాడు. నీవు తీర్పు చెప్పు అని రోదించింది – 4,10. న్యాయవంతుడైన ప్రభువు తీర్పు చెప్పాడు. కయీను చేసిన దుర్మార్గపు పనిని ఖండించాడు. అతనికి నేల పంటలు పండదనీ అతడు దేశద్రిమ్మరి ఐపోతాడనీ శపించాడు.

## 2. హేబేలు క్రీస్తుకి చిహ్నం

నీతిమంతుడైన హేబెలు సూచించిన క్రీస్తు ఈలోకంలో అవతరించాడు. అతని లాగే ఇతడు కూడ పవిత్రుడు, నీతిమంతుడు –అ.చ. 3,14. ఐనా అతని ప్రజలే అతన్ని అన్యాయంగా హత్యచేసారు. నీతిమంతుడైన హేబెలు హత్య మొదలుకొని జకర్యాహత్య

వరకు మీరు చిందించిన భక్తిమంతుల రక్తాపరాధం మీమీదికి దిగివస్తుంది సుమా అని క్రీస్తు యూదులను ముందుగానే హెచ్చరించాడు -మత్త 23,35. కడన అతడు చెప్పినట్లే జరిగింది. దుర్మార్గులు ఆ క్రీస్తునిలాగే శతాబ్దాల పొడవునా లోకం నలుమూలలా చాలమంది నిరపరాధులను హత్యచేస్తూ వచ్చారు. ఈ నిరపరాదుల రక్తం న్యాయం చెప్పమని అన్ని కాలాల్లోను దేవునికి మొరపెడుతూనే వుంది.

హేబెలు రక్తమూ ఇతర నిరపరాదుల రక్తమూ న్యాయం చెప్పమని దేవునికి మొరపెట్టాయి. దోషులను శిక్షించమని అడిగాయి. కాని క్రీస్తురక్తం కేవలం దీనికి భిన్నంగా ప్రవర్తించింది. అది దోషులను మన్నించమని దేవునికి మనవి చేసింది. హేబెలు రక్తం దోషిని శిక్షించమని దేవుణ్ణి అడిగితే క్రీస్తురక్తం దోషిని రక్షించమని అడిగింది -హెబ్రే 12,24. తండ్రీ! వీరేమి చేస్తున్నారో వీరికే తెలియదు. కనుక నీవు వీరిని క్షమించు అని క్రీస్తు ప్రార్థనం -లూకా 23,34. ఈ విధంగా నీతిమంతుడైన హేబెలు మరణంలో తటస్థించిన పరిస్థితి నీతిమంతుడైన క్రీస్తు మరణంలో తారుమార యింది. అక్కడ శిక్షనుకోరిన నెత్తురు ఇక్కడ క్షమాపణను కోరింది.

ఐనా హేబెలు నాటికీ నేటికీ నీతిమంతుడుగానే వుండిపోయాడు. నిర్మల హృదయానికి అతడు ప్రతీక. దేవుని నమ్మి భక్తితో జీవించే వాళ్ళకు అతడు ఆదర్శంగా వుంటాడు.

## ప్రార్థనా భావాలు

1. హేబెలుది నిర్మల హృదయం. కయీనుది దుష్ట హృదయం. కనుకనే వారి కాన్కలు దేవుని అంగీకారానికీ తిరస్కారానికీ గురయ్యాయి. దేవుడు గమనించేది మన కాన్కలు గాదు, మన హృదయంలోని భావాలు.
2. దేవుడు కయీనుని ముందే మందలించాడు. నీవు మంచి పనులు చేస్తే తలయెత్తుకొని తిరుగుతావు. చెడ్డపనులు చేస్తే పాపంవచ్చి నీ వాకిట పొంచి వుంటుంది. అది నిన్ను నాశం చేస్తుంది. చేస్తే పాపంవచ్చి నీ వాకిట పొంచి వుంటుంది. అది నిన్ను నాశం చేస్తుంది. నీవు ఆ పాపాన్ని అణగద్రొక్కాలి సుమా అని హెచ్చరించాడు -ఆది 4,7. ఐనా కయీను విన్పించుకోలేదు. అసూయకు గురై మూర్ఖంగా ప్రవర్తించాడు. ఈ కయీను త్రోవలో మనం పయనించకూడదు -యూదా 11. అతనిలాగ మనం చెడ్డపనులకు పాల్పడ గూడదు -1యోహా 3,12.

3. హేబెలు విశ్వాసం గొప్పది. ఈ విశ్వాసం వల్లనే అతడు తన అన్న కయీను కంటె మేలైన కాన్కను దేవునికి అర్పించాడు. విశ్వాసం వల్లనే దేవుడు అతన్ని నీతిమంతునిగా ఎంచి అతని అర్పణను స్వీకరించాడు. హేబెలు చాలకాలం క్రితమే మరణించినా తన విశ్వాసం ద్వారా నేటికీ మనతో మాట్లాడుతూనే వున్నాడు -హెబ్రే 11,4.

## 3. నోవా

నీతిమంతుని దేవుని శిక్షను తప్పించుకొని రక్షణం పొందుతాడని నోవాకథ నిరూపిస్తుంది.

### 1. నీతిమంతుడైన నోవా

నోవా లేమెక్ కుమారుడు. అతని కాలంలో భూమి మీది నరులంతా దుష్టులై పోయారు. పాపకార్యాల్లో మునిగి దేవుణ్ణి పూర్తిగా మర్చిపోయారు. ఆ కాలంలో దైవభక్తి కలవాడు నోవా వొక్కడే -ఆది 6,9. కనుక దేవుడు దుష్టలోకాన్ని నాశంజేసి నోవా కుటుంబాన్ని మాత్రం మిగల్చాలనుకొన్నాడు. అతని ద్వారా మళ్ళా నూత్న నరజాతిని వ్యాప్తిలోని తీసుకరావాలనుకొన్నాడు. నోవా అతని కుటుంబం బ్రతికి బయటపడ్డానికి అతన్ని ఓడను నిర్మించమన్నాడు.

నోవా దేవునిపట్ల విశ్వాసం గలవాడు. దేవుని ఆజ్ఞలను ఖండితంగా పాటించే వాడు. కనుక అతడు దేవుడు చెప్పినట్లే చితిసారకపు కొయ్యతో ఓడ కట్టాడు. అతని కుటుంబమూ, ఒక్కో జంట చొప్పున సమస్త జంతువులూ వోడలోకివచ్చాయి. ఈ ప్రాణులన్నీ జలప్రళయాన్ని తప్పించుకొని బ్రతికాయి.

150 రోజుల జలప్రళయం ముగిసాక నోవా కుటుంబమూ ఇతర ప్రాణులూ వోడలోనుండి బయటికి వచ్చాయి. నోవా కృతజ్ఞతాపూర్వకంగా ప్రభువుకి బలి అర్పించాడు. దేవుడు ఆ బలిని అంగీకరించాడు -ఆది 8,20-22. అతడు నోవాతో నిబంధనం చేసికొన్నాడు. మళ్ళా జలప్రళయంతో ప్రాణికోటిని నాశంచేయనని అతనికి వాగ్దానం చేసాడు. వాగ్ధానానికి గుర్తుగా ఆకాశంలో వర్దగుడిని నిల్పాడు -9,9-17.

ఆదామునుండి మొదటి నరజాతి విస్తరిల్లింది. ఆ ప్రభువు ఆదాము ఏవలతో మీరు చాలమంది బిడ్డలనుకని వృద్ధిలోకి రండి. భూమినంతటిని వశంజేసికొనండి అని చెప్పాడు -ఆది 1,28. అతడు మళ్ళా నోవాకుకూడ ఇవే మాటలు చెప్పాడు

9,7. అనగా ఆదామునుండి మొదటి నరజాతి వ్యాప్తిజెందినట్లే, నోవానుండి నూత్న నరజాతి వ్యాప్తి చెందుతుందని భావం. అటుపిమ్మట చాలయేండ్ల తర్వాత క్రీస్తునుండి నూత్న నరజాతి ఆవిర్భవిస్తుంది. కనుక నోవా రాబోయే క్రీస్తుకి సూచనంగా వుంటాడు. వీళ్ళిద్దరూ నూత్న నరజాతికి కర్తలే.

నోవా అనే పేరుకి ఓదార్చేవాడు అని అర్థం -5,29. నోవా ఓదార్పు ఏమిటి? ప్రభువు జలప్రళయంవల్ల నాశమైన లోకాన్ని చూచి మళ్ళా నీటిముంపు ద్వారా ప్రాణి కోటిని నాశం చేయను అని నోవాకు వాగ్దానంచేసాడు. అతనితో నిబంధనం చేసికొన్నాడు -9,11-12. కనుక జలప్రళయం మళ్ళా లోకాన్ని నాశం చేయదు అనేదే నోవా మనకిచ్చే ఓదార్పు. ప్రభువు నోవాతో చేసికొన్న నిబంధనం అతని వంశజులందరికీ వర్తిస్తుంది. అతని ద్వారాసృష్టిని తనతో రాజీపర్చుకొన్నాడు.

జలప్రళయం కథ నోవాను నీతిమంతుడైన నాయకుణ్ణిగా చిత్రిస్తుంది. కాని ఆదికాండ 9,20-27 నోవాను గూర్చి మరో కథ చెప్తుంది. ఈ కథ నోవాను దురభ్యాసానికి లొంగిపోయిన బలహీనుణ్ణిగా చిత్రిస్తుంది. ఇది మరో బైబులు సంప్రదాయం. ఈ కథ ప్రకారం మొట్టమొదట ద్రాక్షతోటలను పెంచినవాడు నోవాయే. అనగా అతడు ఆనాటి వ్యవసాయంలో గొప్ప మార్పు తీసికొని వచ్చాడు అనుకోవాలి - 9,20. ఓమారు అతడు ద్రాక్షరసం తప్పత్రాగి కైపెక్కి గుడారంలో దిగంబరుడుగా పడిపోయాడు. అతనికి ముగ్గురు కొడుకులు. వారిలో హాము తండ్రి అలా పడివుండడం చూచి తన యిద్దరు సోదరులకు చెప్పాడు. ఆ యిద్దరు సోదరులు దిగంబరుడైన తండ్రికి బట్టలు కప్పారు. తర్వాత నోవాహామును శపించాడు. ఇక్కడ ద్రాక్షసారాయం నింద్యమైనదనీ, నరులు దాన్ని మితిమీరి త్రాగి వివేకం కోల్పోరాదనీ బైబులు రచయిత ఉద్దేశం.

## 2. నోవా ఆదర్శ భక్తుడు

పూర్వవేద ప్రవక్తలు, జ్ఞానులు నోవాను ఆదర్శభక్తునిగా కీర్తించారు. ప్రభువు ఆదర్శవంతుడైన నోవాతో నిబంధనం చేసికొన్నట్లే ఇతర భక్తులతోను నిబంధనం చేసికొంటాడు. అతడు నోవాకు కరుణ జూపినట్లే ఇతరులకు దయచూపుతాడు - యెష 54,9.

ప్రభువు పాపాత్ములైన ప్రజలను నాశంచేసినా భక్తులైన శేషజనాన్ని కొందరిని మిగతులనిస్తాడు. వీళ్ళద్వారా తన రక్షణ ప్రణాళికను భూమిమీద కొనసాగించుకొని

పోతాడు. నోవా ఈ శేషజనానికి గుర్తుగా వుంటాడు. పూర్వవేదం అంత్యకాలంలో వర్థిల్లిన సీరా నోవాను ఈలా కీర్తించాడు.

నోవా పరిపూర్ణ భక్తుడు
అతని వలన జలప్రళయానంతరం
నూత్న నరజాతి ఉద్భవించింది
అతనివల్లనే జళప్రళయం ముగిసా
భూమిమీద నరజాతి శేషం మిగిలింది -44,17.

నోవా, అతడు సూచించే శేషజనం భవిష్యత్తులో రానున్న మెస్సియాను సూచిస్తారు. ఈ మెస్సియా శేషజనానికంతటికీ ప్రతినిధి.

నోవా లోకాన్ని రక్షించినట్లుగా భక్తిమంతులు తమ కాలపు జనులను రక్షిస్తారు. పూర్వం జలప్రళయకాలంలో లోకం ఆశలన్నీ నోవా పడవమీదనే నిల్చాయి. దేవుడు ఆ పడవను మునగకుండా కాపాడాడు. తర్వాత ఆ పడవలోని వాళ్ళు నూత్న నరజాతి పుట్టుకకు కారకులయ్యారు. ఆదాము ప్రాతతరం నరులకు తండ్రి. నోవా నూత్నతరం నరులకు తండ్రి -సోలోమోను జ్ఞానం 14,6.

ప్రార్థనా భావాలు

1. క్రీస్తు తన బోధల్లో నోవాను ఆదర్శ భక్తునిగా పేర్కొన్నాడు. జలప్రళయ కాలంలో పాపపు నరులు దేవుణ్ణి మర్చిపోయారు. తింటూ త్రాగుతూ పెండ్లి చేసికొంటూ సుఖాలు అనుభవించారు. వాళ్లు జాగరూకులుగావుండలేదు. రానున్న దేవుని శిక్షను పసికట్టలేదు. కనుక ఆ శిక్షలో జిక్కి నాశమయ్యారు. కాని నోవా ఈలా ప్రవర్తించలేదు. అతడు అప్రమత్తుడై వున్నాడు. ప్రభువు శిక్ష త్వరలోనే వస్తుందని గుర్తించాడు. భక్తితో జీవించి ఆ శిక్షను తప్పించుకొన్నాడు. కనుక దేవుని రాకడ కొరకు భక్తితో వేచివుండే వాళ్ళందరికీ నోవా ఆదర్శంగా వుంటాడు -మత్త 24,37-38.
2. ప్రభువు నరుల పాపాలకు జలప్రళయం వస్తుందని ముందుగానే హెచ్చరించాడు. కాని ఆనాటి నరులెవ్వరూ అతని హెచ్చరికలను లెక్క చేయలేదు. వాళ్ల సుఖభోగాల్లో వాళ్ళు మునిగి తేలుతున్నారు. విశ్వాస వంతుడైన నోవా మాత్రం దేవుని నిర్ణయానికి భయపడ్డాడు. దేవుని వాక్కుకి విధేయుడై

పడవను కట్టాడు. తర్వాత జలప్రళయంలో అందరూ చావగా తాను మాత్రం బ్రతికి బయటపడ్డాడు. నోవా విశ్వాసమూ విధేయతా అతన్ని కాపాడాయి. నేడు విశ్వాసరంగంలో అతడు మనకు ఆదర్శంగా వుంటాడు -హెబ్రే 11,7.

3. నోవా సద్భక్తుడు మాత్రమే కాదు, ధర్మప్రబోధకుడు కూడ. అనగా అతడు ఆనాటి జనులను జలప్రళయాన్ని గూర్చి ముందుగానే హెచ్చరించాడు. అతని మాటలను లెక్కచేయని వాళ్ళు చచ్చారు. లోకం విన్నా వినకపోయినా మన తరపున మనం దేవుణ్ణి గూర్చి చెప్పవలిందే. వినేవాళ్ళు బాగుపడతారు. విననివాళ్ళు దైవశిక్షను కొనితెచ్చుకొంటారు -2పేత్రు 2,5.

4. దేవుని శిక్ష దుష్టులను నాశం చేస్తుంది. భక్తులను కాపాడుతుంది. జల ప్రళయంలో చాలమంది చచ్చారు. పుణ్యపురుషుడైన నోవా మాత్రం ఓడద్వారా బ్రతికాడు. అదే నీళ్ళు కొందరికి శిక్షగా మారితే నోవాకు మాత్రం రక్షగా మారాయి. అతని రక్షణం మన జ్ఞానస్నానాన్ని తలపిస్తుంది. జ్ఞానస్నాన జలం నేడు మనలను చావు నుండి కాపాడుతుంది -1పేత్రు 3,20-21.

## 4. మెల్కీసెదెకు

మెల్కీసెదెకు అబ్రాహాముకి ఇష్టుడు. క్రీస్తుని సూచించేవాడు. ఇక్కడ ఈ రెండు భావాలను క్రమంగతా పరిశీలిద్దాం.

### 1. అబ్రాహాముకి ఇష్టుడు

మెల్కీసెదెకు షాలేము పట్టణానికి రాజు, యాజకుడు. ఈ షాలేమే తర్వాత యెరూషలేము ఐంది. ఈ రాజు అబ్రాహాముకి స్నేహితుడు.

అబ్రాహాము ఓ సారి నల్గురు రాజులను యుద్ధంలో ఓడించి వస్తూండదగా మెల్కీసెదెకు రొట్టె ద్రాక్షసారాయాలను తీసికొనివచ్చి అతనికి కానుకలుగా అర్పించాడు. అతన్ని దీవించాడు -ఆది 14,18. ఇక్కడ భోజనపదార్థాలైన ఈ రొట్టె రసాల ద్వారా మెల్కీసెదెకు అబ్రాహాముతో నిబంధనం చేసికొన్నాడు. అబ్రాహాము సంరక్షణ భారాన్ని గూడ స్వీకరించాడు. అబ్రాహాము తన తరపున తాను ఆ రాజుకి కప్పం కట్టాడు - 14,20.

ఇక్కడ అబ్రాహాముని దీవించినవాడూ అతని నుండి కానుకలు పుచ్చుకొన్నవాడూ మెల్కీసెదెకు. కనుక అతడు అబ్రాహాముకంటె గొప్పవాడు. మెల్కీసెదెకు అన్యజాతులకు

గురువు. ఐనా అతడు మహోన్నతుడైన దేవుణ్ణి కొల్చేవాడు. హెబ్రేయుల గురువైన అబ్రాహాము కూడ ఈ దేవుణ్ణే కొల్చాడు. కనుక వాళ్ళిద్దరికీ పొత్తు కుదిరింది. అధికుడైన మెల్కీసెదకు తక్కువవాడైన అబ్రాహామును దీవించి సంరక్షించాడు.

2. క్రీస్తుని సూచించేవాడు

మెల్కీసెదెకు క్రీస్తుని సూచిస్తాడని చెప్తుంది హెబ్రేయుల జాబు. పూర్వవేదంలో యూదుల యాజకత్వం లేవీ తెగనుండి వచ్చింది. నూత్నవేదంలో క్రీస్తు మనకు ప్రధానయాజకుడు. కాని అతడు లేవీ తెగకు గాక యూదా తెగకు చెందినవాడు. కనుక పూర్వవేద యాజకత్వం అతనికి వర్తింపదు. అతడు పూర్వవేద యాజకుల వరుసక్రమంలో రాలేదు.

110వ కీర్తన మెస్సీయా మెల్కీసెదెకు వరుసక్రమంలో వస్తాడని చెప్తుంది. "నీవు మెల్కీసెదెకులాగ యాజకత్వాన్ని పొందుతావు. కలకాలం యాజకుడివిగా వుంటావు" అని చెప్తుంది -110,4. కనుక క్రీస్తు లేవీ వరుసలోగాక మెల్కీసెదెకు వరుసలో వచ్చిన యాజకుడు. అబ్రాహాము యాజకత్వం మెల్కీసెదెకు యాజకత్వం కంటె తక్కువది. అబ్రాహాము వంవజులైన లేవీపుత్రుల యాజకత్వం గూడ మెల్కీసెదెకు యాజకత్వం కంటె తక్కువదే. కాని మెల్కీసెదెకు వరుసక్రమంలో వచ్చిన క్రీస్తు యాజకత్వం లేవీ యాజకత్వం కంటె ఘనమైంది -హెబ్రే 7,7-10.

"మెల్కీసెదెకు" అంటే నీతిమంతుడైన రాజు. "షాలేము రాజు" అంటే శాంతిని కొనివచ్చేరాజు, క్రీస్తుకూడ నీతినీ శాంతినీ కొనివచ్చేవాడే కదా! కనుక అతడు ఇతన్ని సూచిస్తాడు. ఇంకా, ఆదికాండం మెల్కీసెదెకు తల్లిదండ్రులనుగాని, వంశావళినిగాని ఆద్యంతాలనుగాని పేర్కొనదు. అతనికి ఇవేమీలేవు. క్రీస్తుకూడ ఇవేమీ లేనివాడు. ఈ దృష్టిలో కూడా అతడు క్రీస్తుని పోలివుంటాడు. ఈ యిద్దరూ శాశ్వతులైన యాజకులు. కీర్తన 110,4 మెల్కీసెదెకు నిత్యయాజకుడని చెప్తుంది. క్రీస్తుకూడ నిత్యగురువు. లేవీవంశపు యాజకులు నిత్య గురువులు కాదు. ఈ రీతిగా మెల్కీసెదెకుకీ క్రీస్తుకీ చాల పోలికలున్నాయి -హెబ్రే 7,2-3.

## ప్రార్థనా భావాలు

1. క్రీస్తుని సూచించేవాడు గాన పూర్వవేదంలో మెల్కీసెదెకు ఉన్నతమైన వ్యక్తి. అతడు అన్యజాతులకు చెందినవాడు. ఐనా సర్వోన్నతుడైన దేవుణ్ణి తెలిసికొని అతన్నే

పూజించాడు. నీతికీ శాంతికీ నిలయమై ఒప్పాడు. కనుకనే నేడు మనం పూజలో ఇతని పేరు స్మరించుకొంటున్నాం. దేవుడు హేబెలు కానుకలనూ అబ్రాహాము బలినీ, మెల్కీసెదెకు బలినీ అంగీకరించినట్లే మనమర్పించే అప్పరసాలను గూడ అంగీకరించాలని వేడుకొంటున్నాం. దేవుడు ఒక్క యూదులు మాత్రమే కాక అన్యజాతుల వాళ్ళు కూడ మెస్సీయాను సూచించేలా చేసాడు. కనుక మెల్కీసెదకులాంటి అన్యజాతి భక్తులు కూడ మనలను క్రీస్తు దగ్గరికి చేరుస్తారు. అందుచే ఆ భక్తుణ్ణి మనం గౌరవంతో స్మరించుకోవాలి.

5. యెహోషువ

యెహోషువ యిస్రాయేలీయులకు నాయకుడు, క్రీస్తుకు సూచకవ్యక్తి. ఇక్కడ ఈ రెండంశాలను పరిశీలిద్దాం.

1. యిస్రాయేలీయులకు నాయకుడు

మోషే యిస్రాయేలీయులను ఐగుప్తునుండి తరలించుకొని వచ్చాడు. కాని వారిని వాగ్దత్త భూమికి చేర్చకముందే మరణించాడు. మోషే ప్రారంభించిన కార్యాన్ని యెహోషువ కొనసాగించాడు. కనుక పూర్వవేదచరిత్రలో అతనికి ప్రముఖస్థానం వుంది. అతడు క్రీస్తుపూర్వం 12వ శతాబ్దంలో జీవించినవాడు.

యెహోషువ మొదటలో మోషేకు సేవకుడు -సంఖ్యా 11,28. మోషే పదియాజ్ఞలు పొదటానికి కొండమీదికి వెళ్ళినపుడు యెహోషువగూడ అతనితో వెళ్లాడు. తర్వా దైవసాన్నిధ్యం ల గుడారంలో పరిచర్యలు చేసాడు. “మోషే సేవకుడైన యెహోషువ మాత్రం గుడారాన్ని వీడివచ్చేవాడు కాదు” అంటుంది నిర్గమకాండం 33,11. అనగా అతడు బాల్యప్రాయంలోనే దైవానుభూతిని పొందాడు. విశ్వాసంతో జీవించాడు.

ఈ విశ్వాసంతోనే అతడు తర్వాత కనాను మండలాన్ని వేగుచూడ్డానికి వెళ్ళాడు. అక్కడికి వెళ్ళినవాళ్ళు కనానీయులను జూచి దడిసారు. వాళ్ళమీదికి యుద్ధానికి వెళ్ళడానికి సాహసింపలేదు. కాలేబు, యెహోషువ మాత్రమే కనానీయుల మీదికి పోరాటానికి వెళ్ళడానికి అంగీకరించారు. తర్వాత ఆ తరం యిస్రాయేలీయులంతా యెడారిలోనే గతించారు. ఈ యిద్దరు మాత్రం వాగ్దత్త భూమిలో ప్రవేశించారు – సంఖ్యా 14,30.

మోషే కాలంచేయకముందు యెహోషువ మీద చేతులు చాచి ప్రార్థన చేసాడు. అతని యాత్మ యెహోషువ మీదికి దిగివచ్చింది. దానితో అతనికి బదులుగ ఇతడు యిస్రాయేలీయులకు నాయకుడయ్యాడు. ప్రభువే అతన్ని రెండవ నాయకుణ్ణిగా నియమించాడు -సంఖ్యా 27,22.

యెహోషువా దైవబలంతో కనానీయులతో యుద్ధం చేసాడు. మోషేకు తోడై యున్న దేవుడు యెహోషువాకు గూడ బాసటగా నిల్చాడు. మోషేకులాగే నీకూ నేను తోడైయుంటానని చెప్పాడు -యెహో 1,5. ఈ దైవబలంతోనే అతడు కనానీయులను గెల్చాడు. వారి దేశాన్నీ స్వాధీనం చేసికొని దాన్ని పదకండు తెగల యిస్రాయేలీయులకు పంచియిచ్చాడు.

అతడు చాలా యుద్ధాలు చేసాడు. ప్రాకారాలతో గూడిన యెరికో పట్టణాన్ని జయించాడు. ఐనా అమోరీయులతో గిబ్యోనువద్ద చేసిన యుద్ధం అతనికి గొప్ప పేరు తెచ్చిపెట్టింది. ఇక్కడే యెహోషువ శత్రువులమీద పోరాడి వారిని నాశం జేసేంత వరకు సూర్యచంద్రులు అస్తమించకుండ ఆకాశంలో నిల్చిపోయారు. ప్రభువు యెహోషువ పక్షాన యుద్ధంజేసి అతనికి విజయాన్ని ప్రసాదించాడు -10,12-14.

యెహోషువ జీవితాంతం భక్తితో జీవించాడు. చనిపోక ముందు యావే ఆజ్ఞలకు బద్ధులై యుండండని యిస్రాయేలీయులను హెచ్చరించాడు. మీరు ప్రభువుని పూజింపకపోయినా నేను నా కుటుంబం మాత్రం ఎల్లవేళలా అతన్నే సేవిస్తామని నొక్కి చెప్పాడు -24,15. యిస్రాయేలీయుల తరపున ప్రభువుతో నిబంధనాన్ని నూత్నీకరించాడు -24,25. కడన ఆ దైవసేవకుడు నూట పదియేండ్ల యీడున కన్ను మూసాడు -24,29.

## 2. క్రీస్తుకి సూచన వ్యక్తి

యెహోషువ అంటే యావే రక్షనం అని అర్థం. తన పేరుకి తగినట్లుగానే ఈ భక్తుడు మోషే తర్వాత చాలయేండ్లపాటు యిస్రాయేలీయులను రక్షించాడు. పూర్వవేద కాలం చివరలో వచ్చిన సీరా తన గ్రంథం 46,1లో ఇతన్ని ఈలా స్తుతించాడు.

నూను కుమారుడైన యెహోషువ మహావీరుడు
మోషే తర్వాత అతడు ప్రవక్త అయ్యాడు
తన పేరుకు తగినట్లుగానే జీవించి

దైవప్రజలను ఆపదనుండి రక్షించాడు
తనకడ్డువచ్చిన శత్రువులనెల్ల ఓడించి
యిస్రాయేలీయులకు వాగ్దత్తభూమిని
సంపాదించి పెట్టాడు.

ఈ యెహోషువ రాబోయే మరో యెమోషువాకి సూచనంగావుంటాడు. అతడే యేసుక్రీస్తు. హీబ్రూ భాషలో అతని పేరుకూడ యెమోషువాయే. ఆ పేరే "యేసు" ఐంది -మత్త 1,21. యెహోషువ ప్రారంభించిన రక్షణకార్యాన్నే తర్వాత యేసు తన మరణోత్థానాలతో పరిపూర్ణంగా సాధించిపెట్టాడు. ఈ యిద్దరి పేర్లు ఒకటే కావడం విశేషం.

యెహోషువ యిస్రాయేలీయులను వాగ్దత్తభూమికి చేర్చి విశ్రాంతిని దయచేసాడు. కాని ఆ విశ్రాంతి నాడు యూదులు వాగ్దత్తభూమిని చేరుకోవడంతో ముగియలేదు. నేడు మనం మోక్షాన్ని చేరుకొన్నపుడు గాని అది పూర్తిగా ముగియదు. యూదులకు వాగ్దత్త భూమిలాగే మనకు మోక్షం విశ్రాంతి స్థానం. యెహోషువలాగే మనంకూడ జీవితాంతం పోరాడి ఈ వాగ్దత్తభూమిని చేరుకోవాలి. ఈ ఉద్యమంలో అతడు మనకు ప్రేరణంగా వుంటాడు -హెబ్రె 4,8-11.

## ప్రార్థనా భావాలు

1. యెమోషువ యుద్ధవీరుడు, ప్రజలకు నాయకుడు, ప్రభువుకి నమ్మిన బంటు, పరమ విధేయుడు, భక్తిమంతుడు. అతడు వాగ్దత్తభూమిని జయించడానికి పూనుకోక ముందు ప్రభువు అతనితో "నీవు ధైర్యస్థైర్యాలను అలవర్చుకో నిర్భయంగా నిస్సంశయంగా మెలుగు, నీ దేవుడనైన నేను ఎల్లవేళల నీకు తోడై యుంటాను" అని చెప్పాడు -1,9. ప్రభువు అతనికిలాగే మనకుకూడ తోడుగా వుంటాడు. దైవ బలంతోనే నేడు మనంకూడ పనిచేయాలి.
2. యెహోషువ చనిపోకముందు యిస్రాయేలీయులతో "మీరు ప్రభువునే పూజిస్తారో లేక అన్యదైవాలనే పూజిస్తారో నిర్ణయించుకోండి" అన్నాడు - 24,14-15. నాటి యూదులకులాగే నేటి మనకు గూడ ఈ నిర్ణయం అత్యవసరం. మన భక్తికూడ ఈ నిర్ణయాన్ని బట్టే వుంటుంది.

# 6. ఏలీయా

"ఏలీయ్యాహూ" అంటే యావే నాకు దేవుడు అని అర్థం. తన పేరు సూచించి నట్లుగానే, ప్రజల్లో యావేపట్ల భక్తి సన్నగిల్లిపోయినపుడు ఆ భక్తిని పునరుద్ధరించినవాడు యేలీయా. ఈ ప్రవక్తకు నిప్పుతో సంబంధముంది. అతడు మంటలాగ పొడచూపాడు. అతని పలుకులు దివిటీలా మండాయి. అతడు మంటలతో గూడిన సుడిగాలిలో నిప్పు గుఱ్ఱాలు లాగే అగ్నిరథమెక్కి స్వర్గానికి వెళ్ళిపోయాడు -సీరా 48,1,9.

## 1. ఎడారిలో దైవ సాక్షాత్కారం

ఏలీయా యెడారిలో దైవసాక్షాత్కారం పొందిన భక్తుడు. ఆ రోజుల్లో అహాబురాజు బాలు దేవతను కొల్చేవాడు. ఏలీయా యావే భక్తుడు. కనుక అతడు రాజుతో ఘర్షణపడి అతనినుండి పారిపోయి ఎడారిలో కెరీతు వాగు దగ్గర దాగు కొన్నాడు. అక్కడ ప్రభువు ఆజ్ఞపై కాకులు ఆహారాన్ని తెచ్చి అతన్ని పోషించాయి. ఇది అతనికి కలిగిన మొదటి సాక్షాత్కారం -1రాజు 17,2-7.

అహాబు భార్య యెసబెలు బాలు ఆరాధనను ప్రోత్సహించేది. ఏలీయా ఆమె పోషించే బాలు ప్రవక్తలను చంపించాడు. ఆ రాణికి భయపడి యెడారిలోకి పారిపో యాడు. అక్కడ దేవుడు అతనికి రెండవసారి ప్రత్యక్షమయ్యాడు. దేవదూత అతనికి నిప్పులమీద కాల్చిన రొట్టెను ఇచ్చాడు. ఏలీయా ఆ రొట్టెలను భుజించి ఆ బలంతోనే నలభైరోజులు నడచిపోయి హోరేబు కొండను చేరాడు. ఆ పర్వతంమీద అతనికి మూడవసారి దైవసాక్షాత్కారం కలిగింది -1రాజు 19,4-9. పూర్వం దేవుడు మోషేకు దర్శనమిచ్చింది గూడ ఈ కొండమీదనే. ఈ విధంగా దైవదర్శనాలు పొంది యమేలీయా యావే భక్తుడయ్యాడు. తాను జీవించినంత కాలం అపారమైన భక్తిశ్రద్ధలతో యావే మతాన్ని నిలబెట్టాడు. "ఎన్నాళ్లు మీరు ఈలా యిద్దరు దైవాలను పూజిస్తారు? ప్రభువు దేవుడైతే అతన్ని పూజించండి. బాలు దేవుడైతే అతన్ని పూజించండి" అని ఆనాటి ప్రజలను తీవ్రంగా మందలించాడు -1రాజు 18,21.

## 2. ప్రభువు భక్తుడు

ఏలీయా ప్రభువుని అనన్యచిత్తంతో కొలిచిన భక్తుడు. యావే మతంపట్ల అత్యాసక్తి కలవాడు -1రాజు 19,10. ఈ యాసక్తితోనే అతదడు అహాబురాజును ప్రతిఘటించాడు. అహాబు తండ్రి ఒమ్రీరాజు సమరియా నగరాన్ని నిర్మించాడు. ఆ నగరం భోగభాగ్యాలతో విరాజిల్లింది. ఆ రాజుకి విజయాలు సిద్ధించాయి. సిరిసంపదలు అబ్బాయి. కనుక పొగరెక్కి విగ్రహాలను కొల్చాడు. అతని కుమారుడైన అహాబు తండ్రిని మించిన విగ్రహా రాధకుడు. అతడు తూరు రాజు కొమార్తెయైన యెసెబెలును వివాహమాడాడు.ఆమె పుట్టింటివారు బాలును కొల్చేవాళ్లు. కనుక ఆ రాణి యిస్రాయేలు దేశంలో బాలు మతాన్ని

ప్రచారంచేయడానికి కంకణం కట్టుకొంది. అహాబు భార్య ప్రోద్బలంపై సమరియాలో బాలు దేవతకు దేవళాన్ని నిర్మించారు. ఏలీయా ఈ యిద్దరిని ద్రోహులుగా పరిగణించి ఎదిరించారు. యెసెబెలు రాణి పోషించే బాలు ప్రవక్తలు 450 మందివున్నారు. ఏలీయా రాజుని సవాలు చేసాడు. మీరు కొలిచే బాలు నిజమైన దేవుడో లేఉక మేము కొలిచే యావే నిజమైన దేవుడో తేలిపోవాలి. మీ ప్రవక్తలు ఒక యెద్దును కోసి దాని మాంసాన్ని బలిపీఠంపై పేర్చి మీ బాలు దేవతను నిప్పు పంపమని ప్రార్థించాలి. అలాగే నేను ఇంకో యెద్దును కోసి దాని మాంసాన్ని మరో బలిపీఠంపై పేర్చి నిప్పు పంపమనిమా యావే దేవుని ప్రార్థిస్తాను. ఏ దేవుడు నిప్పు పంపి మాంసాన్ని దహిస్తాడో అతడే నిజమైన దేవుడు అని చెప్పాడు. ఆ సవాలుని ఉభయపక్షాలు అంగీకరించాయి. జనమంతా కర్మెలు కొండమీద ప్రోగయ్యారు. బాలు ప్రవక్తలు ఎంత ప్రార్థన చేసినా వారి దేవుడు పీఠంమీదికి నిప్పును పంపలేదు. కాని యేలీయా ప్రార్థన చేయగానే యావే నిప్పును పంపి రెండవపీఠంమీది మాంసాన్ని దమించాడు. పందెంలో యేలీయా గెల్చాడు. అతడు బాలు ప్రవక్తలందరినీ చంపించాడు. యావేకు విజయం, బాలుకు పరాజయం కలిగాయి -1రాజు 18.

ఏలీయా యావే మతం కొరకు మాత్రమేకాక యావే న్యాయం కొరకుగూడ పోరాడాడు. అతడు పేదవాళ్ళ కోపు తీసికొన్నాడు. అహాబురాజు నాబోతు అనే రైతును అన్యాయంగా చంపించి అతని ద్రాక్షతోటను అపహరించాడు. ప్రభువు అహాబును చీవాట్లు పెట్టడానికి యేలియాను పంపాడు. ప్రవక్త అతన్ని ఆ ద్రాక్షతోటలోనే కలసికొని నీవు ప్రభువు ఆజ్ఞమీరి దుష్కార్యం చేసావు. కనుక అతడు నిన్ను నాశం చేస్తాడు. నాబోతు నెత్తుటిని శునకాలు నాకిన తావుననే నీ నెత్తుటిని కూడ కుక్కలు నాకుతాయి అని గర్జించాడు. రాజు ప్రవక్త మాటలకు దడిసి పశ్చాత్తాపపడ్డాడు -1రాజు 21. ఈ రీతిగా యేలీయా 9వ శతాబ్దంలో యిస్రాయేలు దేశంలో యావే మతాన్నీ ధర్మాన్నీ న్యాయాన్నీ నిలబెట్టాడు.

### 3. అన్యజాతులకు దేవుణ్ణి తెలియజేసేవాడు

యావే ప్రభువు తమ జాతివాళ్లనే కాపాడతాడు అనుకొన్నారు యూదులు. కాని అతడు అన్యజాతులను గూడ కాపాడేవాడు. ఏలీయా ప్రభువు ఆజ్ఞపై సీదోను దేశంలోని సారెపతు నగరానికి వెళ్లాడు. అక్కడ అన్యజాతులకు చెందిన ఓ పేద వితంతువును కలసికొన్నాడు. అది కరవుకాలం. ఆమె పుల్లలేరుకొని తన యింట మిగిలివున్న గుప్పెడు పిండితోను చేరెడు నూనెతోను రొట్టె కాల్చుకోబోతుంది. ఏలీయా ఆమెను ముందుగా తనకు రొట్టె కాల్చి పెట్టమన్నాడు. ఆ వితంతువు అలాగే చేయగా ఆమె యింటిలోని పిండీ నూనే తరగిపోకుండా నిల్చాయి. ఆ కరవు కాలమంతా ఆమె, కుమారుడూ, ఏలీయా రోజూ భోజనం చేయగలిగారు. అహాబు పాపాల వలన దేశంమీదికి కరవు వచ్చింది. ఏలీయా దైవభక్తి వలన పేదవారికి కూడు దొరికింది.

తర్వాత ఆ వితంతువు కొడుకు చనిపోగా ఏలీయా అతని కొరకు దేవుని ప్రార్థించాడు. ప్రభూ! ఈ బాలునికి ప్రాణాలు మరల వచ్చునుగాక అని మనవిచేసాడు. పిల్లవాడు తిరిగి బ్రతికాడు. అతని తల్లి నీనోట దేవుని వాక్కు పొల్లుపోదు అని యేలీయాను కొనియాడింది. ప్రభువే జనన మరణాలకు కర్తకదా! ఈ విధంగా యేలీయా అన్యజాతుల యెదుట యావేకు సాక్ష్యం పలికాడు. అన్యులుకూడ ప్రభుని తెలిసికొని పూజించేలా చేసాడు -1రాజు 17.

### 4. ఏలీయా స్వర్గానికి వెళ్ళడం

ఏలీయా అతని శిష్యుడైన యెలీషా యోర్దాను నది దగ్గరికి వచ్చారు. ఏలీయా నీటిని గొంగళితో కొట్టగా నదిపాయలై దారి యేర్పడింది. ఆ దారిన గురుశిష్యులు ఆవలివొడ్డుకు చేరారు. ఏలీయా నేను ప్రభువు దగ్గరికి వెళ్లిపోబోతున్నాను. ఈ చివరి క్షణాల్లో నీకు ఏమి ఉపకారం కావాలో చెప్పు అన్నాడు. ఏలీషా నాకు నీ శక్తిలో రెండు వంతులు దయచేయి అని అడిగాడు. అనగా నన్ను నీ పెద్ద కొడుకులాగ చూడమనిభావం. ఏలీయా ఇది కష్టమైన కోర్కె అని చెప్పాడు. అంతలో నిప్పు గుర్రాలు లాగే అగ్నిరథం వారి మధ్యలోకి ప్రవేశించింది. ఏలీయా ఆ రథమెక్కి సుడిగాలిలో మోక్షానికి వెళ్ళిపోయాడు. ఏలీయా శక్తిలో రెండు వంతులు ఎలీషాకు సంక్రమించాయి. అతడు గురువుగారి గొంగళితో యోర్దాను నీటిని కొట్టగా పూర్వపురీతినే దారి యేర్పడింది. ఆ మార్గాన్నే అతడు తిరిగి వచ్చాడు. యెలీషాకూడ గురువుమార్గంలోనే నడచి యిస్రాయేలు దేశంలో యావే మతాన్ని నిలబెట్టాడు. గురువుగారిలాగే తానూ అద్భుతాలు చేసి ప్రజలను దేవుని దగ్గరికి రాబట్టాడు -2రాజు 2,1-18.

### 5. లోకాంతంతో తిరిగి వచ్చేవాడు

ఏలీయా గాథలు అద్భుతాలు ప్రాచీన యూదులను బాగా ఆకట్టుకొన్నాయి. పూర్వవేదంలో యేలియాను గూర్చి రెండు సంగతులు ప్రచారంలో వున్నాయి. 1.అతడు చనిపోకుండానే మోక్షానికి వెళ్ళినవాడు. 2.లోకాంతంలో ప్రభువు న్యాయతీర్పు జరుపక ముందు మళ్లా భూమిమీదికి దిగివచ్చేవాడు. కనుకనే మలాకీ ప్రవచనం 4,5 పై రెండవ అంశాన్ని గూర్చి ఈలా చెప్తుంది. "ప్రభువు మహాదినం రాకముందే నేను ఏలీయా ప్రవక్తను మీ వద్దకు పంపుతాను. అతడు తండ్రులను కుమారులను ఏకం చేస్తాడు" ఇక్కడ తండ్రులను కుమారులను ఏకం చేయడమంటే కుటుంబాల్లో అంతఃకలహాలు తొలగించి తండ్రులనూ బిడ్డలనూ రాజీపర్చడం. ఏలీయా తిరిగివచ్చి ఈ కార్యం చేసాకగాని ప్రభువు న్యాయతీర్పు తీర్చడు. ఈ యంశాన్ని గూర్చి సీరా జ్ఞానగ్రంథం 48,10 ఈలా చెప్తుంది

"నీవు నిర్ణీత సమయాన తిరిగివచ్చి హెచ్చరికలు చేస్తావనా
దేవునికోపం ప్రజ్వరిల్లక ముందే దాన్ని చల్లారుస్తావనీ
తండ్రులకూ కుమారులకూ రాజీ కుదుర్చుతావనీ
యిస్రాయేలు తెగలను ఉద్ధరిస్తావనీ
లేఖనాలు నుడుపుతున్నాయి."

## 6. స్నాపక యోహాను ఏలీయా

లోకాంతంలో తిరిగివచ్చే యేలీయా స్నాపకయోహానే అనే భావం నూత్నవేదంలో కన్పిస్తుంది. యూదులు ఏలీయా తిరిగివచ్చి ఓ దేవదూతలా తమ్ము కాపాడతాడను కొన్నారు –మార్కు 15,35–36. క్రీస్తు కూడ యోహానే యేలీయా అని శిష్యులతో చెప్పాడు –మత్త 17,10–13. కాని స్నాపక యోహాను మాత్రం నేను యేలియాను కాదని వాకొన్నాడు – యోహా 1,21. యోహాను కొంతవరకు ఏలీయాకు పోలికగా వుంటాడు. ఏలీయాలాగే యితడు కూడ తండ్రులను కుమారులను ఏకం చేస్తాడు –లూకా 1,17. స్నాపక యోహాను ఒంటెరోమాల కంబళి ధరించి నడుముకి తోలుపట్టీ కట్టి మిడతలను భుజించి పుట్ట తేనెను త్రాగినవాడు –మత్త 3,4. ఇది అతని యెడారి జీవితం. కాని పూర్వం యమేలీయా జీవితంగూడ అచ్చంగా యిలాంటిదే –2రాజు 1,8. ఈలా కొన్ని విషయాల్లో ఈ యిద్దరికి సామ్యం వుంది. కనుక యోహాను కొంతవరకు ఏలీయాకు ప్రతిబింబం.

## 7. క్రీస్తూ ఏలియా

ఐతే ఏలియాకు పూర్తి ప్రతిబింబం క్రీస్తు. అతడు నజరేతు ప్రార్థనామందిరంలో బోధించినప్పుడే తన్ను యేలియాతో పోల్చుకొన్నాడు. ఆ ప్రవక్త లాగే నేనూ అందరివద్దకు పంపబడ్డానని చెప్పుకొన్నాడు –లూకా 4,25–26. ఏలీయా సారెఫతు విధవాపుత్రుని జీవంతో లేపాడు –1రాజు 17,17–24. అలాగే క్రీస్తూ నాయీను వితంతువు కుమారుని జీవంతో లేపాడు –లూకా 7,11–16. ఏలీయా ఆకాశం నుండి నిప్పును కురిపించి ద్రోహులను శిక్షించాడు –2రాజు 1,10. క్రీస్తుకూడ పవిత్రాత్మ అనే నిప్పుని ప్రజలమీదికి తీసికొని వచ్చాడు–లూకా 12,49. ఏలియాను ఎడారిలో దేవదూత ఓదార్చాడు –1రాజు 19,5. అలాగే క్రీస్తునికూడ గెత్సెమని తోపులో దేవదూత ఓదార్చాడు –లూకా 22,43. ఏలీయా మోక్షానికి వెళ్ళేపుడు అతని ఆత్మ యెలీషా మీదికి దిగివచ్చింది –2రాజు 2,9–15. అలాగే వుత్థానక్రీస్తు శిష్యులమీదికి ఆత్మను పంపాడు –లూకా 24,49–51. ఈ పోలికలనుబట్టి ఏలీయా లక్షణాలు క్రీస్తులో అదికంగా కన్పిస్తాయి. కనుక నూత్నవేదంలో క్రీస్తు యూలీయాకు ప్రతిబింబం. పూర్వవేద వ్యక్తులను ప్రస్తావించేపుడు నూత్నవేదం మోషే అబ్రాహాము దావీదుల తర్వాత యేలీయాను ఎక్కువగా పేర్కొంటుంది.

### ప్రార్థనా భావాలు

1. ఏలీయాలోని ప్రధానగుణం దైవభక్తి. ఆ భక్తివల్లనే అతడు ఆనాటి భక్తిరహితులైన అహాబునీ అతని కుమారుడు అహస్యానీ ప్రతిఘటించాడు. దీనికి ఒక్క ఉదాహరణ చాలు. అహస్యా జబ్బుపడి ఫిలిస్తీయుల దేవుడు బాల్సెబూబును సంప్రతించ డానికి దూతల నంపాడు. తనకు ఆరోగ్యం చేకూరుతుందో లేదో తెలిసికొని రమ్మని వారిని ఆదేశించాడు. దారిలో ఏలీయా ఆ దూతలను కలిసికొని "మీరు ఫిలిస్తీయుల దేవుణ్ణి సంప్రతించడం దేనికి? యిస్రాయేలు దేశంలో దేవుడు లేడనా? దీనికి

శిక్షగదా మీరాజు ఇక పడకమీదినుండి దిగిరాడని చ చెప్పండి" అన్నాడు. ఇది అతని దైవభక్తి –2రాజు 1,6. ఈ దైవభక్తి మనకు గూడ అలవడితే ఎంత బాగుంటుంది!

2. యాకోబు జాబు ఈలా చెప్తుంది. ఏలీయా మనలాంటివాడే. అతడు వానలు కురవకూడదని ప్రార్థన చేస్తూ మూడున్నర యేండ్లు వర్షాలు పడలేదు. మళ్లా వర్షాలు కురవాలని ప్రార్థనచేస్తే వానలు పడ్డాయి. మన ప్రార్థనకూడ అతని జపంలాగే శక్తితో పనిచేస్తుంది –5,16–8. కనుక మనం కూడ భక్తితో జపం చేయాలి.

3. తబోరు కొండమీద క్రీస్తు దివ్యరూపాన్ని పొందినపుడు ఏలీయా అతనితో సంభాషించాడు –మత్త 17,3. ఇక్కడ యేలీయా పూర్వవేద ప్రవక్తలను సూచిస్తాడు. వాళ్ళ ప్రవచనం క్రీస్తులో కొనసాగుతుందనీ, పూర్వ నూత్న నిబంధనలకు సంబంధముందనీ తెలియజేస్తాడు. ఇంకా, యేలీయా క్రీస్తుతో నెరపిన యీ సంభాషణం పూర్వం అతడు హోరేబు కొండమీద దేవునితో సంభాషించడాన్ని కూడ జ్ఞప్తికి తెస్తుంది –1రాజు 19,12–13. అతడు దైవానుభూతిని పొందిన మహానుభావుడు కదా! ఆ యేలీయాలాగే మనంకూడ భక్తిభావంతో దేవుణ్ణి అనుభవానికి తెచ్చుకోవాలి. ఆ ప్రభువుతో ఏకాంతంగా, ప్రార్థనాపూర్వకంగా సంభాషించడం నేర్చుకోవాలి.

## 7. మోషే

యూదులకు మోషేలాంటి ప్రవక్త మరొకడు లేడు. ప్రభువు అతనిద్వారా యిస్రాయేలీయులకు బానిసం నుండి విడుదలను దయచేసాడు. అతనిద్వరా వారితో నిబంధనం చేసికొని వారికి ధర్మశాస్త్రాన్ని ప్రసాదించాడు.

కాని మోషే మధ్యవర్తిత్వం ద్వారా ప్రభువు యిస్రాయేలీయులకు మాత్రమే ధర్మశాస్త్రాన్ని దయచేసాడు. ఇప్పుడు అతడు తనకుమారుడైన క్రీస్తు మధ్యవంర్తిత్వం ద్వారా సకల జాతులను రక్షిస్తాడు. మోషేద్వారా ధర్మశాస్త్రం లభించింది. కాని క్రీస్తు మూలాన మనకు కృపాసత్యాలు లభించాయి –యోహా 1,17. మోషే నెలకొల్పిన నిబంధన కంటె క్రీస్తు స్థాపించిన నిబంధనం చాల గొప్పది. మోషేను గూర్చి చాల విషయాలు చెప్పవచ్చు. ఇక్కడ ముఖ్యమైన అంశాలు కొన్నిటిని పరిశీలిద్దాం.

### 1. ప్రభువు సేవకుడూ, స్నేహితుడూ

ప్రభువు చాలకాలంపాటు యిస్రాయేలీయులను తయారు చేసాకనే మోషేను ఎన్నుకొన్నాడు. అతడు బానిస జాతిలో పుట్టాడు. ఫరో కుమార్తె అతని ప్రాణాలు కాపాడింది. ఆమె సహాయంతోనే అతడు విద్యాబుద్ధులు గడించి గొప్పవాడయ్యాడు –అ.చ. 7,21

కాని ప్రభువు పిలుపునందుకొన్న పిదపనే గాని అతడు యిస్రాయేలీయులకు నాయకుడు లకాలేదు. యావే అతనికి మండుతూవున్న పొదలో దర్శనమిచ్చి తన పేరునూ తన రక్షణ ప్రణాళికనూ తెలియజేసాడు. అతడు బానిసలైన యిస్రాయేలీయు లను విడిపించుకొని రావాలని చెప్పాడు. అంతటి కార్యాన్ని నెరవేర్చడానికి నేనేపాటి వాణ్ణని మోషే జంకగా, భయపడకు నేను నీకు తోడైయుంటానని అభయమిచ్చాడు -నిర్గ 3,11-12. మోషే నత్తివాడు. మాటనేర్పరి కాఉద. కనుక ఫరో దగ్గరికి వెళ్లి మాట్లాడ్డానికి జంకాడు. కాని ప్రభువు వాక్చాతుర్యంగల అహరోనుద్వారా ఆ కొరతను తీర్చాడు -4,10-14.

ఫరో మొదట మొండికత్తి యిస్రాయేలీయులను పోనీయలేదు. కాని మోషే ప్రభువు సహాయంతో ఫరోను ఓడించి ప్రజలను బానిసం నుండి విడిపించుకొని వచ్చాడు. కనుక ప్రభువు అతన్ని నమ్మదగిన సేవకుణ్ణిగా గణించాడు. అతడు ఇతర ప్రవక్తలతో కల దర్శనాల ద్వారా పరోక్షంగా మాట్లాడేవాడు. కాని తన దాసుడైనమోషేతో మాత్రం ప్రత్యక్షంగా మాట్లాడేవాడు -సంఖ్యా 12,6-8.

మోషే ప్రభువు సేవకుడు మాత్రమే కాదు, స్నేహితుడు కూడ. నరుడు తన మిత్రునితో సంభాషించినట్లే మోషే ప్రభువుతో ముఖాముఖి సంభాషించేవాడు. ఈలాంటి భక్తులు పూర్వవేదంలో ఎందరో లేరు -నిర్గ 33,11. ఇంకా ప్రభువు మోషేకు తన పేరునుగూడ తెలియజేసాడు. అతనిపేరు "ఉన్నవాడు". బైబులు సంప్ర దాయం ఓ వ్యక్తి పేరును తెలిసికోవడమంటే అతనితో పరిచయం కలిగించు కోవడం, అతనిపై అధికారం నెరవడం గూడ. కనుక దేవుని నామాన్ని తెలిసికోవడం ద్వారా మోషేకు ప్రభువుపట్ల పరిచయమూ చనువవూ కలిగాయనుకోవాలి -నిర్గ 3,13-15.

## 2. విమోచకుడు, నిబంధన మధ్యవర్తి

ప్రభువు మోషేకు ఒప్పజెప్పిన మొదటి పని యిస్రాయేలీయులను దాస్యం నుండి విడిపించుకొనిరావడం. వారిని ప్రభువుని ఆరాధించే ప్రజలనుగా తయారుచేయడం. ఫరో ఈ యారాధనకు అడ్డమొచ్చాడు -నిర్గ 4,22-23. కనక దేవుడు మోషేద్వారా ఈజిప్టు మీదికిపది అరిష్టాలు పంపాడు. చివరి అరిష్టంలో ఆ దేశంలోని తొలిచూలు మగబిడ్డలూ ఫరో కొడుకూ కూడ చచ్చారు -నిర్గ 1,29. దానితో గుండె చెదరి ఫరో ప్రజలను పోనిచ్చాడు. ఆలా వెళ్ళకముందు మోషే ఈజిప్టులో పాస్క ఉత్సవాన్ని జరిపించాడు. ప్రజలు యావేను పూజించారు. అటుపిమ్మటఅతడు ప్రజలను రెల్లుసముద్రం గుండా అవతలికి నడిపంచాడు. ఫరోసైన్యం ఈ సముద్రంలోనే మునిగి చచ్చింది. మోషే మాత్రం ప్రజలను ఓ మందలాగ నడిపించుకొని పోయాడు -కీర్త 77,19-20. ఆ రీతిగా అతడు ప్రజలకు విమోచకుడయ్యాడు.

మోషే ప్రజలను తోడ్కొని వచ్చింది ప్రభువుని ఆరాధించడానికే. కనుక అతడు సీనాయి కొండదగ్గర బలి సమర్పించాడు. ప్రజలంతా అక్కడ దేవుణ్ణి పూజించారు. ఆ

సందర్భంలోనే ప్రభువు మోషే మధ్యవర్తిత్వం ద్వారా యిస్రాయేలీయులతో నిబంధనం చేసికొన్నాడు. మోషే ప్రజలమీదా పీఠంమీదా కోడెనెత్తురు చిలకరించి ఇది నిబంధనకు సంబంధించిన రక్తం అని చెప్పాడు -నిర్గ 24,8.

ఈ సందర్భంలోనే యిస్రాయేలీయులు మోషేలోనికి జ్ఞానస్నానం పొందారు - 1కొరి 10,2. అనగా వాళ్ళు అతన్ని అనుసరించి, మేఘం తమ్ము నడిపిస్తూండగా సముద్రాన్ని దాటి, రక్షణం పొందారు. ఆ రీతిగా అతడు ప్రజలకు నాయకుడూ విమోచకుడూ అయ్యాడు -అ.చ. 7,35. ఈ విమోచకుడు నూత్ననిబందనకు చెందిన మరో విమోచకుణ్ణి సూచిస్తాడు. అతడే క్రీస్తు. క్రీస్తు చేసిన నిబందనం మోషే నిబంధనం కంటే మరింత శ్రేష్ఠమైంది -హెబ్రే 8,6. అతడు నేడు తన నామంలోనికి జ్ఞానస్నానం పొందిన మనలందరినీ పాపంనుండీ విమోచిస్తాడు -అ.చ. 2,38.

## 3. ప్రవక్త, ధర్మశాస్త్ర ప్రదాత

మోషే యిస్రాయేలీయులకు గొప్ప ప్రవక్త. ఎప్పుడూ వారికి దైవసందేశాన్ని విన్పిస్తుండేవాడు -నిర్గ 19,6. ప్రజలుమాత్రం అతని సందేశాన్ని అట్టే ఆలించేవాళ్లుకాదు. ఐనా అతడు నిబంధన నియమాలను పాటించండని ప్రజలను నిరంతరం హెచ్చరించేవాడు.

కడన అతడు భవిష్యత్తులో తనలాంటి ప్రవక్త మరొకడు వస్తాడనీ యిస్రాయేలీయులు అతని సందేశాన్ని ఆలించాలనీ చెప్పాడు -ద్వితీ 18,15. ఈ ప్రవక్త రానున్న క్రీస్తే - అ.చ.3,20-23. ఇతనికి మోషే సాక్ష్యం పలికాడు -యోహా 4,46. కనుకనే దివ్యరూప ధారణ కాలంలో తబోరు కొండమీద క్రీస్తు ప్రక్కన మోషేకూడ కన్పిస్తాడు -లూకా 9,30.

ప్రజలకు ధర్మశాస్త్రాన్నిచ్చినవాడు మోషే -నిర్గ 20,1-20. ప్రజలు ఆ ధర్మశాస్త్రాన్ని ఖండితంగా పాటించాలని అతడు వారిని హెచ్చరించాడు -ద్వితీ 6,1-9.

నూత్నవేదంలో క్రీస్తు ధర్మశాస్త్రాన్ని నాశంచేయలేదు. దాన్ని పరిపూర్ణం చేసాడు - మత్త 5,17. అతడు ధర్మశాస్త్రంకంటె అధికుడు. దాన్ని సమాప్తం చేసైవాడు కూడ - రోమా 10,4. మోషే ధర్మశాస్త్రం, ప్రవక్తలు కీర్తనలగ్రంథం తన్నుగూర్చి చెప్పిన విషయాలన్నీ నెరవేరిన పిదపగాని అతడు ఉత్థానం కాలేదు -లూకా 24,44.

## 4. విజ్ఞాపనమూర్తి

మోసే యెన్నోసార్లు యిస్రాయేలీయుల కొరకు విజ్ఞాపనం చేసాడు. రెఫీదీము వద్ద అమాలెకీయులతో యుద్ధం జరిగినపుడు అతడు తన ప్రజలకొరకు మనవిచేసి వారికి విజయాన్ని సాధించిపెట్టాడు -నిర్గ 17,9-13. ప్రజలు బంగారు దూడను గొల్చి ప్రభువు ఆగ్రహానికి గురయ్యారు. అప్పుడు మోషే వారికొరకు మనవిచేసి దేవుని కోపం నుండి వారిని కాపాడాడు -నిర్గ 32,11-14. మోషే కనాను మండలాన్ని జయించడానికి పొమ్మన్నప్పుడు ప్రజలు అతనిమీద తిరగబడి అతన్ని రాళ్ళతో కొట్టి చంపబోయారు.

అందుచే ప్రభువు ఆ ప్రజలపై కోపించి వారిని నాశం చేయబోయాడు. అప్పుడు కూడ మోషే ఆ జనుల తరపున విజ్ఞాపనం చేసి వారిని దైవకోపాన్నుండి తప్పించాడు -సంఖ్యా 14,10-20. ఇంకా, ఎడారి ప్రయాణంలో అలసిపోయి ప్రజలు మోషే మీద తిరగబడ్డారు. దానికి శిక్షగా దేవుడు వారిని విషసర్పాలతో కరిపించాడు. అప్పుడు కూడ మోషే ఆ జనుల తరపున విజ్ఞాపనం చేసి వారిని అపాయం నుండి కాపాడారు -సంఖ్యా 21,6-9. కనుకనే కీర్తన 106,23 అతన్ని గూర్చి యిలా చెప్తుంది.

"ప్రభువు ఆ ప్రజలను నాశంజేయ నెంచాడు
కాని తానెన్నుకొనిని సేవకుడైన మోషే అతనిక డ్డుపడి
అతని కోపాన్ని చల్లార్చి వారిని కాపాడాడు."

ప్రజలు బంగారు దూడను కొల్చిన సందర్భంలో అతడు దేవునితో "నీవు ఈ ప్రజల పాపాలయినా మన్నించు, లేదా నా పేరైనా నీ గ్రంథంనుండి కొట్టివేయి" అని మనవిచేసాడు -నిర్గ 32,32. ప్రజలపట్ల అతనికున్న ప్రేమ అంతగొప్పది. ఈ ప్రార్థన ద్వారా అతడు రాబోయే బాధామయ సేవకుణ్ణి సూచించాడు. ఆ సేవకుడు "పెక్కుమంది దోషాలను భరించి వారి పాపాల పరిహారం కొరకు విజ్ఞాపనం చేసాడు -యెష 53,12.

## 5. ప్రభువు తేజస్సు

మోషే పది ఆజ్ఞలు పొందడానికి కొండమీదికి వెళ్ళినప్పుడు ప్రభువు సాన్నిధ్యం సోకి అతనిముఖం ప్రకాశించింది. ఆ ప్రకాశాన్ని చూచి ప్రజలు భయపడ్డారు. కనుక అతడు ప్రజలతో మాట్లాడినంతసేపు ముఖం మీద ముసుగువేసికొనేవాడు. దేవుని సన్నిధిలోకి వెళ్ళినప్పుడు మాత్రం ఆ ముసుగును తొలిగించేవాడు -నిర్గ 34,29-35.

పౌలుభక్తుడు ఈ సంఘటనను గూర్చి చెప్తూ మోషే కండ్లను ముసుగు కప్పి వేసి నట్లుగా అజ్ఞానం యూదుల కండ్లను కప్పివేసిందన్నాడు. ఎందుకంటే మోషే క్రీస్తుని సూచించేవాడు. అతని కథను చదివాకగూడ యూదులు క్రీస్తుని అంగీకరింపని గ్రుడ్డివారు గానే వుండిపోయారు -2కొ 3,13-15. నిజానికి మోషేను నమ్మేవాళ్ళంతా క్రీస్తునిగూడ నమ్మాలి. అతడు క్రీస్తుని గూర్చి వ్రాసాడు. ఐనా యూదులు మోషేను అంగీకరించిక్రీస్తుని నిరాకరించారు. అదే వారి గ్రుడ్డితనం -యోహా 5,46-47. ఐనా ప్రభువు తేజస్సు సోకి మోషే ముఖం ప్రకాశించినట్లుగానే పవిత్రాత్మ తేజస్సుసోకి ఉత్థాన క్రీస్తు ముఖం ప్రకాశిస్తుంది. ఆ ఉత్థాన క్రీస్తు తేజస్సుసోకి నేడు మనం కూడ ప్రకాశిస్తాం -2కొ 3,18.

స్వర్గంలోని భక్తులు మోషే ఆనాడు రెల్లుసముద్రాన్ని దాటుతూ పాడిన పాటనీ గొర్రెపిల్ల గీతాన్ని ఆలాపిస్తారు -దర్శ 15,3. రెల్లుసముద్రాన్ని దాటిన మోషే క్రీస్తు పాస్క విజయాన్ని సూచిస్తాడు. ఈ పాస్క విజయగీతాన్నే మనంకూడ మోక్షంలో కలకాలం పాడతాం.

### ప్రార్థనాభావాలు

1. మోషే స్వార్థంలేని నాయకుడు. అతడు ప్రజలను కనాను దేశంమీదికి పొమ్మన్నప్పుడు

వాళ్లు అతనిమీద తిరగబడ్డారు. అదిచూచి దేవుడు నేను ఈ జనాన్ని నాశం చేసి నీ నుండి క్రొత్తజాతిని పుట్టిస్తానన్నాడు. కాని మోషే దానికి అంగీకరించలేదు – సంఖ్యా 14,12. మరోసారి, బంగారుదూడను ఆరాధించినందుకు దేవుడు యిస్రాయేలును నాశం చేయబోయాడు. అప్పుడు మోషే ప్రజల కొరకు మనవిచేసి దేవునితో, నీవు వీళ్ళను మన్నించనైనా మన్నించు లేదా నా పేరునైనా నీ గ్రంథం నుండి కొట్టివేయి అన్నాడు –నిర్గ 32,31. ఈ యంశాలనుబట్టి అతడు ఎంత ఉత్తమ నాయకుడో తెలిసికోవచ్చు. మరి నేటి మన నాయకత్వం ఏలా వుంది?

2. ప్రభువు మోషేను ఫరో దగ్గరికి వెళ్ళమన్నాడు. తన ప్రజలను బానిసంనుండి విడిపించుకొని రమ్మన్నాడు. కాని మోషేకూడ బానిసే. అంతకుముందే అతడు ఫరోకి భయపడి పారిపోయి వచ్చాడు. ఆలాంటివాడు ఫరో దగ్గరికి వెళ్ళి అతనితో మాట్లాడగలడా? కనుక జంకాడు. కాని ప్రభువు అతన్ని ప్రోత్సహించి నేను నీకు తోడైయుంటానని చెప్పాడు –నిర్గ 3,12. తాను చెప్పినట్లే మోషేకు అండగా నిల్చాడు. కనుకనే అతడు యిస్రాయేలీయులను నడిపించుకొని రాగల్గాడు. నేడు మన కార్యాల్లోగూడ ప్రభువు మనకు తోడుగా ఉంటాడు. అతని సహాయంతోనే మనం విజయాలు సాధించేది.

3. భూమిమీది నరులందరిలోను మోషే వినయవంతుడు అని చెప్తుంది బైబులు – సంఖ్యా 12,3. యిస్రాయేలు ప్రజలు చాలాసార్లు అతనిమీద తిరగబడ్డారు. అతని అధికారాన్ని సవాలు చేసారు. అతని తోబుట్టువులైన మిర్యాము అహరోనులు కూడ అతనిపై తిరగబడ్డారు. నీ వొక్కడివే నాయకుడివా మేముమాత్రం కాదా అని దబాయించారు –సంఖ్యా 12,2. ఐనా ఆ మహానుభావుడు చలించలేదు. వినయంతో తన పనులు తాను చేసికొంటూ పోయాడు. మనంకూడ అతనిలాగ వినయాత్ములమైన నాయకులం కావాలి.

4. మోషే చాల విధాలుగ క్రీస్తుని సూచిస్తాడు. అతడు ప్రవక్త. తనలాంటి ప్రవక్త మరొకడు వస్తాడని తెలియజేసాడు. ఆ ప్రవక్తే క్రీస్తు –ద్వితీ 18,18. మోషే ద్వారా ధర్మశాస్త్రం లభిస్తే క్రీస్తుద్వారా కృపాసత్యాలు లభించాయి –యోహా 1,17. మోషే యూదులను కనాను దేశానికి చేరిస్తే క్రీస్తు మనలను మోక్షానికి చేరుస్తాడు –హెబ్రే 3,6న మోషే క్రీస్తుని సూచించేవాడు. కాని క్రీస్తు అతనికంటె గొప్పవాడు. మోషే ప్రధానంగా పూర్వవేద నిబంధనకర్త. కాని క్రీస్తు సీనాయి నిబందనం కంటె గొప్ప నిబంధనను నెలకొల్పాడు –హెబ్రే 8,6. నేడు మనం ఈ యిద్దరు నాయకులనూ భక్తితో స్మరించుకోవాలి.

# 8. దావీదు

దావీదు తన వంశంలో పుట్టబోయే మెస్సీయాకు సూచనంగా వుంటాడు. దావీదు కాలం నుండి, ప్రభువు యిస్రాయేలీయులతో నిబంధనం చేసికోవడమంటే ఒక్క దావీదు రాజుతో నిబంధనం చేసికోవడమే ఐంది. కనుకనే పూర్వవేదం చివరి కాలంలో వచ్చినసీరా

ప్రభువు దావీదుతో రాజ్యసంబంధమూన నిబంధనం చేసికొని
అతని రాజ్య నిత్యవైభవంగా కొనసాగేలా చేసాడు

అని వాకొన్నాడు -సీరా 47,11. యిస్రాయేలు సింహాసనమంటే దావీదు సింహాసనమే. దావీదు విజయాలు మెస్సీయా విజయాలకు సూచనలయ్యాయి. మెస్సీయా తన తరపున తాను ఉత్థానమై లేచి దేవుడు దావీదుకి చేసిన ప్రమాణాలన్నీ నెరవేర్చాడు -అ.చ. 13,34. ఇక, దావీదు ఇంత గొప్పవాడు ఏలాగయ్యాడో పరిశీలిద్దాం.

## 1. ప్రభువు ఎన్నుకొనిన రాజు

దేవుడు గొర్రెలను కాచుకొనే దావీదును పిలిపించి అతనికి అభిషేకం చేయించాడు -1సమూ 16,11-13. ఆ మీదట అతనికి తోడైయుండి అతని కార్యాలన్నిటినీ విజయవంతం చేసాడు. అతనికి గొల్యాతుమీద విజయం ప్రసాదించాడు -1సమూ 17,45-47. సౌలు కొలువులో వున్నపుడు అతడు చేసిన యుద్ధాల్లో గెల్పు దయచేసాడు -18,12-14. దావీదు పోరాడిన చోట్లన్నిటిలోను యావే అతనికి విజయాన్ని గెల్పు దయచేసాడు -18,12-14.

మోషేలాగే దావీదుకూడ యిస్రాయేలీయులకు కాపరి, నాయకుడు. పూర్వం ప్రభువు పితరులకు చేసిన వాగ్దానం దావీదుకి గూడ చేసాడు. ఈ వాగ్దానం ప్రకారం అతడు కనాను దేశాన్ని స్వాధీనం చేసికొన్నాడు. అతడు పూర్వం సౌలు కొలువులో వున్నపుడే ఫిలిస్తీయులతో యుద్ధాలు మొదలుపెట్టాడు. తర్వాత తాను రాజయ్యాక వాటిని ఉధృతంచేసి ఫిలిస్తీయులను ఎల్చి కనానును వశంజేసికొన్నాడు. దావీదు యెరూషలేమును జయించడంతో ఈ కనాను గెల్పు పూర్తయింది -2సమూ 5,6-10. ఈ పట్టణానికి అతడు దావీదు నగరమని పేరు పెట్టాడు. ఆ నగరాన్ని తన రాజ్యాన్ని కంతటికీ రాజధానిని చేసాడు. ఆ నగరంలోనే అతడు దైవమందసానికి నివాసం కల్పించాడు. కనుక అన్ని తెగఅల యిస్రాయేలీయులూ అక్కణ్ణే దేవుణ్ణి కొల్వడానికి ప్రోగయ్యారు -2సమూ 6,1-19. సౌలు కాలంలో ఐక్యంగాని 12 తెగలూ దావీదు కాలంలో ఐక్యమయ్యాయి. ఇది చాల గొప్ప విజయం.

## 2. యిస్రాయేలు వీరుడు

దావీదు ప్రభువు చెప్పినట్లుగా నడచుకొన్న భక్తుడు. దేవుని ఆజ్ఞమీరి అతడు ఏమీ చేయలేదు. కనుకనే శత్రువైన సౌలు ఓమారు కొండగుహలోను, మరోమారు రాత్రి శిబిరంలోను తనకు దొరికిపోయినా దావీదు అతన్ని చంపలేదు -1సమూ 24,26. ఎందుకంటే అది దైవచిత్తం కాదు. బాధల్లో గూడ అతడు "యావే నన్ను తన యిష్టం వచ్చినట్లు చేయును

గాక. నేను అతనిచేతిలోని వాడను" అనుకొన్నాడు -2సమూ 15,26. యెరూషలేము నుండి పారిపోయేప్పుడు తన శత్రువైన షిమీ తిట్టిన తిట్లును దేవుడు దీవెనలుగా మార్చు తాడనుకొన్నాడు -16,12. ప్రభువు పట్ల అతనికున్న విశ్వాసం అంత గొప్పది. అతడు కృతజ్ఞతాబావంతో ప్రభువు తనకు దయచేసిన ఉపకారాలకు వందనాలు చెప్పుకొనే వాడు -2సమూ 7,18-29. పూర్వవేదంలో "దీనులు" అనే భక్తవర్గం వుండేది. వాళ్ళు ప్రభువుని నమ్మి అతనిమీదనే ఆధారపడిజీవిస్తూ నిరంతరం అతనికి వందనాలు అర్పించేవాళ్ళు. దావీదు ఈ భక్తులకు ప్రతినిధి. అతడు దైవపరికరాల సహాయంతో ముఖ్యమైన సంఘటనలన్నిటిలోను ప్రభువు చిత్తాన్ని తెలిసికొంటూంటే వాడు -1సమూ 23,9.30,7.

ఆ రాజు మహాభక్తుడు, దేవునిమీద చాలపాటలు వ్రాసాడు. స్వయంగా వాద్యం మీటుతూ పాటలు పాడేవాడు. దేవాలయం నమూనాను సిద్ధంచేసినవాడతడే. ప్రభువుని ఆరాధించే సంప్రదాయాన్ని నెలకొల్పినవాడతడే. దేవాలయంలో ప్రభుని స్తుతించి పాటలు పాడటానికి లేవీయులను నియమించినవాడతడే.

దావీదులో లోపాలుకూడ వున్నాయి. అతడు జిత్తులమారి -1సమూ27,10-12. కొన్నాళ్ళు బందిపోటు దొంగలకు నాయకుడుగాగూడ వ్యవహరించాడు -27,8-12. అతడు ఫిలిస్టీయులరాజు ఆకీషుతో ఓ సంవత్సరం గడిపినా ఆ రాజు తన మోసాలను గుర్తించకుండా వుండేలా నడచుకోగలిగాడు -29,6-7. దావీదు తన శత్రువులమీద పగతీర్చు కోనని మాట యిచ్చాడు. కాని చనిపోతూ శత్రువులైన యోవాబు, షిమీ మొదలైన వారిపై పగతీర్చుకొమ్మని తన కుమారుడు సొలోమోనును ఆదేశించాడు -1రాజు 2,5-9. అతడు తన కుమారులను అదుపులో పెట్టుకోలేకపోయాడు. వాళ్ళు చాల దుండగాలు చేసారు. ఇక, బత్షెబా ఉదంతం అతనికి మాయనిమచ్చగా వుండిపోయింది -2సమూ 11.

ఈలాంటి లోపాలున్నా దావీదు మహానుభావుడు కూడ. యోనా తానుపట్ల అతడు చూపిన స్నేహం బైబుల్లోనే ప్రసిద్ధమైంది. జీవితాంతం అతడు సౌలుకి నమ్మినబంటుగా వుండిపోయాడు. సౌలు అతనికి ద్రోహం తలపెట్టినా అతడు సౌలుకి ద్రోహం చేయలేదు. దైవమందసంపట్ల అతడు చూపిన భక్తి అపారమైనది. దావీదు గొప్ప యుద్ధవీరుడు, రాజకీయ తంత్రనిపుణుడు. ఆ రోజుల్లో యిస్రాయేలీయులకు కావలసిన నాయకుడు ప్రధానంగా అలాంటివాడే. సంగ్రహంగా చెప్పాలంటే అతడు ప్రభువు హృదయానికి నచ్చినవాడు - 1సమూ 13,14.

## 3. మెస్సియా దావీదు కుమారుడు

దావీదు ప్రభువుకి దేవాలయం కట్టబోయాడు. కాని ప్రభువు అతన్ని వారించి "నీ కుమారుడు సొలోమోను నాకు దేవళం కడతాడు. నీవు కట్టనక్కరలేదు. కాని నీవు నాకు మందిరం కట్టాలని మంచికోరిక కోరుకొన్నావు. కనుక నేను నిన్ను బహూకరిస్తాను. నేను

నీ కొక మందిరం కట్టిపెడతాను" అన్నాడు -2సమూ 7,11. ప్రభువు దావీదుకి కట్టిపెట్టే దేవాలయం అతని రాజవంశమే. దేవుడు దావీదు రాజవంశమే. దేవుడు దావీదు రాజవంశం అవిచ్ఛనంగా కొనసాగేలా చేస్తాడు. ఈ వంశంనుండే తర్వాత మెస్సీయా ఉద్భవిస్తాడు. ఇది చాల గొప్ప వాగ్దానం, గొప్ప నిబంధనం. ప్రభువు పూర్వం సీనాయి దగ్గర యిస్రాయేలీయు లందరితోను చేసికొని నిబంధనం ఇప్పుడు ఈ దావీదు రాజుతో చేసికొనిన నిబంధనలో కలసిపోయింది. అనగా అతడు యూదులందరి తోను చేసికొన్న నిబందనం ఇప్పుడు దావీదు కుటుంబానికి పరిమితమై పోయింది. ఇకమీదట ప్రభువు దావీదు వంశజులైన రాజులద్వారా గాని యిస్రాయేలీయులను రక్షించడు. ఈ రక్షణం మెస్సీయా రాకడతో పరిపూర్ణమౌతుంది. ఈ వాగ్దానం ప్రకారం దావీదుకీ అతని వంశజులైన రాజులకీ ఎంతో విలువ వచ్చింది. వాళ్ళంతా రాబోయే మెస్సీయాను సూచించేవాళ్ళయ్యారు. ప్రభువు చాలసార్లు దావీదు వంశజుడైన రాజు ద్వారా నేను మిమ్ము రక్షిస్తానని యిస్రాయేలీయులకు మాటయిస్తూ వచ్చాడు -యెహె 35,23-24

క్రీస్తుపూర్వం 587లో దావీదు రాజవంశం అంతరించింది. బాబిలోనియారాజు నెబుకద్నెసరు యెరూషలేమును నాశంజేసి యూదులను బాబిలోనియాకు బందీలనుగా తీసికొని పోయాడు. కాని దావీదు వంవపురాజులు అంతరించినా అతని వంశం మాత్రం కొనసాగుతూనే వచ్చింది. ఆ వంశం నుండి పుట్టినవాడే యోసేపు. అతని పెంపుడుకొడుకే యేసు -మత్త 1,16-20. కనుక యేసుకి "దావీదు కుమారుడు" అని పేరువచ్చింది -మత్త 1,1.

ఈ యేసు పూర్వం ప్రభువు దావీదుకి చేసిన వాగ్దానాలను నెరవేర్చడానికి వచ్చాడు. కనుక అతడు దావీదుకంటె అధికుడు. దావీదుకి ప్రభువు -మత్త 22,44-45. అతడు దావీదులాగ ప్రజలకు కేవలం నాయకుడు మాత్రమే కాదు. వారికి దేవుడు కూడ. దావీదు వేరునుండి చిగురులాగ పుట్టుకవచ్చిన ఈ యేసు త్వరలో తిరిగి రావాలన ఆత్మావధువైన తిరుసభ నిరంతరం ప్రార్థిస్తుంటారు -దర్శ 22,16-17.

## ప్రార్థనా భావాలు

1. దావీదు మహాభక్తుడు. మందసాన్ని యెరూషలేముకి తీసుకొని వచ్చినపుడు అతడు యాజకవస్త్రాలు ధరించి తన్మయత్వంతో దానిముందు నాట్యం చేసాడు. దానిముందు బలులర్పించారు. ప్రజలకు ప్రసాదం పంచిపెట్టాడు. అతని భక్తి మనకు కూడ అలవడితే ఎంత బాగుంటుంది -2సమూ 6,13-19.
2. దావీదుకీ ఫిలిస్టీయులకీ యుద్ధం జరుగుతుంది. అతనికి బెత్లేహేము బావి నీళ్ళంటే యిష్టం. కాని ఫిలిస్టీయులు ఆ నగరాన్ని చుట్టుముట్టివున్నారు. ఐనా దావీదు వీరులు ముగ్గురు శత్రువులకు భయపడకుండా అతిసాహసంతో ఆ బావికి వెళ్ళి నీళ్లు తీసుకొనివచ్చి దావీదుకి చ్చారు. కాని అతడు ఆ నీళ్లు ముట్టుకోలేదు. వాటిని ప్రభువుకే

ధారపోసాడు. ఆ వీరులు తమ ప్రాణాలకు కూడ తెగించి బెత్లేహేము వెళ్లారు కనుక వాళ్లు తెచ్చిన నీరు వారి నెత్తురుతో సమానమన్నాడు. ఆలాంటి నీటిని తాను ముట్టనన్నాడు. దావీదుకి తన అనుచరులపట్ల అంత ఆదరం, అంత గౌరవభావం? -2సమూ 23,13-17.

3. దావీదు ఓ సారి అమాలేకీయులతో యుద్ధం చేసాడు. అలసిపోయిన అతని సైనికులు కొందరు ఆ పోరాటంలో పాల్గొనలేకపోయారు. యుద్ధంలో దావీదు గెల్చి అమాలేకీయులను దోచుకొన్నాడు. కాని పోరాడిన సైనికులు పోరాడని సైనికులకు కొల్లగొట్టిన సొమ్మును పంచిపెట్టడానికి నిరాకరించారు. అప్పుడు దావీదు జోక్యంచేసికొని పోరాడని బంటులకు గూడ భాగం ఇప్పించాడు. అతడు అంత ఉదారబుద్ధి కలవాడు -1సమూ 30,21-25.

4. అబ్సాలోముకి భయపడి యెరూషలేము నుండి పారిపోయిన దావీదు, అతన్ని ఓడించి మళ్లా నగరానికి తిరిగివస్తున్నాడు. దారిలో యోర్దాను నదివద్ద షిమీ అతన్ని కలసికొన్నాడు. ఇతడు దావీదుకి శత్రువు. ఆ రాజు నగరాన్ని వీడిపోయే పుడు అతన్ని శపించి అతనిపై దుమ్మెత్తిపోసాడు. అలాంటివాడు ఇప్పుడు దావీదు కాళ్ళమీదపడి తన తప్పును మన్నించమని వేడుకొన్నాడు. దావీదు మనసు కరిగి నేను నిన్ను చంపను అని ప్రమాణం చేసాడు. అతని క్షమాపణం అంత గొప్పది. మనం అపరాధులను మన్నిస్తూంటామా? సమూ 19,16-24.

## 9. స్నాపక యోహాను

యోహాను మహాప్రవక్త. క్రీస్తుకిసాక్షి. అతనికి ముందుగా వచ్చి మార్గాన్ని సిద్ధంచేసినవాడు. దైవరాజ్యబోధ అతనితో ప్రారంభమైంది. యోహాను కాలం వరకు మోషే ధర్మశాస్త్రం ప్రవక్తలబోధలు ఆచరణలో వున్నాయి. కాని అతనికాలం నుండి దైవరాజ్యబోధ ప్రారంభమైంది -లూకా 16,16.

### 1. ప్రభువు మార్గాన్ని సిద్ధం చేసినవాడు

యోహాను పుట్టుక పూర్వమే దేవునికి సమర్పితుడై పవిత్రాత్మతో నిండివున్నాడు -లూకా 1,15. పూర్వం సంసోనులాగ అతడు కూడ ప్రభువుకి అంకితుడై ద్రాక్షారసం మద్యం మొదలైనవాటిని ముట్టలేదు. న్యాయాధి 13,5-6. అతడు ఆల్యంనుండి యెడారిలోనే జీవితం గడిపాడు -లూకా 1,80. పూర్వం యేలీయాలాగ భక్తాగ్రేసరుల దుస్తులు ధరించాడు -2రాజు 1,8. ఒంటె రోమాల కంబళి ధరించి నడుముకి తోలుపట్టీని కట్టి మిడతలను భుజించి పుట్టతేనెను త్రాగాడు -మత్త 3,4. ఆ రోజుల్లో ఎస్సీనులనబడే యూదభక్తులు కుమ్రాను ఎడారిలో తపోజీవితం గడిపేవాళ్ళు. యోహాను కూడ కొంతకాలం వాళ్లతో జీవించి వుండవచ్చు.

మెస్సీయాకాలం సమీపించగానే అతడు దైవవాక్కు వలన ప్రబోధితుడై యెడారిని వదలి జనుల మధ్యకు వచ్చాడు -లూకా 3,2. శిష్యులను ప్రోగుజేసుకొని వారికి ప్రార్థనం ఉపవాసం మొదలైన నియమాలు నేర్పించాడు -5,33.

అతడు ప్రజలకు బోధించింది హృదయపరివర్తనం. పరలోకరాజ్యం సమీపించింది. హృదయ పరివర్తనం చెందండి - ఇది యోహాను ముఖ్యబోధ -మత్త 3,2. తర్వాత క్రీస్తు కూడ ఈ వాక్యంతోనే తన బోధను ప్రారంభించాడు -4,17. యోహాను ఈ హృదయ పరివర్తనానికి చిహ్నంగా యోర్దాను నదీ స్నానాన్ని ఎన్నుకొన్నాడు. నీళ్లు దేహమాలిన్యాన్ని కడిగివేసినట్లే పశ్చాత్తాపం ఆత్మమాలిన్యాన్ని కడిగివేస్తుందని అతని ఉద్దేశం కావచ్చు. కనుక ప్రజలు అతని యెదుట తమ పాపాలను ఒప్పుకొని యోర్దాను నదిలో స్నానం చేసేవాళ్లు -మార్కు 1,5. కేవలం అబ్రాహాము సంతానంగా పుడితేనే చాలదనీ, పాపజీవితం వదలుకొని పవిత్ర జీవితం గడపాలనీ అప్పుడే మెస్సీయా రాజ్యంలో చేరడానికి అర్హులమౌతామని యోహాను ప్రజలకు బోధించాడు -మత్త 3,8-9.

కాని పరిసయులూ ధర్మశాస్త్రబోధకులూ యోహాను బోధను అంగీకరించలేదు. వాళ్లు అతనికి దయ్యం పట్టిందనుకొన్నారు -లూకా 7,33. కనక అతడు వాళ్లను జూచి మండిపడ్డాడు. విషసర్ప సంతానమా! మీరు దైవకోపాన్ని తప్పించుకోలేరు. కనుక హృదయ పరివర్తనం చెందండి. దేవుడు మంచిపండ్లను ఈయని చెట్లను నరికి అగ్నిలో పడవేస్తాడు సుమా అని గర్జించాడు -మత్త 3,7-10.

యోహాను మహాపవిత్రుడు. పాపాన్ని సహింపనివాడు. అతడు ఆనాటి పాపపు ప్రజలందరినీ నిశితంగా ఖండించాడు -లూకా 3,10-14. ఆలాగే హేరోదుని కూడ వ్రేలెత్తిచూపాడు. కనుక ఆరాజు అతన్ని చెరలో త్రోయించాడు. కడన చంపించాడు - మత్త 14,3-10. దేవునిపట్ల దైవరాజ్యం పట్ల ఉన్న ఆసక్తిని బట్టి ప్రజలు యోహానుని నూత్నయేలియానుగా గణించారు. ఏలీయా తిరిగివచ్చి దేవుని మార్గాన్ని సిద్ధం జేస్తాడని పూర్వం ప్రవక్తలు చెప్పారు -మలా 4,5-6. క్రీస్తుకూడ యోహానుని రానున్న యేలీయాను గానే పేర్కొన్నాడు -మత్త 11,4. కాని యూదులు చాలమంది అతన్ని పట్టించుకోలేదు. అతడు వచ్చి మెస్సీయాకు మార్గం తయారుచేసినా ఆ మెస్సీయాకు సిలువమరణం తప్పలేదు -మార్కు 9,11-13.

## 2. వెలుగుకి సాక్ష్యం పలికేవాడు

యోహాను క్రీస్తుకి సాక్ష్యంపలికాడు. ఆసాక్ష్యంలోని ముఖ్యాంశం ఇది. అతడు మెస్సీయాకు ముందుగా వచ్చి అతనికి మార్గాన్ని సిద్ధం చేసేవాడు మాత్రమే. తానే మెస్సీయా కాదు. జనుల గుంపు యోహానే మెస్సీయా యేమోనని భ్రాంతి చెందింది. అతడు నేను మెస్సీయాను కాను. అతనికి ముందుగా వచ్చేవాణ్ణి. అతడు నాకంటె అధికుడు. నేను అతని పాదరక్షల వారును విప్పడానికి గూడ యోగ్యుణ్ణి కాను అని చెప్పాడు -లూకా 3,15-16. చెప్పులు విప్పడం దాసులు చేసేపని. ఆ పనికి కూడ

నేను తగనని తన్నుతాను తగ్గించుకొన్నాడు.

క్రీస్తు రాగానే యోహాను అతన్ని తన శిష్యులకు చూపించాడు. అదిగో! లోకం పాపాలను పరిహరించే గొర్రెపిల్ల అని క్రీస్తుని శిష్యులకు పరిచయం చేసాడు -యోహా 1,29. కాని క్రీస్తులోకం పాపాలను ఏలా పరిమరిస్తాడో యోహానుకి స్పష్టంగా తెలియదు. అసలు క్రీస్తు తననుండి ఎందుకు జ్ఞానస్నానం పొందుతున్నాడో గూడ యోహానుకిసరిగా తెలియదు - మత్త 3,13-15. ప్రజల పాపాలను పరిహరించడానికి క్రీస్తు మొదట సిలువ జ్ఞానస్నానాన్ని పొందాలి. సిలువ మరణం ద్వారాగాని అతడు ప్రజల పాపాలను తొలగించలేడు -లూకా 12,50. ఆ సిలువ జ్ఞానస్నానానికి ఈ యోహాను జ్ఞానస్నానం నాంది. ఆ సిలువ జ్ఞానస్నానం ద్వారానే అతడు తండ్రి సంకల్పాన్ని నెరవేర్చేది -మత్త 3,15. అతని యోర్దాను జ్ఞానస్నానం సిలువ జ్ఞానస్నానం గూడ తండ్రి ముందుగా నిర్ణయించినవే. అవి అతని రక్షణ ప్రణాళికలో వివిధ ఘట్టాలు. ఈ ఘట్టాల ద్వారానే క్రీస్తు ప్రజల పాపాలకు మన్నింపు సంపాదించి పెడతాడు.

యోహాను చెరలో వుండగా అతనికి క్రీస్తునిగూర్చి అనుమానం కలిగింది. ఆనాటి యూదులు మెస్సీయా రాజుగా వస్తాడనుకొన్నారు. రోమను ప్రభుత్వాన్ని కూలద్రోసి యూద యాకు రాజకీయ స్వాతంత్ర్యం తెచ్చిపెడతాననుకొన్నారు. కాని క్రీస్తు ఈ పనేమి చేయడం లేదు. అతడు నిరాడంబరంగా, వినయంగా, ఈలోక సంబంధమైన బలం ఏ మాత్రం లేనివాడుగా కన్పించాడు. కనుక ఇతడు మెస్సీయా యేనా అని చాలమందితో పాటు యోహానుకూడ శంకించాడు. అతని వద్దకు ఇద్దరు శిష్యులను పంపి రాబోయేవాడివి నీవా లేక మేము మరొకరి కొరకు ఎదురుచూడాలా అని అడిగించాడు. క్రీస్తు తాను చేసే అద్భుతాలను ఆ శిష్యులకు వివరించి చెప్పాడు. తన్ను గూర్చి శంకించవద్దని వారిని హెచ్చరించాడు. మెస్సియా కాలంలో ఈలాంటి అద్భుతాలు జరుగుతాయని పూర్వం ప్రవక్తలు చెప్పారు. కనుక యోహాను వాటిని చూచి రాబోయేవాడు ఈ క్రీస్తేనని నమ్మవచ్చు. నమ్మి ప్రశాంతంగా కన్ను మూయవచ్చు. క్రీస్తు మెస్సీయా కాకపోతే యోహానుమార్గం సిద్ధం జేయడానికి పడిన శ్రమంతా నిష్ప్రయోజనమౌతుంది. కారాగార శిక్ష వ్యర్థమౌతుంది. ఇప్పుడు క్రీస్తే మెస్సీయా అని నమ్మి అతడు ప్రశాంతంగా కన్ను మూయవచ్చు -మత్త 11,2-6.

### 3. పెండ్లికుమారునికి మిత్రుడు

యోహాను శిష్యుల్లో కొందరు క్రీస్తుని అనుసరించారు. కొందరు అనుసరించలేదు. వీళ్ళకీ క్రీస్తువిష్యులకీ తర్వాత ఘర్షణలు జరిగాయి. యోహాను శిష్యుల్లాగ క్రీస్తు శిష్యులు ఉపవాసం చేయరేం అనే ప్రశ్న వచ్చింది -మార్కు 2,18. దీన్నిబట్టి ఈలాంటి ఘర్షణలు ఉన్నాయనుకోవాలి. యోహాను గొప్పా క్రీస్తు గొప్పా అనే ప్రశ్న యెదురైనప్పుడల్లా ఆదిమ క్రైస్తవ సమాజం యోహాను వాక్యాలనే ఉదాహరించేది. “నా తర్వాత వచ్చే వ్యక్తి నాకంటె శ్రేష్ఠుడు. ఆయన నేను జన్మింపక పూర్వంనుండే వున్నాడు” అనే యోహాను వాక్యాలనే

యెత్తిచూపి అతని శిష్యులు నోరుమూయించేది -యోహా 1,15. యోహాను పెండ్లి కుమారుడైన క్రీస్తుకి నిజమైన మిత్రుడు. అతడు క్రీస్తునిగాంచి సంతోషించినవాడు. అలాంటివాడు క్రీస్తుతో పోటీకిరాడు. పైగా అతడు వినయవంతుడు. కనుకనే క్రీస్తు హెచ్చాలి, నేను తగ్గాలి అన్నాడు -3,27-30. అతడు క్రీస్తుని చూచి అసూయ పడలేదు కదా, తన శిష్యులను గూడ క్రీస్తు పరంజేసాడు -1,35-37.

క్రీస్తు తన తరపున తాను యోహానుని స్తుతించాడు. అతడు దేదీప్యమానంగా వెలిగే దీపమన్నాడు -5,35. నరుల్లో అతనికంటె అధికుడు లేడన్నాడు -మత్త 11,11. ఇవి గొప్పా ప్రశంసా వాక్యాలు. కాని క్రీస్తు ఈ సందర్భంలోనే పరలోక రాజ్యంలో మిక్కిలి తక్కువవాడు కూడ యోహాను కంటె గొప్పవాడౌతడన్నాడు -11,11. ఈ వాక్యం యోహానుని తక్కువ చేయదు. నూత్నవేద వరప్రసాదం పూర్వవేద వరప్రసాదం కంటె గొప్పదని మాత్రమే క్రీస్తు ఉద్దేశం. వినయవంతుడూ పెండ్లికుమారునికి మిత్రుడూ ఐన యోహానుని గూర్చి నాల్గవ సువిశేషం ఈలా చెప్తుంది. "అతడు వెలుగు కాదు. వెలుగుకి సాక్ష్యమీయడానికి వచ్చినవాడు. తన ద్వారా అందరూ క్రీస్తుని విశ్వసించడానికి అతడు వెలుగుకి సాక్ష్యమీయడానికి వచ్చాడు" -1,7-8. కనుక యోహాను సాక్ష్యాన్ని జూచి మనం క్రీస్తుని ఇంకా అధికంగా విశ్వసించాలి.

యోహాను పూర్వ నూత్నవేదాల సంధికాలంలో వున్నవాడు. అతని రాకడతో పూర్వ నూత్నవేదాలు ఒకదానితో ఒకటి కలసిపోయాయి. అతనితో మెస్సీయా ఆగమనం ప్రారంభమైంది. ఆ మెస్సీయా ద్వారానే పూర్వనూత్నవేద గ్రంథాలు అర్థవంతమౌతాయి.

## ప్రార్థనా భావాలు

1. యోహానులో కన్పించే ఓ ముఖ్యగుణం అతని వినయం. క్రీస్తు బహిరంగ జీవితం ప్రారంభించకముందు యోహానుకి గొప్ప ప్రసిద్ధి ఉండేది. అలాంటివాడు క్రీస్తు కంటపడగానే అతడు హెచ్చాలి, నేను తగ్గాలి అన్నాడు -యోహా 3,30. తాను వచ్చింది మెస్సీయాకు మార్గం సిద్ధం జేయడానికి. తానే ముఖ్యంకాదు. మెస్సీయా ముఖ్యం. కనుక యోహాను తన వుద్యమాన్ని తన ప్రాముఖ్యాన్ని వదలుకొని క్రీస్తుని నాయకుణ్ణిగా అంగీకరించాడు.
2. అతని నిర్భీకత గూడ మెచ్చుకోదగిన గుణం. అతడు నరుల అంతస్తుకీ అధికారానికీ భయపడలేదు. హేరోదు అంతటివాణ్ణి నిలదీసి నీవు నీ తమ్ముని భార్యని ఉంచు కోవడం ధర్మం కాదని ర్జించాడు -మత్త 14,4. దీనికి ప్రాణాలు సమర్పింప వలసివచ్చినా అతడు వెనుదీయలేదు.
3. యోహాను ఎడారిలో దైవప్రబోధం పొంది కఠోర జీవితవిధానాన్ని అవలంభించాడు -మార్కు 1,6. క్రీస్తుకి సాక్ష్యం పలకడం అనే తన ధ్యేయాన్ని భక్తి శ్రద్ధలతో నెరవేర్చాడు. మహానుభావుల నిష్ఠ ఈలా వుంటుంది.

# 12. బైబులు ధ్యానాలు

బైబులు భాష్యం 96-97

## విషయసూచిక


**1. దైవప్రేమ** **235**

1. షెకెము నిబంధనం 235
2. సొలోమోను దేవాలయ ప్రార్థన 236
3. ఆపదలో జిక్కిన విశ్వాసుల ప్రార్థన 237
4. అన్యజాతులకు బోధ 237
5. ఎఫెసు పెద్దలు 238
6. యాకోబు - ఏసావు 239
7. మోషే మనవి 240
8. అన్నా వేడికోలు 241
9. దావీదు కృతజ్ఞత 242
10. దావీదు పశ్చాత్తాపం 243
11. దావీదు దైవచిత్తానికి లొంగడం 244
12. షిమీ దావీదుని శపించడం 245
13. సన్మెరీబు జాబు 246
14. హిజ్కియా వ్యాధి 246
15. క్రీస్తు అపోస్తలులను ఎన్నుకోవడం 247
16. గెత్సెమని ప్రార్థనం 248

**2. సోదరప్రేమ** **249**

17. యావే మందిరంలో అతిథి 249
18. ప్రభువు కోరేదేమిటి? 250
19. నా పొరుగువాడు ఎవడు? 251

**3. విజ్ఞాపనం** **252**

20. అబ్రాహాము విజ్ఞాపనం 252
21. మోషే విజ్ఞాపనం 254
22. యిర్మీయా విజ్ఞాపనం 255
23. ఓనియాసు విజ్ఞాపనం 256
24. యెహెజ్కేలు విజ్ఞాపనం 257

**4. దేవునిపట్ల నిజాయితీ** **258**

25. వట్టిపోయిన నది 258

26. నీవు నన్ను చెరిచావు 259
27. హృదయంలోని అగ్ని 261
28. సమరయ స్త్రీ 262
29. రెండు మార్గాలు 267

# 1. దైవప్రేమ

## 1. షెకెము నిబంధనం -యెహోషువ 24,14-28

1. యిస్రాయేలీయులు ఎడారిలో చాల యేండ్లు గడిపి వాగ్దత్తభూమిని చేరుకొన్నారు. అక్కడ యెహోషువ 11 తెగలవాళ్ళకు నేలను పంచియిచ్చాడు. కనుక పూర్వం దేవుడు ప్రమాణం చేసిన వాగ్దత్తభూమి వారికి సంక్రమించి, వారి చిరకాల వాంఛ తీరింది. కాని నాయకుడైన యెహోషువ త్వరలో కన్నుమూయనున్నాడు. కాని అతడు తాను చనిపోకముందు యిస్రాయేలీయులచే మేము యావేను మాత్రమే కొలుస్తామని ప్రమాణం చేయించాలను కొన్నాడు. ప్రభువుపట్ల అతనికి గాఢమైన భక్తీ ప్రేమా వున్నాయి. తన అనుయాయులైన యిస్రాయేలీయులు మరో దేవుణ్ణి కొలవడం అతడు సహించలేడు. కనుక వాళ్ళచే ఈ ప్రమాణం చేయించాడు.

2. యెహోషువ ప్రజలందరిని షెకెము పుణ్యక్షేత్రంలోని దేవళంలో ప్రోగుజేసాడు. తాను మధ్యవర్తిగా నిల్చి ప్రజలకూ దేవునికీ మధ్య నిబంధనం చేయించాడు -24,25-27.

పితరులైన అబ్రాహాము, యాకోబు, ఈసాకుల కాలం నుండి యిస్రాయేలీయులను నడిపించుకొని వచ్చింది యావే. వారి శత్రువులందరినీ ఓడించి, కష్టాలనుండి వారిని గట్టెక్కించి కట్టకడన వాగ్దత్తభూమిలో చేర్చింది యావే. అలాంటి ప్రభువుని యిస్రాయేలీయులు తప్పక పూజించాలి. ఒకవేళ ప్రజలు ఆ ప్రభువుని విడనాడినా తనూ తన కుటుంబం మాత్రం యావేను కొలుస్తామని శపథం చేసాడు -యెహోషువా 24,15. అతని భక్తి అంత గొప్పది.

ప్రజలు, మేము నిస్సందేహంగా ప్రభువుని పూజిస్తాం. మరో దేవుణ్ణి కొలవం. మా మాటలకు మేము సాక్షులం అని ప్రమాణం చేసారు. ఆ కాలంలో యెహోషువాకులాగే వాళ్ళకు కూడ ప్రభువుమీద చెదరని భక్తి వుంది,

ఆ సందర్భంలో యెహోషువా షెకెము దేవళంలో దేవునికీ ప్రభువుకీ మధ్య నిబంధనం చేసాడు. ప్రజలు అన్యదైవాలను కొలవగూడదనీ, యావేను మాత్రే పూజించాలని శాసనం చేసాడు. ఈ ఒప్పందానికి సాక్ష్యంగా అక్కడ ఒక పెద్ద రాతిని గూడ పాతించాడు.

3. ఈ ఘట్టంలో ప్రధానంగా కన్పించేది దైవభక్తి. తమ జీవితంలో ఎన్నో వుపకారాలు చేసిన దేవుణ్ణి మర్చిపోమని ప్రజలు బాసచేసారు. అతన్ని దప్ప అన్యదైవాలను సేవించమని వాగ్దానం చేసారు. ఈ ప్రజల ప్రవర్తనం నేడు మనకుకూడ ప్రేరణం పుట్టించాలి. మన జీవితమంతా దేవునితో ముడిపడి వుంటుంది. అతని కరుణవల్ల మనం ఎన్నో కష్టాలు

తప్పించుకొన్నాం. ఎన్నో మేళ్లు పొందాం. కనుక మన బ్రతుకు నంతటినీ అతనికి అంకితం చేసికోవాలి. మన జీవితంలోని మంచిచెడ్డల్లోను అతని సాన్నిధ్యాన్ని గుర్తించాలి. జీవితాంతం అతన్ని పూజించి సూపేవించి ప్రేమిస్తామని మాట యీయాలి. ఔను, మనలను కలిగించిన ప్రభువుని గాకపోతే మరెవరిని కొలుస్తాం?

## 2. సొలోమోను దేవాలయ ప్రార్థన -1రాజు 8,22-53

1. సొలోమోను రాజు ఎన్మిందేండ్లు దేవాలయాన్ని కట్టి ముగించాడు. దేవాలయాన్ని ప్రతిష్ఠించేపుడు సుదీర్ఘమైన ప్రార్థన చేసాడు. ఈ ప్రార్థన చాల భక్తివంతమైంది. యిస్రాయేలీయులు దేవునికి ప్రార్థన చేయవలసిన అంశాలన్నీ ఈ జపంలో సూచింపబడ్డాయి. ఈ జపం నేడు మనకు గూడ ప్రేరణం పుట్టిస్తుంది.

2. దేవుడు సొలోమోను దేవళం నిర్మిస్తాడని పూర్వమే దావీదుకు వాగ్దానం చేసాడు. ఆ వాగ్దానం ఈ దేవాలయ నిర్మాణంలో నెరవేరింది -8,23-24. దావీదు సంతానం అవిచ్ఛిన్నంగా రాజ్యాన్ని పాలిస్తుందని గూడ ప్రభువు దావీదుకి బాసచేసాడు. ఆ బాస నిలబెట్టుకొమ్మని సొలోమోను ఇక్కడ దేవుణ్ణి వేడుకొన్నాడు -8,25-26.

తర్వాత సొలోమోను ఒక్కొక్క మనవి దేవుని ముందుంచి వాటిని ఆలించమని అర్థించాడు. ఆ మనవులు వరుసగా ఇవి :

1. దేవుడు ప్రజల పాపాలను మన్నించాలి 27-30
2. జనం ఒకరితో ఒకరు పోట్లాడుకొని తీర్పుకొరకు దేవళానికి వస్తే ప్రభువు వారికి తీర్పుచెప్పాలి 31-32
3. ప్రభువు యుద్ధంలో ఓడిపోయినవారి మనవి వినాలి 33-34
4. అనావృష్టిలో ప్రజల వేడికోలు వినాలి 35-36
5. కరువు, తెగుళ్లు అంటురోగాలు వచ్చినపుడు ప్రజల మనవి వినాలి 37-40
6. అన్యజాతి ప్రజలు ప్రార్థన చేసినపుడు వినాలి 41-43
7. యుద్ధానికి పోయేవాళ్ళ మొర ఆలించి వారికి విజయాన్ని దయచేయాలి 44-45
8. బాబిలోనియా ప్రవాసంలో చిక్కుకొన్నవారి మొరవినాలి 46-51
9. ప్రభువు రాజు మొర ఆలించాలి 52-53

ఇన్ని అక్కరల కొరకు చేసిన ప్రార్థన బైబుల్లో మరొకటి కన్పించదేమో! ఈ జపం మన అవసరాల్లో మనం దేవునికి ఏలా విన్నపాలు చేయాలో నేర్పుతుంది.

3. ఆ యిస్రాయేలీయుల్లాగే మనంకూడ పాపులం. పాపకార్యాలు చేసి కష్టాలు తెచ్చుకొంటాం. కాని ఆ కష్టాల్లోనైనా తెలివి తెచ్చుకొని దేవుని సన్నిధిలోకి వెళ్లాలి. అతని సహాయాన్ని అర్థించాలి. లేకపోతే నాశమైపోతాం. మన యిక్కట్టుల్లో దేవుని సన్నిధిలోకి వెళ్లి వినయంతో ప్రార్థిస్తే ఆ ప్రభువు మన ఆపదలు తీరుస్తాడు. మనం బ్రతికిపోతాం. పాపులైనాసరే మంచిబుద్ధితో దేవుని దగ్గరకి వెళ్తే చాలు, దేవుడు వారి మనవి వింటాడు. సొలోమోను ప్రార్థన మనకు నేర్పే సత్యం ఇదే.

## 3. ఆపదలో జిక్కిన విశ్వాసుల ప్రార్థన - అ.చ. 4-23,31

1. పేత్రు యేసు పేరుమీదిగా ఓ కుంటివానికి నడిచే శక్తినిచ్చాడు. ఈ యద్భుతాన్ని చూచి యెరూషలేము పైరులు ఆశ్చర్యపడ్డారు. పేత్రు యోహాను దేవళంలో బోధచేసి ప్రజలకు క్రీస్తు మీద విశ్వాసం పుట్టించారు. ఇదంతా చూచి యూదుల పెద్దలు క్రొత్తమతం వ్యాప్తిలోకి వస్తుందని భయపడ్డారు. అపోస్తులను చెరలో వేయించారు, బెదరించారు. కడన యేసుపేరుమీదిగా బోధించవద్దని హెచ్చరించి వారిని విడుదల చేసారు. అదొక చిన్న వేదహింస. కాని ఆత్మ దిగివచ్చాక అపోస్తలులు క్రీస్తుని గూర్చిబోధించకుండా వుండలేరు. కనుక పేత్రు యోహాను యెరూషలేములోని క్రైస్తవ భక్తులందరూ యూదుల వేదహింసనుండి తమ్ము కాపాడమనీ, తమకు క్రీస్తునిబోధించే ధైర్యాన్ని ప్రసాదించమనీ తండ్రిని ప్రార్థించారు. యేసు పేరిట అద్భుతాలు చేసే శక్తిని దయచేయమని వేడుకొన్నారు.

2. దేవుడు వారి మొర ఆలించాడు. దానికి గుర్తుగా వారున్న తావు కంపించింది. పవిత్రాత్మ వారిమీదికి దిగి వచ్చింది. ఈ సంఘటనకు "రెండవ పెంతెకోస్తు" అనిపేరు. ఇది ఆత్మ రెండవసారి శిష్యులమీదికి దిగిరావడం కదా!

యూదులు వేదహింస ద్వారా శిష్యుల వుద్యమాన్ని అణచివేయబోయారు. కాని శిష్యులు భక్తితో ప్రార్థనచేసి ఆ వేదహింస ద్వారానే తమ వుద్యమాన్ని బలపరచుకొన్నారు. దేవుణ్ణి ప్రేమించేవాళ్ళకు అన్నీ అనుకూలంగానే జరిగిపోతాయి కదా! -రోమా 8,28. ఆ గడియనుండి శిష్యులు ధైర్యంతో యెరూషలేములో దైవసందేశం విన్పింపసాగారు -4,31.

3. ఈ సంఘటనం నుండి మనం నేర్చుకోవలసిందేమిటి? ఆపదల్లో దడవకూడదు. వినయంతో దేవునికి ప్రార్థన చేయాలి. ఆ ప్రార్థన ద్వారా దేవుడు మనకు ధైర్యాన్నీ ఇక్కట్టుల నుండి బయటపడే శక్తినీ గూడ ప్రసాదిస్తాడు. ఎప్పుడు గూడ కష్టాలు మన విశ్వాసాన్ని పెంచుతాయి. అసలు దేవుడు మనకు కష్టాలను పంపేది మనలను తన దగ్గరికి రాబట్టుకోడానికే.

## 4. అన్యజాతులకు వేదబోధ -అ.చ. 13,1-4.

1. అపోస్తలుల చర్యలు అనే పుస్తకం శిష్యులు ఆత్మశక్తితో వేదబోధ చేయడాన్ని వర్ణిస్తుంది. ఈ బోధ మూడంచెలుగా జరుగుతుంది. మొదట యెరూషలేములోను అటుపిమ్మట యూదియా సమరయ సీమల్లోను బోధ జరుగుతుంది. కట్టకడన అన్యజాతులకు వేదబోద చేస్తారు. తొలి రెండు ఘట్టాల్లో పేత్రు యోహాను మొదలైన వాళ్ళు ముఖ్యులు. మూడవ ఘట్టంలో ప్రధానపాత్ర పౌలు. కనుక ప్రస్తుత వేదభాగం పౌలు ప్రేషితోద్యమం ఏలా ప్రారంభమైందో చెప్తుంది.

2. ఆ రోజుల్లో రెండు క్రైస్తవ కేంద్రాలుండేవి. పేత్రు మొదలైనవాళ్లు యెరూషలేములో పెద్దలు. పౌలు అతని మిత్రుడు బర్నబా అంటియోకయలో పెద్దలు. ఈ యంటియోకయలో భక్తులు ప్రార్థనలూ ఉపవాసాలూ చేస్తుండగా పవిత్రాత్మ ఆ బృందంలో ఓ అతన్ని

ప్రేరేపించింది. తన పనికై పౌలునీ బర్నబానీ పంపాలనీ అతనితో చెప్పించింది.

భక్తులు ఆత్మ పిలుపుని అర్థం చేసికొని అన్యజాతులకు వేదబోధ చేయడానికి పైలునీ బర్నబానీ పంపారు. అలా పంపేప్పుడు గూడ మళ్లా ఉపవాసముండి ప్రార్థనలు చేసారు. ఈ ప్రార్థనా వాతావరణంలో పౌలు ప్రేషితోద్యమం ప్రారంభమైంది. అది ప్రధానంగా ఆత్మ తలపెట్టిన పని.

పేత్రు మొదలైనవాళ్లు మొదటినుండి యూదులకు క్రీస్తుని గూర్చి బోధిస్తూనే వున్నారు. యూదులు క్రైస్తవ సమాజంలో చేరారుగూడ. కాని అన్యజాతివాళ్లయిన గ్రీకు రోమను ప్రజలకు క్రీస్తునిగూర్చి చెప్పడమేలాగన్నది ఆ రోజుల్లో పెద్ద సమస్య. అన్యజాతులనుండి అంతకుముందే ఇతియోపీయుడు, కొర్నేలి మొదలైనవాళ్లు క్రైస్తవులయ్యారు. కాని వీళ్లు కేవలం ఇద్దరు ముగ్గురు వ్యక్తులు మాత్రమే. ఈలా కొందరు వ్యక్తులు క్రైస్తవమతంలో చేరితే చాలదు. అన్యజాతి జనులను బృందాలుగా తిరుసభలోనికి తీసికొనిరావాలి. ఈ కార్యలు ప్రారంభించినవాడు పౌలు. అతనితో అన్యజాతులకు వేదబోధ చేయడమనేది పెద్ద వుద్యమంగా తయారైంది. ఈ చరిత్ర అపోస్తలుల చర్యలు 13వ అధ్యాయంనుండి ప్రారంభమౌతుంది. ఇక్కడ పేర్కొన్న సంఘటనంతో ప్రారంభించి పౌలు చాల గ్రీకు పట్టణాల్లో క్రైస్తవ సమాజాలు స్థాపించాడు. యూదులుకాని అన్యజాతి ప్రజలను ఎందరినో క్రైస్తవమతంలోకి తీసకొని వచ్చాడు

3. మనం ఏ వుద్యమాన్ని ప్రారంభించినా ప్రార్థనతో, పవిత్ర భావాలతో ప్రారంభించాలి. ఆత్మనుండి ప్రేరణం పొంది మరీ ప్రారంబించాలి. ఈలా ప్రారంభించిన ఆర్యక్రమాలు పై పౌలు వేదబోధలాగే సత్ఫలితాన్నిస్తాయి. ఈలా కాకుండ కేవలం మానవ ప్రయత్నంలో, స్వార్థప్రయోజనాల కొరకు ప్రారంభించిన వుద్యమాలు మంచి ఫలితాలు ఈయవు. అసలు అవి నిలవ్వు.

5. ఎఫెసు పెద్దలు అ.చ. 20,36-38

1. పూర్వాంశంలో పౌలు అన్యజాతులకు వేదబోధను ఏలా ప్రారంభించాడో చూచాం. ప్రస్తుతాంశంలో ఆ వేదబోధ ఏలా ముగిసిందో చూస్తాం. పౌలు గ్రీకు రోమను ప్రజలకు మూడేండ్లపాటు వేదబోధ చేస్తూ మూడు ప్రేషిత ప్రయాణాలు చేసాడు. ఆయా పట్టణాల్లో క్రైస్తవసమాజాలను నెలకొల్పాడు. అవే తొలినాటి తిరుసభలు. మూడవదీ చివరిదీ ఐన ప్రయాణంలో అతడు మిలేతు నగరానికి వచ్చాడు. ఎఫెసు సంఘ పెద్దలను అచటికి పిలిపించాడు. వారికి తన చివరి సందేశాన్ని విన్పించాడు. పౌలు మిలేతునుండి యెరూషలేముకి వెళ్తాడు. అక్కడ యూదులు అతన్ని బందీనిచేసి రోముకి పంపుతారు. పౌలు రోములో చెరలో కన్ను మూస్తాడు. కనుక అతడు ఇక వేదబోధ చేసేదీలేదు, క్రైస్తవ సమాజాలను నెలకొల్పేది లేదు. కనుక పౌలు ఎఫెసు పెద్దలను మళ్లా కంటితో చూడదు.

2. 20,18-38 వచనాలు పౌలు ఎఫెసు పెద్దలకు చేసిన వీడ్కోలు ఉపన్యాసం. కాని అది అతడు స్థాపించిన తిరుసభలన్నిటికీ చెప్పిన తుది సందేశం అనుకోవాలి. అన్యజాతి క్రైస్తవులకు అతడు వ్రాసియిచ్చిన వ ఈలునామా అనుకోవాలి. ఈ వేదభాగంలోని ముఖ్యభావాలు ఇవి. పౌలు మూడేండ్లు కష్టపడి ఎఫెసు పౌరులకు వేదబోధ చేసాడు. పౌలు తర్వాత వాళ్ళు అతని బోధను కల్తీ చేయకూడదు. అతని సంప్రదాయాన్ని ఉన్నదాన్ని ఉన్నట్లుగా ఖండితంగా పాటించాలి. ఎఫెసు పెద్దలు అతన్ని మళ్లా కంటితో జూడరు అతడు ఎవరి సొమ్ముమీదా ఆధారపడి జీవించలేదు. తన చేతులతో పని జేసికొని పొట్టబోసికొన్నాడు.

పూర్వాంశంలో పౌలు ప్రార్తనా వాతావరణంలో తన ప్రేషితోద్యమాన్ని ప్రారంభించాడని చెప్పాం. ప్రస్తుతాంశంలో అతడు మళ్లా ప్రార్థన వాతావరణంలోనే ఆ వుద్యమాన్ని ముగించడాన్ని చూస్తాం. అక్కడ అంటియోకయ ప్రార్థనాబృందం అతన్ని పనిమీద పంపింది. ఇక్కడ ఎఫెసు నుండి వచ్చిన ప్రార్థనాబృందం పనిని విరమిస్తున్న పౌలుకి వీడ్కోలు చెప్పింది. ఆ పెద్దలందరితోపాటు పౌలు కూడ అక్కడే మోకరిల్లి ప్రార్థించాడు -20,36.

3. మనం దేవుని పేరుమీదిగా ఓ పని ప్రారంభించేపుడూ ప్రార్థన చేయాలి. ఈ ప్రార్థన దైవసహాయాన్ని అడుగుకోవడానికి. అటుపిమ్మట దేవుని పేరుమీదిగా ఆ పనిని ముగించేపుడూ ప్రార్థన చేయాలి. ఈ ప్రార్థన ప్రభువుకి వందనాలు చెప్పడానికి. మనం ముగించినపని ఈ నేలమీద పదికాలాలపాటు నిల్చేలా చేయమని దేవుణ్ణి అర్థించడానికి. మన పనులూ వుద్యమాలూ నిల్చేదీ, కొనసాగేది దైవబలం వల్లనే కదా!

ఇంకా, పౌలు ఎక్కడికి వెళ్లినా ఒక వ్యక్తిగా పనిచేయలేదు. ఒక బృందంగా పనిచేసాడు. అతనివెంట ఎప్పుడూ శిష్యబృంద ముండేది. భక్తబృందం గూడ వుండేది. ఇక్కడ ఎఫెసు భక్తులను చూచాం గద్యూ! వ్యక్తిగతంగా ప్రేషితసేవ చేయడం మంచిదే. కాని ఓ బృందాన్ని కూర్చుకొని ఆ సేవచేయడం ఇంకా మంచిది. పదిమంది వున్నకాడ దేవుడుంటాడు.

## 6. యాకోబు - ఏసావు ఆది 32,2-12

1. యాకోబు మోసగాడు. వంచనతో అన్నకు రావలసిన జ్యేష్ఠభాగం కొట్టేసాడు -25,29-34. అన్నకు దక్కవలసిన ఈవెనను కాజేసాడు -27,27-30. అందుకు ఏసావు యాకోబు తిత్తి తీయాలనుకొన్నాడు. కాని తల్లి రిబ్కా అతని కోపు తీసికొంది. ఏసావుకి తెలియకుండా అతన్ని పద్దనారాములోవున్న తన మేనమామ లాబాను వద్దకు పంపింది. యాకోబు అక్కడ మేనమామనుగూడ బోల్తా కొట్టించాడు. అతని యిద్దరు కూతుళ్లయిన లెయా రాహేళ్ళను పెండ్లియాడాడు. గొర్రెలు గొడ్లరూపంలో అపారమైన ఆస్తి గడించాడు. చాల యేండ్లయినా తర్వాత ఆలుబిడ్డలతో, పసుమందలతో కనాను

మండలానికి తిరిగివచ్చాడు. ఏసావు తమ్ముణ్ణి చూడ్డానికి ఎదురువచ్చాడు. అతడు తమ్ముడు చేసిన అపకారాలన్నీ మర్చిపోయి ప్రేమభావంతోనే వచ్చాడు. కాని యాకోబు అన్న తన్నెక్కడ చితకగొట్టి కసి తీర్చుకుంటాడో అని భయపడ్డాడు. ఆ సందర్భంలో అతడు దేవునికి ప్రార్థన చేసాడు.

2. పద్దనారామునుండి స్వదేశంలోని చుట్టాల దగ్గరికి తిరిగిరమ్మని యాకోబుని ఆజ్ఞాపించింది దేవుడే -32,9. కనుక తన తిరుగు ప్రయాణంలో తన్ను సురక్షితంగా కాపాడే పూచీ దేవునిదే. పైగా అతని సంతానం సముద్రపుటిసుకవలె లెక్కల కందని రీతిగా విస్తరిల్లుతుందని గూడ దేవుడే ప్రమాణం చేసాడు -32,12. మరి యిప్పుడు ఏసావు తన్ను చంపివేస్తే దేవుని ప్రమాణం ఏలా నెరవేరుతుంది? కనుక ఏసావు దెబ్బనుండి తన్ను కాపాడే పూచీగూడ దేవునిదే. పై యాకోబు ప్రార్థనలో ఈ రెండు భావాలు నిగూఢంగా వున్నాయి.

దేవుడు యాకోబు మొర ఆలించాడు. ప్రభువు ఏసావుని యాకోబుపట్ల ప్రసన్నుణ్ణి చేసాడు. కనుక అతడు తమ్ముణ్ణి ప్రేమతో ఆదరించాడు. అన్నదమ్ముల మధ్య పొరపొచ్చాలు పోయి అనురాగం చోటుచేసికొంది.

3. ఈ యాకోబులాగే మనంకూడ ఆపదల్లో నమ్మకంతో దేవుణ్ణి శరణువేడాలి. ఆ ప్రభువు మన బాధలు తీర్చేవాడు. మన శ్రేయస్సును కోరేవాడు కనుక వినయంతో నమ్మకంతో, భక్తిభావంతో మన కష్టాలను అతనికి తెలియజేసికోవాలి. మన తరపున మనం ఈలా తెలియజేస్తే మీదటి సంగతిని అతడే చూచుకొంటాడు.

## 7. మోషే మనవి - సంఖ్యా 11,10-15

1. యిస్రాయేలీయులు తలబిరుసు ప్రజలు. వాళ్లు ఎప్పుడూ యావేమీదా అతని బంటయిన మోషేమీదా తిరగబడుతూనే వుంటారు. అతడు అనిష్టంతోనే ఆ ప్రజలకు నాయకుడయ్యాడు. నాయకుడైనప్పటినుండి ప్రజలు అతన్ని తిప్పలు పెడుతూనే వచ్చారు. ఇబ్బందులు ఎదురైనప్పుడెల్ల వాళ్ళు దేవునిమీద మోషేమీదా తిరగబడి నిష్ఠురాలు పల్కేవాళ్ళు. మీరు మమ్మల్ని ఐగుప్తునుండి ఎందుకు తీసుకవచ్చారని సుమ్మర్లు పడేవాళ్ళు.

ఎడారిలో కిబ్రోతు హట్టావా అనే తావు దగ్గరికి వచ్చినపుడు యిస్రాయేలీయులకు మాంసం తినాలని కోరిక పుట్టింది. వాళ్ళ తలంపులు ఐగుప్తుమీదికి వెళ్లాయి. అక్కడ చేపలు, దోసకాయలు, పుచ్చకాయలు, వెల్లుల్లి కడుపార తిన్నాంగదా అనుకొన్నారు. ఎడారిలో దిక్కుమాలిన మన్నా ఒక్కటి దక్క ఇంకేమి దొరకదుగదా అని గొణుగుకొన్నారు -11,4-6. వారి సణుగుడంతా విని మోషే దేవునికి మనవి చేసాడు.

2. మోషే ప్రజలతో విసిగిపోయాడు. కనుక అతడు ఈ ప్రార్థనలో దేవుణ్ణి చాల ప్రశ్నలు అడిగాడు. ప్రభూ! నీవు నన్నింతగా మోయవలసిన బాధ్యతనాకెందుకు? వీళ్ళకు కావలసినంత మాంసంపెట్టి వీళ్ళ కోరిక తీర్చే శక్తి నాకెక్కడిది? ఇవి మోషే ప్రశ్నలు. ఈ ప్రశ్నలకు దేవుడు జవాబు చెప్పడని మోషేక్కు ముందుగానే తెలుసు. ఐనా అతడు తన

హృదయంలోని వ్యధను దేవునిముందు ఒలకబోసికోకుండా వుండలేకపోయాడు.

కడన అతడు నేనొక్కణ్ణే ఈ ప్రజలను భరాయించలేనని దేవునికి ఖండితంగా జెప్పి వేసాడు. నీవు నాపట్ల అతిక్రూరంగా ప్రవర్తిస్తున్నావు. ఈలాగైతే నన్ను చంపివేయడమే మేలు అని తెగించి పల్కాడు.

ఐనా మోషే తన పనిని మానలేదు. ప్రజల సుమ్మర్లనూ తిరుగుబాటునూ సహిస్తూగూడ వారికి నాయకుడుగా వ్యవహరిస్తూనే వచ్చాడు. దేవుడు అతని కష్టాలను తొలగించక పోయినా తన వరప్రసాదబలంతో అతన్ని ఆదుకొంటూనే వచ్చాడు. కెనుకనే మోషే నలభైఏండ్లపాటు ఆ తలబిరుసు జనంతో వేగింపగలిగాడు. తన జీవితంలోని కష్టాలన్నిటినీ సహింపగలిగాడు.

3. బాధల్లో మనం దేవునికి ప్రార్థన చేస్తాం. జపం జేసాంగదా అని దేవుడు మన కష్టాలను దిడీలున తొలగింపడు. అవి అలాగే వుంటాయి. కాని వాటిని భరించే శక్తినిమాత్రం ప్రభువు మనకు ప్రసాదిస్తాడు. అతని వరప్రసాద బలంతో మనం ముందుకి వెళ్తాం. ఈలా వరప్రసాద బలంతో కష్టాలను భరించడం వలన పుణ్యాన్ని ఆర్జిస్తాం. మోక్షబహుమతికి అర్హులమౌతాం. ఇది చాలు కదా!

8. అన్నా వేడికోలు -1సమూ 1,9-18

1. ఎల్కానాకు అన్నా, పెనిన్నా అని యిద్దరు భార్యలు. వారిలో అన్నా గొడ్రాలు. యూదుల భావాల ప్రకారం సంతానం దేవుని వరాన్నీ, బిడ్డలు లేకపోవడం దేవుని శాపాన్నీ సూచిస్తాయి. కనుక పెనిన్నా నీవు గతిలేనిదానివని అన్నాను దెప్పిపొడిచేది. అన్నా దుఃఖంతో క్రుంగిపోయేది.

2. ఒకసారి ఎల్కానా అతని భార్యలు దేవుణ్ణి కొలవడానికి షిలో నగరానికి యాత్ర వెళ్ళారు. అన్నా అక్కడ దేవళంలోనికి వెళ్ళి దేవునిముందు బోరున ఏడ్చింది. దేవా! నాకో మగబిడ్డను ప్రసాదించావంటే వాణ్ణి నీకే కానుకగా అర్పించుకొంటానని మొక్కుకొంది.

ఆమె వేదనతో హృధయంలోనే ప్రార్థన చేసికొంటూంది. భక్తిభావం వలన పెదవులు కదలుతున్నాయి గాని నోటివెంట మాటలు మాత్రం వెలువడ్డంలేదు. అంతా మౌనప్రార్తన. మామూలుగా యూదులు పెద్దగా అరుస్తూ ప్రార్థన చేసేవాళ్ళు. అన్నా ప్రార్థన దీనికి విరుద్ధంగా వుంది. కనుక అన్నా ముఖాన్ని పరిశీలిస్తున్న యాజకుడు ఏలీ ఆమె తప్పత్రాగిందేమో అనుకొన్నాడు. ఆ ద్రాక్ష సారాయపు కైపు వదలించుకో అన్నాడు. కాని అన్నా అయ్యా! నేనిక్కడికి త్రాగిరాలేదు. నేను తీరని వ్యధతో బాధపడుతున్నాను. దేవుని ముందు మనసువిప్పి ప్రార్థన చేస్తున్నాను అని చెప్పింది. ఏలి అమ్మా! యిస్రాయేలు దేవుడు తప్పక నీ మొర ఆలిస్తాడు అని అన్నాను దీవించాడు. ఆ యాజకుని పలుకుల ద్వారా దేవుడే అన్నాకు అభయమిచ్చాడు. తర్వాత ఆమె దుఃఖం తీరిపోయింది. దేవుడు అన్నాను కరుణించి ఆమెకు సమూవేలు అనే బిడ్డణ్ణి ప్రసాదించాడు.

3. ఇక్కడ అన్నా దేవునిముందు తన కష్టసుఖాలు చెప్పుకొంది. మనసువిప్పి ప్రార్థన చేసింది. ఆమె మాటలతో జపించింది. మన ప్రార్థనలో తరచుగా మాటలుంటాయి గాని హృదయముండదు. ఈ ప్రజలు నన్ను పెదవులతో గౌరవిస్తు న్నారుగాని వీళ్ళ హృదయాలు నాకు దూరంగా వున్నాయి అంటుంది యెషయా ప్రవచనం -29,13. కనుక ప్రార్థనలో మాటలుకాదు, హృదయం ముఖ్యం. అన్నాది చిత్తశుద్ధిగల ప్రార్థన.

9. దావీదు కృతజ్ఞత - 2సమూ 7,28-29

1. దావీదు రాజు దైవమందసాన్ని యెరూషలేముకి తీసుకొనివచ్చాడు. కాని తాను దేవదారు ప్రసాదంలో వసిస్తూంటే దైవమందసం వట్టి దేరాలో పడివుంది. కనుక ఆ రాజు దైవమందసాన్ని వుంచడానికి దేవాలయాన్ని కట్టాలని సంకల్పించు కొన్నాడు. నాతాను ప్రవక్త తొలుత దావీదు సంకల్పాన్ని అంగీకరించాడు. కాని తర్వాత దైవ ప్రబోధితుడై రాజును దేవాలయం కట్టవద్దని శాసించాడు. అతని కుమారుడు సొలోమోను దేవళాన్ని కడతాడని చెప్పాడు. కాని భక్తిభావంతో తనకు దేవళాన్ని కట్టగోరినందున దేవుడు దావీదుని మెచ్చుకొన్నాడు. తానేదావీదుకు ఓ మందిరం కట్టిపెడానని వాగ్దానం చేసాడు -7,11. ఈ మందిరమే దావీదు రాజవంశం. అవిచ్ఛిన్నమైన ఈ వంశం నుండే స్తుతులు అర్పించాడు.

2. దావీదు దేరాలో మందసం ముందు కూర్చుండి ప్రభువుకి వందనాలు చెప్పాడు. అతని ప్రార్థనలో రెండంశాలున్నాయి. మొదటిది, దేవుడు యిస్రాయేలును కరుణించాడు. వారిని ఐగుప్తునుండి తోడ్కొనివచ్చి తన ప్రజలనుగా జేసికొన్నాడు. వారికి వాగ్దాత్తభూమిని దయచేసాడు. లోకంలోని ప్రజలందరిలోను వారిని గొప్పవారిని చేసాడు. ఇందుకు దావీదు దేవునికి వందనాలు చెప్పాడు -7,23-24.

రెండవది, దేవుడు అనామకుడైన దావీదును తన భక్తునిగా ఎన్నుకొన్నాడు. ఇది దావీదుకు ఆశ్చర్యంకలిగించింది. ప్రభూ! నీవు నన్నింతగా పెద్దజేయడానికి నేనేపాటి వాణ్ణి? నా కుటుంబం ఏపాటిది? అని దావదు దేవునికి విన్నవించుకొన్నాడు -7,18. ఔను, పొలంలో గొర్రెలు కాచుకొనే దావీదును కొనివచ్చి ప్రభువు అతన్ని తన ప్రజలకు నాయకుణ్ణి చేసాడు. ఈ కారుణ్యాన్ని ఆరాజు మర్చిపోలేదు. కనుక హృదయపూర్వకంగా దేవునికి వందనాలు అర్పించుకొన్నాడు. నీవు ఈ సేవకుని కరుణించావు. ఇక నేను విన్నవించుకోదగ్గది ఏముంది అని వినయంతో పల్కాడు -7,20.

3. అన్నా ప్రార్థనలో మన కష్టాల్లో దేవునికి ఏలా మొరపెట్టాలో చూచాం. ఈ దావీదు ప్రార్థనలో మన సుఖాల్లో దేవునికి ఏలా వందనాలర్పించాలో నేర్చుకొంటాం. ఆ దావీదులాగే మనంకూడ అల్పులం. ఐనా ప్రభువు మనలను నానా వరాలతోను, విజయాలతోను బహూకరించాడు. మనకేదో ప్రత్యేక భాగ్యాన్ని కూడ దయచేసాడు. కనుక మనం మేరమీరిన కృతజ్ఞతా భావంతో, భక్తిపారవశ్యంతో దేవుణ్ణి స్తుతించాలి.

ఆ రాజులాగే మనం కూడ ప్రభూ! నీవు నన్నింతగా గౌరవించడానికి నేనేపాటి వాణ్ణి? ఇక నేడు విన్నవించుకోదగ్గదేముంది? నీవు నన్ను దీవిస్తే నేను కలకాలం బ్రతికిపోతాను అని వినయంతో విన్నవించుకోవాలి. ఈలా మన కష్టసుఖాల్లోను మనసువిప్పి దేవునికి ప్రార్థన చేయాలి. అంతేగాని దేవునినుండి నానా భాగ్యాలు స్వీకరించిన పిదప గూడ మూగెద్దులా మౌనంగా వుండిపోకూడదు. పైపెచ్చు నా సామర్థ్యం వల్ల నేనే ఈ విజయాలన్నీ సాధించానని గర్వంతో పొంగిపోకూడదు. మనకున్నవన్నీ దేవుడిచ్చినవే. మన సొంతం ఏమైనా వుంటే అవి మన పాపాలు మాత్రమే.

## 10. దావీదు పశ్చాత్తాపం -2సమూ 12,1-14

1. దావీదు ఊరియా అనే సైనికుని భార్యబత్షెబాను మోహించాడు. ఊరియాను మోసంతో యుద్ధంలో మొదటి వరుసలో పెట్టించి చంపించాడు. బత్షెబాను తన యింటికి తీసికొనివచ్చి తన భార్యను చేసికొన్నాడు. కాని అతడు చేసినపని ప్రభువుకి పంపాడు. నాతాను రాజుకి పశ్చాత్తాపం కలిగించడానికి నాతాను ప్రవక్తను పంపాడు.

2. అతడు రాజుతో అయ్యా! ఓ నగరంలో ఓ ధనవంతుడు ఓ పేదవాని గొర్రెపిల్లను బలాత్కారంగా తీసికొని తన చుట్టానికి విందు చేయించాడు. చూచావా అని చెప్పాడు. దావీదు అలాంటి దుష్కార్యానికి వొడిగట్టినవాడు ప్రాణాలు కోల్పోవాలి అన్నాడు. అతడు నాల్గువంతులు నష్టపరిహారం చెల్లించుకోవాలి అన్నాడు. వెంటనే నాతాను అందుకొని ఆ దుర్మార్గుడివి నీవే. నీకు ఇందరు భార్యలుండగా ఊరియా భార్యను ఎందుకు అపహరించాడు? ఊరియాను అన్యాయంగా యుద్ధంలో ఎందుకు చంపించావు? అని ప్రశ్నించాడు. ప్రభువు దావీదు కుటుంబంలో అంతఃకలహాలు పుట్టిస్తాడనీ, అతని భార్యలు మానభంగానికి గురౌతారనీ చెప్పాడు.

బలహీనతలవల్ల పాపం చేసినా దావీదు మంచిరాజు. అతడు తన్నుతాను సమర్థించుకోలేదు. తన తప్పును తెలిసికొని పశ్చాత్తాపపడ్డాడు. నేను యావేకు ద్రోహంగా పాపంచేసాను అని వొప్పుకొన్నాడు. నరహత్య, వ్యభిచారం చేసినందుకు దావీదు ప్రాణాలు కోల్పోవాలి. ఈ శిక్షను దావీదే స్వయంగా ప్రకటించాడు -12,5-6. ఐనా అతడు చిత్తశుద్ధితో పశ్చాత్తాపపడ్డాడు కనుక ప్రభువు అతన్ని బ్రతకనిచ్చాడు. అతనికి బత్షెబాకు పుట్టిన బిడ్డడు మాత్రం మరణిస్తాడు -12,13-14

ఈ సంఘటనంలో నాతాను దావీదును దేవునిముందు నిలబెట్టాడు. దేవుని వాక్యం దావీదు తప్పును ఖండించి అతని మీద శిక్షను ప్రకటించేలా చేసాడు. మామూలుగా నరులు పాపంచేసి దేవుని శిక్షను తప్పించుకోజూస్తారు. దేవుని కంట బడ్డానికి జంకుతారు. పూర్వం ఆదిదంపతులు పాపంజేసి దేవుని యెదుటికి రాకుండా చెట్లనడుమ దాగుకొన్నారు -ఆది 3,8. కాని యిక్కడ దావీదు ఈలా చేయలేదు. అతడు చిత్తశుద్ధితో తన తప్పుని వొప్పుకొన్నాడు. దేవుని ముందట నిల్చి నేను దోషినని

అంగీకరించాడు. మంచి ప్రార్థన ఎప్పుడు కూడ నిజాయితీతో కూడివుంటుంది.

3. మన తరపున మనం ఏవేవో తప్పులు చేస్తాం. తర్వాత దేవుని వాక్యం చదువు కొంటూంటే ఆ వాక్యం మనలను చీవాట్లు పెడుతుంది. మన తప్పును ఎత్తి చూపుతుంది. మన అంతరాత్మను మేలుకొల్పి మనలను చీవాట్లు పెడుతుంది. ప్రభువు పలుకు రెండంచుల కత్తిలాగ మన గుండెల్లోకి చొచ్చుకొనిపోయి మన తప్పులను పరిశీలించి చూస్తుంది. ఓ న్యాయాధిపతిలాగ మనం దోషులమని తీర్పుచెప్తుంది. అప్పుడు మనం నిజాయితీతో మన తప్పును అంగీకరించాలి -హెబ్రే 4,12.

దావీదులాగ మనంకూడ పశ్చాత్తాపపడితే ఆ పశ్చాత్తాపం మన దోషాన్ని కడిగివేస్తుంది. మనలను ఉత్తమ మానవులను చేస్తుంది. భక్తిపరులను గావిస్తుంది. దావీదు "ప్రభువుకి నచ్చిన హృదయం కలవాడు" -1సమూ 13,14. పశ్చాత్తాప జపంద్వారా మనంకూడ దావీదులాంటి వాళ్ళమౌతాం. దావీదు పశ్చాత్తాపాన్ని తెలియచేసే ఈ సంఘటనం మనకుకూడ జీవితంలో చాలసార్లు అనుభవానికి వస్తుంది.

11. దావీదు దైవచిత్తానికి లొంగడం -2సమూ 12,15-23

1. ఊరియాను చంపించి బత్షెబాను అపహరించిన పిమ్మట దేవుడు దావీదుకి చావు తప్పించాడు. కాని రాజు శిక్షను పూర్తిగా తప్పించుకోలేదు. రాజుకు బదులుగా బత్షెబాకు పుట్టిన కుమారుడు చనిపోవలసి వచ్చింది. ఈ బిడ్డడి తరపున దావీదు దేవునికి మనవి చేసాడు. దైవశిక్షగా శిశువు చనిపోయాడు. ఆ పాపడు చనిపోయినపుడు దావీదు దేవునిమీద సుమ్మర్లు పడలేదు. దైవచిత్తానికి లొంగాడు.

2. బత్షెబా అన్నా ఆమెకు పుట్టిన బిడ్డడన్నా దావీదుకి ఎంతో ప్రీతి. కనుకనే అతడు పస్తుండి, కటిక నేలపై పరుండి, ఆ శిశువు కొరకు జపించాడు. వట్టి నేలపై పరుండడం తన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసికోవడానికీ, దేవుని అనుగ్రహం సంపాదించడానికీ. కాని దావీదు ఎంత వేడినా ప్రభువు కరుణించలేదు. పాపడు చనిపోవలసి వచ్చింది.

బిడ్డ ప్రాణాలను తీసినందుకు దావీదు దేవునిమీద సుమ్మర్లు పడలేదు. దైవచిత్తానికి తలొగ్గాడు. శిశువు పోయాడని వినగానే కోవెలకు పోయి దేవునికి వందనాలర్పించాడు. తాను దైవచిత్తానికి బద్ధుణ్ణని తెలియజేసికొన్నాడు. ఇంటికి వచ్చి నిర్విచారంగా భోజనం చేసాడు. ఆ పసికందును మృతలోకంనుండి వెనక్కు తీసుకొని రాలేనని రాజుకి తెలుసు, ఓనాడు తాను ఆ బిడ్డ దగ్గరికి వెళ్లాలిసిందేగాని అతడు మళ్లా తన దగ్గరికి రాడని రాజు గ్రహించాడు. కనుక దావీదు దైవచిత్తానికి జోహారులర్పించి ఊరకున్నాడు. అతని విశ్వాసం ఎంతమాత్రం చలించలేదు.

3. ఈ జీవితంలో మనం ఏవేవో వస్తువులు కోరుకొంటాం. వాటికొరకు మక్కువతో దేవుని ప్రార్థిస్తాం. దేవుడు మన కోర్కెలు తీరుస్తాడని ఆశిస్తాం. కాని మనకు ఏది మంచిదో ఏది మంచిదికాదో, అసలు దైవచిత్తమేమిటో ఎవరికి తెలుసు?

దేవుడు మన కోరికలను నిరాకరిస్తాడు. మనం ఉసూరుమంటాం. ఐనా మనం దేవుని చిత్తానికి లొంగవలసిందే. దేవునిమీద గొణగకుండా అతని నిర్ణయానికి కట్టుపడి వుండవలసిందే. అతనిపట్ల భక్తి విశ్వాసాలు నిలుపుకోవలసిందే. దేవునిమీద అలిగి ప్రార్థనను ఆపివేయకుండా పూర్వంలాగ జపిస్తూ పోవలసిందే. మన జీవితంలోని సంఘటనలన్నిటిలోను తుది నిర్ణయం భగవంతునిదే. దైవనిర్ణయానికి తలొగ్గేవాడే నిజమైన భక్తుడు.

12. షిమీ దావీదుని శపించడం -2సమూ 16,5-13

1. అబ్షాలోము దావీదుమీద తిరగబడ్డాడు. అతనికి దడిసి దావీదు యెరూషలేము నగరాన్ని విడిచి పారిపోయాడు. ఈ పలాయనం అతని జీవితలో కల్లా దైన్యమైన సంఘటనం. ఈ పలాయనంలో సౌలు బంధువైన షిమీ దావీదుని అవమానించాడు. ఐనా రాజు అతనిమీద ప్రతీకారం తీర్చుకోలేదు. ఆ యవమానంలో గూడ దేవుని హస్తాన్ని గుర్తించి వినయంగా వుండిపోయాడు.

2. దావీదు సౌలునీ అతని కుమారులనూ అన్యాయంగా అణగద్రొక్కి వారి రాజ్యాన్ని అపహరించాడనే వదంతా వుంది. కనుకనే యిక్కడ సౌలు బంధువైన షిమీ నగరంనుండి పారిపోయే దావీదుని శపించి అతనిమీద రాళ్ళు రువ్వాడు. దుమ్మెత్తి పోసాడు. నీవు రక్తపాతానికి ఒడిగట్టావు. ఇపుడు నీ యపరాధమే నిన్ను నాశం జేసింది. యావే చెడబడా తిట్టాడు. ఆ తిట్టులను సహించలేక దావీదు సైన్యాధిపతుల్లో ఒకడైన అభీషయి షిమీ తల ఎగరగొడతానన్నాడు. కాని దావీదు అందుకు సమ్మతించ లేదు. ప్రభువే నన్ను శపించమని ఇతన్ని పురికొల్పాడేమో! వద్దనడానికి మనమెవ్వరం? యావే నా దైన్యాన్ని గుర్తించి ఇతని శాపాలకు మారుగా నాకు దీవెనలే యిస్తాడేమో అని పల్కాడు. యింతటి అవమానంలోగూడ దావీదు దేవుని హస్తాన్ని చూడగలిగాడు. అది దేవునివల్లనే సంభవించిందనుకొని తనకు కలిగిన పరాభవాన్ని సహించి ఊరకున్నాడు. ఈలా మానావమానాల్లోను భగవత్సాన్నిధ్యాన్ని గుర్తించేవాడు దొడ్డ భక్తుడు కదా! ఇక్కడి సంఘటనంలో ప్రత్యేక ప్రార్థన యేమీలేదు. దావీదు అవమానాల్లో కూడ దేవుని హస్తాన్ని గుర్తించడమే ప్రార్థన.

3. ఈ జీవితంలో మనకు ఆదరణమూ అనాదరణమూ, కీర్తి అపకీర్తి రెండూ ప్రాప్తిస్తాయి. అల్పులు కీర్తిని గ్రహించి అపకీర్తిని వదలించుకోజూస్తారు. కాని భక్తులు అపకీర్తిలో గూడ దేవుని హస్తాన్ని గుర్తిస్తారు. కనుక కీర్తినిలాగే అపకీర్తిని గూడ గ్రహిస్తారు. అపకీర్తి అవమానాల ద్వారా గూడ దేవుడు మనలను అధిక పుణ్యవంతు లను జేస్తాడు. నిందల ద్వారా గూడ మనకు తన వరప్రసాదాన్ని మెండుగా దయచేస్తాడు. క్రీస్తు సిలువమార్గం అవమానాలతో కూడింది కాదా? అతని శిష్యులమైన మనకు మాత్రం ఆ మార్గం తప్పుతుందా?

## 13. సన్హెరీబు జాబు –2రాజు 19,14-19

1. సన్హెరీబు అనే అస్సిరియా రాజు యెరూషలేం మీదికి దాడిచేసాడు. హిజ్కియా రాజును బెదిరిస్తూ జాబు వ్రాసి పంపాడు. నీ దేవుడు నా బారినుండి నిన్ను కాపాడలేడు. ఇంతవరకు అస్సిరియా రాజులు నానా రాజ్యాలను కూలద్రోసారు. ఆ రాజ్యాల దేవుళ్ళు నా దాడినుండి ఆ రాజ్యాల ప్రజలను కాపాడలేకపోయారు. ఇప్పుడు నీ దేవుడు మాత్రం యెరూషలేం పట్టనాన్ని నా బారినుండి ఏలా కాపాడతాడు? కనుక ఈ నగరాన్ని నా వశం జేయి –ఇది సన్హెరీబు వ్రాసింది. ఆ జాబు రాజునీ యావే ప్రభువునీ గూడ అవమానిస్తూంది.

2. హిజ్కియారాజు చాల భక్తికలవాడు. దేవుణ్ణి నమ్మినవాడు. అతడు శత్రువు జాబుని దేవాలయంలోనికి తీసుకొనిపోయి ప్రభువు ఎదుట పెట్టి ప్రార్థన చేసాడు. అస్సిరియా రాజులు చాల రాజ్యలను నాశంచేసినమాట నిజమే. కాని ఆ రాజ్యాల దేవుళ్ళు నిజమైన దైవాలు కారు. వాళ్ళు నరులు మలచిన రాతిబొమ్మలు, కొయ్య బొమ్మలు. ఆ విగ్రహాలు ఆ రాజ్యాలను కాపాడలేవు కదా! కాని యావే ప్రభువు సజీవుడైన దేవుడు. యెరూషలేమును కాపాడగల సమర్థుడు, అలాంటి దేవుడు సన్హెరీబు నుండి తన్ను రక్షించాలి –ఇది హిజ్కియా ప్రార్థన.

ఈ జపంలో హిజ్కియాకు దేవునిపట్ల వున్న నమ్మకం వ్యక్తమౌతుంది. అస్సిరియా రాజులాంటి మహాబలవంతుడు తన మీదికి ఎత్తివచ్చినపుడు గూడ అతడు ప్రభువుననే నమ్మాడు. దేవుని మీదనే భారం వేసాడు. విశ్వాసమంటే యిదికదా! అతని నమ్మకం వ్యర్థంగాలేదు. ఆరాత్రే ప్రభువు దూత అస్సిరియా సైనికులను చాలమందిని చంపివేసాడు. అదిచూచి సన్హెరీబు భయపడి ముట్టడిని ఆపివేసి స్వీయదేశానికి తిరిగి పోయాడు.

3. జీవితంలో ఒకోసారి మనకు పెద్ద ఆపదలే ఎదురౌతాయి. మన విశ్వాసం చలిస్తుంది. భయం కలుగుతుంది. దేవుణ్ణి నమ్మబుద్ధి పుట్టదు. కాని భక్తి కలవాళ్ళు ఈలాంటి ఘోరవిపత్తుల్లో కూడ ప్రభువుని ఆశ్రయిస్తారు. అన్నిటినీ విడనాడి అతని సహాయం మీదనే ఆధారపడతారు. ప్రభువు ఆ భక్తులగోడు వింటాడు. పై సంఘటనంలో జరిగింది ఇదే. నీతిమంతులు విశ్వాసంతో జీవిస్తారు –హబక్కూకు 2,4.

## 14. హిజ్కియా వ్యాధి –2 రాజు 20,1-6

1. హిజ్కియా జబ్బుపడ్డాడు. యెషయా ప్రవక్త అతన్ని చూడ్డానికి వచ్చి నీ యింటిని చక్కబెట్టుకో. ఇక నీవు బ్రతకవు అని హెచ్చరించాడు. హిజ్కియాకు ఎంతో దుఃఖం కలిగింది. ఇక నరమాత్రులెవరూ తన ప్రాణాలు కాపాడలేరు. కనుక అతడు జనులనుండి తన ముఖాన్ని ప్రక్కకు త్రిప్పుకొని గోడవైపు మళ్లాడు. ఆశతో దేవునివైపు చూచాడు. బోరున ఏడ్చాడు. ప్రభూ! ఇన్నాళ్ళు చిత్తశుద్ధితో నిన్నే సేవించాను. నీ చిత్త ప్రకారమే జీవించాను అని ప్రార్థించాడు.

2. ఈ ప్రార్థనలో హిజ్కియా తన అవసరమేమిటో తెలియజేయలేదు. కాని ఇన్నాళ్ళు చిత్తశుద్ధితో దేవుణ్ణి సేవించానని చెప్పుకొన్నాడు. అతని అంతరాత్మే దీనికి సాక్ష్యం. తాను ప్రభువుని నిజాయితీతో సేవిస్తే, ఇప్పుడు ప్రభువు తన్ను మరణంనుండి కాపాడాలి కదా? అది అతని బాధ్యత కదా?

ప్రభువు హిజ్కియాను చేయి విడువలేదు. అతని కన్నీళ్లను అనాదరం చేయలేదు. దేవుడు శీఘ్రమే అతని వ్యాధిని తొలగించి అతనికి ఆరోగ్యాన్ని ప్రసాదించాడు. అతని ఆయుష్షుని పదిహేనేళ్ళు పొడిగించాడు కూడ.

3. జీవితంలో ప్రమాదం ముంచుకొని వచ్చినప్పుడూ, ఇక ఆశలేదనిపించిన పుడూ గూడ మనం దేవునివైపు మళ్ళాలి. నమ్మకంతో అతని సహాయం అడుగు కోవాలి. ఇంకా, మన జీవితానికి మన ప్రార్థనకీ దగ్గర సంబంధం వుంటుంది. మనం జీవించినట్లే ప్రార్థిస్తాం. ప్రార్థించినట్లే జీవిస్తాం. హిజ్కియా భక్తిగా జీవించాడు గనుకనే భక్తితో ప్రార్థించగలిగాడు. భక్తితో ప్రార్థించాడు గనుకనే రోగం నుండి బయటపడ గలిగాడు. దుష్టజీవితం గడిపినవాళ్ళు అతనిలా నమ్మకంతో జపించలేరు.

ఇక్కడ ఇంకో విషయం గూడ వుంది. ఈ ప్రార్థనలో హిజ్కియా అంతరాత్మ అతనితో నీవు మంచి జీవితమే గడిపావు కనుక నీ యాపదలో దేవుణ్ణి సహాయం చేయమని అడుగు, అతడు నీ మొర వింటాడు అని చెప్పింది. మన ప్రార్థనలో మన అంతరాత్మ కూడ ఈలా సాక్ష్యం పలకగలిగి వుండాలి. మంచివాళ్ళ అంతఃకరణం ఈలా సాక్ష్యం పలుకుతుంది. చెడ్డవాళ్ల అంతఃకరణం ఈలా సాక్ష్యం పలకలేదు.

మన ప్రార్థనలో మన అంతరంగం మనలను సమర్థిస్తే దేవుడు మన మొర తప్పక వింటాడు. ఆ యంతరంగం అతని స్వరమే కదా! మన అంతరంగం మనలను సమర్థించకపోతే దేవుడు మన మొరవినడు. అనగా మనది దొంగ ప్రార్థన అన్నమాట.

## 15. క్రీస్తు అపోస్తలులను ఎన్నుకోవడం -లూకా 6,12-13

1. యేసు ప్రార్థన చేసికోవడానికి కొండకు వెళ్ళి రాత్రంతా జపంలో గడిపాడు. ఉదయాన శిష్యులను పిల్చి వారిలో పండ్రెండు మందిని ఎన్నుకొన్నాడు. వారికి అపోస్తలులు అని పేరుపెట్టాడు -లూకా 6,12-13. ఇవి భక్తిమంతమైన వాక్యాలు. యేసు దైవచిత్తాన్ని గుర్తించకుండా ఏ పనీ చేయడు. శిష్యులను ఎన్నుకోవడం చాల ముఖ్యమైన కార్యం. ఆలాంటి పనికి పూనుకోక ముందు అతడు కొండమీదికి వెళ్లి అక్కడ ఏకాంతంగా వుండిపోయాడు. రాత్రంతా ప్రార్థనలో గడిపాడు. ఆ ప్రార్థనలో తాను ఎవరిని శిష్యులనుగా ఎన్నుకోవడం తండ్రి చిత్తమో తెలిసికొన్నాడు. ఆ జ్ఞానం తోనే ఉదయం శిష్యులను పిల్చి వాళ్ళల్లో పండ్రెండు మందిని అపోస్తలులనుగా ఎన్నుకొన్నాడు. ఆ పండ్రెండు మందిని తండ్రే తనకు ఒప్పజెప్పాడన్నమాట. ఈలాగే ప్రతి ముఖ్యకార్యానికి ముందు అతడు ప్రార్థన చేసేవాడు. ఆ కార్యాన్ని గూర్చిన

తండ్రి చిత్తాన్ని గుర్తించేవాడు. తర్వాతనే ఆ పనికి పూనుకొనేవాడు.

2. శిష్యుల్ని ఎన్నుకోవడం క్రీస్తుకి అతిముఖ్యమైన కార్యం అని చెప్పాం. వీళ్లు ప్రభువుతో వుండి అతని నుండి తర్ఫీదు పొందుతారు. క్రీస్తు వాళ్లను ఇద్దరిద్దరినితగా, తనకంటె ముందుగా, ఆయా గ్రామాలకు వేదబోధ చేయడానికి పంపుతాడు. అపోస్తలులు క్రీస్తుకి ముఖ్యులైనవాళ్ళు. కనుకనే పిశాచం వీళ్లను అపహరింప జూస్తుంది. అది వారిలో యూదాను ఒక్కణ్ణి మాత్రం దొంగిలింప గలుగుతుంది. తతిమ్మా పదకొండుమంది క్రీస్తుకి విశ్వాస పాత్రులుగానే వుండిపోయారు. క్రీస్తు ఉత్థానానంతరం వీళ్లు అతని వుద్యమాన్ని కొనసాగించారు. క్రీస్తు ప్రారంభించిన దైవరాజ్యాన్ని వ్యాప్తిచేసారు. ఈలాంటి శిష్యులను ఎన్నుకోక ముందు క్రీసుర్త తండ్రికి ప్రార్థన చేయడం ఉచితమే కదా!

3. మన కార్యాలు ఏలా ప్రారంభిస్తాం? మనం ఆయా పనులు ప్రారంభించక ముందు దేవుని చిత్తాన్ని తెలిసికోవడానికి జపం చేస్తామా? అవి మన పనులా లేక దేవుని పనులా? ఆ పనులద్వారా మనం పేరు దెచ్చుకోవడం ముఖ్యమా లేక దేవునికి కీర్తి కలిగించడం ముఖ్యమా? మన కార్యాలను దైవబలంతోనే, దైవాశీర్వాదంతోనే కొనసాగిస్తుంటామా? మన ప్రేషిత కార్యాల్లో మన స్వార్థమెంత? దైవసేవ యెంత?

## 16. గెత్సెమని ప్రార్థనం -మత్త 26,34-44

1. క్రీస్తు తన జీవితం చివరిభాగానికి వచ్చాడు. ఆ చివరి గడియల్లో అతడు పిశాచాన్ని ఎదిరించి పోరాడాలి. సిలువమరణాన్ని అనుభవించాలి. చావడానికి ఏ ప్రాణీ యిష్టపడదు. క్రీస్తుకి కూడ చనిపోవాలన్న కోరికలేదు. ఐనా తాను పిత చిత్తానికి లొంగి సిలువ మరణాన్ని అంగీకరించాలి. ఇక్కడ తన చిత్తానికీ పిత చిత్తానికీ మధ్య ఘర్షణం ఏర్పడింది. ఈ ఘర్షణం క్రీస్తు హృదయంలోనే జరిగింది, గెత్సెమని ప్రార్థన ఈ ఘర్షణాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది.

2. క్రీస్తు దేనికొరకు జపించాడు? "తండ్రీ ఈ పాత్రను నానుండి తొలగించు. ఐనా నేనీ పాత్రను త్రాగాలని నీ చిత్తమైతే, దాన్ని త్రాగడానికి సిద్ధంగానే వున్నాను" ఇది క్రీస్తు ప్రార్థనం. ఈ ప్రార్థననే అతడు ఈ సందర్భంలో మూడుసార్లు జపించాడు. ఇక్కడ "పాత్ర" అంటే సిలువ మరణం. పాత్రను త్రాగడమంటే సిలువమీద చనిపోవడం.

మరణంతో మన జీవితం అంతమౌతుంది. కనుక ఏ ప్రాణీ చావడానికి వొప్పుకోదు. క్రీస్తుకి కూడ సిలువమీద చనిపోవడం ఇష్టంలేదు. కాని అది తండ్రి చిత్తం, తండ్రి ఏర్పరచిన రక్షణ ప్రణాళిక. క్రీస్తు తండ్రి చిత్తాన్ని జవదాటడు. కనుక అతడు తండ్రి కోరికను అనుసరించి సిలువ మరణాన్ని అంగీకరించాడు. ఆత్మార్పణం చేసికొన్నాడు.

గెత్సెమని తోపులో ప్రభువు ప్రార్థించింది తన చిత్తానికీ తండ్రి చిత్తానికీ మధ్య

ఏర్పడిన ఘర్షణను పురస్కరించుకొనే. ఈ ఘర్షణంలో ప్రభువు తండ్రికి విధేయుడ య్యాడు. తండ్రీ! నా యిష్టప్రకారం గాదు, నీ యిష్టప్రకారమే జరగనీయి అన్నాడు.

3. ప్రార్థనలోని ముఖ్యాంశం ఇదే. దేవుణ్ణి మన చిత్తానికి లొంగదీసికొనే ప్రయత్నం చేయకూడదు. మనమే అతని చిత్తానికి లొంగాలి. ఇక్కడ క్రీస్తు చేసింది యిదే. మనం దైవచిత్తానికి లొంగితే మన హృదయంలో శాంతి నెలకొంటుంది. అలా లొంగకపోతే మన మనస్సులో శాంతి వుండదు. మన అంతరాత్మే మనలను పీడిస్తుంది.

కాని దేవుని చిత్తానికి లొంగడం కొన్నిసార్లు కష్టమౌతుంది. అది మన స్వార్థానికి వ్యతిరేకంగా పోతుంది. కనుక ఆ కార్యం మనకు ఎంతో బాధ కలిగిస్తుంది. ఒకోసారి మన ప్రాణాలుకూడ అర్పింపవలసి వుంటుంది. ఐనా తప్పదు. దేవుడు నరుని చిత్తానికి లొంగడు. నరుడే దేవుని చిత్తానికి లొంగాలి. మనరక్షణం ఈ రహస్యంలోనే ఇమిడి వుంది. కనుక పిత చిత్తానికి లొంగిన క్రీస్తు మనకు ఎల్లవేళలా ఆదర్శంగా వుంటాడు.

## 2. సోదరప్రేమ

### 17. యావే మందిరంలో అతిథి -కీర్త 15

1. 15వ కీర్తన సాంఘిక న్యాయాన్ని గూర్చి చెప్తుంది. నరుడు తోడి నరుడిపట్ల యేలా ప్రవర్తించాలో తెలియజేస్తుంది. నరుడు భగవంతునికి ప్రీతి కలిగించాలంటే కేవలం ఆరాధనం ఒక్కటే సరిపోదు. తోడివారిపట్ల నీతితో ప్రవర్తించడం గూడ అవసరం.

యావే మందిరంలో ప్రవేశించాలంటే యేలాంటి అర్హత వుండాలని ఈ కీర్తనం లోని మొదటి చరణంలో యాత్రికుడు యాజకుణ్ణి ప్రశ్నిస్తాడు. ఈ ప్రశ్నకు యాజకుడు జవాబు చెప్తాడు. దేవళంలో ప్రవేశించి దేవుని సన్నిధిలో నిలవడానికి కావలసిన అర్హతలను అతడు వరుసగా పేర్కొంటాడు.

2. రెండవ చరణం నుండి యాజకుడు భక్తునికి వుండవలసిన గుణాలను వివరించాడు. అవి యివి

నిందా రహితంగా జీవించడం
ధర్మాన్ని పాటించడం
సత్యం పల్కడం
చాడీలు చెప్పకుండా వుండడం
స్నేహితునికి కీడు తలపెట్టకుండడం
ఇతరులమీద నిందలు మోపకుండడం
దేవుణ్ణి పూజించనివారిని తిరస్కరించడం
భక్తిపరులను గౌరవించడం
చేసిన ప్రమాణం నిలబెట్టుకోవడం
వడ్డీ తీసికోకపోవడం
లంచం పట్టకపోవడం

మామూలుగా దేవాలయంలోకి వెళ్లేవాళ్లు దేవుణ్ణి పూజిస్తారు. బలులర్పిస్తారు. కాని పై జాబితాలో దైవారాదనను గూర్చిన అంశం ఒక్కటీ లేదు. అన్నీ తోడివారి పట్ల పాటింపవలసిన ధర్మాలే వున్నాయి. అనగా తోడి నరునికి న్యాయం చేసేవాడే దేవుణ్ణి పూజించడానికి అర్హుడని భావం.

3. మామూలుగా మనం దేవళానికి వెళ్ళి దేవుణ్ణి కొలుస్తాం. కానుకలు అర్పిస్తాం. ఒక్క ఆరాధన తోనే మన బాధ్యతలన్నీ తీరిపోయాయి అనుకొంటాం. కనుక దేవళం నుండి బయటకి రాగానే తోడివారికి అపకారం తలపెడతాం. దుర్బలులను పీడిస్తాం. ఈ కీర్తన సోదరప్రేమ లేనిదే దేవుని సన్నిధిలోనికి వెళ్లి అతణ్ణి ఆరాధించలేమని రూఢిగా చెప్తుంది. కావున దైవప్రేమ సోదరప్రేమ వేరువేరు విషయాలు అనుకోగూడదు. ఎప్పుడూ అవి రెండూ కలసే వుంటాయి. తోడినరుణ్ణి ప్రేమించకుండా దేవుణ్ణి ప్రేమించలేం. నరుడు దేవునికి పోలికగా వుండేవాడు కదా! సోదరప్రేమను గూర్చి ఈ కీర్తన చెప్పే అంశాల్లో మనం ఎన్నటిని పాటిస్తున్నామో పరిశీలించి చూచుకొందాం.

18. ప్రభువు కోరేదేమిటి? -మీకా 6,6-8

1. పూర్వవేదంలోని యాజకులు దేవునికి బలులు అర్పించాలని చెప్పారు. ఇది కర్మకాండ. బహిర్గతమైన మతం. ప్రవక్తలు ఈ బహిర్గతమైన మతాన్ని నిరసించి అంతర్గత మతం ముఖ్యమని బోధించారు. హృదయంలో దేవునిమీద నిజమైన భక్తీ, తోడి జనుల మీద నిజమైన ప్రేమా వుంటే అదే అంతర్గత మతం. నూత్నవేదం కూడ ఈ హృదయ భక్తికే ఎక్కువ ప్రాధాన్యమిస్తుంది. ఇక్కడ మనం పరిశీలించబోయే మీకా ప్రవచన వాక్యాలు పూర్వవేదంలోని అతిప్రశస్త భాగాలకు చెందినవి.

2. భక్తులు దేవునికి దేనివలన ప్రీతి కలిగిస్తారు? బలులు అర్పించడం వల్లనా? ఈ బలులు చాలా రకాలుగా వున్నాయి. పొట్టేళ్ళను బలియిస్తే సరిపోతుందా? దూడలను దహన బలిగా సమర్పిస్తే దేవుడు సంతోషిస్తాడా? ఓలీవు తైలం మొదలైన ధాన్య బలులను కాన్కబెడితే ప్రభువు మెచ్చుకొంటాడా? మన పెద్ద కొడుకును బలియిస్తే అతనికి ప్రీతి కలుగుతందా? యిస్రాయేలీయులు కాకున్నా ఆనాటి కనానీయులు నరబలులు అర్పించారు కదా! ఏలాంటి బలుల వల్ల కూడా దేవుని ప్రీతి కలగదని చెప్తున్నాడు ప్రవక్త. మరి అతన్ని కొలచే మార్గమేమిటి?

ప్రభువుని మెప్పించాలంటే మూడు కార్యాలు ముఖ్యం. తోడి జనులపట్ల న్యాయాన్ని పాటించాలి. వారి యెడల ప్రేమను చూపాలి. దేవునిపట్ల వినయాన్ని ప్రదర్శించాలి. ఈ మూడింటిలో తొలిరెండు తోడి జనులకు సంబంధించినవి. మూడవది దేవునికి సంబంధించినది.

తోడివారికి అన్యాయం చేయకూడదు. న్యాయమే చేయాలి. ఇది ఆమోసు, యెషయా, యిర్మియా మొదలైన ప్రవక్తలందరూ చెప్పిన సూత్రమే. ఇక్కడ మీకా ప్రవక్త తోడివారిని ప్రేమతో చూడమని గూడ చెప్తున్నాడు.ప్రభువు యిస్రాయేలీయులందరితోను

సీనాయి కొండదగ్గర నిబంధనం చేసికొన్నాడు. ఈ నిబంధనం ద్వారా యూదులు దేవుణ్ణి కొలిచే జనమూ అతని బిడ్డలూ అయ్యారు. కనుకనే ఒకే తండ్రి బిడ్డలైన యూదులు ఒకరికొకరు తోబుట్టువుల్లాంటివాళ్లు. కనుక వాళ్ళకు పరస్పరప్రేమ అవసరం.

భక్తుడు దేవునిపట్ల వినయాన్ని ప్రదర్శించాలి. అనగా దేవుని మీద ఆధారపడి జీవించాలి. గర్వాత్ముడు నాకు నేను చాలుదును అనుకొంటాడు. స్వీయబలం మీదనే ఆధారపడతాడు. వినయాత్ముడు నాకు నేను చాలను దైవబలం కావాలి అనుకొంటాడు. చిన్న బిడ్డడు తల్లిదండ్రుల మీద లాగ దేవునిమీద ఆధారపడతాడు. తానర్పించే బలుల మీదా, తాను చేసే పూజలమీదా కాక దేవుని కృప మీదనే ఆధారపడి జీవిస్తాడు. ఫలితాంశ మేమిటంటే, హృదయంలో సోదరప్రేమా దైవభక్తీ వుంటేనే గాని దేవునికి ప్రీతి కలిగించలేం. వట్టి బహిర్గత మతం చాలదు. అంతర్గత మతం కావాలి.

3. దేవుడు మనకంటె గొప్పవాడు. దోషాలు లేనివాడు. సర్వ సంపూర్ణుడు. కనుక అతన్ని పూజించడం, ప్రేమించడం సులువు. తోడి నరులు మనలాంటివాళ్ళు మనలోని దోషాలే వాళ్ళలో గూడ కన్పిస్తాయి. కనుక వాళ్ళను ప్రేమించడం కష్టం. ఐనా తోడిజనాన్ని అంగీకరించి ప్రేమిస్తేనే గాని దేవుణ్ణి మెప్పించలేం. నేడు అతడు మనకు నేరుగా దర్శనమీయడు. తోడినరుల్లోనే దర్శనమిస్తాడు. కనుక తోడి జనులను ప్రేమిస్తే అతన్ని ప్రేమించినట్లే.

## 19. నా పొరుగువాడు ఎవడు? లూకా 10,29-37

1. మంచి సమరయుని కథ మనకందరికీ తెలిసిందే. మోక్షం పొందాలి అంటే నేనేమి చేయాలి అని ధర్మశాస్త్ర బోధకుడు క్రీస్తుని ప్రశ్నించాడు. ఈ విషయమై ధర్మశాస్త్రం ఏం చెప్తుంది అని క్రీస్తు అతనికి ఎదురు ప్రశ్న వేసాడు. ఆ బోధకుడు ధర్మశాస్త్రం దేవుణ్ణీ పొరుగువాణ్ణీ ప్రేమించమని చెప్తుంది అని పల్కి ఇక్కడ పొరుగువాడంటే ఎవరో తెలియజేయమని క్రీస్తుని అడిగాడు. దానికి సమాధానంగా క్రీస్తు అతనికి మంచి సమరయుని కథను చెప్పాడు. ఈ కథలోని మంచి సమరయుడు కారుణ్యానికి పెట్టింది పేరు. అతని ప్రవర్తనను జాగ్రత్తగా గమనించి మనం కూడ సోదరప్రేమను అలవర్చు కోవాలి.

2. బాటసారి దొంగలచే దెబ్బలు తిని కొనవూపిరితో త్రోవ ప్రక్కన పడివున్నాడు. యాజకుడు, లేవీయుడు సమరయుడు అనే ముగ్గురు ఆ త్రోవ వెంట వచ్చారు. తొలి యిద్దరూ బాటసారిని పట్టించుకోలేదు. మూడవవాడు పట్టించుకొన్నాడు. క్రీస్తు అతన్ని మనకు ఆదర్శంగా చూపించాడు.

బాటసారి త్రోవ ప్రక్కన పడివున్నాడు. దారికి రెండు ప్రక్కలు వుంటాయి కదా? యాజకుడూ లేవీయుడూ బాటసారి పడివున్న ప్రక్కగానే వచ్చారు. కాని అతని

దగ్గరికి రాగానే అతన్ని పట్టించుకోడానికి యిష్టంలేక, త్రోవ రెండో ప్రక్కకు తొలగి దాటిపోయారు -10,31-32. వాళ్ళిద్దరూ యెరూషలేం దేవాలయంలో దేవుణ్ణి అర్చించే వాళ్ళు. ధర్మశాస్త్రానికి, దేవళానికి అంకితులైనవాళ్ళు, దైవభక్తులు, ప్రార్థనాపరులు. ఐనా వాళ్ళు ఆపదలో వున్న తోడినరుణ్ణి పట్టించుకోలేదు. దేవుణ్ణి కొల్చే భక్తులకు తోడినరులను పట్టించుకోడానకి సమయంలేదని వాళ్ళభావం. దేవుణ్ణి సేవించేవాళ్ళు తోడి నరులను సేవించనక్కరలేదని వాళ్ళ తలపు. దేవుడు వేరు ప్రజలు వేరని వాళ్ళ వుద్దేశం.

ఐనా క్రీస్తు వీళ్ళ చర్యను మెచ్చుకోలేదు. బాటసారిని ఆదరించిన సమరయుని మెచ్చుకొన్నాడు. నీవు కూడా వెళ్ళి ఆ సమరయుని లాగే చేయి అని ధర్మశాస్త్ర బోధకునికి అతన్ని ఆదర్శంగాను చూపించాడు -10,37.

యూదులు సీనాయి నిబంధనకు చెందినవాళ్లు. ధర్మశాస్త్రాన్ని పొందినవాళ్లు. దేవుణ్ణి భక్తితో పూజించేవాళ్ళు. ఐనా సోదరప్రేమ లేందే వాళ్ళెందుకూ కొరగారని ప్రభువు ఈ కథలో నొక్కి చెప్పాడు. నేడు క్రైస్తవులమైన మనకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. తోడివారిని పట్టించుకోందే మనం దైవభక్తులం కాలేం. ఇరుగుపొరుగువారికి సేవలు చేయందే ప్రార్థనా పరులం కాలేం. ఆ మంచి సమరయుని లాగ ఆపదలో వున్నవారిని ఆదుకోందే క్రైస్తవులం కాలేం.

3. ఈ కథలో మంచి సమరయుని పేరు లేదు. అతడెవరో మనకు తెలియదు. ఐనా అతడు క్రీస్తునే సూచిస్తాడు. క్రీస్తు తనకు పోలికగా వుండడానికే ఈ పాత్రను సృజించాడు. మానవజాతి పాపంవలన గాయపడి కొనవూపిరితో పడివుంది. క్రీస్తు తన ప్రాణాలొడ్డి మానవజాతి ప్రాణాలు కాపాడాడు. విశ్వమానవాళి కోసం అసువులు ధారపోసాడు. కనుక అతడే మనకు మంచి సమరయుడు. ఇక, మనంకూడ అతనిలాగే నిరంతరం మంచి సమరయులంగా మెలగాలి. అక్కరలో వున్నవాళ్ళను ఆదుకోవాలి. కులం, వర్గం, మతం అనేవి మనకు ఆటంకం కాకూడదు. ఈ ప్రపంచమంతా, మానవజాతి అంతా మన కుటుంబమేనని భావించాలి. ఇదే శిష్యలక్షణం.

## 3. విజ్ఞాపనం

### 20. అబ్రాహాము విజ్ఞాపనం -ఆది 19,22-33

1. సొదొమ గొమొర్రా నగరాల ప్రజలు పాపకార్యాల్లో ఆరితేరిపోయారు. కనుక ప్రభువు ఆ పట్టణాలను నావం చేయాలనుకొన్నాడు. అతడు ఈ సంగతిని తన భక్తుడైన అబ్రాహాముకి తెలియజేసాడు. అబ్రాహాము జాలిగొని ఆ దుష్టనగరాల తరపున దేవునికి విజ్ఞాపనం చేసాడు.

2. అబ్రాహాము దేవుని యెదుట నిల్చున్నాడు -18,22. అనగా దేవునికి ప్రార్థన చేసాడని భావం. సొదొమ నగరంలో దుర్జనులూ వున్నారు, సజ్జనులూ వున్నారు. ప్రభువు

ఆ నగరాన్ని నాశం చేస్తే సజ్జనులు కూడ చనిపోతారు. లోకానికి న్యాయాధిపతియైన దేవుడు దుర్జనులతో పాటు సజ్జనులను కూడ నాశం చేయడం ఏమి ధర్మం? కనుక అబ్రాహాము సొదొమ పట్టణాన్ని మన్నించమని దేవునికి మనవి చేసాడు. ప్రభువు న్యాయాన్ని అతనికే గుర్తుచేసాడు.

ఆ నగరంలో 50 మంది నీతిమంతులుంటే దాన్ని కాపాడమని అబ్రాహాము అడిగాడు. దేవుడు సరేనన్నాడు. కాని ఆ పట్టణంలో అంతమంది పుణ్యాత్ములు లేరు. అబ్రాహాము తన సంఖ్యను 45కి గతించాడు. 45 మంది మంచివాళ్లున్నా దేవుడునగరాన్ని కాపాడతానన్నాడు. ఆ మీదట అబ్రాహాము తన సంఖ్యను నలభైకీ, ముప్పయికీ, ఇరవైకీ పదికీ తగ్గించుకొంటూ వచ్చాడు. అబ్రాహాము ఆరుసార్లు మనవి చేసావు. భక్తిమంతులుంటే నగరాన్ని తప్పక కాపాడతానని దేవుడు ఆరుసార్లు ప్రమాణం చేసాడు. కాని ఆ వూరిలో పదిమంది పుణ్యాత్ములుకూడ లేరు. కనుక దేవుడు సొదొమ గొమఱ్ఱాలను భస్మం చేసాడు.

ఐతే సొదొమ నగరంలో నల్గురు భక్తిమంతులున్నారు. వాళ్లు లోతు, అతని భార్య, ఇద్దరు కూతుళ్లు. ఆ నల్గురి కోసం ప్రభువు పట్టణాన్ని కాపాడలేదు. ఆ నల్గురినీ కాపాడాడు. వాళ్లను నగరం నుండి బయటకు పంపిన పిదప దాన్ని తగలబెట్టాడు - 19,15. ఈ విధంగా అతడు తన న్యాయాన్ని నిలబెట్టుకొన్నాడు. దుర్మార్గులతో పాటు సన్మార్గులను నాశం చేయలేదు. దుర్మార్గులను శిక్షించి సన్మార్గులను వదలివేసాడు - 58,25. అందువల్ల అబ్రాహాము విజ్ఞాపనం వ్యర్థమైపోలేదు. నల్గురు పుణ్యాత్ములను కాపాడ్డం అనే పద్ధతిలో అది ఫలించింది.

3. విజ్ఞాపనమంటే, ఇతరుల కొరకు ప్రార్థనచేయడం. ఈ ప్రార్థన చేయదగింది. తరచుగా వాళ్లనూ వీళ్లనూ మన కొరకు ప్రార్థన చేయమని అడుగుతుంటాం. ఇతరులూ మన జపాలను అర్థిస్తుంటారు. ఒకరికొరకొకరు ప్రార్తన చేయడం అవసరం. జనులందరూ దేవుని బిడ్డలు కనుక ఒకరికొకరు అన్నదమ్ములూ అక్కచెల్లెళ్ళూ ఔతారు. కనుక అందరూ ఒకరికొరకొకరు ప్రార్థన చేస్తుండాలి.

సొదొమ గొమఱ్ఱా ప్రజలు దుష్టులు. ఆ పట్టణాలే ఆ ప్రజలను నాశం చేయమని దేవునికి మొరపెట్టుకొన్నాయి. ఐనా అబ్రాహాము అలాంటి దుష్టనగరాల కొరకు కూడ మనవిచేసాడు. మన ప్రార్థన నుండి ఎవరినీ తొలగించకూడదు. మన శత్రువుల కొరకు కూడ జపం చేయాలి. దేవుడు మంచివాళ్లకూ చెడ్డవాళ్లకూ సమానంగా వాన కురిపించడం లేదా? -మత్త 5,45.

నీతిమంతుని ప్రార్థన మహాబలమైంది అని చెప్తుంది యాకోబు జాబు -5,16. అలాంటి ప్రార్థనను మనం తప్పకుండా తోడివారికొరకు వినియోగించాలి. మహాజపం వల్ల ఎవరోవొకరు దేవుని కృపకు పాత్రులైతే అదే మహాభాగ్యం అ నుకోవాలి. లోకంలో ఇన్ని రకాల సేవలున్నాయి. కాని ప్రార్థనాసేవకు మించిన సేవ లేదు.

## 21. మోషే విజ్ఞాపనం -నిర్గ 32,7-14

1. మోషే సీనాయి కొండమీద 40 రోజులు ఉపవాసముండి ప్రార్థన చేసాడు. దేవుని నుండి పది ఆజ్ఞలు పొందాడు. కాని అతడు 40 రోజులు దూరంగా కొండ మీద వుండిపోవడం వల్ల క్రింద వున్న ప్రజల్లో భక్తివిశ్వాసాలు నశించాయి. వాళ్లు మోషే అన్నయైన అహరోను చేత బంగారుదూడను చేయించుకొని దాన్ని కొలవడం మొదలెట్టారు. మనలను ఐగుప్తునుండి తోడ్కొని వచ్చిన దేవుడు ఇతడే అని చెప్పుకొన్నారు. దానికి బలులర్పించారు. అక్కడ కొండమీద దేవుడు మోషేను హెచ్చరించాడు. నీవు ఐగుప్తు నుండి తోడ్కొని వచ్చిన ప్రజలు మతభ్రష్టులై అన్యదైవాన్ని కొలుస్తున్నారు. త్వరగా క్రిందికి దిగివెళ్లు అని హెచ్చరించాడు. నేను ఈ జనాన్ని కాల్చి మసిచేస్తాను, నీవు నాకు అడ్డురావద్దు అని చెప్పాడు. ఆ సందర్భంలో మోషే దేవునికి విజ్ఞాపన ప్రార్థన చేసాడు.

2. ఇక్కడ మోషే చేసిన ప్రార్థనలో నాల్గంశాలున్నాయి. 1.ప్రభువు ఎంతో కష్టపడి యిస్రాయేలీయులను ఐగుప్తునుండి తోడ్కొని వచ్చాడు. వాళ్ళను ఇప్పుడు నాశం చేస్తే ప్రభువు కృషంతా బూడిదలో పోసిన కన్నీరు కాదా? ఐగుప్తులో అతడు చేసిన అద్భుతాలన్నీ వ్యర్థం కావా?

2. ఇప్పుడు ప్రభువు యిస్రాయేలీయులను చంపివేస్తే శత్రువులైన ఐగుప్తీయులు ఏమనుకొంటారు? యావే వట్టి మోసగాడు. అతడు యిస్రాయేలీయులను ఐగుప్తునుండి నడిపించుకొని వచ్చినట్లేవచ్చి వారిని మోసంతో కొండల్లో చంపివేసాడు అనిఆడిపోసుకోరా?

3. అబ్రాహాము, ఈసాకు యాకోబు అనే పితరుల భక్తిని జ్ఞప్తికి తెచ్చుకోవద్దా? వళ్లు తనకు చేసిన పూజలను స్మరించుకోవద్దా? ఆ పుణ్యపురుషులను చూచి వాళ్ళ సంతానమైన ఈ దుష్ట ప్రజను మన్నించవద్దా?

4. ప్రభువు పూర్వం ప్రమాణాలు చేసాడు. అబ్రాహాము సంతానాన్ని చుక్కల్లాగ, ఇసుక రేణువుల్లాగ లెక్కలకు అందని రీతిగా వృద్ధిచేస్తానన్నాడు. వాళ్ళకు కనాను మండలాన్ని ధారాదత్తం చేస్తానన్నాడు. ఇప్పుడు ఈ ప్రజలను చంపివేస్తే ఆ ప్రమాణాలు ఏలా నెరవేరతాయి? ఈ కారణాలన్నిటిని బట్టి అతడు ప్రజలను నాశం చేయకూడదు. ఇది మోషే విజ్ఞాపనం. ఈ ప్రార్థనను ఆలించి ప్రభువు తన మనస్సు మార్చుకొన్నాడు. యిస్రాయేలీయులను శిక్షించకుండ వదలివేసాడు.

3. ఇక్కడ మోషే శీలాన్ని జాగ్రత్తగా గమనించాలి. ప్రభువు యిస్రాయేలీయులను చంపివేసి మోషే నుండి క్రొత్తజాతిని పుట్టిస్తానన్నాడు -32,10. దీనితో మోషే జాతిపిత కావచ్చు. అబ్రాహాము స్థానాన్ని తాను పొందవచ్చు. నేలమీద తన పేరు శాశ్వతంగా నిల్చిపోతుంది. కాని మోషే స్వార్థం లేని మహానాయకుడు. అతనికి కావలసింది స్వీయకీర్తి కాదు. ప్రజల క్షేమం. అతడు ప్రజలకొరకు జీవించిన నాయకుడు. ఆ జనులను సేవించి వారికి సేవలు చేయడం అతని లక్ష్యం. ఆ ప్రజలు నాశమైపోతే ఇక తానెందుకు, తన

నుండి పుట్టబోయే నూతనజాతియెందుకు? కనుక అతడు ప్రజలను కాపాడమని ప్రభువుకి విన్నపం చేసాడు. ఒకవేళ దేవుడు తన మొరను ఆలించకపోతే తన పేరును జీవగ్రంథం నుండి కొట్టివేయమని కోరాడు -32,32. స్వార్థంలేని ప్రేమతో గూడిన ఆ మహాభక్తుని ప్రార్థనను ప్రభువు ఆలించాడు. ఈలాగే మనంకూడ స్వార్థం లేకుండ తోడి ప్రజలను ప్రేమించినపుడు వారి కొరకు మంచి విజ్ఞాపనను చేస్తాం. దేవుడు మన మనవిని ఆలిస్తాడు. ఇరుగుపొరుగువారి కొరకు విజ్ఞాపనం చేసేపుడు మోషేను మనం ఆదర్శంగా తీసికోవాలి.

## 22. యిర్మీయా విజ్ఞాపనం - యిర్మీ 42,1-6.

1. యిర్మీయా కాలంలో పాలస్తీనా దేశపు రాజకీయ పరిస్థితులు అల్లకల్లోలంగా వుండేవి. 587లో బాబిలోనియా రాజైన నెబుకద్నెసరు యూదులను ఓడించి యెరూషలేమునీ దేవాలయాన్నీ తగలబెట్టాడు. యూదులను బాబిలోనియాకు బందీలనుగా కొనిపోయాడు. కొందరు పేదజనులూ యిర్మీయా ప్రవక్తా పాలస్తీనా దేశంలోనే వుండిపోయారు. బాబిలోనీయులు యూదాకు అధికారిగా నియమించిన గెదల్యాను యిష్మాయేలు చంపివేసాడు. యెహానాను అతని అనుచరులు ఈ యిష్మాయేలును పట్టకో జూచారు. కాని అతడు తప్పించుకొని పారిపోయాడు. అటుతర్వాత యోహానాను బృందం వాళ్ళు గెదల్యా వధకు బాబిలోనీయులు తమ్ము శిక్షిస్తారేమోనని భయపడి ఈజిప్టుకి పారిపోగోరారు. కాని అలా పారిపోక ముందు వాళ్లు యిర్మియాను ప్రార్థన చేసి దేవుని చిత్తమేమిటో తెలిసికొమ్మని అడిగారు. ప్రవక్త వారి తరపున విజ్ఞాపనం చేయడానికి అంగీకరించాడు.

2. యోహానాను బృందం ప్రవక్త తెలియజేసిన దేవుని చిత్తానికి కట్టుపడి వుంటామని బాస చేసింది. వారి భావాల ప్రకారం ప్రవక్త ఓవైపున దేవుని మనిషీ. మరోవైపున ప్రజలమనిషీకూడ. అతడు దేవునికి ప్రార్థన చేసి దేవుని చిత్తాన్ని తెలిసికొనే వాడు. దేవుడే అతనికి తన సంకల్పాన్ని తెలియజేస్తాడు. అతడు దేవుని "నోరు". అనగా దేవుని సందేశాన్ని ప్రజలకు తెలియజెప్పేవాడు.

ప్రవక్త ప్రజలమనిషికూడ. అతడు ప్రజల కష్టసుఖాలనూ సమస్యలనూ గ్రహిస్తాడు. వాటిని దేవునికి విన్నవిస్తాడు. ప్రజల ప్రతినిధిగా దేవుని ముందు నిలుస్తాడు. దేవునికీ మానవులకీ నడుమ మధ్యవర్తిగా వుంటాడు. దేవుడిచ్చే జవాబుని స్వీకరించి ప్రజలకు తెలియజేస్తాడు. ఈ కారణాల వల్లనే ఇక్కడ ఈ యూదబృందం యిర్మీయాను ప్రార్థన చేయమని అడిగింది.

యిర్మీయా మనవి చేయగా దేవుడు పదిరోజులైన పిమ్మట అతనికి జవాబిచ్చాడు -42,7. ప్రభువు సమాధానామేమిటంటే, యోహానాను బృందం ఈజిప్టుకు పారిపోగూడదు. యూదా దేశంలోనే వుండిపోవాలి. బాబిలోనీయుల బారినుండి ప్రభువే వారిని కాపాడతాడు.

కాని ప్రభువిచ్చిన ఈ సమాధానం యోహానాను బృందానికి నచ్చలేదు. వాళ్లు మొట్టమొదట యిర్మీయా తెలియజేసిన ప్రభువు చిత్తానికి కట్టుబడి వుంటామని ప్రమాణం చేసారు. కాని కడన తమమాట నిలబెట్టుకోలేదు. ప్రభువు చిత్తానికి విరుద్ధంగా ఈజిప్టుకి వెళ్లిపోయారు. యిర్మీయాను కూడ బలవంతంగా తమ వెంట లాగుకొనిపోయారు – 43,6. ఇది వాళ్ళ దుష్టవర్తనం.

3. మనం విజ్ఞాపన ప్రార్థన చేసేపుడు ప్రజల తరపున దేవునికి విన్నపాలు చేస్తాం. ప్రజల పక్షాన దేవుని యెదుట మధ్యవర్తిగా నిలబడతాం. ఈ సమయంలో మన లాభం మనం చూచుకోగూడదు. ఎవరి తరపున ప్రభువుకి మనవి చేస్తున్నామో వారి ప్రయోజనాన్ని మాత్రమే లెక్కలోకి తీసికోవాలి. ఒకోసారి మనం ప్రార్తన చేస్తే జనం మన మాట వినరు. మనమీద తిరగబడతారు. మనకు కీడు చేయగోరుతారు కూడ. ఐనా మనం మాత్రం చిత్తశుద్ధితో, స్వార్ధం లేకుండా, వాళ్ళ తరపున ప్రార్థన చేయవలసిందే. పైన పేర్కొన్న వేదవాక్యాల్లో యిర్మీయా ఈలాగే ప్రవర్తించాడు.

## 23. ఓనియాసు విజ్ఞాపనం –2మక్క 15,11-16

1. అంటియోకస్ ఎపిఫానీస్ అనే గ్రీకురాజు యూదులను హింసింపసాగాడు. యూదజాతినీ వారి నగరాన్నీ దేవాలయాన్నీ నాశం చేయాలనీ అతని కోరిక. యూదా మక్కబీయుడు ఆ రాజును ఎదిరించి ధైర్యంగా పోరాడసాగాడు. అంటియోకస్ రాజు నికానోరు అనే సైన్యాధిపతిని యెరూషలేము మీదికి పంపాడు. యూదా అతనితో యుద్ధానికి తలపడ్డాడు. ఆ సందర్భంలో అతడు తన సైనికులకు ధైర్యం కలగడానికి తాను చూచిన ఓ దర్శనాన్ని వారికి ఈ క్రింది రీతిగా వివరించి చెప్పాడు.

2. ఓనియాసు అనే భక్తిగల ప్రధాన యాజకుని గ్రీకులు హత్య చేసారు. ఈ ఓనియాసు గ్రీకుల మీద యుద్ధానికి తలపడిన యూదాకు దర్శనంలో కన్పించాడు. అతడు చేతులు చాచి యూదజాతి కొరకు దేవునికి మనవిచేస్తున్నట్లుగా కన్పించాడు. యూదా తన్మయత్వంతో అతనివైపు చూస్తున్నాడు. అంతలో ఆ దర్శనంలో మరోవ్యక్తి కన్పించాడు. అతడు వృద్ధుడు. ఠీవీ తేజస్సూ కలవాడు. ఓనియాసు ఆ రెండవ వ్యక్తిని యూదాకు పరిచయం చేస్తూ ఇతడు యిర్మీయా ప్రవక్త. యూదులను అధంగా ప్రేమించేవాడు. ఆ ప్రజలకొరకూ పరిశుద్ధ నగరం కొరకూ ప్రార్తన చేసేవాడు అని చెప్పాడు. అప్పుడు యిర్మీయా తన కుడిచేతిని చాచి సువర్ణ ఖడ్గాన్ని యూదాకు బహూకరించాడు. ఈ కత్తిని దేవుడే నీకు కానుకగా పంపాడు. నీవు దీనితో శత్రువులను హతమార్చు అని చెప్పాడు. ఇది దర్శనం. యూదాకు దైవబలముందని ఈ దర్శనం భావం. భక్తులైన ఓనియాసు యిర్మీయా మొదలైనవాళ్ళు అతని తరపున ప్రార్థనం చేస్తున్నారు. కనుక యూదా ధైర్యంగా

శత్రువులను ఎదుర్కొనవచ్చు. యూద సైనికులను అతని పక్షాన్ని అవలంభించి గ్రీకులతో పోరాడవచ్చు. విజయం వారిదేనని భావం.

3. ఓనియాసు యిర్మీయా చాలాకాలం పాటు యూదులకు సేవలు చేసినవాళ్లు చనిపోయాక గూడ ప్రజలకొరకు విజ్ఞాపనం చేసారు. ఈ మహానుభావులు నేడు మన విజ్ఞాపనకు ఆదర్శంగా వుంటారు. మనం ఏ ప్రజలకొరకు కృషి చేస్తున్నామో, వారి కొరకు దేవునికి విజ్ఞాపనం చేస్తుండాలి. విద్యాసంస్థల్లో ఆస్పత్రుల్లో సాంఘిక సేవా సంస్థల్లో పనిచేసేవాళ్లు అక్కడివారి కొరకు దేవునికి మనవిచేయాలి. విచారణల్లో పనిచేసేవాళ్లు అక్కడి ప్రజలకొరకు ప్రార్థన చేయాలి. మనం ఎవరితో కలసి జీవిస్తున్నామో వారికొరకు మొట్టమొదట జపం చేయాలి. అటుపిమ్మట మన బంధుమిత్రులూ తోడి పనివాళ్లూ సహచరులూ మొదలైనవాళ్లందరి కొరకూ ప్రార్థన చేయాలి. ఎప్పుడూ ఇతరుల మీద మనకు గలప్రేమా, ఇతరుల కొరకు మనం చేసే ప్రార్థనా కలసిపోతుండాలి.

## 24. యెహెజ్కేలు విజ్ఞాపననం -యెహె 22,30

1. యెహెజ్కేలు మంచి ప్రవక్తల లక్షణాలు చెప్తున్నాడు. యుద్ధకాలంలో మంచి సైనికులు కోటగోడకు కావలి కాస్తారు. శత్రువులు దానిలో కన్నం వేయకుండా వుండేలా జాగ్రత్త పడతారు. ఒకవేళ కన్నం పెడితే దాన్ని వెంటనే పూడుస్తారు. అలాగే మంచి ప్రవక్త ప్రభువు కోపకాలంలో జాగ్రత్తగా వుంటాడు. ప్రభువు శిక్ష ప్రజలమీద పడకుండ వుండేలా చూస్తాడు. ప్రజలకొరకు ప్రార్థనచేసి దేవుని కోపాన్ని తొలగిస్తాడు.

2. యుద్ధకాలంలో సైనికులు నగర ప్రాకారానికి కావలి కాస్తారు. శత్రువులు దానికి కన్నం పొడిచి కోటలోనికి ప్రవేశింపజూస్తారు. కనుక సైనికుల సర్వశక్తుల ఆ గోడను కాపాడజూస్తారు. ఒకవేళ విరోధులు గోడకు కన్నం పొడిస్తే శౌర్యవంతులైన సైనికులు ఆ రంధ్రం దగ్గరే నిల్చుండి విరోధులను ఎదుర్కొంటారు. ప్రాణాలకు తెగించి పోరాడతారు. సాధ్యమైనంత త్వరలో రంధ్రాన్ని పూడుస్తారు.

ఇక్కడ యిస్రాయేలీయుల మీదికి ఎత్తివచ్చే శత్రువు ప్రభువే. వాళ్ళు అతని యాజ్ఞలు మీరారు కనుక పూర్వం వారికి రక్షకుడుగా వున్న ప్రభువే ఇపుడు శిక్షకుడుగా మారిపోతాడు. కనుక ప్రభువు "నేనే మీకు శత్రువు నౌతాను. నా కత్తి దూసి మీలో మంచివారినీ చెడ్డవారినీ గూడ వధిస్తాను" అని పల్కాడు -యెహె 21,3-4.

ఈ పరిస్థితుల్లో ప్రవక్త మంచి సైనికుల్లాగ ప్రజలను రక్షించాలి. అతడు ప్రజల తరపున ప్రభువుకి ప్రార్థన చేయాలి. దేవుడు తన కోపాన్ని ఉపసంహరించుకొని శాంత చిత్తుడు కావాలని మనవి చేయాలి. ప్రజలు తమ పాపాలకు పశ్చాత్తాప పడుతున్నాడు. కనుక ప్రభువు వారిని శిక్షింపక వదలివేయాలని విజ్ఞాపనం చేయాలి.

ఓ వైపున ప్రజలు మూర్ఖులై ప్రవక్తను హింసిస్తారు. యిర్మీయాను ఈలాగే హింసించారు. మరోవైపున దేవుని కోపం అతనిమీద రగులుకొంటుంది. అతడు తాను చేయని పాపాల కొరకు శిక్షను అనుభవించవలసి వస్తుంది. పూర్వం బాధామయ సేవకుడు ఈలాగే ప్రజలకొరకు శిక్షను అనుభవించాడు. "ప్రభువు మనందరి పరీక్ష కాలం. అతడు రేయింబవళ్ళు ప్రజలకు కావలివాడుగా మెలుగుతూండాలి -యెహె 33,7.

3. పైన అబ్రాహాము, మోషే, యిర్మీయా, యెహెజ్కేలు మొదలైన ప్రవక్తల విజ్ఞాపన ప్రార్థనలను పరిశీలించాం. ఈ మహానుభావులంతా ప్రజలపట్ల బాధ్యత కలవాళ్లు. కనుక తమ బాధ్యతకొద్ది వాళ్లు ప్రజల కొరకు విన్నపాలు చేసారు. మనం కూడ ఏయే బృందాలకు బాధ్యులమో వారి తరఫున దేవునికి విన్నపాలు చేయాలి. సైనికులు కన్నం బడకుండా కోటగోడను కాపాడినట్లే మనంకూడ మన ప్రార్థనలతో మన జనాన్ని కాపాడాలి. ఇది మన పూచీ.

అబ్రాహాము మోషే మొదలైనవాళ్లు దేవుని స్నేహితులు, దైవభక్తులు. కనుక ప్రభువు వాళ్ల మనవిని సత్వరమే ఆలించాడు. మన భక్తిని బట్టీ, పుణ్య జీవితాన్ని బట్టీ, దేవుడు మన మనవిని వింటాడు. మన తరఫున మనం భక్తితో జీవించాలి.

మనం మొదట మన ఆధీనంలో వున్న ప్రజల కొరకు విన్నపాలు చేయాలి. ఎందుకంటే వాళ్ళకు మనం కావలివాళ్ళం. అటుపిమ్మట అందరు ప్రజలకొరకు దేవుణ్ణి వేడాలి. దేవుడు ప్రధానంగా కోరేది సోదరప్రేమ. ఈ యాజ్ఞ వల్ల మనం ఎల్లరి కొరకు ప్రార్థన చేయ బాధ్యులం.

# 4. దేవునిపట్ల నిజాయితీ

## 25. వట్టిపోయిన నది - యిర్మీ 15,18

1. దేనిపట్ల మనకున్న నిజాయితీ ఏపాటిదా అని భక్తులు ఎప్పుడూ తమ్ముతాము పరిశీలించి చూచుకొంటూండాలి. మనం ప్రభువుతో మనసు విప్పి మాట్లాడుతూండాలి. మన కష్టసుఖాలను ప్రార్తనారూపంలో అతనితో చెప్పుకొంటూండాలి. యిర్మీయా ఈలా చేసాడు. ఇక్కడ ప్రవక్త తన దైవసేవను గూర్చి తలపోసికొంటూన్నాడు. ఒకప్పుడు దైవవాక్కు తనకు విన్పింపగా దాన్ని భుజించి ఆనందించాడు -15,18. అప్పుడు ప్రభువు తనకు దగ్గరగా వున్నట్లే అనిపించింది. దేవుడు తన్ను ప్రవచనం చెప్పడానికి పిల్చాడని నమ్మాడు. కాని యిప్పుడు తాను కష్టాల్లో చిక్కుకొంటే ప్రభువు తన్ను పట్టించుకోవడం లేదు. వేసవి రాగానే వట్టిపోయిన నదిలాగ అతడు నమ్మదగనివాడుగా కన్పిస్తున్నాడు. ప్రభువు తనకు జీవజలాల బుగ్గలాంటివాడు కావడంలేదు -15,18.

2. ఇక్కడ కష్టాల్లో ప్రభువు తన్ను చేయి విడిచాడని యిర్మీయా మొరపెడుతున్నారు.

రాజులు అతన్ని హింసించారు. ప్రజలు అతన్ని తృణీకరించారు. తోడి ప్రవక్తలు అతన్ని గేలిచేసారు. ఇవి యిర్మీయా శ్రమలు. ఈ శ్రమల్లో దేవుడు యిర్మీయాను చేయివిడిచి నట్లుగా కన్పిస్తున్నాడు. కనుక దేవుడు వేసవిలో వట్టిపోవడంచే నమ్మదగనిదిగా వుండే నదిలాంటి వాడని ప్రవక్త నిందించాడు.

ఇక్కడ "నమ్మదగని నది" అనే వుపమానం భావం ఇది. ఓ నది వుంది. అది వానాకాలం నిండి పారుతూండేది. ప్రయాణీకులు దాని దగ్గరికి వెళ్లి నీళ్లు త్రాగి దప్పిక తీర్చుకొనేవాళ్లు. కాని యిదేనది యెండ్లకాలం రాగానే యెండిపోయింది. ఈ సంగతి ప్రయాణీకులకు తెలియదు. వాళ్లు ఎండ్లకాలం ప్రయాణం చేస్తే మామూలుగా పోయినట్లే నీటికోసం మళ్లా దాని దగ్గరికి పోగా అది వట్టిపోయి వుంది. బాటసారులకు ఆశాభంగం కలిగింది. అది వాళ్ళను మోసగించింది. అలాగే ప్రభువు కూడా యిర్మీయాను ఒకప్పుడు ఆదరించాడు. తానతనికి పొంగిపారే నదిలాంటి వాడయ్యాడు. కాని ఇప్పుడు తాను కష్టాల్లో వుంటే దేవుడు తన కోపు తీసికోవడం లేదు. అతడు ఎండిపోయిన నదిలా తయారై తనకు ఆశాభంగం కలిగించాడు. తన నమ్మకాన్ని వమ్ముజేసాడు. కనుక ప్రవక్తకు తీరని మనస్తాపం కలిగింది. అతని పుండు మానని గాయంలా వుంది - 15,18. అతనికి ప్రభుదర్శనం లభించడంలేదు. చీకట్లో తిరుగాడుతున్నాడు. తాను ఇప్పుడు ఏటివొడ్డున పెరిగే చెట్టులాలేడు. ఎడారిలో చౌటిప్రలో ఎదిగే ముండ్ల తుప్పలా వున్నాడు -17,5-8. ఈ విధంగా యిర్మీయా ఇక్కడ తన భౌతిక బాధనీ ఆధ్యాత్మిక వేదననీ వెలకబోసికొన్నాడు.

3. దేవుడు కొన్నిసార్లు మనలను ఆదరిస్తాడు. అప్పుడు మను ఆనందం కలుగు తుంది. సింహాసనం ఎక్కినట్లుగా వుంటుంది. కాని కొన్నిసార్లు అతడు మనలను చేయి విడుస్తాడు. అప్పుడు మనకు దుఃఖం కలుగుతుంది. గద్దెమీది నుండి క్రింద పడిపోయి నట్లుగా వుంటుంది. కాని బాధాకాలంలో భక్తుడు భగవంతుణ్ణి విడనాడకూడదు. తన కష్టాలను ఆ ప్రభువుముందు విన్నవించుకంటూ అతన్నే నమ్ముకొని వుండాలి. అతన్ని పరిత్యజిస్తే ఇక మనకు దిక్కెవరు? అతనితో హృదయం విప్పి మాట్లాడకపోతే మరెవరితో మాట్లాడతాం? కష్టసుఖాల్లోను మనలను భరించే తండ్రి అతడు కాడా? ఇక్కడ యిర్మీయా ప్రవర్తించిన తీరు కష్టకాలం వచ్చినపుడు మనం దేవునిపట్ల ఏలా మెలగాలో నేర్పుతుంది.

## 26. నీవు నన్ను చెరిచావు -యిర్మీ 20,7.

1. యిర్మీయా ప్రభువుని వేసవిలో వట్టిపోవడం వల్ల నమ్మదగనిదిగా వుండే నదితో పోల్చాడు -15,18. ఇక్కడ పురుషుడు కన్యను మోసగించి చెరచినట్లుగా దేవుడు తన్ను నమ్మించి చెరచాడని చెప్తున్నాడు. తన అజ్ఞానాన్ని ఆసరాగా తీసికొని ప్రభువు

తన్ను వంచించాడని నుడుపుతున్నాడు. ఈ సందర్భంలో ప్రవక్త వాడిన "మోసగించు" అనే క్రియకు హిబ్రూ భాషలో, చెరచడం, మోసగించడం అనే రెండర్థాలు వున్నాయి.

2. ఈ వుపమానం భావం ఇది. ఓ పురుషుడు ఓ కన్యను నమ్మించాడు. ఆమె అతని మాటలు విని మోసపోయింది. కడన అతడు ఆమెను చెరచాడు. ఆమె నా తెలివితక్కువ తనం వల్లనే నేను నష్టపోయాను కదా అని విచారించింది. ప్రభువు కూడ తనతో ఈలాగే ప్రవర్తించాడని యిర్మీయా భావం. కాని ప్రభువు అతన్ని ఏలా మోసగించాడు? ఏలా చెరిచాడు?

యిర్మీయాకు ప్రవక్త కావాలన్న కోరిక ఏమీ లేదు. అతడు లేత ప్రాయంలో వున్నపుడే ప్రభువు అతన్ని ప్రవచనం చెప్పడానికి పిల్చాడు. యిర్మీయా అందుకు అంగీకరించలేదు. నేను బాలుణ్ణి. ఏలా మాటలాడాలో నాకు తెలియదు అని తప్పించు కోజూచాడు -1,6. ప్రజలు తన మాటలు వినరనీ తన్ను నానా హింసలకు గురిచేస్తారనీ యిర్మీయాకు తెలుసు. కనుకనే అతడు ఆ పనినుండి తప్పుకోజూచాడు.

కాని ప్రభువు అతన్ని వదలిపెట్టలేదు. నీవు మాతృగర్భంలో రూపొందక మునుపే నేను నిన్ను ఎన్నుకొన్నాను. నిన్ను జాతులకు ప్రవక్తగా నియమించాను. ఇప్పుడు నీవు నేను బాలుణ్ణని చెప్పవద్దు. నేను పంపేవాళ్ళ వద్దకు నీవు వెళ్లాలి. నేను చెప్పమన్న సంగతులన్నీ వాళ్ళకు చెప్పాలి. నేను నీకు తోడుగా వుండి నిన్ను కాపాడుతూంటాను. నీవు భయపడనక్కరలేదు అన్నాడు -1,5.8. ఈ విధంగా ప్రభువు అతన్ని నమ్మించి ప్రవక్తను చేసాడు. పైగా అతడు తన పలుకును తీసి యిర్మీయా నోటిలో పెట్టాడు. అతనగా అతన్ని ప్రవక్తగా ధ్రువపరచాడు -1,9.

ఇదంతా చాలదో అన్నట్లు ప్రభువు అతనితో నేను నిన్ను సురక్షిత నగరం లాగాను, ఇనుపస్తంభం లాగాను, ఇత్తడి తలుపులాగాను చేస్తాను. శత్రువులు నిన్నెదరిస్తాను గాని జయించలేరు. నేను నీకు తోడుగా వుండి నిన్ను కాపాడుతూంటాను అని అభయమిచ్చాడు -1,18-19. ఈ మాటలన్నీ నమ్మి యిర్మీయా ప్రభువు ప్రవక్త కావడానికి అంగీకరించాడు. దేవుడు తన్ను కాపాడతాడులే అనుకొన్నాడు. కాని తీరా రాజులూ నాయకులూ ప్రజలూ తన్ను హింసించడానికి పూనుకోగా ప్రభువు అతనికి సాయంజేయడానికి రావడం లేదు. అతడు ఏకాకి అయ్యాడు. కనుక ప్రవక్త విసిగిపోయి ప్రభువు తన్ను మోసగించాడనీ, చెరచాడనీ ఫిర్యాదు చేసాడు. మొదట తన్ను నమ్మించి ఇప్పుడు గోతిలో త్రోసాడని పల్కాడు. తన తెలివిక్కువతనం వల్లనే తాను నాశమైపోయానని దుఃఖించాడు. బాధల్లో వున్నవాళ్లు ఎవరైనా ఈలాగే మాట్లాడ తారు కదా!

3. ప్రభువు మీద సుమ్మర్లు పడ్డం వేరు. నిరాశచెంది అతన్ని పరిత్యజించడం వేరు. యిర్మీయా ఎన్ని కష్టాలు వచ్చినా ప్రభువుని విడనాడలేదు. "ప్రభూ! బాలాఢ్యుడవూ వీరుడవూ ఐన నీవు నా పక్షాన వున్నావు. నన్ను హింసించేవాళ్లు ఓడిపోయి శాశ్వతావ

మానం తెచ్చుకొందురు గాక! నేను నావ్యాజ్యాన్ని నీకు అప్పగించాను. నీవు నా విరోధులకు ప్రతీకారం చేయగా నేను చూతును గాక" అని పల్కాడు -20,11-12. ఈ యిర్మీయా భక్తివిశ్వాసాలు మనకు కూడా అలవడితే ఎంత బాగుంటుంది! ఆపదలు వచ్చినపుడు ప్రభువు మీద సుమ్మర్లు పడవచ్చు. అతనిముందు మన కోపతాపాలు వెళ్ళగ్రక్కవచ్చు. కాని అతన్ని విడనాడ్డం మాత్రం భావ్యం కాదు.

27. హృదయంలోని అగ్ని - యిర్మీ 20,9.

1. యిర్మీయా కాలంలో యూదులకు ఘోరవిపత్తు దాపురించింది. బాబిలోనియా రాజు నెబుకద్నెసరు యెరూషలేమునీ దేవాలయాన్నీ ధ్వసంచేసి యూదులను బాబిలోనియాకు బదీలనుగా కొనిపోయాడు. ఈ శ్రమలను అనుభవించడానికి ప్రజలను సిద్ధం చేయడమే యిర్మీయా పని. కాని ప్రజలు అతని సేవలను అంగీకరించలేదు. అతని వుపదేశాన్ని వినలేదు. అతని బాధలన్నీ బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. అప్పుడతనికి నిరుత్సాహం కలిగింది. ప్రవక్తగా తన బాధ్యతను వదలివేద్దామనుకొన్నాడు. ప్రజలకు ప్రభువు సందేశం విన్పించడం మానివేద్దామనుకొన్నాడు. కాని యీలా మానివేద్దా మనుకొన్నాడు. కాని యిలా మానివేద్దామనుకొన్నా మానివేయలేక పోయాడు. ఆ సందర్భంలో అతడు పల్కిన వాక్యమిది.

2. ప్రజలు ప్రవక్త బోధ వినలేదు. అతన్ని హింసించి బాధించారు -20,8. అతని నోరు మూయింపజూచారు. కనుక యిర్మీయాకు నిరాశ కలిగింది. ఇకమీదట ప్రభువు సందేశం చెప్పకుండ వుంటాననుకొన్నాడు. కాని అతడు తనలో తాను ఈలా నిశ్చయించుకొని మెదలకుండ వుండిపోలేదు. తన వుద్దేశాన్ని ప్రభువుకి తెలియజేసాడు. అతనిముందు మనసు విప్పి మాట్లాడాడు. ప్రార్థనారూపంలో తన గోడు ప్రభువుకి విన్పించుకొన్నాడు.

యిర్మీయా తన మనసులోని భావాన్ని ప్రభువుకి విప్పి చెప్తే ఏం జరిగింది? ప్రభువు వాక్కు అతని హృధయంలో అగ్నిలా మండజొచ్చింది. కుమ్మరి ఆవంలాగ అతని హృదయం గనగన మండింది. ఎన్ని కష్టాలొచ్చినా సరే ప్రభువు సందేశాన్ని మాత్రం విన్పించి తీరాలి సుమా అనే కోరిక అతని అంతరాత్మలో మొలకెత్తింది. ఆ భక్తుడు తన హృధయంలోని దివ్యవాక్కునీ ఆ వాక్కుని ప్రకటించాలనే కోర్కెనీ అణచి వేయజూచాడు. కాని ఆ వాక్కు అతనికి లొంగలేదు. అతి ప్రభువు వాక్కు కాదా! కనుక అది యేదోవిధంగా అతని గుండెలు చీల్చుకొని బయటకి రాబోయింది. అతనికి లొంగకుండా అని నోటివెంట వెలుపలికి దుముకబోయింది. ఇక అతడు ప్రభువు వాక్యాన్ని తన హృధయంలో అదిమిపట్టి వుంచలేకపోయాడు. దాన్ని ప్రకటించక తప్పదని గ్రహించాడు. ప్రభువు పేరుమీదిగా బోధచేసి తీరవలసింఏదనని నిర్ణయించు కొన్నాడు. ఈ సంగతిని ప్రభువుతో చెప్పాడు. ప్రజలు పెట్టే హింసనూ వాల్లు చేసే

ఎగతాళినీ సహించైనా సరే వాక్యబోధ చేస్తానని ప్రభువుకి మాటయిచ్చాడు. ఇదంతా ప్రార్థనా రూపంలో జరిగింది.

ఇక్కడ మనం ప్రవక్తబాధను అర్థం చేసికోవాలి. అతని నిజాయితీని చిత్తశుద్ధినీ మెచ్చుకోవాలి. అతడు దేవుని యెదుట మనసు విప్పి మాట్లాడ్డాన్ని హర్షించాలి. ఆ భక్తుడు దేవునితో నీవు మోసం చేసే నదిలాంటివాడివి అన్నాడు. నమ్మించి కన్నెను చెరిచే మోసగాడి లాంటివాడివి అన్నాడు. తన బాధంతా ఒలకబోసికొన్నాడు. అతడు దేవుణ్ణి గాఢంగా అనుభవానికి తెచ్చుకొన్నవాడు కనుకనే ఆ ప్రభువుతో అరమరికలు లేకుండా మాట్లాడగలిగాడు. దైవభక్తి కలవాళ్ళు దేవునితో ధైర్యంగా మాట్లాడతారు. అతనితో వాదిస్తారు. అతన్ని సవాలు చేస్తారు, నిందిస్తారు. కాని ఈ భక్తులు కడవ దేవుణ్ణి విడనాడరు. దేవునికి అంటిపెట్టుకొని వుంటారు. దేవుణ్ణి తమ చిత్తానికి లొంగదీసికోరు. తామే దేవుని చిత్తానికి లొంగుతారు.

3. ఈ యిర్మీయాలాగా మనం కూడ చిత్తశుద్ధితో, హృదయపూర్వకంగా దేవునికి సేవలు చేయాలి. ఆ సేవలో అతడు పంపే కష్టాలను గూడ భరించాలి. అతని నుండి పారిపోవాలనుకోవడానికి బదులుగా అతనికింకా సన్నిహితులం గావాలి. అతని ఆజ్ఞను త్రోసిపుచ్చడానికి బదులుగా అతనికింకా విధేయులం కావాలి.

మనలను హింసించేవారి కొరకు ప్రార్థన కూడ చేయాలి. యిర్మీయా యిలా జపించాడు. అతడు దేవునితో "ప్రభూ! నేను నీ సమక్షంలో నిలచి నన్ను హింసించే వారి పక్షాన నీకు మనవిచేసాను. నీ కోపాన్ని శాంతింపజేసాను. నీవీ సంగతి జ్ఞప్తికి తెచ్చుకో" అని పల్కాడు -18,20. మన ప్రవర్తనం కూడ ఈలాగే వుండాలి.

## 28. సమరయ స్త్రీ

యోహా 4,4-26

యోహాను సువిశేషంలో క్రీస్తు సమరయ స్త్రీని కలసికొన్న కథ వస్తుంది. ఈ కథ చాల సత్యాలను బోధిస్తుంది. రచయిత ఈ వుదంతాన్ని నాటకీయ శైలిలో రచించాడు. బైబులు పండితులు ఈ సంఘటనాన్ని చాల ఘట్టాల క్రింద విబజిస్తారు. మనం దీన్ని 6 ఘట్టాలుగా విభజించి పరిశీలించి చూద్దాం.

### 1. ప్రభువు ఆ స్త్రీని కలసికోవడం, 4-9 వచనాలు

క్రీస్తు సమరయ మండలం గుండా ప్రయాణం చేస్తూ సుఖారు అనే గ్రామం చెంతకు వచ్చాడు. అక్కడ పూర్వం యాకోబు త్రవ్వించిన బావి వుంటే దాని వొద్దున చతికిలబడ్డారు. అది మధ్యాహ్నసమయం కావడం చేత అతడు బాగా అలసిపోయి వున్నాడు. అతనికి దాహంవేసింది. అంతలో సమర స్త్రీ ఆ బావిలో నీళ్ళు చేదుకోవడానికి రాగా క్రీస్తు ఆమెను త్రాగడానికి నీళ్ళీయమని అడిగాడు. దీనితో వాళ్ళిద్దరికీ సంభాషణం

ప్రారంభమైంది. ఇక్కడ ప్రభువు దాహం భౌతికమైంది మాత్రమే కాదు, ఆధ్యాత్మిక మైనది కూడ. అతడు నరులను రక్షించడానికి ఎప్పుడూ దాహం గొంటూనే వుంటాడు. ఇక్కడ ఈ సమరయ మహిళను పాపం నుండి రక్షించడానికి దాహం గొన్నాడు. తరువాత నరులను రక్షించడానికి సిలువమీద కూడ దాహం చెందుతాడు –యోహా 19,28.

ఓ యూదుడు తన్ను నీళ్ళీయమని అడగడ చూచి ఆవిడ విస్తుపోయింది. యూదులూ సమరయులూ ఒకేజాతివాళ్లయినా బాబిలోనియా ప్రవాసానంతరం విడిపోయారు. పరస్పర వైరాలు పెంచుకొన్నారు. ఒకరినుండి ఒకరు ఇచ్చిపుచ్చుకొనేవాళ్ళు కాదు. ఒకరి యిండ్లల్లో ఒకరు తిని త్రాగేవాళ్ళు కాదు. అందువల్ల క్రీస్తు తన చేతినీళ్ళు త్రాగుతాడా అని ఆమె ఆశ్చర్యపడింది. క్రీస్తు యూదుడు కావడం చేత అతనిపట్లఅ ఆమెకు ఓ రకమైన అనిష్టభావం ఏర్పడింది. కనుక మొదటలో అతనిలో మెస్సీయాను గుర్తించలేకపోయింది. తరచుగా దేవుడు మనకు తోడినరుల్లో సాక్షాత్కరిస్తుంటాడు. కాని కొన్ని కారణాల వల్ల ఆ నరుల పట్ల మనకు అనిష్టభావం పుడుతుంది. అందుచే వాళ్ళల్లో దేవుణ్ణి గుర్తించలేకపోతుంటాం. అలా దైవదర్శనాన్ని కోల్పోతూంటాం. ఇక్కడ యీమె వుదంతంలో అచ్చంగా ఇదే జరిగింది.

## 2. ప్రభువు ఆ స్త్రీ తన్ను గుర్తుపట్టాలని కోరాడు, 10–12

క్రీస్తు ఆ మహిళ నుండి రెండంశాలు కోరాడు. మొదటిది, దేవుని వరమైన తన్ను ఆమె గుర్తుపట్టాలని. రెండవది తననుండి జీవజలం అడుగుకోవాలని. ఈనాడు మనం కూడ తన్ను గుర్తుపట్టాలనీ, తన నుండి జీవజలం అడుగుకోవాలనీ ప్రభువు అభిలషిస్తాడు.

జీవజలాలనే పదాన్ని ఆవిడ అపార్థం చేసికొంది. యూదులు చెరువులు, బావులు మొదలైన వాటిల్లో నిల్వవుండే నీళ్ళను మృతజలాలు అనేవాళ్ళు. ఊటలనుండి కాల్వల నుండీ పారే నీళ్ళను జీవజలాలు అనేవాళ్లు. మొదటి దాని కంటె రెండవది శ్రేష్ఠమైన జలం. కనుక ప్రభువు తాను జీవజలాలలనిస్తానని చెప్పగా సమరయ మహిళ అతడు ఏ పూట నీళ్లో తీసికొనివస్తాడని అపార్థం చేసికొంది. అతడు యాకోబు బావి నీటికంటె గూడ శ్రేష్ఠమైన నీళ్ళు తీసికొని రాగలడా అని అనుమానించింది.

క్రీస్తు బోధను అతని శ్రోతలు అపార్థం చేసికోవడమూ ఆయపార్థం ద్వారా అతడు తన బోధను మరింత విపులంగా వివరించి చెప్పడమూ యోహాను ప్రయోగించే రచనా పద్ధతి. మరో సందర్భంలో ప్రభువు పరలోకాన్నుండి దిగివచ్చిన ఆహారాన్ని దయచేస్తానని చెప్పాడు. యూదులు ఆ వాక్యం అపార్థం చేసికొన్నారు. అది భౌతికాహారమని భ్రాంతి పడ్డారు. కనుక వాళ్ళు ఆ యహారాన్ని మాకు నిత్యమూ దయచేయమని వేడుకొన్నారు. అప్పుడు ప్రభువు తానిచ్చే ఆహారం భిన్నమైందని వివరించి చెప్పాడు –యోహా 6,34. అలాగే యిక్కడ కూడ సమరయ స్త్రీ అపార్థాన్ని ఆధారంగా చేసికొని జీవలజమంటే యేమిటో వివరించి చెప్పడానికి పూనుకొన్నాడు.

### 3. నరుడు నిత్యజీవానికి దాహంగొనాలి 13-15

నరుల హృదయాల్లో ఓ మహాదాహం కన్పిస్తుంది. ఆ దాహం మృత్యువుని జయించి అమరత్వం పొందడానికి, నిత్యజీవాన్ని సంపాదించుకోవడానికి. కనుకనే వైదిక ఋషి "మృత్యోర్మా అమృతం గమయ" -నేను ఈ మరణాన్ని తప్పించుకొని అమరత్వాన్ని పొందేలా చేయి - అని ప్రార్థించాడు. భగవంతునియందు విశ్రమించిందాకా మన హృదయాలకు విశ్రాంతి లేదు అని నుడివాడు అగస్టీను భక్తుడు. ఈ హృదయ దాహాన్ని తీర్చడానికే ప్రభువు జీవజలం దయచేస్తాడు. అది భక్తుని హృదయంలో నిత్యజీవానికి ఊరే నీటిబుగ్గ ఔతుంది. అనగా క్రీస్తుని విశ్వసించే భక్తుని హృదయంలో నిరంతరమూ పారే నీటిబుగ్గ ఒకటి పెల్లుబుకుతుంది. దాని నీళ్ళు అతనికి నిత్యజీవాన్ని దయచేస్తాయి.

ప్రభువు సమరయ మహిళ హృదయమంలో నిత్యజీవం పట్ల కోరిక పుట్టించాడు. ఆమె యింతకుముందు క్రీస్తు తనకు ఏ పూట నీళ్లో యిస్తాడనుకొంది. ఇప్పుడు అతడేదో అద్భుతమైన నీళ్ళు దయచేస్తాడు అనుకొంది. కాని ఆ నీళ్లేమిటివో ఆమెకు సరిగా అర్థం కాలేదు. ఆ జలం దేవుని వరప్రసాదానికి చిహ్నంగా వుంటుందని ఆమె గుర్తించలేదు. ఆమె యింకా భౌతిక పరిధిలోనే వుండిపోయింది. ఆ జలం వల్ల తన భౌతికమైన దప్పిక తీరుతుందని భావించింది. కనుక తాను మళ్లామళ్లా బావికి వచ్చే అవసరం తీరిపోయేలా తనకా నీళ్ళు ఈయమని అభ్యర్థించింది.

సమరయ స్త్రీ జీవజలాన్ని భౌతికజలంగా అపార్థం చేసికొన్నా ఆమె ఆ నీటిని మక్కువతో ఆశించింది. ప్రభువు ఈనాడు మనం కూడ ఆ జీవజలాన్ని ఆశించాలని కోరు కొంటాడు. ఆ జీవజలం పవిత్రాత్మేనని తర్వాత విశదమౌతుంది -యోహా 7,37-39.

### 4. ప్రభువు ఆమెను ఆత్మావలోకనానికి సిద్ధంజేసాడు 16-17

సమరయ స్త్రీకి జీవజలం మీద కోర్కె పుట్టగానే ప్రభువు ఆమెతో నీ భర్తను పిల్చుక రమ్మన్నాడు. దేవుని అనుగ్రహాన్ని పొందాలంటే హృధయ పరివర్తనం అవసరం. పరివర్తనం చెందితేనే గాని దైవదర్శనమూ పరలోకప్రాప్తీ లేదు -మత్త 18,3. కనుక ప్రభువు ఆమె హృదయాన్ని పరివర్తనానికి సిద్ధం చేసాడు. ఆమె తనలోనికి తాను చూచుకోవడానికి సాయం చేసాడు.

సమరయులూ యూదులూ మూడుసార్లు పెండ్లాడవచ్చు. కాని ఈమె ఐదవ పురుషునితో జీవిస్తుంది. అనగా వ్యభిచార జీవితం గడుపుతూంది. కనుక ఆమె పరివర్తనం చెందాలి. ఆమె హృదయం సృష్టివస్తువుల నుండి ఇహలోక సుఖభోగాల నుండీ ఆనందం పొందగోరుతూంది. నిజమైన ఆనందం దేవుని నుండిగాని లభించదని ఆమె యింకా గుర్తించలేదు. అలాగ గుర్తించేలా చేసాడు ప్రభువు.

భర్తపేరురాగానే ఆమె నాకు భర్త లేదు అని బొంకింది. ఈ బొంకు ఆత్మరక్షణానికి "నీ భర్తని పిలువు" అన్న ప్రభువు వాక్కు ఓ న్యాయాధిపతిలా ఆమె నేరాన్ని రుజువు చేసింది. ఆమె మీద వ్రేలెత్తి చూపింది. కాని తన తప్పుని ఒప్పుకొని, తన పాపజీవితాన్ని

మార్చుకొనే ధైర్యం ఆమెఉ లేదు. కనుక భయపడిపోయి అబద్ధాలు చెప్పడం ప్రారంభిం చింది. ఐనా మె పశ్చాత్తాపపడి హృదయ శుఎద్ధిని పొందితేనే గాని దైవదర్శనాన్ని పొందలేదు. కనుక ప్రభువు ఆవిడ పశ్చాత్తాపపడి మనసు మార్చుకోవడానికి సహాయం చేసాడు.

## 5. ప్రభువు ఆమెను వెల్తురుని గ్రహించేలా చేసాడు, 18-20

ప్రభువు వాక్యం వెల్తురు. ఆ వెల్తురులో నరుడు తన్ను తాను పరిశీలించి చూచుకోవాలి. తన నడవడికను తాను చక్కదిద్దుకోవాలి. కాని పాపి వెలుగు దగ్గరికి రావడానికి భయపడతాడు. తన దుష్క్రియ లెక్కడ బయట పడతాయోనని జంకుతాడు -యోహా 3,20-21. కనుకనే సమరయ మహిళ భయపడింది, ఆందోళనము చెందింది, అబద్ధాలాడింది. ఈ పట్టున ప్రభువు ఆమె పాపాన్ని బట్టబయటలు చేసి ఆమె పరివర్తనం చెందడానికి దోహదం చేసాడు. మనసు మార్చుకోడానికి ప్రేరేపించాడు.

ప్రభువు ఆవిడ పాపజీవితపు ఊసెత్తగానే ఆమె అతనికి తన రహస్యాలు తెలుసునని అర్థం చేసికొంది. కనుక అతన్ని దైవభక్తుని గాను ప్రవక్తగాను గుర్తించింది. ఆ రోజుల్లో మహాప్రవక్త ఒకడు విజయం చేస్తాడని యూదులూ సమరయులూ గూడ నమ్ముతూండేవాళ్ళు. "నీలాంటి ప్రవక్త నొకణ్ణి మళ్ళా జనం దగ్గరికి పంపుతాను" అని ప్రభువు పూర్వం మోషేకు వాగ్దానం చేసాడు. ద్వితీ 18-18. కనుక ప్రజలు ఈ వ్యక్తి కోసం ఎదురు చూస్తున్నారు. సమరయ స్త్రీ తన రహస్యం తెలియజేసిన ఈ వ్యక్తి పై ప్రవక్తలాంటివాడై వుండవచ్చు ననుకొంది.

ప్రవక్త అన్న భావం మదిలో మెదలగానే ఆమెకు దేవుడూ ఆరాధనమూ గుర్తుకి వచ్చాయి. కనుకనే దేవుణ్ణి ఎక్కడ ఆరాధించాలని ప్రశ్నించింది. యూదులు యెరూషలేము కొండమీద దేవుణ్ణి కొలుస్తున్నారు. కాని సమరయులు అక్కడికి వెళ్లరు. వాళ్ళు గెరిసిం అనే కొండమీద ఇంకో దేవళం నిర్మించుకొనిఅక్కడ దేవుణ్ణి కొల్చేవాళ్ళు. ఈరెండింటిలో ఏది నిజమైన ఆరాధనమోచెప్పమని అడిగింది. ఆమె భక్తిగల ఆరాధనం ద్వారా తాను దేవునితో సమాధానడాలని కోరకొంది. అనగా ప్రభువు వాక్కు ఆమెకు పరివర్తనం కలిగించడం మొదలెట్టింది అనుకోవాలి.

## 6. సమరయ స్త్రీ మెస్సీయాను గుర్తించడం 21-26

యూదుల యెరూషలేము ఆరాధన, సమరయుల గెరిసిం ఆరాధనా కూడ ఇక మీదట చెల్లవు అన్నాడు ప్రభువు. సమయం ఆపన్నమైంది. అనగా మెస్సీయా కాలం రానే వచ్చింది. ఈ కాలంలో ప్రజలు ఆత్మద్వారాను, సత్యం ద్వారాను తండ్రిని ఆరాధించాలి. అంత్యదినాల్లో అనగా మెస్సీయాకాలంలో, ఆత్మ అందరిమీదా కుమ్మరిం పబడుతుంది. కనుక ఆత్మద్వారా తండ్రిని ఆరాధించడం అవసరం. ఇంకా, సత్యం ద్వారా కూడ అతన్ని ఆరాధించాలి. ఇక్కడ సత్యం అంటే క్రీస్తే. అతడు తండ్రి చేసిన

రక్షణప్రణాళికను నెరవేర్చేవాడు. తండ్రిని గూర్చి ప్రజలకు తెలియజేసేవాడు. కనుక అతనికి "సత్యం" అని పేరు -యోహా 14,6. కనుక ఆత్మద్వారాను క్రీస్తుద్వారాను మాత్రమే తండ్రిని ఆరాధించాలనీ, అదొక్కటే నిజమైన ఆరాధనమనీ, తెలియజేసాడు క్రీస్తు.

నిజమైన ఆరాదనం ఈలా వుంటుందని సమరయ మహిళకు తెలియదు. కనుక ఆమె యేసు పలుకులకు విస్తుపోయింది. మేమంతా ఎదురుచూసే మెస్సీయా ఎటూ రాబోతున్నాడు గదా, అతడు వచ్చాక ఈ విషయాలన్నీ మాకు సవివరంగా తెలియజేస్తాడులే అంది. ఆ మాటలతో క్రీస్తు తన్ను ఎరుకపరచుకొనే సమయం వచ్చింది. అతడు "అమ్మా! నీవు ఆమెస్సీయా ఎప్పుడో వస్తాడు అనుకుంటున్నావు. నీతో మాట్లాడే నేను ఆ మెస్సీయాను" అన్నాడు. ఆవిడ ప్రభువుతని మెస్సీయాగా గుర్తించింది.

ప్రభువు అభిలషించినట్లే ఆమె తనకు జీవజలం దయచేయమని అడిగింది -15వ వచనం. అతన్ని మెస్సీయాను గాను గుర్తించింది -26వ వచనం. ఈ రెండు భాగ్యాలూ మనకూ అబ్బితే మన జీవితం గూడ ధన్యమౌతుంది.

## ప్రార్థనా భావాలు

1. ప్రభువు సమరయ స్త్రీకి జీవజలమిస్తానని చెప్పాడు. ఈ జీవజలం పవిత్రాత్మే, ప్రభువుని విశ్వసించే భక్తుని హృదయంలో నుండి జీవజలాలు పారతాయి. ఈ జీవజలం ఆత్మే. ఈ జీవజలం వల్ల భక్తుని దప్పిక తీరుతుంది -యోహా 7,37-39. అన్ని వరప్రసాదాలకూ మూలం పవిత్రాత్మే. ఆ యాత్మను పొందడం ద్వారా భగవంతుణ్ణి దర్శించాలి, అమరత్వం పొందాలి అనే మనకోరికలు నెరవేరుతాయి. ఆత్మ క్రీస్తు హృదయంలో నుండి భక్తుని హృదయంలోకి వేంచేస్తుంది. కనుక ఆ సమరయ స్త్రీ లాగే మనం కూడ ప్రభువుతని జీవజలం దయచేయమని అడుగుకోవాలి.

రెండవ శతాబ్దంలో వేదసాక్షిగా మరణించిన మహాభక్తుడు అంటియోకయ ఇన్యాసివారు. ఈయన్ని రోములో సింహాలకు మేతగా వేసారు. ఇతడు రోమా పౌరులకు వ్రాసిన జాబులో ఈ జీవజలాన్ని పేర్కొన్నాడు. "ఆ జీవజలం నా అంతరంగంలో నుండి నన్ను తండ్రి చెంతకు రమ్మని పిలుస్తూంది" అని చెప్పుకొన్నాడు. అనగా పవిత్రాత్మే నీవు వేదసాక్షిగా మరణించి తండ్రిని చేరుకొమ్మని ఇగ్నేష్యస్ భక్తుణ్ణి ప్రబోధిం చిందని భావం. క్రీస్తు దయచేసే జీవజలం, అనగా అతని ఆత్మ -మనలను తండ్రి చెంతకూ, క్రీస్తు చెంతకూ చేరుస్తూంటుంది.

16వ శతాబ్దపు పునీతురాలు అవిలా తెరేసమ్మగారికి కూడ ఈ జీవజలాలపట్ల అపారమైన భక్తి వుండేది. ఆమె సమరయ స్త్రీ క్రీస్తుని జీవజలాలీయమని అడిగిన సంఘటనాన్ని చిత్రంగా వ్రాయించుకొని ఆ చిత్రాన్ని ఎప్పుడూ తన ముందట వుంచుకొనేది. ఆ సమరయ మహిళకు లాగే తనకు గూడ జీవజలాలు ప్రసాదించమని ప్రభువుని వేడుకొంటూండేది. ఈ భక్తురాలు మనకు కూడ ఆదర్శంగా వుంటుంది.

సిలువమీద ప్రభువు హృదయంలో నుండి వెలువడిన నీళ్ళు ఈ జీవజలాలే – యోహా 19,34. ఈ నీటిని మనం మక్కువతో ఆశించాలి.

2. ఆత్మద్వారా తండ్రిని ఆరాధించాలి అన్నాడు ప్రభువు. ఈ యారాధనను సాధ్యం చేయడానికి ఆత్మ మనలను దేవుని బిడ్డలను చేస్తుంది –రోమా 8,15–16. మనం దేవుని బిడ్డలమై దేవుణ్ణి "నాన్నా" అని పిలుస్తాం. అతన్ని భక్తితో కొలుస్తాం.

ఆత్మ మనం తండ్రిని ఆరాధించేలా చేయడం మాత్రమే కాదు. క్రీస్తు దగ్గరికి చేరేలా కూడ చేస్తుంది. ఆ ప్రభువు సత్యం అని చెప్పాం –యోహా 14,6. ఆత్మ మనల్ని సర్వసత్యంలోకి నడిపిస్తుంది –16,13. అనగా మనల్ని సంపూర్ణ క్రీస్తు లోనికి నడుపుతుంది. మనం క్రీస్తుని అర్థం చేసుకొనేలా చేస్తుంది. క్రీస్తుని చేరకొనేలా, ఆ ప్రభువునిర పొందేలా చేస్తుంది. కనుక ఆ ప్రభువుని అధికాధికంగతా పొందే భాగ్యం దయచేయమని మనం ఆయాత్ముణ్ణి అడుగుకోవాలి.

3. దేవుని వరాన్ని స్వీకరించాలి అంటే హృదయ పరివర్తనం అవసరం, ప్రభువు వాక్కు ఈ హృదయ పరివర్తనాన్ని పుటిప్టస్తుంది. అది ఓ న్యాయాధిపతియైన మనకు తీర్పు చెపుతుంది. మన దోషాన్ని తెలియజేస్తుంది –హెబ్రే 4,12.

వాక్కు పరివర్తనం కలిగిస్తుంది అనడానికి దావీదు కథ చక్కని తార్కాణం. అతడు ఊరియాను చంపించి అతని భార్యయైన బత్షేబాను అపహరించాడు. అప్పుడు నాతాను ప్రవక్త వచ్చి దావీదుని పేదవాని గొర్రెపిల్లని అపహరించిన ధనికునితో పోల్చి కథ చెప్పాడు. ఆ కథలో దొంగపనికి పాల్పడిన యజమానుడు ఎవరో కాదు నీవేనని హెచ్చరించాడు. దానితో దవీదునకు పరివర్తనం కలిగింది –2సమూ 12,7. ఆ దావీదునకు లాగే, ఆ సమరయ స్త్రీకి లాగే ప్రభువు వాక్కు మనకు కూడ పశ్చాత్తాప భాగ్యాన్ని సంపాదించి పెడుతుంది. కనుక మనం ప్రభువు వాక్కుని ధ్యానం చేసికొని పరితాపం చెందుతుండాలి. తన వాక్కు ద్వారా మన తప్పులను ఎత్తి చూపించమని ప్రభువుని అడుగుకోవాలి.

4. క్రీస్తు సమరయ స్త్రీ రక్షణం కొరకు దాహం గొన్నాడని చెప్పాం. అలాగే అతడు మన రక్షణం కొరకు కూడ దాహం చెందుతాడు. మనం పాపమార్గంలో బోయినపుడు అతడు తప్పిపోయిన గొర్రెను లాగ మనలను వెతుక్కొంటూ వస్తాడు – లూకా 15,4. మనం అతన్ని విస్మరించినా అతడు మనలను విస్మరించడు. అలాంటి ప్రభువుకి మనం చేయెత్తి దండం పెట్టాలి. కాలుజారి పాపకూపంలో పడిపోయినప్పుడల్లా అతడు మనక ప్రబోధం కలిగించి మనలను బయటికి లాగాలని భక్తితో అడుగుకోవాలి.

## 29. రెండు మార్గాలు

బైబులు రెండుమార్గాలను పేర్కొంటుంది. ఒకటి సన్మార్గులు నడచేది, మరొకటి దుర్మార్గులు నడచేది. ఈ రెండు మార్గాలను గూర్చి చెప్పే బైబులు అవలోకనాలను జాగ్రత్తగా పరిశీలించి చూస్తే మనమే మార్గంలో నడుస్తున్నామో స్పష్టమౌతుంది. కనుక ఈ వ్యాసం ఆత్మపరిశీలనానికి ఉపయోగపడుతుంది.

క్రైస్తవ భక్తుడు వివేకాన్ని అలవర్చుకోవాలి. దుష్టమార్గమేదో శిష్టమార్గమేదో చక్కగా గుర్తించాలి. చెడ్డ త్రోవను విడనాడి మంచి త్రోవలో నడవడం నేర్చుకోవాలి. ఇందుకు కూడ ఈ వ్యాసం తోడ్పడుతుంది.

## 1. సజ్జనులూ - దుర్జనులూ

ఉదయభానుడు అంతకంతకూ తేజరిల్లుతూ నిండు వెలుగుని సంతరించు కొంటాడు. సజ్జనులు నడిచేమార్గం ఈలా ఉంటుంది. కాని దుర్జనుల మార్గం తమోమయంగా వుంటుంది. వాళ్ళు ఏదో తట్టుకొని పడిపోతారు. ఏమి తట్టుకొని పడ్డారో గూడ వాళ్ళకే తెలియదు -సామె 4,18-19. ఈ వాక్యాలను బట్టి తేజోమార్గంలో నడిచేవాళ్ళు సత్పురుషులనీ, తమోమార్గంలో నడిచేవాళ్ళు దుర్మార్గులనీ అర్థం చేసికోవాలి. నరుల్లో కొందరు సజ్జనులూ, కొందరు దుర్జనులూ.

## 2. భక్తిమంతులూ - భక్తి హీనులూ

కొందరికి ప్రభువు ధర్మశాస్త్రం పట్ల అపారమైన భక్తి వుంటుంది. వాళ్ళు నిత్యం దాన్ని పఠిస్తారు. ధ్యానిస్తారు. దాని యాజ్ఞలను సంతోషంతో పాటిస్తారు. ఫలితంగా దేవుని దీవెనలు పొందుతారు. విజయాలు సాధిస్తారు. వీళ్ళు ఏటివొడ్డున ఎదిగిన చెట్టులా సత్ఫలాలనిస్తారు. కాని కొందరు దుష్టుల మార్గంలో నడుస్తారు. దేవుణ్ణి లెక్కచేయరు. వీళ్ళు వినాశనాన్ని కొనితెచ్చుకొంటారు. గాలికి కళ్ళంలోని పొట్టు, తాలు ఎగిరిపోయినట్లుగా ఎగిరిపోతారు -1వ కీర్తన

## 3. సత్యవాదులు - అసత్యవాదులు

ప్రవక్తలు సత్యప్రియులు, అసత్యప్రియులు అని రెండు రకాలు -2పేతురు 2,1-4. నరులు సత్యమార్గంలో నడవాలే గానీ అసత్యమార్గంలో నడవకూడదు

## 4. గర్వాత్ములు - వినయాత్ములు

కొందరు గర్విష్టులు, కొందరు వినయవంతులు. దేవుడు అహంకారులను ఎదిరిస్తాడు. కాని వినమ్రులకు తన కృపను దయచేస్తాడు -యాకో 4,6.

## 5. చీకటిలో నడిచేవాళ్ళూ - వెలుగులో నడచేవాళ్ళూ

దుష్క్రియలు చేసేవాడు వెలుగు దగ్గరికి రాడు. అలా వస్తే వాడి దుష్టకార్యాలు బయటపడతాయి. కనుక అతడు చీకటిని ప్రేమించి చీకటిలోనే వుండిపోతాడు. కాని సద్వర్తనుడు ధైర్యంగా వెలుగు దగ్గరికి వస్తాడు. తన కార్యాలు దేవుని చిత్తాను సారమే జరిగాయని నిరూపించుకొంటాడు -యోహా 3,19-21. జగతికి జ్యోతి క్రీస్తే. ఆ ప్రభువుని అనుసరించేవాడు చీకటిలో నడవడు. అతడు జీవపు వెలుగునే పొందుతాడు -8,12. జ్ఞానస్నానానికి ముందు మనం చీకటిలో వుంటాం. కాని జ్ఞానస్నానంలో వెలుగును పొందుతాం. అప్పటినుండి వెలుగులోనే నడవాలి -ఎఫె 5,8. ఉత్థాన క్రీస్తు వెలుగు నిత్యమూ మనమీద ప్రకాశిస్తుంటుంది -5,14. ఈ వాక్యాలను బట్టి క్రీస్తు శిష్యుడు వెలుగులో నడచేవాడనీ పాప చీకటిలో నడచే వాడనీ అర్థం చేసికోవాలి.

## 6. జీవమూ - మృతువూ

ధర్మమారగం జీవానికీ, అధర్మమార్గం మృత్యువుకీ చేరుస్తుంది -సామె 12,28. బుద్ధిమంతుడు జీవానికి చేర్చే పరమపథాన పయనిస్తాడే గాని మృత్యువునకు చేర్చే అధోమార్గాన నడవడు -15,24. కొందరు తప్పుత్రోవల్లో నడచి మృత్యువునీ, మరి కొందరు మంచి బాటల్లో నడచి జీవాన్నీ చేపడతారని భావం.

## 7. గోధుమలూ - కలపు గింజలూ

ఒక యజమానుడు తన పొలంలో గోధుమలు విత్తాడు. అటు తర్వాత అతని శత్రువు వచ్చి ఆ పొలంలో కలుపు గింజలు చల్లాడు. గోధుమా కలుపూ రెండూ కలసే పెరిగాయి -మత్త 13,24-30. దైవరాజ్యంలో కొందరు గోధుమ పైరులాంటి వాళ్ళు. మరికొందరు కలపు మొక్కల్లాంటి వాళ్ళు -మత్త 13,24-20

## 8.దేవుని సంకల్పం - శారీరక వ్యామోహం

క్రీస్తుని అనుసరించేవాళ్ళు దైవ సంకల్పం ప్రకారం జీవించాలే గాని శారీరక వ్యామోహాల ప్రకారం జీవించగూడదు -1పేతురు 4,1-2. అవి రెండూ భిన్నమార్గాలు.

## 9. సులభమైన మార్గం - కష్టమైన మార్గం

జీవానికి పోయే మార్గం ఇరుకైంది, కష్టమైంది. కనుక కొద్దిమంది మాత్రమే ఆ త్రోవన బోతారు. వినాశానికి చేర్చే మార్గం విశాలమైంది, సులభమైంది. కనుక చాలమంది ఆ బాటన వెళ్తారు - మత్త 7,13-14. శిష్యుడు తన గురువులాగే కష్టమైన మార్గాన్ని ఎన్నుకోవాలి.

## 10. మంచి పండ్లు - చెడ్డ పండ్లు

మామిడి చెట్టు మంచి పండ్లను కాస్తుంది. కనుక అది మంచి చెట్టు. ఉమ్మెత్త చెట్టు చెడ్డకాయలు కాస్తుంది. కనుక అది చెడ్డచెట్టు. పండ్లను బట్టి చెట్టును నిర్ణయిస్తాం. కొందరి క్రియలు మామిడి పండ్లలా వుంటాయి. వాళ్ళు మంచిచెట్టు లాంటివాళ్ళు. కొందరి క్రియలు ఉమ్మెత్త కాయల్లా వుంటాయి. వాళ్ళు చెడ్డచెట్టు లాంటివాళ్ళు. ఈలా పండ్లను బట్టి చెట్టుని నిర్ణయిస్తాం -మత్త 7,20. మంచి పండ్లు కాయని చెట్టుని నరికి అగ్నిలో బడవేస్తారు. దానికి శిక్ష తప్పదు -3,10. ఈ యాలోకనాలను బట్ట మంచిపనులు చేసేవాళ్ళు కొందరు, చెడ్డపనులు చేసేవాళ్ళు కొందరు అని అర్థం చేసికోవాలి.

## 11. శారీరక మానవులూ - ఆధ్యాత్మిక మానవులూ

కొందరు శరీరం కోరికల ప్రకారం జీవిస్తారు. కాని శారీరక వాంఛలు మరణానికి దారితీస్తాయి. కొందరు ఆత్మను అనుసరించి జీవిస్తారు. ఆత్మ కోరికలు జీవానికి శాంతికీ దారితీస్తాయి -రోమా 8,5-9. ఇంకా శరీరం కోరికలు ఆత్మ

కోరికలకూ, ఆత్మ కోరికలు శరీరం కోరికలకూ విరుద్ధంగా వుంటాయి. శరీరం కోరికలు జారత్వం, విగ్రహారాధనం, శత్రుత్వం, కలహం, అసూయ, క్రోధం, స్వార్థం, కక్షలు, త్రాగుబోతుతనం మొదలైనవి. కాని ఆత్మ కోరికలు ప్రేమ, ఆనందం, శాంతి, సహనం, దయ, మంచితనం, విశ్వసనీయత, నిగ్రహం మొదలైనవి -గల 5,16-24. కనుక శారీరక మానవులది ఒక త్రోవా, ఆధ్యాత్మిక మానవులది మరొక త్రోవా.

## 12. పై నుండి వచ్చినవాళ్ళు - క్రింది నుండి వచ్చినవాళ్ళు

పై నుండి వచ్చినవాళ్ళు పరలోకానికి చెందినవాళ్ళు. క్రీస్తు ఈ వర్గానికి చెందినవాడు. క్రిందినుండి వచ్చినవాళ్లు ఇహలోకానికి చెందినవాళ్లు. క్రీస్తుని నిరాక రించిన యూదులు ఈ ముఠాకి చెందినవాళ్లు -యోహా 8,23.

## 13. ప్రపంచజ్ఞానం - దైవజ్ఞానం

కొందరిది ఈ ప్రపంచజ్ఞానం. ఇది నాశమైపోతుంది. కొందరిది భగవంతుని జ్ఞానం. ఇది శాశ్వతంగా నిలుస్తుంది. 1కొ 2,15. ఆ ప్రభువు మేము విజ్ఞానులం అనుకొనేవాళ్ళ జ్ఞానాన్ని నాశం చేస్తాడు -1కొ 1,19.

## 14. లౌకిక జ్ఞానం - దివ్యజ్ఞానం

కొంతమందికి లౌకికజ్ఞానం సమృద్ధిగావుంటుంది. ఈలాంటి వాళ్ళ హృదయాల్లో ఈర్ష్య, ద్వేషం, స్వార్థం, అసూయ, అశాంతి మొదలైన దుర్గుణాలుంటాయి. మరి కొంతమందికి దివ్యజ్ఞానం వుంటుంది. ఈలాంటివాళ్ళ హృదయంలో నిర్మలత్వం, శాంతం మృదుత్వం, స్నేహం, కరుణ, నిజాయితీ మొదలైనసద్గుణాలుంటాయి-యాకో3,13-18.

## 15. సైతాను బిడ్డలు - దేవుని బిడ్డలు

పాపకార్యాలకు పాల్పడేవాళ్ళు సైతాను బిడ్డలు. తోడినరుణ్ణి ప్రేమింపనివాళ్లు ఈలాంటివాళ్ళు. దుష్కార్యాలకు పాల్పడనివాళ్ళు దేవుని బిడ్డలు. సోదరప్రేమ కలవాళ్ళు ఈలాంటివాళ్ళు - 1యోహా 3,8-10.

## 16. సోదరప్రేమ కలవాళ్ళు - అది లేనివాళ్ళు

క్రైస్తవభక్తుడికి సోదరప్రేమను మించిన పుణ్యం లేదు -1కొ 13,1-3. కాని అది కలవాళ్ళు కొందరు, లేనివాళ్ళు కొందరు.

## 17. ఆజ్ఞను పాటించేవాళ్ళు - పాటించనివాళ్ళు

శిష్యులు సోదరప్రేమతో జీవించాలని క్రీస్తు ఆజ్ఞ.ఈ యాజ్ఞను పాటిస్తే అతని శిష్యులమౌతాం. లేకపోతే కాము -యోహా 13,45.

## 18. కొత్త సృష్టి - పాత సృష్టి

ప్రభువులో నెలకొని వుండేవాడు నూత్నసృష్టికి చెందుతాడు. అలా నెలకొని వుండనివాడు పాతసృష్టికి చెందుతాడు. అతనిది పాపజీవితం -2కొ 5,17.

## 19. బానిసలు - దత్త పుత్రులు

కొందరు దేవునిపట్ల బానిసల్లా మెలుగుతారు. వీళ్లకు స్వాతంత్ర్యం వుండదు. కొందరు దేవునిపట్ల దత్తపుత్రుల్లా మెలుగుతారు. వీళ్ళకు స్వేచ్ఛ వుంటుంది. నూత్న వేదప్రజలమైన మనం ఈలాంటి వాళ్ళం -రోమా 8,15-16. కాని దేవునిపట్ల చనువూ చొరవా లేకపోతే మనం కూడ బానిసలమై పోతాం.

## 20. దైవప్రియులు - ఇహలోక ప్రియులు

క్రీస్తుని ఎదిరించిన యూదులు ఇహలోక సంబందులు. వీళ్ళు పాపులు. క్రీస్తూ అతని శిష్యులూ దైవసంబంధులు - యోహా 8,23. పాపులు ఇహలోక సంబంధమైన ఆత్మను స్వీకరిస్తారు. కాని శిష్యులు దేవుని ఆత్మను స్వీకరిస్తారు -1కొ 2,12. పాపులు ఇహలోక అభిరుచులకూ ప్రమాణాలకూ అనుగుణంగా జీవిస్తారు. కాని భక్తులు ఇహలోకపు విలువలను స్వీకరించారు. వాళ్ళు ఎప్పటికప్పుడు దేవుని నుండి మానసిక మైన మార్పునీ, నూత్నత్వాన్నీ పొందుతారు -రోమా 12,2. పాపులు కంటికగుపించే ఈ లోకవస్తువులు మీదనే శ్రద్ధజూపుతారు. కాని పుణ్యపురుషులు అగోచరాలైన పరలోక వస్తువుల మీదనే శ్రద్ధజూపుతారు -2కొ 4,18. ఈలోకమూ, దాని వ్యామోహాలూ గతిస్తాయి. కాని దేవుని చిత్తాన్ని నెరవేర్చేవాడు చిరంజీవి ఔతాడు -1యోహా 2,17. పాపు మానవులు ఈ లోకాన్నే ప్రేమిస్తారు. కాని దివ్యమానవులు తండ్రియైన దేవుణ్ణి ప్రేమిస్తారు -1యో 2,15.

లోకాన్ని ప్రేమించేవాళ్ళు ఇక్కడే సంపదలు కూడబెట్టుకొంంటారు. వాటిని చిమ్మటలూ త్రుప్పు దొంగలు కాజేస్తారు. స్వర్గాన్ని ప్రేమించేవాళ్ళు మోక్షంలో సంపదలు కూడబెట్టుకొంటారు. అవి అక్షయంగా వుండిపోతాయి -మత్త 6,20. ప్రాకృతిక మానవులు ఈ భూమిపై గల వస్తువులమీద మనసు లగ్నం జేసికొంటారు. కాని ఆధ్యాత్మిక మానవులు పరలోకంలోని వస్తువులమీద మనసు నిల్పుకొంటారు. ఎందుకంటే ఉత్థాన క్రీస్తు అక్కడ దేవుని కుడిప్రక్కన ఆసీనుడై వుంటాడు గనుక -కొలో 3,2. ఇహలోక ప్రియులు దేవునికి విరోదులు. కనుక ఈ లోకాన్ని ప్రేమించేవాడు తప్పకుండా దేవునితో విరోధం తెచ్చి పెట్టుకొంటాడు -యాకో 4,4.

పైన మనం పేర్కొన్న 19 అంశాలను గూడ ఈ చివరి అంశంలో ఇమడ్చవచ్చు. నరులను ఇహలోక ప్రియులు దైవప్రియులు అని రెండు వర్గాలుగా విభజించవచ్చు. ఈ రెండు వర్గాలవాళ్ళు వేరువేరు యజమానులను సేవిస్తారు. దైవప్రియులు దేవుణ్ణి కోరుకొని అతన్ని సేవిస్తారు. ఇహలోక ప్రియులు ద్రవ్యాన్ని కోరుకొని దాన్ని సేవిస్తారు -మత్త 6,24.

# 13. మహావాక్యాలు

బైబులు భాష్యం 16

## 1. నాయందు నిర్మల హృదయం సృజించు

నరుని ఆలోచనలకీ కోరికలకీ మూలం అతని హృదయం. కనుక నిర్మల హృదయం కలవాడు పవిత్ర మానవుడు. దుష్ట హృదయం కలవాడు దుష్టుడు. అందుకే పై వాక్యంలో కీర్తనాకారుడు చిత్తశుద్ధితో నిర్మల హృదయాన్ని కోరుకొన్నాడు. ఇది చాలా డొక్కశుద్ధిగల ప్రార్థన. మనమంతా పాపులమే. రోజురోజు పాపపు బురదలో అడుగు పెట్టేవాళ్ళమే. కనుక ఓమారు మన హృదయంలోనికి మనం తొంగి చూచుకొని "ప్రభో! నా హృదయాన్ని నిర్మలంచేయి" అని ప్రార్థించుకుందాం. ప్రవక్త యెహెజ్కేలు ప్రవచనంలో ప్రభువు నేను మీకు నూతన హృదయాన్ని నూతన ఆత్మనూ ప్రసాదిస్తాను మీలోని రాతిగుండెను తొలగించి దాని స్థానే మాంసపు గుండెను నిలుపుతాను అంటాడు –36,26. ఈ వాక్యంలో రాతితగుండె అవిధేయుడైన మానవుణ్ణీ, మాంసపు గుండె విదేయుడైన మానవుణ్ణి సూచిస్తాయి. ఈ నిర్మల హృదయమూ ఈ మాంసను గుండె నరుడు ఆశింపదగిన భాగ్యాలుకదా!

## 2. నేను వచ్చింది మీకు జీవాన్ని ఈయడానికీ, సమృద్ధిగా ఈయడానికీ కూడ –యోహా 10,10

క్రీస్తు మనకు జీవం ప్రసాదిస్తాడు. ఆ జీవం కూడ సమృద్ధిగా అనుగ్రహిస్తాడు. లోకంలోని వెలుగంతా గూడా సూర్యుని వద్దనుండి వస్తుంది. అలాగే ఆధ్యాత్మికమైన వెలుగంతా క్రీస్తు నొద్దనుండిని రాదు. అతడు జీవనదాత. ఐనా మనం తరచుగా ఆ ప్రభువు దగ్గరికి వెళ్ళం. జీవంకోసం, మన అక్కర్లు తీర్చుకోవడం కోసం, వాళ్ళనూ వీళ్ళనూ ఆశ్రయిస్తూంటాం. తోడి నరులుగాని మరే సృషి వస్తువులు గాని మనకు సమృద్ధియైన జీవం ఈయలేరు. కనుక ఆ క్రీస్తు నుద్దేశించి, ఆ ప్రభువు నెదుట మన పేరు నుచ్చరించి "ప్రభో! ఫలానా పేరుగల నాకు నీ జీవాన్ని సమృద్ధిగా ప్రసాదించు" అని ప్రార్థిద్దాం.

## 3. నీ యాలోచనలతో నన్ను నడిపిస్తావు కడపట నన్ను నీ మహిమలోనికి జేర్చుకొంటావు కీర్త 73,24.

దేవుడు మనకు మొదట ఓ మంచిపని చేయాలనే కోరిక పుట్టిస్తాడు. ఆ పని చేసేపుడు తాను సహాయపడతాడు. అతని అనుగ్రహం వలననే మనం ఆపనిచేసి ముగిస్తాం.

ఐనా ఆ మంచిపనిని మనంతట మనమే చేసామో అన్నట్లు కడపట అతడు మనలను బహూకరిస్తాడు. ఆ ప్రభువు అంత మంచివాడు. అతనికోసం మనం ఓ మంచి దాసునిలాగ ఉత్సాహంతో పనిచేయాలి. భక్తుడు అగస్టీనులాగే మనమూ ఈలా ప్రార్థిద్దాం. "ప్రభూ! మా పనులన్నీ నీ ప్రేరణతో ప్రారంభమై, నీ సహాయంతో కొనసాగి, నీ దయవల్లనే ముగింపు జెందునుగాక."

## 4. మీరు ప్రార్థనలో అడిగిందల్లా పొందామని విశ్వసించారంటే తప్పక పొందుతారు –మార్కు 11,24

మానసిక రంగంలో నిండు నమ్మికతో ఓ పని ప్రారంభిస్తే తప్పకుండా విజయం సాధిస్తాం. ఆధ్యాత్మిక రంగంలో కూడ నమ్మికతో ఓ పని మొదలుపెట్టామో విజయం పొందుతాం. తరచుగా మనకు ఈ నమ్మిక ఉండదు. అందుకే మనకు విజయం లభించదు. భక్తిమంతులు దేవునియందు నమ్మిక పెట్టుకొని కృషి చేస్తుంటారు. విజయం పొందుతాంటారు కూడ. ఈ మనస్తత్వం మనం కూడా అవశ్యం సాధించాలి. ఓ మారు ఓ తండ్రి దయ్యంపట్టిన తన కుమారుని క్రీస్తు నొద్దకు తీసికొనివచ్చి దయ్యాన్ని పారద్రోలమని కోరాడు. నేను దయ్యాన్ని పారద్రోలగలననే నమ్మిక నీకుందా అని క్రీస్తు అతన్నడిగాడు. అతడు "ప్రభూ! నేను నమ్ముతూనే వున్నాను. ఐనా నా నమ్మిక కొరవడినట్లైతే నీవా కొరతను తీర్చు" అన్నాడు –మార్కు 9,24. ఈ తండ్రికి ఉన్నపాటి నమ్మిక మనకుందా?

## 5. అతనియందే జీవిస్తున్నాం, చైతన్యం పొందుతున్నాం, ఉనికిలో ఉంటున్నాం – అచ 17,28

పౌలు ఆతెన్సు మహాసభలో పల్కిన వాక్యమిది. మనం నిత్యం ఆ భగంతుని యందు నెలకొని వుంటాం. చేప నీటిలో మునిగితేలుతూంటుంది. తామరాకు నీటిమీద తేలియాడుతూ వుంటుంది. పక్షి గాలిలో యెగురుతూంటుంది. అలాగే మనమూ ఆ భగవంతునిలో మునిగి తేలుతూంటాం. త్రాటినుండి వ్రేలాడుతున్న రాయిలాగ నిత్యం ప్రభువుమీద వ్రేలాడుతూంటాం. అతడు పట్టు వదలితే త్రాడు తెగిన రాయిలాగ గబాలున పడిపోతాం. ఏ శూన్యాన్నుండి వచ్చామో మళ్ళా ఆ శూన్యానికే వెళ్ళిపోతాం. మన ఉనికీ మనకీ అంతా ఆ ప్రభువునందే. కనుక అతన్ని స్మరించుకొంటూ జీవించే నరుడు ధన్యుడు

## 6. ప్రభూ! నిత్యజీవమిచ్చే పలుకులు నీ నుండి వెలువడుతున్నాయి. మేమిక యెవరి దగ్గరకు వెళ్తాం!

క్రీస్తు "నా శరీరాన్నే మీకు ఆహారంగా ఇస్తా" నని బోధించాడు. ఆ బోధ రుచించని శిష్యులు అతన్ని వదలివేసి వెళ్ళిపోయారు. క్రీస్తు నిరుత్సాహపడి మిగిలిన శిష్యులను జూచి

మీరూ వెళ్ళిపోతారా అని అడిగాడు. అపుడు పేత్రు పై మాటలు పల్కాడు. ఇవి చాల భక్తిభరితమైన వాక్కులు. క్రీస్తును వదలిపెట్టి ప్రపంచ వ్యామోహాల్లో చిక్కుకుంటే, సంతృప్తి కలుగుతుందా? ఈ లోకపు సిరిసంపదలూ, సుఖభోగాలూ పేరుప్రతిష్టలూ నిత్యజీవం ఈయలవా? ఈ లోకంలో ఏమి పాముకుంటాం? నిత్యజీవపు మాటలు విన్పించేవాడూ, నిత్యజీవం ప్రసాదించేవాడూ ప్రభువొక్కడే. కనుక అతని కంటిపెట్టుకొని వుండేవాడు బ్రతుకుతాడు, అతన్ని విడనాడేవాడు నాశమైపోతాడు.

## 7. ఎవరి మనసు నీ మీద లగ్నమౌతుందో వాళ్ళకు నీవు పరిపూర్ణశాంతిని అనుగ్రహిస్తావు -యెష 26,3

నరులు చిత్తశాంతికోసం ఎంతకృపైనా చేస్తారు. కాని తరచుగా దాన్ని పొందలేరు. హృదయాన్ని దేవునిమీద లగ్నం చేసికొన్న భక్తునికి భగవంతుడు పరిపూర్ణమైన మనశ్శాంతి ననుగ్రహిస్తాడు. ఆ ప్రభువుని నమ్మినవాళ్ళకు కష్టాలు రాకుండా వుండవుగాని, ఆ కష్టాల్లో గూడ వాళ్లు భగవంతుని విడనాడరు. అతడూ వాళ్ళను చేయి విడువడు. మహా పర్వతంమీది శిఖరాల క్రింది భాగంలో మబ్బులు ఆవరించి వుంటాయి. కాని ఆ శిఖరాల మీది భాగాలు మాత్రం మబ్బులకు మీదుగా తలలెత్తుకొని సూర్యునివైపు చూస్తుంటాయి. సూర్యరశ్మితో ప్రకాశిస్తూంటాయి. అలాగే కష్టాల్లో చిక్కుకొన్న భక్తులు కూడ భగవంతునినుండి దృష్టి మరల్చరు. ఆ ప్రభువు కూడ వాళ్ళను హృదయశాంతితో సంతృప్తి పరచకూడదు.

## 8. క్రీస్తును పొందాలనుకొని సమస్తమూ పెంటప్రోవుతో సమానంగా ఎంచాను -ఫిలి 3,8.

పౌలు యూదుల జాతిలో పుట్టినవాడు. యూదుల చదువులు చదివాడు. గమలియేలు నొద్ద ధర్మశాస్త్రం నేర్చుకొన్నాడు. యూదమతాన్ని తు.చ. తప్పకుండ పాటిస్తూ వచ్చాడు. ఇవన్నీ తనకెంతో గౌరవకారణాలు అనుకొన్నాడు. కాని అతడు క్రీస్తు శిష్యుడయ్యాక ఈ విలువలన్నీ వ్యర్థమనీ తెలిసికొన్నాడు. అతన్ని రక్షించింది క్రీస్తుగాని మోషేధర్మశాస్త్రం గాదు. ఆ క్రీస్తు మరణోత్థానాల్లోపాలుపొందితే చాలు తాను ధన్యుడౌతాడు కనుక ఆ క్రీస్తుతో పోల్చుకొంటే సమస్త విలువలూ పెంటప్రోగులాగ నిష్ప్రయోజనమైనవి అనిపించాయి అతనికి. మనం తరచుగా ఉద్యోగన్నో, ధనాన్నో, హోదానో, సుఖాన్నో గొప్ప విలువగా భావిస్తుంటాం. కాని ఈ విలువలన్నిటినీ మించిన విలువ క్రీస్తు. అతనితో పోల్చిచూస్తే ఈ విలువలన్నీ విలువలేనివి. కనుక క్రీస్తు అనే విలువను సంపాదించిన వాడొక్కడు విలువ కలవాడు.

**9. ఈ పేద నరుడు మొరపెట్టగా యావే ఆలకించాడు, సకల శ్రమల నుండి నన్ను రక్షించాడు -కీర్త 34,5**

ఇది చా వినయంతో గూడిన వాక్యం. సామాన్యంగా నరులు తమ్ము గూర్చి తాము గొప్పగా ఎంచుకొంటూంటారు. కాని భక్తులూ మహానుభావులూ తమ్ము గూర్చి తాము స్వల్పంగా ఎంచుకొన్నారు. ఈ కీర్తనాకారుదు కూడ తనబోటి దీనుడు మొరపెట్టగా ప్రభువంతటివాడు ఆలకించాడుగదా అని ఆశ్చర్యపోయాడు. ఈలాంటి వినయం చాలమంచిది. అబ్రాహాము యావేతో మాటలాడుతూ "బూడిద ప్రోవునైన నేను ప్రభువుతో మాటలాడుతూన్నాను గదా" అని వినయాన్ని ప్రదర్శిస్తాడు. ఆది 18,27. మనం కూడ "ప్రభో! ఈ దీనుణ్ణి రక్షించు" అని సవినయంగా ప్రార్థించు కొంటూండాలి.

**10. ఆయన నన్ను తగినవానినిగా తలంచి తన సేవకు నియమించుకొన్నాదు -1తిమొ 1,12.**

పౌలు మొదట క్రీస్తు సమాజాన్ని హింసించాడు. క్రీస్తుకు ప్రత్యర్థిగా నిలిచాడు. క్రైస్తవులను హింసించడానికై దమస్కు వెళ్తుండగా ప్రభువు అతని హృదయం మార్చాడు. ఈలా ఒకవైపున తాను క్రీస్తునకు వ్యతిరేకంగా పనిచేస్తుంటే, మరోవైపున క్రీస్తు తన్ను శిష్యునిగా ఎన్నుకొంటూన్నాడు. ఈ సత్యం పౌలు మనసుకు కరిగించింది. నేను తనకు అపరాధం చేస్తున్నాగూడ ఆ ప్రభువు నన్ను యోగ్యునిగా భావించాడే అని పౌలు ఎంతో ఆశ్చర్యపోయాడు. మనం కూడ ఈలాగే భావించాలి. మనమంతా అయోగ్యులం. కపట వర్తనులం. పాపులం. ఐనా ప్రభువుకి మనమీద సదభిప్రాయం వుంది. కావుననే మనలను తన శిష్యవర్గంలో చేర్చుకొన్నాడు. మనలను మెచ్చుకొనే ప్రభువుపట్ల మనం కృతజ్ఞత చూపవద్దా?

**11. నీకు ప్రభువుమీద నమ్మిక లేకపోతే నీ పనులు నిలువనే నిలువవు - యెష 7,9**

యెషయా ప్రవక్త కాలంలో సిరియా రాజులు యెరూషలేము రాజగు ఆహాను మీదికి దండెత్తి వచ్చారు. ఆ సంగతి వినగానే యెరూషలేము పౌరుల గుండెలు గాలి వానకు కొట్టుకొనే చెట్టు కొమ్మల్లాగ దడదడ కొట్టుకొన్నాయి. ఆ యాపదనుండి వాళ్ళను రక్షింపగలవాడు ప్రభువొక్కడే. ఐనా ఆహానురాజుకి ప్రభువుమీద నమ్మకంలేదు. అందుచేత అతడు రక్షణార్థం బాబిలోనుకు రాయబారులను పంపుతున్నాడు. ఆ సందర్భలో రాజును మందలిస్తూ ప్రవక్తపల్కిన పల్కిది. ఆ యాహాను రాజులాగే మనమూ కష్టాలువచ్చినపుడు

దేవునిమీద నిలువం. కాని ఆ ప్రభువుమీద ఆధారపడకపోతే మరెవరిమీద ఆధారపడ్తాం? అతనిమీద నిలువకపోతే అసలు నిలుస్తామా?

## 12. క్రీస్తుకూడ తన్నుతాను సంతోషపెట్టుకోలేదు -రోమా 15,3

ఇది యెంత చిన్నవాక్యమో అంత గొప్ప వాక్యం. క్రీస్తు తన సుఖం తాను వెదుక్కోలేదు. స్వార్థం కొరకు జీవించలేదు. అలా జీవిస్తే అతడు సిలువ నెక్కేవాడే కాదు. తండ్రి మొదటనే అతనికి మరణ ప్రణాళికను ఒప్పజెప్పాడు. క్రీస్తు జీవించిన కాలమంతా స్వీయ మరణాన్ని మనసులో పెట్టుకొనే జీవిస్తూ వచ్చాడు. ఇక అతడు తన్నుతాను సంతోషపెట్టుకొనేదెలా? అతడు పరార్థజీవి. ఆ గురువువెంట నడచి పోగోరే శిష్యుడు కూడ తన్నుతాను త్యజించుకోవాలి -మత్త 16,24. ఆత్మత్యాగం లేందే ప్రభువును వెంబడింపలేం. ఐనా ఈ యాత్మత్యాగం స్వార్థమానవునికి సుతరామూ గిట్టదు. మనందరి లోను ఈ స్వార్థమనేది చాల బలీయంగా వుంటుంది. భక్తుడు ఫ్రాన్సిస్ డి సేల్సు చెప్పినట్లు, మనం చచ్చాక పదిహేను నిమిషాలకుకాని మనలోని స్వార్థం చావదు! కనుక మనకు గూడ పరార్థజీవితం పట్ల కోరిక పుట్టించమని స్వార్థాన్ని జయించిన ఆ ప్రభువునే మనవిచేద్దాం

## 13. వాళ్లు పక్షిరాజులాగ రెక్కలు విప్పి పైపై కెగురుతారు -యెష 40,31.

ప్రభువును నమ్ముకొని జీవించేవాళ్ళను గురించి చెప్తూ యెషయా ఈలా వ్రాసాడు. "ప్రభువును నమ్ముకున్నవాళ్ళు నూత్నబలాన్ని పొందుతారు. పక్షిరాజులాగ రెక్కలు విప్పి పైపై కెగిరిపోతారు. వాళ్ళు పరుగతెత్తుతూ గూడ అలుపుజెందరు. ప్రయాణం చేస్తూ కూడ సొమ్మసిల్లిపోరు" పక్షిరాజు ఆకాశంలో చాల ఉన్నతంగా ఎగురుతూంటుంది. దాని బలమూ లాఘవమూ చూస్తే భూమిమీద నడిచే మనకు ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది. ప్రభువును నమ్ముకొన్నవాళ్ళు, అతనిమీద ఆధారపడి జీవించేవాళ్ళు, ఈ పక్షిరాజులాగ మీదిమీది కెగరిపోతారు. రోజురోజుకీ వృద్ధి చెందుతారు. వాళ్ళకు అలుపూ, ఆయాసమూ అంటూ వుండదు. చాలమంది భక్తులూ, పునీతులూ మహత్తరమైన జీవితం గడిపారు. ఎంతో కృషిచేసారు. ఎన్నో కార్యాలు సాధించారు. వాళ్ళ జీవిత చరిత్రలు చదువుతూంటే ఒక్కమనిషి యింత పని ఎలా చేసాడబ్బా అని ఆశ్చర్యపోతాం. వాళ్ళను పక్షిరాజులాగ అంతవున్నంతగా ఎగిరించింది ప్రభువే. భగవంతునిమీద ఆధారపడి అతని దయకు పాత్రులమౌతూ జీవించేపుడు మన జీవితంలో కూడ ఓ నూత్నశక్తీ, నూత్నోత్సాహమూ కనిపిస్తుంది. ఈ విషయంలో మీ యమనుభవాన్ని మీరే పరీక్షించి చూచుకొనండి.

### 14. నీయొద్ద జీవధార వుంది, నీ వెలుగులో మేమూ వెలుగు చూస్తాం -కీర్త 36,9

ప్రభువు జీవమిచ్చేవాడు. ఈ జీవానికే కీర్తనకారుడు వెలుగు, జీవధార అని రెండు ఉపమానాలు వాడాడు. అతనినుండి జీవజలం ఓ జీవధారనుండి బాగ నిరంతరాయంగా పెల్లుబికి వస్తుంది. ఈ జీవజలం వల్లనే మనం బ్రతుకుతున్నాం. పైగా అతడు తేజఃపుంజముకూడ. అతని వెలుగు సోకితేనేగాని మనకు వెలుగులేదు. అనగా అతనిజీవం నుండి కాని మనం జీవం పొందలేము. లంగ్రాజ్ అనే బైబులు పండితుడు పూర్వవేదంలోకల్లా పై వచనం శ్రేష్ఠవాక్య అన్నాడు. పూర్వవేదంలోకల్లా శ్రేష్ఠమైన వాక్యం ఐనా కాకున్నా, శ్రేష్ఠమైన బైబులు వాక్యాల్లో ఇదీ వొకటని మాత్రం చెప్పాలి. ఆ ప్రభువు మనకు కూడ తన వెలుగునూ జీవాన్నీ ప్రసాదించాలని మనవి చేద్దాం.

### 15. అతడు భాగ్యవంతుడైకూడ మీకోసం నిరుపేద అయ్యాడు -2కొ 8,9

ఈ వాక్యం క్రీస్తుజనానికి వర్తిస్తుంది. అతడు దేవుడై కూడ మనకోసం నరుడై పుట్టాడు. ఎందుకు? నరులమైన మనలను దివ్యులను చేయడానికి. ఆ ప్రభువు తన దివ్యత్వాన్ని మనకిచ్చి దానికి బదులుగా మన మానుషత్వం తాను పొందుతాడు. మన మానుషత్వం వల్ల అతనికేమీ లాభం లేదు. అతని దివ్యత్వం వల్ల మనకుమాత్రం ఎంతైనా లాభం వుంటుంది. అతడు దరిద్రులను ధనాఢ్యులను జేసేవాడు. పెంటప్రోవులమీద కూర్చొనిన దౌర్భాగ్యులను పైకిలేపి సింహాసనాలమీద కూర్చుండబెట్టేవాడు -1సమూ 2,8. దరిద్ర నరజాతికి చెంఇన మనం అతనిద్వారా దివ్యులం కావాలి.

### 16. మనం పిడికెడు మట్టిముద్ధనుండి పుట్టామని ఆ ప్రభువునకు జ్ఞాపకముంటుంది -కీర్త 103,14.

మన పుట్టుపూర్వోత్తరాలు ఆ ప్రభువునకు బాగా తెలుసు. నరులు పిడికెడు మట్టి ముద్దనుండి పుట్టిన ఆదాము సంతతివారని ఆ ప్రభువునకు జ్ఞాపకముండదా? కనుక మన బలహీనతలను జూచి మనం ఆవ్చర్యపడినా, ఆ ప్రభువు మాత్రం ఆశ్చర్యపడదు. తండ్రి బిడ్డలమీద జాలి జూపినట్లుగా ఆ ప్రభువు మనమీద జాలి జూపుతూంటాడు. మనం నడవలేక జారిపడిపోయినపుడు అతడు జాలితో పైకి లేపుతూంటాడు. బురదలో దిగబడిపోయినపుడు నెనరుతో ఒడ్డు చేరుస్తూంటాడు. బైబులు భగవంతుడు నరులేమి అపరాధం చేస్తారో పట్టుకొందామని ఓ పోలీసువాడిలాగ కనిపెట్టుకొని వుండడు. ఓ తండ్రిలాగ మనలను నెనరుతో చూస్తుంటాడు. నిత్యమూ మనలను ఆదుకొంటాడు.

**17. క్రీస్తు నిన్నా ఇవ్వాళ్ళ ఎప్పుడూ ఒకే రీతిగా వుంటాడు –హెబ్రే 13,8**

క్రీస్తు ఎప్పుడూ ఒకేరీతిగా వుంటాడు. అతనిలో మార్పేమీ లేదు. ఏసు అంటే యేమిటి? రక్షకుడు. అతడు తాను జీవించినపుడూ రక్షకుడే, ఇప్పుడూ రక్షకుడే. అతని తరపున అతడు రక్షణం ఈయడానికి ఎప్పుడూ సంసిద్ధంగానే వుంటాడు. కాని మన తరపున మనం మాత్రం ఆ రక్షణం పొందడానికి సంసిద్ధంగా వుండం. అతడు మార్పు చెందుతూంటాం. కనుక మనకు అతనితో వుండే సంబంధం మారిపోతుంటుంది. అతడు రక్షకుడే గాని అతని రక్షణాన్ని పొందే యోగ్యత మాత్రం మనకుండదు. మరి మనం ఏం చేద్దాం? కనీసం ఈ సత్యమైనా తెలిసికొని చిత్తశుద్ధితో పశ్చాత్తాపపడదాం.

**18. ఉనికిలో వుండే ప్రాణ్ణి దేన్నీ నీవు అసహ్యించుకోవు –జ్ఞాన 11,24**

సొలోమోను జ్ఞానగ్రంథాన్ని వ్రాసిన రచయిత "ప్రభూ! ఉనికిలో ఉండే ప్రాణ్ణి దేన్నీ నీవు అసహ్యించుకోవు. అసహ్యించుకొనేవాడి వైనట్లయితే వాటిని కలిగించే వుండవు. నీవు ప్రాణంపట్ల ప్రీతిజూపేవాడివి. నాశంలేని నీ యాత్మ ప్రతిప్రాణిలోను నెలకొని వుంటుంది" అంటాడు. ఇవి చాల గొప్ప వాక్యాలు. నేను అల్పుణ్ణే గావచ్చు, అధముణ్ణేగావచ్చు. నేనంటే నాకే అసహ్యం కలిగితే కలవచ్చు. కాని ప్రభువు మాత్రం నన్ను ఆదరంతోను, గౌరవంతోను చూస్తుంటాడు. నన్ను లాగే ఇతరులను కూడ అభిమానంతో చూస్తుంటాడు. అందుచేత నా మీద నాకే నమ్మికవుండాలి. నాకు ఇతరుల మీద గౌరవముండాలి. ఇవి ఉత్సాహాన్ని కలిగించే భావాలు కదా!

**19. ఇద్దరు ముగ్గురు నా పేర సమావేశమైనతావులో నేనూ నెలకొని వుంటాను –మత్త 18,20.**

పూర్వవేదకాలంలో యెరూషలేము దేవాలయంలో ధర్మశాస్త్రాన్ని వివరించేవాళ్లు. యూదభక్తులు ఆ దేవాలయంలో సమావేశమై ధర్మశాస్త్ర బోధలను ఆలించేవాళ్లు. అలా సమావేశమైన భక్తసమాజంలో ప్రభువు ప్రత్యక్షమై వుండేవాడు. ఆ ప్రభు సాన్నిధ్యాన్ని పూర్వవేద ప్రజలు "షెకీనా"అంటే నివాసం అని అర్థం. అనగా ప్రభువు ఆ ప్రజల మధ్య నివసించేవాడని భావం. ఇక, పూర్వవేద ప్రభువులాగే నూత్నవేద ప్రభువు కూడ తన ప్రజలతో వసిస్తుంటాడు. నూత్నవేదంలో మనంకూడ ప్రభు బోదలు వినడానికి గాని, ప్రభు గ్రంథాన్ని పఠించడానికి గాని, ప్రభువుని ఆరాధించుకో వడానికి గాని ఓ తావులో సమావేశమౌతుంటాం. ఈలాంటి సమావేశాల్లో క్రీస్తు

కూడ ప్రత్యక్షమై వుంటాడు. తన పేర సమావేశమైన భక్తులను దీవిస్తూంటాడు. ప్రభు దీవెన వలననే మన సమావేశాలూ, కూటాలూ కొంతవరకైనా ఫలసిద్ధి నందుతూన్నాయి.

20. తల్లి తన ప్రేవున బుట్టిన బిడ్డను మరచిపోతే పోతుందేమో గాని, నేను మాత్రం మిమ్ము మరచిపోను -యెష 49,15

తల్లి తన చంటిబిడ్డను మరచిపోదు. తన ప్రేవున బుట్ని బిడ్డమీద కరుణ చూపకుండా వుండలేదు. బిడ్డమీద అనురాగం లేని ఉన్మత్తురాలైన తల్లి ఒకవేళ ఎక్కడైనా ఉంటుందేమో కాని, భగతవంతుడు మాత్రం తన ప్రజలమీద అనురాగం చూపకుండా వుండలేదు. అతడు తల్లిలాంటివాడు. బైబులు అతనిలో తల్లి గుణాలు వుంటాయని చెప్తుంది. అతనిని తల్లి పక్షితో పోలుస్తుంది. ఆ ప్రభువు మనకు తల్లీ తండ్రి అని చెప్తుంది. ఇంట్లో అమ్మంటే మనకెంతో ఇష్టం.జ అమ్మకు మించిన ప్రేమశక్తి ఏముంది? భగవంతుడుకూడ మన అమ్మలాంటివాడే. తన తరఫున తాను మనలను అమ్మలాగ ప్రేమతో ఆదరించేవాడే. కాని మన తరఫున మనకు, అ తనిపట్ల అమ్మపట్ల కలిగే అనుభవం కలుగదు. ఈ లోపం మనది కాని అతనిది కాదు. కనుక మనం రోజురోజుకీ ఆ భగవతుణ్ణి అర్థంచేసికొనే ప్రయత్నం చేయాలి.

## 21. ఇతరులకంటే మేమే యోగ్యులమని భావించండి -ఫిలి 2,3

## ఇతరులను గౌరవించడానికి సంసిద్ధంగా వుండండి -రోమా 12,10

తరచుగా మనం ఇతరులను చిన్నచూపు చూస్తుంటాం. వాళ్ళకంటే మనం ఎంతో యోగ్యులం అనుకొంటుంటాం. ఇతరులను గౌరవించడానికీ, భూషించడానికీ ఒప్పుకోం. వాళ్ళ గౌరవం మన అవమానం అన్నట్లుగా భావిస్తాం. అందుకే తరచుగా మనకూ ఇతరులకూ తగాదాలూ మనస్పర్థలూ వస్తుంటాయి. సోదరప్రేమ కలికానికైనా కన్పించకుండా పోతుంది. ఈ సందర్భంలో పౌలు రెండు నియమాలిచ్చాడు. ఈ రెండు నియమాలనూ పాటిస్తే మనం ఇరుగుపొరుగువాళ్ళతో ఒద్దికగాను, ప్రేమభావంతోను జీవించగలం. ఒకటి: ఇతరులకంటె మనం యోగ్యులం అనుకోకూడదు. వాళ్లే మనకంటే యోగ్యులేమో అనుకొంటూండాలి. రెండు: ఇతరులను చిన్నచూపు చూడకూడదు. ఇతరులను గౌరవిస్తుండాలి. ఈలా ఇతరులను యోగ్యులనుగా భావించి గారవిస్తుంటే మన తగాదాలన్నీ వాటంతటవే సమసిపోతాయి.

## 22. దేవుడు నరుడు చూచే చూపున చూడడు -1సమూ 16,1

దావీదు తండ్రి యీషాయికి ఎన్మిదిమంది కుమారులు. వారిలో కడగొట్టువాడు

దావీదు. యీషాయి తన పెద్దకొడుకు యెలియాబును సమూవేలు చెంతకు పంపాడు. సమూవేలు యెలియాబు ఆకారాన్ని చూచి మెచ్చుకొని అతన్ని రాజుగా అభిషేకింపబో యాడు. కాని ప్రభువు సమూవేలుతో "ఇతని ఆకారాన్ని చూచి భ్రమసిపోవద్దు. నరుడు వెలుపలి రూపాన్ని మాత్రమే చూస్తాడు. కాని దేవుడు హృదయాన్ని పరిశీలిస్తాడు అన్నాడు. మనం నరులుచేసే వెలుపలి పనులను మాత్రమే చూచి వీళ్ళు మంచివాళ్ళు వీళ్ళు చెడ్డవాళ్లు అని నిర్ణయిస్తాం. కాని భగవంతుడు నరులుచేసే వెలుపలి పనులను మాత్రమే చూడదు. వాళ్ళ హృదయంలోని ఉద్దేశాలనుకూడ గమనిస్తూంటాడు. అందుచేత మన దృష్టిలో మంచివాళ్లైన వాళ్ళంతా దేవుని దృష్టిలో మంచివాళ్ళు కావచ్చు కాకపోవచ్చు. ఆలాగే మనదృష్టిలో చెడ్డవాళ్ళైన వాళ్ళంతా దేవుని దృష్టిలో చెడ్డవాళ్ళు కావచ్చు కాకపోవచ్చు. అతని నిర్ణయాలు వేరు, మన నిర్ణయాలు వేరు. కనుక ఇతరులను గూర్చిన మన అభిప్రాయల్లో పొరపాట్లు ఉండవచ్చు. ఉంటాయి కూడ.

## 23. అతడు మీ మీద శ్రద్ధ జూపుతుంటాడు. కనుక మీ చింతలన్నీ అతనికే వదలివేయండి -1పేత్రు 5,7

మనం పసివాళ్ళంగా వున్నపుడు తల్లిదండ్రులు మనమీద శ్రద్ధ జూపించాడు. కనుకనే మనం ఆపదలన్నీ తప్పుకొన్నాం. వృద్ధిలోకి వచ్చాం గూడ. ఈలాగే ప్రభువు కూడ నిత్యమూ తన బిడ్డలమైన మనమీద శ్రద్ధ చూపుతుంటాడు. అతని కరుణవల్లనే మనం రోజురోజు ఆపదలనుండి తప్పుకొని బ్రతుకుతున్నాం. అతను ఓ కాపరిలాంటి వాడు. మనం మందలాంటి వాళ్లం అని చెప్తుంది. 23వ కీర్తన. కాపరి మందమీద శ్రద్ధచూపించినట్లుగానే ప్రభువు మన మీద శ్రద్ధ చూపుతుంటాడు. కనుక భక్తుడు తన చింతలన్నీ ఆ తండ్రికే వదలివేయాలి. చింతించినంతమాత్రన్నే మన సమస్యలు తీరిపోతాయా? తీరవు. వాటిని కొద్దిగానే గొప్పగానో తీర్చేవాడు ఆ ప్రభువొక్కడే.

## 24. నా జీవితమంతా ప్రభు మందిరములోనే గడపాలనుకొన్నాను -కీర్త 27,4

27వ కీర్తన వ్రాసిన భక్తుడు "నేను ప్రభుని ఒక్క వరమడిగాను. నా జీవితమంతా ప్రభు మందిరంలో గడపాలనీ, ఆయన మంచితనాన్ని చవిచూడాలనీ, ఆయన సలహా పొందాలనీ కోరుకొంటూన్నాను" అంటాడు. పూర్వవేదనరులు మామూలుగా దేవుతని నుండి అడిగిన వరాలు నాల్గు : దీర్ఘయువూ, సిరిసంపదలూ, సంతానమూ, శత్రు వినాశమూ. కాని పైకీర్తన వ్రాసి నభక్తుడు మాత్రం ఈ మామూలు కోరిక లేవీ

కోరుకోలేదు. అతడు జీవమంతా ప్రభు మందిరంలో గడిపాడాలనుకొన్నాడు. ఎందుకు? ప్రభువుని సేవించి అతని మంచితనాన్ని అనుభవపూర్వకంగా తెలిసికోవాలనుకొన్నాడు. ప్రభువు సలహాపొంది అతని జీవిత తెలిసికోవాలనుకొన్నాడు. ప్రభువు సలహాపొది అతని జీవిత సమస్యలను ప్రభువును ప్రియపడేలా తీర్చిదిద్దుకోవాలనుకొన్నాడు. ఈ భక్తునికి కావలసింది ఐహిక సంపదలూ కాదు, భగవంతుని వరాలూ కాద, మరి ఆ భగవంతుడే. భక్తుడంటే ఈలాంటివాడు కదా!

## 25. దేవుడు మీ శక్తికి మించినట్లుగా మిమ్ము శోధింపడు - 1కొ 10,13

జీవితంలో అందరికీ శోధనలు మన శక్తికి మించి వుండవు. వాటిని జయించే శక్తిని దేవుడు తప్పకుండా ఇస్తుంటాడు. లేకపోతే అతడు మోయలేని బరువును మన తలమీద మోపినట్లు కదా! శోధనలను మనంతట మనమే జయించలేం గాని, దేవుని శక్తితో జయించగలం. అందుచేత ఆ ప్రభువు వరప్రసాదాన్ని అడుగుకొంటూం డాలి. బలహీనపు తీగ బలమైన చెట్టుమీదికి అల్లుకొంటుంది. ఆ చెట్టుబలంలో తానూ పాలు పొందుతంది. అలాగే మనంకూడ స్వయంగా దుర్బలులమైనా కూడా క్రీస్తు బలంపొంది బలవంతులమౌతాం. ఓమారు పౌలు తన బాధ నొకదాన్ని తొలగించ మని ప్రభువుని మనవిచేసాడు. ప్రభువు పౌలుతో నీ బాధను తొలగించనుగాని, దాన్ని భరించే వరప్రసాదం మాత్రం ఇస్తాను పొమ్మన్నాడు -2కొ 12,10. మన శోదనల విషయంకూడ ఇంతే.

## 26. నీవెక్కడికి వెళ్ళినా నేను నిన్ను కాపాడుతూనే వుంటాను -ఆది 28,15.

యాకోబు తన అన్నయైన యేసావువద్ద నుండి పారిపోతూ రాత్రిలో బేతేలు వద్ద నిద్రిస్తుండగా కలలో ప్రభువు పల్కిన వాక్యమిది. ప్రభువు అతన్ని ఏసావు బారినుండి రక్షించాడు. తరువాత అతడు తన మేనమామ కొమార్తె లిద్దరినీ పెండ్లి చేసికొన్నాడు. సిరిసంపదలతో తలదూగుతూ జన్మదేశానికి తిరిగివచ్చాడు. ఈ విధంగా అడుగడుగునా ప్రభువు అతన్ని కాపాడాడు. ఆదరించాడు. ప్రభువు తన భక్తులకు తోడైయుంటాడు. అందుకే కీర్తనాకారుడు కూడ "నీవెక్కడికి వెళ్లినా నిన్ను కాపాడు తూండమని ప్రభువు తన దూతలను ఆజ్ఞాపించాడు" అంటాడు -91,11. ఈలా భగవంతుని ఆదరకణకు పాత్రుడయ్యే నరుడు ధన్యుడుగదా!

**27. మన ప్రధాన యాజకుడు మన బలహీనతలపట్ల సానుభూతి చూపలేనివాడు కాదు -హెబ్రే 4,16**

మనం తరచుగా క్రీస్తు దేవుడని భావిస్తుంటాం. కాని అతడు నరుడు కూడ అని తలంచనే తలంచం. ఇది పెద్ద పొరపాటు. అతడు దేవుడుగానే మనలను రక్షించి వుండవచ్చు గదా! మరి నరుడై జన్మించింది దేనికి? మన పతన స్వభావాన్ని అనుభవ పూర్వకంగతా తెలిసికోవిడానికీ, మనపట్ల సానుభూతి చూపడానికీ, అతడే మనలాగే నరుడయ్యాడు. కనుక, మనలాగే బాధలూ, శక్షధనలూ అనుభవించాఉడ. కనుక, మన కష్టసుఖాలను అనుభవపూర్వకంగా తెలిసికోగలిగాడు. పిడికెడు మట్టిముద్దయైన నరుడు ఎంత బలహీనపు ప్రాణియో ప్రత్యక్షంగా గుర్తింపగలిగాడు. ఈలాంటి క్రీస్తు దగ్గరికి మనం చనువుతో, స్వతంత్రంతో వెళ్ళాలి. అతడు మనలను చీదరించుకోడు గదా, ఆదరిస్తాడు. అతడు మన తరపున దేవుని యెదుట నిలిచే కృపా సింహాసనం. మన జాతి వాడు. మన పెద్దన్న.

**28. నేను పండుకొని నిద్రపోయాను. మళ్ళా సురక్షితంగా లేచాను. ప్రభువే నన్ను కాపాడాడు.**

దేవునిమీద భారంవేసి జీవించాలని కీర్తనలు మాటిమాటికీ చెప్తాంటాయి. ఓ కీర్తనాకారుని అనుభవం ఇది. అతను పండుకొని నిద్రపోయాడు. నిద్రలో మైమరపు కలుగుతుంది. మనలను మనమే మరచిపోతాం. ఈ సమయంలో ఎవరైనా మనకు హాని చేయవచ్చు. పైగా మైమరపు చెందిన మన ప్రాణం మళ్ళా మేల్కోకుండదా వుండవచ్చు కూడ. ఐనా అతడు నిద్రనుండి సురక్షితంగా లేచాడు. ఎవరూ తనకు హాని చేయలేదు. తాను పూర్వపు రీతినే కుశలంగా వున్నాడు. ఎందుకు? ఆ నిద్రలో, ఆ మైమరపులో ప్రభువే అతన్ని కాపాడాడు. నిద్ర మనకందరికీ అందుబాటులో వున్న అనుభవమే. కాని నిద్రను గూర్చిన ఈ కీర్తనకారుని తలపోతలు మాత్రం లోతైనవి. మనంకూడా ఇతనిలాగే రోజూ నిద్రపోకముందూ, నిద్రనుండి లేచాకా "ప్రభో! నన్ను కాపాడేవాడివి నీవే" అని చెప్పుకొంటే ఎంత సభ్యతగా వుంటుంది!

**29. అతడు అన్ని పనులూ చక్కగా చేసాడు**

క్రీస్తు సమకాలికులు అతని బోధలు విన్నారు. అతని అద్భుతాలు చూచారు. అతని నడవడికను గమనించారు. ఇదంతా చూచాక కొంతమంది క్రీస్తును గూర్చి అనుకొన్న మాటలే పై వాక్యం. అనగా క్రీస్తు సమకాలికులకు అతన్ని గూర్చి కలిగిన

భావం ఇది. క్రీస్తు తానుచేసిన పనులన్నీ సంతృప్తికరంగా చేసాడు. అతని పనులను చూచి పరలోకంలోని పిత మెచ్చుకొన్నాడు. భూలోకంలోని ప్రజలూ సంతుష్టులయ్యారు. మనం చనిపోయాక మన సమాధి రాతిమీద గూడ ఇతడు చక్కగా పనిచేసాడనో, ఇతడు చక్కగా ప్రవర్తించాడనో వ్రాసిపెడితే ఎంత బాగుంటుంది! కాని అప్పుడు అలాంటి మెప్పుకోలును పొందాలంటే ఇప్పుడు మనం ఎలా ప్రవర్తించాలి?

## 30. నేను నీకు తోడై యుంటాను

యెషయా ప్రవచనంలో "బాధామయ సేవకుడు" అనే మహానుభావుడొకడు ప్రజలకొరకు ప్రాణాలు అర్పిఆస్తడు. అతని మరణం ద్వారా ప్రజలకు జీవం కలుగుతుంది. ఈ ప్రవచనం నూత్నవేదంలో రాబోయే క్రీస్తుకు వర్తిస్తుంది. పై వాక్యంలో ప్రభువు ఈ బాధామయ సేవకుణ్ణి ఉద్దేశించి "నేను నీకు తోడైయుంటాను" అంటాడు. ప్రభువు తోడై యుండబట్టే అతడు ధర్మమూర్తియై ప్రాణత్యాగం చేయగలిగాడు. పూర్వవేద భగవంతుడు తన ప్రజలకుతోడై యుండేవాడు. కనుకనే అతనికి ఇమ్మానువేలు – మనతో వుండే దేవుడు –అనిపేరు. ఆలాగే నూత్నవేద భగవంతుడూ తన ప్రజకు తోడైయుంటాడు. కనుకనే అతడు "లోకాంతం వరకూ నేను మీతో వుంటాను" అని హామీ యిచ్చాడు. మత్త 28,20. ఆ ప్రభువు మనకు తోడై యుండబట్టే మనం ఒకపాటిగానైనా విశుద్ధజీవితం జీవింపగల్గుతున్నాం. ఒకపాటిగానైనా సత్కార్యాలు చేయగలుగుతున్నాం. కనుక ఈ దేవుని తోడును అభిలషిద్దాం, అడుగుకొందాం.

## 31. దేవుడు తన్ను ప్రేమించేవాళ్ళకి అన్నీ సవ్యంగానే అమరల్చుతూంటాడు –రోమా 8,28

ఇది చాలమంచి వాక్యం. దేవుడు తన్ను ప్రేమించేవాళ్ళను గమనించి వాళ్ళకు అన్నీ లనుకూలంగా వుండేలా చూస్తాడు. అంటే వాళ్ళకు కష్టాలూ చిక్కులూ రావనిగాదు, వస్తాయి. కాని అలా వచ్చిన కష్టాలను గూడ వాళ్లు సద్వినియోగం చేసుకొంటారు. వాటిని వ్యర్థం చేసికోరు. వాటివలన ఫలితం పొందుతారు. జీవితంలో మనకు బోలెడన్ని సంఘటనలు తటసిస్థంటాయి. వాటిల్లో కొన్ని మంచివి, కొన్ని చెడ్డవి. ఐనా మనం మంచి సంఘటనల వలన ఫలితం పొందుతామేమోగాని, చెడ్డ సంఘటనల వలన మాత్రం తరచుగా ఫలితం పొందం. దేవుని ప్రేమించేవాళ్లు ఈ చెడ్డ సంఘటనల వలన కూడ ఫలితం పొందుతూనే వుంటారు. అది ఈ వాక్యం బోధించే సత్యం. దేవుణ్ణి ప్రేమించే నరుడు పొందే ఫలితం ఈలాంటిది.

## 32. నా రోజులింకా ప్రారంభం కాకమునుపే అవి యిన్ని యని నీవు ముందుగానే నిర్ణయించావు కదా!

మనం పుట్టకముందే మన రోజులిన్ని అని దేవుడు ముందుగానే నిర్ణయించాడు. తన పుస్తకంలో వ్రాసుకొన్నాడు కూడ. మనం ఎన్నాళ్ళు జీవిస్తామో, ఎలా జీవిస్తామో, ఏమేం చేస్తామో అతనికి బాగా తెలుసు. కాని ఈ తెలివిడివల్ల మన స్వాతంత్ర్యం నశించిపోదు. అనగా అతనికి ముందుగానే తెలుసు గనుక మనం ఈలా జీవించం. మనం ఈలా జీవిస్తాం గనక అతనికి ముందుగానే తెలుసు. దేవుడు మన స్వాతంత్ర్యాన్నె ప్పుడూ అరికట్టడు. మన దుష్కార్యాలకు తానెపుడూ బాధ్యుడు కాడు. మంచిని చేసినా, చెడ్డను చేసినా కర్తలము మనమే. ఫలితం అనుభవించేవాళ్ళమూ మనమే. ఈ సత్యం మనకు నిరాశనుగాదు, ఆశను పుట్టించాలి.

## 33. నేను ద్రాక్ష తీగను, మీరు నాలోనికి అతుకుకొన్న కొమ్మలు -యోహా 15,4

కొమ్మలు తల్లి తీగలోనికి అతుక్కొని వుంటాయి. తల్లి తీగలోని సారం వానిలోనికి ప్రసరిస్తుంది. ఆ సారాన్ని పొంది కొమ్మలు ఆకు దొడిగి, పూలు పూచి కాయలు కాస్తాయి. తల్లి తీగలోని సారం కాస్త ఆగిపోతే, కొమ్మలు వాడిపోతాయి, చస్తాయి. ఈ యుపమానమే మనకూ క్రీస్తుకూ కూడా వర్తిస్తుంది. అతని సారం మనలోనికి ప్రసరిస్తుంది. ఆ సారమే వరప్రసాదం. ఆ ప్రభువుతో ఐక్యమై యున్నంతకాలం అతని వరప్రసాదం మనలను దివ్యులనుగా చేస్తుంది. మనం పాపజీవితం విడనాడి పవిత్ర జీవితం గడుపుతాం. కాని ఆ ప్రభువునుండి వేరైపోయినవాడు మనలోని దివ్యజీవితం చచ్చిపోతుంది. ఇక మనకు మిగిలేది పాపజీవితం మాత్రమే.

## 34. నిన్ను గూర్చి నాకు తెలుసు - యిర్మీ 1,5

ప్రభువు యిర్మీయా ప్రవక్తకు ప్రత్యక్షమై "నేను నిన్ను మాతృగర్భంలో నెలకొల్పక ముందే నిన్ను గూర్చి నాకు తెలుసు. నీవు మాతృగర్భంనుండి వెలువడకముందే నిన్ను ప్రవక్తగా నియమించాను" అన్నాడు. కనుక యిర్మీయా పుట్టకముందే ప్రభువుకి అతన్ని గూర్చి బాగా తెలుసు. యిర్మీయా తల్లి కడుపునుండి బయటపడకముందే ప్రభువు అతన్ని తన ప్రవక్తగా నియమించాడు. ప్రభువు యిర్మీయాకు చెప్పిన వాక్యమే మనకూ చెప్తాడు. మనం పుట్టకముందే మనలను గూర్చి ఆ ప్రభువుకి తెలుసు. మనం ఏంపని చేస్తామో ఎలా జీవిస్తామో గూడ అతనికి బాగా తెలుసు. ఒక్కోమారు మన జీవితం ఏమౌతుందో అని దిగులుపడిపోతూంటాం. ఆత్మవిచారానికి గురౌతుంటాం. అలాంటప్పుడు పైవాక్యం మనలో నమ్మికను పుట్టిస్తుంది. నారు పోసినవాడు నీరుపోయడా అనే విశ్వాసం కలిగిస్తుంది.

### 35. నేనింతటివాణ్ణి అయ్యానంటే అదంతా దేవుని చలవవల్లనే -1కొ 15,10

పౌలు పొట్టివాడట. ఐనా చాల గట్టివాడు. అతడు కొరింతు, ఫిలిప్పు, కోలోస్సె మొదలైన నానాపట్టణాల్లో క్రీస్తుని బోధించాడు. క్రైస్తవ సమాజాలు స్థాపించాడు. తిమోతి, తీతు మొదలైన శిష్యబృందాన్ని తీర్చిదిద్దాడు. తన విశ్వాసులకు క్రీస్తును వివరిస్తూ 14 జాబులు వ్రాసాడు. పేత్రుతో సమానమైన ప్రేషితుడని పేరుగాంచాడు. క్రీస్తు అతనికి చాలసార్లు ప్రత్యక్షమయ్యాడు కూడ. ఇన్ని మహత్తర కార్యాలు సాధించినా పౌలు ఉబ్బిపోలేదు. నేనింతవాణ్ణి, అంతవాణ్ణి అని చెప్పుకోలేదు. దేవుని చలువ వల్లనే ఒకపాటి వాణ్ణి అయ్యానని సవినయంగా పల్కాడు. మనం జీవితంలో ఏదో కొంచెం సాధిస్తాం. కాని వెంటనే మన డప్పు మనమే వాయించుకొంటాం. నేటి పత్రికల్లో సమావేశాల్లో, సమాచార సాధనాల్లో ఈ బడాయి అధికంగా కన్పిస్తూంటుంది. తననూ భగవంతుణ్ణి అర్థంచేసికొన్న నరుడు గర్విష్టి కాడుగదా, వినయవంతుడౌతాడు.

### 36. నరుడు స్నేహితునితో మాటలాడినట్లుగా యావే మోషేతో ముఖాముఖి మాటలాడే వాడు -నిర్గ 33,11.

మనం స్నేహితునితో మాటలాడేపుడు మరో మధ్యవర్తిద్వారా మాటలాడం. నేరుగా మాటలాడేస్తాం. ప్రభువు మోషేతో కూడ అలా నేరుగా మాటలాడేవాడు. ఇతర భక్తులతో ఐతే అతడు ప్రవక్తల మధ్యవర్తిత్వం ద్వారా మాటలాడేవాడు. కాని మోషేతో అలాకాదు. అనగా మోషేకు ప్రభువుపట్ల అంత పరిచయమూ, చనువూ వుండేవని భావం. ఇక నూత్నవేదంలో ప్రభువు మనలను కూడ తన స్నేహితులనే పేర్కొంటాడు -యోహా 15,15. ఆ ప్రభువు మనతోను, మనం ఆ ప్రభువుతోను నేరుఆ మాటలాడతాం. ఇది దేవుని మిత్రులకేగాని అన్యులకు లభింపని దొడ్డభాగ్యం

### 37. నరుడు జంతుజాలాన్నంతటినీ మచ్చిక జేసికొన్నాడు కాని నాలుకను మాత్రం సాధువుగా జేసికొన్నవాడు ఒక్కడూ లేడు -యాకో 3,8

చిన్న నిప్పురవ్వే కారుచిచ్చు ఔతుంది. నాలుకా ఈలాంటిదే. నిప్పురవ్వ అడవినంతటినీ కాల్చివేసినట్లే అది మన జీవితాన్నంటినీ కాల్చివేస్తుంది. నాలుకంతటి దోసకారి మరొకటిలేదు. నరుడు పాములు, పెద్దపులులు మొదలైన విష జంతువులను మచ్చికజేసికొంటున్నాడు. కాని నాలుక దుష్టజంతువు లన్నిటికంటె దుష్టమైంది. దీనికి లోబరచుకొన్నవాడు లేడు. చిన్నకళ్లెం గుర్రాన్నీ, చిన్న చుక్కాని ఓడనూ నడిపిస్తుంది. అలాగే నాలుక చిన్న అవయమవే ఐనా నరుడంతటివాణ్ణి నడిపిస్తుంది – ఇవి నాలుకను గూర్చి యాకోబు జాబు చెప్పేకొన్ని భావాలు. ఈ బావాలను విన్నాక మన నాలుకను ఏలా వాడుకొంటున్నామో కూడ కొద్దిగా ఆలోచించి చూచుకొందాం.

**38. నేను మహోన్నతమైన పరిశుద్ధస్థలంలో నివసిస్తుంటాను. ఐనా వినయాత్ములైన పశ్చాత్తాప మనస్కుల చెంత గూడ వసిస్తుంటాను –యెష 57,15**

ప్రభువు ఊర్ధ్వలోకంలో వుంటాడు. అతడు మహోన్నతుడు. ఐనా ఆ ప్రభువు మంటిమీదికి వచ్చి నరులతోను వసిస్తూంటాడు. కాని, ఏలాంటి నరులతో? వినయవంతులూ, పశ్చాత్తాప హృదయులూ ఐన నరులతో, వినయవంతులు అంటే ప్రభువుకి అంత ప్రియం. నరుడు గర్వంవలన తోడి మానవునికేగాదు, భగవంతునికి గూడ అప్రియుడౌతుంటాడు. అందుకే ఓ వేదవాక్యం "ప్రభువు వినయవంతులకు దీవెనలిస్తాడు. కాని గర్విష్ఠులను అణగద్రొక్కుతాడు అంటుంది" –యాకో 4,6. వినయవంతుడైన సుంకరీ గర్వాత్ముడైన పరిసయుడూ వీళ్ళిద్దరి సంగతీ మనకు తెలుసు. ఫలితాంశమేమిటంటే వినయవంతుడు భగవంతుని మన్ననకు పాత్రుడౌతాడు.

**39. నేనూ నీకు శిక్ష విధింపను. ఇక వెళ్ళి పాపం చేయకుండా బ్రతుకు – యోహా 8,11**

రంకుటాలిని రాళ్ళతో కొట్టి చంపమంటుంది మోషే ధర్మశాస్త్రం. క్రీస్తు బోదనా కాలంలో యూదులు తమచేజిక్కిన ఓ వ్యభిచారణిని అలా చంపడానికి పూనుకొన్నారు. శిక్షార్హులకు శిక్ష విధించడంలో ఆశ్చర్యమేమీ లేదు. కాని ప్రభువు శిక్షార్హులకు కూడా శిక్ష విధింపలేదు. వాళ్ళను కరుణించాడు, మన్నించాడు. ఇక వెళ్ళి యిలాంటి పాపాలు చేయకుండా బ్రతకండి అని మాత్రం మందలించాడు. అతని కరుణను తలచుకొంటే మనకు ఆశ్చర్యం కలుగుతుంది. మన విషయంలో కూడ ఆ ప్రభువు కారుణ్యమయుడుగానే ప్రవర్తిస్తాడు. అతడు మన పాపాలకు తగ్గట్టుగా మనలను శిక్షించినట్లయితే మనమంతా ఇప్పుడెక్కడుండే వాళ్ళమో!

**40. ఆకాశం నుండి వచ్చేవానా మంచూలాగే నానోటి నుండి వెలువడే వాక్కూవుటుంది –యెష 55,10**

ఆకాశం నుండి వచ్చే వానా, మంచూ వ్యర్థంగా ఆకాశానికి తిరిగిపోవు. భూమిని తడిపి పైరులను ఎదిగిస్తాయి. పంటలు పండించి సేద్యగానికి అన్నం చేకూర్చి పెడతాయి. అలాగే ప్రభువు నోటినుండి వెలువడే వాక్యంగూడ వ్యర్థంగా అతని వద్దకు తిరిగిపోదు. అది నరుని హృదయాన్ని సోకుతుంది. ఆ నరుని గూర్చిన భగవంతుని సంకల్పం నెరవేర్చి తీరుతుంది. అనగా వాన పొలంలో పంటలు పండించి నట్లే దేవుని వాక్కు మన హృదయంలో మంచి కోరికలు పుట్టిస్తుంది. కనుక భక్తుడు దైవవాక్యాన్ని పఠించాలి. ఆలించాలి. ఆ వాక్యం ప్రకారం హృదయాన్ని సంస్కరించుకోవాలి.

# 14. అష్ట భాగ్యాలు

బైబులు భాష్యం 153

మత్తయి సువిశేషం 5-7 అధ్యాయాలకు "పర్వత ప్రసంగం" అని పేరు. ఇది నూత్నవేదంలోకెల్ల ప్రసిద్ధభాగం. దీనికి క్రీస్తు గీత లేక క్రీస్తు ధర్మశాస్త్రం అని పేరు వచ్చింది. ఈ భాగం క్రీస్తు నైతిక సూత్రాల సంపుటి.

మత్తయి దృష్టిలో క్రీస్తు నూత్న మోషే. ఇద్దరూకొండమీద ధర్మశాస్త్రాన్ని జారీ చేసారు. మోషే పుస్తకాలు ఆదిపంచకం. మత్తయి గ్రంథంకూడ ఐదుపన్యాసాలుగా వుంటుంది.

లూకా మైదాన ప్రసంగం 29 వచనాలు మాత్రమే -6,17-49. కాని మత్తయి పర్వత ప్రసంగం 107 వచనాలు. అనగా అతడు ఈ యంశాన్ని పెంచి వ్రాసాడు. ఈ భాగం నూత్నవేదానికి గుండెకాయ లాంటిది.

ఇక, పర్వత ప్రసంగంలో అష్టభాగ్యాలు ఒక భాగం. వీటికే ధన్యవచనాలు అనికూడ పేరు. ఇవి ఇహలోక భాగ్యాలనూ పరలోక భాగ్యాలనూ గూడ సూచిస్తాయి. పూర్వ నూత్నవేదాల్లో ధన్యవచనాలు చాలా వున్నాయి. నరులు ధన్యులు ఔతారని చెప్పేదే ధన్య వచనం. ఊదాహరణకు, ప్రభువును నమ్మే నరుడు ధన్యుడు అంటుంది కీర్తన 40,4.

ఈ వాక్యాల్లో ఒక దన్యతా, ఒక బహుమానమూ కలసిపోతాయి. ఉదాహరణకు దీనాత్ములు ధన్యులు. వాళ్ళు దైవారాజ్యాన్ని పొందుతారు. ఇక్కడ దీనత ధన్యవచనం. దైవరాజ్యాన్ని పొందడం బహుమతి.

ఈ యష్టభాగ్యాలు ఈ లోకంలో సంపూర్ణంగా నెరవేరవు. వీటిని ఈ లోకంలో కొంతవరకు సాధిస్తాం. పరలోకంలో సంపూర్నంగా పొందుతాం.

ధన్యవచనాలు ఎన్ని? లూకా నాల్గింటిని పేర్కొన్నాడు. అవి పేదలై యుండడం, శోకించడం, ఆకలిదప్పులు, హింసలు అనుభవించడం. మత్తయి ఇంకానాల్గు చేర్చి మొత్తం 8 చేసాడు. అతడు చేర్చియన నాల్గు వినమ్రత, దయ, నిర్మలత్వం, శాంతి స్థాపనం. మొత్తం 8 ధన్యతలూ, 8 బహుమానాలు వున్నాయి.

కాని 8 ధన్యవచనాలు ఒకే ధన్యవచనం అనాలి. అది వినయం! దేవునిపై ఆధారపడి జీవించడం. ఆలాగే ఎన్మిది బహుమానాలు కూడ ఒకే బహుమానం. అది దైవరాజ్యాన్ని పొందడం. ఎన్మిది ధన్యతలూ, ఎన్మిది బహుమానాలు కూడ ఒకే బహుమానం. అది దైవరాజ్యాన్ని పొందడం. ఎన్మిది ధన్యతలూ, ఎన్మిది బహుమానాలూ క్రమంగా ఇవి.

1. దీనాత్ములు - దైవరాజ్యాన్ని పొందడం
2. శోకార్తులు - ఓదార్పు పొందడం
3. వినమ్రులు - భూమికి వారసులు కావడం
4. నీతికొరకు ఆకలిదప్పులు - సంతృప్తిచెందడం

5. దయామయులు – దయను పొందడం
6. నిర్మల హృదయులు – దైవదర్శనం పొందడం
7. శాంతిస్థాపకుడు – దేవెని కుమారులు కావడం
8. హింసితులు – దైవరాజ్యాన్ని పొందడం

తొలి నాల్గు ధన్యవచనాలుమనకు దేవునిపట్ల వుండే సంబంధాన్ని సూచిస్తాయి. మలి నాల్గు మనకు తోడి నరులపట్ల వుండే సంబంధాన్ని తెలియజేస్తాయి.

క్రీస్తు స్వయంగా ఈ ధన్యవచనాలను పాటించాడు. దైవరాజ్యాన్ని బహుమతిగా పొందాడు. అసలు అతడే ధన్యవచనం. మనం కూడ వీటిని పాటించాలి. బైబులు బోధల సారం, క్రైస్తవ జీవితం అంతా వీటిల్లో ఇమిడే వుంది. ఇక, ఒక్కో ధన్యవచనాన్ని విపులంగా పరిశీలిద్దాం,

## 1. దీనాత్ములు – దైవరాజ్య ం

ఈ ధన్యవచనం పేర్కొనే దీనాత్ములు ఎవరు? యిస్రాయేలీయుల్లో "హనవిం" అనే వర్గం ప్రజలు వుండేవాళ్ళు. వీళ్ళు తరచుగా పేదలు. బాధలకు గురయ్యేవాళ్ళు. ఐనా దేవునిపై ఆధారపడి జీవించారు. పేదరికం, వినయం, కష్టాలకు గురికావడం, దైవభక్తి వీరి ప్రధాన లక్షణాలు. పొగరుబోతు తనమీద తాను ఆధారపడతాడు. నాకు నేను చాలుదును అనుకొంటాడు. కాని వినయవంతుడు దేవునిమీద ఆధారపడతాడు. పై హనవిం అనే ప్రజలనే ఈ ధన్యవచనం దీనులు అని పిలుస్తుంది. వీరిని గూర్చే జఫన్యా 2,3 ఈలా చెప్తుంది "దేశంలోని వినయవంతులైన ప్రజలారా! దేవుని ఆజ్ఞలను పాటించే జనులారా! మీరు ప్రభువు వద్దకు రండి, న్యాయాన్ని పాటించండి, వినయాన్ని అలవర్చుకొనండి."

ఈ దీనులు దైవరాజ్యాన్ని పొందుతారు. అనగా వీళ్ళు దేవుని పరిపాలనం క్రిందికి వస్తారు. ప్రభువు అండదదండలు వీరికి లభిస్తాయి. వీళ్ళు ఇక్కడ పాక్షికంగా పరలోకంలో పూర్తిగా దైవరాజ్యాన్ని పొందుతారు. ఇంకా వీళ్ళు ప్రభువు సందేశాన్ని విని దైవరాజ్యాంలో చేరతారు. ఈ దైవరాజ్యం ఈలోకంలో తిరుసభ, పరలోకంలో మోక్షం, కనుక వీళ్ళు ఈ లోకంలో జీవిస్తూ కూడ మోక్షంమీద మనసుపెట్టి వుంచుతారు.

### అన్వయం

మొదటి ధన్యవచనాన్ని ఇప్పుడు మనం ఏలా జీవిస్తాం? మీరు చిన్నబిడ్డల్లా ఐతేనే తప్ప పరలోక రాజ్యంలో చేరరు అన్నాడు క్రీస్తు – మత్త 18,3. చిన్నపిల్లలు అన్నిటికీ తల్లిదండ్రులమీద ఆధారపడతారు. ఆలాగే మనం కూడా దేవుతనిమీద ఆధారపడి జీవించడం నేర్చుకోవాలి. మన పొగరును అణచుకొని వినయం అలవర్చుకోవాలి. మన పొగరును అణచుకొని వినయం అలవర్చుకోవాలి. కష్టాలు పేదరికం మొదలైన వాటిని సహించాలి. దేవుని ఆదరణను నమ్మాలి. దైవభక్తి మనకు ప్రధాన గుణం కావాలి.

దేవుడు పసిబిడ్డలకు దైవరహస్యాలను ఎరిగిస్తాడు –మత్త 11,25. ఈ వాక్యంలో పసిబిడ్డలంటే వినయంగా, సరళంగా వుండేవాళ్ళు. దేవుడు ఈలాంటి వాళ్ళకు దైవావిష్కరణకు తెలియజేస్తాడు. గర్వాత్ములకు దేవుడు తెలియడు.

ప్రభువు తన దాసురాలి దీనావస్థను కటాక్షించాడు –లూకా 1,48. మరియ దీనురాలు. కనుకనే దేవుడు ఆమెను ఎన్నుకొన్నాడు. క్రీస్తుకూడ దీనుడు –మత్త 11,29. వీరిలాగే మనంకూడా దీనులం కావాలి.

పదవులు, అధికారాలు ధనం చూచుకొని పొంగిపోవడం, గర్వం, ధీమా మొదలైనవి ఈ ధన్యవచానానికి వ్యతిరేక గుణాలు. వినయవంతులైనవాళ్ళు ఇతరుల చేత సేవలు చేయించుకోరు. తామే స్వయంగా సేవలు చేస్తారు. జీవితంలో కొన్ని కష్టాలు అనుభవించడానికి సిద్ధంగా వుంటారు. సుఖభోగాలకు కోరుకోరు. పేదరికాన్ని అది తెచ్చిపెట్టే బాధలనూ భరించడానికి వెనుకాడరు. క్రీస్తు పేదరికంలో సంతోషంతో పాలుపంచుకొంటారు. తోడివారికి సాయం చేయడానికీ, వారి అక్కరలు తీర్చడానికి తయారుగా వుంటారు.

మొదటి ధన్యవచనం అతి ముఖ్యమైంది. ప్రభువు ఈ ఒక్క ధన్యతనే ఎన్మిది విధాలుగా చెప్పుకుంటూ పోయాడు.

## 2. శోకార్తులు - ఓదార్పు పొందడం

శోకించడం దేనికి? లోకంలోని దుష్టత్వాన్ని జూచి. బలవంతుల పీడనానికి గురై. శోకించేవారిని ఓదార్చడానికి యావే నన్ను పంపాడు అంటాడు యెషయా 61,2. ఈ శోకించేవాళ్ళు పేదలు, దీనులు, ఖైదీలు, బానిసలు మొదలైనవాళ్ళు. నూత్నవేదంలో క్రీస్తు యెరూషలేము దుర్మార్గాన్ని చూచి దుఃఖించాడు –లూకా 19,41. లాజరు మరణానికి కంటతడి పెట్టాడు –యోహా 11,35.

మన పాపాలకు దుఃఖపడ్డం కూడ శోకించడమే. పేత్రు తన పాపానికి వెక్కివెక్కి యేడ్చాడు – లూకా 22,62. "పాపాత్ములారా! విచారించండి. రోదించండి. నవ్వుటకు బదులు దుఃఖించండి. దేవుతని యెదుట వినమ్రులు కండి. అప్పుడు అతడు మిమ్ము ఉద్ధరిస్తాడు అంటుంది యాకోబు జాబు –4,8–10. ఇప్పుడు మనం పాపసంకీర్తనం చేసికొనేప్పుడెల్ల శోకిస్తూనే వుంటాం. దేవునితో సంబంధం కలిగినదైనప్పుడు మన శోకం పవిత్రమైన దౌతుంది. నిర్మలమైన మన శోకాన్ని చూచి దేవుడు మనలను ఓదారుస్తాడు.

దేవుని ఓదార్పు ఏలా వుంటుంది? అతడు దుఃఖించే వారికి బుగ్గికి బదులుగా పూలదండనిస్తాడు. శోకవస్త్రాలకు మారుగా ఆనందతైలాన్నిస్తాడు. విచారించేవాళ్ళు స్తుతి గీతాలు పాడేలా చేస్తాడు –యెష 61,3. సింహాసనం మధ్యనున్న గొర్రెపిల్ల శోకించే వారికి కాపరి ఔతాడు. వారిని జీవజలాల వద్దకు తీసికొని పోతాడు. వారి నేత్రాల్లోని బాష్పబిందువులను తుడిచివేస్తాడు –దర్శన 7,17.

## అన్వయం

ఈ ధన్యవచానిన్న ఇప్పుడు మనుం ఏలా పాటిస్తాం? మన పాపాలకు శోకించి పశ్చాత్తాపపడాలి. దైవరాజ్యం సమీపించింది. కనుక పశ్చాత్తాపపడండి అని క్రీస్తే బోధించాడు - మత్త 4,17. వినాయాన్వితమూ పశ్చాత్తాపపూరితము ఆయిన హృతయాన్ని నీవు అనాదం చేయవు అన్నాడు కీర్తనకారుడు - 51-17. కనుక మనం పాపాలకు చిత్తశుద్ధితో శోకించాలి.

మన శోకాలు చాల రకాలుగా ఉండవచ్చు. వ్యాధిబాధలు, మానసిక వేదనలు మనకు దుఃకాన్ని తెచ్చిపెడతాయి. జమాజంలో జరిగే హింసలు దౌర్జన్యాలు, మానభంగాలు అన్యాయాలు అక్రమాలు మనకు బాధ కలిగిస్తాయి. తిరుసభ పెద్దల్లో లోపాలు, క్రైస్తవుల దుష్కార్యాలను మనకు బాధ కలిగిస్తాయి. వీటన్నిటికి మనం దుఃఖించవలసిందే. దేవుని యెదుట తుఃఖపడితే హృదయం పునీతమౌతుంది.

మన పాపాలనూ లోకంలోని దుష్టత్వాన్ని తలంచుకొని దుఃఖించినపుడు దేవుడు మనకు ఓదార్పు నిస్తాడు. ఆనాందానుభూతిని దయచేస్తాడు. దీనివలన మన హృదయానికి శాంతి లభిస్తుంది. చీకట్లో వెల్తురును చూచినట్లువుతుంది. దేవుడు మనకు దాపులోనే ఉన్నాడనుకొని ధైర్యం తెచ్చుకొంటాం. మన దేవుడు మన కష్టాల్లో మనలను అనునయించేవాడు. క్రీస్తు శ్రబలను తలంచుకొని శోకించడం గూడ మంచి పత్థతి అతని శ్రమల ధ్యానం మన హృదయంలో మాలిన్యాన్ని కడిగివేస్తుంది

బాధలు ఎదురూనప్పుడు మనం తరుచుగా ఇతరుల దగ్గరికి వెళ్ళి మన అపసోపాలు చెప్పుకొంటాం. కాని మొదట దేవుని దగ్గరికి వెళ్ళి మన బాధలను అతనికి చెప్పుకోవాలి. వినయంతో ఆ బాధలను తొలగించమని అడుగుకోవాలి. మన శత్రువులను క్షమించమని వేడుకోవాలి. అప్పుడు మనశ్శాంతి లభిస్తుంది.

## 3. వినమ్రులు - భూమికి వారసులు

ఇది మొదటి ధన్యవచనమే. ఇక్కడవినమ్రులు అంటే దీనులు, పేదలు,వినయ వంతులు, శాంతి స్వభావులు అని అర్థం. వీళ్ళు తమ కష్టాల్లో దేవునిపై ఆధారపడతారు. శత్రువులమీద పగతీర్చుకోవాలి అనుకోరు. ఆ కార్యాన్ని దేవునికే వదలివేస్తారు. ప్రబువు నేను సాధుశీలుణ్ణనీ వినమ్ర హృదయుణ్ణనీ మీరు నానుండి నేర్చుకొనండి అన్నాడు -మత్త 11,29. అతడు యెరూషలేము ప్రవేశించినపుడు ఇదిగతో! నీ రాజు నీ యొద్దకు వస్తున్నాడు. అతడు వినమ్రుడు. గాడిదపై ఎక్కి వస్తున్నాడు అనే జకర్యా ప్రవచనం నెరవేరింది -మత్త 21,5. పౌలు పేర్కొన్న ఆత్మఫలాల్లో వినమ్రత (సాత్వికత) కూడ వుంది - గల 5,23. కనుక వినమ్రత ముఖ్యమైనగుణం. ఈ గుణం కలవారిలో అహంకారం ఉండదు. ఇతరుల మీద పెత్తనం చేసి వారిని

అణచివుంచాలనే కోరిక ఉండదు. వీళ్ళు ఇతరులు తమకు అపకారం చేసినా వాళ్ళమీద పగతీర్చుకోవాలి అనుకోరు. తోడివారితో ఒద్దికగా జీవిస్తారు.

వినమ్రులు భూమికి వారసులౌతారు. యూదులకు వారసభూమి పాలస్తీనా దేశం. కనుకనే కీర్తన 37,11. "దీనులు ప్రభువు దేశాన్ని స్వాధీనం చేసికొంటారు" అని చెప్తుంది. కాని మన వారసభూమి పాలస్తీనా దేశం గాదు, మోక్షం. కనుక వినమ్రులు మోక్షభూమిని వారసంగా పొందుతారు.

## అన్వయం

ఈ ధన్యవచనం ప్రకారం మనం శత్రువుమీద పగతీర్చుకోవడానికి పూనుకో గూడదు. ఆ పని దేవునికి వదలివేయాలి. దేవుడు శత్రువుల బుద్ధి మార్చాలని మాత్రం ఏవుడకోవాలి. మన తరఫున పొగరు పనికిరాదు. వినయంగా ఉండాలి. ఇతరులతో మెలిగేప్పుడు మృదువుగా, ప్రేమపూర్వకంగా, ఓర్పుతో వ్యవహరించాలి. దురుసుతనం పనికిరాదు. సాదుశీలుడు, శాంతస్వభావుడు ఐన క్రీస్తు మనకు ఆదర్శం కావాలి.

ఈ ధన్యవచనం ఉగ్రవాదాన్ని హింసనూ ఖండిస్తుంది. శాంతిని సామరస్యాన్ని పెంపొందించుకోవాలని చెప్తుంది. ఇంకా ఎప్పుడూ వాదంలో మనమే గెలవాలని కోరుకోగూడదు. ఇతరులు మనకు కీడు జేసినా మనం తిరిగి వారికి ఈకడు చేయకూడదు. మాటకు మాట వడ్డించకూడదు. మన తెలివివల్లగాక దైవబలం వలన విజయాలు సాధిస్తున్నామనుకొని దేవునికి సదా కృతజ్ఞలమై యుండాలి. దేవునికి లొంగివుండాలి. తోడివారికి ప్రతికూలంగా గాక, అనుకూలంగా మెలగాలి.

## 4. నీతికొరకు ఆకలిదప్పులు – సంతృప్తి చెందడం

బైబుల్లో నరుని నీతి అంటే నరుడు పుణ్యకార్యాలు చేయడం –మత్త 5,20. దేవుని నీతి అంటే దేవుని రక్షణం –6,33. కనుక ఈ ధన్యవచనంలోని "నీతి" దేవుడు దయచేసే రక్షణమే. ఆకలిదప్పులు కొనడమంటే గాఢంగా వాంచించడం. కావున, దేవుని రక్షణం కొరకు తపించిపోయేవాళ్ళు భాగ్యవంతులు అని భావం.

ఈలాంటి వాళ్ళు సంతృప్తి చెందుతారు. అనగా దేవుడు వారికి మోక్షాన్ని దయచేసి వారిని సంతృప్తి పరుస్తాడాని భావం. యూదులు మోఓఆన్ని తిని త్రాగే విందుగా భావించారు. దేవుని రక్షణాన్ని కోరేవాళ్ళు మోక్షంలో తనవిదీర తినిత్రాగి సంతృప్తి చెందుతారని ఫలితార్థం. దేవుని రక్షణాన్ని కోరేవాళ్ళకు ఆ రక్షణం పరిపూర్ణంగా సిద్ధిస్తుందని క్రీస్తుభావం. వారికిక ఆకలిదప్పులు ఉండవు. సూర్యుడుగాని వేడిమిగాలి వారిని దహింపవు. సింహాసనం మధ్యనుండే గొర్రెపిల్ల వారికి కాపరి ఔతుంది దర్శన గ్రంథం –7,16

మనలో మూడు రకాల నీతి కన్పించాలి. మనం దేవుని నీతిని (రక్షణం) కోరాలి. మన నీతి (పుణ్యక్రియలు) విస్తరిల్లాలి. తోడివారిపట్ల నీతితో (న్యాయం) ప్రవర్తించాలి.

## అన్వయం

అందరూ రక్షనం కొరకు తపించిపోరు. ఈ లోకసుఖభోగాలతోనే సరిపెట్టు కొంటారు. పూర్వవేదంలో యావే[ప్రభువు రక్షణం - యిర్మీయా 23,6. నూత్న వేదంలో క్రీస్తు మనకు రక్షణం -రోమా 4,25. మనమూ ఈ రక్షణాన్ని పొందాలి. ఇతరులూ దాన్ని పొందేలా చేయాలి.

పునీతులు దేవుతని రక్షణం కొరకు తపించిపవోయారు. దేవుడు వారి కోరికలు తీర్చి వారికి పూర్ణశాంతిని, సంతృప్తిని దయచేసాడు. ఈ భక్తులు నేడు మనకు ఆదర్శంగా వుంటారు. వీళ్ళు దేవుని చిత్తాన్ని తెలిసికొన్నారు. ఈ చిత్తప్రకారం జీవించి పునీతులయ్యారు. నేడు మనం మనలను గూర్చిన దేవుని చిత్తమేమిటో తెలిసికోం. తెలిసికొన్నా ఆ చిత్తాన్ని లెక్కజేయం. మన యిష్టప్రకారం మనం జీవించబోతాం. అందుకే పునీతులం కాలేకపోతున్నాం. నన్ను పంపినవాని చిత్తాన్ని నెరవేర్చడమే నాకాహారం అన్నాడు ప్రభువు -యోహా 4,34.

తొలి నాల్గు ధన్యవచనాలు దేవునిపట్ల మనకుండే భక్తిని సూచిస్తాయి. మలి నాల్గు తోడినరులపట్ల మనకుండే సంబంధాన్ని తెలియజేస్తాయి. ఇక ఈ నాల్గింటిని క్రమంగా పరిశీలిద్దాం.

## 5. దయామయులు - దయను పొందుతారు

ఈ ధన్యవచనం దేవుడు దయామయుడు కనుక మనం గూడ దయను కలిగి వుండాలని చెప్తుంది. పూర్వవేదంలో యావే ప్రభువు తన దయాగుణాన్ని మోషేకు తెలియజేసాడు. అతడు కరుణామయుడైన దేవుడు. సులభంగా కోపపడేవాడు కాదు. నిత్యం ప్రేమ జూపేవాడు. నమ్మదాగినవాడు. మన దోషాలనూ అపరాధాలనూ మన్నించేవాడు -నిర్గ 34,6-7. నూత్నవేదంలో క్రీస్తుకూడ ప్రధానంగా దయను చూపేవాడు. అతడు నాకు కావలసింది కారుణ్యం గాని బలికాదు అనే హోషేయ వాక్యాన్ని ఉదాహరించాడు -మత్త 9,13. ఈ తండ్రీకుమారుల్లాగే మనం కూడా తోడివారిపట్ల దయగలిగి వుండాలని భావం. నూత్నవేదంలో క్షమింపనొల్లని సేవకుని కథ ఉంది. ఇతడు పైవారినుండి దయను పొందాడు. కాని తన క్రిందివారికి దయను చూపలేదు -మత్త 18,33. మన ప్రవర్తనం ఈలా వుండకూడదు.

తోడివారిపట్ల దయను జూపేవాళ్ళు దేవుని నుండి దయను పొందుతారు. మనం ఇతరుల అపరాధాలను మన్నిస్తే దేవుడు మన అపరాధాలను మన్నిస్తాడు అని పరలోక జపం చెప్తుంది. దేవుడు నా తప్పులను మన్నిస్తాడు గాని నేనితరుల తప్పులను మన్నించను అని చెప్పకూడదు కదా!

### అన్వయం

తోడివారిపట్ల కనికరం జూపితేనేగాని మనకు రక్షణం లేదు. మత్తయి 25లో

వచ్చే తుదితీర్పు కథ ఈ సత్యాన్నే వెల్లడిచేస్తుంది. ఈ కథలో వచ్చే సజ్జనులు ఆకలిగొన్నవారికి కరుణతో అన్న పానీయాలిచ్చారు. ఇల్లులేనివారికి వసతి, బట్టలులేనివారికి దుస్తులు ఇచ్చారు. రోగులను, చెరలో వున్నవారిని, పరదేసులను పరామర్శించారు. ఇవన్నీ కరుణ కార్యాలు. ఇంకా పేదలకు దానధర్మాలు చేయడం, చనిపోయినవారిని పాతిపెట్టడం మొదలైనవి కూడ కరుణకార్యాలే. దేవుడు ఈ కార్యాలన్నిటినీ తనకు చేసినట్లే భావించి ఆ సజ్జనులకు మోక్షభాగ్యాన్ని దయచేసాడు. దుష్టులు ఈ కరుణకార్యాలు చేయనందుకు వారికి నరకశిక్ష పడింది. తోడివారిపట్ల దయచూపాలి అనడానికి ఇంతకంటె మంచి ఉదాహరణం ఏమి కావాలి? కనికరం లేనివారికి దేవుడు కనికరం లేని తీర్పు తీరుస్తాడు –యాకోబు 2,13.

మన రోజువారి జీవితంలో ఇతరుల పట్ల కరుణతో, ప్రీతితో మెలగాలి. మాటకు మా3 అనకూడదు. చెడ్డకు చెడ్డ చేయకెఊడదు. క్రీస్తులాగ, స్తెపనులాగ మనం కూడ శత్రువులు కొరకు ప్రార్థించాలి. ఇతరులు తెలిసీతెలియక చేసిన కీడులను మన్నించాలి. వారిపట్ల వైరం, ప్రతీకార బుద్ధి పెంచుకోగూడదు. తనలోని రాక్షసగుణాన్ని స్వార్థాన్ని అణచుకొన్నవాడేగాని దయతో ప్రవర్తించలేడు. లూకా సువిశేషం "మీ తండ్రిలాగే మీరూ కరికరం గలవారై వుండండి" అంటుంది.

## 6. నిర్మల హృదయులు – దైవదర్శనం

ఇక్కడ నిర్మలత్వం అంటే ఆరవ ఆజ్ఞకు వ్యతిరేకమైన పాపాలు చేయకుండా ఉండడమని భావం కాదు. ఈ ధన్యవచనం పేర్కొనే నిర్మలత్వం చాల విశాలమైంది. దేవునిపట్ల నరులపట్లగూడ నిజాయితీతో ప్రవర్తించడమని ఇక్కడ ఈ మాటకు అర్థం. దీన్నే చిత్తశుద్ధి, లేక హృదయశుద్ధి అంటాం. అనగా మన అంతరంగం లేక అంతరాత్మ చెప్పినట్లుగా నడచుకోవడం. వంచన, కపటం,మోసం లేకుండ ఉండడన్నమాట.

ఈ చిత్తశుద్ధిని గూర్చి కీర్నత 24,3-4 చరణాలు ఈలా చెప్తాయి "ప్రభువు పర్వతాన్ని ఎక్కడానికి అర్హుడెవడు? దుష్క్రియలు చేయనివాడు, దురాలోచనలు లేనివాడు. విగ్రహాలను ఆరాధించనివాడు, దొంగప్రమాణాలు చేయనివాడు ఎవడో అతీడే". ఇంకా 15వ కీర్తన గూడ ఈ చిత్తశుద్ధిని విపులంగా వర్ణిస్తుంది. "యావే మందిరంలో వసింపగలవాడెవడు? నిందారహితంగా జీవించేవాడు, ధర్మాన్ని పాటించేవాడు, హృదయపూర్వకంగా సత్యాన్ని పలికేవాడు."

ఈలా నిజాయితీతో జీవించే నిర్మలహృదయులు దేవుణ్ణి దర్శిస్తారు. ఈ లోకంలో అతన్ని కొంతవరకు చూస్తారు. పరలోకంలో సంపూర్ణంగాదర్శిస్తారు –1కొ 13,12. నాల్గవ శతాబ్దంలో జీవించిన పక్కోమియస్ అనే భక్తుడు ఈలా వ్రాసాడు –"మన హృదయంలోకి పగ, అసూయ, డంబం, దుష్టత్వం మొదలైన దుష్టభావాలు రాగానే వాటిని ప్రక్కకు నెట్టివేయాలి. నేను ఈ భావాలకు లొంగిపోతే దేవుణ్ణి దర్శించలేను అనుకోవాలి."

## అన్వయం

నిర్మలహహృదయాన్ని అలవర్చుకోవడం ఏలా? అనన్య చిత్తంతో దేవుణ్ణి సేవించాలి. పూర్వవేదంలో యవే ప్రభువు తన్ను మాత్రమే కొలవండని యూదులను ఆజ్ఞాపించాడు –ద్వితీ 6,5. నూత్నవేదంలో క్రీస్తు ఇద్దరు యజమానులను సేవించవద్దన్నాడు. అవి దేవుడూ, ధనం –మత్త 6,24 అనగా మన విలువలన్నిటిలో భగవంతుడు పై విలువ కావాలి.

నరుడు దైవచిత్తానికి లొంగి జీవించాలి. తన యిష్టప్రకారం తాను జీవించకూడదు. దైవాజ్ఞలు పాటించాలి. ఈలా జీవించే నరుడు దేవుని సన్నిధిలో ఉంటాడు. దేవుని కోరికల ప్రకారం జీవిస్తాడు.

నిర్మల హృదయుడి మనసు దుష్టాలోచనలకు లొంగదు. యూదులు ఆరాధనలో శారీరక శుద్ధిని ఘనంగా యెంచుతున్నారు. కాని క్రీస్తు నైతిక శుద్ధి ముఖ్యమని వాకొన్నాడు. హృదయం నరహత్య, వ్యభిచారం, దొంగతనం, కూటసాక్ష్యం, పరదూషణం మొదలైన భావాలకు లొంగకూడదన్నాడు. ఈ దుష్టాలోచనలను తర్వాత క్రియలై మనిషిని మైలుపరుస్తాయి. కనుక మన మనసు ఎప్పుడు పవిత్రంగా వుండాలి –మత్త 15,19–20.

కాని మనసుని నిర్మలంగా వుంచుకోవడం అంత తేలికగాదు. చాలసార్లు పడిపోతాం. అప్పుడు చిత్తశుద్ధితో పశ్చాత్తాపపడి పాపసంకీర్తనం చేసికోవాలి. ఈ సంస్కారం మన మనసులోని మాలిన్యాన్ని కడిగివేస్తుంది.

హృదయం నిర్మలంగావుంటే ఎంతో సంతోషం కలుగుతుంది. కష్టాల్లో వున్నా కూడా హృదయం శాంతిని పొందుతుంది. డొక్కశుద్ధిలేనివాడికి ఎన్ని సంపదలున్నా, ఎన్ని సుఖాలున్నా హృదయశాంతి వుండదు.

ప్రార్థనద్వరా నిర్మలహృదయాన్ని పొందుతాం. అది మనకు దేవుని వరప్రసాదాన్ని సంపాదించిపెడుతుంది. మన మనసుని కడిగి శుద్ధిచేసేది, దాన్ని దేవునిపై లగ్నంచేసేది వరప్రసాదమే. కనుక భక్తుడు ప్రధానంగతా దైవానుగ్రహాన్ని సంపాదించాలి.

మన హృదయం నిర్మలం కావాలంటే క్రీస్తు హృదయం దానిమీద సోకాలి. అతని హృదయం దయపూరితమైంది. వినమ్రమైంది. ఎప్పుడూ తండ్రినీ నరులనూ ప్రేమించేది. ఈ దివ్యహృదయం మన పాపపు హృదయాన్ని తాకి దాన్ని పునీతం చేస్తుంది. దేవా! నాలో నిర్మల హృదయాన్ని సృజించు అని ప్రార్థించాడు కీర్తనకారుడు –51,10.

వేమన గొప్ప నిజాయితీగల కవి. అతడు చిత్తశుద్ధిలేని శివపూజ లేల, బాండశుద్ధిలేని పాకమేల అన్నాడు. మురికి కుండలో మంచిభోజనం వండినా ఎవరికీ రుచించదు. అలాగే మలిన హృదయంతో పూజలుచేసినా అవి దేవునికి నచ్చవు.

# 7. శాంతి స్థాపకులు - దేవుని కుమారులు

కలహాలు ద్వేషాలూ ప్రజలను విభజిస్తాయి. శాంతిస్థాపకులు ఈ తగాదాలను అణచివేసి, చీలిపోయిన ప్రజలను ఐక్యపరుస్తారు. విడిపోయిన వాళ్ళను రాజీ కుదిర్చి వాళ్ళు ఒకరితో ఒకరు ఒద్దికగా జీవించేలా చేస్తారు. కొన్నిసార్లు ప్రజలు హింసలకు దౌర్జన్యాలకూ పాల్పడతారు. ఈ పరిస్థితుల్లో శాంతికాముకులు ద్వేషాలను తొలగించి శాంతిసమాధానాలు నెలకొల్పుతారు. దీనివల్ల ప్రజలకు క్షేమం కలుగుతుంది. కనుక శాంతిని నెలకొల్పడమంటే కేవలం కలహాలను తొలగించి రాజీని కుదర్చడం మాత్రమే. కాదు. జనానికి క్షేమమూ, అభివృద్ధి కలిగేలా చూడ్డం కూడ. కావున శాంతిస్థాపనం గొప్పకార్యం. ప్రజాక్షేమం, ప్రజాశ్రేయస్సు నెలకొల్పడం.

శాంతిస్థాపకులకు లభించే బహుమతి యిది. వాళ్లు దేవుని కుమారులుగా చలమణి ఔతారు. ఇక్కడ దేవుని కుమారుడు అంటే దేవునిలాంటివాడు కావడం. క్రీస్తు దేవుని కుమారుడు. ఈ క్రీస్తు ద్వారానే శాంతిప్రియులు తండ్రికి ప్రీతిపాత్రులౌతురు. మనలను దేవుని కుమారులనుగా జేసేది క్రీస్తే.

క్రీస్తుకి శాంతికరుడైన రాజు అని పేరు – యెష9,6 అతడు దేవునికీ నరులకూ మధ్య శాంతినెలకొల్పేవాడు అతని సిలువ మరణం ద్వారాతండ్రి పరలోక భూలోకాలను తనతో సమాధానపరుచుకొన్నాడు–కొలో 1,20. క్రీస్తు మరణానికి ముందు యూదులకు అన్యజాతి ప్రజలకుఐక్యతలేదు. క్రీస్తు తన మరణం ద్వారా ఈ రెండు వర్గాల ప్రజలను కలిపివేసాడు. అందరి పాపాలకు పరిహారంజేసి అందరినీ దేవుని బిడ్డలనుచేసాడు. యూదులకు అన్యులకూ మధ్య వుండే అడ్డుగోడను తొలగించాడు.కనుక అతడు జగత్తుకే శాంతిని ప్రసాదించినవాడు - ఎఫే2,14-15. ఈ క్రీస్తులాగే మనం కూడ శాంతికాముకులం,శాంతిని నెలకొల్పేవాళ్ళం కావాలి.

## అన్వయం

నరులు కలసిమెలసి సామరస్యంగా జీవించాలి. అన్యాయాలు, హింసలు, దౌర్జన్యాలు ఈ సామరస్యాన్ని చెరుస్తాయి. కనుక శాంతిస్థాపకులు ఈ యన్యాయాలను ఎదరించి పోరాడవలసి వుంటుంది. ఇది కష్టమైన కార్యం. ఆనాడు యూద సమాజంలోని అన్యాయాలనూ మతాధికారుల అక్రమాలనూ ఎదిరించడం వల్లనే క్రీస్తుకి మరణం దాపురించింది. నేడు శాంతిని నెలకోల్పాలనుకొనేవాళ్ళకు కూడ ఈ యపాయం వుంది.

సమధానాన్ని నెలకొల్పాలంటే తప్పకుండా పోరాటానికి దిగనక్కరలేదు. నరులు ఒకరినొరకు క్షమించుకోవడం ద్వారా గూడ సమాధానం నెలకొంటుంది. కనుక శాంతిని కోరేవాళ్ళ ప్రజలకు ఈ క్షమాగుణాన్ని నేర్పాలి. కొన్నిసార్లు సంప్రతింపుల ద్వారా గూడ నరులను ఒకరినొకరు అర్థంజేసికొని ఆవేశకావేషాలను

వదలించుకొంటారు. కనుక నాయకులు సంప్రతింపులు జరిపించాలి.

మొదట మన హృదయంలో శాంతి లేనిదే ఇతరులకు శాంతిని నేర్పలేం. కనుక శాంతిస్థాపకులు మొదట తమ హృదయాల్లోని అశాంతిని తొలగించాలి. అనగా మన దురాశలనూ స్వార్థాన్నీ అణచుకోవాలి. గాంధీ, మార్టిన్ లూథర్ కింగ్ మొదలైన నాయకులు మొదట తమ హృదయాలను పునీతం జేసికొని ఆ పిమ్మట దేశంలో శాంతిని జ్థాపించారు.

మన హృదయాలకు శాంతినిచ్చేవాడు ప్రధానంగా ప్రభువే. అతడు నేను మీకు శాంతిని అనుగ్రహిస్తున్నాను. లోకం ఇచ్చినట్లుగా నేను మీకు శాంతిని ఈయడంలేదు. మీరు కలవరపడకండి"అన్నాడు. - యోహా14,27.లోకం ఇచ్చే శాంతి తాత్కాలికమైంది. తరుచుగా లౌకిక రంగానికి చెందింది. కాని క్రీస్తు శాంతి ఆధ్యాత్మికమైంది. శాశ్వతమైంది. అది ప్రధానంగా పాపపరిహారంద్వారా లభిస్తుంది.

పౌలు భక్తుడు "శాంతి నొసగే దేవుడు మీకు శాంతిని ప్రసాదించునుగాక" అని తన సహోజాలను ఆశీర్వదిస్తుండేవాడు -1 తెస్స 5,23. నేడు మన సమాజాలకూ ప్రజలకూ గూడ శాంతి అత్యవసరం. మన తరుపున మనం ఎప్పుడు శాంతిని కోరాలి. ప్రజలను ఐక్యతపరచాలి. గాని విభజించకూడదు. తగాదాలు పెట్టి తమాషాలు చూడకూడదు. ఎప్పుడూ మన హృదయాన్ని కోరుకోవాలి. మనం దుఃఖాన్ని భరించలేం గదా! అలాగే ఇతరులను గూడ దుఃఖపెట్టకూఏదదు. అందరూ సుఖంగా,క్షమంగా వుండాలని కోరుకోవాలి. ప్రభూ! నేను నీ శాంతిని పెంపోందించేలా చేయి" అని ప్రార్థించాడు. అసిస్సీ ప్రాన్సిస్ భక్తుడు.

## 8. హింసితులు- దైవరాజ్యం

8వ ధన్యవచనాన్ని 10వ చరణంలో ఒకసారి, 11-12 వచనాల్లో ఇంకోసారి చెప్పారు. కాని ఈ రెండు ఒకే ధన్యవచనం. ఇక్కడ "ధర్మార్థం" అంటే రక్షణం కొరకు అని భావం. కావున నాల్గవ ధన్యవచనంలోని నీతి, 8వ దానిలోని ధర్మం ఒకటే. కనుక మన రక్షణాన్ని పురస్కరించుకొని, అనగా క్రీస్తు కొరకు మన విశ్వాసం కొరకు వేదహింసలకు గురైతే ధన్యులు మౌతామని భావం.

మత్తాయి ఈ సువిశేషం వ్రాసేనాటికి క్రైస్తవులు యూదులు నుండి చీలి పోయారు. కనుక యూదులు క్రైస్తవులను ప్రార్థనా మందిరాలను రానీమలేదు. వారిని నానావిధాల హింసించారు. ఇక్కడ మత్తయి దృష్టిలో వుంది ఈ మతహింసలే. ఆ పిమ్మట శతాబ్దాల పొడుగున క్రైస్తవ సమాజం నానా హింసలకు గురౌతూవచ్చింది.

ప్రభువు కొరకు హింసలను భరించేవాళ్లు దైవరాజాన్ని పొందుతారు. ఈ దైవరాజ్యం మైక్షమే. పూర్వ ప్రవక్తలే యెషయా యిర్మీయా మొదలైనవాళ్లు, క్రీస్తు, ఆ

పిమ్మట స్తెఫనునుండి నేటి వరకు వచ్చిన వేదసాక్షులు శ్రమలను భవించాలి. క్రీస్తు శ్రమలను భరించి తన మహిలో ప్రవేశించడం అనివార్యం అన్నాడు. ప్రభువు - లూకా24,26. ఈ వేదసాక్షుల్లాగే నేడు మనం కూడ బాధలు అనుభవించాలి. వీటి ఫలితమే మోక్షం.

## అన్వయం

ఈ జీవితంలో శ్రమలు అవసరం హింసలకు గురైనపుడు దేవుణ్ణి తలంచుకొని అతన్ని శరుణు వేడుతాం. హింసలే లేకపోతే దైవరాజ్యనికి బదులుగా మన సొంతరాజ్యాన్ని నిర్మించుకొంటాం.

మతహింసలు ఎందుకు వస్తాయి? క్రీస్తు శిష్యులమైనందుకే. లోకం పూర్వం క్రీస్తునపి ద్వేషించింది. ఇప్పుడు అతని శిష్యులను కూడ ద్వేషిస్తుంది. మోహా 15, 18-20 కనుక వేదహింసలు క్రైస్తవ జీవితంలో ఓ ముఖ్యభాగం అనుకోవాలి.

మనం ఎప్పుడూ క్రీస్తు పేరుమీదగానే హింసలకు గురికాక్కరలేదు. ఆ క్రీస్తు పేరుమీదిగా న్యాయాన్ని, పేదల హక్కులనూ నెలబెట్టడానికి పోరాడినపుడు కూడ శ్రమల వాత బడవచ్చు. ఉత్తర భారతంలో సిస్టరు రాణి మరియ, ఫాదర్ మొదలైన వాళ్ళు పేదల హక్కుల కొరకు పోరాడి ప్రాణాలు కోల్పోయారు.

వేదహింసల్లో చాలా మోట్లన్నాయి. అసౌకర్యాలకూ నష్టాలకూఏ గురికావడం క్రిందిమోట్టు, కాని ప్రాణాలు కోల్పోవడం తుదిమెట్టు. ఇదే వేదసాక్షి మరణం. తొలినాటి క్రైస్తవులు వేవసాక్షగా మరణించడం క్రైస్తవ జీవితానికి ముఖ్యలక్షణం అనుకొన్నారు. కాని కాలక్రమేణ ఈ భావం మరుగుపడిపోయింది.

వేదహింసలను అనుభవించడంలో క్రీస్తే మనకు ఆదర్శం. అతడు న్యాయం కొరకు, తండ్రి చిత్తాన్ని నెరవేర్చడం కొరకు, నరుపాపాలకు పరిహారం చేయటం కొరకు, దైవరాజ్యస్థాపనం కొరకు హింసలు అనుభవించాడు. ఆ వేదసాక్షి హింసలు మనకు ఆదర్శంగాను ప్రేరణంగాను వుంటాయి. క్రీస్తు మన కొరకు బాధపడి, అతనరి అడుగుజాదల్లో నడవడానికి మనకు ఓ ఆదర్శాన్ని చూపించాడు. -1పేత్రు2-21.

క్రీస్తు శారీరక శ్రమలు మాత్రమేగాక అతని తండ్రికి విధేయుడై మన కొరకు శ్రమలు అనుభవించాడు. రెండవది, మనపై గల ప్రేమచే బాధలు అనుభవించాడు. ఈ యాంతంగిక గుణాలులేందే అతని సిలువంమరణం మనలను రక్షించివుండుదు. నేడు మన శ్రమల్లో గూడ మనం దేవుని చిత్తానికి లొంగడం, సోదరప్రేమనపు పాటించడం ముఖ్యం.

వేదహింసల్లో క్రీస్తు ఆత్మ మలను ఉత్తేజపరుస్తుంది. శత్రువులను మనం ఎలా జవాబు చెప్పాలో తెలియజేస్తుంది. క్రీస్తు కొరకు ప్రాణాలర్పించే ధైర్యాన్ని కూడ ప్రసాదిస్తుంది. ఈ దివ్యశక్తితోమనం శ్రమలకు తట్టుకొని నిలుస్తాం.

## ముగింపు

పైన ఎన్మిది ధన్యవచనాలను చూచాం. క్రీస్తు స్వయంగా ఈ యెన్మిదింటిని పాటించాడు. అతడు దీనాత్ముడుగా తండ్రి మీద ఆధారపడి జీవించాడు. మన పాపాలను తన భుజస్కంధాలపై భరించి శోకార్తుడుగా వాటి కొరకు దుఃఖించాడు. వినమ్ర హృదయుడుగా ఆ తండ్రి ఆజకు లొంగాడు నరులంతా దేవుని నీతిని, దేవుని రక్షణాన్నీ పొందాలని తపించాపోయాడు. దయామయుడు కనుక శత్రువులను గూడ క్షమించాడు నిర్మల హృదయంతో నిరంతరం తండ్రి ముఖాన్ని అపలోకించాడు. సమాధానకరగా వచ్చి దేవునికీ నరులకూ మధ్య శాంతిని నెలకొల్పాడు. నానా హింసలకు గురై సిలువపై వేలాడాడు. తాను రక్షణాన్ని పొంది మనకూ దాన్ని సంపూర్ణంగా దయజేసాడు.కనుక ధన్యుతలన్నిటినీ అతడు పరిపూర్ణంగా జీవించాడు.

ఈలా ధన్యత లన్నిటిని జీవించిన క్రీస్తు వాటి బహుమానమైన దైవరాజాఞ్యాన్ని గూడ పరిపూర్ణంగా పొందాడు. అసలు అతడే దైఊవరాజ్యం. అతడే నిజమైన ధన్యవచనం.

ఈ విధంగా ధన్యవచనాలను జీవించిన క్రీస్తు నేడు మనం కూడ వాటి ప్రకారం జీవించేలా చేస్తాడు. క్రీస్తు ఆత్మ అతని రూపాన్ని మనలో చిత్రిస్తూంటుంది. అతని లాగే మనంకూడా ధన్యవచనాలను పాటించేలా చేస్తుంది.

ఈ యెన్మిది ధన్యుతలు పెద్ద అద్దం లాంటివి. ఈ యుద్దలోనికి చూచుకొని మనలను మనం చక్కదిద్దుకొంటూండాలి.

ఈ ధన్యువచనాలను మనంచేసికొంటే మన ఆలోచనల్లో, పనుల్లో మార్పు వస్తుంది. దేవునిపట్ల అధిక భక్తితో మెలుగుతాం. తోడివారిపట్ల ఎక్కువ ప్రేమతోను దయతోను ప్రవర్తిస్తాం. ఇది అల్ప లాభమేమీ కాదు.